# సాహిత్య విమర్శ

## ఆధునిక భాష (స్పెషల్ తెలుగు) - పార్ట్ 2 - పేపర్ 4

## బి.ఏ. తృతీయ సంవత్సరం


***రచయితలు***

**డా॥ చేరెడ్డి మస్తాన్ రెడ్డి**
ఎం.ఏ., పిహెచ్.డి.
రీడర్ & ప్రిన్సిపాల్
శ్రీమతి కాసు రాఘవమ్మ బ్రహ్మానందరెడ్డి కళాశాల
నరసరావుపేట

**శ్రీ పోలె ముత్యము**
ఎం.ఏ., ఎం.ఏ.,ఎం.ఫిల్
ఆంధ్రోపన్యాసకులు
ఆంధ్ర క్రైస్తవ కళాశాల
గుంటూరు

**డా॥ మేళ్లచెర్వు భానుప్రసాదరావు**
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.
రీడర్, తెలుగు విభాగం
శ్రీ సుబ్బరాయ & నారాయణ కళాశాల
నరసరావుపేట

**డా॥ యలవర్తి భానుభవాని**
ఎం.ఏ.,ఎం.ఫిల్., పిహెచ్.డి.
రీడర్, తెలుగు విభాగం
పి.బి.ఎన్. కళాశాల
నిడుబ్రోలు, గుంటూరు

**శ్రీ అరిపిరాల హరిహరనాథ శాస్త్రి, ఎం.ఏ.,**
ఆంధ్ర శాఖాధ్యక్షులు
శ్రీ సుబ్బరాయ & నారాయణ కళాశాల
నరసరావుపేట

***ఉపసంపాదకులు***
**డా॥ చేరెడ్డి మస్తాన్ రెడ్డి**
శ్రీమతి కాసు రాఘవమ్మ బ్రహ్మానందరెడ్డి కళాశాల
నరసరావుపేట

***సంపాదకులు***
**ఆచార్య తేళ్ళ సత్యవతి**
డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు అండ్ ఓరియంటల్ లాంగ్వేజెస్
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

***డైరెక్టర్***
**ఆచార్య వి. చంద్రశేఖర రావు,** ఎం.కామ్.,పిహెచ్.డి.



## సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
నాగార్జుననగర్ - 522 510

మాదిరి ప్రశ్నాపత్రము

బి.ఏ. తృతీయ సంవత్సరం

# ఆధునిక భాష

తెలుగు పేపర్ IV

## తెలుగు సాహిత్య విమర్శ

Time : 3 hours

Max Marks : 100

## A. తెలుగు సాహిత్య చరిత్ర

1. శైవకవుల సాహిత్యంలోని విశిష్ట లక్షణాలను వివరించండి. 20 మా.
   (లేదా) తిక్కన కవిత్వ సమాలోచన జరపండి.

2. పోతన కవితా మాధుర్యమును సోదాహరణంగా సమీక్షించండి. 20 మా.
   (లేదా) విజయ విలాసమాధారంగా చేమకూర కవి కవితా చమత్కృతిని తెల్పండి.

3. అ. క్రిందివానిలో రెండింటికి లఘు వ్యాఖ్యలు వ్రాయుడు. 10 మా.

   1. నందితిమ్మన  2. కంచర్ల గోపన్న
   3. నన్నెచోడుడు  4. దూర్జటి

   ఆ. క్రిందివానిలో రెండింటికి లఘు వ్యాఖ్యలు వ్రాయుడు. 10 మా.

   1. ఆంధ్రభాషా భూషణం  2. హరవిలాసం
   3. నృసింహ పురాణం  4. బోజ రాజీయం

## B. ప్రతిమా నాటకం

4. ప్రతిమా నాటకమున తృతీయాశ్వాస ప్రాముఖ్యమును వివరించండి. 20 మా.
   భరతుని పాత్ర చిత్రణను గూర్చి వ్రాయండి.

5. అ. క్రిందివానిలో రెండింటికి సందర్భ సహిత వ్యాఖ్యలు వ్రాయండి. 10 మా.

   1. దుఃఖ దగ్ధమైన యీ శరీరమును ఆహ్లాదపఱుచుము.
   2. ఛాయను పరిహరించి శరీరము నుల్లంఘింతువా.
   3. గజేంద్రునిచే భగ్నమైన వన వృక్షము వలె కూలినాడు.
   4. పూజ్యురాలికి అంతకంటెను ప్రియము నివేదింతును.

   ఆ. ఈ క్రిందివానిలో రెండింటిని సోదాహరణంగా వివరింపుడు. 10 మా.

   1. పంచ సంధులు  2. అంకము
   3. నాయకుడు  4. అర్థ ప్రకృతులు

# బి.ఏ. తృతీయ సంవత్సరం

## **ఆధునిక భాష**

### **తెలుగు - పార్ట్ 2 - పేపర్ 4**

సాహిత్య విమర్శ - సిలబస్

1 కావ్య నిర్వచనము
2 కవిత్వము - ఛందస్సు
3.1 కవిత్వము - సత్యము
3.2 కావ్యము - నీతిబోధ
4 విమర్శ - విమర్శకుడు
5 విమర్శ - పద్ధతులు
6.1 రస స్వరూపము
6.2 రస నిష్ఠ
7.1 రస సంఖ్య
7.2 రసరాజము
8 శృంగార భేదాలు
9 శ్రవ్య దృశ్య కావ్యములు
10 ట్రాజెడి, ఎ. అరిస్టాటిల్, బి. షేక్స్పియర్
11 కావ్య భేదములు
12 భావ కవిత్వము
13 వస్తు కవిత్వము
14 నవల
15 కథానిక
16 వ్యాసము
17 జీవిత చరిత్ర

ఆధార గ్రంథాలు


1. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం.
2. విమర్శ మౌళిక లక్షణాలు - డా॥ ముదిగొండ వీరభద్రయ్య
   (ప్రచురణ - తెలుగు అకాడమీ, హైదరాబాదు.)

# విషయ సూచిక


| | | | | |
|---|---|---|---|---|
| పాఠం | 1 | కావ్య నిర్వచనము | ... | 1-12 |
| | 2 | కవిత్వము - ఛందస్సు | ... | 1-9 |
| | 3.1 | కవిత్వము - సత్యము | ... | 1-4 |
| | 3.2 | కావ్యము - నీతిబోధ | ... | 1-3 |
| | 4 | విమర్శ - విమర్శకుడు | ... | 1-17 |
| | 5 | విమర్శ - పద్ధతులు | ... | 1-11 |
| | 6.1 | రస స్వరూపము | ... | 1-8 |
| | 6.2 | రస నిష్ఠ | ... | 1-4 |
| | 7.1 | రస సంఖ్య | ... | 1-5 |
| | 7.2 | రసరాజము | ... | 1-4 |
| | 8 | శృంగార భేదాలు | ... | 1-20 |
| | 9 | శ్రవ్య దృశ్య కావ్యములు | ... | 1-12 |
| | 10 | ట్రాజెడి | ... | 1-14 |
| | 11 | కావ్య భేదములు | ... | 1-19 |
| | 12 | భావ కవిత్వము | ... | 1-31 |
| | 13 | వస్తు కవిత్వము | ... | 1-12 |
| | 14 | నవల | ... | 1-16 |
| | 15 | కథానిక | ... | 1-17 |
| | 16 | వ్యాసము | ... | 1-6 |
| | 17 | జీవిత చరిత్ర | ... | 1-15 |

# పాఠం - 1

# కావ్య నిర్వచనము

పాఠ్యనిర్మాణక్రమం


1.0 లక్ష్యం
1.1 కవిత్వం - కావ్యం
1.2 కవి - కావ్యం
1.3 ఆలంకారిక పరంపర
1.4 ప్రముఖ నిర్వచనత్రయం
1.5 పాశ్చాత్య నిర్వచనాలు
1.6 సమీక్ష
1.7 ప్రశ్నలు
1.8 ఉపయుక్త గ్రంథాలు


## 1.0 లక్ష్యం

కవి సృష్టి కావ్యం. కావ్యం వల్ల అందరూ సమానంగా ఆనందాన్ని పొందినా, దాన్ని వ్యక్తీకరించడంలో ఎవరి మార్గం వారిది. అందువల్లనే భిన్న భిన్న నిర్వచనాలు ఆవిర్భవించాయి. భారతీయ ఆలంకారికులు కావ్యాన్ని నిర్వచిస్తూ ప్రత్యేక గ్రంథాలు - అలంకార శాస్త్రాలు వ్రాశారు. పాశ్చాత్యులు తమ గ్రంథాల్లో ఇతర విషయాలతో పాటు కవిత్వాన్ని నిర్వచించారు. కనుక భారతీయాలంకారిక మార్గమే సశాస్త్రీయమైనది. పాశ్చాత్య మేధావుల మార్గమూ తత్తుల్యంగా స్వీకార యోగ్యం - ఈ రెండు సంప్రదాయాలను సమీక్షించి, సమన్వయించడమే ఈ పాఠ లక్ష్యం.

## 1.1 కవిత్వం - కావ్యం

మన సమాజంలో కవిత్వం, కావ్యం అనే రెండు మాటలు సమానార్థకాలుగా ప్రచారంలో ఉన్నాయి. కాని వాటికి లక్ష్యభూతాలైన పదార్థాల స్వరూపాన్ని పరిశీలిస్తే కొంత వ్యత్యాసమున్నట్లు గోచరిస్తుంది. కవిత్వమనే పదానికి పద్య రచన రూఢ్యర్థమైనట్లు కనిపిస్తుంది. ఇక కావ్య పదానికి గద్య, పద్య, చంపూ రచనలలో ఏదైనా కావచ్చునన్న భావం ప్రస్ఫుట మౌతున్నది. కవిత్వం అమూర్త పదార్థం. కావ్యం మూర్త పదార్థం. కవిత్వ కక్ష్య పరిమితం. కావ్య పరిధి విపులతరం. మొత్తం మీద కవిత్వం, కావ్యం, సాహిత్యం, సారస్వతం ఉత్తరోత్తర విపులతర కక్ష్యలు.

కావ్యమనే పేరుతో గానీ, కవిత్వమనే పేరుతో గాని ఈ కళలను గురించి ప్రాచ్య పాశ్చాత్య దేశాల్లో అనేక నిర్వచనాలు ఆవిర్భవించాయి. భారతీయాలంకారికులు కావ్య లక్షణాల్ని గురించి ప్రత్యేక గ్రంథాలనే రచించారు. కాని పాశ్చాత్యులు మాత్రం వారు రచించిన గ్రంథాలలో ప్రాస్తావికంగా కవిత్వాన్ని గురించి నిర్వచించారు. మన ఆలంకారికులు ఈ కళను కావ్య మన్నారు. పాశ్చాత్యులు కవిత్వమన్నారు.

ఎంత మంది ఎన్ని విధాలుగా నిర్వచించినా వాటిలో శాస్త్రీయంగా నిర్దుష్టమైనది, సర్వ సమగ్రమైనది ఒక్కటి కూడా లేదు.

సమగ్రంగా నిర్వచించడం కూడా సాధ్యమయ్యే పని కాదు. అందువల్లనే భిన్న భిన్న నిర్వచనాలు ఉత్పన్నమయ్యాయి.

ఈ సందర్భంగా సెయింట్ అగస్టిన్ మాటలను మననం చేసుకుందాం. "If not asked, I know; If you ask me I know not" "నన్ను అడగకపోతే - నాకు తెలుసు. నన్ను అడిగితే - నాకు తెలియదు" - అన్నాడు అగస్టిన్. అందువల్ల కవిత్వానుభూతి వర్ణనం వ్యక్తావ్యక్త మనోహరం.

సహృదయులందరికీ కవిత్వం ఆస్వాద రమణీయంగానే ఉంటుంది. అయినా వారు సమగ్రంగా నిర్వచించలేదు. కావ్యానందానుభూతి ప్రకటనంలో వారి భావాలు వైవిధ్యభరితాలయ్యాయి. ఆనందానుభూతి శబ్దం వల్ల కలిగిందని కొందరూ, అలంకారం వల్ల కలిగిందని కొందరూ, రీతి వల్ల కలిగిందని కొందరూ, రసం వల్ల కలిగిందని కొందరూ భావించి, నిర్వచించి, వారి నిర్వచనాలకు హేతువులు చూపారు. వాటిలో ప్రధానమైన వాటిని పరిశీలిద్దాం. ప్రథమంగా ప్రసిద్ధ సంస్కృతాలంకార గ్రంథాలలోని నిర్వచనాలను అనుశీలిద్దాం.

## 1.2 కవి - కావ్యం

కావ్యం అంటే కవి కర్మ. కవి అనే పదం మొట్టమొదట ఈశావాస్యోపనిషత్తులో కనిపిస్తున్నది. "కవిర్మనీషీ పరిభూ స్వయంభూః" అని పరమాత్మ పరంగా ఉంది. క్రమంగా ఆ పదం పరమాత్మ సాక్షాత్కారం పొందిన 'ఋషి' పరంగా వ్యవహారంలోకి వచ్చింది. మన వైదిక ఋషులు కవులు. వాళ్ళు సాక్షాత్ ద్రష్టలు. వాళ్ల కావ్యాలు ఉపనిషత్తులు. ఆ తరువాత లౌకిక కవులైన వాల్మీకి వ్యాసాదులూ ఋషులే. వాళ్ళు దివ్య దృష్టితో లోక రహస్యాలన్నీ తెలుసుకున్నవారు. తత్కావ్యాలు లోకోత్తర వర్ణనాత్మకాలు. అందువల్ల "నా నృషిః కురుతే కావ్యం", "కవయః క్రాంత దర్శినః" అనే లోకోక్తులు వచ్చినై. ఋషి కాని వాడు కావ్యాన్ని రచించలేడని, కవులు దివ్య దృష్టి కలవారని ఆ వాక్యాల సారాంశం.

'ఋషి కానివాడు కవి కాడు' అన్న ఆర్యోక్తికి 'దర్శనం లేనివాడు కవి కాడు' అని భావం. దర్శనం అంటే విచిత్ర వస్తువుల ధర్మాంశ తత్త్వాల్ని తెలుసుకోవడం. ఈ దర్శనం ఉన్న కవికి వర్ణనా నైపుణ్యం కూడా ఉండాలి. "దర్శనా ద్వర్ణనా చ్చాధ/రూఢా లోకే కవిశ్రుతిః" అని భట్టతౌతుడు పేర్కొన్నాడు. ఈ అభిప్రాయాన్నే భామహుడు ఇలా తెలిపాడు.

ప్రజ్ఞా నవనవోన్మేష శాలినీ ప్రతిభామతా
తదను ప్రాణనాజ్జీవే ద్వర్ణనా నిపుణః కవిః

"నవ నవోన్మేష శాలిని అయిన ప్రజ్ఞే ప్రతిభ. దానికి ఆశ్రితుడై వర్ణన చేసేవాడు కవి" అన్నాడు. ఆ తరువాత ఆనంద వర్ధనుడు ఇలా పేర్కొన్నాడు.

అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతిః
యథాస్మైరోచతే విశ్వం తథేదం పరివర్తతే
శృంగారీ చేత్ కవిః కావ్యేజాతం రసమయం జగత్
సఏవ వీత రాగశ్చేత్ నీరసం జాతమేవ తత్
భావనా నచేతనానపి చేతన వచ్చేతనానప్య చేతనవత్
వ్యవహారయతి యథేష్టం సుకవిః కావ్యే స్వతంత్రతయా

"అపారమైన కావ్య ప్రపంచానికి కవే బ్రహ్మ. అతడు తన ఇచ్ఛానుసారం లోకాన్ని మారుస్తాడు. అతడు శృంగారి అయితే లోకాన్ని శృంగారమయం చేస్తాడు. అతడు విరాగి అయితే నీరసం చేస్తాడు. అచేతన వస్తువుల్ని చేతన వస్తువులుగా, చేతన

వస్తువుల్ని అచేతన వస్తువులుగా చేసి స్వతంత్రతతో వ్యవహరిస్తాడు కవి", అందువల్ల కవి అంటే క్రాంతదర్శియై, ప్రతిభావంతుడై వర్ణనా నిపుణుడైన వాడు.

కనుక కావ్యమంటే కవికి ఉన్న విచిత్ర వస్తు ధర్మాంశ తత్త్వ పరిజ్ఞానాన్ని, వర్ణనా నైపుణ్యాన్ని, ప్రతిభను, స్వతంత్రతను ప్రతిఫలించేది.

దీనికి అనుబంధంగా కతిపయ నిర్వచనాలను పరిశీలిద్దాం.

- 'కవనీయం కావ్యం'. వర్ణింపదగినది కావ్యమని లోచనకారుడు.
- 'కవయతీతి కవిః, తస్య కర్మ కావ్యం'. వర్ణించేవాడు కవి, అతని కర్మ కావ్యం అని విద్యాధరుడు.
- 'కౌతి శబ్దాయతే విమృశతి రసభావాన్ ఇతి కవిః, తస్య కర్మ కావ్యం'. రసభావాల్ని విమర్శించే వాడు కవి. అతని కర్మ కావ్యం అని భట్టగోపాలుడు.
- 'లోకోత్తర వర్ణనా నిపుణ కవి కర్మ కావ్యం'. లోకోత్తర వర్ణనా నిపుణుడైన కవి కర్మ కావ్యమని మమ్మటుడు.

ఈ నిర్వచనాలన్నీ లోకోత్తర వర్ణనా నైపుణ్యానికి పట్టం కట్టాయి.

### 1.3 ఆలంకారిక పరంపర

భరతుడు సుమారు రెండు వేల సంవత్సరాల నాడే తన నాట్యశాస్త్రంలో కావ్యాన్ని నిర్వచించాడు. ఆయన ప్రధానంగా రూపకాన్ని గురించి చెప్పాడు. దృశ్య శ్రవ్య కావ్య భేదాల్ని పాటించలేదు. రెండింటినీ కావ్యంగానే పరిగణించాడు. రెంటికీ అభేదాన్ని పాటించాడు. అతని దృష్టిలో కావ్యమంటే ఇలా ఉండాలి.

మృదు లలిత పదార్థం గూఢ శబ్దార్థ హీనం
బుధజన సుఖ యోగ్యం బుద్ధిమన్నృత్య యోగ్యం
బహుర సకృత మార్గం సంధి సంధాన యుక్తం
సభవతి శుభకావ్యం నాటక ప్రేక్షకానామ్

కావ్యం మృదు పదార్థాలతో కూడుకొని ప్రసాదగుణమయంగా ఉండాలని భరతుడి అభిప్రాయం. ఇతడు "ఇతివృత్తంతు కావ్యస్య శరీరం పరికీర్తితమ్" అని కావ్య శరీరాన్ని గురించి నిర్వచించాడు. కావ్య శరీరం ఇతివృత్తం, దీని సౌందర్య హేతువు రసమని భరతమహర్షి ప్రకటించాడు. అందువల్ల ఈయన రస ప్రాధాన్యవాది. భరతుడికి పూర్వం నందికేశ్వరుడు ఈ రస ప్రాధాన్య సిద్ధాంతాన్ని లేవదీశాడు. భరతుడు దాన్ని అనుసరించాడు.

భామహుడు ఐదవ శతాబ్దిలో ఉన్నాడు. ఇతని గ్రంథం కావ్యాలంకారం. ఈయన శ్రవ్య కావ్య చర్చను సాగించి "శబ్దార్థౌ సహితౌ కావ్యం" అన్నాడు. కావ్యానికి శబ్దార్థాలు శరీరమని, దాని శోభను వక్రోక్తి మొదలైన అలంకారాలు పెంపొందిస్తాయని నిర్ణయించాడు. ఈయన అలంకార ప్రాధాన్యవాది. ఈయన రసాన్ని కూడా 'రసవదలంకారం' అన్నాడు.

దండి ఆరవ శతాబ్దిలోని ఆలంకారికుడు. ఈయన గ్రంథం కావ్యాదర్శం. "శరీరం తావదిష్టార్థ వ్యవచ్ఛిన్నా పదావళీ" 'రమణీయార్థ భూషితమైన పదావళి కావ్య శరీరం' అని పేర్కొన్నాడు. ఇతడు గుణమత స్థాపకుడు. గుణాల వల్ల కావ్య సౌందర్యం కలుగుతుందని నిరూపించాడు. అల్పదోషం కూడా కావ్యంలో ఉండరాదన్నాడు. ఇతడు కూడా రస ప్రాధాన్య వాదాన్ని అంగీకరించలేదు.

వామనుడు తొమ్మిదవ శతాబ్దికి చెందిన ఆలంకారికుడు. 'కావ్యాలంకార సూత్రవృత్తి' ఈయన గ్రంథం. 'రీతి రాత్మా కావ్యస్య' అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఇతడు భామహుని అలంకార సిద్ధాంతాన్ని, దండి గుణ సిద్ధాంతాన్ని తన రీతి సిద్ధాంతంలో సమన్వయించాడు. "విశిష్టా పద రచనా రీతిః" అని రీతిని నిర్వచించాడు. కావ్యాత్మను గురించి ఆలోచించిన వారిలో ఇతడు ప్రధముడు.

ఆనందవర్ధనుడు కూడా తొమ్మిదవ శతాబ్దికి చెందిన ఆలంకారికుడు. ఇతని కృతి ధ్వన్యాలోకం. ఈయన క్రొత్తగా ధ్వని సిద్ధాంతాన్ని స్థాపించాడు. "కావ్య స్వాత్మా ధ్వని రితి బుధైః యస్సమామ్నాత పూర్వః" అన్నాడు. అలంకారాలు, గుణాలు, రీతులు - ఇవి అన్నీ ధ్వనికి తోడ్పడేవిగా ఉండాలన్నాడు. ఆనందవర్ధనుడి ధ్వని సిద్ధాంతం భరతుడి రస సంప్రదాయానికి పెంపుదల. ఆనందవర్ధనుడు భరతుడి రూపక రస సిద్ధాంతాన్ని గ్రహించి శ్రవ్య కావ్యంలో ప్రతిష్ఠించాడు. రసం వాచ్య రూపంలో కాకుండా వ్యంగ్య రూపంలో ఉండాలని ఆనందవర్ధనుడి అభిప్రాయం.

అభినవగుప్తుడు 11వ శతాబ్దికి చెందిన గొప్ప దార్శనికుడు, ఆలంకారికుడు. ఇతడు ధ్వన్యాలోకానికి వ్రాసిన వ్యాఖ్య'లోచనం'. ఈయన ఆనందవర్ధనుడి సిద్ధాంతాన్ని చక్కగా సమన్వయించాడు. రసధ్వని వివరణలో ఇతడు చూపిన ప్రతిభ చెప్పుకోదగింది. ఆనందవర్ధనుడు వస్తు, అలంకార, రసధ్వనులు మూడింటిని సమానంగానే పరిగణించాడు. అయితే రసధ్వని మీద కొంత మొగ్గ చూపాడు. అభినవగుప్తుడు రసధ్వని మీదనే అధికాభిమానాన్ని ప్రకటించాడు. రసధ్వనే కావ్యాత్మ అని నొక్కి వక్కాణించాడు.

మహిమభట్టు కూడా 11వ శతాబ్దికి చెందిన ఆలంకారికుడు. ఇతని శాస్త్ర గ్రంథం వ్యక్తి వివేకం. ఇది ధ్వన్యాలోకానికి ఖండనం. ఇతనిది కావ్యానుమితి సిద్ధాంతం. ఆనందవర్ధన ప్రోక్త ధ్వనులన్నీ అనుమానంలో అంతర్భవిస్తాయని, వ్యంజనావృత్తి అక్కరలేదని మహిమభట్టు అన్నాడు. కాని ఇతని వాదం నిలవలేదు.

కుంతకుడు కూడా 11వ శతాబ్దిలోని ఆలంకారికుడు. 'వక్రోక్తి జీవితం' ఇతని అలంకార గ్రంథం. ఇతడు ధ్వని మతానికి ప్రతికూలంగా కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. 'వక్రోక్తిః కావ్య జీవితం' అన్నాడు. భామహుడి వక్రోక్తినే ఇతడు విశేషంగా పెంచాడు. కవి వ్యాపారవక్రతే వక్రోక్తి అన్నాడు.

క్షేమేంద్రుడు కూడా 11వ శతాబ్ది ఆలంకారికుడు. అభినవగుప్తుడి శిష్యుడు. ఇతని గ్రంథం ఔచిత్య విచారచర్చ. రసానికి జీవిత భూతం చమత్కారకారి ఔచిత్యం. ఔచిత్యం లేకపోతే గుణాలంకారాలు ఎందుకు? అలంకారాలు అలంకారాలే. ఇవి కేవల బాహ్య శోభా హేతువులు. గుణాలు తపస్సత్యాదుల వంటి గుణాలే. అవి జీవితం కావు. కనుక రసవంతమైన కావ్యానికి జీవిత భూతం ఔచిత్యమే. ఔచిత్యం రస సిద్ధస్య స్థిరం కావ్యస్య జీవితం" - అని క్షేమేంద్రుడు సిద్ధాంతీకరించాడు. ఇతడు ధ్వనికారుడి

అనౌచిత్యాదృతే నాన్య ద్రసభంగస్య కారణం
ప్రసిద్ధౌచిత్య బంధస్తు రసస్యోపనిషత్పరా

అనే కారికను పెంచి ఈ సిద్ధాంతాన్ని నెలకొల్పాడు. 'అనౌచిత్యం కన్నా రసభంగానికి వేరే కారణం లేదు. చక్కని ఔచిత్యంగల కావ్యం రసోపనిషత్తే' అని దీని భావం. దండి పేర్కొన్న 'అగ్రామ్యత్వ'మే ఈ భావానికి మార్గదర్శకం. క్షేమేంద్రుడు ధ్వని మతాన్ని ఖండించలేదు, పోషించలేదు. క్షేమేంద్రుని సిద్ధాంతం ధ్వని మతానికి విరుద్ధం కాదు.

భరతుడు, భామహుడు, దండి, వామనుడు, ఆనందవర్ధనుడు, అభినవగుప్తుడు, మహిమభట్టు, కుంతకుడు, క్షేమేంద్రుడు అలంకార శాస్త్రంలో స్వతంత్ర సిద్ధాంతాల్ని స్థాపించారు. అయితే ఆనందవర్ధనుడితోనే కావ్య మార్గం నిర్ణీతమైంది. దీన్నే ఈషద్భేదంతో

అభినవగుప్తుడు అంగీకరించాడు. మహిమభట్టాదుల సిద్ధాంతాలు ఏవీ నిలవలేదు. మమ్మట, విశ్వనాథ, జగన్నాథ, విద్యాధర, విద్యానాథాదులు - ఆనందవర్ధన ధ్వని సిద్ధాంత పోషకులు. కాని రుద్రటాదులు కొంతమంది అలంకార మార్గాన్నే పట్టుకొని వేలాడుతూ గ్రంథాలు వ్రాశారు. కాని వీటికి మమ్మట, విశ్వనాథ, జగన్నాథుల గ్రంథాలకు వచ్చిన ప్రశస్తి రాలేదు.

## 1.4 ప్రముఖ నిర్వచనత్రయం

మమ్మటుడు అభినవగుప్తుడి శిష్యుడిగా భావించబడుతున్నాడు. ఆయన కాలాన్ని క్రీ.శ. 1050 - 1100 అని చెప్పవచ్చు. ఈయన 'కావ్య ప్రకాశం' రచించాడు. విశ్వనాథుడు క్రీ.శ. 14వ శతాబ్ది పూర్వార్ధంలో ఉన్నాడు. ఒరిస్సా ప్రాంతానికి చెందినవాడు. ఇతడు మమ్మటుడి కావ్య ప్రకాశానికి "కావ్య ప్రకాశ దర్పణ" మనే టీకను వ్రాశాడు. విశ్వనాథుని కృతి "సాహిత్యదర్పణం" ప్రసిద్ధమైన అలంకారశాస్త్ర గ్రంథం. అలంకార శాస్త్ర గ్రంథాల్లో మమ్మటుడి కావ్య ప్రకాశం తర్వాత సాహిత్య దర్పణానికే ఎక్కువ ఆదరం. జగన్నాథ పండితరాయలు తెలుగు బ్రాహ్మణుల్లో వేంగినాటి శాఖకు చెందినవాడు. షాజహాన్ ఆస్థానంలో ఉన్నాడు. ఈయన కాలం 17వ శతాబ్ది. రసగంగాధరమనే ఈయన అలంకార శాస్త్రం మౌలికమైనది, ప్రసిద్ధమైనది.

ఈ ముగ్గురిలో మమ్మటుడి నిర్వచనాన్ని విశ్వనాథుడు, ఈ ఇద్దరి నిర్వచనాల్ని జగన్నాథుడు పూర్వ పక్షం చేయడం వల్ల ఒక అనుక్రమ మేర్పడింది.

మమ్మటుడు "తదదోషౌ శబ్దార్థౌ సగుణావనలంకృతీ పునః క్వాపి" అని నిర్వచించాడు. దోషరహితాలు, గుణ సహితాలు, అలంకారయుక్తాలూ అయిన శబ్దార్థ యుగళం కావ్య శరీరమని దీని భావం.

'అనలంకృతీ పునః క్వాऽపి' అనే దానికి "యత్సర్వత్ర సాలంకారౌ క్వచిత్తు స్ఫుటాలంకార విరహేऽపి న కావ్యత్వ హానిః" అని వ్యాఖ్యానం. 'సర్వత్రా శబ్దార్థాలు సాలంకారాలుగానే ఉండాలి. ఒకానొక చోట అలంకారం స్ఫుటంగా లేకున్నా కావ్యం కాకపోదు' అని దీని భావం.

విశ్వనాథుడు "వాక్యం రసాత్మకం కావ్యం" అని నిర్వచించాడు. రస స్వరూపం కలిగిన వాక్యం (మహావాక్యం లేదా వాక్య సమూహం) కావ్యం అని దీని అర్థం.

విశ్వనాథుడు ఈ లక్షణాన్ని చెప్పి మమ్మటుడి లక్షణాన్ని ఇలా విమర్శించాడు. "అదోషౌ" అని ఉండరాదు. దోషరహిత శబ్దార్థాలే కావ్యమంటే కుదరదు. లోకంలో ఏ కావ్యం కూడా కొంచెమైనా దోష స్పర్శ లేకుండా ఉండదు. హనుమన్నాటకంలోని ఈ క్రింది శ్లోకం గమనార్హం.

న్యక్కారోऽ హ్యయమేవమే యదరయ స్తత్రాऽప్యసౌ తాపస
స్సోऽప్యత్రైవ నిహంతి రాక్షస కులం జీవత్యహో రావణః
ధిక్‌ధిక్ శక్రజితం, ప్రబోధితవతా కిం కుంభకర్ణేన వా
స్వర్గ గ్రామటికా విలుంఠన భుజోచ్ఛూనైః కిమేర్భుజైః

ఇందులో "న్యక్కారోహ్యయమేవ" అన్నచోట, "వృథోచ్ఛూనైః" అన్నచోట అవిమృష్ట విధేయాంశం అనే దోషం ఉంది. ఇందులో తొలిది వాక్య దోషం, మలిది పద దోషం. ఈ శ్లోకం దోషదూషితమైంది కనుక కావ్యం కాకుండా పోవాలి.

కాని ఇందులోని ధ్వని ప్రాధాన్యాన్ని బట్టి ఉత్తమ కావ్యంగా ధ్వనికారుడు అంగీకరించాడు. ఈ శ్లోకంలోని పదాలన్నీ రావణాభిమానాన్ని వ్యక్తీకరిస్తున్నాయి. వాచ్యంగా కాక వ్యంగ్యంగా స్ఫురింపజేస్తున్నాయి. కనుక 'అదోషౌ' పదం వల్ల కావ్య

నిర్వచనం అవ్యాప్తి దోషజుష్ట మౌతున్నది.

'రసాపకర్షకాః దోషాః' - రసాన్ని తగ్గించేవి దోషాలు. అందువల్ల రసాన్ని తగ్గించక పోతే అవి దోషాలు కావు. "న్యక్కారోఽహ్యయమేవ" శ్లోకంలోని అవిమృష్ట విధేయాంశ దోషం రసాన్ని తగ్గించడంలేదు. కాబట్టి 'అదోషౌ' అనే మాట కావ్య నిర్వచనంలో ఉండకూడదు.

"సగుణౌ" అనే పదం కూడా వ్యర్థమే. కావ్యానికి రసం ఆత్మభూతం. గుణాలు లేకపోతే రసం లేదు. రసం ఉంటే గుణాలు ఉంటాయి. గుణాలు రసధర్మాలు. గుణాలకు రసాలకు అవినాభావ సంబంధం ఉంది.

"సాలంకారౌ" అనే పదమూ వ్యర్థమే. అలంకారాలు లేకపోయినా కావ్యం రసవంతంగా ఉండవచ్చు. గుణాలు రసధర్మాలయినట్లు అలంకారాలు కావు. కనుక అలంకారాలు కావ్యానికి ముఖ్యాంగాలు కావు.

విశ్వనాథుడు 'వాక్యం రసాత్మకం కావ్యం' అనే నిర్వచనాన్ని కావించడానికి అభినవగుప్తుడి సిద్ధాంతమే ప్రేరకం. అభినవగుప్తుడు తన లోచన వ్యాఖ్యలో ఇలా అన్నాడు. "రసేనైవ సర్వం జీవతి కావ్యం, నహి రసశూన్యం కావ్యం కించిదస్తి, రసఏవ వస్తుతః ఆత్మా, వస్త్వలంకారధ్వనీతు సర్వధా రసం పర్యవస్యేతే" రసం చేతనే కావ్యం జీవిస్తుంది. రసశూన్యమైన కావ్యం ఉండదు. మూడు విధాలైన ధ్వనుల్లో రసధ్వనే కావ్యాత్మ. వస్త్వలంకార ధ్వనులు సైతం రసపర్యవసాయులు కావాలి.

విశ్వనాథుడు తన "వాక్యం రసాత్మకం కావ్యం" అనే సిద్ధాంతాన్ని సమర్థించడానికి కొన్ని గ్రంథాలనుంచి ప్రమాణాలు ప్రదర్శించాడు.

(i) వాగ్వైదగ్ధ్య ప్రధానేఽపి రస ఏవాత్ర జీవితం - అగ్నిపురాణం

ఎంత వాక్చమత్కారమున్నా (అలంకార చమత్కారమున్నా) కావ్యానికి రసమే జీవితం.

(ii) కావ్యస్యాత్మని సంజ్ఞిని రసాదిరూపే న కస్యచిద్విమతిః - మహిమభట్టు

రసాదులే కావ్యానికి ఆత్మ అనడంలో ఎవరికీ భిన్నాభిప్రాయం లేదు.

'వాక్యం రసాత్మకం కావ్యం' అనడం వల్ల ప్రబంధంలోని కొన్ని నీరస పద్యాలకు కావ్యత్వం లేకుండా పోవాలి. అందువల్ల ఒకే కావ్యంలో రసవత్పద్యాల్ని బట్టి కావ్యత్వం, నీరస పద్యాల్ని బట్టి అకావ్యత్వం కలుగుతాయి. కాని ఇది కుదరదు. రసవత్పద్యాలవల్ల నీరస పద్యాలకూ రసవత్త్వం కలుగుతుంది. ఒకే పద్యంలో అయితే రసవత్పదాలవల్ల నీరసపదాలకూ రసవత్త్వం కలుగుతుంది.

ఇలా విషయ విచారణ చేసి విశ్వనాథుడు 'వాక్యం రసాత్మకం కావ్యం' అనే సిద్ధాంతాన్ని ధ్రువపరచాడు.

జగన్నాథ పండితరాయలు "రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యం" అని కావ్య నిర్వచనం కావించాడు. మళ్ళీ మళ్ళీ భావించడం వల్ల లోకోత్తరాహ్లాదం కలిగించే అర్థమే రమణీయార్థం. ఆలోకోత్తరాహ్లాదమే చమత్కారం. ~~ఈ~~ చమత్కారం వస్త్వలంకార రసాది ధ్వనుల వల్ల కలుగుతుంది.

జగన్నాథుడు మమ్మటుడి నిర్వచనాన్ని ఇలా విమర్శించాడు. మమ్మటుడు శబ్దార్థాలు రెండూ కావ్య శరీరం అన్నాడు. దీనికి శాస్త్ర ప్రమాణం లేదు. లోక ప్రమాణమూ లేదు. లోకంలో "కావ్యాన్ని విన్నాం, కాని అర్థం కాలేదు" అనే వ్యవహారం ఉంది. దీన్నిబట్టి కావ్య శరీరమంటే శబ్ద విశేషమే కాని శబ్దార్థ యుగళం కాదు.

'అదోషౌ' అనే విశేషణమూ వ్యర్థమే. లోకంలో 'ఈ కావ్యం దుష్టం' అనే వ్యవహారం ఉంది. దుష్టమంటే దోషయుక్తం.

ఈ వ్యవహారాన్ని బట్టి దోషమున్నా కావ్యత్వానికి హాని లేదు. అసలు దోష స్పర్శలేని కావ్యం ఉండదు.

"సగుణౌ", "సాలంకారౌ" పదాలూ వ్యర్థాలే. "ఉదితం మండలం విధోః" అనే వాక్యముంది. ప్రకరణాది వశం వల్ల దీనికి అనేక వ్యంగ్యార్థాలు గోచరిస్తున్నాయి. కనుక గుణాలంకారాదులు లేకున్నా కావ్యత్వానికి లోపం లేదు.

'రమణీయార్థ ప్రతిపాదక శబ్దం కావ్యం' అనే నిర్వచనంలో శబ్దం కావ్య శరీరం. రమణీయార్థం కావ్యాత్మ. ఆత్మ విశిష్టమైనదే శరీరమైనట్లు రమణీయార్థ విశిష్ట శబ్దమే కావ్య శరీరం అని సారాంశం. 'రమణీయ' పదం చేతనే నిర్దోషత్వ, సగుణత్వ, సాలంకారత్వాలు కూడా ప్రకాశిస్తాయి.

పండితరాయలు ఆ తరువాత విశ్వనాథుడి నిర్వచనాన్నీ ఖండించాడు. రసాత్మకమైన వాక్యమే కావ్యమంటే వస్తు అలంకార వ్యంగ్య ప్రధానాలైన కావ్యాలకు కావ్యత్వం ఉండదు. మన ప్రాచీన మహా కవులు జలపాత వేగ భ్రమణ కవి బాలాది విలాసాల్ని రచించారు. అవి కేవల వస్త్వలంకార ప్రధానాలు. రస స్పర్శ రహితాలు. వాటికి కావ్యత్వాన్ని తొలగించడం భావ్యం కాదు. అటువంటి చోట్ల రసస్పర్శ ఉందని చెబితే "గౌశ్చలతి" (గోవు కదులుతున్నది) అనే వాక్యంలో కూడా ఏదో విధంగా రసం ఉందని చెప్పాలి. ఇది యుక్తం కాదు. కనుక విశ్వనాథుడి లక్షణం అయుక్తం.

జగన్నాథ నిర్వచనమైన "రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యం" అనేది దండి నిర్వచనమైన "ఇష్టార్థ వ్యవచ్ఛిన్నా పదావళీ కావ్యం" అనే దానికి రూపాంతరమే. ఇష్టార్థమంటే రమణీయార్థమే. వ్యవచ్ఛిన్నమంటే భూషితమని అర్థం. కాని కావ్యాదర్శ వ్యాఖ్యాత తరుణ వాచస్పతి "ఇష్టార్థ వ్యవచ్ఛిన్నా పదావళీ" అనే దానికి "చెప్పదలచిన అర్థంతో అలంకృతమైన శబ్దం" అని అర్థం చెప్పాడు. 'హృదయంగమం' అనే వ్యాఖ్యలో "చెప్పదలచిన అర్థాల్ని హెచ్చుతగ్గులు లేని విధంగా చెప్పగల పదసముదాయం" అనే అర్థం ఉంది. ఈ అర్థాల్ని బట్టి చూస్తే దండి జగన్నాథుల నిర్వచనాలకు భేదం కన్పిస్తుంది. అయితే ఇప్పటిదాకా చాలామంది పండితులు దండి జగన్నాథుల నిర్వచనాలను సమానార్థకాలుగానే భావించారు.

ప్రాయికంగా ప్రాచీనాలంకారికు లందరూ శబ్దార్థ యుగళాన్ని కావ్య శరీరమని సిద్ధాంతీకరిస్తే, దండి జగన్నాథులు శబ్ద విశేషమే కావ్య శరీరమన్నారు. ఇదే ఉత్తమ మతం.

మమ్మటుడి 'శబ్దార్థౌ', విశ్వనాథుని 'వాక్యమ్', పండితరాయల 'శబ్దః' - ఇవి అన్నీ ఉపలక్షణాలే. ఒక శబ్దమే, ఒక వాక్యమే కావ్యమౌతుందని కాదు. రమణీయమైన అర్థాలను మాత్రమే గ్రహించి, సముచిత శబ్దాలతో కావ్యరచన సాగించాలి. ఎక్కడైనా ఏదైనా ఒక దోషం ఉన్నంత మాత్రాన అది కావ్యం కాకుండా పోదు. కావ్యానికి ఆత్మ రస మనే మాట వాస్తవమే కాని ప్రతి రచనలోనూ రససిద్ధి కలుగుతుందని చెప్పలేము. అటువంటి సందర్భాలలో రమణీయత ఉంటే చాలు.

గుణదోషాల విషయానికి వస్తే అలంకార శాస్త్రాలు కొన్నిటిలో ప్రత్యేక ప్రకరణాలు ఉన్నాయి. అలంకార శాస్త్రాల్లో కావ్య గుణాలు పదిగా లెక్కించబడ్డాయి. వీటివల్ల రచన హృదయావర్జక మౌతుంది. దోషాలలో నిత్య దోషాలు, అనిత్య దోషాలు అని రెండు రకాలున్నాయి. నిత్య దోషాల్ని మాత్రం ఉపేక్షించకూడదు. అదిగాక, ఒకప్పుడు దోషమనుకున్నది కాలాంతర స్థలాంతరాల్లో కాకపోవచ్చు. అసలు దోషంలేని కావ్యం మృగ్యం. కాళిదాసాది మహాకవుల రచనలలో కూడా ఏవో చిన్నచిన్న దోషాలు కనిపిస్తూనే ఉంటాయి. కాళిదాసు 'త్రియంబకం' అని ప్రయోగించిన శ్లోకం కావ్య జాతికి చెందకుండా పోతుందా? 'ఉండేదే రాముడొకడు' అనే త్యాగయ్య గారి కీర్తన కావ్యం కాకపోతుందా? ఈ రెండూ వ్యాకరణ దోషాలు. ఇటువంటి చిన్న దోషాలవల్ల ఆ రచనల రమణీయతకు లోటు కలగలేదు. ఈ మహాకవుల రచనల్లో దోషాల్ని మించిన సుగుణాలున్నాయి. దోషాన్ని మరపించే రససంపద, రమణీయత ఉన్నాయి. 'ఏదో హిదోషో గుణ సన్నిపాతే! నిమజ్జతీందోః కిరణేష్వి వాంకః' చంద్ర కిరణాలలో మచ్చ మునిగిపోయిన రీతిగా ఒక దోషం గుణసమూహంలో మునిగి పోతుంది - అన్న కాళిదాసోక్తిని మనం గమనించాలి.

తప్పు గలిగిన చోటనే యొప్పు గలుగు
సరస కవితా వశోక్తుల సరణియందుఁ
గప్పు కలిగిన నీహారకరుని యందు
నమృత ధారా ప్రవాహంబు లడరుఁగాదె

అని తెనాలి రామకృష్ణ కవి కూడా తన 'పాండురంగ మహాత్మ్యము' (1-14) లో ప్రవచించిన విషయం అందరికీ తెలిసింది. అయితే రచన అంతా తప్పుల తడకగా సాగించి, ఏ లక్షణానికి కట్టుబడకుండా విశృంఖలంగా కొన్ని ఉద్వేగ వాక్యాలు పలికి, ఇది రసాత్మక కావ్యమని చెప్పుకోవడం, తాను మహాకవినని చెప్పుకోవడం సమ్మతించదగ్గ సంగతి కాదు. ఈ సందర్భంలో తిరుపతి వేంకటకవులు తమ శ్రవణానంద కావ్యంలో (1-11) వక్కాణించన మాట సాహిత్యపరులంతా మననం చేసుకోదగ్గది.

ఎచ్చటేనియుఁ దప్పుండు టేరికైన
ధర్మమే భ్రాంతి పురుషుల ధర్మమగుటఁ
బుటకు డెబ్బది పదొకొండు తొటుకులుండు
వారు వీరును నొకతీరు వారు గారు

ఈ విధంగా దోష పరిమితిని మనం దృష్టిలో ఉంచుకోవాలి, నిగ్రహంతో ఆలోచించాలి.

తదల్పమపి నోపేక్ష్యం
కావ్యే దుష్టం కథంచన
స్యాద్వపు స్సుందర మపి
శ్విత్రేణైకేన దుర్భగం

కావ్యంలో అల్పమైన దోషాన్నైనా ఉపేక్షించకూడదు. శరీరం ఎంత సుందరంగా ఉన్నా చిన్న బొల్లి మచ్చ అసహ్యంగా ఉంటుందన్న దండి కఠోర విమర్శ ఎంత అతివాదమో, ఎన్ని దోషాలు ఉన్నా ఫర్వాలేదు అనే వాదమూ అంత అతివాదమే. ఈ అతివాదాన్ని పరిహరించాలి.

కొన్ని అలంకార శాస్త్రాలలో 'వాక్య గర్భిత దోషం' అని ఒక దోషం పేర్కొబడింది. 'ఒక వాక్యంలో ఇంకొక వాక్యం ఇమిడి ఉండడం' అని దీని అర్థం. ఈ కాలంలో ఇది సర్వసాధారణమై పోయింది. అందువల్ల రమణీయార్థం ప్రస్ఫుటం కావడానికి అడ్డుగా నిలిచేదే దోషం.

మన ఆలంకారుకుల నిర్వచనాలను బట్టి సాహిత్య మనిపించుకోదగిన ఏ రచన అయినా కావ్యమౌతుంది. కాని పాశ్చాత్యులు చేసిన నిర్వచనాలన్నీ కవిత్వాన్ని గురించే ఆ నిర్వచనాలు చేసిన వారు శాస్త్రకారులు కారు. అనుభవ సంపన్నులైన విమర్శకులు, ప్రామాణికులైన వేత్తలు. అందువల్ల వారి మాటలు కూడా శాస్త్ర మర్యాదా భాజనాలే.

సంస్కృత లాక్షణికులు కావ్య స్వరూప నిరూపణం చేసేటప్పుడు కావ్య శరీరం, కావ్యాత్మ మీద తమ దృష్టిని కేంద్రీకరించారు. వారి నిర్వచనాలు ఈ రెండు అంశాల చుట్టూ పరిభ్రమించాయి. పాశ్చాత్యులు వీటిని ప్రస్తావించలేదు. కాలరిడ్జి వంటి వారు ప్రస్తావించినా పరిగణనీయం కాదు. వీరి నిర్వచనాలు ప్రధానంగా అనుభూతి, ఆవేశం, ఊహ, భావన, కల్పన, సౌందర్యం, సందేశం, లయ, ఛందస్సు మొదలైన అంశాల మీద ఆధారపడ్డాయి. ఆంగ్ల లాక్షణికులు మన సిద్ధాంతాల్ని ఊహించారని చెప్పలేము. కాని గోల్డుస్మిత్, లేహంట్ ప్రభృతులు అలంకార మార్గానుయాయులు, వర్డ్సువర్తు, జాన్‌కేబెల్ ప్రభృతులు రస మార్గానుయాయులని చెప్పవచ్చు.

## 1.5 పాశ్చాత్య నిర్వచనాలు

కవిత్వాన్ని తొలిసారిగా నిర్వచించిన పాశ్చాత్య లాక్షణికుడు అరిస్టాటిల్. ఇతడు కవిత్వాన్ని (కళలన్నిటినీ) ప్రకృతికి అనుకరణమన్నాడు. అరిస్టాటిల్ ప్రత్యేకించి ఒక సూత్రంలో ఈ విషయాన్ని చెప్పకపోయినా, ఆ భావాన్ని ఆధారంగా చేసుకుని కవిత్వాన్ని, కళల్ని వాటి స్వరూప స్వభావాల్ని నిర్ణయించాడు. ఇతనిది అనుకరణ సిద్ధాంతం.

అనుభూతిని (Feeling), ఆవేశాన్ని (Emotion) పురస్కరించుకొని వర్డ్స్‌వర్త్, మిల్, కేబెల్, రస్కిన్ కవిత్వ నిర్వచనం కావించారు. తీవ్రానుభూతుల స్వచ్ఛంద విజృంభణమే కవిత్వం - Peotry is the spontaneous overflow of powerful feelings - అని వర్డ్స్‌వర్త్ నిర్వచనం. ఆవేశం స్వచ్ఛందంగా రూపొందిన శబ్దార్థాలు కవిత్వం - But the thought and words in which emotion spontaneously embodies itself - అని మిల్ నిర్వచనం. ఉప్పొంగే అనుభూతుల అభివ్యక్తి కవిత్వం - A vent for overcharged feeling - అని కేబెల్ నిర్వచనం. ఊహ ద్వారా ఉదాత్తావేశాలకు ఉత్తమాలంబనం కల్పించేది కవిత్వం - The suggestion by the imagination of noble grounds for the noble emotions - అని రస్కిన్ నిర్వచనం.

ఊహాశక్తిని (Imagination) పురస్కరించుకొని షెల్లీ, హాజ్లిట్ కవిత్వాన్ని నిర్వచించారు. ఊహాశక్తి ప్రకటనమే కవిత్వం - In a general sense may be defined as the expression of the imagination - అని షెల్లీ నిర్వచనం. ఊహాశక్తి పలికే భాష కవిత్వం - The language of the imagination - అని హాజ్లిట్ నిర్వచనం.

లయ (Rhythm) దృష్ట్యా నిర్వచించారు కార్లైల్, పో. సంగీతాత్మకమైన ఆలోచనే కవిత్వం - We will call musical thought - అని కార్లైల్ నిర్వచనం. లయబద్ధమైన సౌందర్య సృష్టి కవిత్వం - The rhythmic creation of beauty - అని పో నిర్వచనం.

శబ్దాన్ని (Words) దృష్టిలో ఉంచుకొని మెకాలే నిర్వచించాడు. భావనా శక్తిని భ్రాంతులతో నింపే విధంగా శబ్దాల్ని ప్రయోగించటం, చిత్రకారుడు రంగుల ద్వారా సాధించేదాన్ని శబ్దాలతో సాధించటం కవిత్వం అన్నాడు మెకాలే.

వ్యక్తీకరణం (Expression) మీద చూపు నిలిపి, ఆర్నాల్డు కవిత్వాన్ని నిర్వచించాడు. శబ్ద సంపద అందుకొనగల సంపూర్ణమైన ఆనందప్రదమైన స్వరూపం - The most delightful and perfect form of utterance that human words can reach - అన్నాడు. వర్డ్స్‌వర్త్ కూడా "సమస్త శాస్త్రాల సత్యాల ఆవేశభరితమైన అభివ్యక్తి కవిత్వం" అని ఉద్ఘాటించాడు.

ప్రయోజన (purpose of the poem) దృక్పథంతో కాలెరిడ్జి కవిత్వాన్ని నిర్వచించాడు. కవిత్వం శాస్త్రీయ విజ్ఞానానికి విరుద్ధమైనది. దాని ప్రయోజనం సత్యం కాదు, ఆనందం - Poetry is anti-thesis of science having for its immediate object pleasure not truth - అని అభిభాషించాడు.

భావన, కల్పన, సౌందర్యం మొదలైన అంశాలను సమన్వయించి జాన్సన్, లే హంట్ ప్రభృతులు కావ్య నిర్వచనం కావించారు. "ఛందో బద్ధమైన రచన కవిత్వం. హేతువాదానికి భావనాశక్తిని జోడించి, సత్యానంద సమ్మేళనం కావించగల కళ కవిత్వం" - Poetry is a metrical composition. It is the art of uniting pleasure with truth by calling imagination to the help of reason and its essence is 'invention' - అని జాన్సన్ నిర్వచించాడు. "సత్యం, సౌందర్యం, సత్త్వం అనే మూడు లక్షణాల పట్ల గాడాభినివేశాన్ని ప్రకటించే అభివ్యక్తి కవిత్వం, తన ఉద్దేశాలకు భావన, కల్పన అనే శక్తుల సాహాయ్యంతో తార్కాణాల్ని సృష్టిస్తూ ఏకత్వాన్ని పాటించే వైవిధ్యంతో అలరారేటట్లు భాషను సవరించుకొనేది కవిత్వం" అని లే హంట్ నిర్వచించాడు. "కవితాశక్తికి వివేకమే శరీరం, కల్పనే వేషం, ఆవేశమే ప్రాణం, ఊహే ఆత్మ. ఈ ఆత్మ అన్నిటిలో పరివ్యాప్తమై విభిన్నాంశాలకు సురుచిరమైన

స్ఫుటమైన ఏకత్వాన్ని ప్రసాదిస్తుంది" - 'Finally, good sense is the body of poetic genius, fancy is its drapery, emotion its life and imagination the soul that is every where, and in each, and forms all into one graceful and intelligent whole' - అని కాలరిడ్జి నిర్వచనాన్ని రూపొందించాడు.

ఈ నిర్వచనాలలో మిల్ నిర్వచనం విశ్వనాథుడు 'వాక్యం రసాత్మకం కావ్యం' అనే నిర్వచనానికి ఆంగ్లీకరణంలాగా ఉంది. కార్లైల్ నిర్వచనం జగన్నాథ పండితరాయల వాక్యంతో సంవదిస్తున్నది. కాలరిడ్జి - జాన్సన్ అభిప్రాయాన్ని పూర్వపక్షంచేసి కవిత్వ ప్రయోజనం ఆనందమే కాని సత్యం కాదు అని ప్రతిపాదించినట్లు అనిపిస్తున్నది. షెల్లీ కూడా (కాలరిడ్జి లాగానే) జాన్సన్ పండితుడి నిర్వచనాన్ని పూర్వపక్షం చేసినట్లుగా కనిపిస్తున్నది. జాన్సన్ కవిత్వ నిర్మాణ హేతువుగా బుద్ధికీ భావనకూ సమప్రాధాన్యమిస్తే షెల్లీ బుద్ధి వ్యాపారాన్ని త్రోసిపుచ్చి భావనకే ప్రాధాన్యమిచ్చాడు.

ఈ పండితులందరూ తమతమ ఆశయాలకు అనుగుణంగా కవిత్వ నిర్మాణ హేతువులను గురించి, తత్ప్రయోజనాన్ని గురించి చెప్పారు. మన ఆలంకారికుల్లాగా, తర్కసహమైన, నిష్కృష్టమైన నిర్వచనాలు చేయడానికి ప్రయత్నించలేదు. మొత్తం మీద పాశ్చాత్య పండితులు కూడా రసభావ భావనాత్మక రచన కవిత్వ మౌతుందని, దాని ప్రధాన ప్రయోజనం ఆనందమైనా, బుద్ధి వికాసానికి కూడా దోహదం చేయాలని చెప్పారు.

పాశ్చాత్య పండితుల నిర్వచనాలలోని కొన్ని ప్రధాన సూత్రాలను అనుశీలిద్దాం.

అరిస్టాటిలుకు ముందే ప్లేటో 'రిపబ్లిక్' గ్రంథంలో కవిత్వాన్ని గురించి కొంచెం ప్రస్తావించాడు. కవిత్వం భ్రాంతి నుంచి ఆవిర్భవిస్తుంది. అది సత్యానికి ఎంతో దూరంలో ఉంటుంది. ఉద్రేకాలను రెచ్చగొడుతుంది. అందువల్ల అంతగా ఆదరణీయం కాదు అని అన్నాడు. ఈ ధోరణికి భిన్నంగా అరిస్టాటిలు తన సిద్ధాంతాన్ని ఆవిష్కరించాడు. కవిత్వం - లలితకళలన్నీ - ప్రకృతికి అనుకరణమే అన్నాడు. అరిస్టాటిలు అనుకరణ సిద్ధాంతాన్ని సిడ్నీ విమర్శించాడు. కవిత్వం ప్రకృతికి అనుకరణం కాదని, అపూర్వ సృష్టి అని వాదించాడు. సామాన్యుడి చర్మచక్షువుకు కనిపించని గుప్తసౌందర్యాన్ని కవి సువ్యక్తం చేస్తాడు. అందువల్ల ఇది అనుకరణం కాదు. ఆదర్శాత్మక అనుకరణం అన్నాడు సిడ్నీ. సిడ్నీ దృష్టిలో వాస్తవ జగత్తు కన్నా కవితాజగత్తు విలువైనది. పఠిత తన నిత్య జీవితంలో కవితాజగత్తును ఆదర్శంగా స్వీకరిస్తాడు. కనుక అనుకరణం కవి ధర్మం కాదు, పాఠక ధర్మమని సిడ్నీ తేల్చాడు. కవిని అనుకర్తగా కాక సృష్టికర్తగా పేర్కొన్నాడు.

అరిస్టాటిలు కవిత్వాన్ని ప్రకృతికి గ్రుడ్డి అనుకరణంగా భావించలేదు. అతడు పేర్కొన్న అనుకరణ భేదాల్ని అనుశీలిస్తే ఈ విషయం తేటతెల్లమౌతుంది. అనుకరణం మూడు విధాలుగా జరుగుతుందని అరిస్టాటిల్ అన్నాడు. (i) కవి ప్రకృతిని యధాతథంగా అనుకరించవచ్చు. (ii) అది ఇలా ఉండవచ్చు అనే విశ్వాసంతో చిత్రించవచ్చు. (iii) అది ఇలా ఉండాలని చిత్రించవచ్చు. వీని ఉత్తరోత్తరోత్కర్షను మనం గమనించవచ్చు. కవి ప్రతిభను బట్టి వస్తు చిత్రణం సమర్థ పద సంచయంలో సముచితరీతిలో జరుగుతుందని స్పష్టంగా చెప్పాడు. కల్పనా శిల్పానికి పుష్టి కలిగించడం కోసం కవి ప్రకృత్యనుకరణంలో యాదృచ్ఛికంగా కొంత దారి విడిచిపోయినా అంత పెద్ద దోషం కాదన్నాడు. వస్తు స్థితి తెలియనప్పుడు దానికి సంబంధించిన విశ్వాసాన్ని పురస్కరించుకొని గాని లేదా అది ఇలా ఉండవచ్చునని ఊహించి కాని వ్రాయవచ్చునని ఎలుగెత్తి చాటాడు.

అరిస్టాటిలు, ఆర్నాల్డు ప్రభృతులు వాస్తవికతవైపు మొగ్గారు. సిడ్నీ, బ్రాడ్లీ మొదలైన వారు వాస్తవిక జగత్తు కన్న కవితా జగత్తు భిన్నమైనదే కాక ఉన్నతమైనదనీ ఘంటా ఘోషంగా ప్రకటించారు. క్రోచే తాను వ్రాసిన 'ఈస్తటిక్సు' గ్రంథంలో కవితా జగత్తు సత్యమని, వాస్తవ జగత్తు మిథ్య అనీ అభిప్రాయపడ్డాడు. కావ్య జగత్తు నుంచే సామాజిక జగత్తు రూపుదిద్దుకొన్నదని నేల విడిచి సాము చేశాడు. సిడ్నీ త్రోవలోనే బ్రాడ్లీ ప్రయాణం చేశాడు. కావ్య జీవితం స్వతంత్రమనే దాకా సాగిపోయాడు.

కవిత్వం వాస్తవ లోకానికి కేవల ప్రతిబింబం కాదు. మానవుడు కొన్ని సందర్భాలలో వాస్తవ జగత్తులో అతనికి లభ్యం కాని పదార్థాలను కవితాజగత్తులో సృష్టించుకొని అవ్యక్తానందాన్ని పొందుతున్నాడు. సంస్కృత గ్రీకు సాహిత్యాలలోని కామదేవ ప్రస్తావన అటువంటిదే. మన్మథుణ్ణి పుష్ప ధన్విగా ఉభయ సాహిత్యాలూ కల్పన చేసుకొన్నాయి. మన సాహిత్యంలోని అమరులు, అప్సరసలు, ఆకాశగంగ, పాలసముద్రం, మేరు పర్వతం, స్వర్గం అలాంటివే. నరకం, వైతరణి వంటివి భయావహ కల్పనలు. అందువల్ల వాస్తవమైన లౌకికానుభూతులకు కవి కల్పనను జోడిస్తాడని తెలుతున్నది.

వస్తు స్థితి కవి భావనను పురస్కరించుకొని చిత్రితమౌతూ ఉంటుంది గాని కేవలం ఆ వస్తు యాథార్థ్యాన్ని బట్టి కాదు. ఒకే వస్తువు కవి మానసిక స్థితిగతుల్ని బట్టి భిన్న సందర్భాలలో భిన్నమైన అనుభూతుల్ని ఇస్తుంది - లాంబర్న్ అనే విమర్శకుడి అభిప్రాయమిది. ఇది మన ఆనందవర్ధనుడి 'అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతిః' అనే అభిప్రాయానికి అత్యంత సన్నిహితం. మొత్తం మీద కావ్య జగత్తు, జీవితానికి భిన్నమైన లోకం కాదు. కావ్య జగత్తుకు ఆధారం వాస్తవ జగత్తే.

వర్డ్సువర్తు, మిల్, రస్కిన్ మొదలైన వారు కవిత్వమంటే ఆవేశోద్గమనమే అని ప్రకటించారు. వర్డ్సువర్తు ముందు ప్రబలమైన అనుభూతుల మహా ప్రవాహమే కవిత్వమన్నా వెంటనే సంబాళించుకొని 'It takes its origin from emotion recollected in tranquillity' అని తన వాదానికి స్థిరత్వాన్ని సమకూర్చుకున్నాడు. 'మానిషాద' శ్లోక మొక్కటి వాల్మీకి ముఖం నుండి హఠాత్తుగా వెలువడి ఉండవచ్చు. కాని రామాయణమంతా అలా రాలేదు. నెమ్మదిగా ఆలోచనా పూర్వకంగా రచించబడింది. ఒడిస్సీ మొదలైనవీ అంతే. కవిత్వ రచనకు హృదయమే కాకుండా మేధ కూడా ఎంతో అవసరం. ఆవేశాన్ని నిగ్రహించుకొని రసార్ద్రం చేసి సుందర శబ్ద సందోహంతో ప్రవటించినప్పుడే ఉత్తమ కవిత్వం ఉద్భవిస్తుంది. మన అప్పకవి కూడా "ఎంత యోజించినను బద్య మంత సారవంతమగుఁగాన నిలుకడ వలయుఁ గృతికి" (అప్పకవీయము 1-59) అన్నాడు.

షెల్లీ మొదలైన వారు ఊహా ప్రకటనమే కవిత్వ మన్నారు. ఇది అవ్యాప్తితో కూడుకొన్న నిర్వచనం. ఆ ఊహకు తగిన తోడుగు అవసరం కదా! కార్లైల్ గాన సహితమైన ఆలోచన కవిత్వమన్నాడు. ఈ నిర్వచనాన్ని బట్టి వచన గీతాల రూపంలో ఉన్న రచనలు కవిత్వం కాకపోవచ్చు. ఇది సమగ్ర నిర్వచనం కాదు. ఇక మెకాలే శబ్దానికే ప్రాధాన్యమిచ్చాడు. ఇది రీతివాదుల ధోరణి. ఉత్తమ కవిత్వానికి ప్రధానం రసం, రమణీయార్థం. ఈ పాశ్చాత్య నిర్వచనాలలో సంక్షిప్తతను సమగ్రతను దృష్టిలో ఉంచుకొని చూస్తే ఎడ్గర్ ఎలన్ పో (Edgar Allen Peo) అనే అమెరికా దేశపు రచయిత కావించిన నిర్వచనం శిరోధార్యం. Poetry is the rhythmic creation of beauty. సౌందర్యపు లయాత్మక సృష్టి కవిత్వం అని దీని భావం. ఇక్కడ సౌందర్యం అంటే రమణీయార్థం. పాఠకుడికి ఆనందాన్ని కలిగించేదే రమణీయార్థం. నిరంతర దర్శన మననాల వల్ల అపూర్వంగా, నిత్య నూతనంగా కనిపించడమే రమణీయత. Creation శబ్దం కూడా సార్థకం. కవిత్వం అనుకరణం కాదు, నూత్న సృష్టి అని దీని భావం. కవిత్వానికి, గద్యానికి స్థూలమైన భేదం రచనా రీతిలో ఉంది. కవిత్వానికి లయ ప్రథమ గుణం. ఎడ్గర్ ఎలన్ పో ఛందోబద్ధమైనదే కవిత్వమనలేదు. లయబద్ధమైనదని మాత్రమే అనడం వల్ల ఛందోవిరహితాలైన Free verse, Blank verse మొదలైనవి ఈ నిర్వచనంలో ఇమిడిపోయాయి. వచన కవితలో 'లయ', 'తూగు' ప్రధాన గుణాలు. కనుక ఈ నిర్వచనం సంక్షిప్తంగా, సమగ్రంగా ఉందనవచ్చు. 'లయ' వల్ల కవిత్వానికి స్పందన గుణం లభిస్తుంది. కావ్యానికి, పద్యానికి వైలక్షణ్యాన్ని ప్రసాదిస్తుంది. "Just as the banks give each river a distinct personality so does rhythm make each peom an individual creation" అని విశ్వకవి రవీంద్రుడు లయ విశిష్టతను విశదీకరించాడు.

## 1.6 సమీక్ష

ప్రాచ్య పాశ్చాత్య నిర్వచన పరిశీలనానంతరం రమణీయార్థ ప్రతిపాదకమైనదీ, లయాత్మకమైనదీ, ఆనందదాయకమైనదీ ఉత్తమ కావ్యమని ప్రస్ఫుటమౌతున్నది.

## 1.7 ప్రశ్నలు

1. భారతీయాలంకారికుల కావ్య నిర్వచనాలను వివరించండి.
2. పాశ్చాత్య పండితుల కవిత్వ నిర్వచనాలను విశదీకరించండి.

## 1.8 ఉపయుక్త గ్రంథాలు


1. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు, ప్రయోగములు - డాక్టర్ సి. నారాయణరెడ్డి
2. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
3. సంస్కృత సాహిత్య చరిత్ర - డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి, డాక్టర్ ముదిగంటి గోపాలరెడ్డి
4. కావ్యలంకార సంగ్రహము - శిరోమణి సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రి



**డాక్టర్ చేరెడ్డి మస్తాన్ రెడ్డి**

ఎం.ఏ., పిహెచ్.డి.

రీడర్ & ప్రిన్సిపాల్

ఎస్.కె.ఆర్.బి.ఆర్. కళాశాల

నరసరావుపేట - 522 601

# పాఠం - 2

# కవిత్వము - ఛందస్సు

పాఠ్యనిర్మాణక్రమం


2.0 లక్ష్యం
2.1 పరిచయం
2.2 ఛందస్సు పాత్ర
2.3 కవిత్వం లేని ఛందస్సు
2.4 కవిత్వం - అంత్యప్రాస
2.5 ఛందస్సు - సంగీత స్పర్శ
2.6 మాత్రాచ్ఛందస్సు
2.7 జన వ్యవహారం - ఛందస్సు
2.8 కవిత్వం - ఛందస్సు
2.9 ఛందస్సు - ప్రయోజనాలు
2.10 ఛందస్సు భావానుకూలత
2.11 మహాకవుల ఛందఃప్రీతి
2.12 ఛందస్సు - ధారణ
2.13 అనువాదం - ఛందస్సు
2.14 సమీక్ష
2.15 ప్రశ్నలు
2.16 ఉపయుక్త గ్రంథాలు


## 2.0 లక్ష్యం

కావ్య వ్యవహారంలోను జన వ్యవహారంలోను ఛందస్సు ప్రధాన పాత్ర వహిస్తుంది. ఛందస్సు వల్ల రచనకు సంగీత స్పర్శ సమకూరుతుంది. అట్లని కవిత్వ సౌందర్యం లేని రచనలు ఛందోమయాలైనా వాటిలో జీవకళ ఉండదు. మన మహాకవులు భావానుకూలమైన ఛందోభేదాల్ని ప్రయోగించడంలో సిద్ధహస్తులు. కొందరు కవులు కొన్ని ఛందస్సులను ప్రత్యేకంగా ఆదరించారు. ఛందస్సు ధారణకు, పద స్వరూప నిరూపణకు ఎంతో ఉపకరిస్తుంది. పద్యాన్ని గద్యంగా అనువదిస్తే అందం చందం ఉండదు. ఈ విషయాలను వివరంగా తెలుసుకోవడమే ఈ పాఠ్య లక్ష్యం.

## 2.1 పరిచయం

'సాహిత్యము', 'సారస్వతము', వాఙ్మయము అను పదములు సాహిత్య విమర్శలో సమానార్థములుగ వాడుట పరిపాటి. ఇందు 'సారస్వతము' 'సరస్వతి'కి సంబంధించినది. 'రస' సమన్వనితమైన 'సాహిత్యము'నకు సారస్వతమను పేరు సరిపోవును. మరి 'సాహిత్యము' యొక్క పరమ ప్రయోజనములు 'ఆనందము' కలిగించుట, 'ఉపదేశము'ను అందించుట అనునవి 'హితేన సహితమ్ సాహిత్యమ్' అను వ్యుత్పత్తి అంతరార్థము అదియే.

'ఆనందము' కలుగుటకు మూల ధాతువులేవి యనునదియే సమస్య. అందుచేతనే ప్రాచీనాలంకారికులు 'కావ్య' మందలి సిసలైన 'ఆత్మ' యేదియో అని అన్వేషించబూని పెక్కు రీతుల వాక్రుచ్చిరి.

'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి' అన్నట్లు ఆ ఆనందహేతువు 'రసము' - అని భరతుడు సూచ్యము చేసెను.

'నహి రసాదృతే కశ్చిదర్థః ప్రవర్తతే' (రసము లేకుండ ఏ అర్థము ప్రవర్తించదు). దీనినే మరికొంత వ్యాఖ్యానించిన అభినవగుప్తుడు -

'. . . . . . నహి రసశూన్యం కించిదస్తి
రసో వస్తుతః ఆత్మా . . . . . . . . . . '

అని 'రసము' కావ్యమునకు 'ఆత్మ' వంటిదని, రసము ద్వారా వచ్చే 'ఆనందమే' 'కావ్య' పఠన, దర్శనముల ద్వారా వచ్చునని తెలిపెను.

'శబ్దార్థాలు' - కావ్య శరీరాలని 'శబ్దము', దాని వలన వ్యక్తమయ్యే 'అర్థము' కావ్యమునకు ప్రాణమని భామహుడు చెప్పగా, కుంతకుడు 'వక్రోక్తిః కావ్య జీవితమ్మ'ని, వామనుడు 'రీతిరాత్మా కావ్యస్య', అని ఆనందవర్ధనుడు 'కావ్యస్యాత్మా ధ్వనిరితి బుధైః . . . .' అని అనేక కోణాల్లో 'కావ్య' ఆనందహేతువుల్ని తర్కసహితంగా వ్యాఖ్యానించారు.

## 2.2 ఛందస్సు పాత్ర

మన పాఠ్యాంశములోని ప్రధానాంశము 'ఛందస్సు'. ఛందస్సు 'సాహిత్యము'లో ముఖ్యంగా 'పద' సాహిత్యంలో ఎలా 'ఆనంద' కారకమౌతుంది. సాహిత్యము శ్రవ్య, దృశ్య కావ్యములైనను వానిలో 'ఛందస్సు' యొక్క పాత్ర ఎట్టిది? అసలు 'ఛందస్సు' అంటే ఏమిటి? అన్న కొన్ని సందేహాలను సమాధానపూర్వకంగా నివృత్తి చేసికొందాము.

గద్యల్లో 'రగడ'లు - 'అశ్వగతి', 'ఋషభగతి' మొదలైనవి తాళబద్ధమైన రచనలు. అలానే పద్యాల్లోని 'ఛందస్సులు' ఒక క్రమములో 'ఆవృత్తి' అగుట వలన శబ్దానుక్రమణికను బట్టి 'లయ' 'తాళము' అంతర్గతంగా వెలువడుతుంది.

ఉదాహరణకు - ఒక 'ఛందస్సు'లో (ఉత్పలమాల) 'భ-ర-న-భ-భ-ర-వ' అను గణములు ఒకదాని తరువాత మరొకటి చొప్పున నాలుగు పాదాల్లో ఆవృత్తి చెందడము, ప్రతిపాదంలోను 'ప్రాసా'క్షరము 'హల్యంబంధి'యై ఉండటము, పాదమధ్యములో 'యతి' స్వరసంబంధియై ఉండటము శబ్దాలంకారములు స్వతహాగానే వినసొంపుగా ఉంటాయి. శబ్దాలంకారములైన అనుప్రాసాలంకారములు, అంత్యప్రాసలు, యమకములు, లాటానుప్రాస, ఛేకానుప్రాసము, అన్నియు 'పదావృత్తి' వలన ఒక విధమైన 'లయబద్ధత'ను (Rhythmic Expression) సంతరించుకొంటాయి. 'అక్షర' నియమముగాని, 'మాత్రా' నియమముగాని, 'గణ' బద్ధంగా నిర్మించటమే 'ఛందస్సు'కు బహిస్స్వరూపము. కాని అంతరార్థం మాత్రము 'సహృదయుని'కే అంతుబట్టేది.

"Poetry is metrical (thought) composition" అన్న Samuel Johnson మహాశయుని ఆశయము - 'కవిత్వము ఛందస్సు' అభిన్నములనియే. కాని 'కోలరిడ్జి' అను కవి విమర్శకుడు. ఉత్తమ కవిత్వము ఛందస్సు లేక కూడ ఉండును. (Poetry of the highest kind may exist without metre). "ఛందస్సు కవిత్వమునకు ఒక 'ఆభరణమే' గాని అదే దాని హృదయము కాదని - 'సర్ ఫిలిప్ సిడ్నీ' అను విమర్శకాగ్రేసరుడు 'ఛందస్సు'ను బహిస్సౌందర్యముగనే పరిగణించెను.

## 2.3 కవిత్వం లేని ఛందస్సు

ఇక్కడ 'కావ్యము'ను పద్యమని, గద్యమని విభజించుకొని పరిశీలింతము. 'గద్యము' వ్రాసి మహాకవుల కోవలో చేరిన కవులు లేకపోలేదు.

బాణుడు - 'గద్యం నికషం కవీనాం' అను వర పరీక్షలో నెగ్గినవాడు. ఆయన వ్రాయని, స్పృశించని, లోకవృత్తము లేదని ప్రశంసింపబడినాడు. 'బాణోచ్చిష్టం జగత్సర్వం' పదలాలిత్యమునకు ప్రసిద్ధిగన్న 'దండి' వ్రాసిన 'దశకుమార చరిత్రము' పద్యము కాకున్నను, 'ఛందము' న కెక్కకున్నను 'కవిర్దండీ, కవిర్దండీ, కవిర్దండీ' అని పొగడబడినాడు.

కేవలము 'ఛందస్సు' మాత్రముండి దానిలో 'కవిత్వ'ము, అనగా ఆనందమయముగానిది లేనిచో 'మేధ' లేని కళేబరముతో సమానమే. ఇట్టివి శాస్త్రములలో ఎక్కువ. ప్రాచీనకాలమందు శాస్త్రములు పెక్కు ఛందో బద్ధములైనవే. పావులూరి మల్లన, లీలావతి, భాస్కరులు గణిత శాస్త్రములను ఛందో బద్ధమే చేసిరి. వానికి కావ్యగత గౌరవము లేదు. కాని వారి దృష్టిలో 'శాస్త్రము' విశిష్టమైనది. అందుకే వారు 'కావ్యాzలాపాంచ వర్జయేత్' అని అభిశాసనము కూడ చేసిరి. 'సంగీత రసార్ణవము', 'నృత్తరత్నావళి' వంటివి శాస్త్రములే గాని ఛందో బద్ధములైనవి. అప్పకవీయము, కువలయానందము, అను అలంకార గ్రంథములు ఛందోబద్ధములే. ఆంధ్రభాషా భూషణము, సాంబ నిఘంటువు మొదలైన నిఘంటువులు ఛందోమయములే కాని కవిత్వాంశ లేశమైనను కన్పించదు.

కనుక ఛందో మయమైన దన్నంత మాత్రమున కవిత్వముండదని సారాంశము. అట్లే ఛందస్సు లేనిది కూడా కవిత్వమై ఉండవచ్చును.

"పద్యం
ఎక్కువా లేక గద్యం
ఎక్కువా అనే సమస్య అభేద్యం
ఐనా ఘంటా వాద్యం
గా నే నంటా నీ రెండూ నాకే నైవేద్యం"          మూడు యాభయిలు - శ్రీశ్రీ

ఇందులో ఛందస్సు ఉందా అంటే లేదనే చెప్పాలి. ఎక్కువ తక్కువలతో ఉన్న పాదాల చివర అంత్యప్రాసలు తగిలించిన ఆధునిక కవిత్వమిది.

## 2.4 కవిత్వం - అంత్యప్రాస

శ్రీశ్రీ తన 'ప్రాసోపదేశం' లో (మూడు యాభయిలు)

"అసమర్థుడి చేతిలో అసౌనెన్సు
అందించదు సరిగ్గా రిసౌనెన్సు
దానికి కావాలెంతో విజిలెన్సు
అందుకే '<u>ఛందో రహస్యం</u>' తెలిసిన వెటరన్సు
స్ట్రెయిట్ 'రైమ్' కే ఇస్తారు ప్రిఫరెన్సు"

కనుక కవిత్వాన్ని సృష్టించాలంటే 'ఛందోరహస్యం' తెలిసుండాలి. అందునా 'రైమ్' వేయడం మరచిపోకూడదన్నారు. కాని 'Paradise lost' లో జాన్ మిల్టన్ 'రైమ్' లేని 'బ్లాంక్ వర్స్' ఆయన్ను ఆంగ్ల కవితా శిఖరంలో నిలిపింది.

కవులు నిరంకుశులు. ఆ విషయాన్నే Dryden మహాశయుడు తెలుపుతూ 'The Liberty which poets have assumed to themselves, in all ages of speaking things in verse which are beyond the severity of prose' - అని కవి స్వేచ్ఛను ప్రస్తుతిస్తూ 'A poet is held to be free to violate the ordinary norms of speech and of literal truth, including the use of matter and rhyme and the use of fiction and myth' - ఆ స్వేచ్ఛ ఛందస్సులో అంత్యప్రాసల్లోను - సుముఖంగాను, వ్యతిరేకంగాను ఉపయోగించుకొన వచ్చునని విశదీకరించెను.

## 2.5 ఛందస్సు - సంగీతస్పర్శ

గద్య కవితలో కానరాని శ్రుతి లయలు పద్య కవితలో కన్పట్టుటకు ముఖ్యకారణము 'ఛందస్సు'. శ్రుతి, లయలు సంగీతమునందలి అంగములు. శ్రవణ సుభగత్వము లయాన్వితమైనది. తాళగతులు జీవచ్ఛకచ్ఛకితములైనవి. ఈ రెండు గుణములు లలిత కళలలో ప్రాధాన్యతా పారమ్యమునందిన 'సంగీతము'నకే కలదు. అందుకే 'కార్లైల్' 'Poetry is musical thought' అని కవిత్వములోని 'సంగీత' ప్రాముఖ్యత విశదీకరించెను. ఆ సంగీతము 'ఛందస్సు' ను బట్టి ఇనుమడించుట అనుభవైక వేద్యము.

'ఛది' హ్లాదనే 'అనునిరుక్తి' 'ఛందస్సు' యొక్క పరప్రయోజనమును - 'ఆహ్లాదము'నే మూల భూతముగ గ్రహించెను' ఆంగ్లములో 'Scansion' అను పదమిట్టి సమానార్థకత గలిగినదే.

"శ్మశానాల వంటి నిఘంటువుల్ని దాటి,
వ్యాకరణాల సంకెళ్ళు విడిచి,
'ఛందస్సుల' సర్ప పరిష్వంగం వదలి.

తెనుగు కవిత్వాన్ని ఖండించి, దీవించి, ఊగించి, శాసించి రక్షించిన మహాకవి శ్రీశ్రీ - కవి కాలేదా? ఆధునిక కవిత్వ ఒరవడిని ప్రవేశపెట్టలేదా? అంటే ఆయన తొలిరోజుల్లో 'ఛందస్సు' తో కుస్తీలు పట్టినా - తరువాతి రోజుల్లో 'ఆ సర్ప పరిష్వంగం' నుండి బయటపడ్డానని 'మహాప్రస్థానం'లో 'ఓ కవితా' అనే ఖండికలో వ్రాసికొన్నాడు. అందుకే చలం - పీఠికలో (యోగ్యతా పత్రంలో)

"శ్రీశ్రీ ధ్వంసం చేసిన పాత ఛందస్సుల్లోంచి పాతమూలుగులూ, serenadings మూర్ఛతా, వేదాంతాలూ,

మత్తులూ పోయి - దేశాలకి, ఉత్సాహాలకి కదలిపోయే యువ సైన్యానికి, నూతన యుగనిర్మాణాలకి

'Background music' క్రింద, 'Marching band' క్రింద, కొత్త రక్తాన్ని కదను తొక్కించే సంగీతం

వినపడ్డం లేదా? . . . . . . . " అని ప్రశ్నిస్తున్నాడు.

శ్రీశ్రీ రచనలో 'లయబద్ధత' ఉంది. అందులో 'Background music' ఉంది. కదను త్రొక్కించే సంగీతం ఉంది. ఈ లయబద్ధత, ఈ నేపథ్య సంగీతం, ఉత్తేజపరచే సంగీతం ఎక్కడి నుండి వచ్చాయి.

'ఉన్మాది'లో - "వెర్రివాడా! కుర్రవాడా
క్షమిస్తావా? సహిస్తావా"

'స్విన్‌బర్న్ కవికి'లో - "విషం క్రక్కే భుజంగాలో
కదం త్రొక్కే తురంగాలో
మదం పట్టిన మాతంగాలో"

'అద్వైతం'లో - "నీ తలపున రేకులు పూస్తే
నా వలపున బాకులు దూస్తే"

'పేదలు'లో - "అంతేలే పేదల గుండెలు
అశ్రువులే నిండిన కుండలు"

ఇలా 'శ్రీశ్రీ' కవిత్వాన్ని త్రవ్విన కొద్దీ 'ఆవేశం', 'ఆక్రోశం', 'ఉత్సాహం' ఉద్వేలంగా సద్యోజాతంగా సాక్షాత్కరిస్తాయి. తాను 'ధ్వంసం' చేసిన, తాను 'ధ్వంసం' చేశాననుకొంటున్న 'ఛందస్సు' బహిరంగంగ బట్టబయలు కాకపోయినా - అంతరాంతరాల్లో నివురుగప్పిన నిప్పులా, మేఘంలో అణగిన నీరులా, అగ్ని పర్వతంలోని లావాలా గుంభనంగ, గుట్టు చప్పుడు కాకుండ చాపక్రింద నీరులా - ఆయన కవితలో 'కాలిన చోట వాసనలా', 'పూలతోటలో పరిమళంలా' పర్యాప్తమై ఉంది.

## 2.6 మాత్రాచ్ఛందస్సు

'మార్గకవిత'లోని ఛందో నియమాలను, ఆయన కాదనుకొన్నా, దేశికవితలో 'మాత్రా'కమైన కవిత్వము తొంగి చూస్తూనే ఉంటుంది.

ఉదా॥ V I I I I V I I V V
నీ తలపున రేకులు పూస్తే - 14 మాత్రలు

V I I I I V I I V V
నా వలపున బాకులు దూస్తే - 14 మాత్రలు

అంతేగాక - 'పూస్తే', 'దూస్తే' అనే అంత్య ప్రాసలు ఆ కవిత్వానికి 'జడ' చివటి చిరుగంటల్లాగ ఉల్లాస హేతువులౌతాయి. ఆంగ్లంలోని 'complets' లాగ, హృదయానికి హత్తుకు పోతాయి.

ఉదా॥ V V V V I I V I I
అంతేలే పేదల గుండెలు - 14 మాత్రలు

V I I V V I I V I I
అశ్రువులే నిండిన కుండలు - 14 మాత్రలు

ఇక్కడ 'అంత్యప్రాస'తో పాటు రెండు పాదాలలో తొలి 'అ'కారము శ్రవణ సుభగత్వానిస్తుంది. మొదటి పదంలోని 'ఆరు మాత్రల' పదాల ద్వారా ఆ కవిత్వ లోని 'తూగు' ఏ మాత్రం చెడలేదు.

## 2.7 జన వ్యవహారం - ఛందస్సు

మరొక్క విషయం గుర్తు పెట్టుకోవచ్చు. మన భాష అజంత భాష - ఇటలీ భాష వలె. అందుకే కర్ణాట సంగీతంలో ఉపాదేయమైంది. మనం 'ఛందస్సు' వద్దనుకొన్నా అది మనల్ని వదలి పెట్టదను విషయం గుర్తుంచుకోవాలి.

- మన పొడుపు కథల్లో -

గోడ మీద బొమ్మ
గొలుసుల బొమ్మ
వచ్చే పోయే వారికి
వడ్డించే బొమ్మ

- మన సామెతల్లో -

చదవక ముందు కాకరగాయ
చదివిన తర్వాత కీకరగాయ

వీడు పొమ్మంటుంది
కాడు రమ్మంటుంది

ఇట్టివి జన జీవితంలోనే ఛందోమయంగా కన్పిస్తాయి. 'ఛందస్సు' అనేది భాషకు సహజము. కవిత్వమునకు ఛందస్సునకు అవినాభావ సంబంధము కలదనుట లోకమర్యాద.

## 2.8 కవిత్వం - ఛందస్సు

రసమయమైన కావ్యముతో లయాన్వితమైన ఛందమును గూడ జతసేసినచో బంగారమునకుఁ బరిమళ మబ్బినట్లుండును" - అని దివాకర్ల వేంకటావధాని గారి ఉవాచ.

పద్య కవిత్వంలో 'ఛందస్సు' తో పాటు వచ్చు శ్రుతి, లయలు గద్య కవితలో కానరావా? కళ పరమార్థము మనసుకు ఆనందము కలిగించుటే. ఆ కళలలో ప్రత్యేకించబడిన లలితకళలు కలవు. వాటిలో 'సంగీతకళ' శ్రవణా భోగమైనది. సంగీతము శ్రావ్యమైనది. ఈ శ్రుతి, ఈ లయ 'ఛందస్సు' లోని బింబ ప్రతిబింబముల బోలు పదబంధములు, శబ్దాలంకారములు - మాటిమాటికి పునరావృతమై ప్రతిపాద, ప్రతిపాదిత నియమ బద్ధతలను కొలరాళ్ళవలె కళలలను లయబద్ధంగా, శ్రుతి నిబద్ధంగా చెవికి చేరవేస్తాయి. ప్రబంధములందలి గద్య భాగములు శబ్దాలంకారములకు నిధులు. పదాడంబరమున్నను అన్వయ క్లిష్టతచే భావ శూన్యత ద్యోతకమౌతుంది. అందుకే ఛందస్సు సాధించినంత అందము, ఛందః శూన్యములైన కావ్యములలో కానరాదు.

'మిల్టన్' మహాశయుడు ప్రముఖాంగ్ల కవిగా గుర్తింపు నొందినది. తాను 'పెంటామీటర్'గా రూపొందించిన 'బ్లాంక్‌వర్స్' తోనే 'మహాకవి'గా గుర్తించబడ్డాడు. కాని ఆయనే లాటిన్ భాషలో వ్రాసిన 'ఏరియో పెజంటికా' అను గద్య సాహిత్యము వలన కాదు. కార్లైలు, మాత్యూ ఆర్నాల్డు వంటి విమర్శకులు ఛందోరాహిత్యాన్ని సహించలేదు. ఛందస్సు లేనిదే అందమే లేదన్నారు కూడా.

కవిత్వము పక్వస్థితికి వచ్చి ప్రతిభా పురస్సరముగా నిలువ వలెనన్నచే ఛందస్సు పరమావశ్యకమని 'లే హంట్' (Leih Hunt) సాధికారముగా నిర్ణయించాడు. ఛందస్సు అనావశ్యకమను వాదము నిర్జీవమైన వాదమని కొట్టిపడవేసెను.

ఛందస్సులో ఓజస్సు ఉన్నది. ఛందస్సులో ఆవేశమున్నది. ఆవేగమున్నది. అభినివేశమున్నది. ఛందస్సులో సౌందర్యమున్నది. సానంద మాధుర్యమున్నది. కవితా సమగ్రతకు - శక్తిమంతములైన 'ఛందోలయ'లే కొంతవరకు కారణములని తేల్చి చెప్పిన విమర్శకాగ్రేసరుడు 'మాత్యూ ఆర్నాల్డ్'.

"The rhythm and measure of poetry elevated to a regularity, certainity and force . . . . . . "

## 2.9 ఛందస్సు - ప్రయోజనాలు

'ఛందస్సు' వలన కలుగు ప్రయోజనములు.

1. ఛందస్సు వలన 'లయ'కు ఉత్కర్ష కలుగును.
2. ఈ 'లయోత్కర్ష' వలన కావ్యము నందు 'రసానందము' పరిమళించును.
3. ఈ ఛందస్సు 'కవిత్వ సమగ్రత'లో ఒక భాగము.
4. 'కవిత్వ పరిపక్వత'కు ఛందస్సు ఆవశ్యకము.
5. 'కవితావేశము'ను వ్యక్తీకరించుటకు ఉత్తమ మార్గము (రగడలో, దండకములో)
6. 'జాన్ స్టూవర్ట్‌మిల్' ప్రకారము ఆది మానవుని నుండి నేటి వరకు సాగిన భావ ప్రకటన అంతా 'లయా'న్వితమే. అది ఛందస్సుకు ప్రాణము.
7. భావి నివేదనమును, ఔచిత్యము ప్రధానములు.
8. 'మధురతా నిమిత్తం యతిరిష్యతే' - 'కవికల్పలత'లో 'యతి' యొక్క ప్రశంస 'ఛందస్సు' గొప్పతనాన్ని చెబుతుంది.

## 2.10 ఛందస్సు - భావానుకూలత

సున్నితమైన భావ ప్రకటనకు 'ఉత్పల, చంపకమాలలు' కోమల పుష్ప సదృశమై ఔచిత్య స్ఫోరకములైనవి. అట్లే కఠినమైన, క్రూరమైన, పటుతర గంభీరమైన భావ వ్యక్తీకరణకు మత్తేభ, శార్దూల విక్రీడితములు అనువైనవి. గుఱ్ఱముల కదన కౌతులమును 'అశ్వగతి' రగడతోను, వ్రేపల్లె వాడలలోని గోకదంబముల కదలికల వర్ణనలకు 'ఋషభగతి' రగడలు ఔచిత్య శోభితములగుట అనుభవైకవేదము.

## 2.11 మహాకవుల ఛందః ప్రీతి - ప్రక్రియలు

'సీసము'లకు శ్రీనాథుడు, 'కందము'లకు తిక్కనామాత్యుడు, 'అనుప్రాసల రక్తిలో ముక్తి' రసాయనాన్ని అందించిన పోతన - వారి వారి కవిత్వపు మూసలలో నిబద్ధింపబడినారు. ఆ 'సీసా'లలో మరింత మాధుర్యాన్ని నింపి క్రొత్త పుంతలు తొక్కించిన 'జాషువా' - నవయుగ కవిచక్రవర్తి గానే కాదు 'మధుర శ్రీనాథు'నిగ ప్రసిద్ధులైనారు. వేమన చేతిలో 'ఆటవెలది' ఛందము, అచ్చపు 'ఆటవెలది'యై ఎన్ని వేషములు వేసినదో, ఎన్ని దోషములు చూపినదో, ఎన్ని వేదాంతములు నేర్పినదో, ఎన్ని రాద్ధాంతములు నడిపినదో తెలియనిదెవ్వరికి? 'శతకములు' వ్రాసిన వారిలో ఒకటి, లేదా రెండు ఛందములే తీసికొని కవిత్వపు ముదురుపాకంలో ఎంత కమ్మదనాన్ని వడ్డించారో తిన్నవారికి తెలియకపోదు.

'సమస్యా పూరణము' - అవధాన ప్రక్రియలో ఒక సరస వినోదము. అది కూడ 'ఛందో' సంబంధి యగుట ఛందస్సుకున్న ప్రాధాన్యత వెల్లడియగుచున్నది.

'ఛందో బందో బస్తుల్ని' త్రెంచివేసిన శ్రీశ్రీ అధివాస్తవిత కవిత్వాన్ని త్రవ్వి - 'సర్రియలిజమ్' కు ఉదాహరణగా చెప్పిన పాదాలు చూద్దాం.

జీబ్రాకి Algebra చిహ్నాల
లాంకోటూ పాంకోళ్లూ తొడిగి
సాహిత్య పౌరోహిత్యం యిస్తే
వెర్రికాదు Sur-realism రా సోదరా!

ఇందులో 'అర్థాన్ని అర్థ్వానపు అడవి'లో వదలడం జరిగింది. 'జీబ్రా' - 'ఆల్జీబ్రా', 'లాంకో' - 'పాంకో' వంటి ధ్వనిగత శాబ్దిక ఆవేగం తప్ప మరొకటి కన్పించదు.

## 2.12 ఛందస్సు - ధారణ

ఛందస్సు ధారణాశక్తికి త్రాణ వంటిది. ఛందస్సు ఉన్న కవిత్వమును తృటిలో కంఠోపాఠంగా చెప్పగలిగిన వాడు ఛందో రాహిత్యమున్న సాహిత్యాన్ని వెంటనే ఒంటపట్టించుకోలేడు.

కొన్ని ప్రాచీన ప్రతులు భ్రష్టములై, క్రిమిదష్టములైనపుడు వాని పరిష్కరణమునకు 'ఛందస్సు' అమూల్యమైన వనరు.

వేదములు - 'శృతుల'ని చెప్పబడుటకు అందలి లయబద్ధమైన 'నడక' కారణము. ఆ 'నడక' ఛందస్సే అని తెలిసినపుడు - ఆ వేదములనే 'ఛందస్సు' అని అభేదంగా చెప్పుట కద్దు.

'ముఖే ముఖే సరస్వతీ' అన్న వాక్కు ఛందస్సు వలననే యుగముల పర్యంతము పర్యాప్తమైనది.

## 2.13 అనువాదం - ఛందస్సు

'అనువాదము అసిధారా వ్రతమ'ని తెలిసిన వారు పద్యాత్మకమైన మూలములను గద్యాత్మకముగ అనువదించినచో మూల విధేయమైన సౌందర్యము అనువాదమునకు అందనంత దూరముగా ఉండునని తెలిసికొందురు.

ఛందస్సుగల మూలము నిజమైన ముత్యము. ఛందస్సులేని మూలము గడ్డిపోచ మీది ముత్యము వలె కన్పించి తాకినంతనే నీరుగా మారు - ముత్యపు ఆభాసమని తెలియునని James Montegomery మహాశయుడు చెప్పిన అలంకారము యథాక్షర సత్యము.

## 2.14 సమీక్ష

కవిత్వమునకు ఛందస్సు ఆవశ్యకము. అది పైపై అలంకరణ వలె కన్పించినను, కవిత్వము నందలి సంగీతపు పొంగులకు 'లయ'ను కూర్చే సమధికమైన శక్తి.

కవిత్వము పట్ల పాఠకుల ఆసక్తిని రేకెత్తింటి ఆకర్షించుకో గల 'సూదంటురాయి' ఛందస్సు. పైకి 'రాయి'లా కన్పించినా హృదయాకర్షకమైన 'అయస్కాంత' తత్వము ఇచ్చునది కవిత్వమునకు - ఛందస్సు.

ఛందసున్న పద్యమును విని ఆహ్లాదించు మనస్సు - ఆ పద్యమునకే చేర్చిన ఖండాన్వయ, దండాన్వయముల ద్వారా పొందలేము. ఇది సత్యము. ఆ ఘనత 'ఛందస్సు'దే.

అన్ని భాషలలోను కవిత్వమునందు 'ఛందస్సు' అంతర్నిహితముగా జాలువారి అనంత శోభలను, ఆనందపు విందులను పంచియిచ్చును.

కనుక ఛందస్సు ఆవశ్యకము.

## 2.15 ప్రశ్నలు

1. కవిత్వములో ఛందస్సునకు గల స్థానమును వివరింపుము.
2. 'ఛందస్సు' లేని కవితలోని గుణాగుణములను క్రోడీకరించుము.
3. ఆధునిక కవిత్వములో 'ఛందస్సు' లేమిని విమర్శింపుము.

## 2.16 ఉపయుక్త గ్రంథాలు


| | | |
|---|---|---|
| 1. | సాహిత్య శిల్ప సమీక్ష | ఆచార్య పింగళి లక్ష్మీకాంతం |
| 2. | సాహిత్య దర్శనము | ఆచార్య కాకర్ల వేంకట నరసింహం |
| 3. | సాహిత్య సోపానములు | డాక్టర్ దివాకర్ల వేంకటావధాని |
| 4. | కావ్యాలంకార సంగ్రహము | శిరోమణి సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి |
| 5. | తెలుగు సాహిత్య సమీక్ష-2 | డాక్టర్ జి. నాగయ్య |
| 6. | తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు | ప్రొ. వెలమల సిమ్మన్న |
| 7. | సమగ్ర ఆంధ్ర సాహిత్యం-2 | ఆరుద్ర |



**పోలె ముత్యము**
ఎం.ఏ. ఎం.ఏ. యం.ఫిల్.
ఆంధ్రోపన్యాసకులు
ఆంధ్ర క్రైస్తవ కళాశాల
గుంటూరు

# పాఠం - 3.1

# కవిత్వము - సత్యము

పాఠ్యనిర్మాణక్రమం

3.1.0 లక్ష్యం
3.1.1 కావ్య నిర్వచనాలు - సత్యం
3.1.2 శాస్త్రం - సత్యం
3.1.3 ప్రకృతి సత్యం - కావ్య సత్యం
3.1.4 సమీక్ష
3.1.5 ప్రశ్నలు
3.1.6 ఉపయుక్త గ్రంథాలు

## 3.1.0 లక్ష్యం

ప్రసిద్ధ కావ్య నిర్వచనాల్లో సత్య ప్రసక్తి లేదు. ఇది ఆశ్చర్యకరం. సత్యాన్ని శాస్త్ర సత్యంగా, ఆధ్యాత్మిక సత్యంగా, ప్రకృతి సత్యంగా వింగడించవచ్చు. శాస్త్ర సత్యానికి కవులు మరో కోణంలో మనోజ్ఞతను కల్పించారు. మహాకవులు తమ కావ్య సత్య చిత్రణం ద్వారా విశ్వశ్రేయస్సుకు పాటుపడ్డారు. ఈ విశేషాలను వివరించడమే ఈ పాఠ్య లక్ష్యం.

## 3.1.1 కావ్య నిర్వచనాలు - సత్యం

"ఇతివృత్తంతు కావ్యస్య శరీరం పరికీర్తితమ్" - నాట్య శాస్త్రం (భరతుడు)

కావ్యము యొక్క శరీరము ఇతివృత్తము. ఆ ఇతివృత్తానికి 'రసము' సౌందర్య హేతువు. అందువలననే 'రసప్రాధాన్యము' చర్చించబడినది. 'భామహుడు' శబ్దార్థాలతో కూడిన దానినే కావ్యమనగా, 'విశ్వనాథుడు' వాక్యం రసాత్మకం 'కావ్యమ్' అని కొనసాగించాడు. 'జగన్నాథ' పండితరాయలు ఒక అడుగు ముందుకు వేసి 'రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యమ్' అని నిర్వచించారు.

ఇన్ని నిర్వచనాల్లో ఎక్కడా 'సత్య' ప్రసక్తి లేకపోవటం కించిత్తు ఆశ్చర్యాన్నే కలిగిస్తుంది. సత్యము యథార్థ దృశ్యము. 'కవిత్వము' ఆ దృశ్యానికి అక్షరానుకరణము. ఒకటి బింబము. మరొకటి ప్రతిబింబము. బింబము (సత్యము) లేనిదే ప్రతిబింబము (అనుకరణము) సాగదు.

"నాస్తి 'సత్య' సమోధర్మః" అన్నప్పుడు సత్యము ఉన్నత స్థానమున ప్రతిష్ఠితమైనది. అసలు సత్యమంటే ఏమిటి? 'సత్సు సాధుషు భవం సత్యం', అని 'సతి సత్పురుషే సాధు సత్యం' అని లింగాభట్టీయ వివరణము. 'సాధువులందు పుట్టునది సత్యమ'నియు, సత్పురుషులలో ఉండే పదార్థము సత్యమ'ని దాని భావము. ఎదురుగా కన్పించునది సత్యమే. స్పర్శకు అందునది సత్యమే. ఘ్రాణకు లోనగునది సత్యమే. 'రసన'కు రుచి తెల్పునది సత్యమే. జ్ఞానేంద్రియముల ద్వారా అనుభూతములయ్యెడి వన్నియు సత్యములే.

### 3.1.2 శాస్త్రం - సత్యం

మరియొక విధమైన సత్యము శాస్త్ర సత్యము. కార్య కారణ సంబంధమును తెలుపునది. హేతు వాదముచే సముద్ధరింప బడునది. సృష్టి రహస్యములను పరిశోధించి వెల్లడి చేయునది శాస్త్రము చెప్పు సత్యము. ఈ శాస్త్రము వైజ్ఞానికులచే ఆవిష్కృత మైనచో దానిని 'ఆది భౌతిక సత్యము'న వచ్చును. అదే తాత్త్వికులచే వెల్లడించబడినచో 'ఆధ్యాత్మిక సత్యము'నవచ్చును.

శాస్త్రజ్ఞుడు తాను చేయు ప్రయోగములలో ఏక సూత్రిక తను కనుగొన్నచో అది శాస్త్ర సత్యము. ఉదాహరణకు 'కణ' నిర్మాణము సార్వత్రిక సత్యము. శాస్త్ర సమ్మతమైనది. 'యాపిల్ పండు' చెట్టు నుండి క్రిందికి పడుటకు 'గురుత్వాకర్షక శక్తి' ప్రధాన కారణము. ఇది అన్నింట వర్తిస్తుందనుట సార్వత్రిక సత్యము.

"Poetry is metrical composition, it is the art of uniting with truth by calling forth imagination to the help of reason" - Johnson

("కవిత్వమునకు ఆనందముతో పాటు సత్యమును చేర్చు వ్యాపారము గలదు").

సమస్త శాస్త్రముల లక్ష్యము సత్యావిష్కరణమే కాని శాస్త్రములు బట్టబయలు చేయు సత్యము వేరు. 'కావ్యము'లలో నివురు గప్పిన నిప్పు వలె నిక్షిప్తమైన సత్య స్వరూపము వేరు.

అట్లే ప్రయోగమునకు లభ్యము కాని 'పరతత్త్వము' ఒకటున్నది. దాని ఆవిష్కరణమునే 'భగవత్తత్త్వ'మని అదియే 'ఆధ్యాత్మిక సత్యమ'ని భావించనగును.

శాస్త్రము పరిమితి కలది. కవిత్వము ఆధ్యాత్మికతతో పాటు 'ప్రకృతి'ని ఆరాధించును. తన కవితావేశమునందు ప్రాకృత - అప్రాకృత వస్తువులను ఒక త్రాటి క్రిందకు తెచ్చి ఒకే 'తత్త్వము' దర్శింప సమర్థుడు. ఆ తత్త్వమునకు శబ్దరూపము సృష్టించి లోకైక హితమును, ఆనందాభినివేశమును అందించగలడు.

వేదములు ప్రభు సమ్మితములని, ఇతిహాసములు, పురాణములు మిత్ర సమ్మితములని, కావ్యములు కాంతా సమ్మితములని పండితులు చెప్పుదురు. ఉన్నదున్నట్లు చెప్పటం వేదలక్షణం. ఉన్నదాన్ని అన్యాపదేశంగా సూచించటం కావ్యలక్షణము - అదే కాంతా లక్షణం. అనగా 'కాంత' అన్యాపదేశంగా ఎలా దిశా నిర్దేశం చేస్తుందో - అలానే కావ్యం కూడ 'సత్యాన్ని' లేదా 'వాస్తవాన్ని' పరోక్షంగా వల్లిస్తుంది.

"It is strange but true; for truth is always strange, - stranger than fiction." - Byron

సత్యము ఉపాదేయమైనదే. 'సత్యమనేది ఎప్పుడూ ఆశ్చర్యాన్ని కల్గించేదే. కల్పన కన్నా ఆశ్చర్యం కల్గిస్తుంది' అన్న బైరన్ వాక్యము అనుభవమును బట్టి నిజమని తెలిసికొంటాము. కవిత్వము నందలి 'సత్యము' తొలుత అతి సామాన్యంగా కన్పించినా రాను రాను అందలి మధురానుభూతి, ఆశ్చర్యాన్ని పంచుతుంది. ఆనందాన్ని పెంచుతుంది. అందుచేతనే సత్య స్వరూపము ఎన్నటికీ మారదు. సత్యము సత్యముగనే నిలచి ఉంటుందని షేక్స్పియర్ అంటున్నాడు.

'Truth is truth,
To the end of reckoning'

మరి 'జాన్సన్' మహాశయుడు ప్రతిపాదించిన 'కవిత్వ సత్య స్వరూప' మెట్టిది?

శాస్త్రము ద్వారా ఉద్దిష్టమైన సత్యము మానవ సౌఖ్య ప్రసవముగా మారును. కాని తాత్త్వికుడైన వాడు ఆవిష్కరించు 'సత్యము' శాశ్వతమైన సౌఖ్యము నుద్దేశించును. కవి 'ఋషి'గా మారినపుడు ఈ 'సత్యమే' శాశ్వత సౌఖ్య ప్రద నివాసమునకు దారి ఏర్పరచును. అందుకే కవిని 'క్రాంతదర్శి' అని పిలుతురు.

'నానృషిః కురుతే కావ్యం' అనుటలో కవిలోని 'ఋషిత్వము' సత్యావిష్కరణాభిలాష వ్యక్తమగుచుండును.

'Ye shall know the truth,
The truth shall set you free'

అన్న 'బైబిల్' వాక్యము - 'సత్యము తెలిసికో అది నిన్ను స్వతంత్రుణ్ణి చేస్తుంది' - ఈ సత్యాన్నే చెబుతుంది. అందుకే ఉపదేశము - సందేశము - సత్యా ధారితమై అన్యాపదేశముగ బోధింపబడుతుంది.

### 3.1.3 ప్రకృతి సత్యం - కావ్య సత్యం

ప్రకృతిలో అంతకు ముందు ఉన్నప్పటికీ 'కవి' స్పర్శతో వానిలో క్రొత్తదనము జిగేల్ మంటుంది. దీనినే -

శ్లో॥ దృష్ట పూర్వా అపి హ్యర్థాః
కావ్యే రస పరిగ్రహాత్
సర్వే నవా ఇవా భాన్తి
మధు మాస ఇవద్రుమాః

వసంత కాలములో మోడువారిన చెట్లు చిగిర్చినట్లు కావ్యగతమైన రసమును గ్రహించిన 'సత్యము' - పరిపూర్ణంగా క్రొత్త రుచులు సంతరించుకొంటుంది.

అందుకే 'శాస్త్రము' చెప్పు సత్యము పూర్తియైన తర్వాతే కవిత్వము చెప్పు సత్యము ప్రారంభమగునని Leigh Hunt వివరించెను.

'సూర్యోదయము' - ప్రకృతిలో చాలా సహజమైనది. 'భూభ్రమణము' వలన 'సూర్యోదయము' జరుగుచున్నది. ఇది శాస్త్రజ్ఞుని వివరణము. కాని ఈ సూర్యోదయమును దర్శించిన వేదఋషి -

"ఆసత్యే కరజసా వర్తమానో
నివేశ యన్న మృతం మర్త్యం చ
హిరణ్మయేన సవితారథేనా
దేవో యాతి భువనాని పశ్యన్" 11

సూర్యుడు బంగారపు రథాన్నెక్కి లోకములను పరామర్శించుటకు వస్తున్నాడని చెప్పుటలో 'సత్యము' - ఉన్న సత్యమే సరిక్రొత్తగా భాసించింది.

సముద్రమందలి నీరు ఉష్ణ సంవహన క్రియచే వర్షముగా మారుట శాస్త్రీయ వివరణము. ఇది సత్యము. ఇది ప్రాకృతిక సత్యము. కాని కవి చెప్పేదీ సత్యమే. కాని అతని ఊహా శాలీనత, ఆలంకారిక దృష్టి ఆ సత్యమును - ఆశ్చర్య మగ్న మానసగా చిత్రించును. మేఘుడు సముద్రపై వ్రాలినట్లు, అందలి ఉప్పు నీటినే త్రాగినట్లు, అయితే లోకోపకారకుడగు ఆ మేఘుడు 'ఉప్పు'ను తానే జీర్ణించుకొని కేవలం 'మంచినీటి'ని మాత్రమే లోకమునకొసగి లోకోపకారి యగుట 'కవి' వివరణము.

శాస్త్రజ్ఞునికి పుష్పవృంతము, ఆకర్షక పత్రములు, రక్షక పత్రములు, అండము, అండాశయము, కీలము, కీలాగ్రము వలె ఏ భాగమునకు ఆ భాగములు విడివడి కన్పించును. కాని కవి హృదయానికి ఆ పుష్పము - అందలి సంపూర్ణ సౌందర్యము అందలి సౌకుమార్యము, అందలి మార్దవము, అందలి మాధ్వీకము, కన్నులు జిగేలు మనే భగవంతుడు అద్దిన రంగుల పొంగులు మాత్రమే కన్పించును. పై రెండూ సత్యములే. ఒకటి ప్రాకృతిక సత్యము, మరొకటి కవిత్వ మాకర్షించి ఆవిష్కరించిన సత్యము. ఒకటి శాస్త్ర దృష్టి. మరొకటి కవిత్వ దృష్టి.

కవిత్వము భౌతిక తత్త్వమున కంటె ఆధ్యాత్మిక తత్త్వమునకే దగ్గఱగా ఉండును. ప్రకృతిలోని రామణీయకతకు పరవశించే కవులు దానిలోనే భగవత్స్వరూపాన్ని, ఆయన విరాడ్రూపాన్ని దర్శించగలరు. అందుచేతనే వారు 'ద్వైతం'గా కన్పించే ప్రకృతిని 'అద్వైతంగా' ఆవిష్కరించగలరు. పారిమార్థిక లక్ష్యంగా ప్రచారం చెయ్యగలరు. తద్వారా వారు దార్శనికులై సత్యాన్వేషకులౌతారు. ఇందులోనే ధార్మికత నన లెత్తి 'ధర్మధ్వని' స్ఫురణతో ఋషితుల్యులౌతారు. సత్యావిష్కర్తలౌతారు. సమాజాన్ని సత్పథంలో సంచరింపజేస్తారు.

### 3.1.4 సమీక్ష

కవిత్వములో సత్యము ఉండవలెనన్నది భారతీయ తత్త్వము.

'సత్యం బ్రూయాత్'

రామణీయకతతో పాటు సత్యము జతకట్టవలెనను మధ్యే మార్గము మరి కొందరిది. ఆధునికులు మాత్రము లౌకిక వాదమును ఆహ్వానించిరి. సత్యము మానవ సమాజపు విలువలను పెంచునదే కనుక రసనిర్భరమైన రామణీయకతతో మేళగించుట మేలని సారాంశము.

### 3.1.5 ప్రశ్నలు

1. కవిత్వమునందు సత్యము ఉండవలెనా? చర్చించునది.
2. సత్యము మానవ సమాజానికి ఏ మేరకు ఉపయోగపడుచున్నది? కావ్యగతమైన సత్యము యొక్క ప్రయోజనమేమి?

### 3.1.6 ఉపయుక్త గ్రంథాలు

1. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
2. కావ్యలంకార సంగ్రహము - శిరోమణి సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రి
3. సాహిత్య దర్శనము - కె.వి.ఆర్. నరసింహం
4. తెలుగు సాహిత్య విమర్శ - డాక్టర్ వెలమల సిమ్మన్న
5. తెలుగు సాహిత్య చరిత్ర-2 - డాక్టర్ జి. నాగయ్య

**పోలె ముత్యము**
ఎం.ఏ. ఎం.ఏ. యం.ఫిల్.
ఆంధ్రోపన్యాసకులు
ఆంధ్ర క్రైస్తవ కళాశాల
గుంటూరు

# పాఠం - 3.2

# కావ్యము - నీతిబోధ

పాఠ్యనిర్మాణక్రమం


3.2.0 లక్ష్యం
3.2.1 సత్యం - నీతి
3.2.2 నీతి - ఆనందం
3.2.3 నీతి - దేశకాలాలు
3.2.4 నీతి - కళ
3.2.5 నీతి - మతధార్మికత
3.2.6 సమీక్ష
3.2.7 ప్రశ్నలు
3.2.8 ఉపయుక్త గ్రంథాలు


## 3.2.0 లక్ష్యం

నీతి మానవ సమాజాన్ని నడిపించేది. కావ్యంలో ఇది ఆనందంతో కలిసి ఉంటుంది. నీతి దేశ కాలాలను బట్టి మారుతుంటుంది. నీతి ప్రబోధం కోసం అవసరమైతే మత ధార్మికతను స్వీకరించవచ్చు. కావ్య ప్రధాన ప్రయోజనం ఆనందం. నీత్యుపదేశం ఆనుషంగికం. ఈ వివరాలన్నిటినీ ప్రాచ్య పాశ్చాత్య దృక్పథంతో అధ్యయనం చేయడం ఈ పాఠ్య లక్ష్యం.

## 3.2.1 సత్యము - నీతి

కవిత్వము సత్యాధారితమై ఆవిష్కరించే ఆనందము ఉపాదేయము. ఎప్పుడైతే 'సత్య'ము ఆధారమౌతుందో అందులో నుండి 'నీతి' తొంగిచూస్తుంది. 'నీతి' అనే మాటకు నడిపించేదని అర్థము. జాతిని, మానవ జాతిని ఒక పద్ధతి ప్రకారము, ఏర్పరచుకొన్న కట్టుబాట్లను దాటకుండా నడిపించేదే నీతి. 'సత్యము'ను ప్రదర్శించుటలోనే 'నైతిక' దర్శనము సాధ్యమైనది. 'ప్లేటో', 'హోరేస్' వంటి తాత్త్వికులు 'నైతిక'ను సాహిత్యములో జొప్పించుటకే మొగ్గు చూపారు.

'సర్ ఫిలిప్ సిడ్నీ', 'జాన్ రస్కిన్' లు తమ సాహిత్యాలలో ప్రతి పదంలో ఈ 'నైతిక' ప్రబోధమును ప్రదర్శించారు.

మాథ్యూ ఆర్నాల్డ్, డాక్టర్ జాన్సన్‌లు కవిత్వములో 'నీతి'ని సమర్థించిరి. ఎందుకనగా 'నీతి' అనునది మానవ సముద్ధరణకు ఉపకారకమైనది. భగవంతుని సన్నిధానమునకు చేర్చునది.

"All sects are different because they come from men; Morality is every where the same, because it comes from God." - Voltaine

### 3.2.2 నీతి - ఆనందం

'నీతి' కావ్యములలో ఆనందముతో సాహచర్యము చేస్తూ ఉపదేశిస్తూ ఉంటుంది. ఉపదేశము జీవునకు, భగవంతునికి సంబంధించినపుడు దానిని 'తత్త్వశాస్త్ర' పరమార్ధముగా చెప్పవచ్చును. ఆత్మ, పరమాత్మల కలయికకు ఉపకరించునది ఉపదేశము. ఇది కావ్యములందు ఆనుషంగికమే.

ఈ ఉపదేశము 'విశ్వశ్రేయము'ను కాక్షించినచో లోకకాళ్యాణ కారకములగును. ఇది ధర్మోపదేశము.

సంఘమును, సంఘ వ్యవస్థ సంఘటితమగుటకు ఉపయోగపడు ఉపదేశము - మార్గదర్శకమై ఉండవలెను. ఇందు నీతి ప్రధానముగా నుండును. ఈ 'నీతి' ధర్మాధారితమైనది. ఆ ధర్మము సార్వకాలికము. సార్వలౌకికము. దేశ కాల మత సంఘములకు లోబడి ప్రవర్తించుట 'నీతి'కి మౌలిక లక్షణము.

### 3.2.3 నీతి - దేశ కాలాలు

కాని కాలాంతరమున ఒకనాటి 'నీతి' - మరొక కాలమునకు 'నీతి' కాకపోవచ్చును. ఒక దేశమునకు నీతియైనది మరియొక దేశమునకు నీతి కాకపోవచ్చును. ఒక మతమునకు సమ్మతమైన 'నీతి' మరొక మతమునకు 'నీతి' కాకపోవచ్చును. క్రమానుగత ఆచారములకు, వ్రతములకు నైతిక విలువలు వైయక్తికంగా, సాంఘికముగా భేదములు పొడమవచ్చును.

### 3.2.4 నీతి - కళ

కావ్యము 'శిల్ప' దృష్టితో మలచబడేది కనుక లోకమర్యాదలకు అనుగుణముగా నున్న 'నీతి'ని పరోక్షముగా, అన్యాపదేశముగా, వ్యంగముగా నీతిని బోధించేది కావ్యము. చిత్రకారుడైనా, శిల్పియైనా, కవియైనా తన కళను ప్రదర్శించుటలో కృతకృత్యుడైనచో లోకమునకు 'నీతి'ని ప్రదర్శించినట్లే యగును. అందుకే టాల్‌స్టాయ్ మహాశయుడు

"Artistic beauty is not different from moral beauty"

ఆ రెండూ అవినాభావ సంబంధము కలవి. కళా సౌందర్యము నైతిక సౌందర్యము కన్న భిన్నము కాదు. ఒకవేళ తన కావ్యములో ఎవరైనా నైతిక భావములను ఉల్లంఘించినచో, లేక ఉపేక్షించినచో అది మానవ జీవితమునే ఉపేక్షించినట్లని కొందఱి విమర్శకుల అభిప్రాయము. ఎందుకనగా కవిత్వము మానవ జీవితము నాశ్రయించి పుట్టిన కళ.

"Literature is a criticism of life"

అను 'మాత్యూ ఆర్నాల్డ్' మేలిమి వాక్యము ఇక్కడ స్మరణీయమైనది. కావ్య పఠనానంతరము 'ఏమి చెప్పెను?' అనుదానికే ప్రాధాన్యమిచ్చువారు 'ఎట్లు చెప్పెనను దానికి అంత ప్రాధాన్యము నీయరు. వీరిని 'Neo-Humanists' గ పిలుతురు.

### 3.2.5 నీతి - మతధార్మికత

నీతి బోధకత కొన్ని ధర్మములకు లోబడి యున్నది. ఆ ధర్మములు మానవీయ ధర్మములేయైనను మత ధార్మికతను కూడ ముడిబెట్టుకొని వచ్చునని మరికొందఱి విమర్శకుల అభిప్రాయము.

'పాల్ ఎల్‌మార్ మోర్' - అను ఈ నైతిక విమర్శాచార్యుడు మతమును తెచ్చి ధార్మికతను నైతికతను తన విమర్శనా

చాతుర్యముతో పలుకరించాడు.

'బాబిట్' అను మరియొక విమర్శకాగ్రేసరుడు మతము లేకపోయినను 'నీతికి' ప్రథము స్థానము నిచ్చెను. వీరిరువురును ప్రాకృతిక వాదమును, 'రొమాంటిసిజమ్' ను నిరసించిరి.

టి.యస్. ఇలియట్ - మతమును 'నీతి' కొఱకై సాహిత్యములో ప్రవేశపెట్టవలెనని అభిప్రాయపడి'Christian Humanist' గ ముద్రవేయించుకొన్నాడు. ఆధునిక కవిత్వమంతా లౌకిక వాదంలో కలుషితమైందని ఆయన తలంచెను.

## 3.2.6 సమీక్ష

పంచమ వేదమని పేరుబడ్డ భారతేతి హాసము ఒక్కొక్కరికి ఒక్కో విధంగా ప్రతిభాసించడం దానిలోని సార్వజనీనమైన పదార్థమే. అందుకే అది 'ఇతిహాసమ'య్యు - 'కవివృషభు'లచే మహాకావ్యంగా కీర్తింపబడింది. ధర్మము తెలిసిన వారిచే 'ధర్మశాస్త్రం' గా ప్రతిభాసించింది. 'నీతి విచక్షణుల్ నీతి శాస్త్ర' మని వినీతులైనారు.

రమణీయతకు భంగము కలుగని తీరున కావ్యమున ఉపదేశ ముండవచ్చునని 'హడ్సన్' వాక్రుచ్చెను. ఈ తీరునే కాంతా సమ్మితమ్మనవచ్చును.

## 3.2.7 ప్రశ్నలు

1. ప్రాచ్య పాశ్చాత్యుల దృష్టిలో కావ్యములో నీతికి గల స్థానమును నిరూపించునది.

## 3.2.8 ఉపయుక్త గ్రంథాలు


1. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
2. కావ్యలంకార సంగ్రహము - శిరోమణి సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రి
3. సాహిత్య దర్శనము - కె.వి.ఆర్. నరసింహం
4. తెలుగు సాహిత్య విమర్శ - డాక్టర్ వెలమల సిమ్మన్న
5. తెలుగు సాహిత్య చరిత్ర-2 - డాక్టర్ జి. నాగయ్య



**పోలె ముత్యము**

ఎం.ఏ. ఎం.ఏ. యం.ఫిల్.

ఆంధ్రోపన్యాసకులు

ఆంధ్ర క్రైస్తవ కళాశాల

గుంటూరు

# పాఠం - 4

# విమర్శ - విమర్శకుడు

పాఠ్యనిర్మాణక్రమం

4.0 లక్ష్యం
4.1 విమర్శ - ప్రాచీనత
4.2 విమర్శను గూర్చిన విమర్శలు - తెలుగువారు
4.3 ఆంగ్ల భాషాభిజ్ఞుల భావాలు
4.4 సహృదయత
4.5 విమర్శకుల భేదాలు
4.6 ఉత్తమ విమర్శక లక్షణాలు
4.7 అసద్విమర్శ లక్షణం
4.8 కవి - విమర్శకుడు
4.9 సాహిత్యం - విమర్శ
4.10 విమర్శకుడి సమస్యలు
4.11 విమర్శ - ఎవరికోసం
4.12 విమర్శ భాష
4.13 విమర్శ - నిర్ణయాలు - ప్రకటనలు
4.14 విమర్శకుడికి పాండిత్యం అవసరం
4.15 విమర్శ ప్రక్రియలు
4.16 సమీక్ష
4.17 ప్రశ్నలు
4.18 ఉపయుక్త గ్రంథాలు

## 4.0 లక్ష్యం

పాఠక లోకానికి - సాహిత్యానికి విమర్శ వల్లా విమర్శకుడి వల్లా కలిగే ప్రయోజనాన్ని తెల్పటం. విమర్శ విమర్శకుల గూర్చి వివరించడం.

## విమర్శ

విమర్శ ఒక 'Work of Art'. అది ఒక కళా సృష్టి. విమర్శ అనే పదానికి నిఘంటువులలో, హేతువాదం, పరిశీలన, పరస్పర విరుద్ధాలయిన తీర్పు, సందేహం, వాదన, ఆలోచించు, చర్చించు, పరామర్శించు, పరిశీలించు, పరిశోధించు, పర్యాలోచించు, విచారించు, వివేకించు, శీలించు, శోధించు, అంటూ అనేకార్థాలున్నాయి. విమర్శ శబ్దంలో 'మృశ్' ధాతువుకు ముందు 'వి' అనే ఉపసర్గ చేరింది. 'మృశ్' ధాతువుకు పరామర్శించు, పరీక్షించు, చర్చించు వంటి విశేషార్థాలున్నాయి. కనుక విమర్శ అంటే ఒక అంశాన్ని నిశితేక్షణతో పరిశీలించి అందులోని బాగోగులను విశదంగా చర్చాపురస్సరంగా వ్యాఖ్యానించి చెప్పడం, సాహిత్య జగత్తులోని దారి తెలియని మనోహర పరిసరాలకు తీసుకొని పోయే ఉత్తమ మార్గదర్శి విమర్శ.

## 4.1 విమర్శ - ప్రాచీనత

మన ప్రాచీనులు విమర్శను దేవీ స్వరూపంగా భావించారు. లలితా సహస్రనామాల్లో 'విమర్శ రూపిణీ విద్యా' అని ఆ దేవిని విమర్శరూపిణిగా భావించారు. గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా కూచినపూడి గ్రామంలో 'విమర్శాంబా సమేత ప్రకాశ వీరేశ్వర మూర్తి' అనే లింగమూర్తి వేంచేసి ఉన్నాడు. ఈ దేవాలయమూ ఆ దేవతా ప్రాచీన కాల సంబంధులే. విమర్శ వల్ల వస్తు ప్రకాశం కలగటాన్ని ఇది సూచిస్తున్నది. వేదాంత పరిభాషలో ఆత్మానాత్మ వివేకమని అర్థం. కావ్య భాషలో గుణదోష విచార విమర్శ అని అర్థం.

## 4.2 విమర్శను గూర్చిన విమర్శలు - తెలుగువారు

1. 'ఒకరు చేసిన పనిలోని బాగోగులను గురించి చెప్పటం' - పింగళి లక్ష్మీకాంతం.
2. 'ఒక గ్రంథాని గాని కళారూపాన్ని గాని లెస్సగా పరిశీలించి మననం చేసి చర్చాపురస్సరంగా దాని బాగోగులను ప్రదర్శించటం విమర్శ' - దివాకర్ల వేంకటావధాని.
3. 'ఒక గ్రంథంలోని లోపాలను ఔచిత్యాలను భావగాంభీర్యాన్ని అలంకార రచనా పాటవాన్ని ధ్వని విశేషాల్ని శయ్యా సౌభాగ్యాన్ని వస్తు నిర్మాణ సౌష్ఠవాన్ని పాత్ర పోషణ రస పోషణ సన్నివేశ కల్పనాన్ని ఇలా విషయ సర్వస్వాన్ని కూలంకషంగా చర్చించి వాఙ్మయంలో ఆ గ్రంథానికి దక్కే స్థానాన్ని నిరూపించటం విమర్శ' - ఆచార్య కె.వి.ఆర్. నరసింహం.
4. 'కావ్య వస్తు తత్త్వ నిరూపణమే విమర్శ' - డాక్టర్ యస్.వి. రామారావు.
5. 'పరామర్శ వంటివి తెగడ్తలతోను నిండి ఉన్నాయి. నిజానికి ఆలోచనా పూర్వకమైన చర్చతో విషయ నిష్ఠమైన గుణదోష పరీక్షకే స్థానముండాలి' - బూదరాజు రాధాకృష్ణ.

ఇలా సాహిత్య రచనలోని వైశిష్ట్యాన్ని చూపిస్తుంది. సంప్రదాయ అవిచ్ఛిన్నతను పోషిస్తుంది విమర్శ.

## 4.3 ఆంగ్ల భాషాభిజ్ఞుల భావాలు

(Criticism) 'క్రిటిసిజం' అనే పదం KRITEIN (to judge) అనే గ్రీకు పదం నుంచి ఆవిర్భవించింది. విమర్శకు సమానార్థకమైన ఈ క్రిటిసిజం అనే పదాన్ని పాశ్చాత్యులనేక విధాలుగా నిర్వచించారు. మన తెలుగు సాహిత్యం మీద పాశ్చాత్య భాషా ప్రభావం అధికంగా ఉంది. అందువల్ల ఆంగ్ల నిర్వచనాలను గూర్చి కూడ తెలియటం అవసరం.

వస్తు తత్త్వాన్ని గుణగణాల్ని నిర్ధారించేది విమర్శ - హడ్సన్. అనుభూతుల తారతమ్యాల్ని వివేచించి వాటి విలువల్ని తేల్చేది విమర్శ - జె.ఎ. రిఛర్డ్స్. లలిత కళల గుణగణాల పరిశీలనకి కల్పించిన అక్షర రూపం విమర్శ - ఎడ్మండ్ గూస్, రాగ ద్వేష రహితంగా ప్రపంచంలోని ఉత్తమ విషయాల్ని నేర్చుకొని వ్యాప్తి చేయడం విమర్శ - మాత్యూ ఆర్నాల్డ్, కళా రూపాల్ని అక్షర రూపంలో వ్యాఖ్యానించేది విమర్శ - టి.యస్. ఇలియట్.

నిర్దిష్టమైన సాహిత్య రూపాన్ని పరీక్షించి గుణదోషాల్ని పరామర్శించి సిద్ధాంతాలు చేయటం విమర్శ శాస్త్రం అవుతుంది. అలాగే సాహిత్య రూపాల్ని ఉత్తేజ పరచటం వల్ల విమర్శ కళ అవుతుంది. కనుక విమర్శ, శాస్త్రంతో పాటు కళ కూడ అవుతుంది.

సారాంశంగా సాహిత్య కళాఖండాల వస్తుతత్త్వాన్ని రాగద్వేషాల కతీతంగా సాకల్య సద్వివేచనతో మననం చేసి వాటిలోని బాగోగుల్ని కమ్మని కళాత్మక గుణాల్ని విశ్లేషించి విలువకట్టి మంచి మాటల్లో అక్షర రూపంలో ఉత్తమ అభిరుచుల్ని పెంచుతూ

శాస్త్రంగానూ కళగాను వ్యవహరించేది విమర్శ. నిజానికి కావ్యాన్ని శ్రద్ధగా చదివి ఆకళింపు చేసుకున్న వారికే విమర్శ. అది వారికే అధిక ప్రయోజనకారి. పాఠకుడికి కావ్య పఠన సమయంలో కలిగిన అనుభవాన్ని విమర్శతో సరిపోల్చుకొని విమర్శకుడికి తనకు ఏకవాక్యత కలిగినప్పుడు సంతోషిస్తాడు. కలుగనప్పుడు తన అభిప్రాయాన్ని పునః పరిశీలించుకొంటాడు. ఈ విధంగా అతడి సారస్వత మననాభ్యాసాలు బలపడతాయి. సద్విమర్శ వల్ల వచన వాఙ్మయం వృద్ధి చెందుతుంది. విజ్ఞులు చిత్తశుద్ధి గల విమర్శకులు తమ దృష్టిని వర్తమాన సాహిత్యం మీదికి మరల్చి శాస్త్ర బలంతో కూడిన చర్చలు ధారాళంగా సాగిస్తే ఆ భాషలో సాహిత్య విమర్శ ప్రమాణం పెరుగుతుంది. అందువల్ల ఆ భాషలోని సాహిత్య స్థాయి కూడ తప్పక ఉన్నత శిఖరాల నందుకుంటుంది.

విమర్శ - ప్రకాశం, ఒక దానితో ఒకటి ఎప్పటికీ కలిసే ఉంటాయి. ప్రకాశింప చేయని విమర్శ విమర్శ కాదు. ప్రకాశం ఉన్న చోట, విమర్శ దానికి ముందే ఉంటుంది. ఆ రెండింటి సంబంధం విడదీయరానిగా ఉంటుంది. భారతీయాలంకార సిద్ధాంతాలన్నీ కూడ కావ్యగత సౌందర్యాన్ని వెలువరించి విమర్శకులకు ఉపకరించేవే.

ఒక రచనను చదివి చాల బాగున్నది అని అన్నా, ఆ రచనలోని కొన్ని భాగాలను చదివి చాలా బాగున్నది అన్నా, ఆ రచన మనకు తెలిసినట్లు కాదు. రచన మనకు నచ్చినప్పుడు అందులోని బాగున్న విషయాన్ని విడదీసి చూపడానికి వీలుందా? లేక పాలల్లోని వెన్నలాగా రచన మొత్తంలో వ్యాపించి దాని జీవం ఉందా! దాన్ని మన మాటల్లో చెప్పడానికి వీలుందా? ఆ చెప్పడం మామూలు మాటల్లోనా? విశిష్టమైన మాటల్లో చెప్పడం వల్ల కలిగే అధిక ప్రయోజనం ఏమిటి మొ॥వి మనకు తెలియాలి. స్థూలంగా చెప్పాలంటే విమర్శ అంటే ఈ ప్రశ్నలకు సమాధానమే, అంటారు డా॥ ముదిగొండ వీరభద్రయ్య.

సాహిత్య రచనలోని వైశిష్ట్యాన్ని చూపించేదే విమర్శ. మంచి విమర్శ సంప్రదాయ అవిచ్ఛిన్నతను పోషిస్తుంది. ప్రతి క్రొత్త విషయాన్ని వెనుకటి దానితో దానికున్న సంబంధాన్ని, దాని నుంచి ఎంత వరకు స్వతంత్రించింది అనే విషయాన్ని విమర్శ ప్రతిక్షణం బేరీజు వేస్తుంటుంది. ఈ నూత్న విషయం సంప్రదాయంలో ఎలా సహజంగా కలిసి పోయిందో కూడ చూపటం విమర్శలోని అంశమే. అలా వ్యాఖ్యానించి పాఠకుని అభిరుచిని తీర్చి/తీర్చుతుంది. అలా కాకపోతే అది ఒక విద్యగా పరిగణింపబడదు. ఉత్తమ విమర్శ సాధారణ పఠితను వ్యంగ్య వక్రత అలంకార ప్రధానమైన రచనలను మెచ్చుకొనే స్థాయికి పెంచుతుంది. రసానుభూతి కలిగిస్తుంది. రచనలోని సూక్ష్మాంశాలను రచనా సౌందర్యాన్ని రచన ప్రాణాన్ని విమర్శ విశదీకరిస్తుంది.

సాహిత్య సృష్టి జరిగిన తరువాతనే విమర్శ మొదలవుతుంది. రచనకు ముందుగా కవి తనకు తానుగా చేసుకొనే విమర్శ తన రచనా ప్రణాళికలో అంతర్భాగమవుతుందేగాని, అది ప్రత్యేకంగా విమర్శ కాదు. దానిని విమర్శగా పరిగణించలేము. కనుక రచన వేరు, విమర్శ వేరు. కనుక విమర్శ ఒక ప్రత్యేక శాస్త్రం. ప్రత్యేక స్థానం. సాహిత్యాంశాల్ని పరీక్షించి నిగ్గుదేల్చేవాడు విమర్శకుడు. దానికి సహృదయత్వం అవసరం.

## 4.4 సహృదయత

సాహిత్య గ్రంథాన్ని చదివే పాఠకుడు సహృదయుడు కావాలన్నది భారతీయాలంకారికుల అభిమతం. మన ఆలంకారికులు వారిని పాఠకులనిగాని, విమర్శకులనిగాని అనలేదు. ఈ రెండింటికీ పర్యాయపదంగా సహృదయ శబ్దాన్ని ప్రయోగించారు. పాఠక విమర్శకులకు కనీస లక్షణంగా సహృదయం ఉండాలని ఆశించారు. సహృదయత అనేది ఒక పరిభాషాపదం. ఇది విమర్శకుడికి ఉండవలసిన ప్రథమ లక్షణం.

"యేషాం కావ్యాను శీలన వశాత్
విశదీ భూతే మనోముకులే
వర్ణనీయ తన్మయీభావ యోగ్యతా
తే హృదయ సంవాద భాజః సహృదయాః" - ఆభినవగుప్తుడు.

నిత్యం కావ్యాన్ని పరిశీలించే అలవాటువల్ల హృదయ మాలిన్యం తొలగి, ఎవరి మనసు అనే అద్దంలో కావ్య ప్రతిపాదితార్థతో తాదాత్మ్యం ప్రతిఫలిస్తుందో వారు హృదయ సంవాద భాక్కులు, సహృదయులని అర్థం. హృదయ సంవాదత్వం సహృదయ ప్రధాన లక్షణం. అంటే కవి హృదయాన్ని ఉన్నదున్నట్లుగా గ్రహించగల వాడే సహృదయుడు. మలీమసమైన బాహిర ఆవరణాను ఛేదించుకొని విమలాంతఃకరణుడైతాడు పాఠకుడు. అది అతనికి నిత్య సాహిత్య అధ్యయనం వల్ల సాధ్యపడుతుంది. అటువంటి వాడే సహృదయుడు. వాడే కవితో తాదాత్మ్యాన్ని పొందగలడు. అతడు సత్త్వ ప్రధాన హృదయుడు.

### 4.4.1 సహృదయుడైనవాడే విమర్శకుడు

ఏ హృదయంతో కవి కావ్య నిర్మాణానికి పూనుకొన్నాడో అటువంటి హృదయం విమర్శకుడికీ ఉండాలి. ఆ సహృదయుడిని గూర్చి పి.వి.కాణే పండితుడు, భట్టతౌతుని విషయంలో ఇలా వివరించాడు.

'Another doctrin that తౌత (Bhatta Touta) held was that the poet, the hero (of a poem) and the (sympathitic) reader pass through the same experience' (History of Sanskrit Poetics - P.211).

సాధారణీకరణం పొందిన నాయికా నాయకుల సుఖదుఃఖాలుగా భావన చేయగలవాడే సహృదయుడు. అతడు మాత్రమే సద్విమర్శకుడు. కనుక ఉత్తమ విమర్శకుడు అధికారాన్ని ఆర్జించిన సహృదయుడే అర్హుడవుతున్నాడు. ప్రాచీన భారతదేశంలో విమర్శకుడు సహృదయ భావుక రసజ్ఞ . . . . . . శబ్దవాచ్యుడుగా ప్రసిద్ధుడు. ఆనందవర్ధనుడు 'సహృదయ హృదయాహ్లాది శబ్దార్థ మయత్యమేవ కావ్యలక్షణం' అనీ, ధ్వనాలోకలోచన వ్యాఖ్యాన ప్రారంభ శ్లోకంలో 'సరస్వత్యాస్తత్త్వం కవి సహృదయాఖ్యం విజయతే' అనీ, కవి విమర్శకులిద్దరిలో ఉండే సరస్వతీ తత్త్వం విజయమగు గాక అని ఆశ్వాసించటంలోని అంతరార్థం ఇదే.

'సాహిత్య విమర్శనం' దోషోల్లేఖనం కాదు. సాహిత్య నిర్మాణంలోని సౌందర్య తనువును చేరి ఆరాధించటానికి చేసే నిర్మల తపస్సు. విజ్ఞాన బ్రహ్మాన్ని గూర్చి ఉపనిషత్తులో చెప్పిన లక్షణాలు ఉత్తమ విమర్శకు పట్టాలి -

శ్లో॥ 'తస్య శ్రద్ధైవ శిరః
ఋతం దక్షిణః పక్షః
సత్య ముత్తరః పక్షః
యోగ ఆత్మా'

సాహిత్యంలో యోగ మంటే, కవి - సహృదయుల (విమర్శకుల) భావతాదాత్మ్యం అంటారు శ్రీ ఖండవల్లి రంజనం గారు.

కనుక సహృదయ విమర్శకుడు కావ్య పఠన సమయంలో తన హృదయంలో రుచిరాస్వాదం జనిస్తున్నదా లేదా అనీ, తన హృదయానికి ప్రకృతంలో కాక స్థలాంతరంలో ప్రచారం ఉన్నదా? లేదా అనీ తన రసాస్వాదనకు విఘాతం కలుగుతున్నదా కలగటం లేదా అని తన అంతరంగాన్ని పరీక్షించుకోవాలి. విఘాతం కలిగే కథాభాగం ఎక్కడ ఉందో అక్కడ దోషం ఉన్నట్లుగా నిర్ణయించుకోవాలి. లేకుంటే దోషం దోషంగా భాసించటం లేదని భావించాలి. ఇదే మహాకవి కాళిదాసు చెప్పిన 'సహృదయాః ప్రమాణం' అన్నది.

కావ్య రసానుభూతికి ఎవరు ఉత్తమాధికారి అనే విషయాన్ని తెల్పుతుంది ఈ క్రింది శ్లోకం.

శ్లో॥ "శైవ వ్యాకరణజ్ఞ మేతి పితరం న భ్రాతరం తార్కికం
దూరాత్సంకూచి తేవ గచ్ఛతి పునశ్చండాల వచ్చాందసాత్

మీమాంసా నిపుణా నపుంసక మితి జ్ఞాత్వా నిరస్యాదరాత్
కావ్యాలంకరణజ్ఞ మేవ కవితా కన్యా వృణీతే స్వయమ్" - బిల్హణుడు

కవితా కన్య వైయాకరణుడిని తండ్రిగాను, తార్కికుడిని సోదరుడిగాను, వేదజడుని చండాలుడిగాను, మీమాంసకుడిని నపుంసకుడిగాను పరిగణిస్తుంది. కావ్యాలంకారవేత్త అయిన సహృదయునినే స్వయంగా వరిస్తుంది. మిగిలిన వారికి దాని సారస్వత పరమార్థం అంతుపట్టదని భావం.

కనుక చర్వణం సర్వసామాన్యమే అయినా సారాస్వాదనం సహృదయుడిదే అంటారు ఆచార్య యస్వీ జోగారావు గారు.

'యస్తుష్టౌ తుష్టి మాప్నోతి
శోకే శోక ముపైతిచ
క్రోధే క్రుద్ధో భయే భీరుః
స శ్రేష్ఠః ప్రేక్షక స్మృతః - భరతుడు

సంతోష సందర్భంలో సంతోషం శోక సందర్భంలో శోకం క్రోధ సందర్భంలో క్రోధం భయ సందర్భంలో భయం పొందిన వాడే ప్రేక్షక శ్రేష్ఠుడు. అంటే ఉద్దిష్ట సందర్భానికి సమానమైన అనుభూతిని పొందినవాడే సహృదయ శిఖామణి. భరతమతం ప్రకారం సరాభిముఖ్యంగల చిత్తవృత్తి గలవాడే సరి అయిన సహృదయుడు. సహృదయుడు రసానుభూతిని చెంది, ఇతర పాఠకులకు ప్రరోచన కలిగిస్తాడు. కావ్య రహస్యాల్ని తెలియపరుస్తాడు. సమకాలీన రచయితలకు భావి రచయితలకు మార్గదర్శకు డవుతాడు. విమర్శకుడికి సహృదయత ఉంటే విమర్శలోని లోపాలు చాలవరకు తొలగిపోతాయి. మహాంశాలనే పాఠకుడికి విశదపరుస్తాడు.

నిత్య సాహిత్య విమర్శన వ్యాసంగి అయిన సహృదయుని వాక్కు సజీవం ప్రచార మధుశిల - విమర్శకుడిలో సహృదయత కొరవడితే ఆతడి రచనలో కనిపించేది అతడి సొంత విషయమే అవుతుంది. అందుచేత రచయితతో విమర్శకుడు శ్రుతి కలుపు కోవడానికి ఈ సహృదయత అవసరం. దీనికి చక్కని కృషి అవసరం. అది అప్రయత్నంగా సిద్ధించదు.

రచనకు స్పందించటం దగ్గర నుంచి, రచన మీద తన నిర్ణయాన్ని ప్రకటించేత వరకు, తన పనులను చేయడంలో శిక్షణ పొంది ఉండాలి.

నిరంకుశ సూత్రీకరణలు గాని, వైయక్తిక స్పందనలు గాని విమర్శ కాదు. ఒక రచన మీద నిర్ణయం చేసే సామాన్య కృషి అని గమనించాలి. ఇది సుశిక్షితుడైన విమర్శకుడు గాని చేయలేడు. విమర్శకుడు సామాన్యంగా చేయవలసినవి (1) విశ్లేషణ, (2) తులనాత్మక పరిశీలన, (3) వ్యాఖ్యానం, (4) నిర్ణయం. నాలుగూ కూడ బుద్ధి నాశ్రయించి చేసేవే. బుద్ధి ద్వారా విచక్షణ చేసేటప్పుడు నిర్మమతతో కూడిన రచన అవుతుంది. దీనికి శిక్షణ అవసరం.

విమర్శకుడు కవి మనోవ్యూహాన్ని ఛేదించుకొని పోయి తానెరిగినంత వరకు కళా రహస్యాల్ని సూత్రీకరించి "ఇది కంఠపాశము, ఇది కవి గజాంకుశము, ఇది కవి సంశయ విచ్ఛేదమూ అని గ్రంథ రూపంలో క్రోడీకరిస్తాడు" అని శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు వక్కాణించారు.

విమర్శకుడు విమర్శ చేసేటప్పుడు తత్త్వజ్ఞుడు కావచ్చు, మానసిక శాస్త్రవేత్త కావచ్చు. భిన్నభిన్న సాహిత్య పఠిత కావచ్చు. అయితే అవి అన్నీ విమర్శ తరువాతనే రావాలి. విమర్శకుడు విచక్షణా జ్ఞానాన్ని చూపాలి. అంటే ఇది ఇది, అది ఇది కాదు అని వేరు వేరుగా చూపెట్టాలి. ఈ రచన అంటే ఇది, అది చెప్పినదేదో నేను వివరించాను, దాని అంతర్భాగాలు ఎలా పనిచేశాయో చెప్పాను. ఇది దాని ఎక్స్‌రే ఫోటో" ఇది దాని గుర్తి చీటి' అని తెలియ చెప్పాలంటారు శ్రీ నాగళ్ల వారు.

## 4.5 విమర్శకుల భేదాలు

ఇలియట్ విమర్శకులను Incomplete, Spurious, Dogmatic and Technical Criticism అంటూ చతుర్విధాలుగా విభజించాడు. విమర్శలో సమతౌల్యం భావావేశరాహిత్యం బౌద్ధికత ఉండాలి. (1) అవి లోపించిన వాడు అసమగ్ర విమర్శకుడు. (2) పాండిత్యం పరిశీలన సహృదయత విశ్లేషణలవంటి ప్రాథమిక లక్షణాలు లేకుండా కేవలం రచనాచాతుర్యం చూపేవాడు అసత్య విమర్శకుడు. (3) నియమాలను తయారుచేసి కొలతలను పట్టి చూచినట్లు రచనలను కొలవటానికి పూనుకొనేవాడు నిరంకుశ విమర్శకుడు. (4) నియమాలు రచనకు అన్వయమయినాయా? లేదా? అని పరిశీలించేవాడు సాంకేతిక విమర్శకుడు. ఇతని రచన ముఖ్యమైందిగాను ఉపయోగ కరమైందిగాను భావించవచ్చు, కాని విమర్శ మాత్రం కాదంటాడు ఇలియట్. ఈ విమర్శకుడు విమర్శ వ్యాపారపు ఆవలిగట్టునే ఉంటాడు.

### 4.5.1 విమర్శకులలో మరో వింగడింపు

1. సద్విమర్శకుడు. 2. అసద్విమర్శకుడు.

1. సద్విమర్శకుడు - సహృదయుడై దేశకాలాలకు వ్యక్తిత్వాలకు అతీతంగా నిర్మమతతో, సార్వకాలిత సత్యాలను సర్వ సాహిత్య సృష్టిహితాన్ని కూర్చే విమర్శ చేసేవాడు సద్విమర్శకుడు.

2. అసద్విమర్శకుడు - లౌకిక విషయాలకు తావిచ్చి స్వాభిమానానికి మమతకు తావిచ్చే విమర్శలు చేసేవాడు, అసద్విమర్శకుడు. ఇతడు కావ్యాన్ని అస్వతంత్రంగా భావిస్తాడు. పిడివాదం చేస్తాడు. స్వాభిమానాన్ని ప్రకటిస్తాడు. పాక్షిక దృక్పథంతో దోషైక దృక్కుగా విమర్శిస్తాడు.

## 4.6 ఉత్తమ విమర్శక లక్షణాలు

ఉత్తమ విమర్శకుడికి ఉండవలసిన లక్షణాలను టి.యస్. ఇలియట్ ఈ క్రింది విధంగా పేర్కొన్నాడు.

1. అభినివేశం - తాను విమర్శించ దలచిన విషయం మీద చక్కని అభినివేశం విమర్శకుడికి ఉండాలి. ఆ అభినివేశం ఇతరులకు కూడ కలిగేటట్లుగా వ్యక్తీకరించే శక్తి, నేర్పు కలిగి ఉండాలి.

2. విశ్లేషణ - పోల్చి చూడటం విశ్లేషించటం అనే రెండు పద్ధతుల్ని ప్రదర్శించే నైపుణ్యం ఉండాలి.

3. గ్రహణ శక్తి - ప్రపంచ సాహిత్యంలో నుంచి గాఢతా గాంభీర్యం ఉన్న కావ్యాలను గ్రహించగల నిశిత గ్రహణ శక్తి కలిగి ఉండాలి.

4. చైతన్యం - తన కాల ప్రభావానికో స్థానిక ప్రభావానికో విమర్శకుడు స్థబ్దుడు కాకూడదు. ఆ ప్రభావాల నుండి తనను వేరు చేసుకోవాలి.

5. ప్రతిభ - విమర్శకుడికి సృజన శక్తి ఉండాలి. ఇది క్రాంత దర్శనాన్నిస్తుంది.

6. పరిష్కరణ - కళకు సంబంధించిన వర్తమాన సమస్యలతో మునిగిపోడు. ఆ సమస్యల పరిష్కారానికి గతంలోని శక్తుల్ని వినియోగించి పరిష్కరిస్తాడు.

మందేశ్వరరావు గారు మరి కొన్ని సూత్రాలను పేర్కొన్నాడు.

1. భావుకత - కవి మార్గంలో పయనించే భావుకత కలిగి ఉండాలి. ఆ కవి అలా ఎందుకు రచించాడో చెప్పగలగాలి.

2. శిల్పజ్ఞత - కవి శబ్దాలతో పాటు శిల్ప నిర్మాణాన్ని కూడ నిశితంగా పరిశీలించాలి, దానిలోని రసాత్మక విషయాల్ని దర్శించాలి.

3. వర్తమాన సాహిత్య పరిచయం - మారుతున్న సాహిత్య విలువల్ని గమనించగలగాలి.

4. నిర్మమత - రచనా విమర్శలో నిర్మమతతో వ్యవహరించాలి. మమత ప్రతిఫలిస్తే అది విమర్శకాదు. అతడి అభిరుచి వ్యాస మవుతుంది. అహంకార పరిత్యాగం ముఖ్యం.

5. ప్రభావ రాహిత్యం - ఏ దృక్పథానికీ ప్రభావితుడు కాకుండా స్వతంత్రంగా తన దృక్పథాన్ని ఏర్పరచుకోవాలి.

6. స్వతంత్రత - సమకాలీన సహృదయులకు ప్రతినిధి - వెనుకటి విమర్శలు చదవాలి, కాని వాటినే అంటి పెట్టుకోకూడదు. స్వతంత్రంగా వ్యవహరించాలి.

7. మార్గ నిర్దేశం - సమకాలీన కావ్య పరిశీలన చేసి అవసరమైతే సమాజాభిరుచిని మార్చగలగాలి.

8. నిర్ణయశక్తి - నిరంతర కావ్య పఠనం వల్ల పదనుతేరిన హృదయంతో సాహిత్య సిద్ధాంతాలను మథించాలి. వాటి విలువల్ని మదుపుగట్టాలి. పుష్కలమైన సహృదయతను అలవరచుకోవాలి.

9. సమన్వయం - అలంకార శాస్త్ర భావకుని ఆలోచనకు అడ్డుకాకూడదు.

10. జాగరూకత - విమర్శకుడికి అలంకార శాస్త్రాలలోని పారిభాషిక పదాలు తూకపు రాళ్లలాగ ఉండకూడదు. ఆలంకారిక శాస్త్ర మూల సూత్రాలను ఆధునిక విజ్ఞానంతో పరీక్ష చెయ్యడం కన్నా మహోపకారం మరొకటి లేదు.

ఇటువంటి శాస్త్ర పరాయణులైన విమర్శకుల్ని చూచి కాబోలు తిరుపతి వెంకటకవులు తమ లక్షణా పరిణయంలో ఇలా నిరసించారు.

చం॥ మతిగల వారికే నియుఁ బ్ర
మాద మెలర్పకఁ బోదు పుష్ప స
మ్మిత కవితా లతాంగిని ర
మింపుడు కేవల శాస్త్రులార! మీ
మతులకు వచ్చినట్లు రస
మాధురి గ్రోలుడు గాని, వ్యర్థ పుం
జతురిమఁ జూపి దాని స్తన
శల్య పరీక్ష యొనర్ప బోకుడీ - తిరుపతి వేంకటకవులు

అంటే విమర్శకుడు స్వారస్యాన్ని గ్రహించాలే గాని తప్పులు వెదకటమే ప్రధాన వృత్తిగా పెట్టుకోకూడదు.

యస్వీ జోగారావు గారు 'సాహిత్య భావలహిరి'లో తెల్పిన మరికొన్ని ఉత్తమ విమర్శక లక్షణాలు గమనింపదగినవి.

1. ప్రతిభావ్యుత్పత్తులతో పాటు పుష్కలమైన సహృదయ సముపేతుడు కావాలి.

2. ప్రామాణిక దృష్టి - ప్రమాణం పేరు చెప్పి గుడ్డిగా దానిని బట్టి దేవులాడినచో ఆ విమర్శలో చైతన్యం ఉండదు. ప్రమాణాలకు గాని సంప్రదాయాలకు గాని విధేయమైతే ఒక బాధ, విరుద్ధమైతే ఒక బాధ. అది విమర్శకుడికి అసిధారా వ్రతం వంటిది. సిద్ధాంతానికి రచనను మించిన స్థానం ఇవ్వకూడదు.

3. స్వాత్మ వివేచన - ప్రబోధాలకు ప్రలోభాలకు లోనుకాకుండా సద్యోహృద్యమూ సహృదయ నైవేద్యమూ పరమ స్వాదు పదార్థమైన కావ్య స్వరూపం యొక్క యదార్ధ కథనం విమర్శకుడి కర్తవ్యం.

4. సహానుభూతి - రచయిత కావ్య రచనలో పడిన శ్రమను పడిన ప్రయాసను సహనంతో సహానుభూతితో గుర్తించి వాని నభినందించటం కనీస కర్తవ్యం.

'విద్యానేవ విజానాతి విద్యజ్జన పరిశ్రమం
నహి వంధ్యా విజానాతి గుర్వీ ప్రసవ వేదనం'

అనే ఆర్యోక్తి రీతిగా విమర్శకుడు వ్యవహరించాలి. అప్పుడే ఉత్తమ విమర్శ నిగ్గుదేలుతుంది. కవి ఏది వ్రాశాడని కాదు. ఎందుకు వ్రాశాడని కాదు. ఎలా వ్రాశాడన్నది ప్రశ్న. దానిని మాత్రమే పరిశీలించి సహానుభూతితో విమర్శించాలి.

5. మనస్తత్త్వ మర్మజ్ఞత - కావ్యం కవి యొక్క మనశ్శిశువు. కావ్య రచన సమయంలో కవి మనసులో ప్రచలితమైన భావాలు ఎలా ఉన్నాయో తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. అలా ప్రయత్నించటం వల్ల విమర్శకుడు కావ్య జీవ నాడిని పట్టగలడు. చక్కని విమర్శను వెలువరించగలడు.

6. విశిష్ఠ పాఠకత్వం - నిత్యం సాహిత్యాను శీలనం అవసరం. కవి హృదయాన్ని అవగాహన చేసుకోవాలి. కలిగిన అనుభూతికి తన హృదయాన్ని ఎదురొడ్డాలి. తనకు కలిగిన నిండైన అనుభూతిని సర్వ సహృదయులకు సోపపత్తికంగా నివేదించటం చేతకావాలి. సాహిత్యాభిరుచిని సారస్వత లోకంలో సుసంపన్నం చెయ్యాలి. దానికి విశిష్టమైన పాఠకత్వం కావాలి.

7. తత్త్వదర్శిత - తత్త్వదర్శిత మన్నది మహాకవి లక్షణం మాత్రమే కాదు. సారస్వత ద్రష్టల విషయంలో కూడ ముఖ్యమయినదే. గ్రంథాలకు ఉన్న పేరును బట్టి మోసపోక సత్యాన్వేషకుడై గ్రంథం యొక్క అంతరంగం లోకి తొంగి చూడాలి.

"ఏతము వంగిన వంగును
పాతాళము నీరు దెచ్చి బయలం జల్లున్"

8. సృజనాత్మక మర్మజ్ఞత - విమర్శకుడికి సాహిత్యంలో సృజన సమర్థత ఉన్నా లేకున్నా ఫరవాలేదు. కాని దాని పరిజ్ఞానం మాత్రం తప్పనిసరి. అప్పుడందులోని సాధక బాధకాలు బాగా గుర్తించగలడు. కవితో సముచిత రీతిగా సంవదించగలడు.

9. లోచూపు - ఉత్తమ విమర్శకుడు మూల గ్రంథాన్ని ముందుగా సమూలంగా చదివి కూలంకషంగా అవగాహన చేసుకోవాలి. ఇంకా సర్వ సాహిత్య రచనల పట్ల పఠనాసక్తి గలిగి వాటి విస్తృత పరిచయంతో మంచి అవగాహన కలిగి ఉండాలి. అలాగే మంచి లోచూపు గలవాడై కావ్యకళా మర్మజ్ఞుడై విమర్శించాలి. మంచి చెడ్డల రెండింటినీ నిర్ణయించే సామర్థ్యం సహృదయం బహుముఖ ప్రజ్ఞ కలిగి సంకుచిత భావరహితంగా, అంటే విమర్శలో విశాల దృక్పథం కలిగి ఉండాలి.

10. ప్రాజ్ఞత - లౌకిక అలౌకిక విషయ సామస్త్యాన్ని తెలిసిన ప్రాజ్ఞత కలిగి ఉండాలి.

11. ఋజు ప్రవృత్తి - పాఠకుల్ని సైతం ఋజుమార్గంలో పయనింపచేసే ఋజుప్రవర్తకుడై వాస్తవాల్ని మాత్రమే ప్రకటించగలగాలి.

12. ధైర్యసాహసాలు - దానికి సంబంధించి ప్రతి విమర్శల్ని ఎదుర్కొనే ప్రజ్ఞా పాటవాలు ప్రదర్శించగలగాలి. దానికి నిశితమైన బుద్ధి, సూక్ష్మ దృష్టి, విషయగ్రహణ శక్తి అవసరం. అప్పుడే విమర్శ సమగ్రంగా సంపూర్ణంగా విజ్ఞానవంతంగా ఉంటుంది.

13. నిలుకడ - విమర్శ సమయంలో నిలుకడతో నిర్ణయాలు తీసుకోవాలి. ఆవేశం అనర్ధ నిర్ణయాలకు దారితీస్తుంది. తత్రాపి

ప్రతి విమర్శలకు దారితీస్తుంది.

14. ధారణ శక్తి - సద్విమర్శకుడికి మంచి ధారణ శక్తి కూడ వుంటే ఒక రచన యొక్క ప్రాత క్రొత్తలను నిర్ణయించగలడు. విమర్శ నూతనంగాను సత్యంగాను ఉంటుంది.

15. సమకాలీన దృక్పథం - ప్రాపంచిక అనుభవంతో పాటు సమకాలీన సాహిత్య విమర్శలపై దృష్టి సారించాలి. అంటే సమకాలీన దృక్పథం అవసరం.

16. రచనాశైలి - అన్నిటికీ మించి సులభ సుందర వచన రచనాశైలి అవసరం. చదివించేదిగా అనుమానాలకు తావీయనిదిగా రచన ఉండాలి. అలాగే కవికి ఉండవలసిన ప్రతిభా వ్యుత్పత్త్యభ్యాసాలు విమర్శకుడికి కూడ ముఖ్యమే. అలాగని రచనలు చేయనవసరంలేదు. వంటకాల రుచి చెప్పడానికి వంట నేర్వనవసరం లేదు కదా!

17. వివేచన - ఉత్తమ విమర్శకుడు కావ్య పఠన సమయంలో ఏ సిద్ధాంత సులోచనాల్ని ధరించకూడదు. ధరిస్తే సహృదయత కొరవడినట్లే. ఉత్తమ విమర్శకుడు విమర్శ శాస్త్రాన్ని సహాయకారిగా మాత్రమే స్వీకరించాలి. అంతేగాని శరణాగతి శాస్త్రంగా స్వీకరించకూడదు. స్వీకరిస్తే ప్రమాదం పాలుకాక తప్పదు. శాస్త్ర సూత్రాల్ని సమన్వయించగల వివేచనా శక్తి ఉండాలి. దోషైక దృక్కుగా ఉండకూడదు. కవి ఆత్మీయతను ప్రదర్శించాలి.

విమర్శ కావ్యానికి అగ్ని పరీక్ష లాంటిది. కనుక విమర్శకుడు తనకుండవలసిన పై లక్షణాలతో వర్ధిల్లాలి. అప్పుడే వర్తమాన సాహిత్యం చైతన్యవంతమైతుంది. భవిష్యద్రచనలు నిత్యనూతనమై భద్రాయితమైతాయి.

విమర్శకుడు వ్యాఖ్యానించాలి, విమర్శించాలి, వివరించాలి. అలా చేయకుంటే విమర్శ ప్రాముఖ్యాన్ని కోల్పోతుంది. ప్రయోజన శూన్యమైతుంది. పై లక్షణాలు లేని విమర్శకుడి విమర్శ సత్యాన్వేషణ చేయలేదు. కావ్య సౌందర్యాన్ని గుణాన్ని ఆత్మను పాఠకుల కందించలేదు. అతడొక చిత్తశుద్ధిగల అవయవ శాస్త్రజ్ఞుడు కావాలి. 'మలర్మే' 'వాలరీ'ల కవిత్వాన్ని వ్యాఖ్యానిస్తూ 'ధియోనార్డ్' చెప్పినట్లు సద్విమర్శకుడు రచన అంతరార్థాన్ని వివరించి చెబుతాడు.

## 4.7 అసద్విమర్శ లక్షణం

అసద్విమర్శ అంటే సరైన విమర్శ కానిది. ఆ విషయాన్ని ఇలియట్ ఇలా ప్రస్తావించాడు.

1. కవుల మీద యుగాల మీద కేవలం ఉత్సాహం కలిగి ఉండటం.
2. కవిత్వంలో తత్కాలీన విషయాల మీద మక్కువ పెంచుకోవడం.
3. వైయక్తికమైన ఆవేశాల్ని అభిరుచుల్ని కూర్చటం.
4. ముందుగానే ఏర్పరచుకొన్న సూత్రాలతో విమర్శించడం.
5. కవిత్వానికి చెందిన కొన్ని సాంకేతికాంశాల్ని కానీ లేదా నైపథ్యాన్ని కానీ అధ్యయనం చెయ్యటం.

అసద్విమర్శ ఇంకా ఇలా ఉండవచ్చు.

1. కావ్యానికి స్వతంత్ర ప్రతిపత్తిని అంగీకరించక పోవటం.
2. విమర్శను పిడివాదంగా భావించడం.
3. అభిమానంతో కూడిన నిర్ణయాలు చేయడం.
4. పాక్షిక దృక్పథం కలిగి ఉండటం.

5. రంధ్రాన్వేషణైక దృష్టి కలిగి ఉండటం.

పైన పేర్కొన్న విధంగా ఏ సద్విమర్శకుడూ వ్యవహరించడు. అలా చేసే విమర్శ రూపం వైశిష్ట్యం కోల్పోతుంది. ప్రయోజనం నశిస్తుంది. అపకీర్తిని విమర్శకుడు మూటకట్టుకుంటాడు. అసద్విమర్శకుడైతాడు.

## 4.8 కవి - విమర్శకుడు

కవిత్వం అప్రయత్న లబ్ధం అనటం అందరంగీకరించిందే. అందువల్లనే కవిత్వాన్ని అప్రయత్న జనకమైన కళ (unconscious art) అంటారు. భరద్వాజ పక్షి (skylark) యొక్క సంగీతాన్ని అభినందిస్తూ షెల్లీ మహాకవి చెప్పింది, అప్రయత్నంగా వచ్చే కళను గురించి మాత్రమే. విమర్శకులు చెప్పేటంతవరకు తన కవితలోని లోతుపాతులు తెలియక పోవచ్చు. వారు తమ ఆనందానికే కవితలు రాస్తారు. ఈ విషయాన్ని గూర్చి 'సుబంధుడు' అనే కవి చెప్పిన మాటలు గమనార్హం.

"భవతి సుభగత్వ మధికం
విస్తారిత పరగుణస్య సుజనస్య
వహతి వికాసిక కుముదో
ద్విగుణ రుచిం, హిమకరోద్యోతః" 1 - 5

"గుణి నామపి నిజరూప
ప్రతిపత్తిః పరత ఏవ సంభవతి
స్వ మహిమ దర్శన మక్ష్ణో
ర్ముకుర తలే జాయతే యస్మాత్" 1 - 12

భరత భామహాది ఆలంకారికులు, కాళిదాస భవభూతుల వంటి వారి రచనలను దర్శిస్తే రచన విమర్శ రెండూ స్వతంత్ర మైనవని తెలుస్తుంది. వాటికి వైరుధ్యం కన్పించదు. కవి భావ సామగ్రిని సమీకరించి కావ్య రచన చేస్తాడు. విమర్శకుడు దాని పరమార్థాన్ని విశ్లేషించి విమర్శిస్తాడు. అందరికీ అందుబాటులోకి తెస్తాడు. దీనినే ఒక కవి ఇలా అన్నాడు.

"కవిః కరోతి కావ్యాని
లాలయంత్యుత్తమో జనః
తరుః ప్రసూతి పుష్పాణి
మరద్వహతి సౌరభం"

కవులు కావ్యాలు వ్రాస్తారు. సహృదయులు ఆదరిస్తారు. చెట్లు పూలు పూస్తాయి. గాలి దాన్ని పంచుతుంది అని రచనా విమర్శ రెండింటిలో ఒక దానిలో నైపుణ్యం సాధించిన వారు రెండవ దానిలో కూడ ప్రావీణ్యాన్ని సాధించవచ్చు. అందుకు దండి రాజశేఖర అభినవ గుప్త పండిత రాయల వంటి వారే నిదర్శనం. ప్రజ్ఞావంతులైన మహాకవులు పూర్వ కవుల రచనల్ని చదివి వాటిపై అసంతృప్తితో గాని, లేదా తమ ఉపజ్ఞను ప్రదర్శించటానికి గాని స్వాతంత్ర్యాన్ని అవలంబిస్తారు. ఆ సమయంలో ఆ కవి విమర్శక పాత్రను వహిస్తాడు. విమర్శక దృష్టి కవిని సన్మార్గంతో నడిపిస్తుంది. అలాగే సృజనశక్తి దాని మర్మజ్ఞత విమర్శక దృష్టికి దోహదం చేస్తుంది. పూర్వమే రచనా శక్తి గల విమర్శకుడికి విమర్శన సమయంలో అసలైన గుణగ్రహణ పారీణతని కలిగిస్తుంది. గాంభీర్యం స్థిత ప్రజ్ఞత్వం యదార్థ దర్శన యోగ్యత కలిగిస్తుంది. విమర్శకుడికి సాహిత్య సృష్టి లేకపోయినా, లేదా అందులో ప్రావీణ్యం లేకపోయినా ఎంతో కొంత దాని పరిజ్ఞానం అవసరమైతుంది. అంత మాత్రాన కవి మాత్రమే విమర్శకుడు కానక్కరలేదు.

కవిత్వము విమర్శ వేరు వేరు. అలా కన్పిస్తున్నా మనస్తత్త్వ శాస్త్ర దృష్టితో పరికిస్తే ఆంతరమైన సంబంధాలు కనిపిస్తాయి. కవి తన వాక్కులలో చెప్పనిదాన్ని చెప్పలేకపోయిన దాన్ని వైమర్శిక దృష్టితో విమర్శకుడు వ్యాఖ్యానిస్తాడు. కవికి తోచని, అతని రచనలోని మర్మాల్ని విలువల్ని విమర్శకుడు వివరించి లోకంలో కావ్య గౌరవ కారకుడైతాడు. అపుడు కవికి ఆనంద హేతువవుతాడు. సమకాలిక కవికి మార్గదర్శకుడైతాడు. అంతేకాదు 'కవితా వనిత తొలంగు బావ విమర్శక పురుషడ'నే ఆభాణం ఉంది. అంటే కవి విమర్శకులది బావమరదల్ల సరసంగా కొందరు భావిస్తారు. అంతే కాని విమర్శకుడిని కవి శాసకుడిగా భావించకూడదు.

కవి తన కావ్య ధర్మాన్ని గ్రహించింది విమర్శక నియమాల్ని బట్టి కాదు. తన విమర్శక బుద్ధితోను తులనాత్మక పరిశీలనతోను, మహాకవి ప్రయోగ పరిజ్ఞానంతోను తన మార్గాన్ని సుందరీకరించుకొంటాడు. దానినే విమర్శకుడు దర్శిస్తాడు. ఒక మంచి విమర్శ కవిని ఉత్తమ కవిగా మలచగలదే గాని, సామాన్య పాఠకుడని కవిగా మార్చలేదు. అయితే అతడిలో చక్కని సాహిత్యాభి రుచిని కల్పించగలదు.

ఇక ఎప్పటికీ కవులకు ఆలంకారికుల కంటె మహాకవులే మార్గదర్శకులు. తిక్కనపై అబ్బూరి, గురజాడను గూర్చి కృష్ణశాస్త్రి రచించిన గేయాలే నిదర్శనాలు. ఉదాత్త పాఠకుల వలన ఉత్తమ కవితా ప్రతిభా ప్రభంజనం మొదలవుతుంది. అందువలన సమాజం సాహిత్యం పరస్పరాభి వృద్ధి చెందుతాయి. సహృదయుడి హృదయ స్పందనలోనుంచి సాహిత్య సృష్టి జరుగుతుంది. సాహిత్య విమర్శ నిశిత పరిణత పరిశీలన హృదయం నుండి ఆవిర్భవిస్తుంది.

మహాకవి కాళిదాసు యొక్క "ఆ పరితోషాం విదుషాం నసాధు మన్యే ప్రయోగ విజ్ఞానమే బలవదపి శిక్షితానామాత్మన్య ప్రత్యయం చేతః" అనే శ్లోకాన్ని బట్టి కవి కంటె విమర్శకుడే కావ్య పరమార్థాన్ని స్పష్టీకరించటంలో సమర్థుడని తెలుస్తుంది. కవులై విమర్శకులైన వారిలో గోథే మహాశయుడిని మించినవారరుదు. బైరన్ కూడ ఈ భావాన్నే వ్యక్తీకరించాడు. పోలికను బట్టి విమర్శకుడు గూడ కవి వంటి శిల్పి. అంతే కాదు అతడి ప్రజ్ఞను ప్రదర్శించే వ్యాఖ్యాత కూడ. మహా కవులు తమ కావ్యాల ద్వారా మానవ జీవిత పరమార్థాన్ని ప్రసాదిస్తారు. విమర్శకుడు సారస్వత పరమార్థాన్ని ప్రదర్శిస్తాడు. విమర్శకుడు కవి హృదయాన్ని నిగ్గుదేల్చి, సాహిత్య ప్రపంచంలో అతడికి సముచిత స్థానాన్ని నిర్ణయిస్తాడు.

## 4.9 సాహిత్యం - విమర్శ

విమర్శ పాఠకుడి రసానుభవానికి అక్షర రూపం. విమర్శకుడు కవి ఇద్దరూ సాహిత్యం యొక్క ఉత్తమ స్వరూపాన్ని గ్రహించడానికే ప్రయత్నిస్తారు. సాహిత్య కృషి ప్రారంభమైనప్పటి నుండి నిరంతరంగా సాగుతూనే ఉంది. కవిత్వం విమర్శ రెండూ భిన్నంగా కన్పించినా సాహిత్యానుభూతి విషయంలో ఆ రెండింటి ప్రయోజనం ఒక్కటే. రెండింటి పర్యవసానం ఆనందమే. సరియైన విమర్శకుడు కావ్య పరమార్థాన్ని గ్రహించి ప్రకటించేంత వరకు ఆ కావ్యం వెలుగు చూడక పోవచ్చు. అందుకు కళాపూర్ణోదయం కమనీయోదాహరణం. కట్టమంచి వారు వచ్చే వరకు అది లోకం ముఖం చూడనే లేదు కదా! కవి ఉత్తమ ఆదర్శ పాఠకుడు. అతడు కవి హృదయాన్ని ఆవిష్కరిస్తాడు. కవి శిల్పనైపుణీ వ్యాపారాన్ని వ్యాఖ్యానిస్తాడు. ఆతని కృత కృత్యతను పాఠకులకు ఎరుకపరుస్తాడు. కావ్యాన్ని విమర్శించే సమయంలో ఒక ప్రాచీన సిద్ధాంతానికి ఒక నవీన సిద్ధాంతాన్ని జోడింప వలసి రావచ్చు. కొన్ని సందర్భాల్లో ప్రాతదాని స్థానంలో క్రొత్తదాన్ని ఉంచవలసి రావచ్చు. సాహిత్యమూ, సాహిత్య విమర్శ రెండూ ఒకే రకమైన సామాజిక పరిస్థితులలో వృద్ధి పొందినప్పుడు, ఒక కుటుంబంలోని వ్యక్తుల లాగ పోలికలు కలిగి ఉంటాయి.

సాహిత్యంలో ఒక కాలంలో ప్రసిద్ధంగా ఉన్న ప్రక్రియల్ని, ఆ కవులు ఏ విధంగా నిర్వహించారో పరిశీలించడం విమర్శకుని విధి. అంతే కాని ఆ ప్రక్రియలెందుకు ఆవిర్భవించాయని ప్రశ్నించటం కాదు. కవిత్వం వ్యక్తిగతమైనపుడు దాని విమర్శ కూడ వ్యక్తిగతమే అవుతుంది.

ఆ విమర్శకుడు గూడ తన వైయక్తికమైన ఇష్టా యిష్టాలతో కూడిన విమర్శ చేస్తాడు. ఇటువంటి విమర్శలో విమర్శ ప్రమాణాలూ సిద్ధాంతాలు దూరమైతాయి. కొన్ని కొత్త విమర్శ లక్షణాలు, తాత్కాలికంగా సమకాలీన రచయితల భావాల కనుకూలంగా వస్తాయి. ప్రాచీన సాహిత్య యుగాలలో ఒక ప్రత్యేక శాఖకు సంబంధించిన విమర్శన సిద్ధాంతాలు తాత్కాలికమైనవే. అవి సార్వకాలికాలు కావు. కానీ ఆధునిక కాలంలో అన్ని దేశాలలోని సాహిత్య స్వరూపం ఒక్క రూపమైందే. కానీ దాని ప్రకటించే మాధ్యమమే మార్పు - అందుచేత విమర్శ సిద్ధాంతాలు కూడ సార్వకాలికంగా సార్వదేశికంగా ఉండాలంటున్నారు. సాహిత్యంలో క్రొత్త క్రొత్త ప్రక్రియలు ఉద్యమాలు వాదాలు వస్తున్నాయి. వాటిని మనం గుర్తించాలి. గౌరవించాలి. వాటికి తగిన విమర్శ విధానాల్ని రూపొందించుకోవాలి. కనుక సాహిత్యమూ విమర్శ పరస్పరాశ్రయాలు, పరస్పర వృద్ధికి దోహదాలు.

'గుణ దోషే బుధౌ గృహ్ణన్<br>
ఇందు క్ష్వేడా నివేశ్వరః<br>
శిరసా శ్లాఘతే పూర్వం<br>
పరం కంఠే నియచ్ఛతి' - రాజశేఖరుడు

పరమ శివుడు చంద్రుణ్ని శిరసు మీద ధరించి, ప్రపంచానికి ప్రదర్శించి, విషాన్ని కంఠగతం చేసుకొని దాని వ్యాప్తిని అరికట్టినట్లుగా, విమర్శకుడు కావ్య గుణాల్ని శ్లాఘించటానికి అధిక ప్రాధాన్యమిస్తూ, దోషోద్ఘాటన విషయంలో సమ్యమనాన్ని పాటించాలి.

## 4.10 విమర్శకుడి సమస్యలు

కవి వలన సాహిత్యానికి జీవిత తత్త్వానికి సంబంధం ఏర్పడుతున్నది. విమర్శకుడు జీవితాన్ని విమర్శించినట్లు సాహిత్యాన్ని విమర్శించడు. విమర్శకుడు కావ్యాన్ని కావ్యంగానే విమర్శించాలి. ఈ ప్రక్రియలో విమర్శకుడు అప్పుడప్పుడు సాహిత్యానికి జీవితానికి గల సంబంధాల్ని కూడ వినియోగించే సందర్భాలుండవచ్చు.

విషయాన్ని విమర్శించడానికి బహు శాస్త్ర విషయ పరిజ్ఞానాన్ని సంపాదించాలి. సాహిత్య స్వరూప స్వభావం విమర్శకు ప్రమేయమున్న సమస్య. అందులోని వివిధ సాహిత్య గుణాల్ని తెలుసుకోవాలి. స్రష్ట, సాహిత్యము, పఠిత ఈ మూడింటి అనుబంధాన్ని అర్థం చేసుకోవడం వల్ల సాహిత్య స్వరూపం కొంత తెలుస్తుంది. అలా తెలుసుకున్నవాడే సాహిత్య విమర్శకుడైతాడు. సామాన్య మానవుడి కంటె సంఘాన్ని విమర్శకుడు బాగా అర్థం చేసుకోగలగడం వల్ల అతడి విమర్శలో సంఘ ప్రభావం ఉంటుంది. సాహిత్య ప్రయోజనాల్ని తెలుసుకోవాలి. ఈ విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. మొత్తం మీద సాహిత్య ప్రయోజనం ఆనందమని కొందరు, ఉపదేశమని కొందరు అంటారు. సాహిత్యం కొంతవరకైనా ఉన్నత పథాలకు తీసుకపోవాలని కొందరి అభిప్రాయం.

సాహిత్యం జీవిత విమర్శ అన్నాడు ఆర్నాల్డ్. 'యధావద్వస్తు వర్ణనమే సాహిత్య ప్రయోజనమ'ని కొందరు. వీటి నన్నింటిని విమర్శకుడు పఠితకు అందించవలసి ఉంటుంది. సాహిత్య విమర్శ సాహిత్య సృష్టి యొక్క విధానాన్ని గూడ పరిశీలించాలి. రచనా వ్యాపారం జరిగేటప్పుడు కవి మనసులో ఏమి జరుగుతున్నదో విమర్శకుడు తెలుసుకోవాలి.

కవి ఈ రచన కెందుకు ఉపక్రమించాడో తెలుసుకోవాలి. కవి సృష్టి విధానంలోని ఊహా భావానుభూతుల స్వభావం తెలియాలి. ఒక్కొక్కసారి కవికి హఠాత్తుగా కవిత వస్తుంది. దానికి రచనలో గల స్థానమేమిటి. కళాత్మక శైలీ విన్యాసానికి ఎటువంటి స్థానం ఉందో తెలియాలి. ఇలా విమర్శకులు రచనా ప్రక్రియను గూర్చి ఊహలేర్పరచుకోవడానికి అన్వేషించవలసిన విషయాలివి.

కళాఖండాన్ని సక్రమంగా అభినందించాలి.

దాని సృష్టికి తగిన సిద్ధాంత పరిచయం ఉండాలి.

విమర్శకుడికి వివేకం సామరస్యాన్ని సాధిస్తుంది.

ఈ విధంగా సాహిత్య విమర్శలోని సమస్యలు ఉంటాయని ఆచార్య యస్వీ. జోగారావు గారభిప్రాయపడ్డారు. విమర్శకుడికి కేవలం శబ్దార్థం తెలిసి నంతలో అసలు అర్థం తెలిసినట్లుకాదు. విమర్శలో పది ప్రధానమైన కష్టాలున్నాయి.

ఒక రచనను విమర్శిస్తున్నప్పుడు ప్రాథమికంగా దాన్ని విశ్లేషించుకోవాలి, వ్యాఖ్యానించాలి, తులనాత్మక పరిశీలన చెయ్యాలి. ఆ పై రచన స్వరూప స్వభావ మూల్యాల్ని నిర్ణయించాలి.

## 4.11 విమర్శ ఎవరి కోసం

విమర్శ వల్ల కలిగే లాభమేమిటి అన్న ప్రశ్న కేవలం అహంకార పూరితమైనదని అంటారు ఆచార్య కె.వి. నరసింహం. కవిత్వమంటే ఏమిటో తెలుసుకోవచ్చు. కాని తెలుసుకున్నదంతా ఆచరించడం మాత్రం సర్వ సామాన్యమైంది కాదు. అప్పుడే విమర్శ మిక్కిలి ఆవశ్యకమైతుంది. కొందరు కవులకు కవిత్వ తత్వం తెలిసినా దాని నెంత వరకు జీర్ణించుకోగలరో పరిశీలించడమే కవిత్వ విమర్శలకు గల బాంధవ్యం.

సాహిత్య సృష్టి సాహిత్య విమర్శకు ఆధారం. అంత మాత్రాన స్వయం ప్రతిపత్తి లేదని కాదు. నిజం చెప్పాలంటే రెండూ వ్యతిరేక ధ్రువాలు. కవిత్వం ఆవేశ చైతన్యోద్భవం. విమర్శ ఆలోచనా లోచన గోచరం. కవిత్వం గుండెలోనుంచి పుడితే, విమర్శ మనసులో నుంచి పుడుతుంది. ఒక సాహిత్య సృజనలో నుంచి మరొక సాహిత్య సంస్కృతిని కాపాడుతుంది. రచయిత కూడ రచనకు ముందు వెనుకల వ్యుత్పన్నతను సంపాదించు కోవలసిందే. ఇది రచయిత కత్యంతావశ్యకం. దానితో అతని ప్రతిభా నైశిత్యాలు నవనవోన్మేషాలైతాయి. అది రచయితలలోను విమర్శకులలోను సాహిత్యాభిలాషను పెంచుతుంది.

ఇందువల్ల విమర్శ ఎవరి కోసం? ఎవరి కోసం? అంటే సాహిత్యాభిమానుల కోసం. సాహిత్యాభిమాని అంటే అందులో రచయిత పాఠకుడు విమర్శకుడు ముగ్గురూ వస్తారు.

కవిత మాట్లాడలేని దాన్ని విమర్శ ఎత్తి చూపుతుంది అంటాడు ఫ్రై. పాఠకుల అవగాహన కోసం విద్యార్థులకు విద్య కోసం విమర్శ పనికి వస్తుంది. ఇంకా రచన ప్రకాశించడం కోసం పాఠకుల విజ్ఞానాభివృద్ధికి, వారి ఆలోచనా ప్రేరణకు విమర్శ అవసరం. పాఠకుడికి మనః చక్షువుకు గోచరం కాని కావ్యగత రమణీయార్థాల గూర్చిన ఆలోచనలో అవగాహనలో మిత్రుడిగా సహకరిస్తుంది. రచయితలకు భవిష్యన్మార్గదర్శి. అతడికి కళా రహస్య బోధినిగా మారుతుంది. విస్పష్ట పరుస్తుంది. పాఠకుల అనిర్వచనీయాను భూతిని అందరకూ అక్షర రూపంలో అందిస్తుంది. ఇలా విమర్శ సాహిత్య జిజ్ఞాసువులందరినీ అలరిస్తుంది. సాహిత్యా స్వాదనసక్తిని శక్తిని పెంచుతుంది. "ఒక కావ్యాన్ని గూర్చిన మూఢాభిప్రాయాలు విమర్శ ద్వారా తొలగించుకోవచ్చు సద్విమర్శ వల్ల వచన వాఙ్మయం వృద్ధి చెందుతుంది. సద్విమర్శతో కవి - విమర్శకు లిద్దరికి కీర్తి ధనప్రాప్తి కలుగుతుంది" అంటారు డా॥ యస్వీ. రామారావు.

మొత్తం మీద ఉత్తమ విమర్శ సమాజంలో నూత్న చైతన్యాన్ని అవగాహనా శక్తిని ప్రసాదిస్తుంది. కనుక సర్వ సాహిత్య ప్రియులకు సమాజానికి అవసరం సద్విమర్శ.

## 4.12 విమర్శ భాష

విమర్శలో ఉపయోగించే భాష ప్రత్యేకంగా ఉండాలా? మరేదైనా మార్పు ఉండాలా అనే ప్రశ్న తలెత్తితే కొంచెం లోతుగా ఆలోచించాలి. దీన్ని గూర్చి ఐ.ఎ. రిఛర్డ్ ఒక ప్రత్యేక వ్యాసాన్నే రచించాడు.

విమర్శ భాష రెండు అంశాల మీద ఆధారపడి ఉంటుంది. కావ్యం తన మీద వేసిన ప్రభావాన్ని, తనకు కలిగిన అనుభూతిని వ్యక్తీకరించే అతడి భాష మొదటి అంశం. రెండవది సాహిత్య విలువలను రచనలో నుండి పృథక్కరించి చూపేటప్పుడు ప్రత్యేక పరిభాష వాడటం.

కళా చర్చ సమయంలో మనం సాధారణంగా వాడే భాష తప్పుదారి పట్టిస్తుందంటాడు రిఛర్డ్స్. ఆ విషయం తెలిసీ మరిచిపోయి వ్రాస్తాడు. విమర్శకులు కాని కేవల కళాస్వాదకుల భాషకూ, విమర్శకుల భాషకూ భేదం ఉంటుంది. కారణమేమిటంటే విమర్శకుడు కళ తాలూకూ విలువల్ని అతడు దృష్టిలో పెట్టుకొని అభివ్యక్తీకరిస్తాడు. సామాన్యుడు తనకు కలిగిన అనుభూతుల్ని బట్టి భాషను వాడుతాడు. విషయం మీద సరైన అవగాహన గలవాళ్లు కళల మీద అభిప్రాయ ప్రకటనకు వాడే శబ్దాలు వేరుగా ఉంటాయంటాడు రిఛర్డ్స్. రచన రూపం సమతౌల్యం నిర్మాణం గ్రథనం అభివృద్ధి అనే శబ్దాలను అన్ని కళలకూ వాడతాం. మళ్లీ చిత్రకళ సంగీత కళ సాహిత్య కళా విమర్శలలో మరికొన్ని ప్రత్యేకమైన పారిభాషిక పదాలను వాడతారు. విమర్శ సామాన్యులు ప్రతిస్పందించే భాషలో ఉండదు. శాస్త్రకారులు పూర్వం నిరూపించిన అన్వయించిన సిద్ధాంతాలను తెలిపే పరిభాషలో ఉంటుంది. అది సంక్షిప్తతను అవగాహనా సౌలభ్యాన్ని కలిగిస్తుంది. శాస్త్రీకరించిన విషయం ఆత్మాశ్రయ లక్షణానికి దూరంగా ఉంటుంది. అందుచేత విమర్శలో ప్రత్యేక భాష అనుభూతికీ వస్తు లక్షణాలకూ మధ్య స్పష్టమైన రేఖ నేర్పరిస్తుంది.

సాహిత్య విలువల్ని వివరించేది ప్రత్యేక పరిభాష. అలంకార రీతి గుణ రస వక్రోక్తుల విషయంలో ప్రత్యేక దర్శనమూ తత్త్వమూ ఉంటాయి. ఇవన్నీ కావ్యాత్మని విలువల్ని తెలిపే ప్రత్యేక శబ్దాలు. అన్ని కావ్య విలువల మీద ఆలంకారికులు సిద్ధాంతాలను ప్రతిపాదించడంలో ఈ పరిభాష ఏర్పడింది. వాటికి తత్త్వమూ దర్శనమూ ఏర్పడి రూఢిలో స్థిరపడ్డాయి. విమర్శ శాస్త్రం ఈ పరిభాషను సాధిస్తుందని విజ్ఞుల భావన. రసం అనే పారిభాషిక శబ్దం చేత, సృజనాత్మక సాహిత్యం వల్ల పాఠక ప్రేక్షకులలో కలిగే అనుభవనానికి ఒక సామాన్య సూత్రాన్ని కల్పించి విమర్శకులకూ సాహితీ స్రష్టలకు సౌకర్యాన్ని కలిగించిన సిద్ధాంతం మరొకటి లేదు. కనుక రస శబ్దం విమర్శ భాష. అవగాహనలో రచనలో సౌలభ్యాన్ని కలిగిస్తుంది ఈ విమర్శ పరిభాష. అయితే వీటిని అనుచితంగా ప్రయోగించరాదు. వీటిని జాగ్రత్తగా వాడటం వల్ల అలంకార శాస్త్రాన్ని కాపాడుకోవచ్చు. ఇంతవరకు ఏర్పడిన జ్ఞానాంశాల సంస్కారంతో సాహిత్య విమర్శల విషయంలో ఒక అడుగు ముందుకు వేయవచ్చు. అంతే గాని అర్థం గాని ప్రత్యేక పరిభాషను సృష్టించుకొని 'విమర్శ సాటి విమర్శకుల కోసమే' అన్నట్లుండకూడదు.

## 4.13 విమర్శ - నిర్ణయాలు - ప్రకటనలు

విమర్శలో అనేక పద్ధతులున్నాయి. ఏ విధానాన్ని అనుసరించి విమర్శించినా రచన మీద కొద్ది నిర్ణయాలు తప్పనిసరి. విమర్శకుడు రచనలోని బాగోగులను గూర్చి నిర్ణయిస్తాడు. విమర్శ శాస్త్రం విమర్శక నిర్ణయాలకు సహకరిస్తుంది. విమర్శ రంగంలో క్లిష్ట భాగం నిర్ణయ భాగమే.

ఎ) అనుభవ రసానుభూతి

బి) రచనా శిల్ప సౌందర్యం

సి) గుణదోష ఔచిత్య విచారం

డి) తత్రచన వల్ల ఏ సిద్ధాంతానికి వన్నె వచ్చింది

అనే విషయాల మీద నిర్ణయాలు వెలువడాలి.

విమర్శ రంగంలో చైతన్యానికి నిర్ణయాలు ప్రధాన భూమికలు. ప్రతిభాశాలి అయిన రచయితను ఈ నిర్ణయాల విషయంలో, కేవలం సిద్ధాంతాలతోనే విమర్శించకూడదు. ఏ ప్రక్రియపైన అయినా విమర్శకుని నిర్ణయాలు సోపపత్తికంగా ఉండాలి. అంటే సూటిగా వాచ్యంగా చెప్పాలి.

### నిర్ణయ ప్రకటనలోని క్లిష్టతలు

రచనా వస్తువు నచ్చిన రచనలో కళా విలువలు లోపించినప్పుడు, కళా విలువలున్నా వస్తు వైశిష్ట్యంలేని సందర్భంలోను, సందేశంతోనూ వస్తువుతోను విమర్శకుడు విభేదిస్తున్నప్పుడు, రచనలో లేని అనుభవం శాస్త్ర విరుద్ధంగా ఉన్నా, అది బాగున్నదని తోచినప్పుడూ రచనానుభవం స్పష్టంగా తెలియనప్పుడూ, కళా విలువలున్నా సామాజిక ప్రయోజనం లోపించినప్పుడు, విమర్శకుడికి సామాజిక దృష్టి ఉన్నప్పుడూ నిర్ణయ ప్రకటనలో విమర్శకుడికి క్లిష్ట పరిస్థితులు వస్తాయి. వాటిని జాగ్రత్తగా విశ్లేషించుకొని వ్యాఖ్యానించాలి, నిర్ణయాలు చెయ్యాలి, ప్రకటించాలి. అవి పాఠకానుభవ విరుద్ధంగా ఉండకూడదు. స్పష్టంగా ఉండాలి. ఉత్తమ విమర్శకుడి నిర్ణయాలు అభిప్రాయ ప్రకటనలు పాఠకులకు జ్ఞాన తృష్ణను కలిగిస్తాయి. అవి స్పష్టంగా ఉంటాయి. సహజంగా ఉంటాయి.

### 4.14 విమర్శకుడికి పాండిత్యావసరం

ఒక సాహిత్య రచనను విమర్శించడానికి ఉండవలసిన ముఖ్యాంశాల్లో పాండిత్యం ఒకటి. ఒక గొప్ప గ్రంథాన్ని చదివే పాఠకుల్లో పలు విధాలవారుంటారు. వారి విద్యాస్థాయులు వేరుగా ఉంటాయి. ఒక రచనను చదివే హక్కు అందరికీ ఉంటుంది. కానీ అందరూ విమర్శించలేరు.

విమర్శ సాహిత్య సంస్కృతిని వృద్ధి చేస్తుంది. పాఠకుడి అనుభూతిని రక్షిస్తుంది. సామాజిక సాంస్కృతిక లాభాలకు దోహదపడుతుంది. పాఠకుడిని చైతన్య పరుస్తుంది. ఇంత బాధ్యతను వ్యుత్పన్నుడైన విమర్శకుడు మాత్రమే చెయ్యగలడు. సామాన్యుడి తరంకాదు. విమర్శకుడు గూడ కవిలాగ ప్రతిభావంతుడైతే విమర్శను మెరిపించగలడు.

ఉత్తమ విమర్శకుడు విమర్శకు ముందు కావ్య పఠనావసరంలో పాండిత్యం మిక్కిలి అవసరం. లేకుంటే గహన విషయాలను గ్రహించలేడు. విమర్శకుడు పూర్వ సిద్ధాంతాల్ని, ప్రస్తుత సిద్ధాంతాల్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకున్న వ్యుత్పన్నుడు కావాలి. విమర్శకుడికి బుద్ధిగతమైన దోషాలు లేకుండా చేసేది పాండిత్యమే. సాహిత్య విమర్శ ఒక శాస్త్రం. విమర్శ ఏదో ఒక్క శాస్త్ర విజ్ఞానంతోనే దాన్ని పరిపుష్టం చెయ్యలేదు. అనేక శాస్త్ర పరిచయం అవసరం. 'నిర్లిప్తుడు గానూ నిష్పాక్షికుడు గానూ వ్యవహరిస్తూ రచన మీద నిర్ణయాలు చెయ్యడానికి, వాస్తవాలను ధృవీకరించు కోవడానికి మనం పండితుని సమీపించాలి. విమర్శకుడు తప్పక ఎంతో కొంత పండితుడు కావాలి. పండితుడేమో ఎంతో కొంత విమర్శకుడు కావాలి' అని చెప్పిన ఇలియట్ మాటలు అర్థవంతాలు.

'పాండిత్యం దేన్ని ప్రారంభిస్తుందో విమర్శ దాన్ని పూర్తి చేస్తుంది. రెండింటికీ దగ్గరి సంబంధం విమర్శకుడికి ప్రయోజనం' అని ఇలియెట్ భాషణం. మంచి పాండిత్యం విమర్శకుని బుద్ధిని మేల్కొల్పే విధంగా సాక్ష్యాలను చూపుతుంది. అది నిర్ణయం కన్న పద్ధతి నిస్తుందని ఇలియట్ ప్రకటించాడు. పండిత విమర్శకుడు రచనలోని వాస్తవాలకు అతీతంగా పోయి ఊహాపోహలు చేయడు. కారణం పాండిత్యమే. అందుకే విమర్శకుడు వాస్తవ దృష్టి కలిగి ఉండాలి.

1. రచనలోని సంప్రదాయ, లేదా అనుభూతి సంబంధమైన 'సత్యాన్ని' గ్రహించాలి. 2. దాన్ని తెలుసు కోవాలంటే రచనలోని ప్రత్యేకమైన భాగాల్ని విడదీయాలి. 3. వస్తు విమర్శన సమయంలో ఆ వస్తువు చుట్టూతా, అలాగే దానిలోపలా ఉండే భేదాల్ని వాటి

ప్రత్యేకతల్ని ఎత్తి చూపి నిలపడం మీదనే సాహిత్య పాండిత్యం అవసరం. ఈ మూడింటినీ కలిపి చూపగలగడమే విమర్శకుని పని. దీనికి విమర్శకుడు వ్యుత్పన్నుడు కావలసిందే. పాండిత్యం లేనివాడు సమీక్షకుడిగానో పత్రికా వివేకంగానో మిగిలి పోతాడే తప్ప విమర్శక పదవీ విరాజితుడు కాలేడు. గ్రాంధిక భాషలో వివరించ దలచినా, వ్యావహారికంలో పూనుకున్నా రచనా వ్యాసంగం సుబోధకంగా రమణీయంగా కమనీయంగా సాగాలి. పాఠక హృదయానికి హత్తుకు పోవాలి.

విమర్శకుడు పండితుడైతే తన విమర్శ ద్వారా, సాహిత్య సంస్కృతిని పోషించ గలుగుతాడు. కనుక పదిమందిని విద్యావంతులుగా చేయవలసిన విమర్శకుడు తప్పక విద్యాధికుడు కావాలి. కావ్య విమర్శకుడికి కవిత్వ మర్మమూ తెలియాలి పాండిత్యమూ కావాలి. తాత్త్వికతా కావాలి.

### 4.15 విమర్శ ప్రక్రియలు

విమర్శ సహజంగా స్వతంత్ర రచనా విధానం గలది. అది సామాన్యంగా వచనంలో ఉంటుంది. ఇది శ్రేష్టమైన ప్రకటన విధానం. వివిధ ఇతర రూపాలలో కూడ ఉండవచ్చు. ఈ వ్యాసాలు వివిధాంశాలకు సంబంధించి ఉంటాయి.

వీరేశలింగం పంతులు గారితోనే, విమర్శ కేవలం ప్రక్రియా విశేషంగా మాత్రమే కాక సామాజిక ప్రయోజన సాధనంగా కూడ ఉపయోగ పడటం మొదలైంది. తెలుగులో విమర్శ సాహిత్యం ప్రక్రియలు అనేకం. పత్రికలు ప్రత్యేక సంచికలు సాహిత్య చరిత్రలు పీఠికలు సిద్ధాంత గ్రంథాలు విజ్ఞాన సర్వస్వాలు లక్షణ విమర్శలు విమర్శలు లేఖలు ఉపన్యాసాలు విమర్శ గ్రంథాలు వ్యాసం గ్రంథ సమీక్ష పీఠిక పేరడి వ్యాఖ్యానం మొ॥నవి విమర్శ సాహిత్య స్వరూపాలు.

పూర్వ విమర్శకుల పద్ధతికి విరుద్ధంగా అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరులూ, కట్టమంచి రామలింగారెడ్డి, రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ, దువ్వూరి రామిరెడ్డి, కావ్యాలలోని గుణదోషాల్ని రెండింటినీ యుక్తి యుక్తంగా చర్చిస్తూ చర్చించారు. పింగళి లక్ష్మీకాంతం, విశ్వనాథ సత్యనారాయణ, నాగళ్ల గురుప్రసాదరావు, కొడవటిగంటి కుటుంబరావు, యస్వీ జోగారావు, జి.వి. సుబ్రహ్మణ్యం, కె.వి. రమణారెడ్డి, రాచమల్లు రామచంద్రారెడ్డి, బూదరాజు రాధాకృష్ణ, ఆవంత్స సోమసుందర్ వంటి కొందరు విమర్శకులు విమర్శలో క్రొత్త అందాలను తెచ్చిపెట్టారు.

### 4.16 సమీక్ష

ప్రక్రియా భేదాలతో ప్రాక్ర్పతీచీ భేదాలతో తెలుగునాట పాఠక హృదయాలకు కావ్యానందాన్ని విజ్ఞానాన్ని పంచిపెడుతూ సాహితీ విస్తృతికి దోహదం చేస్తూ సహృదయతను పెంపొందిస్తున్న విమర్శ అందరకూ ఉపాదేయం.

### 4.17 ప్రశ్నలు

1. విమర్శ లక్షణాల్ని వివరించండి.
2. ఉత్తమ విమర్శకుడి లక్షణాల్ని తెల్పండి.

### 4.18 ఉపయుక్త గ్రంథాలు

1. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
2. విమర్శ మౌళిక లక్షణాలు - ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య
3. సాహిత్య భావలహరి - ఆచార్య యస్వీ జోగారావు

4. తెలుగు విమర్శ - ఆచార్య యస్వీ రామారావు
5. లక్ష్మీరంజన వ్యాసావళి - ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం

**డాక్టర్ మేళ్లచెర్వు భానుప్రసాదరావు**
ఎం.ఏ., ఎం. ఫిల్., పిహెచ్.డి.
రీడర్ - తెలుగు విభాగం
శ్రీ సుబ్బరాయ & నారాయణ కళాశాల
నరసరావుపేట - 522 601

# పాఠం - 5

# విమర్శ - పద్ధతులు

పాఠ్యనిర్మాణక్రమం


5.0 లక్ష్యం

5.1 ప్రాచీన విమర్శ భేదాలు

5.2 అర్వాచీన విమర్శ విధానాలు

5.3 సమీక్ష

5.4 ప్రశ్నలు

5.5 ఉపయుక్త గ్రంథాలు


## 5.0 లక్ష్యం

ప్రాచీన అర్వాచీన విమర్శ భేదాల్ని తెలియచేయటం, అందులో ప్రధాన తత్త్వాన్ని అవగాహన పరచటం.

## 5.1 ప్రాచీన విమర్శ భేదాలు

విమర్శ పద్ధతులు కొన్ని ప్రాచీన కాలం నుంచీ నేటి వరకు అవిచ్ఛిన్నంగా వస్తున్నాయి. అవి, ఏ కాలంలో ఏ దేశంలో ఏ ప్రక్రియలో ఏ విషయాన్ని స్వీకరించి ఏ ప్రయోజనాన్ని ఆశించి రచించబడి నప్పటికీ, అవి ఏ సాహిత్య గ్రంథానికైనా సమన్వయమైతాయి. విమర్శకు కొన్ని నియమాలు ప్రమాణాలూ ఉంటాయి. అవి ఉండటం అవసరం. అయితే అందులో అతివాదం పనికిరాదు. అది అభిరుచికి సంబంధించింది. కనుక

'సర్వ సారస్వతమ్మభిరుచి సాక్షికమ్ము
అది భావ గమ్యము
వ్యక్తి వ్యక్తికి వాసి గలదు
అది సార్వ కాలికమైన సత్యము
కాన నానా కావ్య చర్చల వలదు
వలదతి వాద శౌర్యము'

అని సాహిత్య విమర్శకులను హెచ్చరించారు ఆచార్య ఎస్.వి. జోగారావు గారు. పర్యాలోచిస్తే ప్రాచీన కాలంలో స్వతంత్ర (ఇండక్టివ్) విమర్శ, అస్వతంత్ర (డిడక్టివ్) విమర్శలని విధాన ద్వయంగా వింగడించారు. విమర్శన రీతిని బట్టి దాని స్వరూప స్వభావాల్ని బట్టి ఆ విమర్శలకు నామకరణం చేస్తారు. ఆ దృష్టితో విభజిస్తే వివరణాత్మక అభినందాత్మక తులనాత్మక నిర్ణయాత్మక నైతిక విమర్శనా భేదాలు ప్రధానమైనవి. అనుశీలింపదగ్గవి. ప్రాచీన విమర్శ కవి కావ్యం కావ్యలక్షణాలు లక్ష్య లక్షణ సమన్వయం ప్రాధాన్యమిస్తుంది. ప్రాచీన కావ్యావతారికలు, వ్యాఖ్యానాలు పీఠికల వంటివి ఈ కోవలోవే. సంస్కృత సాహిత్య విమర్శ పంథాలోనే తెలుగు నాట కూడ విమర్శకంగ వెలిగింది.

### 5.1.1. వివరణాత్మక విమర్శ (Descriptive Criticism)

కావ్యాన్ని శ్రద్ధా భక్తులతో పఠించటమే ఈ విమర్శ ధ్యేయం. విమర్శకుడంటే సుశిక్షితుడైన సంస్కారి పండితుడు

అనుభవశాలి అయిన పాఠకుడు. కవి హృదయాన్ని చక్కగా అవగాహన చేసుకోవటంలో వ్యాఖ్యానించటంలో పాఠకునికి తోడ్పడతాడు. వాటి ఆశయాల్ని సిద్ధాంతాల్ని విశ్లేషించడంలో సహకరిస్తాడు. లోతుపాతుల్ని గమ్యాల్ని వ్యాఖ్యానిస్తుంది ఈ విమర్శ. పద్ధతుల్ని వ్యాఖ్యానిస్తుంది. సాహిత్య గ్రంథాల్లోని భాష బహుముఖ ప్రయోజనమైంది. అలంకార శాస్త్ర రహస్యాలు విశేషాలు సౌందర్యాలు కల్పనలు ఐతిహ్యాలు ఇంకెన్నో విశేషాలు నిక్షిప్తమై కావ్య శోభను ఇనుమడిస్తాయి. ఈ పద్ధతి విమర్శలో సాహిత్య ధర్మసూత్రాలు బాహిరమైనవి కాక అంతః సౌందర్య సంబంధమైనవి.

ఈ విమర్శకుడు కవి భావచిత్ర వ్యాఖ్యానంలో నిశిద దృష్టిని అలవరచుకోవాలి. కవి కల్పనలు కావ్య పరమార్థాన్ని చేరుకోవటానికి ఎలా ప్రణాళికా బద్ధంగా తోడ్పడతాయో విమర్శకుడు పాఠకుడికి మార్గ దర్శకం చేయాలి. సైకో ఎనలిస్టు లాగా పనిచెయ్యాలి. అయితే ప్రతి శబ్దాన్నీ చీల్చి చెండాడి కాకదంత పరీక్షణం చెయ్యకూడదు. కళాత్మకంగా సాగాలి.

ఈ విమర్శనాత్మక పద్ధతికి సాంప్రదాయికమైన ఒక ప్రతిపత్తి ఉంది. ప్రాచీన కాలంలో ఈ పద్ధతి ఎక్కువగా పదవాక్య ప్రమాణ లాక్షణిక వివేచనతో పదునెక్కింది. ప్రాచీన కాలంలో కొనసాగిందంతా విమర్శనాత్మకమైన పద్ధతి మాత్రమే. ఇలాంటివి కొన్ని ఉదాహరణలు.

సంస్కృతంలో మల్లినాథ సూరి వ్యాఖ్యాతా, నారామణీయం, శ్రీధరీయం, వీరరాఘవీయం, నీలకంఠీయం వ్యాఖ్యలు ఈ సంప్రదాయానికి చెందినవే. అలాగే తెలుగులోని రాఘవ పాండవీయానికి ముద్దరాజు పెద్దన వ్యాఖ్య, వసుచరిత్రకు సోమకవి, శిష్టు కృష్ణచరా శాస్త్రుల వ్యాఖ్య ఆముక్తమాల్యదకు వేదం వేంకటరాయశాస్త్రి, మనుచరిత్ర ప్రభావత ప్రద్యుమ్నాలకు వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి వ్యాఖ్యలు ఈ కోవలోవే.

ఆధునిక యుగంలో ఐ.ఏ. రిచర్డ్స్, లీవిస్ మొ॥న వారి కృషితో ఇది పరిణతమై పరిమళించింది. నిష్పాక్షికమూ సుందరమూ వివరణాత్మకమూ అయిన విమర్శ పద్ధతి ఉపాదేయమే అయినా అంతటితో విమర్శ ప్రయోజనం పూర్తి కాదు.

వివరణాత్మక విమర్శ పద్ధతి ప్రమాణాలనంగీకరించదు, సరికదా, వాటిని అసంభావ్యాలుగాకూడ పరిగణిస్తుంది. గ్రంథాంతరంగ సంశోధనం మాత్రమే ఈ విమర్శ పద్ధతి బాధ్యత. అందుకోసం సాహిత్య స్రష్టల రివాజుల ప్రకారమే సాహిత్య ధర్మ సూత్రాలను నిర్వచించాలి. ఇందులోని వివరణ విశదీకరణల వల్ల కావ్య సామగ్రి, కళ, పరమార్థం, అనే మూడూ అవగతమైతాయి. అంటే కవి హృదయానికీ కావ్యానికి దర్పణంలాగా ఉంటుంది. అలా చెయ్యడం వల్ల కావ్యం, దాని యోగ్యతను అదే నిరూపించుకొంటుందని అంటారు. ఈ గ్రంథ విమర్శకుడు గ్రంథంలోని గుణదోషాల్ని గురించిగాని కళాధర్మాల్ని గురించి గాని తన సొంత అభిప్రాయాల్ని వ్యక్తం చెయ్యకూడదు. కవి వ్యక్తిత్వంతో గాని కాలమాన పరిస్థితులతో గాని విమర్శకుడికి ప్రమేయం ఉండదు.

## 5.1.2. అభినందాత్మక విమర్శ (Impressiocistic Criticism)

సాహిత్య ప్రయోజనమైన ఆనంద జనకత్వ ప్రయోజన లక్షణాన్ని నిరూపిస్తుంది. అభినందాత్మక విమర్శ. ఆహ్లాదాన్ని అనుభూతిక తెచ్చి కావ్యం పట్ల అభినందన స్పందన కల్గించటమే. మమ్మటుడు చెప్పిన 'సద్యః పరనివృతి' అన్న కావ్య ప్రయోజన పరమార్థాన్ని దర్శింపచేస్తుంది అభినందాత్మక విమర్శ. ఆ గ్రంథం విమర్శకుడి కెలా నచ్చిందో మాత్రమే తెల్పుతుంది ఈ పద్ధతి విమర్శ.

వివరణాత్మక విమర్శ పాఠకుల్ని కావ్యానంద విహాయస వీధిలో విహరింపచేస్తుంది. విమర్శకుడి వ్యక్తిత్వం ఈ విమర్శలో స్పష్టమైతుంటుంది. ఈ విమర్శ పాఠకుడితో ముఖాముఖి నిలిచి తన అంతరంగాన్ని వెలువరిస్తుంది. అందువల్ల ఈ పద్ధతి ఆత్మాశ్రయంగా సాగుతుంది.

| | | |
|---|---|---|
| మహాకవి గురజాడ | - | కృష్ణశాస్త్రి పాట |
| గురజాడను గూర్చిన | - | శ్రీశ్రీ వ్యాసం |
| శ్రీశ్రీని గురించిన | - | ఆరుద్ర వ్యాసం |
| విశ్వనాథ, మాధవపెద్ది సుందరరామ | | |
| శాస్త్రులను గూర్చిన | - | కానూరు వెంకటరామశాస్త్రుల వ్యాసం |
| నన్నయ ప్రసన్న కలితార్ధ యుక్తి | - | విశ్వనాథ |
| కీట్సు మహాకవి రచించిన | - | ఆన్ లుకింగ్ ఇంటు చాప్‌మన్స్ హోమర్ |

వంటివి ఈ విమర్శ కోవకు చెందినవే. ఈ రకం విమర్శలో ఉత్సాహ ఆవేశాలు పెల్లుబుకాయి. నిదానం సంయమనం అంతగా కన్పించవు. కావ్య స్వభావ జీవలక్షణాల్ని పట్టివ్వదు. దాని గొప్పదనాన్ని వేనోళ్ల కొనియాడుతుంది. అందువల్ల పాఠక హృదయం కావ్య పఠనానికి ఉవ్విళ్లూరుతుంటుంది. ఇందులో విమర్శకుడి చిత్త శుద్ధిని అభినందించవలసిందే. కాని కావ్య యదార్ధం దర్శనానికి అవకాశం సన్నగిల్లుతుంది. మంచి చెడ్డల వివరణ ఉండదు. సాహిత్యంలోని సౌందర్యానందాలనే తెలుపుతుంది. ఒకప్పుడది ప్రసిద్ధమయినదే. కానీ దీని పాక్షిక దృక్పథం వల్ల అవ్యాప్తికి లోనైంది. ఈ కాలంలో పీఠికలు గ్రంథ సమీక్షలు ఈ రీతిగానే సాగుతున్నాయి.

### 5.1.3. తులనాత్మక విమర్శ (Comparative Criticism)

ఇదొక ఉన్నతమైన పరిణతమైన విమర్శన విధానం. ఒక సాహిత్య గ్రంథం ఉత్తమమైనదైనా అది సర్వతంత్ర స్వతంత్రంగా వెలిసిందో కాదో తేల్చుతుంది. ప్రకృతిలో ఏదీ సమగ్రంగా సుందరంగా ఉండదు కదా! వస్తు శిల్పరస కావ్యాంగ ప్రయోజనాల వంటి ప్రధాన విషయాలలో అది ఇతర ప్రసిద్ధ కావ్యాలతో అంతో ఇంతో అనుబంధం కలిగే ఉంటుంది. లేదా సంప్రదాయ ఒరవడిలో వచ్చి ఉంటుంది. ఈ విషయాలు బహు గ్రంథ పరిచయంగ సహృదయ విమర్శకుడు రసానుభవానంతరం తన అంతర నేత్రంతో వీటిని వీక్షించి వాటితో తారతమ్య పరీక్ష చేస్తాడు. ఇటువంటి పరిశీలన వల్ల కావ్యం నిగ్గుతేలుతుంది. సర్వోత్కృష్ట కావ్యం ఉండదు కదా! అనేక గ్రంథాలలోని సాహిత్యమర్మాలు సాహితీపరుల కందుబాటులోకి వస్తాయి. సాహిత్య కళా చైతన్యం పురివిప్పుతుంది. విమర్శ కళ వెల్లి విరుస్తుంది.

ఈ విధానంలో ఒక మహాకవి ఆదర్శమార్గాల్ని లక్ష్యంగా తీసుకొని మరొక కావ్యంలో హెచ్చుతగ్గుల్ని విమర్శించవచ్చు. అలాగే ఆధునికి రచనల్లో ఉత్తమ రచనల్ని ఈ దృష్టితో విమర్శించవచ్చు. ఈ రచన వల్ల విమర్శకుడికి ప్రపంచ భాషా సాహిత్యాల్లో పాండిత్యం అత్యావశ్యకం. అంటే విమర్శకుడు పూర్తి స్థాయి విమర్శకుడే కాదు. బహు భాషా కోవిదుడు కూడ. ఒకే ప్రక్రియలోని ఒకే రకమైన రచనల్ని అంచనా వేయడానికి ఒకే కాలంలోని కవుల్ని వారి కవితా రీతుల్ని విమర్శిస్తుంది తులనాత్మక విమర్శ. దీని వల్ల ప్రపంచ సాహిత్య ఔన్నత్యాలు సాధారణ పాఠకుడికి అవగతమైతాయి. అందువల్ల ఈ పద్ధతి ఒక ప్రమాణ విధానంలో పండిత లోకంలో ఉన్నత ప్రపంచ సాహిత్య విమర్శ కోవిదులలో ప్రముఖుడు తెలుగునాట మన గుంటూరు శేషేంద్ర శర్మ. మొత్తం మీద ఈ విమర్శ విధానంతో కావ్యతత్వాన్ని కవి స్థానాన్ని నిర్ణయించవచ్చు.

### 5.1.4. నిర్ణయాత్మక విమర్శ (Judicial Criticism)

ఒకే జాతికి చెందిన విమర్శ విధానంలో ఒక రచనకు గాని ఒక రచయితకు సంబంధించి గాని కొన్ని నిర్ణయాల్ని ప్రతిపాదిస్తుంది. కొన్ని విలువల్ని నిర్ణయిస్తుంది. కొన్ని సిద్ధాంతాలు కొన్ని సూత్రాల ఆధారంగా ఈ నిర్ణయాలు జరుగుతాయి. ఒక గ్రంథం యొక్క సర్వ సుగుణాల్ని పరిగణనలోకి తీసుకొని సాహిత్యంలో దాని స్థానాన్ని నిర్ణయిస్తుంది. అందులో ఆ గ్రంథ భాష శైలి వస్తు స్వభావం రసపోషణ నిర్వహణ పాత్ర చిత్రణం వర్ణనలు అలంకారాలు వ్యక్తిత్వం ప్రాముఖ్యం ఔన్నత్యం మొదలైన

సర్వలక్షణాల్ని పరిశీలించి దాన్ని నిర్ణయిస్తాయి. ఈ విమర్శలో సాహిత్య ధర్మ సూత్రాలు రచయిత పాలిటి రాజ శాసనాలలాగ పరిగ్రహిస్తారు. అందుకు విరుద్ధంగా ఉన్నదాన్ని ఉత్తమ రచనగా పరిగణించదు. అది పాటించే సూత్రాలు అనూచానంగా సంక్రమిస్తున్నవే. ఒక విధంగా ఇది సంప్రదాయ సంబంధ విమర్శ. ఈ విమర్శ విధానంలోని సిద్ధాంతాల మీద సూత్రాల మీద ఆధారపడి ఉంటుంది నిర్ణయ ఫలితం.

ఈ విమర్శ ఇతర అన్ని విమర్శల కృషి ఫలిత సారం అనవచ్చు. ఎలాగంటే వివరణాత్మక విమర్శతో శబ్దార్థ స్వారస్యాల్ని అభినందాత్మక విమర్శతో, సహృదయ స్పందనను తులనాత్మక విమర్శతో, అటువంటి గ్రంథ సముదాయంలో దానికున్న అనుబంధాన్ని వైశిష్ట్యాన్ని వినియోగించుకొని నిర్ణయాలు చేస్తుంది ఈ విమర్శ పద్ధతి. కనుక అన్ని కోణాలలో సాహిత్యాన్ని దర్శించి విమర్శిస్తుంది, నిర్ణయిస్తుందని నిర్ణయించారు ఆచార్య యస్.వి.జోగారావు.

ఇక, ఈ విధానంలో రచయితకు రచనకు స్వేచ్ఛ ఉండదు. లక్ష్య లక్షణ సమన్వయానికే ప్రాధాన్యం ఉంటుంది. అందువల్ల రచనలో వైవిధ్యం ఉండదు. ఒక్క మూసలో నుంచి తీసినవి గానే ఉంటాయి. విలువలు మారుతున్న సమాజంలో పాత సిద్ధాంతాల్ని పట్టుకొని కొలమానంగా చెయ్యటం వల్ల ఫలితాలు అనుచితంగా ఉండవచ్చు. ఎలాగంటే? సంప్రదాయ సాహిత్య ప్రయోజనం ఆనందం. ప్రస్తుత కావ్య ప్రయోజనం సామాజిక ప్రయోజనం. కనుక ఈ విమర్శ పద్ధతి ఈ కాలపు విలువలకు తగినదనిపించదు. ఇది పాక్షికం అవుతుంది.

### 5.1.5. నైతిక (ఎథికల్) విమర్శ

నైతిక విమర్శ విక్టోరియా యుగంలో ఒక ప్రత్యేకమైన నైతిక దృక్పథాన్ని ఆశ్రయించుకొని ఆవిర్భవించింది. సాహిత్య పరమ ప్రయోజనాన్ని గురించి చేసే విమర్శ యిది. ఉపదేశమే సాహిత్య ప్రయోజనమని భావిస్తుందీ విమర్శ. సాహిత్యం మానవుడిని ఉన్నత పథాల వైపు నడిపించాలి. అందువల్ల కావ్యం విధిగా ఆదర్శపథ నిర్దేశం చెయ్యాలి అంటుంది విమర్శ.

కనుక చక్కని గ్రంథం పాఠకుడి మీద ధర్మ విశ్వాస ముద్రను వేయాలని ఈ విమర్శ పథోద్దేశ్యం. ఈ విమర్శకులకు ఆయా కాలాలకు చెందిన నీతిని గూర్చిన కొన్ని అభిప్రాయాలుంటాయి. నీతికి బహుముఖాలుంటాయి. కనుక దేశాంతర కాలాంతరాలకు చెందిన కావ్యాలను విమర్శించటం కుదరదు. అన్ని దేశాలకూ కాలాలకు నీతి నియమాలు ఏక విధంగా ఎన్నటికీ ఉండవు. పైగా కావ్యం అనేది కేవలం నీతి శాస్త్రం కాదు కదా! అది జీవిత ఆశయాల్ని ఆదర్శాల్ని విలువల్ని జీర్ణించుకొన్న కళాఖండం. కనుక కావ్యంలో ఉండవలసింది కళాధర్మమే. ఉపదేశం తదనంతరమే. అది తెరమరుగున ఉండవలసిందే. పాత్ర సృష్టి ద్వారానే నీతి దుర్నీతుల్ని కావ్యం సూచిస్తుంది. కేవలం నీతి మాత్రమే పరమ ప్రయోజనమైతే నీతి గ్రంథాలు ప్రత్యేకంగా ఉండనే ఉన్నాయి. మొత్తం మీద ఈ విమర్శ రీతిని ప్లేటోవంటి వారు సమ్మతించారు.

## 5.2 అర్వాచీన విమర్శ విధానాలు

ఈ అర్వాచీన విమర్శ పద్ధతులు ఆంగ్ల సాహిత్య విమర్శ ప్రభావంతో ప్రభవించాయి. ఇవి అర్వాచీన యుగ సాహిత్య సృష్టిలోని వైవిధ్యాన్ని, ఆయా గ్రంథాల వైశిష్ట్యాన్ని స్వభావ స్వరూపాల్ని గుణగణాల్ని విమర్శిస్తాయి. ఈ నిమర్శ విధానాలు విశిష్టమైన విమర్శ పద్ధతులు. ఇవి అర్వాచీన స్వభావానికి మాత్రమే అతికినట్లుంటాయి. ఇవి క్రొత్త క్రొత్త సిద్ధాంతాల్ని ప్రతిపాదిస్తాయి. క్రొత్త ప్రయోగ వాదాలు విశ్లేషణలతో విస్తరించాయి. వీటిలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు స్వతంత్ర అభిప్రాయాలకు ఆస్కారం ఎక్కువ. తదనుగుణంగా సాగుతాయి. దేశీయ సాహిత్య ధోరణుల్ని విశ్లేషించే సందర్భాల్లో ఈ స్వేచ్ఛా విహరణం విస్పష్టంగా గోచరిస్తుంది.

వీటిలోని ప్రాచ్య రీతులకు తోడు పాశ్చాత్య రీతులు కూడ ఆదరణీయమైనవే. కొందరు ఆంగ్ల భాషాభిమానంతో దేశీయ విమర్శ పద్ధతుల్ని దూరం చేస్తున్నారు. ఇది తగని పని. ఇందువల్ల కావ్య సౌందర్య వివేచనంలో విషమ ఫలితాలు ప్రతిఫలిస్తాయంటారు శ్రీ లక్ష్మీరంజనం గారు. ఈ అర్వాచీన విమర్శ విధానం కళను కళా దృష్టితో కాక సామాజిక ప్రయోజన దృష్టితో సాగుతుంది. ఇవి వింశతి భేదాలకు పైగా ప్రధానంగా గోచరిస్తాయి. చిన్నా చితకా మరికొన్ని భేదాలు వినిపిస్తాయి. ప్రధానమైన విమర్శరీతుల్ని స్థాలీ పులాక న్యాయంగా స్పృశిద్దాం.

### 5.2.1. గ్రాంధిక (టెక్ష్చువల్) విమర్శ

గ్రంథంలోని శబ్ద స్వరూపానికి భాషారీతికి సంబంధించింది ఈ విమర్శ పద్ధతి. దీనికి రూప విమర్శ, సత్య మీమాంసా విమర్శ అని కూడ వ్యవహారం. ఈ విమర్శకు గ్రంథమే ప్రధాన ఆధారం. కనుకనే గ్రంథ విమర్శ అని పేరు. గ్రంథంలోని వివిధాంశాలను పరిశీలిస్తుంది గాని గ్రంథేతర విషయాలను స్పృశింపదు. అంటే కవి జీవితంతో గాని, చారిత్రక సాంఘికాంశాలతో గాని సంబంధం ఉండదు. పాఠ నిర్ణయం సారపాఠ నిరూపణం, అస్పష్ట విషయం స్పష్టీకరణం శబ్ద వ్యుత్పత్తి ఛందో వ్యాకరణాంశాల చర్చ, ఇతర సూక్ష్మాంశాలు, రచనా నిర్మాణ సామగ్రి వస్తువు భావం శైలిని గూర్చిన విషయాల విమర్శ ఉంటుంది. పలు ప్రతుల లోని పాఠాంతరాలతో గ్రంథకర్త ఉద్దేశ నిరూపణం ఇందులోని ముఖ్యాంశం. అధోజ్ఞాపికలు గ్రంథ పరిష్కారం దీని పరిధిలోనివే. గ్రంథంలోని భాష మృతభాష అయినా జీవద్భాష అయినా రెండింటికీ అనువయినదీ విధానం. అలాగా ఒకే గ్రంథానికి అనేక అనువాదాలున్నప్పుడూ ఏది మూల విధేయమో నిగ్గుతేల్చగలదు. మల్లినాధుని పంచకావ్యాల వ్యాఖ్య షేక్స్పియర్ రచనలకు వెలసిన వ్యాఖ్యలు ఈ విధానానికి లోబడి సాగినవే. కేవలం గ్రంథానికి సంబంధించిన వ్యాసాలు పీఠికలు అవతారికలు గ్రంథ సమీక్షలు గ్రంథ సంబంధమైన నూతన భావావిష్కరణలుకు ఈ విమర్శ విధాన మిత్రతార వంటిది. దీనికే పరిష్కరణ విమర్శ అని కూడ పేరు.

### 5.2.2. ఆలంకారిక (రెటోరికల్) విమర్శ

గ్రీకు భారతీయాలంకారికులందరూ ఆలంకారిక విమర్శ పద్ధతినే అభిలషించారు. సామాన్య వ్యవహారానికి కావ్య ఫల్కికకు భేదాన్ని నిరూపిస్తుంది ఈ రచనా విధానం. కావ్య జగత్తుకు అలంకారమే అలంకారం అనే భావం ఈ నాటికీ చాలమంది విమర్శకులకు ఉంది. కవి రచనలలోని వివిధాలంకార భేదాల సూక్ష్మాతి సూక్ష్మ భేదాన్ని విమర్శిస్తుందీ విమర్శ విధానం. సౌందర్య గ్రంథుల్ని విప్పి మెప్పిస్తుంది. చతుర్విధ కవితా విన్యాసాల్ని ప్రదర్శిస్తుంది. పాఠకుడి హృదయ సీమను అలంకరిస్తుంది. ఈ విమర్శ పద్ధతి పరాశ్రయ సంబంధి. అంటే ప్రసిద్ధాలంకారికులు సూత్రపరచిన విధానాల్ని ప్రామాణికంగా గ్రహించి కావ్య విమర్శ చెయ్యడం. ఇది నలిగిన బాటలో నడవటం వంటిది. కావ్య సంబంధమైన శాశ్వత సత్యాల్ని ఆదరించటానికి ఈ ఆలంకారిక విమర్శ పద్ధతి ఆశ్రయణీయం. అయినా ఈ విమర్శలో కూడ సార్వత్రిక సార్వకాలిక సాహిత్య సూత్రాల్ని కల్పించటం కష్టమైన విషయమే.

### 5.2.3. సాంప్రదాయిక (క్లాసికల్) విమర్శ

ఈ పద్ధతికి రూపశిల్పి అరిస్టాటిల్. దీనికి ప్రాచీన విమర్శ అని కూడ వ్యవహారముంది. ఈ విమర్శవాదులు అరిస్టాటిల్‌ను అనుసరిస్తూనే సాంప్రదాయిక సాహిత్య స్వరూప స్వభావాల్ని గూర్చిన పాండిత్యాన్ని నిర్దిష్టమైన భావాల్ని కలిగి ఉంటారు. ఆ సంస్కార బలంతోనే సమకాలీన సాహిత్యాన్ని కూడ సమన్వయిస్తారు. ఆ సంప్రదాయపు సత్తువ చాల గొప్పదని వీరు భావిస్తారు. ఈ ప్రాచీన విమర్శ అంతా విధేయాత్మక మయిందనిపిస్తుంది. అంతా కవి, కవిత్వ లక్షణాలపైనే సాగుతుంది. పురాణాలు ఇతిహాసాలు ప్రబంధాలు శతకాలు మొదలైన సంప్రదాయ సాహిత్యం మీద సాగిన విమర్శ అంతా ఈ కోవలోనిదే. ఇందులోని

ప్రాచీన కవితా విలువలు ఆధారంగా అధునాతన గ్రంథాలను విమర్శిస్తారు. అధునాతన కవితారీతుల్ని అధఃకరిస్తారు. ఏమైనప్పటికీ ప్రాతదంతా పరమమని క్రొత్తదంతా చెత్తదని భావించలేము. విశ్వజనీన భావన చెయ్యాలి. భాషా విషయానికి వస్తే సంప్రదాయ విమర్శ అంతా గ్రాంథిక భాషలోనే సాగింది. ఆ తరువాత కొంత పట్టు సడలి వ్యావహారిక భాషలోనూ సాగింది. ఇందులో భక్తి వేదాంతాల వంటి అంశాల మీద విమర్శ సాగినా ప్రధానంగా కళకళ కోసమనే భావమే కన్పిస్తుంది. అరిస్టాటిల్ కంటె భరతుడే ఈ సాహిత్య సంబంధమైన విషయాల్ని కూలంకషంగా భావించాడు.

## 5.2.4. పునర్నవ (నియో క్లాసికల్) విమర్శ

సాహిత్య విమర్శను గూర్చి అరిస్టాటిల్ భావానికి జోడింపుగా హోరేస్, క్విట్టిలన్ వంటివారు కొంత భావించారు. తరువాత సంఘం ఎంతగానో పరిణతి చెందింది. అలాగే సాహిత్యం కూడ క్రొత్త పుంతలు త్రొక్కింది. అయినా పునర్నవ సంప్రదాయవాదులు వాటిని పూర్తిగా స్వాగతించలేక పోయారు. నిరోధించే ప్రయత్నం చేశారు. వారు ప్రాచీన సంప్రదాయ బాహ్య స్వరూపాన్ని ఉపాసించారు. వస్తు నూతనత్వానికి విముఖులైనారు. రచనా రీతిలోనూ సంప్రదాయాన్నే సమర్థించారు. ఈ విమర్శలో ప్రతీక వాదం సంగీత శాస్త్ర సిద్ధాంతాలు మమేకమైనాయి. ఇందులో కవి జీవితాన్ని గూర్చి ఆతని వ్యక్తిత్వాన్ని గూర్చిన ప్రసక్తి ఉంటుంది. విశ్వ జనీనత వాస్తవాశ్రయ ధర్మం విషయ విస్పష్టత కళాకౌశలం భాషా భావాల సమన్వయం గూర్చిన ఈక్షణ ఉంటుంది. ఇది ఆలంకారిక విమర్శకంటె కొంత భిన్నంగా ఉండే ప్రాత కొత్తల మేలు కలయిక. ప్రాచీన విలువలే ప్రాణప్రదమైన ప్రామాణికాలు ఎదిగినది ఈ విమర్శ.

"పురాణ మిత్యేవ నసాధు సర్వం
న చాపి కావ్యం నవ మిత్య వద్యం
సతః పరీక్ష దన్యతరః భజంతే
మూఢః పరప్రత్యయ నేయ బుద్ధిః"

పాతదంతా ఆ పాతమధురమనీ క్రొత్తదంతా చెత్తదనీ భావించకూడదు కదా! వైవిధ్యం లేకుండా ఒకే మూసలోని వస్తువుల్లాగా, వైవిధ్యం లేని సాహిత్యం చవులూరించదు కదా! తెలుగులో విశ్వనాథ ఆయన శిష్యులు నవ్య సంప్రదాయాన్ని నవ్య సంప్రదాయ విమర్శను ప్రోత్సహించారు. ఈ విమర్శకే నవ్య సంప్రదాయ విమర్శ అని కూడ పేరు. ఇది ఆంగ్ల సాహిత్య విమర్శ ప్రభావంతో ప్రాదుర్భవించింది.

## 5.2.5. కాల్పనిక (రొమాంటిక్) విమర్శ

కాల్పనిక విమర్శనే రొమాంటిక్ క్రిటిసిజం అంటారు. ఈ కోవలోని కవిత్వమూ విమర్శలూ మొదటి ఇటాలియన్ స్పానిష్ రుమేనియన్ మొ॥న రొమాన్స్ భాషలలో ఆవిర్భవించింది. అందువల్ల ఆ పేరు వచ్చింది. తరువాతి కాలంలో జర్మనీ ఇంగ్లాండు వంటి దేశాల్లో ప్రవేశించింది. అటునుండి తిన్నగా ఆంధ్రదేశం చేరింది. ఆంగ్లభాషా సాహిత్యంలోని రొమాంటిక్ పొయిట్రీని విశ్లేషించటానికి తెలుగు సాహిత్యాన్ని ఆక్రమించింది. కాల్పనిక కవిత్వంలోని ఊహలకు భావాలకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. అలాగే రచయితల అనుభవ సాక్షికంగా ఆవిష్కరించటం ఈ ఉద్యమ లక్ష్యం. ఇది అందువల్ల ఆత్మాశ్రయ రీతికి చెందిన విమర్శ. ప్రాచీన సిద్ధాంతాల నుండి సాహిత్య స్రష్టకు సంపూర్ణ స్వేచ్ఛ ఉండటం దీనిలోని ప్రత్యేకత. వీరి రచనలలో వస్తు ప్రాధాన్యం ఉంటుంది. ఇందులో వాస్తవిక దృక్పథం ఉండదు. తెలుగు నాట వెలసిన భావకవితా విమర్శ దీనికి సంబంధించినదే అనవచ్చు. కాల్పనిక కవులకు చెందిన మనస్తత్త్వాన్ని ప్రేమ తత్త్వాన్ని ప్రకృతి ప్రీతిని ఇంకా ఇతరాల్ని ఈ విమర్శ విశ్లేషిస్తుంది.

### 5.2.6. కవి జీవితానుశీలన (బయోగ్రాఫికల్) విమర్శ

ఈ విమర్శ పద్ధతి ప్రకారం సాహిత్య పఠనం సాహిత్యం కోసమే కాదు. కవి జీవిత విశేషాల్ని జీవిత గమన వైఖరిని, మనస్తత్వాన్ని సమకాలిక సమాజంలోని సమస్త విషయాల్ని పరిశీలిస్తుంది. ఆయా అంశాల్ని ఆయా శాస్త్రాల సంప్రదాయాల్ని వ్యాకరిస్తుంది. పరామర్శిస్తుంది. వాటిని ఆ రచనకు దారి తీసిన కారణాలుగా నైపథ్యాలుగా విశ్లేషిస్తుంది. వాటి ప్రభావాన్ని ప్రయోజనాన్ని విశదీకరిస్తుంది. ఇందువల్ల ఆలంకారికులు లాక్షణికులు సిద్ధాంత సూత్రాల ప్రాధాన్యం చాలవరకు తగ్గుతుంది. కనుకనే టి.ఎస్. ఇలియట్ ఈ పద్ధతి ప్రయోజనానికి ఒక పరిమితి ఉంటుందన్నాడు. అన్ని విషయాలను కవి అనుభవించి వ్రాయాలంటారీ విమర్శకులు. తిక్కన శ్రీనాథుల వంటి వారి రచనలలో కొన్ని సందర్భాల్లో ఆ అనుభవాలు కన్పిస్తాయి. కానీ అన్ని వేళలా సాధ్యపడదు. కవి క్రాంతదర్శి కనుక ఏదైనా గ్రహించి రచిస్తాడు. నోబెల్ బహుమతి గ్రహీత సోమర్ సెట్‌మాం 'పోర్టర్' అనే నవలను రచించటానికి పోర్టర్ పని చేసి ఆ అనుభవంతో సుప్రసిద్ధమైన నవల రచించాడంటారు. ఇలా అందరికీ అన్ని వృత్తులూ సాధ్యపడవు. కనుక రచనలోని వారి ఆత్మీయతను గ్రహిస్తే సరిపోతుంది. ఈ విమర్శలో ప్రధానంగా పరిశీలించ దగినవి.

1. కవి జీవించిన కాలం.
2. కవి జీవించిన సమాజం.
3. కవి జీవన యాత్ర.
4. కవి రచనా శిల్పం.

ఈ విధమైన విమర్శలో విమర్శకుడు పక్షపాత వైఖరి నవలంబించే ప్రమాదం ఉంది. మొత్తం మీద దీని వల్ల కవి ఆత్మీయత వ్యక్తిత్వం ఆతని మానసిక తాత్త్విక విశేషాలు అతని కావ్యంలో ఎలా ప్రతిఫలిస్తాయో తెలుస్తుంది.

### 5.2.7. సాంకేతిక (టెక్నికల్) విమర్శ

ఇది రచనా ప్రక్రియకు శిల్పానికి సంబంధించింది. ఇందులో ఏ సాహిత్య గ్రంథం ఏ సారస్వత ప్రక్రియకు సంబంధించిందో గుర్తిస్తారు. ఆ ప్రక్రియం సంప్రదాయాల్ని కవి ఎంతవరకు ఆ రచనా నిర్మాణంలో పాటించాడో విశ్లేషిస్తారు. డ్రైడెన్ కాలరిడ్జి, టి.ఎస్. ఇలియట్‌లు ఈ విమర్శ పద్ధతిలో విజయకేతనాల్ని ఎత్తారు. ఈ ప్రక్రియ పరిశోధనకు మిక్కిలి ఉపయుక్తంగా ఉంటుంది. అయితే ఈ విమర్శలో దృష్టి రచనా శిల్పం మీదనే ఉంటుంది. వస్తు సమీక్షణానికి ఇంత దూరం అవుతుంది. అందువల్ల గ్రంథ వస్తు స్వభావం రసపుష్టి సందేశం అంతరంగం వంటి వాటి వివేచన నీళ్లు వదలుతుంది. అంటే కవి ప్రతిభను కావ్య హృదయాన్ని గ్రహించి, విమర్శకుడు తన అనుభూతిని ప్రకటించటానికిది తగిన భూమిక కాదు ఈ సాంకేతిక విమర్శ పద్ధతి.

### 5.2.8. సిద్ధాంత విచార (థియరిటికల్) విమర్శ

ఈ విమర్శ సౌందర్య దృక్పథ పద్ధతికి మానస పుత్రిక వంటిది. ఒక కళా ఖండంలో అంతర్నిహితంగా ఉన్న సౌందర్య సూత్రాలకు సంబంధించిన ప్రక్రియా పరిశీలనతో కూడి ఉంటుంది ఈ విమర్శ విధానం. అయితే విమర్శకుడికి కళాదృష్టి ఒక్కటి మాత్రం సరిపోదు కదా! మొత్తం మీద దీనిలో సౌందర్య దృష్టి అధికం. దీని ఆద్య ప్రవర్తకుడు అరిస్టాటిల్.

### 5.2.9. సామాజిక (సోషలాజికల్) విమర్శ

రచయితకు సమకాలికాలైన సాంఘిక పరిస్థితులను గుర్తిస్తుంది ఈ విమర్శ రీతి. కవి నాటి యుగ ప్రభావం గ్రంథంలో ఎలా ప్రసరించిందో గుర్తిస్తుంది. ఆనాటి స్థితిగతులను వివరిస్తుంది. సంస్కృతీ సంప్రదాయాల్ని వెలువరిస్తుంది. ఉదాహరణకు తిక్కన నాటి రాజకీయాలు యుద్ధ తంత్రాలు, పెండ్లి తంతులు, ఆముక్తమాల్యదలోని జనజీవనం, లోకంపోకడలు, అలాగే ఇతర కవుల రచనలలోని సామాజిక విషయాలు విశేషాలు వెలుగు చూస్తాయి. ఇలా గ్రంథంలోని సామాజిక పరిస్థితులను సందర్శించవచ్చు.

ఇది చాల అవసరమే. కాని దీని వల్ల మౌలికమైన కళా ధర్మం మూలనపడుతుంది, కనుమరుగైతుంది. అయితే ప్రతి కవిలోని సామాజిక చైతన్యంతో పాటు వ్యక్తిగత చైతన్యాన్ని కూడ గుర్తించవచ్చు. ఈ విధమైన విమర్శన విధానం ప్రాచీనమే అయినా ఆధునిక కాలంలో ప్రాచుర్యాన్ని సంతరించుకుంది.

## 5.2.10. పౌరాణిక (మైథలాజికల్) విమర్శ

పురాణాల్లోనిది గాని లేదా కావ్యాల్లోనిది గాని, ఇతర రచనలలో గాని కల కళాపరిశీలనంతో పాటు సంస్కృతీ వారసత్వాన్ని వైజ్ఞానిక మానసికాంశాల్ని ఇతర విషయాల్ని వెలికిదీసి వెలార్చుతుందీ విమర్శ. దీనిలో సూక్ష్మమైన కావ్య పరిశీలనం సాగుతుంది. ఆయా అంశాల్ని బట్టి విమర్శనా రీతుల్ని మార్చుకుంటూ సాగుతుంది పౌరాణిక విమర్శ.

ఈ విమర్శ పద్ధతి కవి భావుకతా స్థాయిని కూడ నిర్ణయిస్తుంది. రచన మీద మనకెందుకు మక్కువ కలిగిందో గుర్తించి విశ్లేషిస్తుంది. అంతేకాని ఇతర విషయాలకిందులో ప్రాధాన్యం ఉండదంటారు కొందరు. ఇది ఆధునిక విమర్శనా పద్ధతుల్లోనూ ప్రాచుర్యాన్ని పొందింది. ఇందులో విమర్శకుడి వైదగ్ధ్యం వెల్లడైతుందే కాని సత్య స్వరూప సమ్యగ్దర్శనం కాదని కొందరి అభిప్రాయం. సాహిత్యపు విలువలు సంవ్యక్తం కావంటారు మరికొందరు.

## 5.2.11. సౌందర్య దృక్పథ (ఈస్థటిక్) విమర్శ

కళను కళగా దీపించేది సౌందర్యం. ఆ సౌందర్యం మనకందించేది ఆనందం. కాళాఖండాలలో నిక్షిప్తమైన సౌందర్యాన్ని కర్తృ కౌశలాన్ని నిరూపిస్తుంది సౌందర్య దృక్పథ విమర్శ. కళ కళ కొరకే అనేది దీని సిద్ధాంతం. ఇందులో సౌందర్యం ఒక్కటే విలువైంది. దీనికి సత్య నిష్ఠతో గాని నైతిక విలువలతో గాని నిమిత్తం ఏ మాత్రం లేదు. కళా ఖండపు ఆత్మ పదార్థాన్ని మాత్రమే పరిశీలిస్తుంది. సత్యం శివం సుందరం అని మనవారి ఆశయం. కాని సత్యానికి శివానికి సౌందర్యంతో నిమిత్తం ఉండదు ఈ సిద్ధాంత వాదంలో. అదే దీనిలోని పెద్ద లోపం. ఈ విమర్శకుడు కావ్యంలోని ఇతర విషయాల్ని స్పృశించడు. విమర్శించడు విదూరుడైతాడు. శశాంక విజయం వంటి వాటిలో కవితా సౌందర్యం ఉంది. కాని సత్య శివాలకు దూరమైంది. అందుచేతనే దాన్ని అసత్కావ్యంగా భావించి అవతల పెట్టారు. కనుక నీతిబాహ్యమైన సౌందర్యాన్ని లోకం గౌరవించ దీని స్పష్టమైతుంది.

## 5.2.12. నవ్య (న్యూ క్రిటిసిజం) విమర్శ

సాహిత్య గ్రంథాన్ని గూర్చిన ఆంతరంగిక దృక్పథాన్ని వెలువరిస్తుంది న్యూ క్రిటిసిజం. మనస్తత్వ శాస్త్రీయ సామాజిక మార్క్సిస్టు పద్ధతులతో సాంఘిక మూల సంస్కార వాద విషయాల్లో నాటి మేధావులకు ముఖం మొత్తిన కారణంగా వెలిసింది ఈ నవ్య విమర్శన విధానం. ఈ త్రోవన నడిచిన ప్రముఖులు జె.సి.రస్తమే, ఎలన్సే స్టోటే, ఆర్.పి. వారెంట్, ఆర్.పి. బ్లాక్ బూర్ పండితులు. కాలరిడ్జి, హెన్రీ జేమ్సు, ఎజ్రా పౌండ్, ఐ.ఏ. రిచర్డ్స్ వీరికి స్ఫూర్తి ప్రదాతలు. కాని వారికి సజీవ స్ఫూర్తి మార్గ దర్శకులు టి.ఎస్. ఇలియట్. కవిత్వం ఒక ప్రత్యేక శాఖ అని, ఆ మాటకు వస్తే ఇతర విజ్ఞాన శాస్త్రాల కంటె కూడ గొప్పదని వీరి అభిప్రాయం. అర్థం బోధపడాలంటే కావ్యంలో ఉన్న సాంకేతిక పదాలు పరికరాలు ఆకృతి విశేషాలు అలంకార శిల్పాలు తెలియాలని వీరి పరిపూర్ణ విశ్వాసం. కావ్యానికి సంబంధించిన వస్త్వలంకార ధ్వని విశేషాలన్నీ విస్పష్టంగా ఆలోచించాలని వీరి దృఢ విశ్వాసం. ఒక విధంగా ఈ విమర్శ విధానం మన భారతీయ ధ్వని సిద్ధాంతం వంటిదే.

## 5.2.13. చారిత్రక (హిస్టారికల్) విమర్శ

ఒక కళాఖండపు పుట్టు పూర్వోత్తరాల్ని కేవలం ఆ యుగం లోని కళాత్మక స్వభావ ప్రభావలతోనే కాకుండా, దాని

సమకాలిక సామాజిక సామాన్య పరిస్థితులతో సరిపోల్చి పరిశీలించటం చారిత్రక విమర్శ విధానం అని హెరాల్డ్ ఆన్ బోర్న్ అభివర్ణించాడు. అది ఏ విధమైన కళాఖండం అయినప్పటికీ అది స్వయంజనితం కాదని, అది ఒక చారిత్రక సన్నివేశమని ఈ విమర్శకుల గాఢ భావన. ఏ రచయిత అయినా సరే అంతో ఇంతో చారిత్రక ప్రభావానికి లోనుకాక తప్పదు. సామాజిక మానసిక ఆర్థికాది సంఘటనలెన్నో రచయిత మీద, ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రభావం చూపకమానవు. అవి అతని రచనలో ప్రతిఫలిస్తాయి. ఈ విమర్శ వాటినన్నింటిని విశదీకరిస్తుంది. ఒక కళాఖండం ఎంత వరకు చారిత్రక సాక్ష్యంలోను, అవిచ్ఛిన్నమైన సాహిత్య సంప్రదాయంలోను భాగస్వామ్యం వహిస్తుందో వెల్లడిస్తుంది. ఒక రచన జన్మించిన యుగంలోను దానికి ముందున్న కాలంలోను కళను గురించి సాగిన సమాలోచనాన్ని కూడ ఈ విమర్శకుడు పరిశీలించాలి. ఆనాటి సాంఘిక తాత్త్విక సాహిత్య దృక్పథ సమీక్ష కూడ ఈ పరిధిలోనిదే. ఇది కవి కాలాలను నిర్ణయిస్తుంది. గ్రంథ పరిష్కారానికి సహకరిస్తుంది. రచనలోని ఉచితానుచితాల నిర్ణయానికి ఉపకరిస్తుంది. కవి జీవిత విమర్శకులకు చారిత్రక విమర్శకులకు పరస్పరం అవసరం ఉంటుంది. మార్క్సిస్టు విమర్శ సామాజిక విమర్శ దీని శాఖలే.

## 5.2.14. మార్క్సిస్టు విమర్శ

ఈ మార్క్సిస్ట్ విమర్శకే గతితార్కిక చారిత్రక భౌతిక వాద విమర్శ అని పేరు. దీని సిద్ధాంతకర్త మార్క్స్. అతడి పేరుతో మార్క్స్ విమర్శ అని వ్యవహారంలోకి వచ్చింది. ఒక మార్క్సిస్టు సాహిత్యాన్ని ఏ విధంగా ఏ దృక్పథంతో పరిశీలించి విమర్శించి విలువకడతాడు అనే విషయం ఆధారంగా ఈ పదమూ ఈ విమర్శనా పద్ధతి రూపొందాయి. కనుక మార్క్సిస్ట్ విమర్శ అంటే మార్క్సిస్ట్ దృక్పథంతో చేసే విమర్శ అని గుర్తుంచుకోవాలి.

దృశ్య జగత్తులోని ప్రతి విషయానికీ అన్వయమయ్యే మూడు మౌలిక సూత్రాలమీద ఆధారపడింది మార్క్సిజం. కళలకూ కళా విమర్శలకూ కూడ అవే సూత్రాలను అన్వయించటం వల్ల మార్క్సిస్ట్ విమర్శ అనే పేరు వచ్చింది. ఇందులో చారిత్రక భౌతిక వాద సూత్రాలు మానవ చరిత్ర పరిణామ సూత్రాలు, మార్క్సిజం నైపథ్యం ముఖ్యంలో ఉంటాయి. వస్తువు ప్రగతిశీలమైందా కాదా వర్గ చైతన్యాన్ని కల్గించేదేనా, శ్రామిక వర్గ భద్రతను గూర్చి రచనలో ఉన్నదా లేదా అని దర్శిస్తాడు మార్క్సిస్ట్ విమర్శకుడు. కళార్ద్రత ఉన్నప్పటికి సాంఘిక అభ్యుదయానికి పాటుపడనట్టయితే దాన్ని ఈ విమర్శకులు ఆదరించరు. కావ్యానంద విషయంలో అలంకార శాస్త్రంలో లేని వాటిని దానికి అంటగడతారు. చరిత్ర తెలీని సందర్భాల్లో కూడ ఆ సూత్రాల్ని అన్వయించటం ఈ విమర్శలోని లోపం. ప్రతి విమర్శ పద్ధతికి పరిమితులున్నట్లే దీనికి కొన్ని పరిమితులున్నాయి. తెలుగునాట యిది ఇంకా వికాసదశలోనే ఉంది.

## 5.2.15. మనోవిజ్ఞాన శాస్త్ర భూమిక విమర్శ

ఇందులో పాశ్చాత్య విమర్శకులు మనస్తత్వ శాస్త్ర పరిజ్ఞానాన్ని సాహిత్య విమర్శకు ఒక పరికరంగా ఉపయోగించుకుంటారు. స్త్రీ పురుష సంబంధాన్ని గురించి స్వప్నాల గురించి ఫ్రాయిడ్ కనిపెట్టిన అంశాలు, ఆత్మవిశ్వాసం నశించి తమను తామే కించపరచుకొనే మనుష్యుల స్వభావాన్ని గురించి ఏడ్లర్ వ్రాతలూ జాతి సామూహిక సుప్తచైతన్యాన్ని గురించిన జంగ్ సిద్ధాంతమూ - ఇవన్నీ సాహిత్యాధ్యయనానికి కూడా ఉపకరిస్తాయని ఈ విమర్శకుల భావం. ఈ మనోవిజ్ఞా శాస్త్రానికి రూపశిల్పి హెర్బర్ట్ రీడ్. కళా మూలాల్ని కళోత్పత్తిని గూర్చి ఈ శాస్త్రంలో సాహిత్య విమర్శకుడికి ఈ శాస్త్ర సాయంతో తెలుస్తుంది. మనోవిజ్ఞాన శాస్త్రానికి విమర్శ శాస్త్రానికి మౌలిక భేదాలున్నాయి. మనో వ్యాపారం వల్ల ఉత్పన్నమయ్యే విషయాల్ని గురించి వివేచిస్తుంది. ఆయా విషయాల్లో కళ విశేషమయింది. రీడ్ దృష్టిలో మనోవిజ్ఞాన భూమికలో చేసే విమర్శ సాహిత్య పరిధి దాటదు. కళా సృష్టి చేసే మనసును గురించి మనో విశ్లేషణ అనేక వివరాలు ఇస్తుంది. కాల్పనికత మనో విశ్లేషణ న్యూరోసిస్ - కళలు, సౌందర్యం - ఆనందం అనే వాటికి ఇందులో ప్రాధాన్యం ఉంది. అయితే రచయితను ఒక న్యూరోటిక్ రోగిగా భావించి మనో విశ్లేషణ చెయ్యటం నిష్ప్రయోజనం. ఈ విధానాన్ని వైద్యశాస్త్ర పరంగా రచయిత మీద ప్రయోగించటం సమర్థనీయం కాదు.

### 5.2.16. ప్రాదేశిక (టోపోగ్రాఫికల్) విమర్శ

దీని రూపకర్త డా॥ యస్వీ జోగారావు గారు. ఇందులో కవి నివసించిన ప్రదేశపు స్వరూప స్వభావాలు భౌగోళికంగా దాని నైసర్గిక శీత వాతాతపాది పరిస్థితులు, వాటి వలన అక్కడ వృద్ధి చెందిన వృక్షజాలం ప్రాణికోటి అతని పరిసరాలు అన్నిటినీ గూర్చిన పరిశీలన గతార్థమైతుంది. మానవుడి జీవిత గమన శైలి అంతా వానిమీద ఆధారపడి ఉంటుంది. అతడి ఆహార విహారాలు వేష భాషలు వృత్తి ప్రవృత్తులు సంసారపు సరిగమలు బరువు బాధ్యతలు సంబంధ బాంధవ్యాలు అన్నీ అతని రచన మీద ప్రసరిస్తాయి, ప్రతిబింబిస్తాయి. సాహిత్యంలోని నవరస పోషణలో సర్వ దేశాలలోను అవి పోషింపబడిన తీరు భిన్న భిన్నంగా ఉండటం గమనించగలం. ప్రాదేశికమైన భేదాలే వారి అభిరుచులకు, తదనుగుణమైన రచనాక్రమానికి మూలం మూలం. కనుక ఒక సాహిత్య గ్రంథంలోని ఆంతర్యాన్ని సర్వస్వాన్ని గ్రహించాలంటే ఈ పద్ధతి విమర్శ ఉపకరిస్తుంది.

### 5.2.17. సముద్దేశ నిర్ణయ విమర్శ

ఉత్తమ ప్రమాణాలతో గ్రంథ విలువల్ని నిర్ణయించటమే విమర్శ శాస్త్రం యొక్క ధ్యేయమని హెర్బర్ట్ రీడ్ అభిప్రాయం. ఒక సాహిత్య గ్రంథంలో గల సాహిత్య విలువల్ని వెలువరించడం ఈ విమర్శ పద్ధతి విధి.

### 5.2.18. తర్కసహ పద్ధతి

మానవోన్నతికి వలసిన నైతిక ప్రతిపత్తులు గల ఇతి వృత్తాలతోను మానవాళిని ప్రభావితం చేసిన ప్రముఖ చారిత్రక సన్నివేశాల్ని సమర్థంగా వ్యాఖ్యానించగల పద్ధతులతో రూపొందింది ఈ తర్కసహ విమర్శ పద్ధతి.

### 5.2.19. మౌలిక విమర్శ

సాహిత్య సృష్టికి గల మౌలిక సత్యాలకు సంబంధించిన విచికిత్స ఇందులో ప్రధానం. కావ్యంలోని గుణదోషాల్ని వదలి, అసలు కవిత్వం ఏది, ఎందుకు ఆ కావ్యం పుట్టింది అది సాధించిన ప్రయోజనం ఏమిటి, అంటూ దాని మూల ప్రకృతిని అన్వేషించటం ఈ విమర్శ లక్ష్యం. దీన్ని 'జార్జ్ సైంట్ బరి' అమితంగా ప్రశంసించాడు.

### 5.2.20. వర్ణనాత్మక పద్ధతి

ఇది సాహిత్య గ్రంథాలకు సంబంధించిన చర్చ వ్యాఖ్యానం విశ్లేషణ అభినందన మొదలైన విషయాల మీద ఆధారపడి ఉంటుంది. చదువరి అనుభూతుల్ని విస్తృతపరచటం దీని ధ్యేయం. ఈ విమర్శకు పితామహుడు డ్రైడెన్ (1668). ఇప్పటికీ ఇది అనేక విధాలుగా దాని పరిధిని పెంచుకొంటున్నది.

### 5.2.21. మౌలిక పరిణామ దృక్పథ (ఒన్టోజెనెటిక్) విమర్శ

ఇది సామాజిక పద్ధతికీ మనస్తత్వ శాస్త్రీయ పద్ధతికీ మధ్య ఒక సౌహార్ద్ర సేతువును నిర్మించే యత్నం చేసింది. ఈ పద్ధతి సర్వ సాహిత్య విమర్శకీ మూలమయింది. అందువల్ల సాహిత్య విమర్శకీ నైతిక ఆధ్యాత్మిక ఆదర్శ దృక్పథ సంబంధం కలిగిన అన్ని విమర్శ పద్ధతులకు కూడ దీన్ని మూలాధారమయిందిగా భావించారు. కవి యొక్క వ్యక్తిగత మనస్తత్వంతోను అతడున్న సమాజంలోని ఆర్థిక వ్యవస్థను, అతడు సృజించిన కళాఖండం యొక్క మౌలిక రూపురేఖల్ని పొదుకొని ఉంటుంది. ఇలా దీని రూపకర్త అయిన హెర్బన్సురీడ్ అభిప్రాయపడ్డాడు.

### 5.2.22. ప్రమోదకాముక (హెడోనిస్టిల్) విమర్శ

ఇది ఈస్థటిక్ స్కూలుకు చెందిన ఒక అవాంతర పద్ధతి. కళాస్రష్ట ఒక ప్రవక్తలాగా వ్యవహరించిటం తగదని వాల్టన్ పీటర్, ఎడ్డింగ్‌టన్, సైమండ్స్, ఆస్కార్ వైల్డింగ్‌లు భావించారు. వారే దీని రూపశిల్పులు. 'గాట్‌మన్' వంటి 'కళ కళ కొరకే' అని చెప్పిన ఫ్రెంచి విమర్శకుల మూల సూత్రాల మీద ఆధారపడి వీరు సౌందర్య శాస్త్ర సంబంధమైన ఈ వాదాన్ని సృష్టించారు. ఈ విమర్శకులకు వాస్తవికత మీద మక్కువ మిక్కిలి తక్కువ. సమకాలీన సామాజిక నిత్య బాధా విముక్తి కోసం ఒక కళా జగత్తులో ప్రవేశించాలనీ, తద్వారా ప్రమోదాన్ని పొందాలని వీరి అభిలాష. అందువల్లనే దీనికి ప్రమోదకాముక విమర్శ అని నామకరణం.

పైన పేర్కొన్న విమర్శ విధానాలు వింగడింపులే కాక మరెన్నో ఉన్నాయి. ఆ విమర్శలను స్థూలదృష్టితో పరికిస్తే ప్రాచీన కాలానికి చెందిన ఆలంకారిక పౌరాణిక చారిత్రక నైతిక విమర్శల వంటి వాటిని ప్రాచీన విమర్శలు, ప్రాచీన విమర్శలలో కావ్య లక్షణాలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. అవతారికలు పీఠికలు టీకులు టిప్పణులు ఇటువంటివే - ఈ విమర్శలు విధేయాత్మకమైనవి.

సహృదయంతో ఉత్తమ ప్రమాణాలతో రాగద్వేషాల కతీతంగా విమర్శిస్తే సద్విమర్శ అనీ, తద్భిన్నంగా విమర్శిస్తే అనుద్విమర్శ అని వ్యవహారం. ఒక కావ్యాన్ని అన్ని దృక్కోణాలతో సవివరంగా విమర్శిస్తే అది సమగ్ర విమర్శ. ఇది సాహిత్యాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుంది. కావ్యాన్ని సమగ్రంగా కాక పాక్షికాంశాలనే విమర్శిస్తే అది అసమగ్ర విమర్శ.

ఇవి కాక తెలుగునాట వచ్చిన అనేక ఉద్యమాల సారస్వతాన్ని విమర్శించే సందర్భంలో ఆ సాహిత్య ఉద్యమ నామంతోనే ఆ విమర్శను కూడ వ్యవహరించారు. అలాంటి వాటిలో సంస్కరణ, సాహిత్య, పునరుజ్జీవ, కాల్పనిక, దిగంబర, విప్లవ, స్త్రీవాద, దళితవాద సాహిత్య విమర్శలు ముఖ్యమైనవి. ఆయా ఉద్యమవాద సాహిత్యాలకు వేరువేరుగా విమర్శ సూత్రాలు కల్పించుకుంటారు. ఈ ఉద్యమ సాహిత్య విమర్శలకు ప్రత్యేక ప్రయోజనాలుంటాయి.

### 5.3 సమీక్ష

మార్క్సిస్టు మనోవైజ్ఞానిక సిద్ధాంతాల కనుగుణంగాను సమాజానికి ఉపయోగకరమైన మార్గంలో సాహిత్య విమర్శ చేయడం సమంజసం.

### 5.4 ప్రశ్నలు

1. ప్రాచీన విమర్శ భేదాల్ని తెల్పండి.
2. అర్వాచీన విమర్శ పద్ధతుల్ని వివరించండి.

### 5.5 ఉపయుక్త గ్రంథాలు

1. సాహిత్య భావలహరి - యస్వీ జోగారావు
2. విమర్శ మౌళిక లక్షణాలు - ముదిగండ వీరభద్రయ్య
3. లక్ష్మీరంజన వ్యాసావళి - ఖండవల్లి లక్ష్మీరంజనం

**డాక్టర్ మేళ్లచెర్వు భానుప్రసాదరావు**
రీడర్ - తెలుగు శాఖ
శ్రీ సుబ్బరాయ & నారాయణ కళాశాల
నరసరావుపేట - 522 601

# పాఠం - 6.1

# రస స్వరూపము

పాఠ్యనిర్మాణక్రమం

6.1.0 లక్ష్యం
6.1.1 రసస్థితి - స్వరూపం
6.1.2 రస సూత్రం
6.1.3 రససిద్ధి
6.1.4 స్థాయి భావం
6.1.5 విభావానుభావాదులు
6.1.6 సమీక్ష
6.1.7 ప్రశ్నలు
6.1.8 ఉపయుక్త గ్రంథాలు

## 6.1.0 లక్ష్యం

కావ్య ప్రయోజనాలలో ముఖ్యమైనది రసానందం. ఈ ఆనందం పొందటానికి రససిద్ధి ఎలా జరుగుతుంది? రసమంటే ఏమిటి? మొదలైన విషయాలను గూర్చిన అవగాహన కలిగించడం.

## 6.1.1 రసస్థితి - స్వరూపం

భావం, భావన, ఆలోచన, పదగుంఫన అనే నాలుగంశాలు మొత్తంగాగాని, ఏవేని ఒకటి, రెండుగాగాని కావ్యం చదివినప్పుడు మనస్సునకు హాయిని కలిగిస్తాయి. కలిగిన ఆ హాయిని బట్టి ఆ కావ్యం రసవంతంగా ఉందని అంటాం. కొన్నిసార్లు ఒక పద్యాన్ని గాని, కావ్యాన్ని గాని చదివినప్పుడు భావావేశాన్ని కల్గించే అంశం మాత్రమే ఉండి కూడా హృదయాహ్లాదం కలుగుతుంది. అప్పుడది రసవంతంగా ఉందని మెచ్చుకుంటాం. మరికొన్ని సార్లు ఎటువంటి భావావేశం కలుగకుండానే మన కళ్ళముందు కవి చిత్రింపదలచిన మూర్తి సాక్షాత్కరించి ఆనందం కలుగుతుంది. అటువంటి పద్యం కూడ రసవంతమే అవుతుంది. ఇంకొన్నిసార్లు భావావేశం గాని, రూపసాక్షాత్కారంగాని జరుగకపోయినా ఆ రచన రసవత్తరంగానే అన్పిస్తుంది.

ఉదా॥ "రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్
పర్యుత్సుకో భవతి యత్సుఖితో పి జంతుః
తచ్చేతసా స్మరతి మానమబోధ పూర్వం
భావ స్థిరాణి జననాంతర సౌహృదాని"

ఈ శ్లోకం కాళిదాస కృత అభిజ్ఞాన శాకుంతలం లోనిది. ఏ విచారము లేకుండా సుఖంగా ఉన్న మానవుడు అందమైన దృశ్యాలను చూస్తూ, మధురమైన శబ్దాలను వింటూ కూడా ఆనందం పొందడానికి బదులు మనోవ్యాకులత పొందుతాడు. అతని మనస్సులో నిగూఢంగా ఉన్న, పూర్వజన్మ స్నేహాలు స్మరణకు రావడమే కారణం - అని ఈ శ్లోక భావం. ఈ శ్లోకంలో ఒక

అసాధారణమైన మానసిక తత్త్వ రహస్యం ఉంది. కాని ఈ శ్లోకం రసవంతం కాదనటానికి వీలులేదు.

పోతన్న భాగవతంలోని గజేంద్ర మోక్షంలో ఉన్న "అలవైకుంఠ పురంబులో" అన్న పద్యంలోని శబ్ద గుంఫన వల్ల పద్యం మధురంగా ఉండి రసవంతంగా అనిపిస్తుంది. ఇక్కడ భావ జన్యమైన ఆహ్లాదం మాత్రమే శాస్త్రీయం అయిన రసాంశం. మిగిలినవన్నీ చిత్తసుఖాలు.

రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ గారి అభిప్రాయం ప్రకారం రసమంటే లాక్షణికులు నియమించినట్లు శృంగారం మొదలైన తొమ్మిది భేదాలతో కూడిన అలౌకిక చర్వణా విషయమైన, వివరించరాని పదార్థంగాదు. లాక్షణికులు తర్క శాస్త్ర పరాధీనులై రస శబ్దానికి మార్గాన్ని సంకోచపరచారని వీరి అభిప్రాయం. ఏ భావాలైనా వాని తీక్షణ దశలో అవిదిత వేద్యాంతరంగా అనుభవించగల్గితే, ఆనంద స్వరూపులై రసశబ్ద వాచ్యాలౌతాయి. ఇది శిల్ప విషయ సంబంధి.

"తర్కశాస్త్రము నోరు మూసినను హృదయమును మూయజాలదు. కావున కవి భావనా బలము చేతనకు గలుగు శోకము, మోహము, అసూయ, ద్వేషము, సంతోషము, ప్రణయము మొదలగు భావములనబడు చిత్త వికాసముల మూలమున వర్ణింపవలసిన పదార్థముల స్వరూపమును నిర్ణయించి విగ్రహమును (ఏ విగ్రహమైనను సరే) సరళమగు భాషతో దీర్చి యెదుట నిలిపినపుడు రసానుభవ సంస్కారముగల సహృదయుల కట్టి మనోవికారములే కలిగి అవి యెట్టివైనను, శిల్పమందు గల యొకానొక అనిర్వచనీయ మహిమచే ఆనందముగా బరిణమించును. ఈ యర్థమందే ప్రకృతము రసపదమును నేనుపయోగించెదను" అని రాళ్ళపల్లి వారు స్పష్టంచేశారు. అంతేకాదు "ఈ రసశబ్ద వ్యాఖ్యానానికి భరత మహర్షి పాదం పట్టి లాభం లేదు. పాశ్చాత్య లక్షణాన్ని ఉపలక్షించాలి" అని జి.వి. సుబ్రహ్మణ్యంగారు వ్యాఖ్యానించారు.

సౌందర్య శాస్త్రంలో రస-రామణీయకత్వాల వివేచనాన్ని పురాణం సూరి శాస్త్రి గారి మాటలలో "రసానుభవము కళోత్పత్తికి పూర్వమేర్పడుటయే గాక కారణము కూడనగుచున్నది". దువ్వూరు రామిరెడ్డి గారు "అచేతన వస్తువులు కూడ రమణీయ భావముల బ్రేరేపించును. అవి యనుభవించినపుడు ఆనందము పుట్టును. సుఖానుభవ యోగ్యమగు ప్రతి భావమును రసత్వము పొందును" అని చెప్పారు.

"నభావహీనో అస్తిరసః" అని కదా శాస్త్ర వాక్యం. భావం లేనిదే రసం లేదు. భావముంటే సామాజిక మనోవికారం. అది కావ్యార్థాన్ని భావుకులచే ఆస్వాదింపచేస్తుంది అని ఫలితార్థం. భావం అంటే ఏమిటి? అని ప్రశ్నించుకుంటే సమాధానంగా భావయంతి - నిష్పాదయంతి రసానితి భావాః అని, భావయంతి - భావాది వ్యపదేశంజనయంతీతి భావాః అని ఉభయ విధాలుగా గ్రహించవచ్చు.

అలంకారాలు కూడ రసపోషకాలు అవుతాయా? అనే విషయమై ఆలోచిస్తే కొన్నిసార్లు అవి రసవద్భావాన్ని కలిగించే విషయం నిజమే. ఉదాహరణకు

"మొదట చూచిన కడుగొప్ప పిదప కురుచ
అది కొంచెము తరువాత నధికమగును
తనరు దిన పూర్వ పరభాగ జనితమైన
ఛాయ పోలిక కుజన సజ్జనుల మైత్రి" అనే పద్యం.

ఈ పద్యంలో సజ్జన, కుజనుల మైత్రీ తారతమ్యం చెప్పబడింది. ఈ మైత్రికి దిన పూర్వ పరభాగ జనితమైన ఛాయను ఉపమానంగ చెప్పటం వలన సరసత్వం కలిగి మంచి కవిత్వమైంది. కవి తాననుభవించిన భావావేశాన్ని మనలో రసభావంగా ఉద్భిన్నం చేసేందుకు చేసే ప్రయత్నమే కవిత్వ రచన. మన హృదయంలో రసభావాన్ని పుట్టించి, దానిని పోషించి, రస రూపంలో ఆస్వాదింప చేసే శక్తి గల పదాలు కావ్యంలో ఉంటాయి. అందుకే 'కావ్యం రసవంతం' అంటాం. రసభావాన్ని స్ఫురింప చేసే ఆ

శబ్ద శక్తికే రసధ్వని అని పేరు.

ప్రకృతి వైచిత్ర్యాలు, ప్రియ దర్శనులు, చిత్ర శిల్పాదులు ప్రత్యక్షంగ కన్నులకు గట్టి రస సౌందర్య చింత నేర్పరుస్తాయి. సంగీతం ప్రత్యక్షంగా శ్రవణేంద్రియాలను తాకి రసధ్యానమేర్పరుస్తుంది. కావ్య పఠనం ఇట్టి సౌందర్య విచారణను కల్గించినను కావ్య నిర్దిష్టాలైన విషయాలు ప్రత్యక్షంగా ఇంద్రియ గోచరం కావు. పదాలకు, భావాలకు, వస్తువులకును స్పందించి మానసకోశం ఆ పదాలు నిరూపించే విషయాలను మానస వీధిలో ప్రత్యక్షం చేస్తుంది. ఇలా సాక్షాత్కరించిన విషయచ్ఛాయలను చింతిస్తూ రసానందం అనుభవిస్తున్నాం. కావ్య పఠనం వలన జనించే రసయోగం వ్యంగ్య ప్రభూతమై, పద సూచితమై ప్రత్యక్షేతరంగా ఉంటుంది అని పురాణం సూరిశాస్త్రి గారి అభిప్రాయం.

మన చిత్తం ఒక విషయంపై చూపు నిలిపి దానిని సంతోషంగా, ఉత్సాహంగా చింతించటం మొదలుపెట్టినప్పుడు మన మానసం రసయోగం అధిష్ఠించిందని చెప్పవచ్చు. ఇట్టి స్థితిలో మన మనుభవించే మానస వ్యాపార విశేషాలు రసానుభవ మనబడతాయి. రస సౌందర్య విరాజితాలైన విషయాలను చింతించినపుడెల్ల ప్రీతి, ఆనందం, సంతోషం కలుగుతాయి. ఇట్టి రసానందం అనుభవించే సమయాలలో మన శక్తియుక్తులు పెల్లుబ్బి జీవ సంచలన వికాసం కలుగుతుంది. మన రాగ ద్వేషాలు, భావోద్రేకాలు చల్లబడి ఒక విధమైన సాధుత్వం కలుగుతుంది. మానసం అనిర్వచనీయ సంతోష తేజః పుంజంలో సంకల్ప హీనమై, నిశ్చల సంతుష్టితో తేలుతూ ఉంటుంది అనేది పాశ్చాత్య రస సౌందర్య తత్వ సమాలోచన సంప్రదాయం.

మానవ చైతన్యంలో ఉన్న ఊర్ధ్వ ప్రకృతి, అధః ప్రకృతి అనే రెండు భాగాలు ఉన్నాయి. స్థాయి భావమనేది సాధారణంగా అధః ప్రకృతిలో జనించి సుఖానుభూతిని కల్గిస్తుంది. కాని అది లౌకిక భావోప స్పర్శనం కలిగి రజోగుణ కలుషితమై ఉంటుంది. అందలి కాలుష్య క్షాళనం జరిగిన తరువాత అది పరమానందప్రదం అవుతుంది. దీనినే అరిస్టాటిల్ "పర్గేషన్" అన్నాడు. దీనికే 'భావనము' అని పేరు. ప్రతి సుఖానుభూతి ఆనందానికి పర్యాయం కాదు. సుఖం మనస్సుకు సంబంధించినది. ఆనందం ఆత్మ సంబంధి. రజో గుణ సంబంధమైన లౌకిక కాలుష్య క్షాళనమే రస పరిపోషణ ప్రక్రియ. ఆ పరిపోషణ వల్ల అధః ప్రకృతిలో జనించిన రసభావం క్రమంగా ఊర్ధ్వ ప్రకృతి గతమై భావి తత్వాన్ని పొంది, చైతన్యమంతా తానై పరమానందం కలుగుతుంది. పరమానంద జనకమైనప్పటి ఆ భావ స్వరూపానికే 'రసం' అని పేరు.

కవి చేసెడి రసపోషణ వల్ల ఆ మాలిన్యమంతా రెండు మూడు దశలలో క్షాళితమై పోతుంది.

### 6.1.2 రస సూత్రం

రసాన్ని గురించి, దాని పరిణామ క్రమాన్ని గురించి, దాని స్వాదుత్వాన్ని గురించి ప్రపంచంలో మొదట చెప్పిన వాడు భరతుడు. "నహిరసాదృతే కశ్చిదర్థః ప్రవర్తతే" రసాన్ని వీడి ఏదియును ఉండదు అని భావం. భరతుడు చెప్పిన రస సూత్రం ఇది.

"విభావానుభావ వ్యభిచారి సంయోగాత్ రస నిష్పత్తిః". విభావ, అనుభావ, వ్యభిచారి భావాల సంయోగం వలన రస నిష్పత్తి జరుగుతుందని అర్థం. కావ్య సామగ్రి అంతా ఆ రస వ్యంజకత్వానికే ఉపకరిస్తుంది.

"యథాహి నానా వ్యంజ నౌషధి ద్రవ్య

సంయోగాద్రస నిష్పత్తిర్భవతి" . . . . . . అనే

పద్ధతిలో బెల్లం, ఏలా మరీచికాదులైన ఓషధుల సంయోగం వలన శ్రేష్ఠమైన రసాయనంగా సిద్ధమైనట్లు బహువిధాలైన విభావాదుల కూడికచే స్థాయి భావాలు రసంగా నిష్పన్నమౌతాయి.

"రసః ఇతికః పదార్థః ఉచ్యతే - ఆస్వాద్యత్వాత్"
(రసమని ఏ పదార్థం చెప్పబడుతుంది)

"రస్యతే - ఆస్వాద్యతే ఇతి రసః"
(ఆస్వాదింప బడేది రసం)

"కథమ్ - ఆస్వాద్యతే"
(ఎట్లా ఆస్వాదింపబడుతుంది).

అనేక రుచులతో కూడిన వ్యంజనాలతో కూర్చబడ్డ అన్నం తింటూ ఆయా రసాలను (షడ్రుచులు) ఆస్వాదించి సంతోషించినట్లు, ఆంగిక, వాచిక, సాత్త్విక వ్యాపారాలచేత సముపనీతములై, వివిధ భావాభినయాలచే వ్యంజితాలైన స్థాయి భావాలను సహృదయులైన ప్రేక్షకులు హర్షిస్తారు. నాట్యం వలన రస్యమానాలైనందున ఇవి నాట్య రసాలైనవి. కాని ఈ రస ప్రక్రియ, అనుభూతి శ్రవ్య దృశ్య కావ్యాలు రెండింటికి సమానమే.

దృశ్య కావ్యాలలో నట ప్రయుక్తమైన భావాలు రసాస్వాదనకు తోడ్పడగా, శ్రవ్య కావ్యాలలో సందర్భోచిత పద ప్రయోగాదులు తోడ్పడతాయి.

రసం నుండి భావం పుడుతుందా? లేక భావం నుండి రసమా? అని ప్రశ్నించుకుంటే పరస్పర సంబంధంచే రసభావాలు నిష్పన్నమౌతాయని కొందరన్నట్లు భరతుని సమాధానం.

భావయంతి - నిష్పాదయంతి రసాన్ ఇతిభావాః
భావయంతి - భావాది వ్యపదేశంజనయుంతి ఇతి భావాః

"దృశ్యమైనను, శ్రవ్యమైనను రస భావ స్ఫోరకమైనది కవి వాక్యమే. నాటకమైనచో పాత్రలును, తదభినయమును ఆ స్ఫురణ కలుగుటకు మరి కొంత సాయపడును." అన్న పింగళి లక్ష్మీకాంతం గారి వాక్యాలిట స్మరణీయాలు.

### 6.1.3 రససిద్ధి

కవి మనస్సులో ఉన్న భావసంపద, మనలో రసభావాలు కల్గించేటట్లు ఉచిత పదప్రయోగం, వాక్య లేదా పద్య నిర్మాణం చేయడమే కవి యొక్క నైపుణ్యం. అనగా ఆ కవి కావ్యంలో ఉన్న శబ్ద శక్తి మన హృదయంలో 'రసభావం' పుట్టించి దానిని పోషించి, రస రూపంలో ఆస్వాదింపచేస్తుంది. కాబట్టి రసభావం యొక్క పరిణామమే రససిద్ధి. రసభావాన్ని స్ఫురింపచేసే శబ్ద శక్తి రసధ్వని. రసభావం పరమానందాన్ని కల్గించినప్పటి భావ స్వరూపమే రసం. స్థాయి భావం లౌకిక కాలుష్యమంతా క్షళనమైన తరువాత వ్యభిచార భావాల స్థాయినుండి సాత్త్వికావస్థకు చేరి రసత్వం పొందుతుంది. ఆ సాత్త్వికావస్థను కూడ దాటి ఇతర వివర్తాలు లేకుండ ఆనందామృతంగా పరిణమిస్తుంది. అదే రసానందం.

కావ్యం చదివేటప్పుడు ఈ కార్యకలాపమంతా జరుగుతుందా? జరిగితే ఆ క్రమం ఎక్కడా కన్పించడంలేదు కదా? అని అనుమానం రావచ్చు. గ్రంథంలో మొదటి పద్యంతోనే రసానందం ఎట్లా కలుగుతుందని అన్పించవచ్చు. కొన్ని కావ్యాలలో ఎంత చదివినా అసలేం కలుగలేదేమని సందేహం రావచ్చు. నిజానికి ఈ రస పరిపోషణను క్రమమనే కార్యకలాపమంతా విస్తృతమైన కథలున్న కావ్యాలకు తగిన ప్రక్రియ. విపులమైన కావ్యాలలో నిజంగా రసపరిపోషణ జరిగిన చోట మనకు తెలిసినా, తెలియకపోయినా ఈ పరిణామం జరిగితీరుతుంది. కావ్యాలలో రససిద్ధి కావ్యం చివర మాత్రమే జరుగుతుందన్న నియమంలేదు. చివరగాని,

మధ్యలోగాని జరుగవచ్చు. ఎన్నిసార్లైనా ఆ అనుభూతి, ఆనందం కలుగవచ్చు. నిపుణుడైన కవి తన హృదయ పరిపక్వదశలో భావన చేసి రచించిన పద్యమైనచో రసభావం సాత్త్వికావస్థలోనే కలుగవచ్చు. ఆ మరుక్షణమే దాని స్వచ్ఛ రూపమైన ఆనందం కల్గుతుంది. ఒక్కొక్క కావ్యంలో రస పరిపోషణ జరిగి రససిద్ధి లేకపోవచ్చు. అందుకే ఖండ కావ్యాలు, చాటు పద్యాలు మొదలైన వాటిలో రసానందం కలగాడానికి కవి నైపుణ్యమే కారణం గాని కావ్య కలాపం గాదు.

శాస్త్రీయమైన రస పరిపోషణకు అవకాశం లేనప్పుడు ఒకటి, రెండు విడి పద్యాలలో ఆనందానుభూతి ఎట్లు కలుగుతుంది. అనే ప్రశ్నకు అసంలక్ష్యక్రమంలో అని ఆలంకారికుల సమాధానం. కాని భావుకుడైన కవి చేత భావితమైన భావం కావ్యంలో వ్యక్తం చేయబడినపుడు అది మనలో భావితమైన రూపంలోనే ఆవిర్భవించి వెంటనే ఆనందాన్ని అందిస్తుంది. రసభావ స్పర్శ ఏ మాత్రం లేని పద్యాలలో ఆహ్లాదం కలగడానికి కావ్యాంశాలలో చెప్పిన భావన, ఆలోచన, పదగుంఫన అనేవాటిలో ఏవైనా కారణం కావచ్చు. రససిద్ధి కలగడానికి కావ్యం పఠించేటప్పుడు పఠిత చిత్తవృత్తి అనుకూలంగా ఉండాలి. ఆయా వర్ణనలు చేసే సందర్భంలో ప్రకృతి పదార్థాల రామణీయకతను దర్శించటంలో కవి చిత్తవృత్తి అనుకూలంగా ఉండాలి. కావ్యం ప్రతిపాదించే సత్యంలో సాధారణీకృతి ఒక భాగం. శకుంతలా దుష్యంతుల కథను చదివేటప్పుడు రసభావ జన్యమైన ఆనందాన్నుభవించే టప్పుడు ఆయా పాత్రల పరమైన పరిజ్ఞానం నశించి సర్వలోక సాధారణమైన యువతీ యువకులు మాత్రమే మనో ఫలకంలో నిలుస్తారు. అదే తాదాత్మ్యం, శిల్ప వస్తువుగా స్వీకరింప బడే పాత్ర దేశ, కాలాల నుండి కవిచే వేరు చేయబడి సార్వ లౌకికంగా చిత్రింపబడి సార్వకాలికం అవుతుంది. ఇది కూడ సాధారణీకృతి కొక కారణం. దీని మూలంగా సహృదయులందరూ తాదాత్మ్యం పొంది రసాస్వాదన చేస్తారు.

## 6.1.4 స్థాయిభావం

"విభావైరనుభావైశ్చ సాత్త్వికైర్వ్యభి చారిభిః
ఆనీయమాన స్వాదుత్వం స్థాయి భావో రసః స్మృః"

పై శ్లోకం ఆధారంగా స్థాయి భావమే రసంగా పరిణతి పొందుతుందని భావింపవచ్చు. అంత ప్రాధాన్యమున్న స్థాయి భావం అంటే ఏమిటి?" ఈ ప్రశ్నకు సమాధానంగా 'దశ రూపకం'లో ఈ క్రింది శ్లోకం చెప్పబడింది.

సజాతీయైర్వి జాతీయై రతి రస్కృత మూర్తిమాన్
యావద్ర సంవర్తమానః స్థాయీ భావ ఉదాహృతః

"భావము అనగా భావింప చేయునది" అని అర్థం. మధ్యలో విచ్ఛిన్నంగాకుండ రససిద్ధి పర్యంతం స్థిరంగా ఉండే సహజ పటుత్వం కలిగిన వాసనారూపమైన రసభావాన్ని స్థాయిభావం అంటారు. మనోధర్మ శాస్త్రం పదునాలుగు వాసనా రూపమైన భావాలను చెప్పినప్పటికిని ఆలంకారికుల మతం ప్రకారం స్థిరత్వం కలిగి స్థాయిభావం అనిపించుకో దగినవి తొమ్మిది మాత్రమే. ఈ స్థాయి భావోదయం ఇతర పూర్వ సంస్కారాల మాదిరిగానే నిగూఢంగా ఉండి, కావ్యోద్బోధకంచే తలచూపి నెలకొంటుంది. అట్టి వాసనలేని మనస్సుకు రసాస్వాదన కలుగదు.

సాహిత్య దర్పణంలోని ఈ పద్య పాదం పై భావాన్ని స్పష్టం చేస్తుంది.

"నజాయతే తదాస్వాదో వినా రత్యాది వాసనామ్"

ఆలంబన విభావం స్థాయికి కారణ భూతమవుతుంది. అది స్థాయికి ముందే సిద్ధమై, ప్రేరకమౌతుంది. ఆలంబన విభావంతో పాటు ఉద్దీపన విభావం కూడ ఉంది. ఆలంబన మంటే కావ్య గత వ్యక్తులు, వారి వాక్యాలు.

'వాగంగ సత్వోపేతాన్ కావ్యార్థాన్ భావయంతీతి భావాః'

అని భరతుని ఉక్తి. రసానికి సన్నిహితమైన భావమే స్థాయి భావం. దీనికి రసానికి నూలుకు, వస్త్రానికి వలె ఆకారమే భేదం. మగ్గం మొదలైన వాటి సాయంతో నూలును వస్త్రంగా తయారు చేస్తారు. అదే విధంగా స్థాయి భావం విభావాదుల చేరికవల్ల పరిపుష్టమైన రస వ్యవహారం పొందుతుంది.

"అవస్థితాశ్చిరం చిత్తే సంబద్ధాచ్చాను బందిభాః
వర్థితాయే రసాత్మనః తేస్మృతాః స్థాయినోబుధాః"

అనేది ఆలంకారికోక్తి. సముద్రం నదీ జలాలను తనలో కలుపుకొన్నట్లు స్థాయిభావం తక్కిన భావాలను తనలో కలుపుకొంటుంది.

యావద్రస నిష్పత్తి స్థిరంగా ఉండి తక్కిన విభావాదులకు ఆశ్రయమైనందున స్థాయి భావాలు ముఖ్యాలు.

మానవులందరిలో ఒకే విధమైన కరచరణాదు లున్నప్పటికిని కులశీల విద్యాది విశేషాల వలన కొందరే రాజులౌతున్నారు. బహుజన పరివారం గలవాడే నరేంద్రుడు గాని, పరివార హీనుడు గొప్పవాడైనను నరేంద్రుడు కాలేడు.

"యథానరాణాం నృపతిః శిష్యాణాంచ యథా గురుః
ఏవంహి సర్వ భావానాం భావః స్థాయీ మహానిహ"

ప్రజలలో రాజు, శిష్యులకు గురువు గొప్ప వారైనట్లు భావాలలో స్థాయి భావం శ్రేష్ఠం.

### 6.1.5 విభావానుభావాదులు

స్థాయి భావం రెండు మూడు దశలలో క్షాళనం పొంది మాలిన్యాన్ని పోగొట్టుకొని, ఉత్తమ ప్రకృతి విభాగానికి కొంత చేరువై, ఆనుషంగికములైన అనేక అవాంతర భావ రూపాలను దాల్చి రసంగా పరిణమిస్తుంది. అటువంటి స్థితి స్థాయి భావానికి కలగడంలో ప్రేరకమైనది విభావాలు. ఇవి ఆలంబన విభావం, ఉద్దీపన విభావం అని రెండు రకాలు. ఈ ఆలంబన విభావం రససమవాయి కారణమని ఆలంకారికుల అభిమతం. ఏది లేకపోతే రసం ఉండదో, అది రసానికి సమవాయి కారణం. కావున రససిద్ధికి ఆలంబన విభావం ప్రథమ కారణం. ఆలంబనమంటే కల్పిత జీవులైన కావ్య గత వ్యక్తులు, వారి వాక్యాలు. దృశ్య కావ్యాలలో నటులు, వారి వాక్యాలు.

ఆలంబన విభావం చేత ఉత్పన్నమైన స్థాయిని కొంచెం ఉద్దీపింపచేసేది ఉద్దీపన విభావం. అంటే స్థాయీ వికాసానికి ఉచితమైన వర్ణనలు మొదలైనవి. ఉదాహరణకు శృంగార రసపరంగా రతి అనే స్థాయి భావానికి రమణీయ ప్రకృతి వర్ణన ఉద్దీపన విభావం. అట్లే రౌద్ర రసానికి సంబంధించి క్రోధం అనే స్థాయీ భావానికి యుద్ధభూమి, హయహేషలు మొదలైనవి ఉద్దీపనం కల్గిస్తాయి. ఈ ఉద్దీపన విభావాన్నే రసోచితమైన వాతావరణం అని ఆధునికులంటారు.

ఆ పైన పాత్రల మనోభావాలను వ్యక్తం చేసే శారీరకమైన కొన్ని చేష్టలను అనుభావాలు అంటారు. ఇవి అభిప్రాయ సూచనాత్మకాలైన కార్యాలు. విభావం కారణంగా జనించటం వలన అనుభావం కార్యమయ్యింది. ఇది శ్రవ్య కావ్యంలో వర్ణనాత్మాకం గాను దృశ్య కావ్యంలో అభినయాత్మకంగాను ఉంటుంది. శృంగార రస ప్రధానమైన కావ్యంలో కడగంటి చూపులు, మందహాసాలు మొదలైన విలాస చేష్టలు అనుభావాలు. రౌద్ర రస ప్రధానమైన చోట ఆయుధచాలనం, పండ్లుకొరకడం మొదలైనవి అనుభావాలు.

ఇవిగాక రససిద్ధి జరగటంలో ముఖ్యమైనవి వ్యభిచారి భావాలు, సాత్త్విక భావాలు మొదలైనవి.

స్థాయిభావం రసంగా పరిణమించడానికి ఉన్ముఖమైనప్పుడు తాల్చే అవాంతర రూపాలకే వ్యభిచారి భావాలని పేరు. ఇవి ఆకస్మికంగా ఎక్కడ నుండో వచ్చి ప్రవేశించేవి కావు. నీరు మరుగుతున్నప్పుడు పుట్టే బుడగల వలె రస పరిపోషణలో తీక్షణతను పొందిన స్థాయి భావం దాల్చెడి రూప వైవిధ్యమే వ్యభిచార భావ పరంపర. అథః ప్రకృతిని వీడీ వీడక మాలిన్యం పోయీ పోక స్థాయి భావం అటునిటు వ్యభిచరించు నప్పటి రూపాలకు వ్యభిచారి భావాలని పేరు. ఇవి ముప్పది మూడు. వీటి వర్ణనలు చదివి నప్పుడు మనస్సులోని స్థాయి భావం మరికొంత పరిపుష్టి చెందుతుంది. సముద్రమందు లేచి పడెడి తరంగాలు ఆ సముద్ర జలాల విజృంభణమై గాని కొత్త నీరుగాదు. అట్లే వ్యభిచారి భావాలు స్థాయి భావం యొక్క విజృంభిత రూపాలే గాని కొత్త భావాలు గావు. రసానుభూతి అనెడి గమ్యానికి మనసు అబిముఖంగా ఉన్నప్పుడు ఉదయించే భావాలు కాబట్టే వ్యభిచారి భావాలైనవి.

వ్యభిచారి భావోదయ వేళకు చిత్తం గమ్యానికి అభిముఖంగా మాత్రమే ఉంటుంది. కాని సమీపస్థం కాదు. సమీపస్థమైనప్పుడు పుట్టే భావాలు సాత్త్విక భావాలు. గాద్గద్యము, వైస్వర్యము, మొదలైన ఎనిమిది సాత్త్విక భావాలు. రజస్తమోగుణ స్పర్శ లేని మనస్సే సత్త్వం. అదే ఊర్ధ్వ ప్రకృతి. అట్టి మనస్సులో పొడమే భావాలు కాబట్టి వీటిని సాత్త్విక భావాలు అంటారు.

"రజస్తమోభ్యామస్పష్టం మనస్సత్త్వమి హోచ్యతే"

వ్యభిచారి భావాలకు వలెనే ఇవి కూడ స్థాయి భావం యొక్క రూపాంతరాలే గాని కొత్తగా పుట్టవు. సాత్త్విక భావోదయ వేళకు స్థాయి భావంలోని రజోగుణ మాలిన్యం పూర్తిగా క్షాళితమై దానికి భావితత్త్వం వస్తుంది. అనుభావాలకు వలెనే ఇవి శరీరజాలు. అనుభావాలు పుట్టినపుడు మనస్సుకు పరవశత్వం ఉండదు. కాని గాద్గద్యం మొదలైన సాత్త్విక భావోదయం జరిగినప్పుడు మనస్సుకు పరవశత్వం ఉండి, ఇవి వాటంతట అవే పుడతాయి.

"పృథ గ్భావా భవంత్యన్యే ఽనుభావత్వే ఽపి సాత్త్వికాః
సత్త్వాదేవ సముత్పత్తేః తచ్చతద్భావ భావనమ్"

(శరీరజా లైనప్పటికి సత్త్వం నుండి పుట్టుట చేత సాత్త్వికాలనే వేరే భావాలైనాయి. అదియే క్షాళిత స్థాయి భావం యొక్క శుద్ధ రూపం). ఇట్టి సత్త్వస్థితిలో ఆత్మ ప్రతిఫలనం కొద్దిగా కలుగుతుంది.

### 6.1.6 సమీక్ష

విభావానుభావ సాత్త్విక వ్యభిచారాలచే ఆస్వాద యోగ్యతను పొందిన స్థాయి భావమే రసం. రసానందంత్ర గుణాతీతం. రసానందం అనుభవించే టప్పుడు శారీరక, మానసిక, వ్యాపారమంతా అణగిపోయి ఆనంద స్వరూపమైన ఆత్మ మాత్రమే ప్రకాశిస్తుంది. అంటే స్థాయి ఆత్మలో లీనమై బ్రహ్మానంద సమమైన ఆనంద రూపంలో అభివ్యక్తమౌతుంది. అదే రసానుభూతి. ఆ పరిణత రసావస్థలో వివిధ రసావిర్భావం జరుగుతుంది. విభావానుభావాది సామగ్రి అంతా ఈ ప్రక్రియలో తోడ్పడుతుంది. ఏ రసంలో నైనా లౌకిక కాలుష్యం ఉండదు. అంతా శాంతిమయమైన ఆనందం. రసధుని అని చెప్పదగిన శ్లోకం చదువుతున్నప్పుడు ఆనంద భాష్పాలు రావడం, గొంతు గాద్గద్యం పొందటం మొదలైనవి సాత్త్విక భావానుభావాలైతే, ఆ అనుభవంలో కళ్ళు మూసికొని పరవశం కావడం సంపూర్ణ రసానందానుభవం. ఈ రసానందాన్ని బ్రహ్మానంద సబ్రహ్మచారు అనడానికి కారణం బ్రహ్మానందం ఆలంబనాన్ని అపేక్షించదు. రసానందానికి ఆలంబనం లేక జరగదు. ఆ ఆనందం అనుభూతి కర్హమైన హృదయం గల వారికే లభిస్తుందని వారే సహృదయులని సారాంశం. అందుకే లోకోత్తర చమత్కార ప్రాణులైన కొంతమంది ప్రమాతల చేతనే (తెలిసికొనగలవారిచేతనే) ఆత్మ సాక్షాత్కారం కంటె భిన్నంగాని విధంగా రసమాస్వాదింప బడుతుంది. అది కూడ కావ్యంతో శ్రుతి గలిపిన చిత్తవృత్తి ఉన్నప్పుడు మాత్రమే.

ఇతరుల కథలు చదవడం, చూడటం మొదలైన సందర్భాలలో అందరకు ఆనందం కలగడానికి కారణం సాధరణీకరణ. దీనివలన ఇది పరునిది మనది అన్న వివక్ష తొలగిపోయి సర్వలోక సాధారణమైన భావన కలిగి ఆనందం సొంతమౌతుంది.

### 6.1.7 ప్రశ్నలు

1. రస స్వరూపాన్ని వివరించండి.
2. స్థాయి భావాన్ని గురించి వివరించండి.
3. రససిద్ధిలో విభానుభవాల ప్రాధాన్యాన్ని చర్చించి వ్యభిచారి భావాలను, సాత్విక భావాలను గూర్చి వివరించండి.

### 6.1.8 ఉపయుక్త గ్రంథాలు

1. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
2. ఆంధ్ర ప్రతాపరుద్ర యశోభూషణం - చెలమచెర్ల రంగాచార్యులు
3. ఆంధ్ర సాహిత్య విమర్శ - ఆంగ్ల ప్రభావం - డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం

**డాక్టర్ యలవర్తి భానుభవాని**
ఎం.ఏ. యం.ఫిల్. పిహెచ్.డి.
రీడర్ - తెలుగు విభాగం
పి.బి.ఎన్. కళాశాల
నిడుబ్రోలు - 522 124

# పాఠం - 6.2

# రసనిష్ఠ

పాఠ్యనిర్మాణక్రమం

6.2.0 లక్ష్యం
6.2.1 రసం ఎవరి యందు ఉద్భవిస్తుంది? లేదా ఎవరి యందుంటుంది?
6.2.2 భట్టలోల్లటుని వాదం - చర్చ
6.2.3 శ్రీశంకుకుని వాదం - చర్చ
6.2.4 అభినవగుప్తుని వాదం - చర్చ
6.2.5 వివిధ వాదాలు ఆధారంగా చేసిన సిద్ధాంతాలు - తుది నిర్ణయం
6.2.6 సమీక్ష
6.2.7 ప్రశ్నలు
6.2.8 ఉపయుక్త గ్రంథాలు

## 6.2.0 లక్ష్యం

రస స్వరూపాన్ని గురించి తెలిసికొన్న తరువాత రసాస్వాదన చేయడానికి ఎవరు ఆధారం? రసం ఎక్కడ, ఎలా పుడుతుంది అనే విషయాలను గురించిన సమాలోచన చేయడం.

## 6.2.1 రసం ఎవరి యందు ఉద్భవిస్తుంది? లేదా ఎవరి యందుంటుంది?

"విభవాను భావ వ్యభిచారి సంయోగాద్రస నిష్పత్తిః" అని భరతుడు రససూత్రాన్ని చెప్పాడు. ఈ రసనిష్పత్తిని గూర్చి వివరించటంలో ఆలంకారికులు భిన్న దృక్పథాలను ప్రదర్శించారు. వారిలో భట్టలోల్లటుడు, శ్రీశంకుకుడు, భట్టనాయకుడు, అభినవగుప్తుడు ముఖ్యులు. వీరిలో భట్టలోల్లటుడు రసోత్పత్తివాది. ఇతని అభిప్రాయం ప్రకారం రసం అనుకార్యుడైన నాయకుని యందుంటుంది. శ్రీశంకుకుడు రసానుమితివాది. ఇతని ఆలోచన ప్రకారం విభావాదులున్న చోట రసముంటుంది. అనగా నటులయందే రత్యాదులను సామాజికుడూహించును. భట్ట నాయకుడు రసభుక్తివాది. రస సూత్రంలో చెప్పిన సంయోగ శబ్దానికి 'భోజకత్వం' అనే అర్థాన్ని చెప్పాడు. అదే విధంగా నిష్పత్తి శబ్దానికి 'భుక్తి' అనే అర్థాన్నిచ్చాడు. భోజకాలైన విభావాదుల సంబంధంతో 'స్థాయి' భోజ్యమౌతుంది. అదే రసం అని ఇతని అభిప్రాయం.

అభినవగుప్తుడు రసాభివ్యక్తి వాది. వ్యంజకాలైన విభావాదుల మూలంగా సహృదయ నిష్ఠమై ఉన్న స్థాయి భావం రస రూపంగా అభివ్యక్త మౌతుందని ఇతని వివరణ.

## 6.2.2 భట్టలోల్లటుని వాదం - చర్చ

ఇతడు రసం అనుకార్యనిష్ఠమని ఒక వాదం చేశాడు. ఇతనిది రసోత్పత్తి వాదం. అనుకార్యనిష్ఠమనగా అనుకరించబడుచున్న రామాదులయందుండునని అర్థం. తమ నటనాకౌశలంతో ఆయా పాత్రలను పోషించి వీరే రామాదులనబడే విధంగా నటిస్తున్న

నటులయందున్నట్లుగా అన్పిస్తుంది. త్రాడును చూచి పాము అనుకొన్నప్పుడు కలిగే భయం త్రాడు వలననే కల్గుతుంది. అదే విధంగా నటునియందున్నట్లు భ్రాంతితో భావింపబడ్డ రసం కూడ ప్రేక్షకుల హృదయంలో ఒక చమత్కారం కలిగించి ఆనందింప చేస్తుంది.

ఈ వాదం ప్రకారం సామాజికుడు రసానందం పొందటం జరగదు. రసోదయం ఒకచోట, ఆనందానుభవం మరొకచోట జరగటం తర్కసహం గాదు. అనుకార్యునిలో రసచ్ఛాయలున్న వేదనానుభవం మాత్రమే ఉంటుంది. రసానందం పుట్టదు. అతని లోని వేదన ఎంత నిశితమైనను లౌకిక మనో వికారం యొక్క పరాకాష్ఠనే అందుకొంటుంది గాని లౌకిక కాలుష్య రహితంగా, త్రిగుణాతీతమైన ఆనందంగా పరిణమించలేదు. దుఃఖించే వ్యక్తి ఆ బాధలోని తీక్షణతను మాత్రమే అనుభవిస్తాడు గాని, ఆనంద రూపమైన కరుణను ఆస్వాదింపలేడు. బాధ అధికమైన కొలది కన్నీరు, గాద్గద్యం మొదలైన తీవ్ర రూపాలు కల్గవచ్చు. అది అధికమైన దుఃఖం వల్ల కలిగే తీవ్రతయే గాని, సాత్త్విక భావాలు గావు. దుఃఖంలో ఆనందాన్ననుభవించడం శాస్త్ర విరుద్ధం మాత్రమే గాదు. లోక విరుద్ధం కూడ. అట్లే సుఖం విషయంలో కూడ నాయికకు సంబంధించి నాటకుడనుభవించే సుఖం కూడ శరీరవాంఛలకు, విషయ సుఖాలకు సంబంధించిందే గాని స్వతంత్రం, అలౌకికంయైన ఆనందంగాదు. కాబట్టి లోకంలో అనుకార్యునిలో రసం లేదు.

### 6.2.3 శ్రీశంకుకుని వాదం - చర్చ

ఇతనిది అనుమితి వాదం. "యత్రధూమస్తత్రాగ్నిః". పొగ ఉన్న చోట నిప్పు ఉంటుంది అనే అనుమాన ప్రమాణం దీనికి మూలం. నాట్య కౌశలంతో రామాది పాత్రలను ధరించి నటించే నటులను చూచి సామాజికుడు వీరే రామాదులని భావిస్తాడు. ఆ నటులలో విభావాదులుండటం వలన ఆ నటుల యందే రత్యాది భావాలను సామాజికుడు ఊహిస్తాడు. ఎందుకంటే ఈ వాదంలో విభావాదు లెక్కడ ఉంటే రసం అక్కడ ఉంటుందనేది ప్రమాణం.

కాని అనుకర్తయైన నటునిలో రసం ఉండటం సత్యం కాదు. ఇతడు లోకులను (అంటే ఇతర పాత్రలను) వారి వర్తనను అభినయించి రసాన్ని ప్రేక్షకులు లేదా సామాజికులు అనుభవించేలా చేస్తాడు. అంతే కాని స్వయంగా రసాస్వాదన చేయడు. అతనికి రసం పట్ల ఆసక్తి ఉండి ఉండవచ్చు. అనుభవం ఉండదు. అభ్యాసం వల్ల పుట్టిన కౌశలంతో అనుభవం ఉన్నవాని వలె రంగం మీద కన్పిస్తాడు. ఈ నటుడు తనను మరచిపోయి, అనుకార్యుని ఆకారాన్ని, ప్రవర్తనను ప్రదర్శిస్తాడు. తన శరీరం అనెడి భిత్తిక మీద అనుకార్యుని చిత్రిస్తాడు. ఇది నటుని ధర్మం. సజీవ పాత్ర కావడం వల్ల కొన్ని రస భావాలను అనుభవించటంలో అప్పుడప్పుడు కొన్ని రకాల ప్రలోభాలకు అవకాశం ఉంటుంది. వేడి పాలు పోస్తే పాత్ర కూడ వేడెక్కుతుంది. అలాగే నటునికి కూడ కొద్దిపాటి అనుభవం కలగటం తప్పు కాదు. కలగకుండా నివారించటం కూడా కష్టమే.

'కావ్యార్థ భావనా స్వాదోనర్తకస్య నావార్యతే' అని దశ రూపకంలో చెప్పారు.

అయినప్పటికిని అతని అనుభవం సామాజికుని అనుభవం వలె తీవ్రమై ఆనందపారవశ్యంగా పరిణమిస్తే రంగ నిర్వహణ సాగించలేడు. అనివార్యంగా భావోదయం కలిగినా అది నిగ్రహింపబడాలి. ఏ కొద్ది భావానుభవం కలిగినా అతడు సామాజికుడు అవుతాడు గాని నటుడు కాడని 'సాహిత్యదర్పణ' కారుని ఉద్దేశ్యం.

"శిక్షాభ్యాసాది మాత్రేణ రాఘవాదేః స్వరూపతాం
దర్శియన్ నర్తకోనైవ రసాస్వాద కోభవేత్"
నాయం జ్ఞాప్యః స్వసత్తాయాం ప్రతీత్య వ్యభిచారతః
కావ్యార్థ భావనే నాయమపి సభ్యపదాస్పదమ్"

(శిక్షాభ్యాసాదులతో అనుకార్యుని సారూప్యాన్ని ప్రదర్శించే నర్తకుడు రసాస్వాదకుడు కాకూడదు. ఒకవేళ అట్టి భావన అతనికి కలిగితే అప్పుడు అతడు సామాజికుడవుతాడు గాని నటుడు కాడు).

నట ధర్మానికి భంగం కలగనంత వరకు అతని కావ్యార్థ భావన ఆమోద యోగ్యం. ఉత్తమ నటుడు తాను నవ్వుకుంటూ అధికమైన దుఃఖాన్ని ప్రదర్శించగలడు. ఏడ్చినట్లు కన్పించి ప్రేక్షకులను ఏడ్పించటమే గదా నటన. లేనిది ఉన్నట్లు నటించటమే గదా నటన. కాబట్టి అనుకార్యునిలో వలెనే అనుకర్తయైన నటునిలోను రసం లేదు.

### 6.2.4 అభినవగుప్తుని వాదం - చర్చ

అభినవగుప్తుని సిద్ధాంతాన్ననుసరించి రసాన్ననుభవించే వాడు నాటక విషయంలో సామాజికుడు, శ్రవ్య కావ్య పరంగా కావ్య పఠనం చేసేవాడు. ఈ అభినవ గుప్తుడు ధ్వన్యాలోక వ్యాఖ్యాత. ఇతని సిద్ధాంతం భరతుని అభిప్రాయానికి అనుగుణంగానే చేయబడింది. స్వగోచరమై, అలౌకిక చమత్కార రూపమైన, ఆస్వాదంగలట్టి దైన రసం అఖండానంద స్వరూపం. లౌకిక రసం అనుకార్యులైన రామాదులందున్నప్పటికిని అలౌకికమైన రసం సామాజికుని యందే ఉంటుంది.

రసానుభూతి ఆత్మాశ్రయమైన సత్యమా లేక పరాశ్రయమైన సత్యమా? లేక అసలు అసత్యమా? అనే ఆలోచనలకు సమాధానం ఇది ఆత్మాశ్రయ సత్యమని ఈ అభివ్యక్తి సిద్ధాంతం ద్వారా చెప్పబడింది. రస భావం ఉద్భవించటం, అది రసంగా అభివ్యక్తం కావటం కూడ సామాజికునిలోనే అనే సిద్ధాంతం (అభివ్యక్తి సిద్ధాంతం) అభినవగుప్తునిది. వాసనారూపమైన బీజం లేనిదే అభివ్యక్తి లేదు. ఆ బీజం సామాజికుని హృదయంలో వాసనా రూపంలో గూఢంగా ఉండడం వలననే, సామాజికుడు రసాభివ్యక్తి ద్వారా రసానందాన్ని అనుభవిస్తున్నాడు. ఆ అనుభవం సామాజికునికి ప్రత్యక్షమే యైనందువల్ల రసానుభూతి ఆత్మాశ్రయ సత్యమే.

### 6.2.5 వివిధ వాదాలు ఆధారంగా చేసిన సిద్ధాంతాలు - తుది నిర్ణయం

రసం సామాజికాశ్రయం అనేది ఆరోప మూలకమేగాని వాస్తవికం గాదని మహోపాధ్యాయ నరహరి సూరి అన్నాడట. ఆయన అభిప్రాయం ప్రకారం రసం పరిపూర్ణాఖండానంద రూపం. పరమేశ్వర పర్యాయం. బ్రహ్మానందం యోగి గమ్యం. రసానందం విభావాద్యనుసంధాయక హృదయ గమ్యం. ఇట్టి దానికి ఆశ్రయ విచారం లేదు. అఖండానంద రూపం అనాధారం అయిన రసం సామాజికులచే చర్వ్యమాణం కావడంతో రసం సామాజికాశ్రయం అని ఆరోపించి వ్యవహరించారు. 'రస రత్న ప్రదీపక' అనే అలంకార శాస్త్ర గ్రంథంలో చెప్పిన దానిని బట్టి -

నిత్యానిత్య భేదాలతో సుఖం రెండు విధాలు. బ్రహ్మ స్వరూపమైనది నిత్యం. విషయోద్భవమైంది అనిత్యం.

విషయోన్ముఖమైన ఈ లోకంలో నిత్య సుఖ ప్రచారం విరళం. వైషయిక సుఖం నానారుచి వశాన బహుధాభిన్నమై దాని పరిణతత్వంలోనే సుందరమౌతున్నది. రసరూపమైన సుఖం పై రెండింటికినీ మధ్యమమై అనిర్వాచ్యమని పూర్వులు నిరూపించారు. కావున అసారమైన సంసారంలో రసమే సారం అనేది నిశ్చయం.

పాశ్చాత్యులలో రసానుభూతిని గూర్చి మొదట ప్రస్తావించిన పండితుడు అరిస్టాటిల్. అశుభాంత నాటకాల ప్రయోజనాన్ని గూర్చి చెపుతూ అవి సామాజికునిలో శోక భయాలను ఉద్రేకింప చేసి, వాటికి క్షాళనం కల్గిస్తాయని తెలియచేశాడు. ఈ వాదాలను బట్టి అరిస్టాటిల్ సిద్ధాంతం రస సిద్ధాంతానికి సన్నిహితం అని స్పష్టమౌతుంది. కెథార్సిస్ అనే పదానికి మన 'భావన' అనే పదం పర్యాయ పదం వంటిదిగా భావింపవచ్చు. మనో వికారమైన స్థాయి భావం, సాత్త్వికత్వాన్ని పొందే ప్రక్రియే భావన.

రసానందం అలౌకికం అంటే లౌకిక జీవితంలోని సుఖాల కంటె భిన్నమై, ఆధ్యాత్మికమైన బ్రహ్మానందము కంటె వేరై, రెండింటికి నడుమ ఇంకొక స్వతంత్ర స్థితి కలది అని 'సాహిత్య శిల్ప సమీక్ష' కారుల నిర్ణయం.

### 6.2.6 సమీక్ష

పై వాదాల సారాంశంగా రసం సామాజిక నిష్ఠం అనే అభిప్రాయం బలపడుతుంది.

### 6.2.7 ప్రశ్నలు

1. 'రసం అనుకార్యనిష్ఠం' అనే సిద్ధాంతాన్ని గూర్చి చర్చించండి.
2. 'రసనిష్ఠ'కు సంబంధించిన వివిధ వాదాలను తెలియచేసి, రసం ఎవరి యందుంటుందో నిరూపించండి.

### 6.2.8 ఉపయుక్త గ్రంథాలు

1. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
2. ఆంధ్ర ప్రతాపరుద్ర యశోభూషణం - చెలమచెర్ల రంగాచార్యులు

**డాక్టర్ యలవర్తి భానుభవాని**
ఎం.ఏ. యం.ఫిల్. పిహెచ్.డి.
రీడర్ - తెలుగు విభాగం
పి.బి.ఎన్. కళాశాల
నిడుబ్రోలు - 522 124

# పాఠం - 7.1

# రస సంఖ్య

పాఠ్యనిర్మాణక్రమం

7.1.0 లక్ష్యం
7.1.1 రసాలు ఎన్ని?
7.1.2 వివిధ వాదాలు
7.1.3 శాంతం - రసమా - కాదా - చర్చ
7.1.4 వివిధ రస స్వభావాలు
7.1.5 రస సంఖ్య - నిర్ణయం
7.1.6 సమీక్ష
7.1.7 ప్రశ్నలు
7.1.8 ఉపయుక్త గ్రంథాలు

## 7.1.0 లక్ష్యం

రస సంఖ్య విషయంలో ఉన్న వివిధ అభిప్రాయాలను చర్చించి ముఖ్యమైన రసాలను గుర్తించటం.

## 7.1.1 రసాలు ఎన్ని?

రసాలు తొమ్మిది అనే మాట లోక ప్రసిద్ధం. మొదట ఈ సంఖ్య ఎనిమిదిగా చెప్పబడింది. తరువాత కొందరు తొమ్మిదిగా చెప్పారు. ఆ తరువాత కొందరు రస సంఖ్యను పదకొండు, పన్నెండుగా కూడ చెప్పారు. రసాలు ఎనిమిది అని చెప్పిన వారి లెక్కలో శాంత రసం లేదు. లాక్షణికులలో మూల విరాట్టుగా చెప్పదగిన భరతముని తన నాట్య శాస్త్రంలో ఎనిమిది రసాలను ఈ క్రింది శ్లోకంలో పేర్కొన్నాడు.

"శృంగార హాస్య కరుణాః రౌద్ర వీర భయానకాః
బీభత్సాద్భుత సంజ్ఞౌ చేత్యష్టౌ నాట్యే రసాః స్మృతాః
ఏతేహ్యష్టౌ రసాః ప్రోక్తాద్రుహిణేన మహాత్మనా"

భరతముని తాను వ్రాసిన నాట్య శాస్త్రంలోనే ఈ ఎనిమిది రసాలకు స్థాయి భావాలను కూడ క్రింది విధంగా పేర్కొన్నాడు.

"రతి ర్హాసశ్చ శోకశ్చ క్రోధోత్సాహౌ భయం తథా
జుగుప్సా విస్మయ శ్చేతి స్థాయి భావాః ప్రకీర్తితాః"

దీని ననుసరించి కాళిదాసు, వరరుచి మొదలైన వారు ఎనిమిది రసాలనే గుర్తించారు. దండి మొదలైన ప్రాచీన లాక్షణికులు కూడ ఇదే అభిప్రాయాన్ని కలిగి ఉన్నారు.

అనంతర కాలంలో తొమ్మిది రసాలను అంగీకరించిన వారు శాంత రసాన్ని కూడ చేర్చి తొమ్మిదిగా పరిగణించారు. రుద్రటుడు ప్రేయస్సును కూడ చేర్చి రసాలను పదిగా భావించాడు. ఆ తరువాత భక్తి, వాత్సల్యం, ప్రీతి, స్నేహం, శ్రద్ధ, మృగయ,

అక్షాదులన్నీ రసాలుగా కొంతమంది చెప్పారు. వంగ దేశంలోని వైష్ణవ ఆలంకారికులు మధుర, ఉజ్వల, శాంత, దాస్య, సఖ్య వాత్సల్యాదులను రస విశేషాలుగా చెప్పారు. జైనాచార్యులు 'వ్రీడనకం' అనే క్రొత్త రసాన్ని పేర్కొన్నారు. చివరకు 'అనంతావై రసాః' అన్న మాట చెప్పినట్లయ్యింది. లెక్కకు మిక్కిలిగా ఒక వైపు రసాల సంఖ్య పెరుగుతుంటే మరొక వైపు 'రసం ఒక్కటే' అని ఏక రసవాదం బయలుదేరింది. ఒక రసానికే మిగిలినవన్నీ వికృతులని చెప్తూ శృంగారం ఒక్కటే రసం అని కొందరు, కరుణం ఒక్కటే రసం అని కొందరు, అద్భుతం ఒక్కటే రసం అని ఇంకొందరు అభిప్రాయపడ్డారు. ఈ రకంగా రస సంఖ్య కాలక్రమంలో అనియతంగా తయారైంది. విద్యానాథుడు కొంతమంది లాక్షణికుల మతాన్ననుసరించి రససంఖ్యను తొమ్మిదిగా నిర్దేశించాడు.

### 7.1.2 వివిధ వాదాలు

#### 7.1.2.1. రసములు ఎనిమిది

భరతముని ఎనిమిది రసాలనే ప్రతిపాదించాడు. కాని అవి నాట్యానికే పరిమితం. లోకంలో నవరసాలుగా రూఢికెక్కిన వాటిలో శాంత రసాన్ని భరతుడు అంగీకరించలేదు. దశ రూపక కర్తయైన ధనుంజయుడు భరతుని మతాన్నే సమర్థించాడు. ఇతని ఉద్దేశ్యంలో నాటకంలో శాంతానికి స్థానం లేదు. దశ రూపక వ్యాఖ్యాతయైన ధనికుడు నాటకాలలో లేకపోయినప్పటికిని శ్రవ్య కావ్యాలలో శాంతాన్ని నిబంధించవచ్చుననే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. దండి మొదలైన వారు ఎనిమిది రసాలనే గుర్తించారు. కాళిదాసు మహాకవి "మునినా భరతేన యః ప్రయోగో భవతి - అష్టరసాశ్రయో నియుక్తః" అని విక్రమోర్వశీయ నాటకంలో పేర్కొన్నాడు. వరరుచి మహర్షి "షట్ స్థానాని, గతిద్వయమ్, అష్టౌరసాః" అని పేర్కొన్నదాన్ని బట్టి ఎనిమిది రసాలనే అంగీకరించినట్లు స్పష్టమౌతుంది. భరతముని ప్రసాదించిన ఎనిమిది రసాలు ఇవి. 1. శృంగారం, 2. హాస్యం, 3. కరుణ, 4. రౌద్రం, 5. వీరం, 6.భయానకం, 7. భీభత్సం, 8. అద్భుతం.

#### 7.1.2.2. రసములు తొమ్మిది

పైన చెప్పిన ఎనిమిదింటికి శాంతాన్ని కూడ చేర్చి తొమ్మిది అని పలువురు భావించారు. మమ్మటుడు, ఆనందవర్ధనుడు, అభినవగుప్తుడు మొదలైన వారంతా ఈ వాదాన్ని సమర్థించినవారే. ప్రాచీనుల్లో శాంతంతో కూడిన తొమ్మిది రసాలను మొదటగా ఒప్పుకొన్నవాడు 'వాసుకి' అని తెలుస్తున్నది. అతడు

"రజస్తమో విహీనాత్తు సత్త్వావస్థాత్ సచిత్తతః
మనాగ స్పృష్ట బాహ్యార్థాత్ శాంతో రస ఇ తీరితః"

అని అన్నాడట. కోహలుడు కూడ రసాలను తొమ్మిది గాను, శాంతాన్ని రసం గాను అభిప్రాయపడి "ఉత్సాహ, నిర్వేద, శమము"లలో ఏదో ఒకటి శాంతానికి స్థాయి కావచ్చునని చెప్పెనట. ఆలంకారికులలో నవరసాలను మొదటగా ప్రతిపాదించిన వాడు నాట్య శాస్త్ర వ్యాఖ్యాతలలో మొదటి వాడైన ఉద్భటుడు. భట్టతౌతుని వాదము కూడ ఇదే. అభినవగుప్తుడు శాంత రసంతో కూడిన నవరస వాదాన్ని ప్రతిష్ఠాపించాడు. విద్యానాథుడు, జగన్నాథుడు కూడ ఇతనినే అనుసరించారు. సాహిత్య దర్పణకారుడైన విశ్వనాథుడు శాంత రసం కావ్య, నాటకాలు రెండింటిలోను ఉంటుందని అంగీకరించాడు.

భరతుడు నాటక ప్రయోజనాన్ని తెలియచేస్తూ ఈ క్రింది శ్లోకం చెప్పాడు.

క్వచి ద్ధర్మః, క్వచిత్క్రీడా, క్వచిదర్థః, క్వచిచ్ఛమః
దుఃఖార్తానాం, శ్రమార్తానాం, శోకార్తానాం, తపస్వినాం
విశ్రాంతి జననం కాలే నాట్య మేతద్భ విష్యతి

బ్రహ్మర్షీణాంచ విజ్ఞేయం నాట్యం వృత్తాంత దర్శనం"

ఈ శ్లోకంలో ఉన్న 'క్వచిచ్ఛమః' అనే మాట ఆధారంగా భరతుడు కూడ శాంత రసాన్ని అంగీకరించాడనేది కొందరి వాదం.

### 7.1.2.3. రస సంఖ్యకు సంబంధించిన ఇతర వాదాలు

రుద్రటుడు అనే ఆలంకారికుడు 'ప్రేయస్సు'ను కూడ చేర్చి రసాల సంఖ్య పదిగా పేర్కొన్నాడు. మిత్రుల మధ్య తల్లీ బిడ్డల మధ్య మొదలైన చోట్ల ఉండే ప్రీతి శృంగార ప్రీతి కంటె భిన్నమైనందువల్ల దీనికి ప్రత్యేక రసంగా స్థానమివ్వాలని ఇతని అభిప్రాయం.

మధుసూదన సరస్వతి భక్తి అనే మరొక రసం ఉందని, దానికి భగవంతుడే ఆలంబన (ఆధారం) అని చెప్పి భక్తికి రసత్వాన్ని నిరూపించే ప్రయత్నం చేశాడు.

### 7.1.2.4. రసములు అనంతములు

లోకంలో ప్రతి హృదయ వేదనను వ్యవహారంలో రసం అనే వాడతారు. ఉదాహరణ - దయారసం కలవాడు, స్నేహరస పూరితుడు మొదలైన మాటలు.

పై లోకాచారాన్ని బట్టి 'రసములు అనంతములు' అనే మాట ఏర్పడి ఉంటుంది. అందుకే భక్తి, ప్రేయస్సు వంటి వాటితో పాటు కొంతమంది ప్రతిపాదించిన ఉజ్జ్వల, శాంత, దాస్య, సఖ్య, వాత్సల్యాతులు కూడ అనంత రస సంఖ్యలో చేరతాయి.

### 7.1.3 శాంతం రసమా - కాదా - చర్చ

ఆనందవర్ధనాదులు శాంత రస ప్రధానాలైన ఇతిహాసాలు రూపకాలు ఉన్నాయంటూ భారతాన్ని, ప్రబోధ చంద్రోదయ నాటకాన్ని ఉదహరించారు. అష్టరసవాదులు వాటిని వీరరస ప్రధానాలని అన్నారు. బహుకథాశ్రయమై బహుసంఖ్యాక పాత్ర సమన్వితమైన భారతం వంటి ఇతిహాసాలలో ప్రధానరస నిర్ణయం చేయడం కష్టం.

దశ రూపక కర్తయైన ధనుంజయుడు శాంత రసానికి నాటకంలో స్థానం లేక పోవడానికి కారణం ఇలా చెప్పాడు. శాంత రసానికి స్థాయి భావం శమం. శమం అంటే నిర్వికార చిత్తత. స్థాయి భావం ఉల్లోల కల్లోలమై, క్షాళిత రజోమాలిన్యమై, సాత్త్వికమై రసంగా అభివ్యక్త మౌతుందనే సిద్ధాంతాన్ననుసరించి నిర్వికార చిత్తత అనే శమానికి ఆ ప్రక్రియ అసాధ్యమౌతుంది. సహజంగానే మాలిన్యంలేని శమానికి పైన చెప్పిన విధంగా రసంగా అభివ్యక్తం అయ్యే అవకాశం లేదు. దానిని అభినయించుట అసాధ్యం. అందుచే శమం శమంగా ఉండవలసిందే కాని రసం కాదు.

కొందరు శాంత రసం దృశ్య శ్రవ్య కావ్యాలు రెండింటిలోను అంగరసం మాత్రమే గాని, దానిని అంగిరసంగాని బంధించరాదని నొక్కి చెప్పారు. అభినవగుప్తుడు దీనిని చర్చించి శాంత యొక్క రసత్వాన్ని క్రింది విధంగా సమర్థించాడు.

చిత్తవృత్తి విశేషాలైన రతి, క్రోధాదులైన ఎనిమిది స్థాయి భావాలు రసాలుగా ఆస్వాదింప బడుతున్నపుడు వేరొక చిత్తవృత్తి మాత్రమెందుకు రసం కాకూడదు? మోక్షం అనే పురుషార్థానికి ఉచితమైన చిత్తవృత్తియైన శమం "రస స్వరూపం" పొంది ఆస్వాద్యం కాదని అనకూడదు. సామాజికులందరు శాంతాన్ని అనుభవింప లేకపోయినా వీతరాగులైన పురుషులెందరో సామాజికులుగా, పఠితలుగా శాంత రసాస్వాదన చేయగలరు. నటుడు అభినయించలేనంత మాత్రాన శాంతం రసం కాదనరాదు. శమ ప్రధానాలైన వాక్యాలలో ఉన్న శబ్ద శక్తి వల్ల శాంతరసం అనుభవంలోనికి వస్తుంది. ఉదాహరణకు నాచికేతూపాఖ్యానం మనుచరిత్రలను నాటకీకరిస్తే

శాంతరస ప్రధానాలే అవుతాయి. రతి, క్రోధం మొదలైన వాటికి లొంగిపోక శమం బలాన్ని కూర్చుకొని తీవ్ర రూపం దాల్చి విరోధి రసాలను ఓడిస్తుంది. ఇటువంటి బల తీవ్రతలు ఉండటం చేతనే శాంతం రసమౌతుంది.

ఈ విధంగా శాంతం కూడ రసంగా అంగీకరించబడింది. నవరసాలలో స్థానం పొందింది. విద్యానాథ కవి అభినవగుప్తాదుల మార్గాన్ననుసరించి శాంతంతో సహా తొమ్మిది రసాలను అంగీకరించాడు.

### 7.1.4 వివిధ రస స్వభావాలు

తొమ్మిది రసాలలో శృంగారం, హాస్యం, కరుణ, శాంతం అనేవి కోమలమైన రసాలు. వీటిచే హృదయం మృదువుగా అవుతుంది. వీర, రౌద్ర, భయానక, భీభత్సాలు ఉద్ధత రసాలు. ఉద్ధత రసం మనస్సుకు ఊష్మలతను కలిగిస్తుంది. చివరగా అన్ని రసాలు ఆనందపర్యవసాయులే. అయినను కోమల రసాలలో రసోదయం త్వరితగతిన జరుగుతుంది. సూర్య కిరణాలు తగిలి తామర వికసించి మకరందం కురిసినట్లు కవి వాక్కులనే కిరణాలు సోకి భావుకుల హృదయ పద్మం స్పందించి విప్పారి కరిగిపోతుంది. ఈ చివరి స్థితిలోనే రసాస్వాదనలోని అమృతసిద్ధి జరుగుతుంది. కోమల రసాలలోగూడ శృంగార, కరుణ రసాలలో హృదయద్రవీకరణ మరింత తొందరగా జరుగుతుంది. పింగళి లక్ష్మీకాంతంగారి అభిప్రాయాన్ననుసరించి జీవయాత్రతో ప్రధానంగా అవినాభావ సంబంధం కలవి మొదటి మూడు రసాలు మాత్రమే. అవి శృంగారం, హాస్యం, కరుణ.

మిగిలిన ఆరు రసాలు ఈ మూడింటితో సంబంధం కలవేగాని స్వతంత్రాలు గావు. గృహస్థ జీవితంలో ప్రవేశించి దాంపత్య సుఖ జీవనం చేయడం కావ్యంలోని శృంగార రసానికి మూల ప్రకృతి. తన వారిని పోషించుకొనేందుకు, కాపాడుకొనేందుకు చేసే ప్రయత్నాలలో చూపే ఉత్సాహమే వీర రసానికి మూల ప్రకృతి. దైవ యోగం వల్ల తన సొత్తులో ఏదైనా నశిస్తే మానవుడు పొందే దుఃఖమే కరుణ రసానికి మూలప్రకృతి. పుణ్యశాలియైన పురుషుడు దుఃఖానుభవం లేకుండ జీవితం గడపగలడు. కాని మొదటి రెండు లేకుండ ముందుకు సాగలేడు. అవి మానవ ప్రవృత్తికి ప్రథమ, ద్వితీయ చోదకాలు. అందుకే మానవ జీవితాన్ని కావ్యంగా మలచినప్పుడు శృంగార, వీరరసాల్లో ఏదేని ఒక్కటి ప్రాధాన్యం వహించాలని శాస్త్రంలో నిర్దేశించారు. జీవితపు నిస్సారతను గుర్తించి విరక్తుడైనప్పుడు శమం ఉద్భవిస్తుంది. అప్పుడది జీవితాన్ని పరిపాలించే రసాలలో ఒకటైన శాంత రసంగా మారుతుంది. ఈ నాలుగు కాక మిగిలినవన్నీ వీటికి సంబంధించిన శాఖాంతరాలు.

### 7.1.5 రస సంఖ్య - నిర్ణయం

పై సిద్ధాంతాలు ఆధారంగా లాక్షణికులు కావ్యంలో ఉన్న రసాల సంఖ్యను తొమ్మిదిగా అంగీకరించారు. ఆ రసాలు - వాటి స్థాయి భావాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

| | రసాలు | స్థాయి భావాలు |
|---|---|---|
| 1. | శృంగారం | రతి |
| 2. | హాస్యం | హాసం |
| 3. | కరుణం | శోకం |
| 4. | రౌద్రం | క్రోధం |
| 5. | అద్భుతం | విస్మయం |
| 6. | భయానకం | భయం |
| 7. | వీరం | ఉత్సాహం |
| 8. | భీభత్సం | జుగుప్స |
| 9. | శాంతం | శమం |

### 7.1.6 సమీక్ష

కావ్యంలోని రసాలు తొమ్మిది. వీటినే నవరసాలు అంటారు. కావ్య పఠనం వలన రసానుభవం కలిగి అనిర్వచనీయమైన సంతోషం కలుగుతుంది.

### 7.1.7 ప్రశ్నలు

1. రస సంఖ్యను ఎనిమిదిగా అంగీకరించినవారు చూపిన కారణాలను, వారు చెప్పిన ఎనిమిది రసాలను గురించి వ్రాయండి.
2. 'రసములు తొమ్మిది' - అనే విషయాన్ని నిరూపించండి.

### 7.1.8 ఉపయుక్త గ్రంథాలు

1. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
2. ఆంధ్ర ప్రతాపరుద్ర యశోభూషణం - చెలమచెర్ల రంగాచార్యులు

**డాక్టర్ యలవర్తి భానుభవాని**
ఎం.ఏ. యం.ఫిల్. పిహెచ్.డి.
రీడర్ - తెలుగు విభాగం
పి.బి.ఎన్. కళాశాల
నిడుబ్రోలు - 522 124

# పాఠం - 7.2

# రసరాజము

పాఠ్యనిర్మాణక్రమం


7.2.0 లక్ష్యం

7.2.1 రస క్రమం

7.2.2 రసాలలో ఏది శ్రేష్ఠం

7.2.3 శృంగార రసం - విశిష్టత

7.2.4 కరుణ రసం - విశిష్టత

7.2.5 శాంత రసం - విశిష్టత

7.2.6 శృంగారమే రసరాజమా? ఇతర రసాలు ఎందుకు కావు?

7.2.7 సమీక్ష

7.2.8 ప్రశ్నలు

7.2.9 ఉపయుక్త గ్రంథాలు


## 7.2.0 లక్ష్యం

రసాల ప్రత్యేకతను నిరూపించటం.

## 7.2.1 రస క్రమం

రసాలను వరుసగా చెప్పేటప్పుడు ముందు శృంగారాన్ని చెప్పారు. అన్ని ప్రాణులకు సులభమైన కామం సర్వహృదయంగమం. కాబట్టి తత్సాధకమైన శృంగారం మొదట చెప్పబడింది. తరువాత స్థానం హాస్యానిది. హాస్యానికి విరుద్ధమైన కరుణం మూడవది. ఆ కరుణకు కారణమైంది, అర్థ ప్రధానమైంది రౌద్రం. ఇది నాల్గవది. తరువాత అర్థ కామాలకు మూలమైన వీరం, దానికి సంబంధించిన భయానకం బీభత్సం, అద్భుతం వరుసగా చెప్పబడ్డాయి. కడపట శ్రేష్ఠ పురుషార్థమైన మోక్షానికి ఆధారమైన శాంతం చెప్పబడ్డది.

## 7.2.2 రసాలలో ఏది శ్రేష్ఠం

ఈ విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. కొందరు వరుసలో ముందుగా చెప్పబడిన శృంగార రసాన్ని రసరాజంగా పరిగణించారు. మరి కొందరు కరుణ రసం శ్రేష్ఠమైనదన్నారు. వేరొకరు శాంత రసం అన్నిటికంటె గొప్పది, ముఖ్యమైనది కాబట్టి అదే రసరాజం అవుతుందని అభిప్రాయపడ్డారు. ఇంకొకరు 'అద్భుతమే రసరాజమని' మిగిలిన రసాలన్నీ దానిలోనుంచే పుడతాయని చెప్పారు. ఈ విధంగా ఏ రసం శ్రేష్ఠమైనది, దేనిని రసరాజంగా అంగీకరించాలనే విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి.

## 7.2.3 శృంగార రసం - విశిష్టత

పూర్వ సంస్కారాలు వాసనా రూపంలో మనస్సులో ఉన్న వారికి మాత్రమే రసాస్వాదన శక్తి ఉంటుంది. వారు మాత్రమే

రసానందం పొందగలుగుతారు. కొంతమందికి అసలు రసాస్వాదన శక్తి ఉండకపోవచ్చు. అలా ఉండకపోవడం ఆశ్చర్యమూ కాదు. అసహజమూ కాదు. కొందరికి కొన్ని రసాలు ఆస్వాదించేందుకు మాత్రమే అనుకూలమైన పరిస్థితి ఉంటుంది. కాని మానవ సృష్టికి ఆది కారణమైన కామ వాసన సర్వసామాన్యం. సర్వప్రాణి సామాన్యం కూడ. స్థావర ప్రకృతిలో కూడ ఈ వాసన ఉన్నట్లు కొన్ని శాస్త్రాలు చెప్తున్నాయి. అందుచే శృంగారానికి కారణమైన కామ వాసనకు ఉన్న విశ్వవ్యాప్తి మిగిలిన వాటికి లేదు.

శృంగార రసం మొదటి నుండి చిత్త సుఖాన్నిచ్చే మాధుర్యంతో కూడినదే. కావ్యాలలోను, లోకంలోను కూడ మొదటి నుండి చివరి దాకా సుఖాన్నిచ్చేదే. మిగిలిన రసాలు పరిపోషణలోను చరమ దశలోను మాత్రమే ఆనందాన్నిస్తాయి. లోకంలో వాటికి ఏ మాత్రం ఆనంద స్థితి లేదు.

ఉదా - దుఃఖం లోకంలో కూడ దుఃఖమే. అది కరుణ రసంగా మారినప్పుడు మాత్రమే ఆనందాన్నిస్తుంది. అట్లే క్రోధం కూడ. అన్ని చోట్ల అది సుఖాన్నివ్వదు.

మొదటి నుండి కావ్యాలలో శృంగారం మనోహరమైనందువల్ల అది నవరసాలలో అగ్రస్థానానికి అర్హమౌతుంది.

"విశిష్టములు, అభీష్టములు, సందృష్టములునైన చేష్టల నభివ్యంజన మొనరించు ఆత్మగుణ సంపదలకు శృంగారము సముత్కర్ష బీజము. బుద్ధి, సుఖము, దుఃఖము, ఇచ్ఛ, ద్వేషము, ప్రయత్నము, సంస్కారము మొదలగు వాని యతిశయ హేతువు. ఆత్మకు సంబంధించిన యహంకారాత్మక గుణ విశేషము. సచేతసుల కందరకు రస్యమానము. ఇదియే శృంగార రసము" అని జమ్ములమడక మాధవరామశర్మ గారు "భోజమహారాజ శృంగార ప్రకాశము - సాహిత్య ప్రకాశము" అనే తమ గ్రంథంలో చెప్పారు.

అంతేగాక అన్ని ప్రాణుల మధ్య ఏకత్వానికి మార్గాలైన అనురాగం, భక్తి, ప్రేమ మొదలైన మనోభావాలన్నీ శృంగార గర్భితాలైనవే. ఆ దివ్య సుఖమే జీవ, ఈశ్వర ఐక్య భావనకు సాధనమౌతున్నది. శృంగార రసానుభవశాలి తన ఆత్మను పరమాత్మలో తేలికగా లీనం చేయగల్గుతాడు.

శృంగారానికి మరో ప్రత్యేకత కూడా ఉంది. ఈ రసంలో ప్రక్షాళనం కాదగిన మాలిన్యం చాల తక్కువ. కాబట్టి అది 'కెథార్సిస్' ప్రక్రియను ప్రతిఘటిస్తుందని అరిస్టాటిల్ అభిప్రాయమైనట్లు బుచర్ చెప్పాడు. నిజానికి ఎక్కువ ప్రక్షాళనాన్ని అపేక్షించే భావాలు ఆరోగ్యదాయకాలు కావు. అవి ఆత్మకు తేజస్సును తగ్గిస్తాయి. క్షాళనావసరంలేనివి ఆత్మకు దీప్తి నిస్తాయి. అట్టి శక్తి రతి భావానికి అధికం. శమం కూడ ఇటువంటిదే యైనప్పటికి అధిక వ్యాపకత మొదలైన గుణాలవల్ల శృంగారమే శ్రేష్ఠం.

భోజుడు సరస్వతీ కంఠాభరణం అనే గ్రంథంలో శృంగారం ఒక్కటే రసమని సిద్ధాంతం చేశాడు.

"శృంగార ఏవ మధురః
పర ప్రహ్లాదనో రసః" అని ధ్వన్యాలోకం శృంగార రస విశిష్టతను పేర్కొంది.

### 7.2.4 కరుణ రసం - విశిష్టత

భవభూతి మహాకవి "ఉత్తర రామచరిత్ర"లో పాత్రపరంగా ఒక శ్లోకం చెప్పాడు. ఆ శ్లోకం ఆధారంగా కొంతమంది కరుణ రసానికి ప్రాధాన్యమిచ్చి దానిని రసరాజంగా భావిస్తున్నారు.

ఏకోరసః కరుణ ఏవ నిమిత్త భేదాత్
భిన్నః పృధక్పృథగి వాశ్రయతే వివర్తాన్
ఆవర్త బుద్బుద తరంగ మియాన్ వికారాన్
అంభోయథా సలిలమే వహితత్స మస్తమ్

నిమిత్త భేదంతో నీరు సుడులు, బుడగలు, అలలు మొదలైన రూపాలు పొందినట్లు కరుణ ఒక్కటే నిమిత్త భేదంతో అనేక రూపాలలో కన్పిస్తుంది.

ఈ శ్లోకంలోని అభిప్రాయం ఆ పాత్రదా లేక కవిదా అన్నది ప్రశ్న. కథాత్మకమైన కావ్యం వ్రాసినప్పుడు కవి తాను పాత్ర పరంగా కొన్నిసార్లు, సూత్రధారుడుగా కొంతసేపు కథ నడిపిస్తాడు. సూత్రధారుడుగా పలికే పలుకులకు అతడే కర్త. కాని ఇక్కడ పై శ్లోకము పాత్ర పరమైనప్పటికీ భవభూతి వాక్యంగాను, భవభూతి అభిప్రాయంగాను గుర్తించబడింది.

అందుకే ఆ శ్లోకానికి అత్యధికమైన ప్రాధాన్యం వచ్చి కరుణ రసం ఒక్కటే రసమని మిగిలినవన్నీ దాని వికృతులనే అభిప్రాయం కొంతమందికి కలిగింది.

అధికమైన మాధుర్యంతో మనుస్సును ద్రవీభవింప చేసే శక్తి మాత్రమే గాకుండా, ఆనంద పారవశ్యం కల్గించే శక్తి కూడ కరుణ రసానికి ఎక్కువగా ఉంది. కాని అదే నిమిత్త భేదంతో మిగతా రసాలుగా రూపాంతరం చెందుతుందనే విషయం మాత్రం మనోధర్మవేత్తలు అంగీకరించరు. అసలీ రస సిద్ధాంతమంతా శారీరక మానసిక తత్త్వ శాస్త్రానికి సంబంధించింది. మనో ధర్మ శాస్త్ర విరుద్ధమైన దానిని తర్క బలంతో సమర్థిస్తే అది ప్రజ్ఞా వాదమే గాని యదార్థం గాదు.

### 7.2.5 శాంత రసం - విశిష్టత

ఇంకొక మతంలో శాంతం రసరాజంగ పరిగణించబడింది. దానిని వారు క్రింది విధంగా సమర్థించారు.

శాంతం బొమ్మలు వ్రాయటానికి అనువైన భిత్తిక వంటిది. గోడ మీద ఒక బొమ్మను వ్రాసి, దానిని చెరిపి మరొక దాన్ని వ్రాయవచ్చును. ఇట్లా ఎన్ని బొమ్మలు వ్రాసినా గోడ మారదు. ఇతర రసభావాలు పుట్టక ముందు స్వస్థంగా ఉన్న చిత్తవృత్తి శాంతమయం. ఆ చిత్త వృత్తిలో పుట్టిన నానావిధ రసభావాలు దానిలో కలిగిన వికారాలు. అనగా శాంతం ప్రకృతి. రత్యాది ఇతర భావాలు వికృతి. ఆ వికారాలు ఆనంద పర్యవసాయులైన తరువాత గాని, ఆనంద పర్యవసాయులు కాకుండ సమసిపోయిన తరువాత గాని చిత్తవృత్తి శాంతమయం అవుతుంది. రసానందం కూడ శాంత స్వరూపమే. కాబట్టి రసాలన్నీ చరమావస్థలో శాంతంలోనే పర్యవసిస్తాయి. చతుర్విధ పురుషార్థాలలో ఉత్తమమైనది మోక్షం. దానికి సాధకమైన రసం ఇది. అందుమూలంగా దీనికి అధిక ప్రాధాన్యం ఉంది. అందుచే ఇది రసరాజం.

ఈ విషయంలో కూడ రెండు లోపాలున్నాయి. సామాజికుని మనస్సు స్వస్థంగా ఉన్నప్పుడు కలిగెడు వికారాలు రస భావాలనే మాట నిజమే. కాని ఆ స్వస్థత నిర్వికార చిత్తత కాదు. అనగా వైరాగ్యం నుంటి పుట్టిన శమం కాదు. వైరాగ్య జనితమైన నిర్వికారతకే శమం అని పేరు. శాంత రసానికి అదే స్థాయి భావం. నాటకం చూడబోయే ముందుగాని, కావ్యాన్ని చదవబోయే ముందుగాని సహజమైన కుతూహలం కలుగుతుంది. అంతేగాని ఎవరి మనసులోని వైరాగ్యం నుండి పుట్టిన శమం లాంటి భావం ఉండదు. రసాస్వాధన సమయంలో సమస్తమైన శారీరక మానసిక వికారాలు సమసిపోవటం, ఆ ఆనందం శాంతిమయంగా ఉండటం యదార్థమే. అంత మాత్రాన రసాలన్నీ చరమస్థితిలో శాంతంగానే భాసిస్తాయనడం సమంజసం కాదు. అట్లైతే అన్ని రసాలకు శమమే స్థాయి అవుతుంది. ఇది శాస్త్ర విరుద్ధం. శమం శాంత రసానికే స్థాయి. దాని పరిణామమే శాంత రసం. ఇతర రసాలను ఆస్వాదించేటప్పుడు చైతన్యానికుండే లక్షణాలలో శాంతం ఒకటి. ఇది రసానంద విశేషమైన శాంతిగాని, శాంతరసం గాదు, రసాలన్నీ శాంత పర్యవసాయులే అయితే రసభేద పరిగణన అనవసరం. కాబట్టి శాంతం వేరు. శాంతమైన చైతన్యస్థితి వేరు.

### 7.2.6 శృంగారమే రసరాజమా? ఇతర రసాలు ఎందుకు కావు?

శృంగారం, కరుణ, శాంతం అనే మూడు రసాలు వేర్వేరు సిద్ధాంతాల రీత్యా వేర్వేరు వ్యక్తులు రసరాజాలుగా పరిగణించారు.

మనోధర్మ శాస్త్ర విరుద్ధమైన రీతిగా కరుణ రసప్రాధాన్యాన్ని చెప్పినట్లున్నందున అది రసరాజంగా అంగీకరింపబడలేదు.

శాంతికి, శాంత రసానికి మధ్యనున్న భేదాన్ని విస్పష్టంగా గుర్తించకుండా చేసిన సిద్ధాంతం కారణంగా శాంతరసం కూడ రసరాజంగా గుర్తింపబడలేదు.

అద్భుతం రసరాజం అని వేరొకరు చెప్పినప్పటికిని అది యుక్తి సహం కాదు.

కాబట్టి లాక్షణికులలో అధిక సంఖ్యాకులు శృంగార రసాన్నే రసరాజంగా అంగీకరించారు.

## 7.2.7 సమీక్ష

శృంగార రసం రసరాజం, భోజుని సిద్ధాంతాన్ననుసరించి శృంగార మొక్కటే రసం. "పెద్దలందరు రసములు పది యనుచున్నారు గాని మేము మాత్రం శృంగార మొకటియే రసమని యందుము" అనే అర్థం వచ్చే శ్లోకం 'సరస్వతీ కంఠాభరణము'లో ఉంది. రసరాజమైన శృంగారం సంభోగ శృంగారం, విప్రలంభ శృంగారం అని రెండు విధాలు.

## 7.2.8 ప్రశ్నలు

1. శృంగార రసాన్ని గూర్చి వివరించి, ఎందుకు అది రసరాజం అవుతుందో తెలియచేయండి.
2. శాంత రస ప్రాధాన్యాన్ని వివరించి - అందులోని విశేషాలను చర్చించండి.
3. కరుణ రసం ఎందుకు రసరాజం కాలేదు? వివరించండి.
4. నవరసాలలో ఏది రసరాజం? సోదాహరణంగా చర్చించండి.

## 7.2.9 ఉపయుక్త గ్రంథాలు


1. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
2. శ్రీ భోజమహారాజ శృంగార ప్రకాశము - సాహిత్య ప్రకాశము - జమ్ములమడక మాధర రామశర్మ
3. ఆంధ్ర ప్రతాపరుద్ర యశోభూషణం - చెలమచెర్ల రంగాచార్యులు



డాక్టర్ యలవర్తి భానుభవాని

ఎం.ఏ. యం.ఫిల్. పిహెచ్.డి.

రీడర్ - తెలుగు విభాగం

పి.బి.ఎన్. కళాశాల

నిడుబ్రోలు - 522 124

# పాఠం - 8

# శృంగార భేదాలు

పాఠ్యనిర్మాణక్రమం

8.0 లక్ష్యం
8.1 శృంగార ప్రాధాన్యం
8.2 శృంగార రస విభాగం
8.2.1 అయోగ శృంగారం
8.2.2 సంయోగ శృంగారం
8.2.3 విప్రలంభ శృంగారం
8.2.4 త్రివిధ శృంగారం
8.2.5 రసాభాసం
8.3 సమీక్ష
8.4 ప్రశ్నలు
8.5 ఉపయుక్త గ్రంథాలు

## 8.0 లక్ష్యం

రసరాజమైన శృంగారాన్ని గూర్చి శాస్త్రీయంగా తెలుసుకోవడం ఈ పాఠంలోని ప్రధాన లక్ష్యం. అయోగ సంయోగ విప్రలంభ రసాభాస భేదాలు సుప్రసిద్ధాలు. త్రివిధ శృంగారం నూతనావిష్కరణం.

## 8.1 శృంగార ప్రాధాన్యం

చిత్త సుఖాన్ని ప్రసాదించే మాధుర్యం కలది శృంగార రసం. కావ్యంలో లాగానే లోకంలో కూడ ఆద్యంత సుఖ ప్రదాయకమైంది కూడ. తక్కిన రసాలు పరిపోషణంలోనూ చరమ దశలోనూ మాత్రమే ఆనందాన్ని కలిగిస్తాయి. కానీ లోకంలో వాటి కసలు ఆనంద స్థితి లేదు. కనుక లోకంలోను కావ్యంలోను ఆద్యంత మనోహరమైంది నవరసాల్లో శృంగారం ఒక్కటే. అదే అగ్రాసనానికి అర్హమైంది.

సర్వప్రాణి సమైక్యానికి పూలబాటలనదగినవి అనురాగం భక్తి ప్రేమ ప్రణయం వాత్సల్యం మొదలైన హృదయభావాలు. అవి అన్నీ శృంగార గర్భితాలై జీవుడికి స్వర్గ సుఖాన్ని అందిస్తాయి. అటువంటి దివ్యసుఖమే జీవేశ్వరైక్య భావనానికి సర్వప్రాణి సమానత్వ భావనకూ అనుభవానికీ సాధనం.

మానవుడి జీవిత పరమావధి జీవేశ్వరైక్యం శృంగార రసం. అట్టి ఆధ్యాత్మిక స్థితికి ఛాయ మాత్రమే కాక, దాన్ని ప్రతిఫలింప చేసే ముకురం కూడ అదే. శృంగార రసానుభవశాలి తన ఆత్మను పరమాత్మలో సుకరంగా లీనం చేయగలడు. హృదయం ప్రేమ పూరితమైనప్పుడు ఆత్మ భగవానుడి పదాల మీద వ్రాలి ఉంటుందని పింగళి వారి ప్రకృష్ట భావనం.

ఇతర రసాలకంటె శృంగారంలో క్షాళితం కాదగిన మాలిన్యం చాల తక్కువ. అందువల్లనే ఇది కెథార్సిస్ ప్రక్రియని ప్రతిఘటిస్తుంది. ఎక్కువ క్షాళనాల్ని అపేక్షించే భావాలు అనారోగ్య కారకాలు. అవి ఆత్మకు తేజోహానిని కలిగిస్తాయి. క్షాళన అవసరం లేనివి ఆరోగ్యదాయకాలు. అవి ఆత్మకు దీప్తి నిస్తాయి. అటువంటి శక్తిగల వాటిలో రతి భావం ప్రధానమైంది. ఈ

జాతికి చెందిందే శమం. దానిది ద్వితీయ స్థానం. ఇలాంటి అనేక కారణాల వల్ల భోజుడు శృంగారం ఒక్కటే రసమని సిద్ధాంతీకరించాడు.

'ఆమ్నా శిషుర్దశ రసాన్ సుధియోవయందు
శృంగార ఏవ రసనాత్ రసమామ నామ'

చాలమంది ఆలంకారికులు రసాలు పది అన్నారు. కాని మేము శృంగారం ఒక్కటే రసమంటాము - అని సరస్వతీ కంఠాభరణంలో భోజుడు ఉద్ఘాటించాడు. తదుపరి శృంగారం ఒక్కటే రసరాజమని ధ్వన్యాలోక కర్త అన్నాడు.

'శృంగార ఏవ మధురః
పర ప్రహ్లాదనో రసః
తన్మయం కావ్య మాశ్రిత్య
మాధుర్యం ప్రతి తిష్ఠతి'

అని సిద్ధాంతాన్ని ప్రతిపాదించి ఆనందవర్ధనుడు శృంగారానికి పరమ స్థానాన్ని కట్టబెట్టాడు. ఇటువంటి శృంగారానికి, ప్రధాన కారణాలు సర్వజనాను భవగోచరత, సర్వజీవి స్వభావ సిద్ధత, ఆద్యంతం హృద్యంగా ఉండటం, ప్రధాన కారణాలు. ఆపై సృష్టి స్థితికి శృంగారమే మూలం కావటం మరో కారణం.

## 8.2 శృంగార రస విభాగం

రసరాజమైన ఈ శృంగారం సంయోగ, విప్రయోగాలని ప్రధానంగా భావిస్తారు. వీటినే పూర్వ రాగమని ఉత్తర రాగమని కూడ వ్యవహరిస్తారు. పెక్కురు ఈ విధంగానే విభజించారు. కాని దశరూపక కర్త ధనంజయుడు మాత్రం శృంగార రసాన్ని అయోగం సంయోగం విప్రయోగం అని మూడు విభాగాలు చేశాడు. వీటినే అయోగం సంభోగం వియోగాలని పేర్కొంటారు.

### 8.2.1. అయోగ శృంగారం

దీనికే అభిలాషా విప్రలంభమని, పూర్వ రాగమని కూడ నామాంతరాలున్నాయి. ఆయా విభావాల వల్ల రాగం ఉదయించిన ప్రేయసీ ప్రియులకు సంబంధం కలగక పోవటం అయోగం. ఈ పూర్వ రాగ విప్రలంభంలో అభిలాషాదులైన నాయికానాయకుల మనః ప్రవృత్తులు వర్ణిస్తారు. వీటిని స్మరదశలని గాని కామావస్థలని గాని వ్యవహరిస్తారు. వీటిని రసార్ణవ సుధాకర కర్త దశ విధావస్థలన్నాడు. అవి -

"దృఙ్మన స్సంగ స్సంకల్పో జాగరః కృశతా రతిః
హ్రీత్యాగోన్మాద మూర్ఛాంతా ఇత్యనంగ దశాదశ"

దృక్కు= దర్శనం లేదా చక్షుః ప్రీతి, మనస్సంగమం సంకల్పం, జాగరం కృశత అరతి హ్రీత్యాగం, ఉన్మాదం మూర్ఛ, అంతం = మరణం అనేది దశ విధ మన్మథా వస్థల క్రమం.

1) చక్షుః ప్రీతి = నాయిక నాయకుడి చూడగానే చక్షుః ప్రీతి అంటే చూడాలనే కోరిక ప్రథమంగా కలిగే దశ.
2) మనస్సంగం = మనసు ప్రియుడి మీదికి సతతం ప్రసరించటం.
3) సంకల్పం = తరువాత అతని సంగమ చింత కలగటం.
4) జాగరం = ఆ సంకల్పం వల్ల నిద్ర రాక పోవటం.

5) కృశత = తదేక చింతవల్ల శరీరం కృశించటం
6) అరతి = దేని మీదా ప్రీతి కలుగక పోవటం.
7) హ్రీత్యాగం = లజ్జను విడిచి ప్రియుడితో మాట్లాడటం
8) ఉన్మాదం = అదే ధ్యాసలో ఉన్మాద స్థితికి చేరటం
9) మరణం = ప్రేమ ఫలించక పోతే చివరకు మరణ ప్రయత్నం చెయ్యటం

కొందరు అలంకారికులు అభిలాషకు పూర్వం ఇచ్ఛ, ఉత్కంఠ అనే వాటిని కలిపి ద్వాదశావస్థలుగా పేర్కొన్నారు.

నాయిక నాయకుని కలిసికొనటానికి ముందు కలిగే కోరికే అభిలాష.

చం॥ అ నయము శ్రీ నృసింహు లలితాంకతలంబున నుండవచ్చు, నా
యనఘు నఖాంక సంగతుల నందగ వచ్చు, నృపాల మౌళితో
జనవున గుల్కవచ్చు, గుణ సంగతి మెచ్చులు చూపవచ్చు నో
వనజ దళాక్షి! యా కనక వల్లిక నైనను ధన్య నౌదుగా

ఈ నాయిక నాయకుడైన నరస భూపాలుడి తోడి సంభోగాన్ని అభిలషిస్తున్నది. కనుక అభిలాష. ఈ పూర్వ రాగం ముప్విధాలుగా ఉంటుంది. అవి

1) నీలీరాగం = పైకి మిక్కుటంగా కనపడక ఎన్నటికీ తొలగిపోక మనోగతంగా ఉండే ప్రేమ నీలీ రాగం ఇందుకు ఉదాహరణ సీతారాముల అనురాగం. ఇది మధ్యమం.

2) కుసుంభ రాగం = పైకి కనబడుతూ కాలాంతరంలో కరిగిపోయే ప్రేమ కుసుంభరాగం. దేవహూతి కర్దముల అనురాగం ఉదాహృతం. ఇది అధమమైంది.

3) మాంజిష్ఠారాగం = పైకి అధికంగా కనబడుతూ ఎన్నటికీ తొలగని రాగం మాంజిష్ఠా రాగం. ఇందుకు నలదమయంతుల ఇందుమత్యజ మహారాజుల అనురాగం పేర్కొనదగినవి. ఇది శ్రేష్ఠమైంది. ఈ విభాగాన్ని ప్రథమతః ప్రతిపాదించిన వాడు శారదా తనయుడు.

## పారతంత్ర్య భావం

ఈ పూర్వ రాగంలో అనురాగం సంకల్ప రూపంలో ఉంటుంది. ఆ అనురాగ సిద్ధి పరతంత్రంగా ఉంటుంది. కనుక ఇందులో పారతంత్ర్య భావం కూడ ఉంటుంది. ఆపార తంత్ర్యం దైవ కృతం కావచ్చు లేదా మనుష్య కృతం కావచ్చు. ఈ రెండు భేదాల్ని రసార్ణవ సుధాకర కర్త ఉదాహరించాడు. ఈ పారతంత్ర్యంలో ఉన్న ఈ రెండు విభాగాలీ విధంగా ఉంటాయి.

## దైవ పారతంత్ర్యం

శైలాత్మ జాపి పితురుచ్చి రసోఽభిలాషం
వ్యర్థం సమీక్ష లలితం వపురాత్మనశ్చ
సఖ్యా స్సమక్ష మితి చాధిక జాతల జ్జా
శూన్యా జగామ భవనాభిముఖీ కథంచిత్

పార్వతి కూడ, శివుడు తనకల్లుడు కాగలడన్న తన తండ్రి కోరికా, తన అందమైన శరీరమూ వ్యర్థమైనవని తెలిసికొని, తన చెలికత్తె ఎదుట ఇలా జరగటానికి లజ్జపడి శూన్య హృదయంతో ఇంటి ముఖం పట్టి ఎలాగో అతి కష్టం మీద చేరింది.

ఇక్కడ తండ్రి మొదలైన వారి అనుకూలత ఉన్నా దైవ పారతంత్ర్యం వల్ల పార్వతికి కలిగిన పూర్వ రాగం ఇది.

## మానుష్య పారతంత్ర్యం

"దుర్లభః ప్రియస్తస్మిన్ భవ హృదయ నిరాశం
అమ్మో! అపాంగో మే స్ఫురతి కిమపి వామః
ఏష స చిరదృష్టః కథం పునర్ద్రష్టవ్యః
అహం పరాధీనా త్వం పున స్సతృష్ణమ్।"

ఓ హృదయమా! ప్రియుడు దుర్లభుడు. అతని పట్ల ఆశను విడిచిపెట్టు. అమ్మో! ఎడమ కన్ను అదురుతున్నది. చాలకాలం క్రిందట చూచిన ఆ నాయకుడిని మళ్లీ ఎలా చూడగలను. నేను పరాధీనురాలిని. ఇది తెలిసి కూడ నీవు ఆతని పట్ల అభిలాషను కలిగి ఉన్నావు.

ఇందులో శర్మిష్ఠ దేవయానీ పరతంత్ర కావటంతో ఆమెకు యయాతి పట్ల కలిగిన అనురాగం మనుష్య పారతంత్ర్యం వల్ల కలిగిన పూర్వానురాగ భేదం.

## 8.2.2. సంయోగ/సంభోగ శృంగారం

ఏక చిత్తులైన స్త్రీ పురుషుల జంట జీవిత పరిపూర్తి కోసం పరస్పరం కలసి ఉండాలనుకోవటం సంయోగం (A desire to live together in union). ఆ కలయికలో పరస్పర దర్శన స్పర్శన సంబంధమైన సుఖం ఉంది. ఆ సుఖాన్ని ఇద్దరూ కలసి అనుభవించటమే సంభోగం. ఈ అభిలాషలో పురుష ప్రకృతి స్త్రీ ప్రకృతిని, స్త్రీ ప్రకృతి పురుష ప్రకృతిని ఆకర్షిస్తుంది. శృంగార రససిద్ధి విజాతీయాలైన స్త్రీ పుంసత్వ సంయోగం వల్ల కలిగినట్లుగా సజాతీయ ప్రకృతిని సంయోగం వల్ల కలుగదు. కనుకనే ఈ రసానికి నాయికా నాయక ఆలంబనం ఆవశ్యకం. ఇది దీని పరమార్థం. అయినా ఆ జంట మిథున క్రీడా పరమైన సుఖాన్ని అనుభవించిందని అనకూడదు. అది ప్రధానం కాదు. దానికే ప్రాధాన్య మిచ్చి కావ్యంలోను శాస్త్రంలోను అతి మాత్రంగా వర్ణించటం తగదు. ఈ శృంగారానికి మూలం ప్రేమ. అది ఉప్పొంగి వెల్లివిరిసి నిర్భరమైనప్పటి దశకే 'రతి' అని పేరు. మిథున క్రీడ వల్ల ఆ పొంగు చల్లారి చిత్తాలు ప్రకృతి గీతమైనప్పుడు ఆ ప్రాణులు రెండూ అంతటితోనే విముఖాలైతే వారి శృంగారం సంయోగమనే పేరుకె తగదు. యదార్థమైన ఐక్యాన్ని ఆ జంట అభిలషించటం లేదని భావించాలి. కామోద్రేక ప్రేరణంతో వారి కలయిక తటస్థించిందని చెప్పాలి. చిరకాలం సీతారాములు వానప్రస్థులై బ్రహ్మచర్య దీక్షా పరాయణులై కాలం గడపటం మిథున క్రీడా వాంఛలేని సంయోగం. కనుక పరమ పవిత్రమైన నాయికా నాయక ప్రేమకు మిథున క్రీడ మాత్రమే పరమ ప్రయోజనం కాదు. అలా భావించటం అనాగరికం ఆశాస్త్రీయం అనే పింగళి వారి యాదార్థ్యం.

సంయోగ శృంగారానికి ఉదారహణంగా ధనంజయుడిచ్చిన ఉత్తర రామ చరిత్రలోని శ్లోకం ఈ భావాన్ని శతధా శ్లాఘిస్తుంది. సీతాదేవి యొక్క శరీర దర్శన స్పర్శన సుఖాన్ని అనుభవించే రాముడికి చైతన్య భ్రమణమే కలిగింది.

"వినిశ్చేతుం శక్యోన సుఖ మితివా దుఃఖమితి వా
భ్రమో వా నిద్రా వా కిము విష విసర్పః కిము మదః
తవ స్పర్శే మమ హి పరిమూఢేంద్రియ గణో
వికాం శ్చైతన్యం భ్రమ యతిచ సమ్మోహ యతి చ"

నీ శరీరాన్ని నేను స్పృశించి నపుడెల్ల నా యింద్రియాలు పరిమూఢాలైతున్నాయి. నా చైతన్యాన్ని భ్రమింప చేస్తూ మూర్ఛలో ముంచుతున్న ఈ వికారం అది సుఖమో దుఃఖమో మోహమో నిద్రో విష ప్రసారమో మదమో చెప్పలేకున్నాను - అని అంటాడు రాముడు.

వారి ఈ పరమానంద సంయోగ జీవన విధానం పరమ శృంగార భావనా స్పృహణీయం.

ఈ సంయోగ శృంగారాన్ని గూర్చి దశరూపక కర్త ధనంజయుడిలా నిర్వచించాడు.

'అనుకూలౌ నిషేవేతే యత్రాన్యోన్యం విలాసినౌ
దర్శన స్పర్శనాదీని ససంయోగో ముదాన్వితః'

అనుకూలురైన ఇద్దరు యువతీ యువకులు పరస్పర దర్శన స్పర్శనాదికాన్ని అనుభవించే సమయంలో కలిగే సుఖాన్వితమైన వారి అనుభూతి సంయోగం.

దంపతులిద్దరూ ఒకరి హృదయంలో ఒకరు జీవిస్తూ ఎడబాటు లేకుండా మధురమైన దాంపత్య సుఖాన్ని అనుభవించటమే ఈ సంయోగ శృంగారం. అదే దంపతుల ప్రణయ జీవితం. దంపతుల ప్రణయ జీవితాన్ని వర్ణించటంలో మహాకవి కాళాదాసు కృతహస్తుడు. జగత్పితరులైన పార్వతీ పరమేశ్వరుల కంటె తపః పరాకాష్ఠ, నియమ నిష్ఠగల దంపతులుండరు కదా! ఆ ఆది దంపతుల ప్రణయ జీవితాన్ని ఊహించటం కష్టంకదా! వారిని గూర్చి కాళిదాసు కుమార సంభవంలో.

వారిద్దరూ చెట్టపట్టాలు పట్టుకొని ఆకాశగంగా తటిని విహారానికి వెళ్ళారు. అంతలో వారికి జలకేళీ కౌతుకం కలిగింది. నదీ జల ప్రవేశం చేశారు.

'హేమ తామరస తాడిత ప్రియా
తత్కరాంబు వినిమీలితే క్షణా
ఖే, వ్యగాహత తరంగిణీ ముమా
మీన పంక్తి పునరుక్తి మేఖలా' - కుమార సంభవం

మందాకినిలోని బంగారు తామరతో పరమశివుడిని పార్వతి సుతారంగా తాటించింది. అతడు మాత్రం తక్కువ సరసుడా! దోసిళ్లతో నీటిని పార్వతీదేవి ముఖాన చిమ్మాడు. ఆ జల్లుకు తాళలేక ఆమె కళ్లు మూసుకుంది.

జలకేళి తర్వాత వారు నందన వనంలో ప్రవేశించారు.

"తం పులోమ తనయాల కోచితైః
పారిజాత కుసుమైః ప్రసాధయన్
నందనే చిరమయుగ్మ లోచనః
సస్పృహిం సురవధూభి రీక్షితః"

ఆ నందన వనంలోని పారిజాత కుసుమాల్ని కోసి శివుడు శివకలంకరించాడు. ఆ సన్నివేశాన్ని సురకాంతలు క్రీగంటితో సస్పృహంగా చూచారు. పార్వతి ఎంత అదృష్టవంతురాలని అనుకొని ఉంటారు. కనుక శృంగారమంటే విభావానుభవ సంబంధమైనది మాత్రమే కాదు. స్పృహణీయమైన చిన్న మాట లేదా చేత ఏదైనా శృంగారమే నని తెలుస్తుంది.

పార్వతీ పరమేశ్వరులు లాగా ఏక శరీరధారులు కావాలంటే దంపతులిట్టి ప్రణయ జీవితాల్ని గడపాలి. ఈ జీవితమే శృంగార కావ్య శిల్పులకు అమూల్యమైన ఇతివృత్తం.

రఘువంశంలోని అజవిలాస ఘట్టంలో కూడ ఇటువంటి ప్రణయ జీవిత స్మరణమే ఉంది. ఇందుమతి గృహిణిగా గృహ నిర్వహణం చేస్తూ, మంత్రిగా మంత్రాలోచనలు చేస్తూ నర్మసఖిగా సల్లాపాలు సాగిస్తూ శిష్యురాలిగా సంగీత సాహిత్యాలు అభ్యసిస్తూ అజమహారాజును నిత్యానందాబ్ధిలో ముంచెత్తింది.

ఆమె మరణానికి విలపిస్తూ అజమహారాజు -

"గృహిణీ సచివత్సఖా మిథః
ప్రియ శిష్యా లలితే కళా విధౌ
కరుణా విముఖేన మృత్యునా
హిరతా త్వాం వదకిం నమేహృతమ్"

నా గృహిణిని నా సచివుని నా నర్మసఖిని నా శిష్యురాలిని హరించిన క్రూర మృత్యువు నా కింకేమి మిగిల్చింది?

"తవ నిశ్వసి తాను కాంభిః
వకుళై రర్ధ చితాం సమంమయా
అసమాప్య విలాస మేఖలాం
కిమిదం కిన్నర కంఠి సుప్యతే"

నీ నిశ్వాసంలాంటి పరిమళం గల పొగడ పూలతో నీ సింగారపు మొలనూలి కోసం మన మిద్దరం గ్రుచ్చుకొన్న ఈ దండ ముగిసి పోకుండానే కన్ను మూసితివేమిటి ప్రియా - అజుడు.

ఇలా సంయోగ శృంగారానికి మహాకవులు స్వీకరించే ప్రణయ జీవిత విధానాలు అందులోని వర్ణనలూ అన్నీ కామవాసనలేని ఆనందమయ దంపతి చర్యలు. అటువంటి ప్రణయ జీవులే సంయోగ శృంగారానికి ఉచితమైన ఆలంబనం. ఇటువంటి జీవన విధానాన్నే శారదా తనయుడు కౌలీన శృంగారం అన్నాడు.

తెలుగులో నిర్వచనోత్తర రామాయణంలో తిక్కన సీతా పరిత్యాగ ఘట్టానికి పూర్వం ఆ నాయికా నాయకుల సంయోగ శృంగారాన్ని వన వినోద శయ్యాగృహ వర్ణనల రూపంలో ఎంతో నాగరికంగా ప్రదర్శించాడు. కళా పూర్ణోదయంలో పింగళి సూరన చేసిన సరస్వతీ చతుర్ముఖుల లీలా విహార వర్ణనా ఉత్తమ జాతి సంయోగ శృంగారానికి మరొక ఉదాహరణం.

ఉత్తమోత్తమమైన చిత్త సంస్కారం కలిగి నాగరక జీవితంలోని సుందర సాధుత్వాన్ని గ్రహించి ఆ విధంగా జీవితాన్ని గడుపుకొన్న కావ్య ఘట్టాల్లోని సంయోగ శృంగారాన్ని వర్ణించటం సాధ్యమైతుంది. అటువంటివారు ప్రపంచ వాఙ్మయంలో చాల తక్కువగా ఉంటారు. జాంతవమైన కామోద్రేక వర్ణనమే శృంగార రసంగా భావించే కవులు గ్రామ్యతా భూయిష్ఠమైన చిత్తవృత్తి గలవారని నిస్సందేహంగా చెప్పవచ్చు.

## కౌలీన శృంగారం

భారతీయ సంప్రదాయాల్ని బట్టి దంపతులంటే గృహస్థాశ్రమంలోని సహధర్మచారులు. అతిథి పితృపూజలు అనాథ దీన జన పోషణ చేస్తూ ఉపవాస వ్రతానుష్ఠానాలతో ఆత్మ సంయమనం అలవరచుకొని నియమబద్ధమూ కాల్యరహితమూ అయిన

తృతీయ పురుషార్థాన్ని సేవించి సత్సంతానాన్ని కని వంశ ప్రతిష్ఠను కలిగించి వనాలకు వెళ్ళి గాని ఇంటనే ఉండి గాని జీవిత చరితార్థ తృప్తిని అనుభవించటంలో దంపతులు ఆద్యంతం సహధర్మచారులైతారు. అది వారి పవిత్ర జీవిత చర్య. అది గృహస్థ జీవితంలో వారు గడిపే ధార్మిక జీవితమే కావచ్చు గాని, అందులో వారి ప్రణయ జీవితం కానరాదు. దంపతులు ఎటువంటి కఠోర వ్రత పరాయణులైనా ప్రణయ జీవిత భాగం కూడ ఒకటి ఉంటుంది. వారి ఆ జీవిత భాగం కావ్యంలో చిత్రితమైనప్పుడు అది వారి సంయోగ శృంగార గాథ అవుతుంది.

కులీన కాంతాగతమైన శృంగారం కౌలీన శృంగారం అది సమాన శీలం గలిగిన దంపతుల సాంసారిక జీవన మాధుర్యసారం. కులీనలు స్వీయ కాంతలు. వారు సంపదల్లో గాని ఆపదల్లో గాని ప్రియుని వీడి ఉండరు. శీలం సత్యం ఋజుత్వంతో గూడిన రహః సంభోగ లాలసలుగా ఉంటారు. వారు సంప్రదాయబద్ధలు. వీరి పట్ల శృంగారమంటే మధుర భావనం ఏదైనా కావచ్చు, విభావానుభావ సంబంధమైనదే కానవసరం లేదు. సాంసారికంగా వివిధ భూమికల్లో అది అనుభూతమైతుంది. వారి అనురాగ దాంపత్య మురళి రవళిస్తుంది. దీన్నే గార్హస్థ్య శృంగారమనీ కౌటుంబిక శృంగారమని కూడ వ్యవహరిస్తారు. ఈ కౌలీన శృంగారంలోనే ధర్మార్థ కామాలన్నీ లీనమైతాయని ముందే తెలుసుకున్నాం.

కౌలీన శృంగారాన్ని సంతాన పరిణతి పర్యంతం ఒక దశ గాను తర్వాత కుటుంబ నిర్వహణంలో వచ్చే సాధక బాధకాలు ఒక దశ గానూ పరిగణించవచ్చు. రెండు దశల్లోనూ సర్వ కామాల్నీ సభార్యాకంగానే పండించుకోవాలి. కనుక అవి అన్నీ కౌలీన శృంగారోత్పన్నాలే. ఇటువంటి కౌలీన శృంగారంలో ధర్మార్థ కామాల్ని అందరూ చక్కగా పండించుకోవచ్చు. అనురాగమయమైన ఈ శృంగార యోగంలో జీవితాన్ని ఆనంద ధామంగా దీన్ని తీర్చి దిద్దుకోవచ్చు. దీన్ని గురించి భవభూతి ఉత్తర రామచరిత్రలో శ్రీరాముని ముఖతః ఇలా పలికించాడు.

శ్లో॥ "అద్వైతం సుఖ దుఃఖయో రనుగతం సర్వాస్వవస్థాయి య
ద్విశ్రామో హృదయస్య యత్ర రజరసా యస్మి న్నహార్యో రసః
కాలే నావరణాత్యయా త్పరిణతే యత్స్నేహ సారే స్థితం
భద్రం తస్య సుమానుషస్య కథమప్యేకం హి తత్ప్రార్థ్యతే॥"

ఏ దాంపత్యం సుఖదుఃఖాల్లో ఒక్కటి గానే ఉంటుందో, ఏ దాంపత్యం అన్ని అవస్థల్లోనూ అంటే సంపత్తుల్లోనూ విపత్తుల్లోనూ అనుగుణంగా ఉంటుందో, ఏ దాంపత్యం హృదయానికి ఊరట కలిగిస్తుందో, ఏ దాంపత్యం ముదిమి పైగొన్నా రక్తి హరించుకొనిపోదో, ఏ దాంపత్యం కాల క్రమంగా పరిణమిస్తూ స్నేహసారంగా నెలకొంటుందో అటువంటి సుమానుషత్వం భద్రంగా ఉండాలి.

ఇటువంటి దంపతుల సాంసారిక జీవన విధానమై కౌలీన శృంగారం లేదా కౌటుంబిక శృంగారం.

## సంభోగ శృంగార భేదాలు

భోగ్య ద్రవ్యోప భోగానికి భోగమని పేరు. భోగమనేది సుఖాసాధ్యం. ఆ భోగమే శృంగార విశేషంగా ప్రఖ్యాతమైంది. భోగం ఉపభోగం సంభోగం అనే శబ్దాలు పర్యాయ వాచకాలు. లోకంలో సర్వప్రాణులకూ సంభోగంలో మానసికమైన రతి ఉంటుంది. అది రాగ సహితులైన యువతీ యువకులందే ప్రధానంగా ఉంటుంది. ప్రేయసీ ప్రియులకు సంభోగంలో రతి ఉంటుంది.

ఈ సంభోగ శృంగారం నాల్గు విధాలు. ఇంతకు పూర్వం కలయిక లేనివారు కానీ, కలసికొని ఎడబాసిన వారుకాని అయిన నాయికా నాయకులు పరస్పరం కలసికొన్నప్పుడు వెనుక కలిగిన రతిగాని, అప్పుడు కలిగిన రతిగాని, కోరుకొన్న ఆలింగనాదులు సిద్ధించటం వల్ల కలిగిన హర్షం వంటి వాటి చేత సంస్పృజ్యమానమై చందోదయాదులచేత వృద్ధి పొందింపబడి స్మితాదులచే వ్యక్తమై

పరిపుష్టి పొంది సంభోగ శృంగారం అవుతుంది. అవి చతుర్విధాలు.

1. పూర్వరాగానంతర సంభోగం
2. మానానంతర సంభోగం
3. ప్రవాసానంతర సంభోగం
4. కరుణానంతర సంభోగం

ఆయా సంభోగాలకు ప్రేయసీ ప్రియుల సంభోగ సౌఖ్య భేదాల్ని బట్టి వరుసగా సంక్షిప్తం, సంకీర్ణం, సంపన్నం సమృద్ధిమంతం అని వ్యవహారం. ఈ విభాగం అధికంగా అటు శారదా తనయుడు ఇటు సింగ భూపాలుడూ కూడ అనుసరించారు. శృంగార విషయంలో అందరకూ ఆరాధ్యుడు భోజుడే.

## ప్రధమ రాగానంతర సంభోగం

ప్రధమ రాగంలో సముత్పన్నమైన సంభోగ సమయంలో అభీష్టాలైన ఉపచారాలుండటం వల్ల సంభోగం ఉన్నతంగా ఉంటుంది. సంప్రాప్తమైన శృంగారాన్ని చక్కగా ఉపచార కౌశలంతో పాలించటం నిరంతరం ఉపచార సంపన్న సముచిత సముల్లాసంతో అనువర్తించడం సముచితంగా ఉంటుంది. ప్రధమ సమాగమ సమయంలో ప్రేయసీ ప్రియుల పరస్పరోపచార విశేషాలు సాధ్యసాదులతో కూడి ఉండటం వల్ల సంభోగ ప్రక్రియా విశేషాలన్నీ మితంగానే ప్రయుక్తమైతాయి. కనుక దీనిని మిత సంభోగమని పేరు. ప్రధమ సమాగమంలో యువతీ యువకులు భయం సిగ్గు వంటి వాటి వల్ల ఉపచారాలు సాధ్యసంతో కూడి సంక్షిప్తంగా ఉంటాయి కనుక సంక్షిప్తమని వ్యవహారం.

1. పురుషుడికి కలిగిన భయం వల్ల కలిగిన సంక్షిప్తం.

ఉదా॥ "విలాసం చేత గోవర్ధన పర్వతాన్ని ఎత్తిన
శ్రీకృష్ణుని హస్తం రాధ యొక్క వక్షస్థలం మీద
ప్రధమ సమాగమంలో కల్గిన భయం చేత వణుకు
చున్నది" - అది మిమ్ము రక్షించుగాక!

2. వనితకు కలిగిన సాధ్యసానికి ఉదా॥

"చుంబనే ష్వధర దాన వర్జితం
సన్న హస్త సదయోప గుహనే,
క్లిష్ట మన్మధ మపి ప్రియం ప్రభో
ర్దుర్లభ ప్రతి కృతం వధూరతమ్" - కుమార - 8 స.

చుంబనాల్లో పెదవి మీద దంతక్షతాలు లేనిదే స్తనాలపై మెల్లని చేతులు కలదగుట చేత బిగిలేని కౌగిలి కలదీ అయిన వధూ (పార్వతి) సంగమం, మదన విలాసంతో తృప్తి పొంద నప్పటికీ శివుడికి ప్రియంగానే ఉంది.

## మానానంతర సంభోగం

ప్రధమానురాగంలో గానీ, తదనంతర సంభోగంలో గానీ ప్రియుడు చేసిన అపరాధాలవల్ల యువ జంటల మానసాల్లో కలిగే రోషానికే 'మానం' అని పేరు. ఈ రోషం స్త్రీలకు వర్ణించటం ఉత్తమం. అటువంటి మానానంతర సంభోగం కుటిలంగా ఉంటుంది.

అది ఎప్పుడూ కౌటిల్యాన్ని వీడదు. ఇందులోని ప్రేమ కుటిలం, ఈ కౌటిల్యానికి అలవడిన ప్రేయసీ ప్రియులు అనంతర సంభోగంలో కూడ అంతర్నిహితంగా కౌటిల్య భావంతోనే ఉంటారు. పరస్పరం కౌటిల్య సంబంధమైన శంకాతంకాలతో ఉంటారు. ఇలా కొద్దిపాటి కలుష భావంతో ఉండి కూడ సంప్రాప్తమైన సంభోగానందంతో ఉంటారు. ప్రియుడు చేసిన అలంకారాలతో అనుగ్రహం కలిగినా, పూర్వం చేసిన అపరాధ స్మరణంతో కోపం ఉంటూనే ఉంటుంది. కనుక అప్పటి సంభోగం కోప సంకీర్ణంగా ఉంటుంది. కనుక దానికి 'సంకీర్ణ సంభోగ' మని 'సంకర సంభోగ' మని వ్యవహారం. ఇది కొద్దిపాటి మన్మథ చేష్టల వల్ల సుకుమారంగా ఉంటుంది. విమర్దనాల చేత రమ్యాలూ మత్సరంతో కూడినవి, ధైర్యం స్వేచ్ఛలతో కల్పితాలు అయిన సురతాలు 'మానం' పోవటం వల్ల స్పష్టంగా ఉండి ఆ దంపతులు అనుభవిస్తారు. ఇటువంటిది కళాచతురత్వంతో కావ్యగౌరవాన్ని పొందుతుంది.

ఇందుకు పారిజాతాపహరణ ప్రబంధం చక్కని ఉదాహరణ.

## ప్రవాసానంతర సంభోగం

భయం మిథ్యా స్మరణాదులు లేకుండా మిక్కిలి వైభవం కలిగి, ప్రవాసానంతరం మరల కలసి కొన్న యువతీ యువకుల సమ్యక్సంభోగం అతి హృద్యంగా ఉంటుంది. ఆకలి గొన్నవాడికి హృద్యమైన అభ్యవహారంలాగ ప్రవాసానంతరం భోగులు అన్య విషయాలకు మనసులో తావివ్వరు. ఏకాగ్రచిత్తులై సంభోగరసాన్ని ఆస్వాదిస్తారు. ప్రవాస సమయంలో భావించి భావించి పేర్చుకొన్న కూర్చుకొన్న ఇష్ట భోగాలన్నింటినీ శత గుణితంగా అనుభవించాలనుకొంటారు. అలా చేస్తాను ఇలా చేస్తాను. అలా చేస్తే ఇలా చేస్తాను. ఇలా చేస్తే అలా చేస్తాను అని భావిస్తూ హృద్యంగా సంభోగాన్ని అనుభవిస్తారు.

కామ సంపన్నులు ప్రోషితులై వచ్చి ఉపభోగరీతులైనప్పుడు వారి సమ్యక్సంభోగం సంపన్నంగా ఉంటుంది. కనుక అప్పటి సంభోగం సంపన్న సంభోగం. సంపన్న సంభోగం పలు భేదాలతో ప్రియుడి వార్తా శ్రవణం నుండి సమాగమ పర్యంతం ప్రకాశిస్తుందంటాడు భోజుడు. వీటితో సంభోగ పుష్టి కలుగుతుంది.

'దంతక్షతః కపోలే కరగ్రహోద్వేల్లితశ్చ ధమ్మిల్లః
పరిచుంబితాచ దృష్టిః ప్రియాగమం సూచయతి వధ్వాః' - రసార్ణవ సుధాకరం.

చెక్కిలి మీద దంత క్షతాలు చేతిలో చెదరిన కేశపాశం గాఢంగా ముద్దిడు కొన్న కళ్లు ఆమె ప్రియుడి రాకను తెల్పుతాయి.

ఈ ఉదాహరణంలో నాయికకు ప్రధమ సంభోగం కానందువల్ల, భయరహిత కావటం, దంతక్షతాదులకు అనుకూలంగా అవయవార్పణ చెయ్యటంలో వ్యళీకస్మరణాదులు లేకపోవటం కన్పిస్తుంది. కనుక ఇది పరిపూర్ణ వైభవం కలిగిన సంభోగానికి ఉదాహరణ.

## కరుణ/విప్రలింభానంతర సంభోగం

కరుణానంతర సంభోగం విస్రంభంతో కూడుకొన్న అనుభూతిని పొంది ఉంటుంది. ఈ సమయంలో వారికి కాలుష్యం ఉండదు. ఆశారాహిత్యంతో వ్యధితులై నిరపేక్షా స్వభావులైనవారు ప్రత్యుజ్జీవిత ప్రియసంబంధంలో ఆశాసహితులై సాపేక్షభావులై ఇష్టాభీష్ట భోగాలను అనుభవిస్తారు. పూర్వాచరిత సంభోగ క్రియలన్నింటికి సానుసంధానంతో స్వానుసంధానంతో అనుభవంలో అందుకుంటారు. అనుభూతి సర్వస్వం వీరి అనుభవంలోనే ఉంటుంది. మరణించిన వ్యక్తి పునర్జన్మకు సంబంధించిన శరీరాంతరంతో సంగమ ప్రత్యాశవల్ల రతి ఉదయించి వారికి సంభోగం ఘటిల్లినా అది కరుణానంతర సంభోగమే.

మృతులైన జీవించిన వారి సంభోగం సమృద్ధం. ప్రత్యుజ్జీవనం వలని హర్షాదుల వల్ల ప్రవృద్ధమై దీనాతిశయ విశేషాల చేత దీప్తమయితుంది. కనుక అప్పటి వారి శృంగారం 'సమృద్ధ సంభోగం'. ఈ కరుణ విప్రలంభానంతర సంభోగంలో కలిగే అవస్థ

విశేషాలు ప్రధానంగా చతుర్వింశతి అని భోజుడు పేర్కొన్నాడు. పోతన భాగవతంలోని 'శంబరుడి యింట్లోని చేరి మాయవతీ ప్రద్యుమ్నుల పునస్సమాగమంలో వారి కరుణానంతర సంభోగ శృంగారపుష్టి సౌఖ్య సంపద వ్యక్తమైతాయి. వారి సంభోగం సమృద్ధం. కనుక ఇలా తిరిగి బ్రతికి కలిసి కొన్నవారి భోగ సమృద్ధి ఇంతమాత్రమని నిర్ణయించవలసింది సమృద్ధిమంత శృంగారం.

'అకలిత పరిరంభ విభమాణ్యా
గుణిత చుంబన డంబరాణి దూరమ్
అఘటిత ఘనతాడ నాని నిత్యం
నమతానంగ రత్యోర్మోహనాని' - రసార్ణవ సుధాకరం

కూర్పబడని ఆలింగన విశేషాలు లెక్కింపని చుంబన డంబరాలు అధికంగా కూర్పని తాడనాలూ కలిగి నిత్యం జరిగే రతి మన్మధుల మోహనాలు జయించుగాక అని అర్థం.

ఇక్కడ, మరల జీవించిన మన్మధునితో కలసికొన్న రతీదేవి యొక్క రతి, బాహ్యోపచారాలు లేకుండానే ఫలమైన సుఖప్రాప్తిని కల్గించినట్లుగా చెప్పటం చేత ఇక్కడి కరుణానంతర సంభోగం సమృద్ధమైంది.

## ఇతర విశేషాలు

స్త్రీ అనురక్త అయితేనే పురుషుడు అనురక్తుడు కావాలి. అప్పుడు అది ఉత్తమ సంభోగం. ప్రేయసీ ప్రియులకు అన్యోన్య రక్తిమ ఏక కాలీనమైతే అది మధ్యమ కామం అవుతుంది. ఇద్దరిలో ఏకత్రానురాగమే ఉంటే అది అధమ సంభోగం. ఇది శారదా తనయుడి మతం. స్త్రీ పురుషులకు గల ప్రకృతి తారతమ్యమే ఈ భేదాలకు మూలకారణం. పురుషుడు ధీర ప్రకృతి గలవాడు. స్త్రీ లలిత ప్రకృతి గలది. కనుక స్త్రీ పురుషులో స్త్రీకి గల అనురాగం ముందుగా ప్రకటితమైతుంది. దీనినే మమ్మటుడు మరో విధంగా, నాయకారబ్ధ శృంగారం అనీ నాయికారబ్ధ శృంగారమనీ పేర్కొన్నాడు.

## 8.2.3. విప్రలంభ శృంగారం

పరస్పర దర్శన స్పర్శనాలతో పరమానంద జీవితాన్ని గడిపే నాయికా నాయకులు ఏదేని కారణం వల్ల ఎడబాసి పునస్సంయోగ వాంఛతో బాధపడటం విప్రలంభ శృంగారం. అలా ప్రేయసీ ప్రియులు విడివడి ఉండటాన్ని ధనంజయుడు అయోగం అని పేర్కొన్నాడు.

'తత్రాయోగోఽను వాగేఽపి నవయోరేక చిత్తయోః
పారతంత్రేణ దైవాద్వా విప్రకర్షా దసంగమః'

ఉత్తమ దంపతులకు తటస్థించే విప్రయోగమే విప్రలంభ శృంగారం. వారి సంయోగం ఎంత సుఖకరంగా ఉంటుందో వారి వియోగం అంత విషాదకరం. పరస్పర గాఢానురాగం గలిగిన ప్రియుల విరహ ప్రవృత్తుల చిత్రణమే విప్రలంభం. దీని వ్యత్పత్తి.

'సంభోగ సుఖాస్వాద లోభేన విశేషేణ ప్రలభ్యతే ఆత్మాఽత్రేతి విప్రలింభః' - సంభోగ సుఖస్వాద లోభం చేత ఆత్మ మిక్కిలిగా ప్రతారింపబడుతుంది. అందుచేత ఈ అవస్థ విప్రలంభమైంది.

పాశ్చాత్యులు ట్రాజెడీకిచ్చినంత ప్రాధాన్యం ఇతరాలకు ఇవ్వలేదు. శృంగార రస ప్రాధాన్యం ట్రాజెడీలో కూడ గోచరిస్తుంది. ఎలాగంటే "నవినా విప్రలంబేన శృంగారః పుష్టిమశ్నుతే కషాయితేహి వస్త్రాదౌ భూయాన్ రాగోవివర్ధతే" అని ఆలంకారికులు శృంగారంలో సైతం విప్రలంభ శృంగారం ప్రధానమన్నారు. అంతే కాకుండా విప్రలంభం లేకుంటే శృంగారానికి పుష్టిలేదు. కషాయితమైన

వస్త్రంలోనే రంగు వృద్ధి చెందుతుంది. కనుక సుఖ దుఃఖోభయ మిశ్రణం వల్ల ఏర్పడిన ఈ శృంగారం అత్యంత ప్రధానమైంది.

## సంభోగ వియోగాల్లో ఏది ప్రీతి పాత్రం?

ఉత్తమ యువ ప్రకృతులైన స్త్రీ పురుషుల సంభోగ శృంగారం విప్రలంభ సహకృతమైతే మరింత శోభిస్తుంది. అది విప్రలంభంలో సహకృతం కావాలే తప్ప పరిభూతం కాకూడదు. సంయోగ విప్రలంభాల సమ్మేళనమే స్వాతిశయ చమత్కారవహమని అభినవగుప్తుని అభిభాషణం.

'అత ఏవ ఏతద్ద శాద్వయ మేళన ఏవ
సత్యతః సాతిశయ చమత్కారః యధా'

'ఏకస్మిన్ శయనే పరాఙ్ముఖతయా వీతోత్తరం తామ్యతో
రన్యోన్యం హృదయ స్థితే ప్రనునయే సంరక్షితో ర్గౌరవమ్
దంపత్యోశ్శనకై రపాంగ వలనా న్మిశ్రీభవ చ్చక్షుషో
ర్భగ్నో మాన కలిః సహసరభస వ్యాసక్తి కంఠగ్రహిమ్ - అమరుక శతకం - 23

భార్యా భర్తలు ఒక పాన్పు మీదే ప్రణయ కలహంతో ఎడముఖం పెడముఖంగా పరుండి మౌనం వహించి బాధపడుతూ ఒకరినొకరు మన్నింపవేడుకోవటానికి కోరిక కలిగి ఉన్నా, తమ బెట్టు పోతుందనే భయంతో అలా వేడుకొనకుండా ఉండి, తరువాత అన్యోన్య భావగ్రహణం కోసం కడకన్నులతో ఒకరి నొకరు చూచుకొని చూపులు కలుపుకొని పరస్పర ప్రసాదాపేక్ష తెలుసుకొని తటాలున మహా సంతోషంతో నవ్వుతూ సరిగా పరస్పరాభి ముఖంగా తిరిగి కంఠాశ్లేషం చేసుకొని కృతార్థులైనారు.

ఇలా వియోగానంతర సంభోగం విశేషంగా ఉంటుందని భావం. అలాగే ఒకే పాన్పు మీద ఉన్నా పొలయతికతో మాటాడు కోకుండా ఉంటే అది కూడ వియోగమేనని, తెలుస్తుంది. ఇలా శృంగారం విప్రలంభ సహకృతమైతే సరస మనోహరంగా ఉంటుంది.

## విప్రలంభ శృంగార భేదాలు

విప్రలంభ శృంగారాన్ని అనేకాలంకారికులు చతుర్విధాలుగా వింగడించారు. అవి -

1. పూర్వానురాగ విప్రలంభం
2. మాన విప్రలంభం
3. ప్రవాస విప్రలంభం
4. కరుణ విప్రలంభం

కాని కావ్య ప్రకాశకర్త మమ్మటుడు మాత్రం పంచ విధాలని పేర్కొన్నాడిలా.

1. అభిలాషా విప్రలంభం
2. విరహా విప్రలంభం
3. ఈర్ష్యా విప్రలంభం
4. ప్రవాస విప్రలంభం
5. శాప విప్రలంభం

భేదాల విషయంలో భేదాభిప్రాయాలున్నా విప్రలంభ స్వరూపంలో మాత్రం వారికి ఎట్టి అభిప్రాయభేదాలూ లేవు.

పరస్పర గాఢానురాగంగల ప్రియులకు కలిగే విశ్లేషం మాన, ప్రవాస భేదాలచే రెండు రకాలని, ఆ రెంటిలో మానానికి ప్రణయంగాని ఈర్ష్యగాని కారణం అవుతుందని అందువల్ల అది మరలా రెండు రకాలన్నాడు ధనంజయుడు.

'విప్రయోగస్తు విశ్లేషో రూఢ విస్రంభయో ర్ద్విథా
మాన ప్రవాస భేదేన మానోఽపి ప్రణయేర్ష్యయోః' - దశరూపకం

**అభిలాషా విప్రలంభం**

అయోగ శృంగారాన్ని గూర్చి ఇంతకు ముందే చర్చించుకున్నాం. అదే అభిలాగా విప్రలంభం.

**మాన విప్రలంభం**

వద్దు వద్దంటూనే ప్రతిషేధార్థాలతో అభీష్టాలైన ఆలింగనాదుల్ని రోషంతో అడ్డుకోవటాన్ని మానం అంటారు. ఇందులో సహేతుకం నిర్హేతుకం అని రెండు రకాలున్నాయి. అందులో సహేతుకం ఈర్ష్యవల్ల కలుగుతుంది. ఇదే ఈర్ష్యామానం. భర్త అన్యాసక్తుడైనప్పుడు ఆ విషయాన్ని వినిగాని అనుమానించి గాని ప్రత్యక్ష పరిజ్ఞానంతో గాని సహించ లేకపోవటం ఈర్ష్యామానం.

భోగ చిహ్నాల వలని ఊహ వల్ల కల్గిన ఈర్ష్యామానానికి ఉదాహరణ. రసార్ణవ సుధాకరంలోని శ్లోకం ఉదాహార్యం 'కోదోషో మణి మాలికా' -

అపరాధి అయిన నాయకుడు - 'నా కంఠ సీమలో నఖక్షత రూపమైన మణి మాలిక ఉంటే తప్పేమిటి? శివుడు అర్ధ చంద్రుడిని భూషణంగా ధరించలేదా?

నాయిక - అర్థ చంద్రుడు నిర్మలుడు.

నాయకుడు - చంద్రుడిలో నలుపు లేదా?

నాయిక - సరే మంచి పనే చేశావు వేరే మాటలక్కరలేదు. నీ భాగ్యాన్ని చూడలేక కన్ను కుట్టుకున్న నాదే తప్పు.

ఇక్కడ మణిమాలికా రూపమైన నక్షత్రాలతో ప్రియుడొనర్చిన అపరాధం ఊహింపబడి దానివల్ల కలిగిన ఈర్ష్యవల్ల ప్రియురాలికి మానం కలిగింది. ఆ కోపం 'తత్ సాధ్యేవ కృతం' మొ॥ విపరీత లక్షణా రూప పదాలతో ('నీవు చేసింది సరికాదు' అనే అర్థాన్ని ఇచ్చే వాటిలో) వ్యక్తమైతున్నది.

కారణం లేకుండానే నాయికా నాయకులకు కలిగిన మానం నిర్హేతుకం. ఈ నిష్కారణ మానం స్మితాదులతో శమిస్తుంది. స్త్రీకి నిష్కారణంగా కలిగిన కోపానికి ఉదాహరణ.

"ముంచ కోపను నిమిత్త కోపనే!
సంధ్యయా ప్రణమితోఽస్మి నాన్యయా,
కిం న వేత్సి సహధర్మచారిణం
చక్రవాక సమవృత్తి మాత్మ నః' - కుమారసంభవం 8. స॥

"కారణం లేకుండానే కోపించే ఓ పార్వతీ కోపం విడిచిపెట్టు. నేను సంధ్యచే ప్రణమితుడనై వచ్చాను. వేరొకతెతో ప్రణమితుడను కాలేదు. నీ సహధర్మచారినైన నేను చక్రవాకంతోటి సమాన వృత్తిని పొంది ఉండటం (విరహాన్ని పొందటం) నీవు గమనింపలేదా!"

ఇక్కడ పార్వతికి కోపం కల్గటానికి పరమేశ్వరుడి సంధ్యాప్రణమి తత్త్వం కారణంగా తోస్తుంది. కానీ కారణం అది కాదు. అది కారణంగా భావన మాత్రమే.

ఇలాగే ఇతర మాన భేదాలు ఊహించ దగినవి. ఈర్ష్యామానానికి పారిజాతాపహరణంలోని సత్యభామా విరహం తార్కాణం. ప్రియుని పట్ల అతి ప్రణయం గల ప్రియురాలు తన అనురాగంతో తులతూగ తగిన అనురాగాన్ని ప్రియుడు చూపటం లేదని అనుమానించి నపుడు ప్రియురాలు పొందే విరహ వ్యధ ప్రణయ మానం.

## ప్రవాస విప్రలంభం

మొదట కలసి జీవించిన యువతీ యువకులకు దేశాంతరం మొదలైన వాటిచే కల్గిన యెడబాటు ప్రవాసం. దాని వల్ల కల్గిన విప్రలంభం కూడ ప్రవాసమే. ప్రవాసం అంటే కొన్ని ఆమడల దూరంగల దేశమని భ్రమింపనవసరం లేదు. స్వేచ్ఛగా కలుసుకోవటానికి అవకాశం లేని ప్రతిబంధక భూయిష్టమైన దేశం అని అర్థం. కనుకనే సాహిత్య దర్పణ కారుడు విరహ విప్రలంభాన్ని ప్రత్యేకంగా పేర్కొనకుండా ప్రవాస విప్రలంభంలోనే చేర్చాడు. ఇందులో హర్షం గర్వం మదం వ్రీడ అనేవి తప్ప మిగిలిన శృంగార రస యోగ్యాలైన వ్యభిచార భావాలన్నీ ఉంటాయి. అన్య కార్యం వల్ల, శాపం వల్ల సంభ్రమం వల్ల ఈ ప్రవాస విప్రలంభం సంభవిస్తుంది. వీటిలో మళ్లీ అనేక భేదాలున్నాయి. ధర్మార్థ సంగ్రాహికమైన బుద్ధి వ్యాపారం, కార్యం సన్నిధాన వ్యపేక్ష ఉన్నా బుద్ధి పూర్వకంగా కలిగింది.

1. కార్యజం - ఇది భావి విప్రలంభం భవద్విపలంభం భూత విప్రలంభమని మూడు విధాలు. వీటినే వృత్త వర్తిష్యమాణ వర్తమాన భేదాలుగా కూడ వ్యవహరిస్తారు.

2. సంభ్రమజం - అంటే ఆ వేగం అలజడి. ఇది దివ్యాది భేదాలతో అనేక విధాలు. ఇది దేవకృతమైన మానవ కృతమైన ఉత్పాతాల వల్ల కలుగుతుంది. ఇది కూడ పలు విధాలుగా ఉంటుంది.

3. శాపజం వల్ల కలిగిన విరహం రెండు విధాలు. అవి వైరూప్యం తాద్రూప్యం. నాయికా నాయకులకు శాపంతో వియోగం కలిగినపుడు రూపం కూడ మారితే ఆ విప్రలంభం వైరూప్య శాపజం అవుతుంది. ఉదా. అహల్యా గౌతముల విప్రలంభం అలాంటిది. సహజ రూపంతోనే ఉండి విరహం అనుభవించటం తాద్రూప్యం. మేఘ సందేశంలోని యక్ష యక్షిణుల విరహం ఇందుకు మంచి ఉదాహరణం.

> "కశ్చిత్ కాంతా విరహగురుణా స్వాధికారాత్ప్రమత్తః
> శాపే నాస్తం గమిత మహిమా వర్ష భోగ్యేన భర్తుః
> యక్షశ్చక్రే జనక తనయా స్నాన పుణ్యోద కేషు
> స్నిగ్ధచ్ఛాయా తరుషు వసతి రామగిర్యాశ్రమేషు! మేఘసందేశం 8 స.

తన విహిత కృత్యాన్ని చక్కగా నెరవేర్చని సేవకుడైన యక్షునొకడిని కుబేరుడు 'సంవత్సర కాలం ప్రియా వియుక్తుడివి అవుదువు గాక' అని శపించాడు. దానితో వాడు శాప ప్రభావంతో తన మహిమ నశించినవాడై, సీతాదేవి స్నానం చెయ్యటం చేత పవిత్రమైన జలం కలిగి, చల్లని నీడనిచ్చే చెట్లతో కూడి ఉండే రామగిరి ఆశ్రమాల్లో నివాసం ఏర్పరచుకొన్నాడు.

ఇందులోని యక్షుడికి మహిమ నశించింది కాని రూపం తొలగలేదు. కనుక వారి వియోగం తాద్రూప్యశాపజం. ఇలా శాప సంబంధమైన ప్రవాసం ప్రియులిద్దరకూ సమానం.

ప్రవాస విప్రలంభంలో నాయికకు గాత్ర మాలిన్యం వస్త్ర మాలిన్యం ఏకవేణీ ధారణం నిశ్వాసం, ఉచ్ఛ్వాసం రుదితం భూమి పాతం మొ॥వి కలుగుతాయి. అంగ మాలిన్యం తాపం పాండుత్వం కృశత్వం అరుచి అధైర్యం శూన్యమనస్కత తన్మయత్వం ఉన్మాదం మూర్ఛ మృతి అనే మన్మధావస్థలు కలుగుతాయి.

**కరుణ విప్రలంభం**

"యూనోరేక తరస్మిన్ గతవతి లోకాంతరం పునర్లభ్యే
విమనాయతే యదైక స్తదారాసః కరుణ విప్రలంభాఖ్యః"

నాయికా నాయకులలో ఒకరు లోకాంతరాన్ని పొంది కూడ కాలాంతరంలో ఆ శరీరంతోనే మళ్లీ బ్రతికితే ఆ అవస్థ కరుణ విప్రలంభం. కాదంబరిలోని మహాశ్వేతా పుండరీకుల వృత్తాంతం ఇందుకు ఉదాహరణం. అందులో పుండరీకుడు విరహోద్రేకంతో మరణిస్తాడు. కాలాంతరంలో ఆ శరీరంతోనే బ్రతికి వచ్చి మహా శ్వేతతో సుఖిస్తాడు. ఆ అవస్థ కరుణ విప్రలంభం.

విశ్వేశ్వరుడు తన రస చంద్రికలో ఒక వివరణ యిచ్చాడు. ఒక్కొక్క చోట 'రతి' 'శోకాల'కు సమ ప్రాధాన్యం ఉండే ఒక మనో వికారం కలుగవచ్చు. వాటి వల్ల కలిగే రసం అటు విప్రలంభమూ కాక ఇటు కరుణమూ కాక ఉభయ స్థాయికమైన 'కరుణ విప్రలంభం' అనే వేరొక పేరుతో ప్రకాశిస్తుంది - అని చెప్పాడు. అంటే నాయికా నాయకులలో ఒకరు లోకాంతర గతులైనపుడు రెండవ వారికి కలిగే శోకంలో పునర్జీవితాశ తల చూపితే ఆ శోకం కరుణ విప్రలంభమైతుందని వివరించాడు.

ఆకాశవాణి మహాశ్వేతతో 'నీ భర్త తిరిగి వస్తాడని' చెప్పే పర్యంతం ఉన్నది కరుణ రసమే. ఆ తర్వాతనే ఆమెలో సంగమ ప్రత్యాశవల్ల రతి ఉదయించింది. అప్పటి నుండి కలిగిన దశ మాత్రమే 'కరుణ విప్రలంభ' మైతుంది.

మరొక ఉదాహరణం -

"అధ మదన వధూ రుపప్లవాంతం
వ్యసన కృశా పరిపాలయాం బభూవ
శశిన ఇవ దివాతనస్య రేఖా
కిరణ పరిరక్షయ ధూసకా ప్రదోషం" - కుమార సంభవం 4 స.

కిరణ నాశం వల్ల ధూసర వర్ణం కలిగి పగటివేళ కనబడే చంద్రరేఖ సాయంకాలం ఎదురుచూస్తూ ఉన్నట్లుగా, మన్మధ వియోగంతో చిక్కిపోయిన రతీదేవి తనకు కలిగిన ఆపద యొక్క అవధిని ఎదురుచూస్తున్నది.

ఇక్కడ ఆకాశవాణి పట్ల గల నమ్మకంతో రతీదేవికి విప్రలంభం కలిగింది. అది కృశత్వం మొదలైన వాటితో ఊహింపబడిన గ్లాని మొ॥న వ్యభిచారీ భావాలతోనూ ప్రోషిత సమయాన్ని పాలించటం వంటి అనుభవాలతోను వ్యక్తమైతున్నది. ఇందులో కూడ రతీదేవి ఆకాశవాణి వాక్కు వినే వరకు అనుభవించింది కరుణరసమే. ఆ తర్వాత దశ మాత్రమే కరుణ విప్రలంభం.

**కరుణము - కరుణ విప్రలంభము**

ఈ కరుణ విప్రలంభం శృంగారంలో ఒక భేదం. ఇందులోని కరుణ పదం సంశయానికి తావిస్తున్నది. ఈ విప్రలంభ భేదాలన్నింటిలోను శోకచ్ఛాయ ఉంది. అది ఒక్కొకసారి అతి తీవ్రమై కరుణ రసమనే భ్రాంతిని కలిగిస్తుంది. విప్రలంభంలోను కరుణంలోను 'ప్రీతి' అనే సమాన ధర్మం ఒకటుంది. ప్రీతి లేకపోతే దుఃఖమే ఉండదు. కాని విప్రలంభంలోని దుఃఖానికి కరుణంలోని దుఃఖానికి పొంతనలేదు. విప్రలంభంలో పునస్సమాగమ సంబంధమైన ఇచ్ఛ ఆశ ఉంటాయి. ఆ నైరాశ్యమే

దుఃఖానికి హేతువు. విప్రలంభంలో దుఃఖం ఉన్నా ప్రత్యాశ ఉంటుంది. కనుక ఆ శోకారత్యానాలింగితం, కరుణంలోని శోకారత్యా నాలింగితం. విప్రలంభ శృంగారంలోని దుఃఖంలో కరుణ రసత్వం లేదు.

జగన్నాథుడు కరుణ విప్రలంభం అనే విభాగాన్ని అంగీకరించలేదు. నాయికా నాయకులలో అన్యతర మృతత్వ జ్ఞానం ఉంటే అది కరుణ రసమేనని, ప్రకారాంతరం చేత పునస్సంగమ జ్ఞానం ఉంటే అది ప్రవాసాదుల వలె అవుతుందనీ అన్నాడు. అలాగే కొందరి సిద్ధాంతంలో కరుణ విప్రలంభం ప్రత్యేక రసమని పేర్కొన్నాడు. దీనిపై చర్చ అనంతంగా సాగింది.

### 8.2.4. త్రివిధ శృంగారం

శృంగార రసోత్పత్తికి హేతుభూతంగాను సంభోగ శృంగార రసఫలం పర్యవసానంగాను పరిగణించి, వాచిక నైపథ్య క్రియా భేదాలతో శృంగారాన్ని త్రివిధంగా విభజించారు. వీటిని ప్రాణ భూతమైనవిగా పరిగణించి వేరువేరుగా నిరూపించి నిర్వచించాడు శారదా తనయుడు. వాటిని కావ్యంలో వ్యష్టిగాను సమష్టిగాను ప్రయోగించవచ్చు.

### వాచిక శృంగారం

వాచిక శృంగారం భావ గర్భంగా ఉంటుంది. ప్రేయసీ ప్రియులు రహస్యంగా తమ హృదయాల్లో దాచి ఉంచుకొన్న భావ సంవేదనాన్ని ఈ విధంగా మాటలతో వ్యక్తీకరిస్తారు. వారి సంవేదనం మధురంగా ఉంటుంది. అది నర్మగర్భంగా శృంగారాత్మకంగా మనోహరంగా ఉంటుంది. మంచి వృత్తాలతో సాగుతుంది కావ్యంలో. శృంగార సూచకాలైన శ్లోకాలు పద్యాలు శృంగారోచితమైన వృత్తాలతో నాచిక శృంగారం వ్యక్తమైతుంది.

గోపికా వస్త్రాపహరణ ఘట్టంలో గోపికలు శ్రీకృష్ణుడిని సంబోధిస్తూ పల్కిన పల్కులు ఇందుకు ఉదాహార్యాలు.

కం॥ మామా వలువలు ముట్టకు
మామా! కొనిపోకు పోకు మన్నింపు తగన్
మా మానమేల గొనియెదు?
మా మానస హరణమేల మానుము కృష్ణా!

కం॥ వచ్చెదము నీవు పిల్చిన
నిచ్చెదమేమైన గాని యెటు చొరుమనినన్
జొచ్చెదము నేడు వస్త్రము
లిచ్చి మముం గరుణతోడ నేలుము కృష్ణా!

ఈ మాటలు వారి ఆంతర శృంగార తత్వాన్ని వెలికి తీసే ప్రణయ పద మంత్రాలు. ఈ ఘట్టంలో వాచిక శృంగారం ప్రధానంగా ప్రథమానురాగ సంబంధిగా గోచరిస్తుంది.

### ఆంగిక శృంగారం

ఆంగిక శృంగారమే నైపథ్య శృంగారం. ఆంగిక శృంగారం మంచి వస్త్రం, అంగ రాగం ఆభరణాలు పూలమాలలు మొ॥న వాటితో అలంకృతమై యౌవన సంపదతో ఉన్న దేహాన్ని ఆంగిక శృంగారంతో కూడిందిగా భావిస్తారు. ప్రేమ జంటల వలపు తొలకరిలో వారి హృదయాలు పరస్పరంలో గొనటానికి వారికి ఉద్దీపన కలిగించటానికి ఆకర్షకంగా ఆంగిక శృంగారం ప్రథమ స్థానాన్ని ఆక్రమిస్తుంది. అది వారి తాహతును బట్టి అభిరుచిని బట్టి ఆశయాని బట్టి మారుతుంది. అభూషణత్వం కూడ

ఒక్కొకసారి రమ్యంగానే ఉంటుంది. అదే అక్కడి ఆంగిక శృంగారం అవుతుంది. కళా పూర్ణోదయంలోని సుగాత్రి నిరలంకామే నాయకుడికి ఉద్దీపన కలిగిస్తుంది. వేశ్యలు కార్య సాధన కోసం చేసుకొనే ఆంగికం ఆహార్యం ప్రత్యేకంగా ఉంటాయి. గృహిణుల ఆంగిక శృంగారం మనోనాథుల్ని మనోమోహనం చేసేదిగా ఉంటుంది.

శ్రీకృష్ణుడున్న పడకటిల్లు చేరిన రుక్మిణీ స్వరూపం ఆంగిక శృంగారం. వారి సరస సల్లాపాలకు అదే నైపథ్యం.

సీ॥ కుచకుంభముల మీది కుంకుముతో రాయు
హారంబు లరుణంబు లగుచు మెఱయ
గర పల్లవము సాచి కదలింప నంగుళీ
యక కంకణ ప్రభలావరింప
గదలిన బహురత్న కలిత నూపురముల
గంభీర నినదంబు గడలు కొనగ
గాంచన మణి కర్ణికా మయూఖంబులు
గండ పాలికలపై గంతులిడగ

తే॥ గురులు నర్తింప బయ్యెద కొంగు తూల
బోటి చేనున్న చామర బుచ్చుకొనుచు
జీవితేశ్వరు రుక్మిణి చేరనరిగి
వేడ్కలిగు రొత్త మెల్లన వీవ దొణగే - భా. 10. ఉ. 2281.

ఇటువంటి నైపథ్య శృంగారం పూర్వానురాగంలోనూ సంభోగ శృంగారంలోను సముద్దీప్తినిస్తుంది. ఈ ఆంగిక శృంగారం ఒక్క మానవ జాతికే కాదు. సర్వ ప్రాణికోటికి ఉద్దీపన కలిగించగలదన్న సత్యాన్ని గజేంద్ర మోక్షంలో గజేంద్రుడికి కూడ వర్తింప చేశాడు పోతన. గజేంద్రుణ్ణి ఒప్పులకుప్పగా శిల్పించాడు. (భాగ. 8.40).

### క్రియా శృంగారం

మూడవది క్రియా శృంగారం. దంతక్షత నఖక్షతాలవంటి శృంగార క్రియలకు, హావ భావ హేలకేలీ విలాసం మొదలైన వాటితోను, శయనోపచారాలతోను సంగీతాది క్రియలతోను కూడి ఉంటుంది. ఇది నాయికా నాయకుల ఇష్ట ప్రాప్తి దశ. అరమరికలు లేని శంకారహితమైన శృంగార కలాప విలాసదశ ఇది. మనసులు మరచి తనువులు కలిసిన దశలో ఈ క్రియా శృంగారం కామ శాస్త్రానికి నవ్య భాష్యాలు బోధిస్తుంది.

వాచిక నైపథ్య క్రియా శృంగారాలు పరస్పర పోషకాలు. ఉత్తరోత్తరం బలీయాలు. వాటి ఏకత్ర ప్రయోగం మనోహరం. సంభోగ శృంగారమే దాని పరమావధి. భాగవతంలో పోతన చిత్రించిన కుబ్జాకృష్ణుల కథ శృంగారత్రయ సమ్మిశ్రిత సంశోభితంగా ఉంటుంది.

### 8.2.5. రసాభాసం

ఏ రసమైనా అనుచిత విభావాలంబనమైతే అది రసాభాస అవుతుందని కొందరు భావించారు. మరి కొందరు అనుచితమైన రతమత్వం వల్ల రసాభాసం సిద్ధిస్తుందని సవరించారు. అనుచితమంటే సహృదయ ఆస్వాద యోగ్యం కానిది. కనుక సహృదయ సమ్మతం కాని రతి రసాభాసం అవుతుంది. అయితే రసాభాసం కూడ రసమే అనీ, దుష్టత్వ నిమిత్తంగా రసం రసత్వాన్ని

కోల్పోదని అది కూడ ఆస్వాద యోగ్యమేనని మరికొందరి భావం. దానికి ఆ శక్తి ఉంది. కనుకనే మహాకవులు తమ కావ్యాలలో రసాభాసాన్ని తుష్టిగా పుష్టిగా వర్ణించారు.

"ఏకత్రైవాను రాగశ్చేత్ తిర్యజ్ మ్లేచ్ఛగతోఽపివా।
యోషితో బహు సక్తిశ్చేత్ రసాభాస స్త్రిధా మతః।

నాయికా నాయకులలో ఒకరికే మరొకరిపై అనురాగం ఉండటం, మరొకరికి లేకుండటం, తిర్యక్కులలోను మ్లేచ్ఛులయందు అనురాగ పోషణం, స్త్రీలకు బహు నాయకులపై ఆసక్తి అని రసాభాసం మూడు రకాలు.

ఆభాసం అంటే లేనిది ఉన్నట్లు భాసించటం. కావ్యంలో రస విషయికమైన ఇటువంటి ఆభాసం ఉంటుంది.

## ఏకత్రైవానురాగశ్చేత్

అన్యోన్యానురాగం లేని స్త్రీ పురుషులను ఆలంబనంగా స్వీకరించి వ్రాసిన కావ్యం వల్ల మనకు కలిగే ఆనందం శృంగారం యొక్క ఆభాసం వల్లనే గాని రసం వల్లకాదు. దీనికి ఏకత్రైవానురాగమని పేరు. ఇందులోని ఆభాసాన్ని రసంగానే ప్రకాశింప చెయ్యటానికి కవికి అసాధారణమైన ప్రజ్ఞ ఉండాలి. ఏకనిష్ఠమైన ప్రీతి శృంగార రసంగా పర్యవసించి ఆనందాన్ని ఇవ్వలేక పోయినా స్థాయిని అంకురింప చెయ్యటానికి సమర్థమే అవుతుంది. కవి ఇటువంటి అసంపూర్ణాలంబనాన్ని చేపట్టి దానివల్ల కలిగే స్థాయికి సహజంగా ఉన్న శక్తి కంటె అధిక శక్తిని ఆపాదించి ప్రదీప్తం చేయటం వల్ల రసాభాసాన్ని రసంగానే ఆస్వాదించ గలుగుతాడు సహృదయుడు.

భారతంలోని కీచక వధ ఘట్టంలో కీచకుడి శృంగార భావాన్ని అధికంగా వర్ణించింది ఈ కారణం చేతనే. అలాగే మనుచరిత్రంలోని వరూధినీ ప్రవరుల ఘట్టం. సారంగధర చరిత్ర ఇటువంటివే. ఈ ఆభాసం వల్ల ఆనందం సంగతి ప్రక్కన పెడితే, యదార్థమైన రసానందం అంగిరసం వల్ల కలుగుతుంది. కీచక వధలో భీమాశ్రయమైన క్రోధం రౌద్రంగా పరిణమించి కావ్య సిద్ధిని రససిద్ధిని కలిగిస్తుంది. వరూధిని అనురాగం ప్రవరుడి నిర్వికార ధీరత్వంతో ప్రతిఘటింపబడి దాన్ని జయించటానికి అసాధారణ శక్తిని చూపి తుదకు పరాజితమైంది. కావ్యం వల్ల కలిగే రసానందం వంటిదే రసాభాసానందం కూడ.

రెండవది మ్లేచ్ఛగత శృంగారం, మ్లేచ్ఛులు అంటే 'నీచ ప్రకృతులు' అని భావం. అటువంటి వారి చిత్తంలో పొటమరించే కామోద్రిక్తత తక్షణ శారీరక తృప్తిని అభిలషిస్తుందే కాని ఉద్రేక భిన్నమైన నిర్వేద భావాలు కలిగే వరకు ఉంచవలసిన నిగ్రహాన్ని చూపలేదు. అటువంటి పాత్రల్ని స్వీకరించి కవి రసపోషణం చెయ్యలేడు. అయినా వర్ణింపబడినంతవరకు ఆ పాత్రల కామోద్రేకమే మనకు ఆనందప్రదాలైతాయి.

భాగవతంలో మురళీనాదం చేసే గోవిందుణ్ని చూచి మోహపరవశలైన భిల్లాంగనల ఉల్లాసం ఉగ్గడింపదగింది.

కం॥ ఉల్లసిత కుచభరంబుల
నల్లాడెడి నడుముతోడ నలరుల దండల్
భిల్లి యొకతె హరికిచ్చెను
హల్లోహల కలితయగుచు నంగన కంటే - భాగ. 10.792

ఈ భిల్లాంగనల స్థితి కామినీ జనోచితం. వారి ప్రేమ నిర్భరం. ఐనా వారు భిల్లాంగనలు కనుక శ్రీకృష్ణుని కోరటం అనుచితం. ఇది మేచ్ఛాలంబనమైన శృంగారం. అందువల్ల ఇది రసాభాసమే. ఇటువంటి సందర్భాలను కొందరు అనుచిత

శృంగారంగా పరిగణించారు.

## యోషితో బహుసక్తిశ్చేత్

ఒకే స్త్రీకి పలువురి మీద ఆసక్తి ఉంటే ఆ ప్రవర్తనం రాసాభాసం అంటారు. ఒక పురుషుడికి పలువురు స్త్రీల మీద ఆసక్తి ఉన్నా రసాభాసమే అవుతుంది. ఒక స్త్రీకి పలువురు పురుషుల మీద ఆసక్తి ఎన్నడూ నిలువదు. పలువురి మీద సమానురాగం వుండటం మానవ మాత్రుల కసాధ్యం. అటువంటి విశేషాలెక్కడైనా సాహిత్యంలో ఉంటే, అవి విశేష మహిమాన్విత వ్యక్తులు ఆలంబనంగా గలిగిన తావులుగా భావించాలి. ద్రౌపది విషయం అటువంటిదే. అలాగే పురుషులకు అనేక స్త్రీల తోడి సంబంధమున్న కృష్ణ చరిత్ర వంటివి కూడ. 'యోషితో బహుసక్తిః' అనేది ప్రధానంగా వేశ్యను దృష్టిలో ఉంచుకొని చెప్పిన మాట కావచ్చు. వేశ్య అనేక మందితో సంభోగిస్తుంటుంది కాని ఆమెకు ఎవరి మీద కూడ 'రతి' అనదగిన స్థాయిభావం ఉండదు. వారి అనుభావాలన్నీ నటనలే కాని ప్రేమోద్భవాలు కావు. ప్రేమరహితమైన అనుభవాల ప్రదర్శనం పాఠకునిలోను లేదా ప్రేక్షకునిలోను అనౌచిత్యాన్నే రేకెత్తిస్తుంది కాని ఆస్వాద్య యోగ్యం కాదు. కావున ప్రేమ రహితమైన అనుభావ ప్రకటనలు రసాభాసకారణాలే.

## తిర్యగ్గత శృంగారం

పశుపక్షి మృగాదుల కామ ప్రవృత్తి రసాభాసమని ప్రసిద్ధ ఆలంకారికోక్తి. దానికి కారణం వాటిలో వైదగ్ధ్యం ఉండదని భావించడమే. ఏకావళీ కర్త అయిన విద్యాధరుడూ జగన్నాథుడూ ఇద్దరూ తిర్యక్కుల ప్రణయాన్ని మ్లేచ్ఛరాగాన్నీ రసంగానే పరిగణించారు. రసార్ణవ సుధాకర కర్త దాన్ని సయుక్తికంగా ఖండించాడు. అయినా తిర్యగ్గతిలో వాటికి కూడ విభావాదులున్నాయి. అవి భావుక చిత్తోల్లాస హేతువులై చమత్కార సారమైన రస నిష్పాదక కారకమైతాయి. ఇందులో సహృదయులకు స్థాయి కాలుష్యం కాని పక్షంలో అది శృంగారమే అని ఆంధ్ర ధ్వన్యాలోక వ్యాఖ్య. కనుక తిర్యగ్గతి కావటం చేతనే అది రసాభాసం అయితే రసాభాసం కూడ కొందరి దృష్టిలో రసమే కనుక అది ఆస్వాద్య యోగ్యమైనదే. జంతుగతమైన శృంగారాన్ని భోజుడు 'సామాన్యం' అని పేర్కొన్నాడు. కొందరు అపరిపుష్ట శృంగారం అన్నారు.

కాళిదాసు కుమార సంభవంలో స్థాణువనంలో తటస్థించిన అకాలమధు విజృంభణాన్ని వర్ణించి నప్పుడు ఈ తిర్యక్కుల వర్ణన గమనించదగ్గది. అవి ఆలంకారికులు ఆనందదాయకాలుగా అభినందించినవే.

'మధు ద్విరేఫః కుసుమైక పాత్రే  
పపౌ ప్రియాం స్వామనువర్తమానః  
శృంగేణ సంస్పర్శ నిమీలితాక్షీః  
మృగీ మకండూయత కృష్ణ సారః'

ఒక మగతుమ్మెద తన ప్రియురాలు తేనె త్రావిన పిమ్మట తాను కూడ ఆ కుసుమ పాత్రలో నుండే తేనె నాస్వాదించింది. ఒక మగలేడి ఆడులేడిని కొమ్ములతో గోకుతుండగా ఆ స్పర్శకు పరవశ అయిన ఆడు లేడి కన్నులు మూసికొంది.

అలాగే గజేంద్రుడి మీద చేరి చేసే భృంగరాజ శృంగారం సరస జనామోదం.

"తేటి యొకటి యొరు ప్రియకును  
మాటికి మాటికిని నాగమదజల గంధం  
బేటికని తన్ను బొందెడి  
బోటికి నందిచ్చు నిండు బోటు తనమునల్" - భాగ. - 8-31.

తన మీద వలపు కురిపించే తేటి బోటికి బోటుతనంతో మదగజ మదజలాన్ని అందించే ఈ తేటి శృంగార భావ మాధుర్యం ప్రకృతిగత ప్రణయ తత్త్వ సంకేతం.

కం॥ అంగీకృత రంగన్మా
తంగీ మదగంధ మగుచు దద్దయు వేడ్కళ్
సంగీత విశేషంబుల
భృంగీగణ మొప్పె ప్రమానూ పెట్టిడి వేడ్కన్ - భాగ. 8-32.

ఆశ్చర్య చకచ్చకితంగా మదజల గంధాన్ని ఆస్వాదిస్తూ తేటి బోటుల గుంపులానందంతో ఆలపించే సంగీత విశేషం ప్రకతి ప్రణయ మంత్రం.

అలాగే మను చరిత్రలోని చక్రవాకీ విరహం చేష్టా రూపంలో వర్ణింపబడి ఆహ్లాద జనకంగా ఉంటుంది.

ఇలా తిర్యగ్గతాలైన భావాలు కొన్ని మానవ హృదయ భావాలలాగానే పరిపుష్టిని పొంది ఆనందాన్ని అందించగలవు. ఆ భావాలతోనే వాటికి వాక్కును కూడ కల్పించి వాటిచే పలికించి భావప్రపంచంలో సర్వ ప్రాణులూ సమానమే అనే తాత్త్విక సత్యాన్ని ఉపదేశించారు కొందరు మహాకవులు.

## నిరింద్రియ శృంగారం

రసాభాసంలో తిర్యక్కుల విషయమే కాక నిరింద్రియాల్ని కూడ హేమచంద్రుడు పేర్కొన్నాడు.

'నిరింద్రియేషు తిర్యగాదిషు
చారోపాత్ రసభావాబాసా'

నిరింద్రియాలైన లతాతరు గుల్మాలలోనూ తిర్యగాదుల్లోను శృంగారారోపం చేస్తే రసభావా భాసం అవుతుంది.

మాధవుడి తోడి తన శృంగారాన్ని కూర్చి భూదేవి ధర్మదేవుడికి వివరిస్తూ మురిసిపోయిన తీరు సుమనోహరం.

కం॥ మెల్లన నాపై యాదవ
వల్లభు డడుగిడగ మోహన వశనై నే రం
జిల్లగ రోమాంచము క్రియ
మొల్లములై మొలచు సస్యములు మార్గమునన్ - భాగ. 1-407.

ఇటు భూమి పంగా శృంగారా రోపం చెయ్యటం వల్ల ఇది నిరింద్రియ సంబంధమైన శృంగారరస భావాభాసం. ఇలాగే భాగవతంలో 10.789 నదీగత రతిని గూడ వర్ణించబడింది.

## 8.3 సమీక్ష

మన ప్రాచీనాలంకారిక సమ్మతంగా సర్వ శృంగార రస భేదాల్ని అవగాహన చేసుకొని తద్రస బంధురమైన సాహిత్య గ్రంధాల్ని అధ్యయనం చేసి బ్రహ్మానంద సబ్రహ్మచారియైన రసానందాన్ని పొందాలి.

## 8.4 ప్రశ్నలు

1. శృంగార ప్రాధాన్యాన్ని వివరించి అయోగ శృంగారాన్ని విశదీకరించండి.
2. సంయోగ శృంగార భేదాల్ని విపులీకరించండి.
3. విప్రలంభ శృంగార భేదాల్ని వివరించండి.
4. రసాభాసాన్ని గూర్చి చర్చించండి.

## 8.5 ఉపయుక్త గ్రంథాలు

1. రసార్ణవ సుధాకరం - సర్వజ్ఞ సింగ భూపాలుడు
2. సాహిత్య శిల్ప సమీక్ష - పింగళి లక్ష్మీకాంతం
3. శృంగారము - ఆంధ్రుల వరివస్య - తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
4. పోతన భాగవతం - శృంగారం - మేళ్లచెర్వు భానుప్రసాదరావు

**డాక్టర్ మేళ్లచెర్వు భానుప్రసాదరావు**
రీడర్ - తెలుగు శాఖ
శ్రీ సుబ్బరాయ & నారాయణ కళాశాల
నరసరావుపేట - 522 601

# పాఠం - 9

# శ్రవ్య దృశ్య కావ్యములు

పాఠ్యనిర్మాణక్రమం

9.0 లక్ష్యం
9.1 కావ్యం
9.2 శ్రవ్య దృశ్య శబ్ద వ్యుత్పత్తి - వికాసం
9.3.0. శ్రవ్య దృశ్య కావ్య విభాగం
9.3.1. ఇతివృత్తం
9.3.2. రస ప్రాధాన్యం
9.3.3. రచనా సంవిధానం
9.3.4. పాత్ర చిత్రణ పద్ధతులు
9.3.5. వర్ణనలు
9.3.6. భాషారీతులు
9.3.7. చైతన్య శక్తి - కేంద్రీకరణ
9.4.1. ప్రదర్శనాపేక్ష లేని మహాకావ్యం
9.4.2. శ్రవ్య నాటకం - కావ్యం
9.5.1. అభినయ సూచనలు
9.5.2. అభినయం - భావన
9.5.3. అభినయం - భావుక సౌలభ్యం
9.5.4. అభినేత కవికి వ్యాఖ్యాత
9.6.1. శ్రవ్య కావ్య పఠనాధికారి
9.6.2. దృశ్య కావ్య దర్శనాధికారి
9.7 సమీక్ష
9.8 ప్రశ్నలు
9.9 ఉపయుక్త గ్రంథాలు

## 9.0 లక్ష్యం

శ్రవ్య దృశ్య శబ్దాల వ్యుత్పత్తినీ శ్రవ్య దృశ్య కావ్య విభాగాల్నీ, ఇతివృత్త పాత్ర రసాదుల్లో వాటికి గల భేదాల్ని అభినయ విశేషాల్నీ శ్రవ్య దృశ్య కావ్యాధికారుల్ని గూర్చి తెలుసుకోవటం ఈ పాఠ్య లక్ష్యం.

## 9.1 కావ్యం

"అపారే కావ్య సంసారే
కవి రేవ ప్రజాపతిః
యథాస్మైరోచతే విశ్వం
తథేవ పరివర్తతే" - ఆనందవర్ధనుడు

అనంతమైన కావ్య ప్రపంచంలో కవిది బ్రహ్మస్థానం. ఈ విశ్వం అతడి అభిరుచిని అనుసరించి ప్రవర్తిల్లుతుంది.

ఈ సృష్టికర్త నిర్మించిన కావ్య కళ ప్రకృతి నియమ పరతంత్రమైంది కాదు. అది ప్రత్యేక స్వతంత్ర సృష్టి అని కూడ సిద్ధాంతీకరించారు ఆలంకారికులు.

"నియతి కృతి నియమ రహితాం
హ్లాదైకమయీ మనన్య పరతంత్రాం
నవరస రచిరాం నిర్మితి
మాదాధతీ భారతీ కవేర్జయతు"

లోకధర్మ నియమాలకు లోబడక స్వతంత్రమై ఆనందమయమైన కావ్య నిర్మాణాన్ని చేసే కవి వాక్కునకు జయమగు గాక! అని ఆశంసించారు.

ఆ కవి భారతినే కావ్యం అన్నారు. ఆ కావ్య ప్రపంచాన్ని సాహిత్యం అంటారు. ఆ సాహిత్యాన్నే విమర్శకులు వాఙ్మయంగా వ్యవహరిస్తారు. నిజానికి సాహిత్యం వాఙ్మయంలో ఒక భాగం. సరే! ఆ సాహిత్యంలో భిన్న భిన్న నామాలతో వివిధ కావ్యాలున్నాయి. వీటి భిన్నత్వం విషయంలో భారతీయాలంకారికులకు పాశ్చాత్యులకూ కొన్ని భేద సాదృశ్యాలున్నాయి. వాటిలోని శ్రవ్య దృశ్య కావ్యాల గూర్చిన చర్చ ప్రస్తుతాంశం.

## 9.2. శ్రవ్య దృశ్య శబ్ద వ్యుత్పత్తి - వికాసం

శబ్ద వ్యుత్పత్తిని బట్టి శ్రవ్యం అంటే వినదగింది. దృశ్యం అంటే చూడదగింది. ఇది స్థూలమైన అర్థం మాత్రమే. కాని ఈ శబ్దాల్ని ప్రబంధ, నాటకాలకు వాడటం లోకాచారంగా ఉంది. మరి నాటకంలో అభినయ దర్శనంతో పాటు వాక్య శ్రవణం కూడ సరి నడకలు సాగిస్తాయి. అయినా దానికి శ్రవ్య విశేషం వర్తించదు. అందుకు కారణం అందులో శ్రవ్య కావ్యంలోని అభినయం అధికంగా ఉండటం ఒకటి, దానికి తోడు పరంపరా గతంగా వస్తున్న లోక వ్యవహారం. సాహితీ లోకంలో శ్రవ్య కావ్యాలంటే ప్రబంధాలుగా పేరుపడ్డ కావ్యాలు. అది వాటికి పర్యాయ పదంగా మిగిలి పోయింది. దృశ్య కావ్య శబ్దం నాటకానికి పర్యాయంగా ప్రసిద్ధమైంది.

## 9.3.0. శ్రవ్య దృశ్య కావ్య విభాగం

భారతీయాలంకారికులు ప్రధానంగా ప్రదర్శన ప్రమాణాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రదర్శన యోగ్యమైన కావ్యాలను దృశ్య కావ్యాలని ప్రకటించారు. అలాగే శ్రవణ యోగ్యమైన కావ్యాలను శ్రవ్య కావ్యాలని నిర్ణయించారు. ఈ కావ్యాలు పద్యాత్మకాలు కావచ్చు లేక గద్యాత్మకాలు కావచ్చు లేదా ఉభయాత్మకాలైనా కావచ్చు. దృశ్య కావ్యాలను దశ రూపకాలుగా ధనంజయుడు వింగడించాడు. అందులో నాటకం ప్రధానమైంది. కనుక ప్రధాన వివక్షతో దశ రూపకాలను నాటకాలనే లోకం వ్యవహరిస్తున్నది. ఉపరి నాటకాల్ని దృశ్య నాటకాలు శ్రవ్య నాటకాలుగా ద్వివిధంగా గుర్తించారు. అది వాటి ప్రదర్శన యోగ్యత కావ్యత్వం వంటి ప్రధాన లక్షణాల్ని బట్టి చేసిన నిర్ణయం.

పాశ్చాత్యులు కావ్యాలన్నింటినీ నాటకాలు మహాకావ్యాలు అని రెండుగా మాత్రమే విభజించారు. నాటకం అంటే డ్రామా. మహాకావ్యం అంటే ఎపిక్ (Epic). వారి మహాకావ్యాల్లో ఇతివృత్తం వీరరస ప్రధానంగాను ఉదాత్తంగాను ఉంటుంది. మన ప్రబంధాలు శృంగార రస ప్రధానంగా ఉంటాయి. కనుక పాశ్చాత్యుల మహాకావ్యాలకు మన ప్రబంధాలకు ప్రధాన సాదృశ్యాలేవీ లేవు. దేని ప్రత్యేకత దానిదే -

పాశ్చాత్యుల (Epic) మహాకావ్యాలకు మన మహాభారత రామాయణాలకు కొద్దిపాటి పోలికలుంటాయి. వాటిని ఐతిహాసిక కావ్యాలని గాని వీర కావ్యాలని గాని అనవచ్చునని పింగళివారి భావం. ఏది ఏమైనా మహా గ్రంథాలన్నీ అందరకూ ఒకే విధమైన ఆనందాన్ని కలిగిస్తాయి.

ప్రబంధాల్ని భారత రామాయణాల్ని కూడ శ్రవ్య కావ్యాలుగానే పరిగణించవచ్చు ఈ సందర్భంలో. శ్రవ్య కావ్యాలంటే నాటకం కంటె భిన్నమైన మహా కావ్యంగా భావించాలి. పురాణేతి హాస కావ్యాల్లో దివ్య చారిత్రక సాంసారిక అంశలు ప్రధానంగా కనిపిస్తాయి. ఇతిహాస, పురాణ, కావ్యాలనే ఈ మూడు జాతుల గ్రంథాలోనూ ఈ విషయాల అన్యోన్య సంక్రమణం సాధారణంగా ఉంటుంది. అన్నీ లోక సంబంధులే కదా!

వారి మహాకావ్యాల (Epics)కూ నాటకాలకూ గల ముఖ్యభేదం ఇతివృత్త స్వభావాన్ని బట్టిగాని, పాత్ర చిత్రణను బట్టిగాని ఉండదు. వాటికి గల భేదం ప్రదర్శన యోగ్యతను బట్టి మాత్రమే ప్రధానంగా ఉంటుందని అరిస్టాటిల్ సూత్రప్రాయంగా వ్యక్తీకరించాడు.

### 9.3.1. ఇతివృత్తం

శ్రవ్య దృశ్య కావ్య ప్రక్రియలన్నింటికీ లక్షణ ఐక్యాన్ని సాధించే ప్రయత్నం చేశారు చాలమంది ఆలంకారికులు.

"ఇతివృత్తంతు కావ్యస్య
శరీరం సరి కీర్తి తః"

అని కావ్య శరీరానికి ఇతివృత్తం ప్రధానమని ప్రకటించాడు భరతుడు. రూపకంలో లాగానే కావ్యంలోనూ వస్తువు రసాది వ్యంజకంగా రసోచితంగా ఉండాలి. రూపకంలో ప్రదర్శన యోగ్యమైన రమణీయ కథా ఘట్టాలనే స్వీకరించాలి. వాటిని అంకాలుగా విభజించి రచించాలి. అదే రీతిగా శ్రవ్య కావ్యంలోనూ ఇతి వృత్తంలోని రసవద్ఘట్టాలనే స్వీకరించాలి. కాని ఏ ఘట్టాన్నైనా రమణీయం చేయగల అవకాశం శ్రవ్య కావ్య కర్తకు ఉంది. రూపకం దృశ్యం కావటం వల్ల రంగస్థలం మీద కొన్ని ఘట్టాలు ప్రదర్శన యోగ్యాలు కావు. కనుక అవి నిషిద్ధాలు. ఇది గమనించి ఇతివృత్తాన్ని నడపాలి. అదే కావ్య శిల్పం.

నాటక కవి కథా సన్నివేశంలో తన ప్రతిభా పాటవాల్ని సమస్తాన్నీ కేంద్రీకరించాలి. ఉపయోగించాలి. రమణీయమైన కథలన్నీ నాటక ప్రదర్శనకు పనికిరావు కనుక ఉపయోగపడని కథా భాగాల్ని వదలిపెట్టాలి. కథా గమనం దెబ్బతినకుండా ఆ భాగాల్లో విష్కంభ ప్రవేశాల ద్వారా లోటును సవరించుకోవాలి. ఇలా నడపటం కవికి అసిధారావ్రతం. ఇటువంటి సంకట స్థితి శ్రవ్య కావ్య రచయితకు ఉండదు. రసభావ నిరంతరమైన మానవ చిత్త ప్రవృత్తినే రంగస్థలం మీద ప్రదర్శించాలని పాశ్చాత్యుడైన మాథ్యూ ఆర్నాల్డ్ కూడ నిర్దేశించాడు. (The most impassioned state of the being).

### 9.3.2. రస ప్రాధాన్యం

భారతీయ ఆలంకారికులు కావ్య లక్షణాల్ని మొదట నాటక పరంగానే నిర్వచించారు. తదనంతర కాలంలో కొద్దిపాటి భేదంతో అది కావ్య లక్షణంగా పరిణమించింది. కనుక మన కవులు నాటక వస్తువు పట్ల చూపించినంత శ్రద్ధ శ్రవ్య కావ్య వస్తువు విషయంలో వహించలేదు. భరతుడు

'కావ్యంహి దశ రూపాత్మక మేవ'

కావ్యం దశ రూపాత్మకమైనదేనని ప్రకటించాడు. కనుక భరతుడు రూపక వస్తువును, రూపక రసాన్ని గూర్చి మాత్రమే

చెప్పాడు. శ్రవ్య కావ్య రసాన్ని గూర్చి స్మరించనైనా లేదు. తరువాత ధ్వని కారుడు ప్రప్రథమంగా రూపకానికి లాగానే శ్రవ్య కావ్యానికి కూడ రసమే ప్రధానమని దాని వల్లనే రమణీయత కలుగుతుందని నిర్ణయించాడు. అభినవగుప్తుడు కూడ తన లోచనవ్యాఖ్యలో -

'నాట్యాత్ సముదాయ రూపాల్ రసః
కావ్యేచ నాట్యాయమాన ఇవ రసః కావ్యార్థః'

అని అంటూ భరతుడి రూపక రస సిద్ధాంతాన్ని శ్రవ్య కావ్యానికి కూడ సమన్వయించాడు.

నాటక నిర్మాణంలోని పంచ సంధి లక్షణాలనే కావ్యంలో పాటించ వచ్చునని, దానిలో లాగానే, దీనిలోనూ రస నిర్వహణం జరగాయని అంగీకరించారు అనంతర కాలంలోని ఆలింకారికులందరూ.

### 9.3.3. రచనా సంవిధానం

ఇతివృత్త విషయంలో రెంటికీ భేదం లేకపోవచ్చు గాక, రస విషయంలో రెండూ సమానమే కావచ్చుగాక, కానీ రచనా సంవిధానంలో మాత్రం నాటక కర్తకు ఉన్నంత క్లేశం ప్రబంధకర్తకు లేదు.

పాత్ర చిత్రణం నాటక కవికి అత్యంత ప్రధాన విషయం. ప్రబంధకవికి అంతటి చిక్కులేదు. ప్రబంధకవి ఏ కథను స్వీకరించినా ఆ కథకు ఆమూలాగ్రంగా చిత్ర విచిత్ర వర్ణనలతో అలంకారాలతో తీర్చి కావ్యాన్ని ప్రౌఢంగాను రసవంతంగాను మలచగలడు. కథాంశాలకు సంబంధించి ఏ నియమాలూ ప్రతిబంధకాలూ లేవు. ఏ ఘట్టాన్నయినా రస సమంచితం చేయగలిగితే ప్రతిభతో అతడు చరితార్థుడైనట్లే.

శ్రవ్య కావ్యాన్ని రచించే కవి కథలోని పాత్రల్ని తన వెనుక నిలుపుకొని పాఠకులకు పాత్రలకు మధ్య తాను నిలుస్తాడు. అవసరమైనప్పుడు పాత్రలను మన ఎదుట నిలబెడతాడు. వాటి చేత మాట్లాడిస్తాడు. అవసరం లేనపుడు పాత్రల్ని తోసిరాజని తానే మాట్లాడుతూ, పాత్రల ద్వారా కొంత తనద్వారా కొంత కథను రక్తి కట్టిస్తాడు. ఇది వీధి నాటకంలోని సూత్రధారుడి పాత్ర వంటిది. ఇది కవి యొక్క నాటక రచనా సామర్థ్యాన్ని పెంపొందించే ప్రథమ శిక్షా స్థానం. ఈ శిక్షణానంతరమే ఉత్సుకత గల కవి నాటక రచనకు పూనుకుంటాడు.

దృశ్య కావ్యంలో కవి మనకు కనబడడు. అతడు పాత్రల్ని సృష్టించి, వాటి వాటి స్వభావానుసారంగా కథను నడిపిస్తాడు. పాత్రల్ని మన ఎదుట నిలబెట్టి వాటికి స్వతంత్ర శక్తిని కల్పిస్తాడు. అవి స్వతంత్రంగా ఆడే విధంగా చేస్తాడు. వాటిని ఆతడి అదృశ్య హస్తం నడిపిస్తుంది. ఇది ఆతడి నాటక శిల్పానికి సంబంధించిన సంగతి. నాటక శిల్పం అంటే సృష్టికి ప్రతి సృష్టి చెయ్యటం. ఆ సృష్టికర్త ఈ జగద్వర్తనంలో ఎక్కడా కనబడడు. అతడి పరోక్షంలోనే జీవిత నాటకమంతా నడుస్తుంది. అలాగే కనిపించని కవి సాహిత్య నాటక జీవితాన్ని రక్తి గట్టిస్తాడు. అంటే నాటక రచనా సందర్భంలో కవి పరకాయ ప్రవేశం చేస్తాడు. ఇదే నాటక శిల్పం.

### 9.3.4. పాత్ర చిత్రణ పద్ధతులు

పాత్రల స్వభావాన్ని శ్రవ్య కావ్యంలో ప్రత్యక్ష పద్ధతిలో వ్యక్తపరుస్తారు. ఈ ప్రత్యక్ష పద్ధతిలో కవి తానై పాత్రల గుణాల్ని వర్ణిస్తాడు. దృశ్య కావ్యాల్లో పాత్రల్ని స్వయం వ్యక్తమయ్యేటట్లు చెయ్యాలి. స్వయం వ్యక్తమయ్యే పాత్రల్ని గూర్చి కవి ఏమీ చెప్పడు. కథా కార్యానికి కారణమైన తన వర్తనం చేత, ఆ వర్తనానుగుణమైన వాక్కుల చేత ఆ పాత్ర తనంత తానుగా వ్యక్తమైతుంది.

తలపు మాట నడవడి అనే త్రికరణాల ద్వారా ఆ పాత్ర తన విశిష్టతను ప్రదర్శించుకుంటుంది. శ్రవ్య కావ్యాల్లో ఈ పద్ధతి కూడ ఉపయుక్తమే. శ్రవ్య కావ్య కర్తల్లోనూ నాటకీయ ప్రతిభ కలవారు చాలవరకు ఈ పద్ధతిలోనే పాత్ర సృష్టి చేస్తారు. దృశ్య కావ్యంలో పరోక్ష పద్ధతి ఒక్కటే ఉపకరిస్తుంది. నాటక కవి తానై ఏ పాత్రను గురించీ చెప్పదగింది ఏదీ ఉండదు. కనుక నాటకంలో ప్రత్యక్ష పద్ధతికి అవకాశం లేదు.

శ్రవ్య కావ్యంలో కవి తానుగా చెప్పదగింది కొంత ఉంటుంది కనుక ఆ భాగంలో పాత్రల గుణగణాల్ని వర్ణించవచ్చు. ఆ పాత్రనే కథలో ప్రవేశపెట్టి వర్తింప చేసేటప్పుడు దానిని స్వయం వ్యక్త మయ్యేటట్లు చెయ్యవచ్చు. అతని వర్ణనకూ పాత్ర యొక్క స్వయం వ్యక్తికీ విరోధం ఉండదు. ఉండరాదు. మనుచరిత్రలో ప్రవరుడిని వర్ణిస్తూ పెద్దన -

"వాని చక్కదనము వైరాగ్యమున జేసి
కాంక్ష సేయు జార కామినులకు
భోగ బాహ్య మయ్యె పూచిన సంపెంగ
పొలుపు మధుకరాంగనలకు వోలె"

అని ప్రశంసించాడు. ఆ ప్రవరుడు వరూధినీ సమక్షంలో నర్తించవలసి నపుడు ఈ భోగబాహ్యతే వ్యక్తమైతుంది.

నాటకంలో ప్రవరుడికి ఇతర గుణాలతో పాటుగా పరస్త్రీ విముఖత కూడ అతడి నడవడిని బట్టి మాత్రమే నాటకంలో గ్రహిస్తాం. అలాగే అతని నిత్యాగ్ని హోత్రతను గూర్చి గూడ అతనికి గల అగ్నిహోత్రుని అనుగ్రహాన్ని ప్రార్థనను బట్టి గ్రహిస్తాం. కనుక పాత్ర వర్తనం స్వయం వ్యక్తతకు ప్రధాన సాధనం. అలాగే రెండవ సాధనం వాగ్రూపం.

### ఉదాత్త నాయకుడు

మహా నాటక రచయితకు మహోదార పురుషుని చరితమే తగిన ఇతివృత్తం. కాని అతని చరిత్ర నంతటిని నాటకీకరించటానికి పూనుకొనడు. అటువంటి పనిని శ్రవ్య కావ్య కర్త తలపెట్టగలడు. శ్రవ్య కావ్యానికి గూడ మహాదాత్త పురుష చరిత్రమే ఉత్తమం. రాముడనే మహా పురుషుని చరిత్రను మొత్తాన్ని రామాయణ మహాకావ్యంగా రచించినట్లు కథను మొత్తాన్ని నాటకంలో చిత్రించవలను పడదు. కథలో నాటకోచిత ఘట్టాలు కొన్నే ఉంటాయి. అలాగే మరి కొన్ని శ్రవ్య కావ్యోచితాలుగా ఉంటాయి. మొత్తం మీద ఉదాత్త నాయక చరిత్రయే రెండింటా ఆవశ్యకం.

### 9.3.5. వర్ణనలు

వర్ణనమే కవిత్వం. 'లోకోత్తర వర్ణనా నిపుణః కవికర్మ కావ్యం' అని మమ్మటుడు నిర్వచించాడు. లోకోత్తర వర్ణనా నిపుణుడే కవి. దీనిని బట్టి కవిత్వం అంటే వర్ణనమనే భావించాలి. దృశ్య సాక్షాత్కార యోగ్యమైన వర్ణనను, నైపుణ్యంగల కవి మాత్రమే చెయ్యగలడు. రసభావదీధితిలో స్నాతమైన సౌందర్యమే దృశ్యం కవికి భావసంకేతమే శబ్దం. శ్రవ్య కావ్య రచయిత లాగా తనివి తీర ఏ దృశ్యాన్నీ, ఏ పదార్థాన్నీ కూడ నాటక కవి వర్ణించుకోలేడు. నాటక స్వభావాన్ని బట్టి వర్ణనకు అనేక ప్రతిబంధకాలున్నాయి. అయినా ఏదో ఒక అవకాశాన్ని దొరకబుచ్చుకొని కవితా ధర్మమైన వర్ణనాభిలాషను సార్థకం చేసుకుంటాడు నాటక కవి. సమర్థుడైన కవి, అందులోనూ విజయుడైతాడు. శాకుంతలంలో దుష్యంతుడు లేడి పరుగును వర్ణించిన సందర్భం తగిన ఉదాహరణం.

శ్లో॥ 'గ్రీనాభంగాభిరామం ముహురనుపతతి స్పందనే బద్ధ దృష్టిః
పశ్చార్ధేన ప్రవిష్టః శరపతన భయాద్భూయసా పూర్వ కాయం
దర్భైరర్ధావలీఢైః శ్రమవివృత ముఖభ్రంశభిః కీర్ణ వర్త్మా

పశ్చార్ధేన ప్రవిష్టః శరపతన భయాద్భూయసా పూర్వకాయమ్ దర్భైరర్ధావలీఢైః శ్రమవివృతముఖభ్రంశిభిః కీర్ణవర్త్మా
పశ్యోదగ్ర ప్లుతత్వాద్వియతి బహుతరం స్తోక ముర్వ్యాం ప్రయాతి"

(మనోహరంగా మెడను ప్రక్కకు త్రిప్పుతూ రథం వైపు మాటిమాటికీ దృష్టిని కేంద్రీకరిస్తూ, బాణం తన మీద పడుతుందనే భయంతో శరీరపు ముందు భాగాన్ని వెనుక భాగాన్ని కుదించుకొంటూ ఉండగా, అలసటతో తెరచిన నోటి నుండి సగం కొరికిన దర్భలు దారి నిండా జారిపడుతూండగా, మున్ముందుకు దుముకుతుండటం వల్ల నేలమీద ఆనకుండా పయనిస్తున్నది చూడు)

ఇది కాళిదాసు కల్పించుకొన్న వర్ణనా సదవకాశమే. ఇది కాళిదాసు కల్పనే కాని మృగయాసక్తుడైన దుష్యంతుడు కావించిన వర్ణనం కాదు. ఎందువల్లనంటే లేడి సొగసులు చూచి మురిసిపోయే మృగయుడు దానిని వేటాడలేడు కదా! అప్పుడు అతడి బాణం చేతినుండి జారిపోతుంది తప్ప లేడి మీదికి పోదుగదా!

మరి ఇటువంటి సందర్భంలో ఈ శ్లోకం సందర్భ శూన్యమైందిగా భావించగలమా? నిరసించగలమా? అలా చేస్తే శాకుంతలంలోని ఎన్నో శ్లోకాల్ని తొలగించ వలసి వస్తుంది. అలా చేస్తే రసవత్కవితా పదార్థంగల భాగాలు కనుమరుగు అవుతాయి. అసలు చెప్పాలంటే ఆ శ్లోక భాగాల వల్లనే శాకుంతలం ఉత్తమ శ్రవ్య కావ్యంగా కూడ కీర్తి గడించింది. అవి ప్రదర్శన సమయంలో సైతం నాటక సౌందర్యాన్ని ఇబ్బడి ముబ్బడి చేస్తున్నవే తప్ప నాటక ప్రదర్శనకు నష్టం కల్గించటం లేదు. అలాగని నాటకంలో మితి మించిన వర్ణనలుండకూడదు.

నాటకంలో అభినయానికీ రంగ ప్రదర్శనకూ ఉన్న స్థానం ఉన్నతం. అయినా వాటికి సాధ్యం కాని కొన్ని అంశల్ని మూర్తుల్ని కవి వర్ణించక తప్పదు. ఆ వర్ణనల వల్ల ప్రదర్శనకు అందం వస్తున్నదే తప్ప నష్టం వాటిల్లదు. కనుక ఉత్తముడైన నాటక కవి తన కవితా ప్రజ్ఞలో చాల భాగాన్ని సంయమనంతో అణచిపెట్టి తగు మాత్రమైన సాహిత్య వస్తువు నందిస్తాడు. ఇక రక్తి కట్టించ వలసిన ఇతర విషయాల్ని నటులకు వదలివేస్తాడు. అది వారి వంతు కర్తవ్యం. వారి వల్లనే నాటకం వర్ధిల్లుతుంది. అది సుందర తరమైతుంది.

ఈ నాటక రచయితే, అదే ఇతివృత్తాన్నే శ్రవ్య కావ్యంగా రచిస్తే, దాని సంపూర్ణ సౌందర్య పోషక భారాన్ని తన మీదనే వేసుకొంటాడు. వర్ణనలతో సర్వం స్వయం సమగ్రంగా సుందరీకరిస్తాడు.

### 9.3.6. భాషారీతులు

నాటకానికి పూర్వ పాఠాలుగా చదివే పద్య కావ్యాలలోను చంపూ కావ్యాలలోను ప్రౌఢ సాహిత్యం ఉంటుంది. కానీ నాటక భాష ఇతర కావ్య భాష కంటె సులభతరంగా సుఖగ్రాహ్యంగా ఉంటుంది. శబ్దార్థ పరిజ్ఞానం కోసం కాక భాష సుబోధకంగా ఉండాలి. నటుడు పునఃపునః చదువడు. మననం చేసుకోవడానికి వీలుండదు. కనుక సామాజికుడు చప్పున గ్రహించడానికి వీలుగా చరించాలి. ఇది సర్వజన సమ్మతమైన విషయం. అలా చెయ్యకపోతే నాటకంలోని చమత్కారాలు అభినయంలోని అందాలు కథాగమనంలోని కమనీయతలు ఏవీ సామాజికుడికి అవగతం కావు. శిల్ప రచనా పరిజ్ఞానం కోసం నాటక పఠనాన్ని తుది పాఠకంగా నిర్ణయించారు. ఇటువంటి అనేక విషయాల్ని దృష్టిలో పెట్టుకొనే 'నాటకాంతం హి సాహిత్యం' అన్నారు. 'ఆట పాట' లోని నృత్తం నాట్యంగా పరిణమించటంతో శ్రవ్య కావ్యంలాగా అదే కథను స్వీకరించినా అభినయ ప్రధానంగా రచన సాగుతుంది దృశ్య కావ్యంలో. కనుక నాటకంలో శబ్దాని కంటె అభినయానికే ఎక్కువ హక్కుంటుంది. దానికి తోడు పాత్రోచిత భాష అవసరం.

శ్రవ్య కావ్యంలో దుర్బోధాలైన పదాలతో కర్కశ సుందరమైన ఒక శైలిని నడుపవచ్చు. అంటే అక్షర రమ్యత ప్రదర్శించవచ్చు. శ్రవ్య కావ్యంలో ప్రతిపదార్థాన్ని అపేక్షిస్తాం. అలాగే దృశ్య కావ్యంలో వాక్యార్థమైనా కనీసం అవసరమైతుంది. సారాంశంగా శ్రవ్య

కావ్యంలో శబ్ద రచనకే ప్రాధాన్యం ఎక్కువ. అది దోషం కాదు.

మొత్తం మీద శ్రవ్య కావ్యంలో లాగ శబ్దాడంబరంతో అతిశయోక్తులతో మెప్పించటం తేలిక. కాని నాటకంలో లాగ స్వభావోక్తులతో సరస సుబోధక భాషతో మెప్పించటం కష్టం.

### 9.3.7. చైతన్య శక్తి - కేంద్రీకరణ

నాటకం పరకళాశ్రయమైనప్పటికీ, పరిమిత విస్తృతి కలది. కనుక దృశ్య కావ్య రచయిత తన కావ్యనిర్మాణ శక్తినంతటినీ కేంద్రీకరించి దాన్ని సుసంఘటితం చేస్తాడు. ఇటువంటి అవకాశం తీరిక మహాకావ్య (Epic) రచనలో కుదరదు. అందువల్ల శిథిల నిర్మాణం గల నాటకం అసమగ్రమైనప్పటికీ ఎపిక్ కంటె సర్వోత్కృష్టమైందని అరిష్టాటిల్ తన భావాన్ని ఘంటాపథంగా చెప్పాడు. ఈ భావంతోనే కావచ్చు అరిష్టాటిల్ నాటక పరిమితిని నాటి విస్తృతం నాతి సంక్షిప్తం కాకుండా ఉండాలని నిర్దేశించాడు. ఇటువంటి నియమ నిబంధనలు నాటక కర్త యొక్క సృజన శక్తిని కేంద్రీకరింపచేసి ఉత్తమ నాటక రచనకు దోహదం చేస్తాయి. అయినా ఈ వాదం సమర్థనీయం కాదంటారు పింగళివారు.

భారత రామాయణాల వంటి విపులేతి హాస కావ్యాల్ని రచించిన మహాకవులు తమ సర్వచైతన్య శక్తుల్ని కేంద్రీకరించారు. ఎటువంటి సూక్ష్మాంశల్లోనూ ఏ లోపం లేకుండా చేశారు. ఒక వ్యక్తి చరిత్రనే కాదు వందల పాత్రల్ని వాటి చరిత్రల్ని మానవ మానవేతర ప్రాణి జీవితాల్ని ఉత్తమంగా చిత్రించారు. అంతేకాదు ముల్లోకవాసుల విషయాల్ని కూడ విపులాతి విపులంగా వర్ణించి లోకాలన్నింటినీ మనకు సన్నిహితం చేశారు.

భారత రామాయణాలలాగ అతి విస్తృతి గల మహేతి హాసాలు కాకపోయినా సంస్కృతంలోని కుమార సంభవాది కావ్యాలూ, తెలుగులోని మనుచరిత్రాది ప్రబంధాలూ నాటకాల వలెనే సుసంఘటితమైనవే. ఆ కవుల కవితా ప్రజ్ఞ మధుర మనోహర విహారం చేసిన దివ్యరంగ భూములని, ఎటువంటి మహా నాటక కర్త అయినా అటువంటి దివ్య సీమల్ని ఎప్పటికీ చేరుకోలేడు. ఇలా ఆలోచిస్తే సాహిత్య వాఙ్మయ సృష్టితో నాటకం స్పర్ధ వహించదగింది కాదంటారు పింగళివారు.

### 9.4.1. ప్రదర్శనాపేక్షలేని మహాకావ్యం

కొన్ని నాటకాలు ప్రదర్శింపక పోయినా చిరంజీవులే. వాటిలోని మహాకావ్య లక్షణమే అందుకు కారణం. అందుకు లోకోత్తరమైన అభిజ్ఞాన శాకుంతల మహా నాటకమే ఉదాహరణం. దానికి సరైన ప్రదర్శన లోపించి కొన్ని వందల సంవత్సరాలైంది. అయినా అది అజరామరంగా ఉండటానికి కారణం దాని ప్రదర్శనాపేక్ష లేని మహాకావ్యత్వమే. ఏతాదృశ నాటకాల్ని పఠించే సమయంలో సహృదయుడు తన భావనా శక్తిని ఉపయోగించుకోవాలి. నాటకంలో కనిపించే లుప్త భాగాల్ని ప్రదర్శన సమయంలో నటుడు రంగాలంకరణాదుల సాయంలో ఇతర కళల సాయంతోను పూరిస్తాడు. దానితో సామాజికుడు భావించుకోవలసిన అవసరం లేకుండానే ప్రత్యక్షం చేస్తాడు.

ప్రదర్శనాపేక్షలేని మహానాటకాలలో అందులోని మహాకావ్య లక్షణాలు వర్ణన రసం కవి చేసిన అభినయ సూచనలు పాఠకుడికి సర్వాన్నీ కన్నుల ముందు ప్రత్యక్షీకరిస్తాయి. దానితో మహా నాటకాన్ని దర్శించిన తృప్తి మహా కావ్యాన్ని పఠించిన ఆనందం కలుగుతాయి.

### 9.4.2. శ్రవ్యనాటకం - కావ్యం

ప్రదర్శన యోగ్యతలేని నాటకం శ్రవ్య నాటకం. అటువంటి నాటకాన్ని శ్రవ్య కావ్యంతో పోల్చినప్పుడు దాని స్థానం

ఏమిటని ప్రశ్న. అంటే ప్రదర్శనీయ వస్తువుగా గాక పఠనీయ నాటకంగా ఎంచి చూస్తే అది చాల అసమగ్రంగా ఉంటుంది. కావ్య విశేషంగా అది ఏ విధంగాను స్వయం సంపూర్ణం కాదు. అది సంపూర్ణంగా ఉండాలంటే దానికి ఇతర లలిత కళల సహకారం అవసరం. అంటే అది సర్వకళల సమాహారంగా ఉండాలి. అప్పుడే అది ప్రదర్శన యోగ్యమైతుంది. అంటే ఆ నాటకంలో కవి రచించిన వాక్కు ఒక్క అంశమే అవుతుంది కాని సర్వ సమగ్రంకాదు. అది అలా అసమగ్రంగా ఉండటానికి కారణం నాటక ప్రక్రియా స్వభావమే కాని రచయిత అసమర్థత మాత్రం కాదు. ఇంకొక విషయం గుర్తుంచుకోవాలి. దృశ్య కావ్యానికి రంగ స్థలమూ నటుడూ దొరకని పక్షంలో ఆ రచన నిస్సహాయంగా నిలచిపోతుంది. ఉండికూడ లేనట్లే అవుతుంది. ఎంత లోకోత్తర కథ కలిగిన నాటకమైనప్పటికీ ప్రచారంలో ఉండదు. శ్రవ్య కావ్యం ఇతర కళల ఆపేక్ష లేకుండానే ఎట్టి పరిస్థితులలోనైనా సర్వసమగ్రంగా శోభిస్తుంది. అయితే దానికి తగిన పాఠకుడు లభించాలి.

### 9.5.1. అభినయ సూచనలు

నాటకంలో ప్రదర్శింపని లుప్త భావాల్ని కొన్నింటికి నాటక కర్త అభినయ సూచనలు (stage directions) చేస్తాడు. మహా నటుడు ఆ సూచనలలోని అర్థానికి అనుగుణంగా నటించగలుగుతాడు. పాత్ర యొక్క శారీరక చేష్టల్ని అనుకరించ గలిగినా మానసికమైన భావతరంగాల్ని కవి ఊహ కనుగుణంగా అభినయించటం సుశిక్షితుడైన నటుడికి మాత్రమే సాధ్యమైతుంది.

నాటక కర్త కూడ అన్ని సూచనలూ చేయలేడు. (కావ్యంలో) కొన్ని సన్నివేశాలు కవి వర్ణించినవి తప్ప అభినయానికి సాధ్యపడవు.

మనుచరిత్రలో ప్రవరుడిని చూచిన వరూధినికి స్థితిని వర్ణించే పద్యం తిలకించవచ్చు.

ఉ॥ చూచి ఝుళం ఝుళ త్కటక సూచిత వేగ పదారవిందయై
లేచి కుచంబులుందురుము లేనడు మల్లల నాడ నయ్యెడం
బూచిన యొక్క పోకనును బోదియ జేరి విలోకన ప్రభా
వీచికలం దదీయ పదవీ కలశాంబుధి వెల్లి గల్పుచున్

మను చరిత్రలోని ఈ సన్నివేశాన్ని నాటకీకరించిన కవి అన్ని అభినయ సూచనలు చేయలేడు. "ఆమె లేచి నిల్చి ప్రవరుని మార్గాన్ని వీక్షిస్తూ" అని మాత్రమే సూచించగలడు. ఈ సూచనను నిమిత్తంగా మాత్రమే స్వీకరించి నటి తన అభినయ కౌశలంతో కవి భావాన్ని సమగ్రంగా ప్రదర్శించవచ్చు. అయినా ఆమె చూపు 'తదీయ పదవీ కలశాంబుధి వెల్లిగొల్పటం' అనే భావాన్ని నాటక కర్త సూచింపనూ లేదు. నటులకు అభినయ సాధ్యమూ కాదు.

ఆ కవి ఈ సన్నివేశాన్ని శ్రవ్య కావ్యంగా రచిస్తే తాను భావించి దర్శించిన వరూధిని నడల ఒయ్యారాన్నీ చూపుల్ని సొగసుల్ని వర్ణించి తృప్తిపొందగలడు. పఠితను రసానంద పారవశ్యం కలిగిస్తాడు. పై పద్యమే అందుకు తార్కాణం.

సారాంశంగా అభినయ సూచనలు అటు నాటకంలోగాని కావ్యంలోగాని అన్నిటా సాధ్యంకావని తెలుస్తుంది.

### 9.5.2. అభినయం - భావన

నాట్య శాస్త్రాన్ని బట్టి శాకుంతలాది నాటక సందర్భాల్ని బట్టి పర్యాలోచిస్తే అభినయం ఎప్పుడూ సర్వాన్నీ ప్రత్యక్షీకరించ లేదు. సామాజికుడు భావించు కోవలసిన భాగం చాల ఉంది. అంటే అభినయం వల్ల భావం పూర్తిగా వ్యక్తం కాదు. అందుకు సామాజికుని భావన కూడ సహకరించాలి. ఉదాహరణకు శకుంతల భర్త ఇంటికి వెళ్లే సమయంలో వనదేవతలు ప్రసాదించిన

ఆభరణాల్ని అనసూయా ప్రియంవదలు నాటక రంగం మీదనే ఆమెకు అలంకరిస్తారు. దీనిని కాళిదాసు 'ఉభే నాట్యే నాలం కురుతః' (ఇద్దరూ అలంకరిస్తున్నట్లు నటించారు) అన్నాడు. దీని కనుగుణంగానే భూషణాల్ని అలంకరిస్తూ నటిస్తారు. అంతే కాని అసలు ఆభరణాల్ని ఆమెకు తొడగరు. నటించి సామాజికుల్ని భ్రమింపచేస్తారు. ఆ ఆభరణాలు సామాజికుడి కంటికి కనబడక పోయినా వారి భావలోచన గోచరాలవుతూనే ఉంటాయి. అలా భ్రమింప చెయ్యటమే అసలైన అభినయం. అలా కాక అన్నీ రంగ స్థలం మీద ప్రత్యక్షంగానే చూపాలంటే నాటకమే సాగదు. కనుక నాటకంలో ప్రత్యక్ష దర్శనం పరిమితికి లోబడిందే.

మరో ఉదాహరణ - కూచిపూడి భాగవతుల ఉషాపరిణయ ఘట్టంలో బాణాసురుడి జైత్రయాత్ర. ఆ సందర్భంలోని యుద్ధ ఘట్టంలోని బాణాసుర వేషధారి పరిస్థితి కూడ అటువంటిదే. రంగ స్థలం మీద యుద్ధ ఘట్టం నిషిద్ధం. అందువల్ల అతడు రంగ స్థలం మీదనే 'ఇరుకరముల డాలును కత్తియు మెఱయ' అటూ ఇటూ చిత్ర విన్యాసాలతో పరాక్రమిస్తూ ముల్లోకాల్ని జయించిన వాడిలాగ అభినయిస్తాడు. కానీ, అక్కడ యుద్ధభూమీ లేదు యుద్ధమూ లేదు. శత్రువులూ లేరు. వారి సంహారమూ లేదు. కానీ అతని అభినయ కౌశలమే మనకు మనో గోచరమైతుంది.

అలాగే శృంగార పదాల్లో 'ఆకు మడుపు లందిత్తు రారా' అంటూ నాయిక నాయకుడిని ఆహ్వానించే పదం ఒకటుంది. ఆ పదాన్ని అభినయించే పాత్రధారి. ఆకులు వక్కలు లేకుండానే అభినయంతోనే, ఆకులకు ఈనెలు తియ్యటం, సున్నం రాయటం మడవటం చిలుకలు చుట్టటం వంటి సరస కృత్యాలన్నీ గాలిలోనే అభినయించి యదార్థ పదార్థ అపేక్ష లేకుండానే వాస్తవికతా భ్రమను కల్పిస్తుంది. అదే అభినయానికి పరాకాష్ఠ పాత్రకు అలంకారం.

### 9.5.3. అభినయం - భావుక సౌలభ్యం

1. శ్రవ్య కావ్య పఠన సమయంలో భావుకు అనుభవించే భావనాహ్లాదం కంటె, ప్రదర్శన సమయంలోని అభినయం వల్ల నాటక ప్రేక్షకుడి మనసులో వెల్లివిరిసే భావనా సంబంధమైన ఆహ్లాదం సుకంగా లభిస్తుంది.

2. సంగీత సాహిత్యాభినయాలతో కూడిన నాటక రంగ వాతావరణం సామాజికుడికి అప్రయత్నంగా అలౌకికమైన ఒక రసజగత్తును ఆవిష్కరిస్తుంది. ఇటువంటి స్థితిని కలిగించగల ప్రదర్శనీయ నాటకమే ఉత్తమ నాటకం.

3. అంతే కాని కేవలం శ్రవ్య నాటకం శ్రవ్య కావ్యానికి లాగా ఆనందాన్ని పంచి పెట్టదు.

4. ఒక్కొక్కసారి ఎంత భావుకునికైనా స్ఫురించని రసపదార్థాలు ప్రదర్శన సమయంలో నటుని అభినయ కౌశలం వల్ల హఠాత్తుగా సుకరంగా స్ఫురించవచ్చు. కనుక భావుక సౌలభ్యం విషయంలో నాటకమే ఉత్తమం.

### 9.5.4. అభినేత - కవికి వ్యాఖ్యాత

శకుంతలను దుష్యంతుడు పల్కరించిన సందర్భంలో -

"కిం శీతలైః క్లమ వినోదిభిః ఆర్ద్రవాతాన్
సంచాలయామి నలినీ దళ తాళ వృంతైః
అంకే నిధాయ కరభోరు యథా సుఖం తే
సంవాహయామి చరణావుత పద్మ తామ్రౌ" - వసంత తిలకం.

శకుంతలను దుష్యంతుడడిగిన వాక్యంలోని 'కిం' అనే పదం కేవలం ప్రశ్నార్థకం కాదు. అది ఆమె పట్ల అనునయంతో కూడిన ప్రశ్నార్థకం. నాటక పఠనవేళ పాఠకుడికి కవి ఉద్దేశించిన ఈ భావం స్ఫురించకపోవచ్చు. కానీ ఆ వాక్యాన్నే ఉత్తమ

నటుడు అనునయాత్మకంగా అభినయాత్మకంగా ఉచ్చరిస్తూ ప్రదర్శించి నప్పుడు, ఆ నటుడు ప్రేక్షకులకు కవి హృదయాన్ని ఆవిష్కరించిన వ్యాఖ్యాత అవుతాడు. నట కౌశలం వల్ల కవి హృదయం సామాజిక హృదయానికి హత్తుకుంటుంది.

షేక్స్పియర్ రచించిన 'మర్చెంట్ ఆఫ్ వెనిస్' అనే నాటకంలోని 'షైలాక్' పాత్రను, పూర్వం ఆంగ్ల ప్రజలు ఎంతో గర్హించేవారు. కాని గత శతాబ్దంలో ఆ పాత్రను 'ఎడ్మండ్ కిన్' అనే ఉత్తమ నటుడు తన అభినయ కౌశలంతో నటించి, 'షైలాక్' పాత్ర పట్ల ప్రజలకు ఎంతో ఆదరాన్ని సానుభూతిని కలిగించి మెప్పించాడు. అతడు వ్యాఖ్యా సదృశమైన అభినయ కౌశలమే దీనికి కారణమంటారు. అది ఎలాగంటే -

ఆ నాటకంలోని న్యాయ విచారణ సందర్భంలో 'నీకు తృప్తి కలిగిందా?' (Art thon contented, Jew) అని పోర్షియా అడిగిన దానికి షైలాక్ పాత్రధారి 'కిన్' 'నాకు తృప్తి కలిగింది' (I am content) అని అంటూ తన నిస్సహాయతలో నిర్వేదం పరాభవం నిస్సహాయతను వ్యక్త పరిచాడు. నటన ఉచ్చారణ వైవిధ్య కౌశలంతో. అప్పటి నుండి ఆంగ్ల సారస్వత విమర్శకులే కాదు సర్వసామాజికులూ షైలాక్ పాత్రను గర్హణీయమైంది కాదని, దయనీయమైందని భావించ నారంభించారు. 'I am more sinned against than sinning' నేను చేసిన అన్యాయాల కంటె నాకే ఎక్కువ అన్యాయం జరిగింది - అని షైలాక్ పాత్ర వాపోవడంలో సత్యం ఉందని గ్రహించారు.

ఇటువంటి సందర్భాల్ని దృష్టిలో పెట్టుకొని పరికిస్తే నాటక దర్శనం వల్ల కలిగే ఆనందం కేవలం నాటకాన్ని పఠించటం వల్ల కలుగదని స్పష్టమైతుంది. ఆ ఆనందం కలగాలంటే పై చెప్పిన విధంగా మహానటులు లభించాలి. అటువంటి వారు అరుదుగా ఉంటారు.

### 9.6.1. శ్రవ్య కావ్య - పఠనాధికారి

ఉత్తమాధికారి మాత్రమే ప్రబంధ పఠనానికి అర్హుడు. అతడు కవి హృదయంతో సంవదించాలి. కవి వలె సరస హృదయమూ నిశిత భావనా కలిగి ఉండాలి. విద్యా సంస్కారం కలిగి కవిని సానుభూతితో అర్థం చేసుకోగలిగి ఉండాలి. అటువంటి సహృదయుడు కావ్యాన్ని పఠిస్తున్నా, నాటకాన్ని దర్శిస్తున్నప్పటి కంటె అధికంగా ఆనందిస్తాడు, భావిస్తాడు, దర్శిస్తాడు. కావ్య కల్పిత పాత్రల హావ భావాల్ని తన భావనా శక్తితో సాక్షాత్కరింప చేసుకుంటాడు. అటువంటి భావనా గోచరమైన జగత్తు రంగస్థలం మీద ఎన్నటికీ దర్శన మివ్వదు. మనం దర్శించే పాత్రల అభినయం భావనాలోకమైన చలద్రూపం దాని ముందు దిగదుడుపే.

కీచకుడు సైరంధ్రిని కాలితో తాచటం చూచిన భీముడి ఉగ్రరూపాన్నీ, ఉద్రేకాన్నీ వర్ణించిన సందర్భం సహృదయ మనోగోచరం.

చం॥ కనుగొని కోపవేగమున కన్నుల నిప్పులు రాల నంగముల్
దనరగ సాంద్రఘర్మ సలిలమ్ములు గ్రమ్మ నితాంత దంత పీ
డనరట దాస్య రంగ వికట భృకుటీ చటుల ప్రవృత్త న
ర్తన ఘటనా ప్రకార భయదస్ఫురణా పరిణద్ధ మూర్తియై

సీ॥ నేలయు నింగియుఁ దాళముల్గాఁ జేసి
ఏపున మించి వాయించి యాడ
గుల పర్వతమ్ములు గూల్చి యొండొంటితో
దాకంగ వీకమైఁ దన్నియాడ
నేడు సాగరములు నిక్కడక్కడఁ బెట్టి

పలుచని రొంపిమై నలది కొనగ
దిక్కులు నాలుగు నొక్క చోటికిఁ దెచ్చి
పిసికి పిండలి చేసి పిడుచుకొనగ

తే॥ మిగిలి బ్రహ్మాండ భాండంబు ప్రగుల వ్రేయ
నప్పళించుచు ప్రళయ కాలానలమున
గండరించిన రూపంబు కరణి భీము
డతి భయంకరాకారత నతిశయిల్లె - తిక్కన

ఇందులో భీముడి భయంకరాకారం, ఉద్రిక్త చిత్త వృత్తి వర్ణింపబడింది. ఇవి భావుకలోచన గోచరాలే కాని అభినయ సాధ్యాలు కావు. ఒక వేళ ఈ సన్నివేశాన్నే తిక్కనే నాటకీకరించినా భీముని పాత్రను ఇంత రసవంతంగా చూపించలేడు. 'ఉగ్రుడై చూచుచూ' అని ఒక్క అభినయ సూచన మాత్రమే చెయ్యగలిగి ఉండేవాడు. అంతే కాని, అంతకు మించి ఆ వర్ణనలోని ఉగ్రమూర్తిని దర్శింపచెయ్యలేడు. ఆ నటుడు శరీరాన్ని విజృంభింప చేసి దంత పీడన భృకుటీ విశేషాలతో ఏదో కొంత భయంకరత్వాన్ని దర్శింపచేయగలడు. అంతే తప్పితే తిక్కన మహాకవి భావించిన మహోగ్రమూర్తిని దర్శింప చెయ్యలేడు. కాబట్టి ఈ పద్యాన్ని పఠించే సమయంలో సహృదయుడు పొందే ఆనందం నాటక దర్శన సమయంలో సామాజికుడికి లభించదు.

### 9.6.2. దృశ్య కావ్య దర్శనాధికారి

కావ్య పఠనానికి లాగానే నాటక దర్శనానికి భావనా శక్తి ఉంటే నాటక దర్శన సమయంలో సంపూర్ణానందం కలుగుతుంది. అతడు సరసాభి ముఖ్యమైన చిత్తవృత్తి గలిగిన సజ్జనుడై ఉండాలి. అతడే సహృదయ శిఖామణి.

అతడు నాటకశాలకు వెళ్లేది నాటక దర్శనం కోసమే. అంతే కాని దృశ్య కావ్య రసాస్వాదన కోసం కాదు. కావ్య రసాస్వాదన తృప్తిని ఇంటి వద్దనే ఉండి కావ్యాన్ని పఠించినా కలుగుతుంది. అలాంటి ఆనందాన్ని పొందలేని అపరిణత బుద్ధులైన వారికి బాలురకు నాటకమే శరణ్యం. వారికి సహృదయ భావంతో పని లేదు. అంతా ప్రత్యక్ష దర్శనమే. అందుచేతనే కావ్య పఠనానికి వలసిన విధంగా నాటకానికి ఉత్తమాధికారులు అవసరం లేదని పింగళి వారి ఉద్దేశ్యం. కారణం అందులో అంతా చక్షుర్గోచరమే.

రూపకానందం చక్షుర్గోచరమైంది. కావ్యానందం హృదయ గోచరమైంది. చక్షుర్గోచరమైన నాటకానందం కంటె హృదయ గోచరమైన దృశ్య కావ్యం ఉత్తమమైందని కొందరు సారస్వత వేత్తల అభిప్రాయం.

## 9.7 సమీక్ష

ఉత్తమ కావ్యం అయి ఉండి అది ప్రయోగానుకూల్యం కానప్పటికీ దానికి సాహిత్య ప్రతిపత్తి లోపించదు. నాటకం కంటె మహాకావ్యమే ఉత్తమ సాహిత్య ప్రక్రియ అని అరిస్టాటిల్ కాలం నుంచే ఒక వాదం ప్రబలంగా ఉంది. దృశ్య కావ్య రచనలోని క్లేశాలను తెలిసి కూడ వారీ నిర్ణయానికి వచ్చారు.

కావ్య గౌరవం ప్రయోగానుకూల్యం గల నాటకమే అత్యుత్తమ నాటకం. సాహిత్య ప్రతిపత్తి లోపించి ప్రయోగానుకూల్యం ఉన్నప్పటికీ వాఙ్మయంలో దాని ఉనికి ప్రశ్నార్థకమే. కనుక ఈ రెండు విషయాల్లో ఏది లోపించినా, దాని పరిపూర్ణత లోపించినట్లే. ఈ రెండు లక్షణాలు సాధించిన నాటకాలు ఏ భాషలోనైనా స్వల్పంగానే కల్పిస్తాయి. సృష్టికి ప్రతిసృష్టి వంటి ఇటువంటి నాటకాల వల్లనే 'నాటకాంతం హి సాహిత్యం' అని పెద్దలన్నారు.

## 9.8 ప్రశ్నలు

1. శ్రవ్య దృశ్య కావ్య భేదాల్ని సంక్షిప్తంగా వివరించండి.

## 9.9 ఉపయుక్త గ్రంథాలు


1. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
2. సాహిత్య భావలహరి - ఆచార్య యస్వీ జోగారావు



**డాక్టర్ మేళ్లచెర్వు భానుప్రసాదరావు**
రీడర్ - తెలుగు శాఖ
శ్రీ సుబ్బరాయ & నారాయణ కళాశాల
నరసరావుపేట - 522 601

# పాఠం - 10

# ట్రాజెడి

## (ఎ) అరిస్టాటిల్, (బి) షేక్స్పియర్

పాఠ్యనిర్మాణక్రమం


10.1.0. లక్ష్యం
10.1.1. గ్రీకు ట్రాజెడీ ఆవిర్భావం
10.1.2. అరిస్టాటిల్ ఔన్నత్యం
10.1.3. ట్రాజెడీ నిర్వచనం
10.1.4. ట్రాజెడీ ప్రధానాంగాలు
10.1.5. కెథార్సిస్ - గ్రీకు భారతీయ సామ్యం
10.1.6. ట్రాజెడీ - గ్రీకు భారతీయ రసానందం
10.1.7. ట్రాజెడీ - ప్రయోజనాలు
10.2.1. షేక్స్ప్రియర్
10.2.2. విషాదాంత నాటక లక్షణాలు
10.3.1. అరిస్టాటిల్ షేక్స్ప్రియర్ దృక్పథ భేదాలు
10.4.1. సమీక్ష
10.5.1. ప్రశ్నలు
10.6.1. ఉపయుక్త గ్రంథాలు


### 10.1.0. లక్ష్యం

పాశ్చాత్య దృశ్య కావ్య ప్రపంచంలో ట్రాజెడి విశిష్ట ప్రక్రియ. ట్రాజెడి సిద్ధాంతానికి లక్షణం అరిస్టాటిల్ లక్ష్యం షేక్స్ప్రియర్ - లక్షణం లక్ష్యంగా పరివర్తనం చెందేటప్పుడు కొన్ని మార్పులు చేర్పులు తప్పక ఉంటాయి. వీటిని గమనించటంతో పాటు ప్రాచ్య పాశ్చాత్య విషాదాంత నాటక రసానంద భేద సాదృశ్యాల్ని గమనించడం, అరిస్టాటిల్ షేక్స్పియర్ ట్రాజెడీ సిద్ధాంతాల్ని సాంగోపాంగంగా అధ్యయనం చేయడం ప్రధాన లక్ష్యం.

### 10.1.1. గ్రీకు ట్రాజెడీ ఆవిర్భావం

ట్రాజెడీ ఒక గ్రీకు రూపక ప్రక్రియ. ఇది మొదట గ్రీసు దేశంలో ఉద్భవించింది. అతి ప్రాచీన కాలం నుంచి గ్రీకు దేశీయులు సంవత్సరానికి రెండు పర్యాయాలు, ద్రాక్ష దిగుబడి వచ్చే ఋతువుల్లో పండువులు జరుపుకొనేవారు. మార్చి మాసంలో వచ్చే ద్రాక్ష పంట కాలంలో వారు వసంతోత్సవాలు ఘనంగా జరుపుకొనేవారు. మదిరా ప్రభువైన 'డయోనిసస్' ఆ ఉత్సవాలకు అధిష్టాన దైవతం - ఆ 'డయోనిసస్' ను నుతించటానికే 'డితిరాంబు' (Dithyramb) అని వ్యవహారం.

(The dithyramb was an elaborate choral ode sung and performed by a trained chorous of fifty, the song itself having a direct bearing upon the central religious orientation of the whole festival and its connection with the god dionysus)

ఆ ఉత్సవాల్లో మేషబలి గావించేవారు. అది దేవతా ప్రీతికోసం చేసే ఒక విధమైన జాతర. అందులో వారు మేకల వేషాలు వేసుకొని నృత్యం చేస్తూ బృందగానం చేసేవారు. ఆ పాటలకు మేష గీతాలని పేరు. ఇందులో ఆరంభదశలో ఆశు గీతాలుండేవి. ఆ తరువాత కవి రాసిన గీతాలుండేవి. అప్పటినుండి "డితిరాంబు"కు సారస్వత స్థాయి వచ్చింది. ఇందులో ప్రదర్శన భాగం తక్కువ. బృందగానం ఎక్కువ. కథ ఆఖ్యాతం చేయబడేది. మధ్య మధ్య కొన్ని సన్నివేశాలు మాత్రమే ప్రదర్శించే వారు. ఇది గ్రీకు నాటక కళా ప్రాథమి స్వరూపం. అటు తరువాతి కాలంలో ముందు ట్రాజెడీలు తరువాత కామెడీలు ఆవిర్భవించాయి.

ఆ నాటి గ్రీకు ట్రాజెడీలు అంటే 'Funeral performance at the grave of a warrier' అని ప్రొఫెసర్ రిడ్జివే (Ridgeway) వివరించారు. ఒక మృతయోధుడి సమాధి వద్ద జరిపే అపర కర్మ కలాపం అని భావం. కాని రాను రాను ట్రాజెడి ఒక రూపక ప్రక్రియగా రూపొందింది. క్రీ.పూ. 536 లో థెస్పిస్ (Thespis) అనే వ్యక్తి ట్రాజెడీ రచనకు అంకురారోపణ చేసినట్లు తెలుస్తుంది. ఆ తరువాత గ్రీకు ట్రాజెడీకి ఒక విశిష్టమైన లక్షణ ప్రక్రియ నేర్పరచినవాడు అరిస్టాటిల్. అది కాలక్రమంలో పాశ్చాత్య దేశ రూపక రచనా ప్రయత్నాల కన్నింటికీ ప్రామాణిక గ్రంథం అయింది. దానితో అరిస్టాటిల్ గ్రీకు నాటక పితామహుడైనాడు.

### 10.1.2. అరిస్టాటిల్ ఔన్నత్యం (384-322 B.C.)

క్రీస్తుకు పూర్వం గ్రీసు దేశంలో పుట్టిన తాత్త్విక గురు పరంపరలో సోక్రటీస్ ప్రథమాచార్యుడు. అతడి శిష్యుడు ప్లేటో మహాశయుడు. ఆతని శిష్యుడు అరిస్టాటిల్. అరిస్టాటిల్ తన గురు పరంపరలోని సోక్రటీస్ ప్లేటోల వలెనే తాత్త్వికుడు. అంతకు మించి అదనంగా తార్కికుడు విజ్ఞాన శాస్త్రవేత్త లాక్షణికుడు కూడ. అతని గురువు లిద్దరూ కవులను వారి కవితలను మెచ్చుకోలేదు. సరికదా ఆనాటి సుప్రసిద్ధ కవి హోమర్‌ను సోక్రటీసు చాల తిరస్కార భావంతో నిరసించాడు. అలాగే ప్లేటో సామాజికంగా కవులకు ఉన్నత స్థానం లేదని ఉద్ఘాటించాడు. పైగా కవిత్వం అస్వతంత్రమైన అనుకరణకు అనుకరణమని కించపరుస్తూ ఒక నూతన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. సోక్రటీస్ ప్లేటో లిద్దరూ నైష్ఠిక ధార్మిక వాదులనదగిన వారే. కాని అరిస్టాటిల్ విజ్ఞాని మాత్రమే కాక రసజ్ఞుడు కూడ. అందువల్లనే తన గురువులకు గల తిరస్కార భావాన్ని పరోక్షంగా సున్నితంగా పూర్వపక్షం చేశాడు. కావ్య కళకు అర్హమైన గౌరవాన్ని చేకూర్చదలిచాడు. అందుకోసమే 'De-poetica' అనే కావ్య లక్షణాన్ని రచించాడంటారు.

### 10.1.3. ట్రాజెడీ నిర్వచనం

అరిస్టాటిల్ మహాశయుడు ట్రాజెడీని తన 'De-poetica'లో క్రింది విధంగా నిర్వచించాడు.

'Tragedy is the imitation of an action that is serious. Complete in itself and a certain magnitude, in language made beautiful by different means in different parts in the dramitic not in the narrative form, with incidents arousing pity and fear, bringing about the catharsis (purgation) of such emotions' -

ట్రాజెడీ స్వయం సంపూర్ణంగాను తగిన పరిమాణం కలిగి ఉదాత్తంగా లోకేతి వృత్తాని అనుకరించాలి. అది కథన రూపంలో గాక సంవాద రూపంలో ఉండాలి. విధిగా గేయ రూపంలో సాగాలి. స్వరతాళాది అలంకారాలతో సందర్భాను సారమైన భాషతో రమణీయంగా ఉండాలి. ఆఖ్యాన రూపకంగా కాక నాటకీయంగా ప్రదర్శింప బడాలి. అందులోని కథాంశాలన్నీ దయా శోక భయానక రసోద్బోధకాలుగా ఉండాలి. అటువంటి రసభావాలు క్షాళనం చేసేట్లుగా ఉండాలి. అలాంటిది మాత్రమే ట్రాజెడీ అనిపించుకుంటుంది.

ఈ నిర్వచనం ట్రాజెడీ స్వరూప స్వభావాల్ని దానిలోని భాషను దాని వ్యక్తీకరణ విధానాన్ని నాటకీయతను తెలిపింది. ట్రాజెడీ ప్రయోజనం కొన్ని భావాల క్షాళన అని వివరించింది. సారాంశంగా అతడి నిర్వచనం ప్రకారం ట్రాజెడీ అంటే భావ

గంభీరమూ పరిపూర్ణమూ సముదాత్తమూ అయిన ఒక అవస్థను అనుకరించటం. సామాజికుని మీద అది చూపే ప్రభావం వల్ల ఒక నైతికమైన ప్రయోజనం సమకూరుతుందని అతడి భావన. మానవుడి మనగడలో మాటి మాటికీ ఎదురౌతూ అతడి మనసును ఊచకోతకు గురిచేసేవి భయం కరుణ అనేవి. ట్రాజెడీ సామాజికుడని మొదట భయభ్రాంతుడిని చేసే కరుణలో కరిగించి తుదకు మాలిన్య ప్రక్షాళనం చేస్తుందని అరిస్టాటిల్ సిద్ధాంతం.

ఇలా అరిస్టాటిల్ తనకు ముందున్న Euripides, Sophocles రచించిన నాటకాల్ని పరిశీలించు తాను స్వయంగా మరి కొన్ని లక్షణాల్ని ఏర్పరచి ట్రాజెడీని నిర్వచించాడు. ప్రత్యేకించి ఈ లక్షణంలో అనుభూతి కంటె ఆలోచన వైపు నైతిక ప్రయోజనం వైపు దృష్టి సారించి సుస్థిరం చేశాడు.

### 10.1.4. ట్రాజెడీ ప్రధానాంగాలు

ట్రాజెడీలో ప్రధానాంగాలు కొన్ని ఉన్నాయి. ఇతివృత్తం పాత్రౌచిత్యం భాష భావం సంగీతం రంగాలంకరణ వంటివి ముఖ్యం. వీటి సుందరతర సంగమమే విషాదాంత నాటక స్వరూపం.

ఎ. ఇతివృత్తం - ప్రధానేతి వృత్తం - ట్రాజెడీలో ఇతివృత్తానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. అది నాటకానికి హృదయ స్థానం వంటిది. కథా ప్రధానం కాని ట్రాజెడి హృదయాన్ని ద్రవింపచేయలేదు. కథ ఏక కార్య నిష్ఠగా ఉండాలి. ఇతివృత్తం శుద్ధం సంకీర్ణం అని ద్వివిధాలు. ఈ రెండు రకాలు మోదాంతకాలు గానూ లేదా విషాదాంతాలు గాను ఉండవచ్చు. ఈ శుద్ధ సంకీర్ణ ఇతి వృత్తాల మధ్యన గల భేదం (ఎ) వ్యత్యస్థమైన ఫలం (బి) అభిజ్ఞానం అనే వాటిలో ఉంటుంది.

ఆశించిన దాని కంటె ఫలితం విరుద్ధంగా ఉంటే అది వ్యత్యస్థఫలం. సిరి సంపదలతో వర్థిల్లే పాత్ర ఒక్కసారిగా దుఃఖా భాజకంగా మారటం. అంటే అప్పటి వరకూ జ్ఞాతం కాని అంశం వెలుగులోకి రావటం అభిజ్ఞానం. ఉపకారం చేయ తలచి వచ్చిన దూత, అడిసన్ రాజు పుట్టు పూర్వోత్తరాలు వ్యక్తం చేశాడు. కానీ దానివల్ల రాజు జీవితం అంధకార బంధురం కావటానికి కారణమైనాడు. ఇక్కడ దూత తలచిన ఫలం ఒకటి. లభించిన ఫలం వేరొకటి. ఇది వ్యత్యస్త ఫలం. రాజుకు అంత వరకు తెలియని ఒక నగ్న సత్యాన్ని తెలియటం అభిజ్ఞానం. ఈ అభిజ్ఞానంతో మిత్రత్వమో శత్రుత్వమో ఏదో ఒకటి ఏర్పడుతుంది. దాంతో నాటకం శుభాంతమో అశుభాంతమో అవుతుంది.

అరిస్టాటిల్ సంకీర్ణేతి వృత్తానే ఆదరించాడు. ఇది శుభాంతేతి వృత్తం కావచ్చు. లేదా అశుభాంతేతి వృత్తం అయినా కావచ్చు. ఇందులో సంకీర్ణ అశుభాంతేతి వృత్తాలనే ట్రాజెడీకి తగినవని భావించాడు. ఇటువంటి ఇతివృత్తాలలోని నాయక పతనం వంటిదే తమకూ కలుగుతుందేమోనని సామాజికుడికి భయం కలుగుతుంది. ఆ భయంతో అతడికి పాత్ర మీద అమితమైన సానుభూతి కలుగుతుంది. కనుక ఇదే సరైన ఇతివృత్త విధానమని అరిస్టాటిల్ అభిప్రాయ పడ్డాడు.

ఇతి వృత్తం స్వయం సంపూర్ణంగా ఉండాలి. అంటే ఆది మధ్యాంతాలనే మూడు దశల యొక్క క్రమ పరిణామం కలిగి కథ ఉండాలి. ఇతరాపేక్ష పనికి రాదు. అంటే స్వయం వ్యక్తమైన మూర్తి కలిగి ఉండాలని భావం. ఆది మధ్యాంతాలనే ఈ మూడు దశల్లో మధ్య భాగం ఆది భాగానికి కార్యమై ఉండాలి. అంత్య భాగం మొదటి రెంటికీ అపరిహార్యమైన ఫలమై ఉండాలి. కనుక సహజమూ శాస్త్రీయమూ అయిన ఇటువంటి కార్య కారణ సంబంధంతో శోభించే అవయవ నిర్మాణం గల ఇతివృత్తం ట్రాజెడీకి అవసరం. అప్పుడే నాటక నిర్మాణ శిల్పం రక్తి కడుతుంది. ఇదే కథైక్యం (Unity of Plot) అంటారు. 'The poet should be the maker of plots rather than of verses' నాటక కవి కథా సంవిధాత కావాలి కాని పద్య రచయిత అయినంత మాత్రాన సరిపోదన్నాడు అరిస్టాటిల్.

అలాగే నాటక కథ మరీ విస్తృతంగా గానీ మరీ సంక్షిప్తంగా కాని ఉండకూడదు. అతి పెద్ద కథ సామాజికుడి దృష్టికి

అందకూండా పోతుంది. కనుక మధ్యమ పరిమాణంగల ఇతివృత్తమైతే సామాజికుడికి విస్మృతి గాని అసంతృప్తి గాని కలిగింపక హృదయానికి హత్తుకుంటుంది. లోకంలో కూడ అతి సూక్ష్మజీవి సౌందర్యం కంటబడదు. అతి స్థూలజీవి సౌందర్యం కంట పట్టదు.

కథాంశాలన్నీ జాలిని భయాన్ని కలిగించాలి. ఆ భావాల్ని శోధించేవిగా ఉండాలి.

బి. ప్రాసంగికేతి వృత్తం - ప్రాసంగికేతి వృత్తానికి అధికారికేతి వృత్తంతో సంబంధం కలిగిఉండాలి. కనుక ప్రధాన కథకు అంగభూతమైన ఉపకథను త్రోసిపుచ్చకూడదు. స్వీకరించాలి. దాన్ని కథా పరిణతికి ఉపస్కారకంగా మలిచి సంఘటించుకోవాలి. ఏ ప్రాసంగికం ముఖ్యమో ప్రస్తుతమో ఏది అప్రస్తుతమో కవి నిర్ణయించుకోవాలి. అందుకు అరిస్టాటిల్ ఒక మార్గాని సూచించాడు. దేని అస్థిత్వం గాని నాస్తిత్వంగా కథా వర్తనంలో నిర్విశేషమైతుందో అటువంటి ప్రాసంగికాన్ని స్వీకరించవద్దని చెప్పాడు. అది నాటకానికి ప్రాణవంతమైన అవయవం అనిపించుకోదు. అలాగే ఏది లేకపోవడం వల్ల కథా శరీరానికి అంగవైకల్యం కలుగుతుందో ఏది ఉండటం వల్ల కథకు పరిపూర్ణత కలుగుతుందో అది మాత్రమే ప్రాణవంతమైన ప్రాసంగికం. అంటే ప్రాసంగికేతి వృత్తం అధికారికేతి వృత్తంతో సంబంధం కలిగి సౌందర్యాన్ని సంతరించాలి.

సంభావ్యత - ప్రధాన కథలో గాని ఉపకథలో గాని సంభావ్యత గల అంశాన్ని మాత్రమే స్వీకరించాలి. అది మాత్రమే ఉపాదేయమైంది. అసంభావ్యమైన దాన్ని పరిత్యజించాలి. లోకంలో యదార్ధంగా జరిగిన కథను స్వీకరించనప్పుడు, అందులోని ఘట్టాలు కొన్ని యధాతధంగా నాటకంలో సంభావ్యం కాకపోవచ్చు. అలాగే ఆ ఉదంతంలో జరుగని కొన్ని అంశాలు సంభావ్యాలు కావచ్చు. కనుక నాటకకర్త ప్రదర్శింప తలచిన పాత్ర యొక్క గుణ స్వభావాల్ని బట్టి కథా పరిమితికి ఆవశ్యకమైన అంశాల్ని అవి యదార్థాలైనా అయదార్థాలైనా సరే స్వీకరించవచ్చు. అయితే కల్పనలు సహజస్థితికి అద్దం పట్టాలి. కథా పాత్రలకు మెరుగులు దిద్దాలి. కథను రసమార్గంలో నడిపించాలి. శాకుంతలంలో మహాకవి కాళిదాసు చేసిన కల్పనలన్నీ ఈ కోవకు చెందినవే.

ఏక నాయకాశ్రయమే కదా అని ఒక మానవుడి జీవిత చరిత్ర నంతటినీ నాటకంలో నిబంధించకూడదు. అలా చేస్తే అది అతడి జీవిత చరిత్ర అవుతుంది కాని కావ్యం కాదు. అతడి వర్తనంలో ఏ ప్రధాన ఘట్టాన్ని కవి తాను నిర్దేశించిన ఫలానికి అనుగుణంగా ప్రదర్శింప తలచాడో ఆ ఘట్టం మాత్రమే కథైక్యం కలది అవుతుంది. తదనుసారంగా ప్రదర్శించిన పురుషుడి నడవడే కార్యైక్రమైతుంది.

సి. పాత్రలు - ట్రాజెడీలో నాయకుడు ఉత్తముడై యుండాలి. విధి నిర్వహణంలో న్యాయ బుద్ధి సద్గుణాలు కలవారు కచిత్తుగా కనిపిస్తారు. ధైర్య స్థయిర్యాలు కలవారూ ఉన్నారు. అతడి ట్రాజడీలలో ప్రసిద్ధ పురాణ పాత్రలు రాజవంశీయులను చిత్రించాడు. వారి చరిత నడవడి లోకమెరిగిందే కనుక అందుకు అనుగుణంగా పాత్ర చిత్రణం చేశాడు. ఆ చిత్రీకరణం సహజంగ ఉండాలి. నీచ హీన పతిత పాత్రలు ఉండరాదు. కోపతాప లక్షణాలు ఉన్నా అవి పాత్రౌదార్యానికి ప్రరోచన కావాలి. ఇవి అన్నీ నాటకంలో శోక రసోద్ధతికి మూలకారకాలు.

స్వరూప స్వభావాలు వేషభాషలలో పాత్రౌచిత్యం ఉండాలి. ఉత్తమ మధ్యమ అధమ పాత్రలు ఉండాలి. ఉదా॥ రాజు ఉత్తమోత్తముడు బానిస అధమ పాత్ర అన్ని పాత్రలు హోదాకు తగిన విధంగా నడుచుకోవాలి. పాత్రల రూపకల్పన ఆద్యంతం ఒక్క రీతిగా సాగాలి. పాత్రల స్వభావంలో నియమ బద్ధత ఉండాలి. అరిస్టాటిల్ ట్రాజెడీలో పాత్ర పోషణకు కూడ ప్రాముఖ్యం ఉంది. కాని దీని ప్రాధాన్యం ఇతివృత్తం తర్వాతిదే. ఇందుకు వ్యతిరేకంగా షేక్స్పియర్ ట్రాజెడీలుంటాయి.

డి. భావం - ఒక అంశాన్ని నిరూపించటానికి సార్వజనీనమైన సత్యాన్ని వ్యక్తీకరించటానికీ, చెప్పే వివిధ విషయాల్లో మంచి భావానికి ప్రాధాన్యం ఉంది. అది సందర్భోచితంగా సముచితంగా ఆలోచించి చెప్పగలగటానికి భావం అని పేరు. అలాగే సాధించ దలచిన

దానికి అనుగుణంగా సాగే ఆలోచన భావన.

ఇ. భాష - భావం భాష జోడు గుఱ్ఱాల వంటివి. భావానికి తగిన భాషను ప్రయోగించాలి. భావాన్ని సౌందర్యతరం చేయాలన్నాడు భాష. ఉచ్చారణలో గల వ్యంగ్య ధ్వని వంటి పలు పోకడలను ప్రదర్శించి రమణీయం చేయాలి. అది పాత్రోచితంగా సాగాలి. ఒక్క వ్యవహారిక భాషను గూర్చి ముచ్చటించలేదు గాని మాండలికం రూపకం అసాధారణ పదప్రయోగం కల్పిత పదాలు ఛందో వైవిధ్యం పద కుంచనం పదానికి మరో పదాన్ని కూర్చటం వంటి భాషా విషయాలు కావ్య ప్రయోగ యోగ్యమైనవిగా అరిస్టాటిల్ ప్రవచించాడు.

యఫ్. రంగాలంకరణ - కథకూ నటులకే కాని అరిస్టాటిల్ ప్రవచించిన De-poetica లోని ట్రాజెడీ లక్షణాలలో రంగాలంకరణకు ప్రాధాన్యం కన్పించదు. అతడి ట్రాజెడీలలో స్థలాంతర ప్రదర్శనం ఉండకపోవటమే అందుకు కారణం.

జి. కోరస్ (బృందగానం) - ఇది ఐక్యత్రయ సిద్ధాంతానికి ప్రధానం. డయోనిసిస్ దైవతోత్సవాల్లో నాటకుడిని అనుసరిస్తూ పాడేవారిని కోరస్ అంటే బృంద గాయకులంటారు. ఇందులో 12 నుండి 50 మంది దాకా సభ్యులుంటారు. వీరందరిదీ ఒకే మాట ఒకే పాట ఒకే ధ్యేయం ఒకే పాత్ర. ఈ బృందం రంగ స్థలంలో పాత్రలతో సంభాషిస్తుంది. వారిని నిర్దేశిస్తుంది. సామాజికులనూ పరామర్శిస్తుంది. స్పందిస్తుంది. త్రికాల విషయాలను సూచిస్తుంది. ఈ కోరస్ ఒకసారి పాత్రలాగ మరోసారి హితాభిలాషిలాగా ఇంకోసారి కేవలం ప్రేక్షక పాత్రలా వ్యవహరిస్తుంది. అన్నిటా తానై నిలుస్తుంది.

ఈ కోరస్ వల్ల కవి నిగళబద్ధుడైతాడు. కొన్నిసార్లు దీనివల్ల రసభంజకం జరుగుతుంది. మంత్రాలోచనకూ భంగకరమే. నాటకేతి వృత్తం సంకుచితమైతుంది. ఇలా కొన్నిట ప్రతిబంధకమే అయినా దాని ప్రాధాన్యం దానికుంది. మొత్తం మీద కొన్ని అభ్యంతరాలను పరిహరించటానికి, కాలగమనంలో ఇది కొంత పరిణామాన్ని పొందింది.

## ఐక్యత్రయం

నాటక నిర్మాణ సౌందర్యానికి ముఖ్యమైనవి కార్యైక్యం కాలైక్యం స్థలైక్యం. ఈ మూడింటినీ పాటించిన రచనకే అత్యద్భుతాలని విమర్శకుల భావం. అరిస్టాటిల్ ఈ ఐక్యత్రయంలో స్పష్టంగా నిర్దేశించింది కార్యైక్యాన్ని మాత్రమే. కాలైక్యాన్ని గూర్చి ఈషణ్మాత్రంగా సూచించాడు. స్థలైక్యాన్ని గూర్చి మాత్రం ఏమీ చెప్పలేదు.

ఎ. కార్యైక్యం (Unity of Action) - ఇది తప్పక శిరసావహించ వలసిన నియమం. అరిస్టాటిల్ దృష్టిలో పాత్ర నిర్మాణం కంటె వస్తు సన్నివేశానికే ఎక్కువ ప్రాధాన్యం కన్పిస్తుంది. ఇటువంటి సన్నిధానం వల్ల నాటక కావ్యంలో అవ్యాహితమైన ఐక్యం దానంతట అదే వస్తుంది. దీనినే కార్యైక్యం అంటారు. కథైక్య కార్యైక్యాలు రెండూ అన్యోన్యం ఆశ్రయించుకొని ఉంటాయి. అంతే కాని అవి స్వతంత్ర ప్రతిపత్తి కలవి కాదు. కథలో లేని ఐక్యం కార్యంలో రాదు.

బి. కాలైక్యం (Unity of Time) - నాటక చర్య రసరమ్యంగా ఉండాలంటే నాటక కర్త కాలైక్యాన్ని పాటించి తీరాలి. చర్యా కాలం ఎంత స్వల్పమైతే అంత మంచిది. ఆలస్యమైన కొద్దీ అనేక సన్నివేశాలతో కలగా పులగమై కథా నిర్మాణ గౌరవం దెబ్బతింటుంది.

'Tragedy endeavours as far as possible to confine its action within the limits of a single revolution of the sun or nearly so'

ట్రాజెడీ సాధ్యమైనంత వరకు సూర్యుడి ఏక భ్రమణం లోపల సంభవించిన కథా కావ్యానికే సంబంధించి ఉంటుంది. లేదా దాదాపుగా అంతటి పరిమితికి లోబడి ఉంటుంది అన్నాడు. దీనిని బట్టి నాటకం ఒక రోజులో జరిగిందిగా ఉండాలని

తెలుస్తుంది. కాని పై వాక్యంలోని 'సాధ్యమైనంత వరకు' 'దాదాపుగా' అనే పదాలు అరిస్టాటిల్ నిర్దేశించింది విధి వాక్యం కాదని, అది వివక్షా అపేక్షకమని నిరూపిస్తున్నాయి.

సాధ్యమైనంతవరకు కథ ఒక రోజులో జరిగింది కావాలి. దీనికి ఒక కారణముంది. సాధారణంగా నాటక గమనం ఆరోహణ అవరోహణ క్రమంలో జరుగుతుంది. దానిలోని ఐదు భాగాలలో గర్భసంధి అనదగిన మధ్య భాగం ఆరోహణ క్రమానికి పరాకోటి (Zenith)గా ఉంటుంది. ఆరోహణం నాటకం యొక్క పూర్వభాగం. అక్కడి నుండి ఆరోహణ క్రమంలో ఉపసంహృతిని చేరేటప్పుడు కథాగతికి వేగం అధికమైతుంది. ఎలాగంటే కొండనెక్కేటప్పటి కంటె దిగేటప్పుడు వేగం పెరిగిన రీతిగా ఇది సహజమైనదే గదా! ఈ ఉప సంహృతి అనేది కథలో ఉత్తరభాగం. గ్రీకు నాటకాల్ని సాధారణంగా శిఖరారోహణంతో ప్రారంభిస్తారు. అక్కడి నుండి ఉప సంహృతికి ఎక్కువ కాలం పట్టదు. అందువల్ల వారి నాటకాలన్నీ ఇంచుమించుగా ఒక నాటి కథను మాత్రమే ప్రదర్శించటం సంప్రదాయమైంది.

సి. స్థలైక్యం (Unity of place) - స్థలైక్యాన్ని గూర్చి అరిస్టాటిల్ అసలేమీ చెప్పలేదు. యవనిక లేని గ్రీకు రంగస్థలాన స్థలాంతర ప్రదర్శనం సాధ్యం కాదు. ట్రాజెడీలోని కోరస్ (గాయక బృందం) కు రంగస్థల ప్రవేశమే కాని నిష్క్రమణ లేదు. కనుక స్థలాంతర ప్రదర్శనం కుదరదు. అలాగే అనేక కథా రంగాలుంటే రంగ ప్రసాధన ఆవశ్యకత అధికమైతుంది. ఈ రంగ ప్రసాధన వ్యవధానంలో సామాజికుడి ఔత్సుక్యం, కీలక స్థానం నుండి చెదరిపోతుంది. ట్రాజెడీ రూపక శిల్పాన్ని సుసంపన్నం చెయ్యడానికే అరిస్టాటిల్ దీని ప్రస్తావ చేసి ఉండడు. మొత్తం మీద విదగ్ధుడైన ట్రాజెడీ నాటక కర్త కథను ఒక్క రంగంలోనే నడిపిస్తాడు. కాని చూపరులకు సహజంగా కన్పించటం కోసం ఆధునికులు ఈ స్థలైక్యాన్ని సృష్టించారు.

డి. ఐక్యత్రయం - పర్యాలోచన - ఈ ఐక్యత్రయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన వాడు కాస్టెల్ వెట్రో. తరువాత కొందరంగీకరించారు. కాని షేక్స్పియర్ దీన్ని పాటించలేదు. డా॥ జాన్సన్ వంటి వారు ఖండించారు. ఐతే ఇది ట్రాజెడీ సిద్ధాంతానికి చెందిన మూడు రూపాలని టి.యస్.ఇలియట్ తెలిపాడు. మొత్తం మీద ఈ ఐక్యత్రయాన్ని పాటించిన ట్రాజెడీలు మిగిలిన వాటికంటె సర్వోన్నతంగా కన్పిస్తాయి. కానీ కొన్ని లోపాలు కూడ కొట్టవచ్చినట్లు గోచరిస్తాయి. ఇందులో కథా వస్తువు కుంచించుకపోతుంది, వస్తు విస్తృతికి అవకాశం పూజ్యమైతుంది. ప్రాసంగికేతి వృత్తానికి ప్రమేయం ఉండదు. నవరస పోషణకు అవకాశం నాస్తి అవుతుంది.

**నాయకుడు**

ట్రాజెడీలోని ఇతివృత్త ఉదాత్తమై ఉండాలి. కనుక నాయకుడు కూడ సముదాత్తుడు కావాలన్నది అరిస్టాటిల్ ఆశయం. నాటక చర్య కీలకం కావటానికి తగిన సమున్నత వ్యక్తిత్వం కలవాడై ఇతిహాస గాథాదికాల్లోని ప్రసిద్ధ పాత్ర అయి ఉండాలి. అయితే అలోక సామాన్య సముదాత్త చరితుడు కానవసరం లేదు. కాని అతని పతనానికి కారణం అతని దుర్మార్గం కాకూడదు. అతని శీలంలోని లోపంగాని ఊహాపోహల్లోని ఒక దోషం కాని విధి ప్రేరణ ప్రమాదం గాని కారణం కావాలి. ఇందులోని నాయకుడు ఒక తీవ్రమైన నైతిక ప్రాముఖ్యంగల సంఘర్షణకు లోనై పతనమైతాడు.

కనుక వాని స్వభావంలో పైకి కానరాని ఈషణ్మాత్ర గుణలోపం ఏదో ఉంటుంది. అతడు ప్రమాద వశం వల్లనో విధి వక్రించటంతోనో ఆలోపానికి లోనై చేయరాని ఒక ఘోర కార్యాన్ని చేసి దాని ఫలాన్ని అనుభవిస్తాడు. ఆ దుష్ఫలితాన్ని అనుభవించకుండా త్రోసి పుచ్చటానికి అతడు ఎదురైన ప్రతికూల శక్తుల్ని ప్రతిఘటించి ధీరుడై జయించటానికి తీవ్రంగా యత్నించి విఫలుడైతాడు. విధి తనకు ప్రతికూలంగా ఉందని తెలిసినా విధిని సైతం ఎదుర్కొనే ప్రయత్నం చేస్తాడు. ధృఢ సంకలంతో దురభిమానంతో కూడిన అతడి విజృంభణం విధి చేతలకు తోడ్పడుతుందే గాని, అతనికి ప్రయోజనం ఉండదు. జీవితాంతం వరకు విధిని తిరస్కరిస్తూనే దానికి తాను లోబడతాడు. ఆ క్రూర విధి అతడి నాశనాన్ని అతడి చేతనే చేయిస్తుంది. అటువంటి

వాడి చరిత్రే మనకు జాలిని భయాన్ని కలిగిస్తుంది. ధీరోదాత్తమైన నాయక పాత్ర సామాజికుల సానుభూతిని పొందాలి. అతడు ప్రతికూల పరిస్థితులకు తలవంచని ధీరుడై ఉండాలి. భౌతికంగా అపజయాన్ని పొందినా నైతికంగా ఘన విజయుడు కావాలి.

బి. ట్రాజెడీ - ఘోరకృత్యం

ఇందులోని కథా పురుషుడు చేసే ప్రతిజ్ఞ శత్రువును సంహరించటానికి కాదు. అలా చేస్తే అది ఇద్దరు శత్రువీరుల మధ్య జరిగిన కలహఫలమో యుద్ధఫలమో అవుతుంది. అది అసహజం కాదు. ఇక శత్రుత్వం కాని మిత్రత్వం కాని లేని యిద్దరు వ్యక్తుల్లో ఒకడు రెండవవాడిని చంపవచ్చు. ఇది ధర్మ విరుద్ధమైన ఘోరకృత్యం. అయినా ఇది అధమ మానవ కృత్యం అని సమాధానపడతాం.

అలాకాక తండ్రి కొడుకును కొడుకును తండ్రి, తమ్ముడిని అన్న అన్నను తమ్ముడు, తల్లి బిడ్డలను, బిడ్డ తల్లిని, తమ రక్త సంబంధాన్ని సైతం లెక్కించకుండా ప్రతికూల పరిస్థితులకులోనై వధించటం కాని, లేదా వధించే యత్నం చెయ్యటం గాని ట్రాజెడి వృత్తాంతానికి తగిన ఘోరకృత్యం.

ఇటువంటి ఘోరకృత్యం వల్ల సామాజిక హృదయంలో కలిగే క్షోభ, జాలి భయాన్ని కలిగిస్తుంది. ఇలా నాటకాంతంలో సామాజిక నిష్ఠగా విషాదం మిగిలితేని అది విషాదాంత నాటకమైతుంది. కనుక దానికి తగిన ఘోరకృత్యం ట్రాజెడీ కథలో ముఖ్యం.

## కెథార్సిస్ (భావన మాలిన్య పరిమార్జనం)

ఎ. ట్రాజెడి - నాటక ప్రయోజనంగా పేర్కొన్న కేథార్సిస్ అనే పదాన్ని ఎక్కడా వివరించలేదు. అందువల్ల ఇది అనేక చర్చలకు దారితీసింది. కెథార్సిస్ అనేది వైద్య శాస్త్ర సంబంధమైన పదం. దీనికి క్షాళనం అని అర్థం. మనిషిలోని శోక భయాది ఆవేశాలు ఆయా భావాల ద్వారానే క్షాళితం కావటం సాహిత్య రంగంలో అరిస్టాటిల్ ప్రతిపాదించిన కెథార్సిస్ ఉద్యేశం.

అనేక మంది దీనికి purgation అని అర్థం చెప్పారు. ఇందులోని pity & fear అనేవి చిత్తానికి అస్వాస్థ్యాన్ని కలిగించే దుర్గుణాలని పేర్కొన్నాడు. ట్రాజెడీ నాటక ప్రదర్శన సమయంలోనూ లేదా పఠన సమయంలోనూ హృదయం ఆ రెండు భావాలతో ఆవేశపూరిత మైతుందనీ తత్ఫలితంగా ఆ భావాలే సంస్కరింపబడి ఉత్తమ రూపాన్ని ధరించి సుఖప్రదాలైతాయని Bulcher మొదలైన విమర్శకులు నిరపవాదమైన సిద్ధాంతం చేశారు. విమర్శక లోకంలో ఇప్పటికీ ఈ సిద్ధాంతమే ప్రామాణికం. Purgation అంటే జాలి భయం అనే రెండు భావాల పరమార్జనమని గాని నాశనమని కాని కాదు. వాటి మాలిన్య పరిమార్జన మని మాత్రమే అర్థం.

శ్రవ్య మహాకావ్యాలు - కెథార్సిస్

అరిస్టాటిల్ శ్రవ్య మహాకావ్యాన్ని గూర్చి వ్రాస్తూ సంగీతం ప్రదర్శనం అనే రెండు అంశాలు మాత్రమే శ్రవ్య మహా కావ్యాల్లో ఉండవనీ, తక్కిన అన్ని అంశాల్లో అవి కూడ ట్రాజెడీతో సమానమేనని అన్నాడు. ఆ రెండింటి ప్రయోజనం ఒక్కటేనని వక్కాణించాడు. అంటే దీనిని బట్టి శ్రవ్య కావ్య పఠనంలో కూడ పాఠకుడి హృదయంలో పొడ సూపే భావాల మాలిన్యం పరిమార్జితమై చిత్తం సుఖాన్ని అనుభవిస్తుందన్నాడు.

బి. కామెడీలు - కథార్సిస్ - Trastatus coislinianus అనే శిధిల గ్రంథం ఒకటి లభించిందట. అందులో కవిత్వాన్ని గూర్చిన మూడు పుటలు గ్రీకు భాషలో ఉందట. అది అరిస్టాటిల్ రచించిందేనని Lare Cooper మొదలైనవారి నమ్మకం. దానిలో

కామెడీని గూర్చిన ఈ క్రింది వాక్యాలున్నాయి.

"Comedy is the imitation of an action that is ludicrous and defective of magnitude, language various emblished the several kinds of embilishments being severally used in different parts of the play carried on by agents not in the form of narrative though pleasure and laughter, effecting a catharsis of the comic emotions comedy has laughter for its mother.

హాస్యాస్పదమైందీ అనూనం కానిదీ అయిన మానవ వర్తనం యొక్క అనుకరణం కామెడి. దానిలోని వివిధ ప్రకరణాలు సందర్భోచితమైన భాషతో వివధ రీతులతో సాలంకృతాలు కావాలి. ఇతివృత్తం కథన రూపంలో కాక అనుకర్తలచేత నిర్వహింపబడుతుంది. సంతోష హాస్య వికారాల క్షాళనం ద్వారా హాస్యం ఆనందాన్నిస్తుంది. కామెడీ హాస్య ప్రధానం.

కనుక పై నిర్వచనాన్ని బట్టి కామెడీకి కూడ కెథార్సిస్ వర్తిస్తుందని అందువల్లనే అది ఆనందదాయకమైతుందని స్పష్టమైతున్నది. దీన్ని బట్టి జాలి భయం అనే భావాలే కాక సంతోష హాస భావాలు కూడ మలిన స్వభావం కలవేనని తెలుస్తుంది. ఆ మాలిన్య పరిమార్జనం జరిగిన తరువాతనే సుఖదాయకమైతుందని భావించాలి.

### 10.1.5. కెథార్సిస్ - గ్రీకు భారతీయ సామ్యం

మన అలంకార శాస్త్రాల్లో రస నిష్పత్తిని గూర్చిన చర్చలో 'తచ్చ తద్భావ భావనం' అన్న వాక్యానికి ఉన్న అర్థమే 'కెథార్సిస్' అనే పదానికి ఉంది.

రజస్తమో గుణాలతో మాలిన్యం కాని మనసును సత్త్వం అంటారు. అటువంటి సత్త్వం నుండి పుట్టిన భావాలు సాత్త్వికాలైతాయని సాహిత్య దర్పణ కారుడి మతం. రజస్తమోగుణ మాలిన్య రహితమైన భావమే సాత్వికమని సారాంశం. ఆ రజోగుణ తమోగుణ సంపర్క మాలిన్య పరిమార్జనమే కెథార్సిస్ అని అరిస్టాటిల్ నామకరణం చేశాడు.

కనుక ట్రాజెడీ కాని కామెడీ గాని హృదయ వికారాల లోని మాలిన్యాన్ని క్షాళనం చేసి, ఆ వికారాల యొక్క సాత్త్విక రూపాన్ని సాధించి ఆనంద దాయకాలైతాయి అని అరిస్టాటిల్ ప్రతిపాదన.

నాటక జన్యమైన ఆనందాన్ని అరిస్టాటిల్ 'చిత్త సుఖం' అన్నాడు. మరి 'భావ భావనం' (purgation of the emotion) జరగటమే చిత్త సుఖానికి కారణమన్నాడు. భారతీయ శాస్త్రం ఆ సుఖాన్ని దాటిన మరొక చరమావస్థలో ఆనందం కలుగుతుందని అనుశాసించింది. అంటే భావానికి సాత్త్వికత రావటమే సుఖ కారణమని అరిస్టాటిల్ భావం. కానీ సాత్త్వికతకు పరంలో కలిగే ఆవరణ విస్మృతి రూపమైన బ్రహ్మానందం వంటిది రసానందమని భారతీయ సంప్రదాయం.

### 10.1.6. ట్రాజెడి - గ్రీకు భారతీయ రసానందం

అరిస్టాటిల్ సిద్ధాంతానికి మన అలంకార నిష్పత్తి క్రమానికి భేదం లేదు. మనం నవరసాలు పేర్కొంటే, ఆతడు మూడింటిని మాత్రమే పేర్కొన్నాడు. దీనికి కారణం, అతడు సాహిత్య వాఙ్మయంలో ముఖ్యంగా పేర్కొన్నవి మూడు కావ్యాలే. అవి, ట్రాజెడి కామెడి మహాకావ్యాలు. వీటిలో కామెడీ కాక తక్కిన రెండూ సమాన గుణాలు కలవే - అని అతడు పేర్కొన్నాడు. అందువల్ల ఇక మిగిలినవి ట్రాజెడీ కామెడీలు రెండు మాత్రమే. ఈ రెండింటి వల్ల కలిగే ఆనంద నిష్పత్తి విధానాన్ని అరిస్టాటిల్ వివరించాడు. ఈ నాటకాలవల్ల కలిగే మూడు భావాల్ని మాత్రమే స్వీకరించాడు. అవి జాలి భయం హాసం. తక్కిన వాటితో అతడికి ఈ తావున నిమిత్తం లేకపోయింది. అయినా శృంగారానికి మూలకారణమైన ప్రేమ భావం ఈ క్షాళన ప్రక్రియకు తేలికగా లొంగదని, అయినా

అది క్షాళనం కాదగిన మలినమైంది కాదని పేర్కొన్నాడు. అంత మాత్రాన మిగిలిన భావాలు అతనికి తెలియవనికాని ఉపేక్షించాడని కాని భావించలేం.

అతడు చెప్పదలచింది నాటక లక్షణాల్ని గూర్చి మాత్రమే. కనుక ద్వివిధాలైన ఆ నాటకాలలో కలిగే రసాలను గూర్చి మాత్రమే చెప్పాడు. మిగిలినవి అతడికి ఇక్కడికి అనవసరం కదా!

శాంతాన్ని పరిహరిస్తే అష్ట రసాలు ప్రధానమైనవి. ఆ ఎనిమిదింటిలో ఐదు వీర రౌద్ర భయానక బీభత్స అద్భుతాలు. ఇవి ఇంచుమించు ఒకదాని కొకటి సహాయకారులు. కనుక ఒకే జాతికి చెందినవి. కనుక శృంగార హాస్య కరుణాలే ప్రత్యేకంగా మిగులుతాయి. ఈ మూడింటిలో శృంగారం క్షాళితం కాదగిన మాలిన్యం కలది కాదన్నాడు. ఆపైన కరుణ భయానకాలు ట్రాజెడీవల్ల కలుగుతాయని, హాస్యం కామెడీ వల్ల జనిస్తుందని సిద్ధాంతీకరించాడు. అందులోనూ ట్రాజెడీకి గల ప్రాముఖ్యం కామెడీకి లేదని నిర్ధారించాడు.

ఎందువల్లనంటే ట్రాజెడీలో క్షాళితం కాదగిన జాలి భయం (pity & fear) అనే రెండు భావాలున్నాయి. పర వ్యసన దుఃఖితుడే జాలి కలవాడు. ఆ దుఃఖం తీవ్రమైనప్పుడు దానిని ఆవరించి ఉన్న జాలి విచ్ఛిన్నమై దుఃఖమే స్థిరంగా నిలుస్తుంది. ఇదే మన శాస్త్రంలో శోకం స్థాయి భావం కావటం. దాని ఆనందావస్థ కరుణమే కదా! ఈ కారణాల్ని బట్టి ట్రాజడీలో నిష్పన్నమయ్యే రసాలు కరుణ భయానకాలని చెప్పవచ్చు.

### 10.1.7. ట్రాజెడీ ప్రయోజనాలు

మానవ హృదయ వికారాలన్నింటిలో శోక భయాలు రెండూ అరిస్టాటిల్ దృష్టిలో అవశ్యం భావించదగినవి. శోకం ముఖ్యంగా మరణం వల్ల, భయం మరణ భీతి వల్ల కలుగుతాయి. మరణించిన వారిని తలచుకొని ఏడ్వటం తాను మరణిస్తానేమోనని భయపడటం రెండూ వికారాలే. నిత్య ప్రసన్నంగా ఉండ వలసిన మానవాత్మకు వీటి వల్ల సంక్షోభం కలుగుతుంది. వీటి వల్ల చిత్తానికి అస్వాస్థ్యం కలుగుతుంది. ఈ అస్వాస్థ్యానికి ఔషధం వీటి మాలిన్య క్షాళనమే!

దీనిని గురించి అరిస్టాటిల్ ట్రాజెడీ నిర్వచనంలో వివరించాడు.

'Tragedy not only rouses these emotions (pity and fear) but also by the way it rouses them effects a catharsis of them (emotions)'.

ఈ అశుభాంత నాటకం సామాజికుడిలో శోక భయాలనే భావాల్ని ఉద్రేకింప చేస్తూ ఆ క్రమంలో వాటిని క్షాళనం చేస్తుంది అన్నాడు. ట్రాజెడీ వల్ల ఔషధ సేవన ఫలం కలిగి చిత్తం స్వస్థమై సుఖిస్తుంది. దాంతో అశుభాంత నాటకం సంతోషదాయకం శుభప్రదం అయిన ఫలాన్ని కలిగిస్తుందని 'క్రోంబి' (Crombie) అనే విమర్శకుడు వివరించాడు. కనుకనే నాటక సర్వస్వంలో అరిస్టాటిల్ ట్రాజెడీని సర్వోత్తమమైందిగా పరిగణించాడు.

### 10.2.1. షేక్స్పియర్

16వ శతాబ్దంలో ఆంగ్ల నాటక రచన ఒక నూతన ఉద్యమ స్ఫూర్తిని పొందింది. ప్రాచీనమైన గ్రీస్ లాటిన్ సంప్రదాయాలకు ఆ కాల రచయితలు నిబద్ధులు కాలేదు. దేశ కాల పాత్రానుగుణంగా నాటక కళను క్రొత్త పుంతల్లో పండించారు. ఆ నాటక జాతిని రొమాంటిక్ డ్రామాలు అన్నారు. అంటే కల్పనా చమత్కృతిగల నూతన నాటక సంప్రదాయం అని భావం. ఈ విధమైన స్వతంత్ర నాటక రచయితలలో షేక్స్పియర్ ప్రముఖుడు. ఆనాటి కాలంలో పూర్వ సంప్రదాయాల్ని పాటించిన వారూ కొందరున్నారు. అయితే వారికి గుర్తింపు రాలేదు.

షేక్స్ప్రియర్ నాటకాల్లో ట్రాజెడీల కంటె కామెడీలే మెండు. కామెడీ అంటే అరిస్టాటిల్ సిద్ధాంతం ప్రకారం హాస్య జనకమైన ఒక చిల్లర నాటకం మాత్రమే. అది మన ప్రహసనం లాంటిది. కాని కాలక్రమంలో దానికి శుభాంత నాటకంగా గుర్తింపు వచ్చింది. ట్రాజెడీ మాత్రం గ్రీకు ఆంగ్లేయ సంప్రదాయాలు రెండింటిలోను విషాదాంత నాటకంగానే గణుతికెక్కింది.

### 10.2.2. విషాదాంత నాటక లక్షణాలు

అతడి విషాదాంత నాటకాలు మేక్‌బెత్, ఒథెల్లో, కింగ్లియర్, హామ్లెట్‌లు ప్రసిద్ధమైనవి. అవి కొన్ని నిర్దష్టమైన ప్రమాణాలతో ఉంటాయి. దుఃఖాన్ని కల్గించే కారకాలు కలిగి ఉంటాయి అని బ్రాడ్లీ నిర్వచించాడు. దుఃఖమంతా ఇతడి నాటకాల్లో ఇతర పాత్రల కన్నా కథానాయకుడి మీదే కేంద్రీకృతమై ఉంటుంది. గ్రీకు నాటకాల్లో కూడ ఇదే విధంగా ఉంటుంది. అలాగే ప్రేమ పూరితమైన దుఃఖాంత నాటకాల్లో అంటే, రోమియో & జూలియట్‌లోను, ఆంటోనీ క్లియోపాత్రల్లోను, కథానాయకుడితో పాటు నాయకురాలి జీవితంలో కూడ ఒడిదుడుకులు కష్టనష్టాలు వస్తాయి. టైసన్ యాండ్రూస్ షేక్స్ప్రియర్ ప్రథమ దుఃఖాంత నాటకం. సెనేక్ & కిడ్ నాటకాల ప్రభావం షేక్స్ప్రియర్ నాటకాల మీద ఉన్నట్లు కన్పిస్తుంది. ఈ నాటకం రక్తపాతం భయోత్పాతం వంటి వాటితో సెనేకన్ నాటకం తరహాలో ఉంటుంది. ఇది ఎలిజిబెతెన్ కాల ప్రజల అభిరుచి. విషాదాంత నాటకం రోమియో & జూలియట్ కూడ కర్మ సిద్ధాంతం అదృష్టం అనే వాటిమీద ఆధారపడి ఉంది. భయంకరమైన దురదృష్టం వల్ల రోమియో జూలియట్ల జీవితాలు ముగిసిపోయాయి.

ఏ.సి. బ్రాడ్లే చెప్పినట్లు విధంగా విషాద నాటకాలు బాధలతోను ఆపదలతోను నిండి నాయక మరణానికి దారి తీస్తుంది. నాయకుడి అతి మంచితనం సమస్యలకు దారితీసి ఆపదలలో ముంచి మరణానికి మార్గం వేయవచ్చు. అలా ఆపదలకు దారితీసిన ఆ సంఘటనలు కథానాయకుడికి మానసిక వ్యధనూ శారీరక శ్రమనూ కలుగజేస్తాయి. సమస్యలు ఎన్ని వచ్చినా నాయకుడి ఔన్నత్యం అడుగంటదు. హామ్లెట్ యొక్క మానసిక చిత్రహింస దీనికి పరమోదాహరణం. ఒథెల్లో నాటకంలో కూడ ఈ చిత్రవధను గమనించవచ్చు. కింగ్ లియర్ పిచ్చివాడై పోతాడు. మాక్‌బెత్ కూడా సర్వస్వం కోల్పోతాడు.

#### దుఃఖపు వివాదం

దుఃఖానికి సంబంధించిన వివాదం షేక్స్ప్రియర్ నాటకాలల్లో బహిరంతరాల రెండింటా దర్శించవచ్చు. రోమియో & జూలియట్‌లో, రిచర్డ్-2 లో ఈ వివాదం దాదాపుగా బాహ్యంగా ఉంది. మాక్‌బెత్ హామ్‌లెట్ ఇంకా లియర్‌లోనూ ఒథెల్లో, కొరియ లామస్‌లలో ఈ సమస్య అంతర్గతంగా ఉంది. ఇలా సమస్యను అంతర్గతంగా అభినందించడంలో తన సమకాలికులకన్న సమున్నతుడు షేక్స్ప్రియర్.

#### నాయక పతనం

షేక్స్ప్రియర్ ట్రాజెడీలు గ్రీకు నాటకాల వంటివే అయితే నాయక విషయంలో తప్ప ఇతర లక్షణాలతో వాటితో సంవదించదు. అరిస్టాటిల్ నాటక లక్షణాలు కూడ షేక్స్ప్రియర్ నాటకాల పట్ల కొంతవరకే సమన్వయిస్తాయి. అరిస్టాటిల్ వర్ణించిన విధంగానే షేక్స్ప్రియర్ నాయకుడు గూడ ఉదాత్త పురుషుడు విఖ్యాత చరితుడు. కాని నాయక పతనం విషయంలో కొన్ని భేదాలున్నాయి.

అరిస్టాటిల్ నాయకుడి పతనానికి కారణం విధి ప్రేరణ ప్రమాదం. కాని షేక్స్ప్రియర్ నాయకుడి పతనానికి ప్రధాన కారణాలు వేరు.

(ఎ). మానసిక దౌర్బల్యం - నాయకుడి మానసిక ప్రపంచంలో స్థిరీభూతమైన ఒక దౌర్బల్యం అతడి పతనానికి కారణమైతుంది. అతడి జీవితంలో ఆ దౌర్బల్యం అనువైన పరిస్థితుల్లో అంకురించి అభివృద్ధి చెంది అతడి చేత అకృత్యాలు చేయిస్తుంది.

షేక్స్పియర్ నాటకాల్లోని ఈ దౌర్బల్యం రాజస తామస లక్షణాలైన అహంకారం అనుమానం ఆటోపం అవివేకం అసూయ వంటి వాటిలో ఏదో ఒకటిగా ఉంటుంది.

(బి) ఆంతర సంఘర్షణ - నాయకుడి జీవితంలో ఒక్కోసారి అతడి మహా పురుష లక్షణానికి, క్షుద్రమైన మానసిక దౌర్బల్యానికి ఆంతర సంఘర్షణ జరుగుతుంటుంది. ఆ సంఘర్షణ వల్ల జరిగే చిత్త క్షోభ వల్ల ఆతడి అంతస్సాక్షి చేసే సదుపదేశాన్ని చెవిని బెట్టడు. అంతశ్శత్రువైన దౌర్బల్యం వల్ల కలిగే భ్రమకు వశుడైతాడు. ఒక నిర్ణయానికి రాలేక పోతాడు. డోలాందోళిత మనస్కుడైతాడు. ఆ ఆంతర మహా యుద్ధంలో అంతశ్శత్రువు ఆంతర సాక్షి కన్న మిన్నగా ఉంటుంది. అది దుష్కార్యాచరణకు పురికొల్పుతుంది.

(సి) బుద్ధిపూర్వకం - కొన్ని సందర్భాల్లో ఆంతర సంఘర్షణ లేకుండానే బుద్ధి పూర్వకంగా దుష్కార్య పరతంత్రుడు కావచ్చు. మరి కొన్ని పట్ల అది ఘోరకృత్యం కాకపోయిన స్వల్పమైన దుష్కార్యం కావచ్చు.

కారణమేదైనప్పటికీ జరిగే ఘోరకృత్యం సమానమే. దాని ఫలాన్ని అనుభవించే సమయంలో చిత్త క్షోభం ఇంతింతలుగా విజృంభిస్తుంది. చిత్త క్షోభం నాటకంలో లేకున్నా అనుతాపం ఉండక తప్పదు. అదే ట్రాజెడీకి జీవగర్ర.

## నాయక పతనం

చివరకు ప్రయోజన శూన్యమైన అనుతాపానికి లోనై జీవితం మీద రోతపుట్టి స్వయంగా మృత్యు దేవతను వరిస్తాడు. కౌగిలిస్తాడు. అంటే తనకు తానుగా మృతి చెందవచ్చు, లేదా హత్యకు గురి కావచ్చు. ఎవరి పతనానికి లేదా మరణానికి వారే కర్త అని నిరూపిస్తాడు. తుది గడియలో అతడి ప్రవర్తన పరోక్షంగా ఈ విషయాన్ని రూఢి చేస్తుంది. అతడి చరిత్ర మిక్కిలి శోచనీయంగా పరిణమించి ఎంత వాడికి ఎంత గతి పట్టిందిరా అని అనిపించి అతడిపై జాలి కలిగిస్తుంది.

## దురదృష్టం

షేక్స్పియర్ ట్రాజెడీ నాయకుడిని కష్టాలు దుఃఖాలు దురదృష్టం వెంటాడుతాయి. అతడి మరణానికి మార్గం వేస్తాయి. ఆ దుఃఖం నాయకుడితో పాటు అతడి పరిజనాన్ని కూడ బలిగొంటుంది. అంటే దుఃఖానిది నాటకంలో ప్రధాన స్థానం. ఉదాహరణకు కింగ్లియర్ నాటకంలో 'కింగాఫ్ బ్రిటన్' మానసిక శారీరక చిత్ర హింసలకు లోనైతాడు. చివరకు తనకు తానే తన తప్పుల్ని తెలుసుకొని పరితాపాన్ని పొందుతాడు. అందులో విశ్వాసఘాతుకులైన కొమార్తెల చర్యలు వృద్ధాప్యం ప్రకృతి వైపరీత్యం మానసిక సంఘర్షణ దుఃఖాన్ని కల్గిస్తాయి. చివరకు మరణం వరిస్తుంది. అదే విధంగా, గ్లేసియర్ అనేక బాధలు పడి చివరకు మరణిస్తాడు. మంచిదైన కింగ్లియర్ చిన్న కుమార్తె కూడ మరణిస్తుంది. ఈ విధంగా నాటకంలో అందరికి దుఃఖంతో కూడిన దుర్గతి పడుతుంది.

## నాయక దుఃఖం

షేక్స్పియర్ ట్రాజెడీ నాయకుడికి మల్వోలియక్ నాటకాలలో లాగ ఉదాత్తమైన భావాలతో పాటు దుర్మార్గపు లక్షణాలు కూడ ఉంటాయి. అంటే నాయకుడు ఈ రెండు రకాలైన లక్షణాలూ కలిగి ఉంటాడు. కనుక అతడు మంచి చెడు లక్షణాల కలగలుపు స్వరూపం. నాయకుడి బలహీనతల కారణంగా నాటకం దుఃఖమయమైతుంది. అందువల్లనే కథానాయకుడు ఆపదలలో పడటమే కాకుండా బాధలు పడి మరణానికి దారి తీస్తుంది. అరిస్టాటిల్ నాటకాలలో కూడ కథానాయకుడు బలహీనతల వల్ల దుఃఖంలో నుంచి ఆపదలలో పడతాడు.

## స్వయంకృతం

బ్రాడ్లీ నిర్వచనం ప్రకారం 'షేక్స్పియర్ నాటకం విషాదాంతం కావటానికి ప్రధాన కారణం జ్ఞాన రాహిత్య కాని విషయ

వివేచన లేకపోవటం వల్ల కాని నిర్లక్ష్యం వల్ల కాని కావచ్చు. ఒథెల్లోలో అపనమ్మకం వల్ల హామ్లెట్‌లో నిర్ణయ సామంజస్య రాహిత్యం వల్ల మేక్‌బెత్‌లో కాంక్షా తీవ్రత వల్ల యాంటోన్ నిర్లక్ష్యం వల్ల' అని చెప్పవచ్చు. దీనినే స్వయంకృతాపరాధంగా భావించవచ్చు.

## వ్యక్తిగతం

నాయకుడి ఆవేశం నిర్లక్ష్యం అమాయకత్వం అతని పతనానికి కారణం కావచ్చు. ఇవి అన్నీ వ్యక్తిగత లక్షణాలే. ఈ వ్యక్తిగత కారణాల వల్లనే సామాజికంగా సమస్య ప్రతిబింబిస్తుంది. ప్రేక్షకులకు సానుభూతి ఆ పాత్రల మీద కలుగుతుంది. ఆ పాత్రలు మానవతా వాదానికి ప్రతిరూపాలు. మానవతా వాదం ప్రతిబింబిస్తుంది కనుకనే నాటకం అజరామరమైతుంది. డెస్టిమో పాత్ర అమాయకత వల్లనే బాధలు పడి చనిపోతుంది. మరణానికి ముందు కూడ, కారకురాలైన ఎమీలియానో పల్లెత్తుమాట అనలేదు.

## విధివిలాసం

ఒక్కొక్క సారి నాయకుడి దుర్గతికి విధి విలాసం కూడ కారణం కావచ్చు. అవి అదృశ్య శక్తులు ప్రకృతి బీభత్సాల వంటివి కూడ కావచ్చు. అయినా ఆ విధి ఒక్కసారిగా పుట్టుక వచ్చిందిగా కన్పించదు. దాని విజృంభణానికి వలసిన దోహదం అంతా అతడి హృదయక్షేత్రంలో అంతకుముందే గుప్తంగా ఉంటుంది. మొత్తం మీద ప్రళయకాలంలోని మహాభూత విజృంభణం లాంటి మానసిక క్షోభనూ రాళ్లనైనా సరే కరిగించగల శోచనీయావస్థ లేని ట్రాజెడీ ట్రాజెడీయే కాదు.

## 10.3.1. అరిస్టాటిల్‌కూ షేక్స్పియర్‌కూ గల దృక్పథ భేదాలు

ఐక్యత - అరిస్టాటిల్ చెప్పిన కార్యైక్యాన్ని మాత్రమే షేక్స్పియర్ పాటించాడు. మిగిలిన రెంటిని అతడు పట్టించుకోనేలేదు.

నిర్మాణం - అరిస్టాటిల్ నాటకమూర్తి నిర్మాణాన్ని గూర్చి ప్రధానంగా వక్కాణించాడు. షేక్స్పియర్ మాత్రం పాత్ర నిర్మాణంలో మాత్రమే కౌశలాన్ని కనపరిచాడు. అయినా ఇతడి నాటకాల ప్రసిద్ధికి కారణం అతడి పాత్ర నిర్మాణ ప్రతిభా పాటవాలే. నాటక నిర్మాణంలో క్వచిత్‌గా శైథిల్యం కన్పిస్తుంది. అయినా అతడి చకచ్చకితమైన పాత్ర చిత్రణా నైపుణి ముందు అది మరుగున పడిపోతుంది. అందువల్లనే విమర్శకులు అతడి ఆలోపాన్ని ఉపేక్షిస్తారు.

కోరస్ (బృందగానం) - గ్రీకు ట్రాజెడీ షేక్స్పియర్ ట్రాజెడీ కోరస్ విషయంలో విభేదిస్తాయి. కోరస్ అనేది ఒక గాయక బృందం. నాటక మధ్యంలో పాటలు పాడటం వ్యాఖ్యానించడం సామాజికులతో సంభాషించటం కథా సంబంధమైన త్రికాల విషయాలను సూచించటం వంటివి కోరస్ పని. ఇటువంటి కోరస్ లేకుండా గ్రీకు నాటకం ఉండదు.

కానీ షేక్స్పియర్ రచించిన ప్రధానమైన ట్రాజెడీలలో కోరస్ ఉండకపోవటం విశేషం. ఇతర నాటకాల్లో కోరస్ ఉన్నా గ్రీకు నాటకాల్లోని కోరస్‌కు ఉన్న ప్రాధాన్యం లేదు. హెన్రీ-5 లో ప్రస్తావనా ప్రవర్తకుడిగా, వింటర్స్‌టేల్‌లో కాలపురుషుడిగా రోమియో & జూలియట్‌లో ప్రణయ తత్త్వ వ్యాఖ్యాతగా కోరస్ వ్యవహరించింది.

దేవతా ప్రవేశం - గ్రీకు ట్రాజెడీలలో మానవ పురుష కారం కంటె దేవతా ప్రభావమే మిక్కుటం. దేవతలు నాటకాలలో తమ ఇచ్ఛానుసారంగా మానవులతో నరబలివంటి దుష్కార్యాలు చేయిస్తూ దాని ఫలాన్ని అనుభవింప చేస్తారు. మరణించిన వారిని బ్రతికించటం వంటి అలౌకికమైన అద్భుతాలు కూడ ప్రదర్శిస్తారు. ఇటువంటి సందర్భాలలో నాటకంలోని దేవతలు అదృశ్య పాత్రలే కాని అరిస్టాటిల్ చెప్పిన నాటక లక్షణాలలో మానవ పురుషకారానికి ప్రవేశం ఉంది. దేవతల ఊసే లేదు.

షేక్స్పియర్ నాటకాల్లో కూడ దేవతలకు ప్రవేశాన్ని నిషేధించాడు. మంచి చెడ్డలు రెండింటికీ మానవుడి గుణకర్మానుసారమైన ప్రవర్తనమే ప్రధాన కారణం. అదే అతడి పతనానికి గాని అభ్యుత్థానానికి కాని అడుగులు వేయిస్తుంది. షేక్స్పియర్ ట్రాజెడీలలో నాయకుడు తన నాశనాన్ని తాను చేజేతులా చేసుకుంటాడు అంతే కాని దేవతలు ప్రేరేపించటం వల్ల కాదు.

### పాత్రలు

గ్రీకు ట్రాజెడీలలో ప్రధాన పాత్రకే ఉంటాయి. ఒక వేళ చిన్న చిన్న పాత్రలు ఉన్నా పరిగణింపదగినవి కావు. ఆ నాటకాల్లో పాత్రల సంఖ్య కూడ పరిమితంగానే ఉంటుంది. షేక్స్పియర్ నాటకాలు మాత్ర బహు పాత్ర ప్రయోగాలు. వాటిలోని చిల్లర మల్లర పాత్రలు సైతం నాటక చిత్రగతుల ప్రగతికి దోహదం చేస్తాయి. నాటకంలోని పాత్ర నిర్మాణం విషయంలో షేక్స్పియర్ అద్వితీయుడు. ఆ ప్రతిభతో అన్ని లోపాల్ని కప్పిపుచ్చగలడు.

### ఇతివృత్తం

టక్కర్ బ్రూక్ అభిప్రాయం ప్రకారం షేక్స్పియర్ నాటకాల్లో కథాంశం అద్భుతంగా ఉంటుంది. పాత్రలపై అపరిమితమైన జాలి మానవత్వాన్ని కురిపిస్తుంది. కథోపసంహారానికి అవ్యవహితంగా ప్రారంభమైతుంది గ్రీకు ట్రాజెడీ. అందువల్ల కథ ఉన్మీలితం కాదు. షేక్స్పియర్ నాటకాల్లో కథా వికాసానికి చక్కని పథకక్రమం ఉంటుంది.

### ప్రాసంగికేతు వృత్తం

గ్రీకు ట్రాజెడీల్లో కథా పరిమాణం అత్యల్పంగా ఉండి ప్రాసంగికేతి వృత్తానికి అవకాశం ఉండదు. మరి షేక్స్పియర్ నాటకాల్లో దీని ప్రయోగం ప్రయోజవంతంగా ఉంటుంది.

(ఎ) కొన్నిట అధికారిక వృత్తంతో పాటు ప్రాసంగికేతి వృత్తం కూడ సరినడకలు నడుస్తుంది.

(బి) కొన్నిచోట్ల ఈ ప్రాసంగికేతి వృత్తం ప్రధానేతి వృత్తానికి ప్రతియోగం (contrast) గా ఉంటుంది.

(సి) మరికొన్ని సందర్భాల్లో అనుయోగం (similarity) గా సంధానింపబడి అధికారికానికి వన్నెతెస్తుంది.

(డి) కొన్ని సందర్భాల్లో ప్రాసంగికేతి వృత్తం లేకపోయినా ముఖ్యపాత్రల్లో కనిపించే యితర పాత్రలుంటాయి. అవి ముఖ్య పాత్రల వర్తనం వల్ల సామాజికులకు కలిగే హృదయ భారాన్ని తొలగిస్తుంటాయి.

గ్రీకు ట్రాజెడీలలో Sophocles వ్రాసినవి అరిస్టాటిల్ లక్షణానికి కొంత లక్ష్యభూతమైనాయి. అంతే కాక అవి షేక్స్పియర్ నాటకాలకు మార్గదర్శకాలైనాయి.

అరిస్టాటిల్ లక్షణాలకు గ్రీకు ట్రాజెడీలకు షేక్స్పియర్ ట్రాజెడీలకు గల స్థూలమైన భేదసాదృశాలివి.

### 10.4.1. సమీక్ష

ధర్మార్థ సంఘర్షణ ద్వారా మానవ మనోధర్మాల్ని నిరూపించి ధర్మాచరణ పథంలో ఎదురయ్యే ఆటంకాల వలన కలిగే భయాన్ని అపనయించి ధైర్యాన్ని పురికొల్పటం విషాదాంత నాటకాల ప్రయోజనం. దీని వలన మనోమాలిన్యాలు ప్రక్షాళితమైతాయి. రసానంద స్థితికి దోహదమైతుంది.

**10.5.1. ప్రశ్నలు**

1. అరిస్టాటిల్ ట్రాజెడీ లక్షణాల్ని వివరించండి.
2. షేక్స్పియర్ ట్రాజెడీ దృక్పథాన్ని తెల్పండి.

**10.6.1. ఉపయుక్త గ్రంథాలు**


1. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
2. సాహిత్య భావలహరి - ఆచార్య యస్వీ జోగారావు



**డాక్టర్ మేళ్లచెర్వు భానుప్రసాదరావు**
రీడర్ - తెలుగు శాఖ
శ్రీ సుబ్బరాయ & నారాయణ కళాశాల
నరసరావుపేట - 522 601

# పాఠం - 11

# కావ్య భేదములు

పాఠ్యనిర్మాణక్రమం


11.0. లక్ష్యం

11.1. కావ్య భేదములు

11.2. ప్రబంధము

11.3. ఉదాహరణ కావ్యము

11.4. చతుర్విద కవిత్వములు

11.5. ముక్తక కవిత్వము

11.6. ఖండ కావ్యము

11.7. లఘు కృతులు

11.8. బిరుదావళి

11.9. శతకములు

11.10. దండకము

11.11. ఆఖ్యాయిక

11.12. ఉపాఖ్యానము - ఆఖ్యానము

11.13. ఇతిహాసము

11.14. పురాణము

11.15. చాటువులు

11.16. యక్షగానములు

11.17. సమీక్ష

11.18. ప్రశ్నలు

11.19. ఉపయుక్త గ్రంథాలు


## 11.0 లక్ష్యం

రచన సుందరమై, సార్వజనీన ప్రయోజనము కలిగి భావనాత్మకమైన ఆహ్లాదము నిచ్చుచు, కర్త యొక్క ఆత్మీయులును స్ఫురింపచేయు గ్రంథము "కావ్యము". ఆ కావ్యజాలమే సాహిత్యము. సాహిత్యమున భిన్న భిన్న నామములచే పిలవబడు వివిధ కావ్యములు ఇమిడి యుండును. అవన్నియు తత్తత్కావ్య విశేషములుగా లోకమున నెగడుచుండును. ఈ విశేషము లన్నింటిని వర్గీకరించి వాటి వాటి లక్షణములను బట్టి కొన్ని భాగములుగా వేర్పాటు చేయుటకై ఆలంకారికులును, పాశ్చాత్యులును కొన్ని ప్రమాణములను అనుసరించిరి. పాశ్చాత్య విభాగ పద్ధతికిని, మన ఆలంకారిక పద్ధతికిని ఒక్కొక్క యెడ సాదృశ్యమును, ఒక్కొక్క యెడ విభేదమును కానవచ్చుచుండును. ఈ కావ్య భేదాల్ని పరిశీలించడం ఈ పాఠ లక్ష్యం.

## 11.1 కావ్య భేదములు

భారతీయాలంకారికులు ఛందస్సును ప్రమాణముగా గైకొని, దాని భావా భావములను బట్టి కావ్యములను . . . .

"గద్య పద్యోభయ మయం చంపూ రిత్సభా దేయత్"

పద్య, గద్య చంపువులని మూడు విధములుగా విభజించిరి. ప్రదర్శన ప్రమాణమును పురస్కరించుకొని, ప్రదర్శన యోగ్యములైన వాటిని దృశ్య కావ్యములనియు, శ్రవణ యోగ్యములను శ్రవ్య కావ్యములనియు, వేరొక విభాగము చేసిరి. అప్పకవి మొదలగు లాక్షణికులు గీతిని పురస్కరించుకొని, సంగీత కావ్యమనియు, సాహిత్య కావ్య మనియు ఇంకొక విభాగము చేసిరి. ఇదియే పాఠ్య గేయ విభాగము.

పద్య కవిత్వమును మార్గ కవిత్వమనియు, పద కవిత్వమును దేశి కవిత్వమనియు వ్యవహరింతురు. అనగా సంస్కృత పద భూయిష్టమై, సంస్కృత ఛ్ఛంద శాస్త్ర సంగీతములగు వృత్తములు గల రచన మార్గ కవిత. దేశీయములగు మాత్రా ఛ్ఛందస్సు నుండి పుట్టిన జాతి వృత్తమగు రచన దేశి కవిత. ఈ దేశి కవితకు జాను తెనుగు, పద కవిత, గేయ వాఙ్మయము అనియు నామాంతరములు గలవు.

ఆంధ్ర కావ్యములలో నిర్వచనోత్తర రామాయణము తప్ప మిగిలిన కావ్యములన్నియు చంపూ కావ్యములే. వీనికిపుడు "ప్రబంధము" లని వ్యవహారము వచ్చినది. వర్ణనాభూయిష్టమగు ఈ ప్రబంధమును నన్నెచోడుడు "వస్తు కవిత" యనియు, లక్షణ దీపికా కారుడు "విస్తర కవిత" యనియు వ్యవహరించిరి. చంపూ కావ్యములనందు వలెనే ఆంధ్ర ప్రబంధము లందును నొక్కక్క యాశ్వాసము నందును పెక్కు వృత్తములను కవులు వాడుదురు. వర్ణ్య, వస్తు భేదమును బట్టి గద్య, పద్యాది భేదములను పాటింప వలయునని సరస్వతీ కంఠాభరణ వ్యాఖ్యాతయగు రత్నేశ్వరుడిట్లు తెలుపుచున్నాడు.

"కశ్చి ద్గద్యేన పద్యేన కశ్చిన్మి శ్రేణ శక్య తే
కవియం కశ్చన ద్యాభ్యాం కావ్యzర్ధ కశ్చనత్రిభిః"

"యధాహి అటవీ వర్ణనా దౌ గద్యం ప్రగల్భతే తధాన పద్యం"
యధాచ కావ్య శాస్త్రతా నిర్వహణోచితేz ర్ధే పద్యముత్స హటే
న తధా గద్యం" ఇత్యాది పాదోపాత్త బందౌచితీ ద్రష్టవ్యా"

అరణ్యా వర్ణమున గద్యము శోభిల్లు నట్లు పద్యము శోభిల్లదు. కావ్య శాస్త్ర రూపములగు కావ్యములందు పద్యము శోభిల్లునట్లు గద్యము శోభిల్లదు. కథా, ఆఖ్యాయికాదులందు గద్యమే శోభిల్లును. చంపువులందు భయము నుండవచ్చును. దీనినే ధ్వనికారుడు ప్రబంధౌచిత్యములని చెప్పెను. మహా కావ్యమునగానీ, ఖండ కావ్యమునగానీ, ఒక్కడే నాయకుడుండవలెను. అతడు ధీరోదాత్తుడు. శృంగార వీర రసములలో ఒకటి ప్రధానముగా నుండవలెను. నాటకము నందు వలెనే కావ్యమందున నవరసములు ప్రధానముగా నుండవలెను. కావ్యారంభమున ఇష్టదేవతా నమస్కారముగానీ, ఆశీర్వాదముగానీ, వస్తు నిర్దేశము గానీ యుండవలెను. కుకవినింద, సుకవి స్తుతులుండవలెను.

పద్య కావ్యములందు విబద్ధములు, అనిబద్ధములు అని రెండు బేధములు గలవని వామనుడు పేర్కొనెను. సంధి సామ శ్రీయుతమై, ప్రకృష్టమైన బంధము కలిగి విస్తు విలోదాత్తమైన ఇతివృత్తము గల కావ్యమే నిబద్ధ కావ్యము. దానినే సర్గబంధమనియు, మహా కావ్యమనియు దండి పేర్కొనెను. తెలుగున దానినే ప్రబంధమని పిలుచుచున్నారు. సంధిసాయిశ్రీ అనగా, ఒక కావ్యము లోగల పద్యము లన్నింటిని పూలదండ వలె ఏక సూత్రమునకు నిబంధించెడి ఒక కథయు, ఆ కథను అలంకరించెడి వర్ణనలును, దానిని నడిపెడి పాత్రలను, మొదలైన సాధనములతో ఆద్యంతములకు అవిచ్ఛిన్న సంబంధము కలిగించెడి రచన నిబద్ధ కావ్యము. ఇతివృత్తము కానిది, స్వయసమగ్రము, ముక్తకము, కులకము, పంచరత్నములు, నవరత్నములు, నక్షత్రమాలికలు, శతకములు,

ఆధునిక ఖండ కావ్యములు అనిబద్ధ కావ్యములే. ప్రాచీన కాలము నుండి అనేక విధములుగా కావ్య విశేషములు వెలసి యున్నవి. కావ్య విశేషములలో ప్రఖ్యాతములైన వానిని గూర్చి ప్రస్తావింపనగును.

## 11.2 ప్రబంధము

తెలుగు కావ్య భేదములలో ప్రబంధము ప్రముఖమైనది. సుప్రసిద్ధమైనది. ప్రబంధమనగా ప్రకృష్టమైన బంధము కలది అని అర్థము చెప్పవచ్చును. అనగా ఆది నుండి అంతము వరకు అంతర్వాహినిగా స్రవించు వస్త్వైక్యము కలది యని వ్యాఖ్యానము చేయవచ్చును. తెలుగులో ప్రబంధమన రూఢార్థమున వర్ణనాత్మకమైన నిబద్ధ కావ్యము. అందు కథకు, పాత్రపోషణకు, భావ సంపదకు సముచిత స్థానమున్నను వర్ణనలన్నింటిని మించి ప్రాధాన్యము వహించును. అష్టాదశ వర్ణనలలో క్వాచిత్కముగా కొన్ని కొరవడినను ప్రబంధమున వర్ణనా బాహుళ్యము అపరిహార్యము. కావ్యాలంకార సంగ్రహమునందు రామరాజభూషణుడు,

పుర, సింధు, నగ, ర్త్విన, శశి
సరసీ, మనమధు, రతిప్రసంగ, విరహముల్,
పరిణయ, తనయోదయ, నయ
విరచన, యాత్రాజి, దౌత్య, విభువర్ణనముల్

పుర, సముద్ర, శైల, ఋతు, సూర్యోదయ, చంద్రోదయ, సరఃక్రీడా, వన క్రీడా, వసంత, రతిప్రసంగా, విరహ, పరిణయ, పుత్రోదయ, నయవిరచన (సంధి విగ్రహాదులు) దండయాత్రా, యుద్ధ, దౌత్య, ప్రభు వర్ణనములు అను అష్టాదశ వర్ణనములు కలది మహాకావ్యమని పేర్కొనెను.

అష్టాదశ వర్ణనలను విన్నకోట పెద్దన తన కావ్యాలంకార చూడామణి యందు ఈ క్రింది విధముగా పేర్కొనినాడు.

"పుర వారాశి మహీధర ర్తు శశిభృత్పూషోద యోద్యానః పు
ష్కర కేళీ మధుపాన మోహన వియోగ క్షేమయాన స్వయం
వర పుత్రోత్సవ మంత్ర దూత్య రణ దోర్వ్యై కాంతి సంకీర్తనా
కర మష్టాదశ వర్ణనాన్వితము తత్కార్యంబు భవ్యంబిలన్"

అప్పకవి 'అప్పకవీయము' నందు, ప్రబంధమున

"పురమును ఋతు షట్కమును బ్రయాణమ్మును
    శైలంబు వేటయు సాగరంబు
మౌనీంద్ర పుణ్యాశ్రమంబును, మంత్రంబు
    ద్యూతంబు పిదప నద్భుత రణంబు
విజయంబు మధ్య పానజ వికారంబును
    వన విహారంబును వారి కేళి
కన్యాంగ సౌందర్య కథనంబు హిమకరా
    భ్యుదయంబు విప్రలంభోచితంబు

పద్మమిత్రోదయంబును బరిణయంబు
సురతమును ధౌహృదంబును సుతజననము

నసగ నిరువది రెండు వర్ణనలు గూర్చి
చెప్పవలయు ప్రబంధంబు శ్రీనివాస"

ఇరువది రెండు వర్ణనలు కూర్చి చెప్పవలెనని పేర్కొనినాడు. అష్టాదశ వర్ణనలనుట సుప్రసిద్ధ సాహిత్య సంప్రదాయమే అయినను ఆయా ప్రబంధము లందు కొన్ని కొన్ని కొరవడు చుండినను మహా కావ్యమే యగును.

అలంకార శేఖర కారుడు కావ్య వర్ణనియములను

వర్ణశ్చ రాజా దేవీచ దేశోగ్రామః పురీ సరిత్।
సరోఽబ్ద్యరణ్యో ద్యానాద్రి ప్రయాణ రణవాజినః।
హస్తర్క చంద్రావుతవో వివాహోఽథ స్వయంవరః।
సురా పుష్పాంబు సంభోగః విశ్లేష మృగయాశ్రమాః।
కలాఋతువయస్సంధీ ధాతు వృషాభిసారికాః।

రాజు, రాణి, దేశము, గ్రామము, పురి, నది, సరస్సు, అబ్ధి, అరణ్యము, ఉద్యానము, అద్రి, ప్రయాణము, రణము, గుఱ్ఱములు, ఏనుగులు, సూర్యోదయము, చంద్రోదయము, ఋతువులు, వివాహము, స్వయంవరము, సురాపానము, పుష్పాపచయము, జలకేళీ, సంభోగము, విశ్లేషము (విరహము) మృగము, ఆశ్రమము, కళలు, ఋతువులు యొక్కయు, వయస్సు యొక్కయు, సంధులు, ధాతు, వృక్ష, అభిసారికలు, అను విషయముల వర్ణ్యనీయములని పేర్కొనెను.

కొందరు ఈ వర్ణ్యనీయములను బట్టియో కావ్య వస్తువు నిర్ణీతమగు చున్నదనియు అనగా, మరికొందరు ఇవన్నియు గల కథ కావలయునని చెప్పుదురు. మన కవులు నాటక వస్తువునందు చూపినంత శ్రద్ధను శ్రవ్య కావ్య వస్తువునందు చూపలేదు. భరతుని మతమున 'కావ్యం హి దశ రూపాత్మక మేవ' కావ్యమున దశ రూపాత్మకమే. అందువలన భరతముని రూపక వస్తువును, రూపక రసమును గురించియే కాని, శ్రవ్య కావ్య వస్తువును, శ్రవ్య కావ్య రసమును గూర్చి చర్చించలేదు. 'ఏతచ్చ రసాధి లూత్పర్యేణ కావ్య నిబంధనం భరతా దావపి సుప్రసిద్ధమేవ' నని ధ్వన్యాలోకమున ధ్వనికారుడు మాత్రమే ప్రప్రథముగా రూపకమునకవీ వలెనే శ్రవ్య కావ్యమునకును రసమే ప్రధానమనియు, దానివలననే రమణీయత్వము కలుగుననియు నిర్వచించెను. అభినవగుప్త పాదాచార్యులు వారును తమ లోచనమున 'నాట్యాట్ సముదాయ రూపాత్ రసః కావ్యేచ నాట్యాయ మాన ఇవ రసః కావ్యార్థః' అని తెలిపిరి. ప్రబంధమున వస్తువు రసవ్యంజనముగా నుండ వలెననిరి. ప్రబంధమన కావ్యమే.

"ఇతి వృత్తంతు కావ్యస్య శరీరం పరికీర్తితం" అని భరతముని మతము. రూపకము నందు వలెనే కావ్యము నందును వస్తువు రమణీయముగా, రసోచితముగా నుండవలయును. శ్రవ్య కావ్యమున కార్య వస్తువు రసవ్యంజకము కావలయునన్నచో, ఇతివృత్తమందలి రసవద్ఘట్టములను తీసుకొనియే రచింపవలెను. కావ్యము వస్తువును బట్టి ప్రఖ్యాతము, ఉత్పాద్యము, మిశ్రము' అని మూడు విధములు. ప్రఖ్యాత మన పురాణ ప్రసిద్ధము రామాయణాదులు. ఉత్పాద్యమన కేవల కవి కల్పితములు. కళా పూర్ణోదయాదులు. మిశ్రమన కొంత ప్రఖ్యాత వస్తువును, కొంత ఉత్పాద్య వస్తువును మిళితమైనది. మను, వసు, చరిత్రాదులు. వీనిలో నేది రమణీయమని ప్రశ్నించుకొనిన, రామరాజ భూషణుడు వసుచరిత్రలో -

"కేవల కల్పనా కథలు కృతిమ రత్నము, లార్య సత్కథల్
వావిరిఁ బుట్టు రత్నము, లవారిత సత్కవి కల్పనా విభూ
షావహ పూర్వ వృత్తములు సానలఁ దీఱిన జాతి రత్నముల్
కావున నిట్టి మిశ్ర కథగా నొవరింపుము నేర్పు పెంపునన్"

దీనిని బట్టి "ఉత్పాద్య వస్తువు కృత్రియ రత్నము, ప్రఖ్యాత వస్తువు గనిలో పుట్టిన రత్నము (అనగా మెఱుగు పెట్టని రత్నము) మిశ్రవస్తువు సానలఁ దీఱిన జాతి రత్నము" అని అర్థమగును.

## క్షుద్రప్రబంధములు

విద్యానాధుడు 'మహాకావ్యము దక్క మిగిలిన వన్నియు క్షుద్రప్రబంధములని' వ్యవహరించెను. వీనికి 'ఉపకావ్యము'లనియు నామాంతరము కలదు. 'ఉపమితం కావ్యేన ఉపకావ్యం' అను వ్యుత్పత్తిని బట్టి కావ్య సదృశము అని యర్థము. మహలి కావ్య, ఖండ కావ్యములు నిబద్ధ కావ్యములు. మిగిలిన అనిబద్ధ కావ్యములన్నియు క్షుద్ర ప్రబంధములు.

## 11.3 ఉదాహరణకావ్యము

తెలుగు సాహిత్యములో ఉదాహరణ వాఙ్మయము ఒక విశిష్టశాఖ. ఆశు, మధుర, చిత్ర, విస్తరములను చతుర్విధ కవితా రీతులలో "ఉదాహరణము" మధుర రీతికి చెందినది. "ఆంధ్ర వాఙ్మయ మంతయు ప్రాయకముగ సంస్కృతానుసరణమేయైనను, అందు కొన్ని స్వతంత్ర రచనలు లేకపోలేదు. ద్విపద, దండకము, శతకము, యక్షగానము, ఉదాహరణము, మున్నగు శాఖలు పేరునకు సంస్కృతమే యైనను, గ్రంథ స్వరూపమునందును, ఛందస్సాహితీ రీతులందును, కవితా విన్యాసము నందును, ఆంధ్రతా ముద్ర కలిగిన స్వతంత్ర రచనలైనవి". శ్రీ నిడదవోలు వేంకటరావు గారి అభిప్రాయము స్వీకరించదగినది. ఆంధ్ర భాషలో నున్న ఏడు విభక్తులలో సంబోధన ప్రథమావిభక్తితో పాటు వివిధ పద్యములు అల్లి, ప్రభువును గూర్చియో, దైవమును గూర్చియో ప్రస్తుతి గల లఘుకృతి ఉదాహరణము.

## ఉదాహరణ కృతుల ప్రధాన లక్షణములు

1. ఇందు ఒక్కొక్క విభక్తికి ఒక్కొక్క వృత్త పద్యముండును. ఆ వృత్తము శార్దూల, మత్తేభములలో నొకటి కావలెను. పిమ్మట కళిక, ఉత్కళిక, తరువాత సార్వ విభక్తిక పద్యము వుండును. సార్వ విభక్తిక పద్యము సాధారణముగా శార్దూల వృత్తమై యుండును.

2. ఉదాహరణములో విభక్తి ప్రత్యయములన్నియు ప్రయుక్తములు గానవసరము లేదు. ఆ ప్రత్యయములు వృత్తములో నాల్గవ పాదము చివరను, కళికలో ప్రతి పాదము చివరను, ఉత్కళికలో ఎనిమిదవ పాదము చివరను ఉపయుక్తమైన చాలును. ఒక్క చతుర్థీ విభక్తి మాత్రము ఉత్కళికలో ప్రతిపాదమునందును భాసింపవలెను.

3. ఉదాహరణములోని కళికలు, ఉత్కళికలు తాళబద్ధములు. తెలుగులో త్రిపురాంతకోదాహరణము సుప్రసిద్ధము. ఉదాహరణము ఆంధ్రకవితా పరిణామమున అటు రగడకు ఇటు యక్షగానములకు మధ్యస్థమైనది. ఆంధ్ర ఉదాహరణ కార్యములకు అప్పకవీయము నందలి 'కృష్ణోదాహరణమే' ప్రమాణము.

## 11.4 చతుర్విధ కవిత్వములు

ప్రాచీన లాక్షణికులు చతుర్విధ కవిత్వములను పేర్కొనిరి. 'లక్షణదీపిక' యందు ఆశు, మధుర, చిత్ర, విస్తర కవిత్వములని నాలుగు విధములుగా పేర్కొనెను.

1. ఆశు కవిత్వము - ఆశు కవిత్వమున ఏకపాద, త్రిపాద, కఠినప్రాస, విషయ సమస్యా పూర్తులు, వ్యస్తాక్షర, నిషేధాక్షర రచనలు, అష్టావధాన శతావధానములు, ఘటికాశత గ్రంథ కల్పనలు, ఆకాశ పురాణము, మొదలగు తత్కాలోచితమగు అది త్వరితగతిని రచింపబడునది.

2. మధుర కవిత్వము - 'జక్కుల పాట' అని నామాంతము గల యక్షగానము లందలి కవిత్వము మధుర కవిత్వమునకు చెందినది.

3. చిత్ర కవిత్వము - ఒక వృత్తమున మఱొక వృత్తము వచ్చునట్లు చెప్పుటను చిత్ర కవిత్వమందురు. అనగా కంద గర్భ సీసము మొదలగునవి.

4. విస్తర కవిత - విస్తర కవిత్వమన ప్రబంధ కవిత్వము.

ఆధునికలు చతుర్విధ కవితారీతులను ఈ విధముగా విభజించిరి.

1. ఆఖ్యాన రీతి - The Epic Style
2. నాటకాయ రీతి - The Dramatic Style
3. ప్రబంధ రీతి - The Descriptive Style
4. భావ కవితా రీతి - The Lyrical Style

## 11.5 ముక్తక కవిత్వము

ముక్తకమనగా ఒక పద్యము మాత్రమే "ముక్తం అన్యేన నాలింగితం స్వార్థేకన్" క్రియా సమాప్తి కై పద్యాంతరములలో ఎట్టి సంబంధమును లేక రసభావాదులు గల ఏక పద్యము. అమరుకము రచయుక్తకములందు 'అ' కారాది 'హ' కారాంతము లాద్యక్షరములుగా గల పద్య సంగ్రహమునకు 'వ్రజ్య' అని నామము.

స్వయం సంపూర్ణమైన ఒక పద్యములో ఒక గాధ విన్పించవచ్చును. గాధా సప్తశతి ఏడువందల ముక్తకముల ముత్యాహారము.

ఉదా॥ "సరస కవిత యన్న సంగీత కళయన్న
వ్యంగమన్న లలిత హాస్యమన్న
అవని విముఖులున్న అదియే వారికి శిక్ష
వేరు శిక్ష యింక వేయునేల" - (నండూరి రామకృష్ణమాచార్యులు)

## 11.6 ఖండ కావ్యము

"ఖండ కావ్యం భవేత్కావ్య స్యైక దేశాను సారిచ" అని సాహిత్య దర్పణమున ఖండ కావ్యము గురించి వివరింపబడినది. మహాకావ్య లక్షణములలో నేక దేశమును గ్రహించి వ్రాసిన కావ్యము. మహా కావ్య ఖండ కావ్యములకు 'సంఘాతము లేక సంఘాతకము' అనియు నామాంతరము భారత రామాయణ పురాణ ప్రసిద్ధములగు కథలను గ్రహించి, అష్టాదశ వర్ణనలతో పెంపొందించి, తెలుగున ప్రబంధములు ప్రాచీన కవులు రచించినట్లే, ఆధునిక కవులు పురాణ, ప్రబంధములనుండి, చరిత్ర నుండి, సమకాలీన సంఘము నుండి, వస్తువును గ్రహించి కవితలు వ్రాయుచున్నారు. ఇవియే ఖండ కావ్యములు. వీనిలో 'శీర్షిక' కే ప్రధానము గాని పూర్వోత్తర కథలలో సంధానము అవసరము లేదు. క్షణ ప్రబంధ యుగమున వెఱ్ఱి తలలు వేసిన కవిత్వమునకు విరుగుడుగా, ఆధునిక కవులు వస్తువులోను, భావములోను, రసములోను, దేశికవితామయములో నవ్యతను పాటిస్తూ అనేక లఘు కథాకావ్యములు వ్రాసినారు. వీరిలో రాయప్రోలు సుబ్బారావు గారు, జాషువా, వేదుల, జంధ్యాల పాపయ్య శాస్త్రి గారు, మొదలగు ప్రముఖులు కలరు.

శ్రీకృష్ణ దేవరాయలపై జాషువా గారు వ్రాసిన ఖండ కావ్యములో ఒక పద్యము.

తొల్లి నిన్ను గన్న తుంగభద్రానది
బ్రదికి యున్న దిపుడు పార్థివేంద్ర
నేటి తుంగభద్ర నిన్నెరుంగని యట్లు
నడచుచుండు నంగనాచి వోలె!

ఇట్టి పద్య పరంపరలే ఆ శీర్షికలో ఇందలి వస్త్వైక్య పరిధికి శీర్షికయే కేంద్రబిందువు.

ఖండ కావ్యమున ఇతివృత్తము కవి భావపరంపరయే. ఉదాహరణము - జాషువా గారి ఖండ కావ్య సంపుటి లోని 'శ్మశానవాటి' శీర్షిక పరిశీలింపదగును.

ఇచ్చోటనే సత్కవీంద్రుని కమ్మని
　　కలము నిప్పులలోన కరగిపోయె!
ఇచ్చోటనే భూములేలు రాజన్యుల
　　అధికార ముద్రిక లంతరించే!
ఇచ్చోటనే లేత యిల్లాలి నల్ల పూ
　　సల సౌరు గంగలో కలిసి పోయె!
ఇచ్చోట నెట్టి పేరెన్నికం గనుగొన్న
　　చిత్రలేఖకుని కుంచియు నందించె!

ఇది పిశాచలత నిటాకాక్షణుండు
గజ్జ గదిలించి యాడు రంగస్థలంబు
ఇది మరణ దూత తీక్ష్ణమౌ దృష్టులొలయ
నవనిఁ బాలించు భాస్మ సింహాసనంబు

వేముల సత్యనారాయణ శాస్త్రి గారి 'దీపావళి' యను ఖండ కావ్య సంపుటిలో 'కాంక్ష' యను శీర్షికలో ఒక 'పువ్వు' యొక్క భావ పరంపర అభివ్యక్తమయినది.

"ఈ సుమజన్మ మెట్లో ఘటియిల్లెను నాకొక నాటి పాటిదై"
"పేదల రక్త మాంసముల బెంపు వహించి దయారసామృతా
స్వాద దరిద్రులైన ధనవంతుల పెద్దతికమ్ముకై మతో
న్మాదము పెంచు దేవునకు మాఱుగ నిల్చిన రాతి బొమ్మలం
దూదరవోవు పాడు బ్రదుకొక్క నిమేషము సైపనా హృదిన్॥"

"నాకు తలంపు లేదు లలనా జనతాక బరీ భరై కభూషా కలనన్
ద్వార తోరణ స్థానము నం దురింబడగ జాలను"

నీచపు దాస్య వృత్తి మన నేరని శూరత మాతృ దేశ సే
వాచరణమ్ము నం దసువు లర్పణ చేసిన వారి పార్థిత
శ్రీ చెలు వారు చోట తద సృ గ్గుబులన్ వికసించి వాసనల్
వీచుచు వాడిపోవగ వలెందదు దాత్త సమాధి మృత్తికన్॥"

ఖండ కావ్యమునకు ముక్తకమునకు గల భేదము గుర్తింపనగును. ముక్తకము ఒకే ఒక పద్యము. ముక్తకము స్వయం సంపూర్ణమైనది. ఖండ కావ్యము నందు అనేక పద్యములుండును. ఉదాహరణకు జంధ్యాల పాపయ్య శాస్త్రి గారి 'కుంతీకుమారి' లో -

"అది రమణీయమైన పుష్పవన మానమునందొక మేడ, మేడపై
అది యొక మారుమూలగది ఆ గది ముందట ఇంచుమించుగా
పదునయిదేండ్ల ఈడు గల బాలిక పోలిక రాచపిల్ల జం
కొదవెడి కాళ్లతోడ దిగుచున్నది క్రిందికి మెట్ల మీదుగన్"

ఈ పదములో 'ఎవరా రాచపిల్ల! అంతకు ముందు ఏమి జరిగినది? అను విషయము ఖండకావ్య కర్తకా కథ అనవసరము. 'గాలిలూగు జలతారు మేలిముసుగు' నొకింత జేర్చిన, ఆమె నెమ్మము గానిపించినది. ఆమే 'స్నిగ్ధ సుకుమారి కుంతీ కుమారి. ఆమె కానీనుడైన కర్ణుని ఎత్తుకొని గంగ కడ కేగినది. చివరకు ఒక పెట్టెలో 'ఒత్తుకొనకుండ పూలగుత్తులు' పెట్టి నదీ ప్రవాహములో విడిచిపెట్టి 'నిశ్చల నిర్నిమేష నయనాలతో' చూచుచు నిల్చిపోయినది. తరువాత కథ ఏమైనది? ఆ ప్రశ్న ఖండ కావ్య కర్త నడుగరాదు.

రస గుళికలు వంటి రమ్య కావ్యములను సృష్టించిన కవి రాయప్రోలు సుబ్బారావు గారు. ప్రకృతిని తల్లిగా, దేవతామతల్లిగా సంభావించినారు. భోగ్యవస్తువుగా కేవల వర్ణ్య వస్తువుగా పరిగణించబడుచున్న స్త్రీని దేవీ పీఠముపై అధివసింపచేసినారు. 1909లో రాయప్రోలు వారు Hermit ననుసరించి 'లలిత' అను ఖండ కావ్యమును వ్రాసినారు. ఈ ఖండ కావ్యము ఏక భాదాశ్రయమైన ఇతివృత్తము కలది. అడవిలో తిరుగుచున్న ఒక బాటసారిని ఒక ముని తన ఆశ్రమమునకు ఆహ్వానించి పలకరించును. బాటసారి తాను జయపాలుడను రాజు కూతురునని, తాను ప్రేమించిన సత్యవర్థనుడు నిరాశుడై అడవులు పట్టెనని, తాను మనసారా వరించిన ప్రియుడు లేని జీవితము నిరర్థకమని పలుకుచున్న బాటసారిని ముని వేషధారియైన యువకుడు హఠాత్తుగా కౌగిలించుకొని, తానే సత్యవర్ధనుడని వివరించగా, ఇరువురు అతి పరవశులై అనురాగమున విహరించిరి. రాయప్రోలు వారీ కావ్యమున ఆద్యంతమున నవ్యత కనబరచిరి. రాయప్రోలు వారి అమలిన శృంగారతత్త్వము శాఖామాత్రముగా ఈ కావ్యములోనే తళుక్కుమనుచున్నది.

## 11.7 లఘుకృతులు

లఘుకృతులను గూర్చి అప్పకవి 'అప్పకవీయములో'

ఒనరు ముక్తకమన నొక్క పద్యము, ద్వికం
బగు రెండు, త్రికము మూడైన, బంచ
రత్నంబు లైదు, వారణమాల యెనిమిది
నవరత్నములు పద్య నవకమైన
భాస్కర మాలిక పంద్రెండు, శశికల
పదియాఱు, నక్షత్రపంక్తి యిరవ
దియునేడు, త్రింశద్వాహయము ముప్పదిగాన
సంఖ్య వెండియు మెండు సాగెనేని

వరుస పంచాద శాఖ్య మవ్వల శతకము
నష్ట సమధిక శతంబు ననగ వెలయు

నేబదియు మాఱు నూటిపై నెనిమిదియును
సప్తశతి సప్తశతమైన శార్ఙ్గపాణి॥

అని సీసపద్యములో తెలుగు దేశమును నున్న నిత్య వ్యవహార నిష్ఠములైన లఘుకృతులను పేర్కొనెను. ఒక పద్యము ముక్తకము. రెండు పద్యములైన ద్వికము. మూడు పద్యములైన త్రికము. అయిదు పద్యములు చెప్పిన పంచ రత్నములు. ఎనిమిది పద్యములలో చెప్పిన గజమాల, తొమ్మిది పద్యములలో చెప్పిన నవరత్నములు, పండ్రెండు పద్యములలో చెప్పిన సూర్యమాల, పదునాఱు పద్యములలో కూడినది శశకళ, ఇరువది ఏడైన పద్యములలో కూడినది నక్షత్రమాల. ముప్పది పద్యములలో చెప్పిన త్రింశత్తు, ఏబడి పద్యములలో కూడినది పంచాశత్తు, నూఱు పద్యములలో కూడినది శతకము, నూట ఎనిమిది పద్యములలో చెప్పిన అష్టోత్తర శతకము, ఏడు నూఱులైన సప్తశతి అని లఘు కృతులను పద్య సంఖ్యను బట్టి నామములను పేర్కొనెను.

## 11.8 బిరుదావళి

"ఆచక్రవాళ లక్షణ
సూచితమై బిరుద భరిత శుభ వాఙ్మయమై
ఆచక్రవాళ విపుల
క్ష్మా చక్రము నందు బిరుద గద్యము పొల్చున్"

అని కావ్యాలంకార సంగ్రహము నందు 'బిరుదావళి' పేర్కొనబడినది.

"ప్రతాప రుద్రీయమున"
"వర్ణ్యమానాంక బిరుదు వర్ణన ప్రబురోజ్జ్వలా।
వాక్యాడంబర సంయుక్తా సామతా బిరుదావళీ।

వర్ణింపబడుచున్న రాజాదుల బిరుదములను గూర్చి వాక్యాడంబరములో వ్రాయబడిన కావ్యము 'బిరుదావళి' ప్రతాప రుద్రీయము నందు చెప్పబడిన లక్షణమును బట్టి ఇది పద్యమో గద్యమో తెలియరాకున్నది. నరసభూపాలీయము నందు 'బిరుదు గద్యము' అని పేర్కొనబడుటచే ఇది గద్యమయమని తెలియుచున్నది. సాహిత్య దర్పణమున 'గద్య' పద్యమయం రాజస్తుతి ర్బిరుత ముచ్యటే అని పేర్కొనబడుటచే ఇది గద్య పద్య ఉభయమని తేలుచున్నది. విశ్వనాథుడు 'బిరుదుమణి మాలా' అను కావ్యమును లక్ష్యముగా నిచ్చెను. అప్పకవీయమున ఈ క్రింది లక్షణము గలదు.

క్షితి మహారాష్ట్ర భాషచే చెప్పఁబడెడు
భీకరోక్తులు బిరుదులై పెక్కుఁదనరు
వాని బిరుదావళి యెనర్పవలయు నంద్రు
బుధులు సంబుద్ధి పదములు పొసగఁ గూర్చి

"సలిలిత వాక్య గుంభనల, సర్వ విభక్తుల, దీవనంబులన్
బెలువుగఁ బద్యమెక్కటి రచించిన పిమ్మట, గౌడరీతి సం
కలిత చతుష్క, షట్క, దళ గద్యము ల్మెనిదియుంబదాదునిం,
పలరగఁ గూర్చి పేర్చి బిరుదావళి చెప్పగ నొప్పు నెంతయున్"

ప్రప్రథమున సర్వ విభక్తులతో ఆశీర్వాద రూపమగు ఒక పద్యమును చెప్పి, పిమ్మట గౌడ రీతిలో నాలుగు లేక యాఱు,

లేక యెనిమిది, లేక పదనాఱు బిరుద గద్యలు తత్తత్ప్రతాప భుజక్రమాదులను వర్ణించునవి చెప్పవలెను. ఈ బిరుదములు మహారాష్ట్ర భాషామయములని చెప్పఁబడెను. మహారాష్ట్ర భాష అనునది ఉపలక్షణం. ఏ దేశ భాషలోనున్ననూ ఆ బిరుదముల ఆంధ్ర సంస్కృతాదుల లోనికి మార్చక అదేవిధమున వ్యవహరింపవలెను. జగనొబ్బగండ, మూరురాయర గండ, ఉభయర గండ, గండ భేరుండాది బిరుదపదములను - అట్లే వ్యవహరింపవలెను. కాని వానిని అనువదింపరాదు.

రాజుల ప్రశంస సల్పెడి బిరుదావళులు ప్రాచీన కాలమున బహుళములు. దేశ భాషలలో మహారాష్ట్ర భాషలో ఇవి తామర తంపరగ విలసిల్లినవి. ఇటువంటి బిరుదావళులు తెలుగు భాషలో కూడ అనేకములు వెలసినవి.

## 11.9 శతకములు

భగవదనుగ్రహ ప్రాప్తి కొఱకును, కవితా సృజనాభ్యాసము కొఱకును, శతకములు ఆంధ్ర సాహిత్యమున 12వ శతాబ్ది నుండి నేటి వరకును రచింపబడుచునే యున్నవి. తెలుగులో తెలుగుదనములో గుబాళించు సుప్రసిద్ధ రచన శతకము. ఇందు నూరు పద్యము లుండవలెనని శతక శబ్దము చాటుచున్నది. కాని సాధారణముగా నూట ఎనిమిది పద్యములు వరకు కానవచ్చు చున్నది. భగవన్నామ స్తోత్రములందు సహస్రమో, అష్టోత్తర శతమో నామములుండుట పరిపాటియగుటచే, శతకమునందు కూడ అష్టోత్తర శత పద్య పరిమితములై నున్నట్లు తోచుచున్నది. లౌకిక సంస్కృతమున మయూరుని సూర్య శతకము, భర్తృహరి సుభాషిత త్రిశచి మున్నగు శతకములు కానవచ్చుచున్నవి.

శతకమందలి ప్రతి పద్యము చివర సమానమైన మకుటముండును. ఈ మకుటములు సర్వసాధారణముగా భగవత్సంబోధన రూపములై యుండును. 'దాశరధీ కరుణా పయానిధీ' శ్రీ కాళహస్తీశ్వరా, 'సుమతీ' మున్నగు మకుటములు సుప్రసిద్ధములు. సంస్కృత శతకమునందు మకుట నియమము కానరాదు. శతకములు సాధారణముగా ఒకే ఛందమున వ్రాయబడుచుండును. కావ్యము లందు వలె శతకము లందలి పద్యము లన్నింటికిని సంబంధము సమకూర్చు కథా సూత్రము కానరాదు. ఇందలి పద్యములు వేనికవే స్వతంత్రములు. అందుచే వీనిని ముక్తక కావ్యములని చెప్పవచ్చును. ప్రతి పద్యము స్వయం సంపూర్ణమై అర్థములో భాసించుచుండును. వస్త్వైక్యము లేక పోవుటచే శతకము నందు రస పాత్ర పోషణము నందు అవకాశమంతగా కానరాదు. కాని, శృంగార, భక్తి, హాస్యరస ప్రధానములైన శతకములు కొన్ని లేక పోలేదు. శతకము సాధారణముగా గ్రంథ కర్త ఆత్మ భావములను ప్రకటించునదిగా నుండును. కావున శతకములు ఆత్మాశ్రయ కవితా జాతికి చెందినవి. కావున శతకములందలి నిష్కాపట్య నిర్మాలిన్యముద్ర, చిత్తశుద్ధి సంస్కృతములను ఆకర్షించును. ప్రబోధము, నీతిగాని, భక్తిగాని, శృంగారము గాని, వైరాగ్యమును గాని బోధించుట శతకము నందలి ముఖ్య లక్షణము. శతక కవిత అనగా కవి హృదయము చేయు విశ్వరూప ప్రదర్శనమే. శతకము నందలి తెలుగుతనము, ఆత్మాశ్రయులైన భావోద్వగము ప్రసంసింపదగినది. సారళ్యము, సౌలభ్యము శతక కవితకు ఉచ్ఛ్వాస నిశ్వాసములు. అందుచేత శతక పద్యములు సహజమైన ఇంటింటి పద్యములు. అవిరాని వారు ఉండరు.

పాల్కురికి సోమనాథుడు పండితారాధ్యుడు రచించిన గ్రంధములను పేర్కొనుచు 'శతకంబు శివతత్త్వసారము దీపకళిక' అని వ్రాసియుండెను. దీనిని బట్టి తెలుగున మల్లికార్జున పండితారాధ్యుడే ప్రథమ శతక కర్త యని చెప్పవచ్చును. పాల్కురికి సోమనాథుడు రచించిన 'వషాధిప శతకము' సర్వ లక్షణ సంపన్నమైన శతకము.

ఆంధ్ర వాఙ్మయమందలి శతకములను నీతి శతకములు, భక్తి శతకములు, వ్యాజ స్తుతి శతకములు, వేదాంత శతకములు, అని నాలుగు విధములుగా విభజించవచ్చును.

1. నీతిశతకములు - సర్వజన హితకరములైన నీతులతో కూడి, చదువు వారి ప్రవర్తనలను చక్క చేయుటకు నీతి శతకములు తోడ్పడుచుండును. ఇవి పూర్వ గ్రంధములను, లోకానుభవమును ఆధారముగా చేసుకొని వ్రాయబడినది. ఇందు రాజనీతి,

గృహనీతి, లోకనీతి, ప్రవృత్తినీతి ముఖ్యములైనవి. వీనిలో 13వ శతాబ్ది బద్దెన అను భద్రభూపాలుడు వ్రాసిన సుమతీ శతకము, మారద వెంకయ్య వ్రాసిన భాస్కర శతకము, వేమన యోగి రచించిన 'విశ్వదాభిరామ వినుర వేమా' యను మకుటముతో గూడిన పెక్కు నీతి పద్యములు ముఖ్యములైనవి.

'సుమతీ శతకమున'

"కనకపు సింహాసనమున
శునకము గూర్చుండఁబెట్టి శుభలగ్నము నం
దొనరగఁ బట్టయు గట్టిన
వెనుకటి గుణమేల మాను వినరా సుమతీ"

చిన్న, చిన్న పదాలతో సారళ్యము, సాలభ్యముతో అనల్పార్థమైన భావముతో వ్రాసిన పద&యము రాని వారుండరు.

ప్రౌఢ ప్రయోగములు శతకములలో ఉన్ననూ సౌకుమార్య మాధుర్యములే సుమతీ శతకములో ప్రబోధము లోకవృత్తాను దర్పణము.

కమలములు నీట బాసిన
కమలాప్తుని రశ్మిసోకి కమలిన భంగిన్
తమతమ నెలవులు తప్పిన
తమ మిత్రులె శత్రులగుట తథ్యము సుమతీ!

జీవితానుభవములే జ్ఞానోపదేశము చేయగా, జ్ఞాని అయి, విరాగి అయిన కవి వేమన భావము. భాషా సంగ్రహము - స్పష్టత - సరళతో వేమన కవితా గుణములు.

ఉప్పు కప్పురంబు నొక్క పోలికనుండు
చూడ చూడ రుచుల జాడ వేరు
పురుషులందు పుణ్య పురుషులు వేరయా
విశ్వదాభిరామ! వినురవేమా!

సాంఘిక దురాచారములతో కుల వ్యవస్థ జాతిని కలవరపెట్టు తీవ్ర సమస్య.

రామనామ పఠన రమణచే వాల్మీకి
పరగ బోయడయ్యె బాపడయ్యే
కులము ఘనము కాదు గుణమే ఘనంబురా
విశ్వదాభిరామ! వినురవేమా!

ఏ కులమునందు జన్మించినను, వాని ఘనత కులమును బట్టికాక గుణమును బట్టి ఏర్పడునని ప్రబోధించినాడు వేమన. ఆటవెలదిలో రెండు పాదములు విషయమును, మూడవ పాదము ఉపమానము, లేక దృష్టాంతము నాల్గవ పాదమున మకుటముతో అల్పాక్షరములతో అనల్పార్థమైన రచన చేసినవాడు వేమన.

2. భక్తిశతకములు - భగవన్నుతి పూర్వకములైన భక్తి శతకములలో, శైవకవి సార్వభౌముడైన పాల్కురికి సోమనాధుడు, 'బసవా

బసవా! కృపాధిప' అను మకుటములో వ్రాసిన వృషాధిప శతకము మొట్ట మొదటిది. యథా వాక్కుల అన్నమయ్య, 'సర్వేశర శతకము, ధూర్జటి 'శ్రీకాళహస్తీశ్వర శతకము' కంచర్ల గోపన్న అను పేర గల రామదాసు రచించిన 'దాశరధి శతకము' భక్తి శతకములలో ప్రముఖమైనవి.

ధూర్జటి కాళహస్తీశ్వర శతకమున -

'ఏ లీలన్ నుతియింప వచ్చు నుపయోత్ప్రేక్షా ధ్వని వ్యంగ్య శ
బ్దాలంకార విశేష భాషల కలంభ్యం బైన నీ రూపమున్
బాలుం జాలు కవిత్వముల్ నిలుచున్ సత్యంబు వర్ణించుచో
బీ! లజ్జింపరు గాక! మాదృశ కమల్ శ్రీ కాళహస్తీశ్వరా!

అని కవి తన అహంకారమును ఉజ్జగించి, ఆత్మార్పణమును సలిపెను.

3. వ్యాజ స్తుతి శతకములు - "వ్యాజ స్తుతి ర్ముఖే నిందాస్తు తిర్వా రూఢి రన్యధా" అని వ్యాజ స్తుతి అలంకారమునకు నిర్వచనము. ఇందులో స్తుతిలో నింద గాని, నిందలో స్తుతి గాని అంతర్గతమై యుండును. భగవంతుని నిందించు చున్నట్లు కనిపించినను, ఇందలి పద్యములలో భక్తి అంతర్వాహినిగా ప్రవహించుచుండును. గోగులపాటి కూర్మనాధ కవి 'సింహాద్రి నారసింహ శతకము' మొదటగా పేర్కొనదగినది. భల్లా పేరయ్య కవి 'భద్రగిరి శతకము' కాసుల పురుషోత్తమ కవి 'ఆంధ్ర నాయక శతకము' లు ప్రముఖములైనవి.

4. తత్త్వ శతకములు - ఉపనిషాదులందు నిరూపింపబడిన తత్త్వ విషయములను సామాన్య జనులకు సహితము చక్కని తేట తెలుగు మాటలతో కవులు శతక రూపమున వెల్లడించి యున్నారు. శ్రీకాళహస్తీశ్వర, దాశరథీ, వేమన యోగి రచించిన పద్యములలో తత్త్వ బోధకములయిన పద్యములు చాల కలవు.

వేమన వేదాంతము నిగూఢమైనది. భగవంతుడు కలడనియు, అతడు ఒక్కడే యనియు, అతడు సర్వ జీవకోటి హృదయ పీఠములపై అధివసించువాడనియు వేమన భావము.

"పసుల వన్నె వేఱు పాలేక వర్ణమౌ
పుష్పజాతి వేరు పూజ యొకటి
దర్శనంబు వేరు దైవంబదొక్కటే"

శతకములు తెలుగు భాషలో 'ధారాశుద్ధి శోభితములై, సహజ భావ పరిమితములై, చదువరుల కానందముతో పాటు విజ్ఞాన వివేకములను కూడ కలిగింప దక్షతలై' రచింపబడినవి.

## 11.10 దండకము

తెలుగు భాషలో దండకము పద్య గద్య కావ్యముల మధ్య సేతువు వంటిది. దండకము సహజముగా 'త' గణ బద్ధము. త, న, స, హ, గణములలో నొకటి మొదట నిడి, తక్కిన వన్నియు తగణములే కూర్చి తుదిన నొక గురువు నుంచవలెను. యతి ప్రాస నియమము లేదు. ఇది గద్య కావ్యమా? పద్య కావ్యమా? అని సందేహము కలుగును. కాని గద్యము నందు ఛ్చందస్సు ఉండదు. కాన ఇది పద్య కావ్యమే. తెలుగులో కల దండకములు సహజముగా దైవ స్తుతి రూపములో అనగా భక్తి రస కావ్యములే. ఆంజనేయ దండకము మొదలగునవి. పోతన 'భోగినీ దండకము' శృంగార ప్రధానమైనది. రాయలసీమలో బహుళ ప్రచారము

గల భాషీయ దండకము హాస్యరస సంభరితమైనది.

### 11.11 ఆఖ్యాయక

ఆఖ్యాయక ఉచ్ఛ్వాసాది విభాగములు కలిగి నడుమ నడుమ ఇతరుల పద్యములు గల గద్య ప్రబంధము.

### 11.12 ఉపాఖ్యానము

"శ్రుత స్వార్థస్య కథన ముపాఖ్యానం ప్రచేక్షతే"

ప్రధాన కావ్యములో నానుషంగికముగా ప్రవక్తమగు చిరుకథ, ఇతరుల వలన విన్న కథను చెప్పుటయు ఉపాఖ్యానమగును.

అఖ్యానము

"స్వయం దృష్టార్థ కథనం ప్రా హం రాఖ్యానకం బుథాః"

కవి తాను స్వయముగా దర్శించిన సన్నివేశమును వర్ణించుట.

### 11.13 ఇతిహాసము

ఇతిహాసమనగా పూర్వరాజాదుల కథలను తెలుపునది. ఇతి-హ-ఆస్మిన్ అస్తీది ఇతిహాసః' అని వ్యుత్పత్తి. భారత రామాయణాదులు ఇతిహాసములుగా సుప్రసిద్ధములు.

### 11.14 పురాణము

1. సర్గము - (ప్రపంచోత్పత్తి)
2. ప్రతి సర్గము - (బ్రహ్మాదులు చేసెడి ఉత్పత్తి)
3. వంశము - (దేవాసురాది విభేదోత్పత్తి)
4. మన్వంతరము (మానవుల వృత్తాంతము)
5. వంశాను చరితము (సూర్య చంద్ర వంశ రాజుల చరిత్రము)

అను ఐదు అంశములలో నున్న బృహద్రచను పురాణమందురు.

"పురాఽపి నవం పురాణం" అని వ్యుత్పత్తి. అనగా పూర్వ కథయైనను క్రొత్తదిగా భాసించునది అని వ్యుత్పత్త్యర్థము. అష్టాదశ పురాణములు సంస్కృత వాఙ్మయమున సుప్రసిద్ధములు. మొదట ఈ ఐదు అంశములకే ప్రాధాన్యమిచ్చినను, తరువాత కాలమున వర్ణనలు చేరినవి. ఇతిహాసము వలె పురాణములును పెక్కు కథలకు నిలయములయినవి. ఇతిహాసముల వ్యాప్తి చిన్నది. పురాణముల వ్యాప్తి పెద్దదిగా పరిణమించినది. ఇప్పుడే అల్ప భేదమును పాటింపక పురాణ పదమునే రెంటికిని వ్యవహరించు చున్నారు.

మణిప్రవాళము - సంస్కృతాంధ్రములను - విభక్తులతో తిలతండుల న్యాయమున గుదిగ్రుచ్చుట. పాల్కురికి సోమనాధుడు 'వృషాధిప శతకము'న మణి ప్రవాళమునకు ఉదాహరణముగా నొక పద్యము వ్రాసెను. అసలు ఇది మళయాళమున గలదు.

"తండులాని గృహమందు నసంది<br>
తిండికైతే పదిమంది వసంది"

వాయువు వొందు యీ విగత వాన అమాపరహంబు భౌ (?)
న్యాయ విధేయ మీశతరి యన్యున బాణా కళాభి దంచు। వా
గ్ధేయమణి ప్రవాళమున దిల్లము నిన్ను నలంకరింతు దే
వా! యమిబృంద వంద్య। బసవా। బసవా। బసవా। వృషాధిపా?

ఆధునికుల భాషణములో ఆంధ్రాంగ్లములు కలిసిన మణిప్రవాళము నిత్యజీవిత యాత్రలో అనుభవ వేద్యమే.

## 11.15 చాటువులు

చాటువు అను శబ్దమునకు 'మనోహరమైనది' అని అర్థము. కవితా ప్రపంచములో సద్యోమౌవ్వనములో ఉద్భవించు ఏకైక పద్యము చాటువు. చాటువులు 'పాతాళగంగ పైకుబికినట్లు కవి హృదయము నుండి ఆశువుగా వెలువడెడి ముక్తకములు. ఈ పద్యములు గ్రంథస్థములు కాకపోయినను రసజ్ఞుల హృదయస్థములై అనేక శతాబ్దముల నుండి చిరంజీవములై వర్ధిల్లుచున్నవి. చాటు పద్యము స్వయం సంపూర్ణమైనది స్వతంత్ర ప్రతిపత్తి కలది.

చాటు పద్యమునకు (1) తాత్కాలిక ప్రేరణ, (2) స్వయం సంపూర్ణత, (3) చమత్కారము, (4) ఝటికి స్ఫూర్తి, (4) ఇతివృత్త సౌలభ్యము ప్రధాన లక్షణములుగా పేర్కొనవచ్చును. చమత్కారము చాటువునకు అంతరాత్మ. వస్తు లాఘవము గమనింపదగినది. ఝటుకి స్ఫూర్తి చాటు పద్య రచనలోని విశేషము తెలుగు కవుల స్వచ్ఛంద కవితా ప్రతిభకు, సర్వతంత్ర స్వతంత్ర ప్రతిపత్తికి తెలుగు చాటువులు నికషోపలములు ఒక్కొక్క చాటువు ఒక మహాకావ్యముతో సరితూగ గల సామర్థ్యము కలవి. ఇవి గ్రంథ నిబద్ధములు గాకపోయినను, కాల మహా ప్రవంతి కెదురీది బ్రతికిన సాహిత్య ఖండికలు. తెలుగులో వెలసిన చాటువులు అసంఖ్యాకములు. అవి నవరస భరితములు. నిత్య ప్రత్యగ్రములు. ఉదాహరణమునకు కొన్ని చాటువులు . . . .

కం॥ శివు డద్రిని శయనించుట
రవి చంద్రులు మింటనుంట రాజీవాక్షుం
డవి రతమును శేషునిపై
బవళించుట నల్లి బాధ పడలేక సుమీ

ఆ॥వె॥ చాకివాని తోడ జగడాలు పడలేక
సిరిగలాడు పట్టు చీర గట్టి
శివుడు తోలు గప్పె సేయని మది రోసి
భైరవుండు చీర పార వేసె

ఈ చాటు పద్యములలో కవి సహజ ధర్మములను తనకు కావలసిన విషయములో సమన్వయించుకొని చమత్కారముతో వర్ణించుట విశేషము.

తిక్కన సోమయాజికి పెద్ద తండ్రి కుమారుడు, మనుమసిద్ధి మహారాజు సేనాని ఖడ్గ (రణ) తిక్కనను గూర్చి జన శ్రుతిలోనున్న చాటు పద్యములు. మనుమసిద్ధికిని, కాటమ రాజునకు జరిగిన యుద్ధములో ఖడ్గ తిక్కన కాటమ రాజు సేనను ఎదుర్కొనలేక, ఇంటికి రాగా ఖడ్గ తిక్కన భార్య, భర్త స్నానము చేయుటకు రాగా, నులక మంచము అడ్డ చేసి, పసుపుటుండ దానిపై నుంచి, నీళ్ళ బిందె తెచ్చి పెట్టెనట. ఇది ఏమని ఖడ్గ తిక్కన అడుగగా,

పగఱకు వెన్నిచ్చినచో
నగరే నిను మగతనంపు నాయకులెందున్?
ముగురాఁడు వారమైతిమి
వగపేటికి జలకమాడ వచ్చినచోటన్!

అని అవమానకరముగా పలికినట. తర్వాత తల్లి అన్నములో విఱిగిన పాలుపోయగా, ఇది ఏమని అడిగినాడట. అతని తల్లి 'నాయనా! నీవు పోయిన చోటకే పసులును మేతకు పోయెను. అవియు విఱిగి వచ్చినవి. పాలును విఱిగెను' అని జవాబు ఇయ్యగా, అన్నము విడిచి, లేచి యుద్ధమునకు పోయి శత్రువులను ఎదొర్కొని వీరస్వర్గము పొందినట్లు ఆనాటి కవుల చాటు పద్యముల ద్వారా తెలియుచున్నది.

"నిరంకుశాః కవయః" కవులు నిరంకుశులు అను మాట చాటు రచనము పట్ల మిక్కిలి సార్థకము. చాటువులలో కవి సర్వతంత్ర స్వతంత్రుడై ఉల్లంఘింపని నియమము లేదు. వ్యాకరణ ధిక్కారము, కావ్య మర్యాదల తిరస్కృతి, కవి సమయ భంగము, భాషా సంప్రదాయ విచ్ఛిత్తి, సర్వము చాటు కవితా జగన్నాథమయమే. అయినను అనిర్వచనీయమైన చమత్కార మాధుర్యము చాటు పద్యమును ఆపాత రమణీయమొనర్చి ఝటితి స్ఫూర్తితో సద్యోరస ప్రతీతి కల్పించుట అనుభవవేద్యము.

తెలుగు చాటువులను గురించి ఎన్నో కమ్మని కథలు ప్రచారములో నున్నవి. శ్రీనాథయుగములోను, ప్రబంధయుగములోను ఎన్నో చాటువులు వెలసినవి. శ్రీనాథుని చాటువులు సుప్రసిద్ధములు. కొండవీట నున్నపుడు శ్రీనాథుడు పల్నాటి సీమకు పోవుచుండెడి వాడు. పల్నాటి సీమపై శ్రీనాథుడి గల అనాదరము అనేక పద్యములలో తెలియుచున్నది.

కం॥ రసికుడు పోవఁడు పల్నా
డెసగంగా రంభయైన నేకులు వడకున్
వసుధేశుఁడైన దున్నును
కుసుమాస్త్రుండైన జొన్నకూడే కుడుచున్

ఉ॥ అంగడి యూర లేదు వరి యన్నము లేదు శుచిత్వమేమి లే
దంగన లింపు లేరు ప్రియమైన వనంబులు లేవు నీటికై
భంగపడంగఁ బాల్పడు కృపాపరులెవ్వరు లేరు దాతలె
న్నంగను సున్న పలినాటికి మాటికిఁ బోవ నేటికిన్

పల్నాటిలో మంచినీరు దొరకక చెప్పిన పద్యము.

క॥ సిరిగల వానికిఁ జెల్లును
దరుణులు పదియాఱు వేలదగఁ బెండ్లాడన్
దిరిపమున కిద్దరాండ్రా
పరమేశా। గంగ విడుము। పార్వతి చాలున్

పరమేశ ధిక్కార పద్యము ఆపాత మధుర మనిపించును.

శ్రీనాథుడు ఈశ్వరార్చన కళాశీలుడు. సకల విద్యాసనాథుడు. పుంభావ సరస్వతి. అనేక సుకవి రాజ సన్మానములు పొందినవాడు. ప్రౌఢ దేవరాయులుచే కనకాభిషేకము పొంది 'కవిసార్వభౌమ' బిరుదును పొందిన మహాకవి. జీవితమునందు

మహాభోగములననుభవించి, తుదకు కవిత్వమును ఆదరించు ప్రభువులు లేక, వడ్డెర రాజుల చెఱశాలలలో కష్టముల ననుభవించి, బృహస్పతికి సహితము గుండియలు దిగ్గురనునట్లు స్వర్గమున కరిగిన యుద్ధండపండిత కవి.

సీ॥ కవిరాజు కంఠంబు కౌఁగిలించెను గదా
పురవీధి నెదురెండ పొగడ దండ
ఆంధ్ర నైషధ కర్త యంఘ్రి యుగ్మంబున
దగిలియుండెను గదా నిగళ యుగము
వీరభద్రారెడ్డి విద్వాంసు ముంజేత
వియ్యమందెను గదా వెదురు గొడియ
సార్వభౌముని భుజాస్తంభ మెక్కెను గదా
నగరి వాకిట నుండు నల్ల గుండు

గీ॥ కృష్ణవేణమ్మ గొనిపోయె వింతఫలము
బింబిలాక్షులు తినిపోయెఁ దిలలు పెసలు
బొడ్డు పల్లెను గొడ్డేటి మోసపోతి
నెట్టు చెల్లింతుఁ టంకంబు లేడు నూర్లు

అవసానకాలమున శ్రీనాథ మహాకవి సార్వభౌముడు చెప్పికొన్న పద్యము.

సీ॥ కాశికా విశ్వేశుఁ గలిసే వీరారెడ్డి
రత్నాంబరము లేదా యుఁడిచ్చు?
రంభఁ గూడెఁ దెనుంగు రాహుత్తుండు
కస్తూరి కేరాజుఁ బ్రస్తుతింతు?
సర్గస్థుఁడయ్యే విస్సన్న మంత్రి మఱి హేమ
పాత్రాన్న మెవ్వని పంక్తిఁ గలదు?
కైలాసగిరిఁ బండె మైలార విభుడేఁగి
దినవెచ్చ మేరాజు తీర్పఁ గలడు?

గీ॥ భాస్కరుడు మున్నే దేవుని పాలి కరిగెఁ
గలియుగంబున నిఁక నుండఁ గష్టమనుచు
దివిజ కవివరు గుండియల్ దిగ్గు రనఁగ
నరుగుచున్నాఁడు శ్రీనాధుఁడమరపురికి!

పొగ త్రాగుట గురించి ఆధునిక కవి చాటువు.

కం॥ పొగ త్రోవికి సతిమోవికి
నగణితముగ సూర కవికి నమృతమ్మనకున్
తగనుచ్చిష్టము లేదని
ఖగవాహనునితోడఁ గాలకంఠుఁడు పలికెన్

ఈ చాటువులో ధర్మ సూక్ష్మమును చెప్పినది కవి కాదుట. శ్రీ మహావిష్ణువుతో పరమేశ్వరుడు చెప్పెనని కవి కల్పన.

ముక్కు పొడుము (నస్యము)ను గురించి ఒక చాటువు.

ఉ॥ నస్యము శీత మత్త గజ నాశన హేతు విచార ధీర పం
చాస్యము సుప్తి రోగ నిబిడాంధతమః పటతార్క బింబసా
దృశ్యము, వేద శాస్త్రచయ దీప్త సుపండిత వాగ్వి చిత్ర సా
రస్యము, రాజవర్య మహారాజ్మాణికైన నుతింప శక్యమే.

ఈ చాటు పద్యము ఎంతటి రీతి సుభగమైన గంభీర శయ్యతో సుప్రసిద్ధ మహాకవి ప్రయోగ సంభరిత సమాస ప్రౌఢ పదగుంఫనముతో అందముగా నడచినది.

ప్రతి చాటు పద&యము తెర వెనుక ఒక కమ్మని కథ పొంచి దాగి యుండును. ఒక్కొక్క పద్యము అనేక ప్రబంధ కవితాసారములను వడ బట్టి ఒకచో చేర్చి చేసిన రసగుళిక యనిపించును. ప్రతి చాటువు స్వయం సంపూర్ణత కలిగి, ఝుటిత స్ఫూర్తితో చమత్కారము కలిగించి ఇతివృత్త సౌలభ్యముతో ఆపాత రమణీయ మాధుర్యముతో సద్యో రస ప్రతీతి కల్పించుటచే, ప్రజల నోళ్ళలో అనేక శతాబ్దముల పర్యంతము నిలిచిపోయి, ఆంధ్ర సాహిత్యములో అమూల్య ఆభరణములై ప్రసిద్ధికెక్కినది.

## 11.16 యక్షగానములు

"యక్షగానములు చతుర్విధ కవితలలో మధురశాఖకు చెందునని" వేటూరి ప్రభాకరశాస్త్రి గారు సుగ్రీవ విజయ యక్షగాన పీఠికలో పేర్కొనిరి. ఆంధ్ర సాహిత్యములో 12వ శతాబ్దికి ముందు కాలము యక్షగాన చర్త్రిలో 'అజ్ఞాత' యుగముగా చెప్పవచ్చును. యక్షగాన పరిణామ చరిత్ర అది చిత్రమైనది. రచనలో, ప్రదర్శనలో, తరతరమునకును పరిణామమందుచు వచ్చినది. మొదట యాత్రాస్థలములందును, కామందుల లోగిళ్ళనందును, పల్లె పట్టుల రచ్చ సావడి యందును, పాడి గలిగిన రాచదేవిడీలందును యక్షగానము ప్రదర్శితమైనది. వివిధ ప్రాంతములందలి వివిధ శ్రవ్య, దృశ్యాత్మకములైన సాహిత్య ప్రక్రియలలో అనుబంధము పెంచుకొని, వివిధ గీతి చ్ఛందస్సులను తనలో ఇముడ్చుకొని, బొమ్మలాట రైతుల మొదలుగ జానపదుల గంటములనుండి నగరములందు రాజాస్థానముల నాశ్రయించిన పండిత కవుల పైడి గంటములకును ఎగబ్రాకినది. పలు తరగతుల ప్రజా జీవితోదంత విశేషములను ప్రతిబింబించుకొని, పలు కథలకాశ్రయమై, పాఠ్య గేయ నాట్యాత్మకములైన పెక్కు ప్రయోజనములకు స్థానమై, 'సార్వజనీనమైన బహుముఖ ప్రయోజన సనాథమైన సాహిత్య ప్రక్రియగా పరిణమించినది.

ఆంధ్ర సాహిత్యమున మొట్టమొదట యక్షాది నేపథ్యములలోడి ఆట పాటల ప్రసక్తి పాల్కురికి సోమనాధుని పండితారాధ్య చరిత్రమున కలదు. కావున యక్ష గాన సరణి బీజప్రాయముగ పాల్కురికి సోమన కాలమున ఆరంభమై శ్రీనాధుని కాలమున విస్తరించినదని విద్వాంసుల అభిప్రాయము.

కీర్తింతు రెవ్వాని కీర్తి గంధర్వులు
గాంధర్వమున యక్షగాన సరణి (భీమఖండము. 3-65)

అని శ్రీనాధుడు భమఖండములో యక్షగాన ప్రశంసచేసెను. 15వ శతాబ్ది ప్రథమ పాదమున వెలసిన క్రీడాభిరామమున

కామవల్లీ మహాలక్ష్మి కైటిభారి
వలపు వాడుచు వచ్చె జక్కుల పురంధ్రి (క్రీడాభిరామము. 135)

జక్కుల పురంధ్రి గానకళా ప్రావీణ&యము ప్రస్తుతింపబడినది. అందు 'యక్షకన్యల' నృత్యము కూడ ప్రసక్తమైనది. పదనారవ శతాబ్దిలోని చిత్రభారతమున 'యక్ష కామినుల' నాట్యము, 'యక్ష వనితల పాట' పేర్కొనబడినది. జక్కల శబ్దము యక్ష శబ్దముగా మారుట భాషా సంప్రదాయానుగుణ్యమే. 17వ శతాబ్దమున తంజాపురాన్నదాన నాటకమున జక్కుల రంగసాని సత్రములో 'పదకేళిక' పట్టినట్లు కలదు.

"యక్షగాన పదంబులు నవ్విధమున
సముచితానేక విధ తాళ సంగతులను
నవరసాలం క్రియా సవర్ణంబు లగుచు"

యక్షగానము లలరారుచుండెడివని తాళ్ళపాక అన్నమాచార్యుల వారి పౌత్రుడైన చినతిరుమలాచార్యుడు 'సంకీర్తన లక్షణమను' గ్రంధమున పేర్కొనెను.

యక్షగానములలో ప్రధాన రచనాంగములు మూడు.

1. రగడ వికారము - తాళ ప్రధానమైన రేకు.
2. ద్విపద
3. ఏలలు, జోలలు - అర్థచంద్రికలు - ధవళశోభనములు.

తొలుత యక్షగానములలో వచన భాగము చాల తక్కువ. రానురాను వచన సంభాషణములు చేరినవి. దరువు, ద్విపద, గద్య పద్యములు యక్ష గానాంశములుగా చివరకు రూపొందినది.

"ప్రోలుగంటి చెన్నశౌరి సౌభరి చరిత్రము" మొట్టమొదటి యక్షగాన రచన 15వ శతాబ్ది యుత్తరార్థమున రచించినట్లు తెలియుచున్నది. కాని ఆ గ్రంథము లభ్యము కాలేదు. అది జక్కల కథయని పేర్కొనబడినది. మనకు లభ్యమవుతున్న 16వ శతాబ్ది ఉత్తరార్థమున కందుకూరి రుద్రకవిచే రచింపబడిన 'సుగ్రీవ విజయము' మొదట యక్షగానముగా పండితలందరిచే పరిగణింపబడినది. సుగ్రీవ విజయము ప్రదర్శన సౌలభ్యము కల రచనయని తోచును. సంభాషణలు వచనమున లేకపోయినను అందు ఆఖ్యాన శైలి కంటె సంవాద శైలికే ప్రాధాన్యమున్నది. ఆధునిక శతాబ్దములో యక్షగానములు కోకొల్లలుగా వెల్లివిరిసినవి. గుజ్జువాడ లక్ష్మణ మూర్ఛ, సంతవేలూరు - కుశలవ, పాతపట్టణము - బాణాసుర నాటకము మొదలైనవి. హరికథలను కూడ ఆదిభట్ల నారాయణ దాసు మున్నగు వారు యక్షగాన ప్రబంధములని వ్యవహరించినారు.

"అటునిటు చెరి మేకనిచే పట్టుకొన బడిన తెల్లని గుడ్డయే తెర. తెరకు అటునిటు నూనె దివిటీలు. తెర వెనుక హంగుదారులు. వంత పాటగాండ్రు, హంగుతిత్తి, మద్దెలి, తాళపు చిప్పలు, తెర ముందు సూత్రధారుడు. అతడే ప్రదర్శన ప్రవర్తకుడు. ప్రార్థనాదికము. కథాసందర్భ వివరణము, పాత్ర ప్రవేశ సూచన, పాత్రలను పల్కరించుట, పాత్రలకు వంత పాటలకు పల్లవులనందించుట, అభినయానుకూలముగా తాళము వేయుట, సంధి వచనములు చదువుట, అప్పుడప్పుడు హాస్య ప్రసంగములు నెరపుట, మున్నగునవి అతని పనులు. ప్రదర్శనములు రాత్రి ప్రారంభమై తెల్లవారు సరికి అంతమగుచుండునని" డా.యస్వీ జోగారావు గారు పేర్కొనిరి.

తంజావూరు రాజ్యము యక్షగానములకు స్వర్గ యుగము కల్పించినది. విజయరాఘవ నృపాలుడు అనేక యక్షగానములు రచించినట్లు ప్రఖ్యాతికెక్కెను. తంజావూరును పరిపాలించిన మహారాష్ట్రులను యక్షగానములను ప్రోత్సహించిరి. విద్వత్కవి కంకంటి పాపరాజు విష్ణుమాయా విలాసము అను యక్షగానమును వ్రాయుట చేత వాఙ్మయమున ఆనాడు పర్వదిన గౌరవ

ప్రపత్తులను ఎన్నవచ్చును.

## 11.17 సమీక్ష

యక్షగానముల రచన సామాన్యముగా ప్రారంభమై, వివిధ శ్రవ్య దృశ్యాత్మకములైన సాహిత్య ప్రక్రియలలో అనుబంధము పెంచుకొని, వివిధ గేతి ఛ్చందస్సులను తనలో ఇముడ్చుకొని, జానపదుల గంటములనుండి రాజాస్థాన పండిత కవుల పైడి గంటముల వరకు విస్తరించి, కొటలోని రాజు గారికిని, పేట లోని ప్రజలకును సమానముగా ఆదర్శపాత్రమైనది. తామరతంపరగా అనేకము పైన యక్ష గానములు వెలసినవి. త్యాగరాజు, నారాయణ తీర్థులు, మేలత్తూరు వెంకటరామ శాస్త్రి మున్నగు వారిచేతను యక్షగానములు రచింపబడి ఆంధ్ర సాహిత్యమున ఒక విశిష్ట స్థానమును పొందినది.

## 11.18 ప్రశ్నలు

1. కావ్యమును వివరించి, కావ్య భేదములోని ప్రబంధములను గురించి వ్రాయునది.
2. కావ్య భేదములలోని ఖండ కావ్యములను గురించి వ్రాయునది.
3. కావ్య భేదములలోని చాటు పద్యములను వివరించినది.
4. యక్ష గాన ప్రక్రియ గురించి వివరించునది.
5. శతకములను గురించి వివరించునది.

## 11.19 ఉపయుక్త గ్రంథాలు


1. కావ్యాలోకము - డాక్టరు నండూరి రామకృష్ణమాచార్య
2. కావ్యాలంకార సంగ్రహము - వివరణ కర్త - సన్నిధానము సూర్యనారాయణ శాస్త్రి
3. ఆంధ్ర యక్ష గాన వాఙ్మయ చరిత్ర - డాక్టరు యస్వీ జోగారావు
4. చాటు పద్య మణి మంజరి - వేటూరి ప్రభాకరశాస్త్రి
5. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
6. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగములు - డాక్టర్ సి. నారాయణ రెడ్డి



**అరిపిరాల హరిహరనాథశాస్త్రి**

Incharge - తెలుగు శాఖ

శ్రీ సుబ్బరాయ & నారాయణ కళాశాల

నరసరావుపేట - 522 601

# పాఠం - 12

# భావ కవిత్వము

పాఠ్యనిర్మాణక్రమం


12.0. లక్ష్యం
12.1. భావ కవిత్వ నిర్వచనము
12.2. భావ కవిత్వ స్వరూపము
12.3. భావ కవిత్వ శాఖలు
12.4. ప్రణయ కవిత్వము
12.5. ప్రకృతి కవిత్వము
12.6. భక్తి కవిత్వము
12.7. దేశభక్తి కవిత్వము
12.8. సంఘ సంస్కరణ కవిత్వము
12.9. స్మృతి కావ్యాలు
12.10. సమీక్ష
12.11. ప్రశ్నలు
12.12. ఉపయుక్త గ్రంథాలు


## 12.0 లక్ష్యం

తెలుగు సాహిత్యములో నవ్య కవిత్వం ఆవిర్భవించటానికి దోహదం చేసిన ప్రేరణలు రెండు. ఒకటి, అంతఃప్రేరణ. 17, 18, 19 శతాబ్దాల్లో వచ్చిన మన సాహిత్యం పట్ల ఏర్పడిన ఒక వైముఖ్యం. ఇది నవ్యతా రాహిత్యం వల్ల ఏర్పడింది. రెండవది బహిః ప్రేరణ. ఇది ఆంగ్ల సాహిత్య ప్రభావం మరియు సామాజిక ఉద్యమాల ప్రభావం. వీటి కారణంగా తెలుగులో నవ్య కవిత్వం కట్టమంచి రామలింగారెడ్డి గారు 1900 సంవత్సరములో ప్రచురించిన 'ముసలమ్మ మరణం'తో ప్రారంభమైంది. ఈ నవ్య కవిత్వమే తరువాతి కాలంలో భావ కవిత్వంగా పిలవబడింది. దీని స్వరూప స్వభావాలను శాఖోప శాఖలను వివరించడమే ఈ పాఠ లక్ష్యం.

## ఉపోద్ఘాతం

ఆధునికాంధ్ర కవితా ధోరణులలో మొదటిదైన భావ కవిత్వోద్యమము దాదాపు మూడు దశాబ్దాల పాటుగా (1910-1940) ఆంధ్ర సాహిత్య కేదారమున పసిడి పంట పండించినది. 1940 లోపల కలము పట్టిన వారెవ్వరును దీని ముద్రను తప్పించుకొన లేకపోయిరి. భావ కవులలో రాయప్రోలు సుబ్బారావు, విశ్వనాథ సత్యనారాయణ, వేంకట పార్వతీశ కవులు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, దువ్వూరి రామిరెడ్డి, బసవరాజు అప్పారావు, నండూరి సుబ్బారావు, వేముల సత్యనారాయణ శాస్త్రి, నాయని సుబ్బారావు, పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వర రావు, గుర్రం జాషువా, తుమ్మల సీతారామమూర్తి, తల్లావఝ్ఝల శివశంకర శాస్త్రి, అడవి బాపిరాజు, కవికొండల వెంకటరావు, అబ్బూరి రామకృష్ణారావు ప్రముఖముగా పేర్కొనదగిన వారు. భావ కవిత్వంపై ఆంగ్ల సాహిత్యములో పందొమ్మిదో శతాబ్ది ప్రారంభములో వచ్చిన రొమాంటిక్ పోయిట్రీ (కాల్పనిక కవిత్వం) ప్రభావము కన్పిస్తుంది. ఆంగ్లమున Lyrical Poetry ని తెలుగున భావ కవిత్వముగా ప్రారంభమున వ్యవహరించిరి. "ఆంగ్లమున Lyric అనగా 'Lyre' అనెడి జంత్ర వాద్యములో కలిపి పాడుటకు అనువైన గీతము. దానికి ఈ యర్థము తొలగిపోయి చిరకాలమైనది. ఇప్పుడు ఈ పదమును గీత

ప్రధానమైనట్టియు, ఆత్మభావ వ్యక్త రూపమైనట్టియు కవిత్వము అనెడి అర్థమున వాడుచున్నారని పింగళి లక్ష్మీకాంతం గారు వివరించినారు.

## 12.1 భావకవిత్వ నిర్వచనం

రాయప్రోలు వారి కావ్యములలో 'భావ పదము, భావ గీతము' పదములు తొలిసారిగా కనిపించుచున్నవి. తరువాత విశ్వనాధుని వారి గిరి కుమారుని ప్రేమ గీతములలో, కృష్ణ శాస్త్రి గారి ఊర్వశిలో భావగీతము ప్రయోగింపబడినది. గాడిచర్ల హరి సర్వోత్తమరావు గారు ఆంధ్ర పత్రికలో తరచుగా ఈ పదమును ప్రయోగింపగా, ఇది నవ్య కవిత్వమునకు పర్యాయ పదమైనదని, ఈ కవిత్వము వ్రాసెడి కవులు భావ కవులని పిలువబడిరని డా. గిడుగు సీతాపతిరావు గారభిప్రాయపడినారు. తృణకంకణములోని ప్రకాశికుల విజ్ఞప్తిలో 'భావకవిత్వ' పదము తొలిసారిగా వాడబడినది. కాల్పనిక కవితగా అభినవ కవితగా, గీత కవిత్వంగా వ్యవహరించబడిన నవ్య కవిత్వానికి భావ కవిత్వమన్న పేరు స్థిరపడిపోయింది. భావ కవిత్వమును నిర్వచించిన వారిలో విశ్వనాథ, పంచాగ్నుల, కవికొండల, శ్రీశ్రీ, సి. నారాయణరెడ్డి గణనీయులు. వారి అభిప్రాయములను ముందుగా తెలుసుకొందాము.

"కవి యొక్క ఒక అవిస్పష్ట వాంఛాంకురము, ఒక అంతర్నిగూఢ తాపము, ఒక చిన్న కావ్యములో ఊదబడినచో" అది భావకవిత్వమని, 'ఖండ కావ్యములు' ప్రధానముగా ఒక భావమును ఆశ్రయించియే యుండును. అందుచేత దీనిని భావ కవిత్వమన వచ్చునని విశ్వనాథ సత్యనారాయణ గారు నిర్వచించిరి. ఇది ఆంగ్ల విమర్శకులు Lyrical Poetry కి చేసిన నిర్వచనముతో తులతూగుచున్నది.

"భావము యొక్క కవితా స్వభావము భావ కవిత్వ" మని కవికొండల వెంకటరావు గారు నిర్వచించిరి. నవ్య కవిత్వమునకు ప్రముఖ వ్యాఖ్యాతలగు ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారు 'కవేర్భావః కవిత్వం' - భావ ప్రధాన కవిత్వం భావ కవిత్వమని కవికొండల వారి అభిప్రాయమునే బలపరిచిరి.

"హృదయాలను, మానసాలను కలవర పరుస్తూ అల్లకల్లోలంగా ఝూర్ణిల్లే ప్రమాద ప్రాంతరాలలో కవికి నిరాఘాటంగా విహరించే అధికారం కలదు. అట్టి అతని సంచారాలలో ఏ సమ్ముహూర్తాననో కావ్యగీతం ఒకటి మెరుగులు తీరిన విలక్షణ రచనా ధోరణిలో వెలుగు చూస్తుంది. ఆ గీతం కవి అనుభవించిన రసస్థాయిని సమగ్రంగా పాఠకునిలో ఆవిష్కరించ గలుగుతుంది. ఉత్కృష్ట భావ గీతానికి నా నిర్వచనం ఇది" అని శ్రీశ్రీ గారు అభిప్రాయపడినారు. అనగా కవి హృదయంలో తటిత్తు వలె అప్రయత్నముగా మెరసిపోయిన భావముల అక్షరాకృతియే భావ కవిత్వమని శ్రీశ్రీ గారి అభిప్రాయము వలన తేలిన సారాంశము.

"ఏదో ఒక భావాన్ని ఆధారముగా చేసుకొని అల్పావకాశంలో పూర్ణంగా రససిద్ధిని చేకూర్చేయత్నం" నవ్యులు చేయుదురని పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి గారి అభిప్రాయము.

'వస్తు భావ రచనలలో భావమునకు ప్రాధాన్యమిచ్చిన కవిత్వము' భావ కవిత్వమని 'ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు ప్రయోగములు' రచనలో డా. సి. నారాయణ రెడ్డి గారభిప్రాయపడినారు.

## 12.2 భావకవిత్వ స్వరూపము

'అంతర్ముఖత్వము' భావ కవిత్వము యొక్క ప్రధాన లక్షణము. దీని వలన కవి స్వానుభవమును వాడిగా వేడిగా, స్ఫుటముగా చెప్పుటకు అవకాశము కలుగును. ఈ కవితా మార్గమున మనస్సు పొరలలోని భావ రేఖలను, శబ్ద చిత్రముల ద్వారా వ్యక్తమొనర్చుటకు వీలు కలుగుతుంది. పద చిత్రములలోని క్రొత్తదనము, అనుభూతి, ప్రకటనములోని నవ్యలు - ఈ రెండు గుణములు భావ కవిత్వమును కొంత అస్పష్టంగా చేసినవి. అందుకే దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు 'ఏదియో అపూర్వ మధుర రక్తి

స్ఫురింయించు గాని అర్థమ్ము గాని భావగీతమ్ము' లనిరి.

అంతర్ముఖత్వము వలన భావ కవిత్వమున క్రింది విధమైన ఛాయలు స్ఫుటాకృతి దాల్చి నిలచిపోయిన వని ఆచార్య సి. నారాయణరెడ్డి గారు వివరించినారు.

1. స్త్రీ పురుషుల బాహ్య సౌందర్యమునకు బదులుగ ఆత్మ సౌందర్యము గుణ సౌందర్యము కవిత్వమున వర్ణ్యములైనవి.

2. కవితనకు కలిగిన సుఖ దుఃఖములను తెర మరుగు లేకుండ వెర్రిగా వెల్లడించుకొన్నారు.

3. ఒక్కొక్కప్పుడు అవస్థా భేదమును బట్టి కవికి కొండంత సహన మేర్పడినది. దానికి తోడు దార్శనిక దృక్పథమలవడినది.

4. ప్రకృతి వర్ణనలలో బాహ్య విషయములకు బదులుగా సుకుమారమైన సౌందర్య తత్త్వమును నిర్దేశించుట జరిగినది. అనగా చర్మ చక్షువునకు కనిపించిన ప్రకృతి కాక మనో నేత్రమునకు భాసించిన ప్రకృతియే వర్ణ్యమైనది.

5. జాతికి సర్వాంగ వికాసము కలిగించి సంప్రదాయ సిద్ధమైన సంస్కార దృష్టి కలిగినది. పూర్వజన్మ వాసనలు మరల ఊపిరి పోసికొన్నవి.

6. తాను విన్న, కన్న, ఏ భిన్న సంఘటనైనను తన హృదయ తంత్రులను జుమ్మనిపించి కవిత్వా రూపమున వెలిజిమ్ముకొని వచ్చినది.

7. ఆత్మార్పణ తత్త్వము, ఆరాధనా తత్త్వము పాదులు దన్నుకొన్నవి. అంతశ్చేతనము లోని చైతన్యము హద్దులు త్రెంపుకొని వెలువడినది.

8. సామాన్యమైన లౌకిక సంతోషమునకు బదులుగా సర్వే సర్వత్ర అలౌకికానందము అంచులు దార్చికొన్నది. చిత్ర కవిత్వమును భావకవి నిరసించుటలో ఈ ఆంతర్యమే యున్నది.

9. కవి తన కొలబద్దలతో జీవితమును కొలుచుట మాని తన వ్యక్తిత్వమును విస్మరించి, ఇతరుల సుఖదుఃఖములో లీనమై పోయెడి స్థితి యేర్పడినది. దీనినే కేట్సు 'Negative Capability' అనెను. ఇది భావ కవిత్వములో కాననగును.

ఈ భావ కవిత్వమన్నది ప్రాచ్య పాశ్చాత్య సాహిత్యములో రేఖా మాత్రముగా మొదటి నుండియు ఉన్నదే. ప్రాచీన కవిత్వలో భావ కవిత్వ రేఖలున్నను అవి అప్రధానముగా నుండిపోయినవి. భావ కవిత్వముపై ఆంగ్ల సాహిత్యములో పందొమ్మిదవ శతాబ్ది ప్రారంభములో వచ్చిన Romantic Poetry (కాల్పనిక కవిత్వము) ప్రభావమున్నది.

## 12.3 భావకవిత్వ శాఖలు

భావ కవిత్వములోని శాఖలనీవిధముగా విభజించవచ్చును. (1) ప్రణయ కవిత్వము (Love Poetry), (2) ప్రకృతి కవిత్వము (Nature Poetry), (3) భక్తి కవిత్వము (Mystic Poetry) , (4). దేశభక్తి కవిత్వము (Patriotic Poetry), (5). సంఘ సంస్కరణ కవిత్వము (Reformative Poetry), (6). స్మృతి కావ్యములు (Elegies). ఇది స్థూల విభజనము మాత్రమే.

## 12.4 ప్రణయ కవిత్వము (Love Poetry)

ప్రాచీన కవులు, లాక్షణికులు 'ప్రణయ' శబ్దమునకు స్త్రీ పురుషుల మధ్య గల శృంగారమే కాక సాధారణ 'స్నేహ'మను అర్థములోను వాడిరి. భావ కవిత్వములో 'ప్రణయము' నాయికా నాయకుల మధ్య గల 'ప్రేమ' పరముగా వాడబడినది. భావ

కవిత్వము సంయోగ వియోగ శృంగారములలో వియోగ శృంగారమునకే ప్రాధాన్యమిచ్చినది. భావ కవులు ప్రేయసీ ప్రియులకు పార్వతీ పరమేశ్వరత్వమును ఆపాదించారు. వీరి సంయోగ శృంగారము సభ్యతా పరిధిలోనే ఉండిపోయినది. వీరి దృష్టిలో స్త్రీకి పూజ్య స్థానము కలిగినది. స్త్రీని కేళీ పదార్థముగా కాక సహచరిగా, ప్రేయసిగా, ఇల్లాలుగా భావించిరి. వీరు చిత్రించిన నాయికా నాయక ప్రణయము శృంగారావధిలోనే స్నేహమాధుర్యమును చవిచూసినది. భావ కవులలో ప్రణయ సంకీర్తనము చేయని కవి లేడని చెప్పవచ్చును. భావ కవులను ఆంగ్ల కాల్పనిక కవిత్వములోని స్వచ్ఛంద ప్రణయము ఆకర్షించింది.

భావ కవులలో కొందరు తాము చూచిన స్త్రీని గురించి, కొందరు తాము ఊహించుకొనిన సౌందర్యమునకు సంకేతముగా ఒక ఊహా ప్రేయసిని సృష్టించుకొని ఆమె చుట్టు కవితలల్లారు. మరికొందరు ప్రేమ విఫలమై ఆశాభంగము పొంది వియోగ విషాద గీతికలను ఆలపించి, ఆ విషాదమునే వరించి, భావశాంతి పొంది, ఒక అలౌకిక జగత్తును కల్పించుకొని, ఆ జగత్తులో ప్రత్యణువులో తన ప్రేయసీ స్వరూపము దర్శించి ఆరాధించిరి. ఈ రకంగా భావ కవిత్వంలో ప్రణయము, ప్రేయసి, అనేకావస్థల నధిగమించినవి.

భావ కవిత్వములో ప్రణయ కవిత్వం రెండు విధములుగా నున్నది. కథ, పాత్రలున్న కవిత్వాన్ని వస్త్వాశ్రయ రీతి అని, ఇవి లేనిది ఆత్మాశ్రయ రీతి అని చెప్పుకోవచ్చును.

### 1. వస్త్వాశ్రయ రీతి (Objective trend)

వస్త్వాశ్రయ రీతిలో చక్కని ప్రణయ కవిత్వమందించిన కవులు కొద్ది మంది ఉన్నారు. ఉన్న కొన్ని కావ్యములలో ఉత్తమమైనవి రాయప్రోలు వారి లలిత, తృణ కంకణం, కష్టకమల, స్నేహలత, అబ్బూరి వారి మల్లికాంబ, దువ్వూరి రామిరెడ్డి గారి 'కడపటి వీడ్కోలు' వేంకట పార్వతీశ్వరుల జలజమాలిక, కాళ్ళకూరి గోపాలరావు గారి స్నానఘట్టము, కొడవటిగంటి వెంకటసుబ్బయ్య గారి 'భిక్షువు' ఎన్నదగినవి.

రాయప్రోలు వారి కావ్యాలలో ప్రణయం ప్రధాన వస్తువుగా గల కావ్యాలు లలిత, తృణ, కంకణం, కష్ట కమల, స్నేహలత, వియోగ శృంగారములోని పావిత్ర్యాన్ని దృష్టిలో పెట్టుకొని రాయప్రోలు వారు 'అమలిన శృంగారమ' నే క్రొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు.

శృంగారము గృహస్థాశ్రమ ధర్మములలో ముఖ్యమైనది గృహస్థాశ్రమమున శృంగారమును సంతాన తంతువు కొరకు నిర్వర్తించుట రాయప్రోలు వారికి సమ్మతమే. కాని, శృంగారమునకు పరమార్థము సంయోగమన్న భావమును రాయప్రోలు అంగీకరించలేదు.

"సురత సంస్పర్శ లేని ఈ శుచి మదమల
జీవితాను రాగాదులన్ చిలకరించు
కానరాని శృంగారము . . . . . . . . "

"శృంగారః శుచిరుజ్జ్వలః" అన్న ప్రాచీనుల సూక్తియే వీరి అమలిన శృంగారమున కాలంబనము. సురత స్పర్శ లేని శుద్ధమైన అనురాగము గల "అబోధ శృంగారము" సర్వోత్తమ మైనదనిరి. ఉత్తమ సంస్కారులైన దంపతులు శరీర విముక్తమైన సౌందర్యము నర్చించ వలెనని రాయప్రోలు వారి అభిప్రాయము. వయసు గడచుకొలది వారి శృంగారము స్నేహ పర్యావసాయి కావలెనని వీరి సిద్ధాంతము. వారి కావ్యములలో తృణ కంకణము అమలిన శృంగారమునకు ముఖ్య గ్రంథము.

"కనుల నొండొరులను జూచుట కన్న
మనసులన్యోన్య రంజనల్ గొనుటకన్న
కొసరి 'యేమోయి' యని పిల్చుకొనుట కన్న

చెలుల కిల మీద నేమి కావలయు సఖుడ"

అని తృణ కంకణ నాయిక చేత అనిపించినారు. ఒకనాటి ప్రేమికుల మధ్య ఉన్న ప్రేమ, తరవాత స్నేహంగా పరిణమించడం తృణ కంకణలో చిత్రించబడినది. రాయప్రోలు వారు శృంగారానికి, ప్రేమ వాత్సల్యాలకు లంకె వేశారు. స్త్రీ లోని మాతృమూర్తిత్వమును, దైవతాంశమును దర్శించి స్వప్నకుమారాది కావ్యముల ద్వారా నిరూపించిరి. పద్మ భ్రమరాల కనాదిగానున్న ప్రేయసీ ప్రియు సంబంధం త్రోసివేసి దానిని వాత్సల్య సూత్రములో ముడివేసిరి.

"సందెలను దారి దప్పు మిళింద సుతుల
తెనె పొలిచ్చి చీకట్ల దిరుగ నీక
ఉదయమగుదాక యెడిలోన నిదుర బుచ్చు
చేరదీసిన మమతకు చిక్కి నళిని"

ఆధునికాంధ్ర కవిత్వంలో స్త్రీ సమారాధనా తత్త్వమునకు రాయప్రోలు వారే మొట్టమొదటి ఆచార్యులు. రాయప్రోలు వారి 'అమలిన శృంగారము' అవహేళన పాలుగాకున్నను, అంతగా ఆదరము పొందలేదు. వీరిని సమర్థించి ఎవ్వరును కావ్య రచన చేయలేదు. కాని, అమలిన శృంగారమనే క్రొత్త సిద్ధాంతమును స్థాపించిన గౌరవము మాత్రము రాయప్రోలు వారికే దక్కినది.

అబ్బూరి రామకృష్ణారావు గారి 'మల్లికాంబ'లో ప్రణయ లేఖల మూలమున గలిగిన భ్రాంతిలో పండు వంటి సంసారమున కలిగిన ఉపప్లవము చిత్రింపబడినది. ఈ కావ్యములో కమలకు మల్లికకు జరిగిన సంభాషణలో ప్రణయ తత్త్వము చెప్పబడినది. వెంకట పార్వతీశరుల "జలజమాలిక"లో ప్రధాన వస్తువు ప్రణయమే. చిన్ననాటి చెలిమికాండ్రు ఏ విధముగా పరిస్థితులు అడ్డురాగా విడిపోయారో, వారి పచ్చని బ్రతుకులే విధముగా పసివాళ్ళాడిపోయినవో చిత్రింపబడినది. మేనత్త కొడుకగు చంద్రశేఖరునితో చిన్ననాటి నుంచి ప్రేమించిన అన్నపూర్ణ, పెద్దవాళ్ళ ఆటంకముతో వివాహము విఫలము కావడంతో, బావకు ఉత్తరం రాసి ఆత్మహత్య చేసుకుంటుంది. లేఖ చదివిన ఆమె బావ 'ప్రకృతిలో లీనమైన ప్రణయ స్వరూపిణిగా' భావించుకొని "జన్మ జన్మంబునిట్లె నా సకియ వగుచు, మదవతీ! శాంతి సుఖము నందెదవు గాక' అని తనను తాను ఓదార్చుకుంటాడు. పాపవంతులై చరించెడు పరుల కొఱకు అచ్చపుం బ్రేమ నాశనమగుట తగదను సందేశం ఈ కావ్యమందించుచున్నది.

దువ్వూరి రామిరెడ్డి గారి 'కడపటి వీడ్కోలు' శారదయను ఋషికన్య, గౌతముడను ఋషి కుమారుడు బాల్య సఖులు. ఇరువురికి బంధము పొసగలేదు. చివరకు విధి ఇరువురిని కాల ప్రవాహములో కలిపివేసినది.

"ఎంత పుణ్యంబు చేసెనో యీ స్రవంతి
ప్రేమ వాంఛల రెంటిఁ జీర్ణించికొనగ"

అన్న కవి వాక్యములో ఈ కావ్యమును విషాదాంతముగా ముగిసినది. కాళ్ళకూరి గోపాలరావు గారి 'స్నానఘట్టము'లో సౌందర్యము సందర్శనమునకే కాని సంస్పర్శనము కాదను లక్ష్యముగా రచింపబడినది. కొడవటిగంటి వెంకట సుబ్బయ్య గారి 'భిక్షువు' వస్త్వాశ్రయ రీతిలో రచింపబడినదే.

## 2. ఆత్మాశ్రయ రీతి (Subjective trend)

కృష్ణశాస్త్రి గారి కృష్ణపక్షమూ, నాయిని సుబ్బారావు గారి సౌభద్రుని ప్రణయ యాత్ర వేదుల సత్యనారాయణ శాస్త్రి గారి 'దీపావళి' విశ్వనాథ వారి 'గిరి కుమారుని ప్రేమ గీతాలు' కిన్నెరసాని పాటలు' మొదలైనవి ఆత్మాశ్రయ రీతికి చెందినవి.

### స్వచ్ఛంద ప్రణయము

భావ కవులు ప్రేమ అన్నది ప్రాణికి సహజ లక్షణమని భావించిరి. భావ కవి స్వచ్ఛమైన స్వచ్ఛంద ప్రణయమును తన జీవిత ధ్యేయముగా పెట్టుకొని, అందుకు అనుగుణమైన ప్రేయసి నన్వేషించి ఆమె నారాధించును.

సౌరభము లేల చిమ్ము పుష్పవ్రజంబు?
చంద్రికల నేల వెదజల్లు చందమామ?
ఏల సలిలంబు పాఱు? గాడ్పేల విసరు?
ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను?

పువ్వు లెందుకు సౌరభము చిమ్మునో? చందమామ ఎందుకు వెన్నెల వెదజల్లునో, సలలమేల పాఱునో, గాడ్పేల విసరునో, ఆ కారణము చేతనే నేను నిన్ను ప్రేమింతునని భావ కవి ప్రేయసితో తెలుపుచున్నాడు. కృష్ణపక్షములో దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు ప్రేయసితో వ్యక్తం చేసిన భావన ఆత్మాశ్రయ రీతికే అందచందాలను తెచ్చి పెట్టింది. బసవరాజు అప్పారావు గారు పవిత్రమైన ప్రణయమునకు హేతువుండదని, అది అందపు తళుకుల కతీతమైన దని, "ఆత్మను ఆత్మను కలిపి కుట్టు దారమే నాడు ప్రేమకు గారణమ్ము" అని, 'లోకముతో మన కేటికి లోలాక్షి రాపోదుము" అని గానం చేశారు.

### పూర్వ రాగం

తాను ప్రేమించిన సుందరి తన కెప్పుడు వశమగునోయని భావ కవి ఎదురు తెన్నులు చూచును. తన ప్రేయసికి సంఘము, విధి అడ్డు రాకుండు గాక యని దైవమును ప్రార్థించును.

"ప్రకృతి కాంతాధర రసమ్ము వడియి గట్టి
పోత పోసినట్లుప్ప నొప్పు లగులాచి,
క్రూర కంటక హతి సొంపు గోలుపోక
కన్నులకు విందొనర్చెడు కాలమెపుడో"

అని సౌభద్రుని ప్రణయ యాత్రలో నాయని సుబ్బారావు గారు ఆందోళన చెందారు. ఈ విధముగా ఆందోళన పడిన భావకవి తన అప్రాప్త మనోహరి అనుగ్రహ వీక్షణము కోరుకొనును. పూర్వ రాగావస్థలో కవి ఆమె దర్శన భాషణములతోనే తృప్తుడగును.

### సంయోగ దశ

పూర్వ రాగము తర్వాతది సంయోగ దశ ప్రేయసీ సమాగమం కొరకు కవి ఉవ్విళ్ళూరుచుండును. "ఆ మబ్బు ఈ మబ్బు ఆకాశ మధ్యాన అడ్డుకున్నట్లు మనమైక్యమౌదామే" అని ప్రేయసిని ప్రియుడు ప్రార్థించినట్లు బసవరాజు అప్పారావు గారు ఆలపించారు. వేదుల సత్యనారాయణ శాస్త్రి గారు 'దీపావళి'లో మూఢ విశ్వాస శ్రుంఖలములను ఛేదించుకొని వలపు కౌగిట ముడి పట్టుబడినచో 'తమ శరీర సుఖ స్పర్శనమునకు' అణువు అణువు కూడ నవజీవన మనభవించునని, తాము నేగు బోకలో రాలు పూల జత వోలే ఆనంద ప్రపూరములో జన్మ జన్మాల యాత్ర సాగింతుమని" ప్రేయసితో నివేదించును. ప్రేయసి ప్రియుని వలపు విన్నది. ఆ ప్రేమజీవుల జన్మాంతర సౌహృదము ఒక్క మాటు గుబాళించినది. 'ప్రకృతి సౌధపు దక్షిణ ద్వారమంత తెఱచుకొని వచ్చి' మృదాల పవమాన పరిమళోర్మికలు వారిని దృఢాశ్లేషములో బిగించగా, వారు లౌకిక బంధములు త్రెంచుకొని 'యుగ యుగముల ప్రేమ వియోగ భార కూర్చి వైచుచు లోకము మాటయే మరచి శరదయోత్సవములలో మైమరచిపోయిరి అని దీపావళిలో కన్పిస్తుంది.

ఇట్టి అపూర్వ సంయోగమాధుర్యమును ప్రేయసీ ప్రియులనుభవించినట్లు భావ కవిత్వము చిత్రించినది. భావ కవిత్వము లోని సంయోగ దశ చుంబనావస్థను దాటిపోలేదు. ఆ చుంబనమును కూడ చమత్కారముగా వర్ణించిరి.

"బింబి ఫలములబోలు నీ పెదవులెపుడు
ఈ యధరమంటి వేడి ముద్దిచ్చె, నపుడే
అంకింతంబయ్యె నా హృదయంబు నీకు
నృపతి ముద్రాంకితంబైన లేఖ యిట్లు"

**ఆశాభంగము, విప్రలంభము**

తాను ప్రేమించిన సుందరియును, తాను కలయకముందే, ఆమె తనకు కాకుండపోగా, ప్రియునికి కలుగు ఆందోళనము భావ కవిత్వములో ప్రధానముగా చిత్రింపబడినది.

"తళుకు మని కనిపించి వలపు వెల్లువ ముంచి
వలపించి మాయమై వనట గూర్చితివా"

అని ఆశాభంగాన్ని వ్యక్తం చేశారు కృష్ణ పక్షములో కృష్ణశాస్త్రి గారు. తమ స్వచ్ఛంద ప్రణయమున కట్టవచ్చిన పరిస్థితులకు,

"ఎవ్వరే రాక్షసుడు మన మీదనున్న
యవధియంతయుఁ దానమై యాక్రమించి
వికట దంష్ట్రా భయంకర వికృత వదన
విషయ హాసుండు నన్నిట్లు వెక్కిరించు"

రాక్షసత్వ మంటగట్టినాడు సౌభద్రుని ప్రణయ యాత్రలో నాయిని సుబ్బారావు. తన ప్రేయసి కొరకు మిన్ను, మన్నంతయు గాలించగా, కానరాక, కవి నిరాశ నిహులుడై, వియోగ దందహ్యమానుడై వేయి కరములు సాచికొని, వేయి కన్నులు విరిసికొని, వేయి గుండెలు కొట్టుకొనగా ప్రేయసి కొరకు వేచి,

"కంటి రెప్పలు మింటి కప్పుల
నంటి పోయె నిరీక్షణంబున
ఫాల తలమున రక్తనాడులు
భగ్గు భగ్గున మండుచున్నవి"

అని తన బాధను వ్యక్త పరచినాడు మల్లవరపు విశ్వేశ్వరరావు గారు వేదుల సత్యనారాయణ శాస్త్రి గారు. చంద్రునుద్దేశించి-

"విరిసిన పూల వెన్నెలలు వెల్లువఁ జక్కదనాల హంసలై
యరిగెడు నిన్ను జూచి నిశలందున నాకగు భాష్ప శాంతి"

అనెను. ప్రకృతిలోని ప్రత్యాంగము బత్తశమనము గూర్చునదిగా కన్పించును.

**విషాదస్థితి**

భావ కవిత్వములోని విప్రలంభ శృంగారములో విషాద భావన పరాకోటి నందుకొన్నది. కవి ప్రణయ జీవితము లోకము

యొక్క నిష్ఠుర పద ఘాతములో నలిగిపోయినది. అతనికి అతని ప్రేయసికిని మధ్య కాలరాక్షసుడు ఇనుప తెరలు వ్రేలాడదీసినాడు.

"వికృత హాస కరాళ దంష్ట్రికలు మేరయ
నీల కైశిక కాళి మమ్మోలగింప
ఒక్క యెడ విస్ఫులింగములు మిసికొనుచు
తొంగి చూచుచున్నది దుఃఖ దేవి" (పెనుమర్తి)

కవి తన జీవితములో ఇక సుఖము లేదని గమనించినాడు. ప్రకృతి కూడ ఉపశాంతిని ప్రసాదించలేని దశలో వేదనామయ కవితకు మరో పేరైన వేదుల సత్యనారాయణ శాస్త్రి గారు

"దారుణపు జీవితంపు టెడారిలోన
తీరని పిపాస నేదారి తెన్ను లేక
నేనె నా దుఃఖ భాష్ప శోణి తలహారుల
నే విసుగు వేసటలు లేక త్రావినాను"

అని తన దుఃఖోద్వేగమును ప్రకటించినాడు. లజ్జా విషాద దురంత భాదవహనమున కోర్వక, అతని బ్రతుకు పాతాళలోకంపు టిరుకు సందులకు దిగబడి పోగా భరింపలేక 'దుర్భర శోక విషమ గీతు లేడ్చి వైతు ఎలుంగెత్తి యేడ్చి వైతు' నన్నాడు. ఈ విధముగా దుఃఖ పీడితుడైన కవి ఒకానొక విచిత్ర మనః స్థితికి లోనై, నైరాశ్యమును వరించినాడు.

'నాకు గాదులు లేవు నాకుషస్సులు లేవు
నేను హేమంత కృష్ణానంత శర్వరిని'

అని చెప్పుకొన్నాడు.

### పలాయన తత్త్వము - నిరాశావాదము

విషాద స్థితి విషమించగా భావ కవికి ఈ ప్రపంచము దుఃఖమయముగా కన్పించి, జగత్తు నుండి దూర దూరాలకు మిన్నుల కెగసిపోవాలని పలాయన తత్త్వము ప్రబలినది. చంద్రునితో "ఈ యామిని మాత్రమే తిరుగు లాడెదనే జిఱు మబ్బు వోలె నీతో మనసార నొక్క పరి దోడ్కొని పొమ్మిటకో సుధాకరా! అని మొరపెట్టుకొన్నాడు. సంధ్యాసమీరము నుద్దేశించి -

ఓయి, సంధ్యా సమీరణా, రేయి తోడఁ
గారు చీఁకటి తోడ దుఃఖము కూడ
పరువు పరువున నాకొఱ కరుగుదెంచుః
నీదు నును లేత ఱెక్కల మీద వడిగ
నెత్తికొని పోవరాదే నన్నెచట కేని"

అని కృష్ణశాస్త్రి గారు యాచించినారు.

### విషాధ మాధురి

విషాధ నిర్భరమైన కవి మనస్సులో ప్రకృతి కూడ ఓదార్పునీయని సమయములో భావకవి దుఃఖమును తనకు తోడునీడగా

భావించినాడు.

"ప్రేమ దాహాన నెడద తపించుకొలది
అమృత మొలకింతు స్మిత నయినాంచలముల"

అని దుఃఖములోనే ఆనందమును వేములవారు దీపావళిలో ప్రదర్శించినారు. విషాదమును ఆనంద రసామృతముగా మలచుకొని శక్తి కరిగిన పిమ్మట కవి 'దరిద్ర కుటీరాంగణమ్ము'న చైత్ర ప్రభాత పరిమళములు విరిసినట్లు పొంగి పోయినాడు. కవి మనస్సులో క్రొత్త ఆశలు రెక్కలు తొడుగుకొన్నవి.

"పూల చిరునవ్వులలో పొంగిపోవు వలపు
గాలి యూర్పుల చిఱు తరంగాల వలపు
చివురు జొంపాల వెచ్చని కవుగిలింత
పులుగు గొంతుక తీయని పులకరింత
నేడె నా హృదయమ్ములో నిండిపోయె"

అని కవి వసంత కోకిలయై ఆనంద కుహూ కూజితముల వేలార్చినాడు.

## ఊహా ప్రేయసీ సృష్టి

కవి దుఃఖములోనే ఆనంద రేఖలను దర్శించి, తన మనస్సులోని విషాదనీల యవనికను తొలగించి, తనలోని సౌందర్య తృష్ణకు మూర్తి కల్పనము చేసికొన్నాడు. ఊహా ప్రేయసిని సృష్టించుకొన్నాడు. కృష్ణశాస్త్రి గారికి ఊహా ప్రేయసి "ఊర్వశి" గా సాక్షాత్కరించింది. మల్లవరపు విశ్వేశ్వరరావు గారికి 'విద్యున్నారి'గా, జీవన దేవతగా, ఇంద్రజాతిగా, ఉరుతిమిర మరసంచారిణిగా, నీరద రథ సంచారిణిగా, ధీర విషాదకారిణిగా, బహుభంగుల భాసించినది. వేదుల వారికి ఊహా ప్రేయసి 'కవి భావనా విలాసినీ నిత్య సైరంధ్రిగా' స్వప్న లోకరాజ్ఞిగా సాక్షాత్కరించింది. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారికి ఊహా ప్రేయసి 'తపఃఫల సిద్ధి మూర్తి'గా బాపిరాజు గారికి 'శశికళ'గా భాసించినది. ఈ విధముగా భావకవులు పలువురు తమ సౌందర్య తృష్ణకు తగినట్లుగా ఊహా ప్రేయసులను సృష్టించుకొని చిత్తశాంతిని పొందిరి.

## ప్రేయసీ పూజ్యత

భావ కవిత్వములో భావ కవులు ప్రేయసికి పూజ్య స్థానము లభించినది. వీరిలో రాయప్రోలు వారు ప్రథములు. దీపావళిలో వేదులవారు ప్రేయసిని అంతరంగ శాంతి దేవతగా, ఆశాపథాంతరాళ పారిజాతముగా, తపఃకల్పవల్లిగా భావించిరి. నాయిని సుబ్బారావు గారు ప్రేయిసిని దేవతగా భావించి,

'దైవతవు నీవు నీదు ప్రత్యక్షమునకు
గడియ లెంచుచు నుండు భక్తుడను నేను'

అనిరి. తల్లావజ్ఝల వారు 'నీ పాద యుగళి ధ్యేయమ్మునా' కనెను.

## కులపాలికా ప్రణయము

విశ్వనాథ వారి 'గిరి కుమారుని ప్రేమ గీతాలు' నాయని వారి 'సౌభద్రుని ప్రణయ యాత్ర' 'ఫలశ్రుతి' అను కావ్యములు కులపాలికా ప్రణయ చిత్రణకు ప్రతినిధి కావ్యములో భావ కవులలో కులపాలిక శృంగారమును దివ్య స్థాయికి తీసికొనిపోయి,

దంపతులకు ప్రకృతి పురుష భావము సమన్వయించిన కావ్యములు గిరి కుమారుని ప్రేమ గీతాలు, సౌభద్రుని ప్రణయ యాత్ర. ఈ కావ్యములలోని నాయికా నాయకులు ఇంద్రియాతీతమైన నిర్మల ప్రేమ యందు సమాధి పొంది, ఆనంద పీయూషమును సాధించినారు.

## 12.5 ప్రకృతి కవిత్వము (Nature Poetry)

దృశ్యమానమైన స్థావర జంగమాత్మకమైన జగత్తంతయు ప్రకృతి యని స్థూలముగా భావించవచ్చును. ప్రకృతి వర్ణనము కవితావతరణము నుండి ప్రారంభమైనదనవచ్చును. వైదిక ఋషులు పాడిన ఋక్కులు ఇట్టివే. వేదములలోని ప్రకృతి వర్ణనలు చాలవరకు స్వభావోక్తి రమ్యములు ఆదికావ్యమైన రామాయణములో ప్రకృతి వర్ణన సర్వతోముఖముగా భాసించినది. ప్రాచీనాంధ్ర కావ్యములలో ప్రకృతిని స్వభావోక్తి రమ్యముగానే చిత్రించిరి. ప్రబంధాలలోని ప్రకృతి చిత్రణలలో కొన్నిచోట్ల సహజత్వ తగ్గి కృతిమత్వం చోటుచేసుకొంది. వాల్మీకిలోని స్వాభావికత, కాళీదాసులోని భావుకత, పురాణ కవులలోని సాధుత, ప్రబంధ కవిత్వంలోని ప్రకృతి వర్ణనలలో లోపించినవి. నవ్య కవుల దృష్టిలో ప్రకృతి చర్మచక్షువును దాటి హృదయ నేత్రములో ప్రవేశించినది. అనగా కంటికి కనిపించిన ప్రకృతి కాక గుండెకు స్ఫురించిన ప్రకృతియే వారికి వర్ణ్యమైనది. భావకవులను ప్రకృతి దేవతామతల్లియై చేరదీసి లాలించినది, గురువులా దీవించినది, మిత్రునిలా ఓదార్పునిచ్చింది.

### కాల్పనిక కవిత ప్రకృతి

ప్రకృతి అంటె ప్రీతి, ప్రకృతిని ఆరాధించడము, మొదలగునవి ఇంగ్లీషు కాల్పనిక కవుల ప్రధాన లక్షణములు ప్రకృతిని ఆరాధనచేసిన కాల్పనిక కవులలో (Wordsworth) వర్డ్సువర్తు ప్రముఖుడు. నగర జీవితంలో విసిగిపోయిన ఆంగ్లేయులకు ప్రకృతి ఉపశమనముగా, తోడునీడగా కన్పించింది. ప్రకృతి దర్శనములో ఆంగ్ల కవులు అంతర్ముఖత్వాన్ని పొందారు. ప్రకృతిలో తాదాత్మ్యం చెందారు. కాల్పనిక కవులకు ప్రకృతి ఎన్ని విధాలుగా కన్పించినదో అన్ని విధాలుగా చిత్రించారు. ఆంగ్ల కాల్పనిక కవుల ప్రభావము భావకవుల ప్రకృతి కవిత్వముపై విశేషముగా పడినది.

### భావ కవిత్వములో ప్రకృతి

భావ కవికి ప్రకృతియే కవితా రచనకు ప్రేరణమైనది. ప్రకృతియే అనేక రూపములలో ప్రత్యక్షమై అతనిలోని కవితా శక్తిని ఆవిష్కరించినది. వేంకట పార్వతీశ్వరుల కవులకు ప్రకృతి

> "రమణ నొకసారి నీలాంబరము దాల్చి
> చెలగి యొకసారి వెన్నెల చీర దాల్చి
> పొసగ నొకసారి మంచు మేల్ముసుగు దాల్చి
> లీలనొకసారి మేఘ మాలికను దాల్చి
> గడియకొక రీతిగా నలంకార సరణి
> నెఱపుచున్నది ప్రకృతి నీనికటమందు"

అనేక విధాలుగా దర్శనమిచ్చింది. ప్రకృతి పురుషుల భేదములు దేవుని పూజించుట ఎంతయో, చెట్టును పూడించుట అంత విలువని భావ కవుల భావన. గడ్డిపూలను చూచి ఆనంద పరవశుడగును. పూలను త్రుంచుట సైతము భావ కవి సహింపలేడు. ఈ ప్రకృత్యాధిక్యమే భావకవిని వినమ్రమునిగా చేసినది.

ప్రకృతిని ఆనంద హేతువుగా భావించి, ప్రకృతిలో లీనం కావాలని ఆరాటపడటము 'ఆకులో ఆకునై' పూవులో పూవునై,

కొమ్మలో కొమ్మనై ఈ యడవి దాగిపోనా' యని కృష్ణ శాస్త్రి గారు తహతహలాడారు.

'పగడాల చిగురాకు తెరచాటు తేటినై
పరువంపు విరిచేడే చిన్నారి సిగ్గునై'

అని కృష్ణశాస్త్రి గారు అడవిలో దాగిపోవలెనని ఉత్కంఠ చూపినారు. తాను 'కలవిహంగ పక్షముల తేలియాడునని' 'తారకా మణులతో తారనై మెరియుదునని' 'మెయిలు దోనెల లోన పయనం బొనర్చెదనని, చివరకు' పాడుచు చిన్కునై పడిపోదునని' ఎలుగెత్తి చాటినారు. ఎవ్వరైనా నవ్వుకొన్నచో 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు' అని లోకమును విదిల్చివేసిరి.

దువ్వూరి రామిరెడ్డి గారు -

"సాంధ్య కిమ్మీర వర్ణన వస్త్రములు దాల్చి
గిరితట విహార శృంగార కేళి సొలసి
రమణఁ జరియించు జలధర్భకునిగా గ
నేల సృజియింపడో నన్ను నీశ్వరుండు"

ప్రకృతిగా తానెందుకు జన్మింపలేదే యని వాపోయారు. అదే విధముగా 'తుహినాంబు కళిగా' మలయూటకాల్వగా 'కలువ'గా చుక్కగా ఈశ్వరుడు తాన్నెందుకు సృష్టించలేదని బాధపడును.

అబ్బూరి వారు ప్రకృతిని ప్రణయోద్దీపకముగా భావించి 'ప్రేయసీ లేచి రమ్ము చివురించిన మావుల క్రింద' అని ప్రకృతి లోనికి ప్రేయసిని ఆహ్వానించారు. నాయిని సుబ్బారావు గారికి 'తెనెలు, మంచుబొట్లు' కలిసిపోగా 'ప్రణయ శృంగారము' స్ఫురించినది.

'చికిలి పూదేనెలకు తుషార కణములకు
నేమి సంబంధ భాందవ్య మీ శరత్ప్ర
భాత వేళా వికాసి పుష్పముల కొనల
కలసికొన్నవి ప్రణయ శృంగార మేలయ'

పూదేనెలు, తుషారకణములు కలిసిపోవుటలో శృంగారమున్నదని భావించుటలో ప్రణయ కవి స్వానిభావము ద్యోతక మగుచున్నది. ప్రకృతికి దుఃఖోపశమనము కలిగించగల శక్తిని గ్రహించి, ప్రకృతిని భావకవి గురువుగా గ్రహించినాడు.

"శ్యామలాకాశ ఫలకమునందుఁ దరళ
కాంతి వెదజల్లు తారకాక్షరము లొనర
విశ్వ వైశాల్య బోధక విద్య నేర్పు
శర్వరీ గర్భ శాంతి యెజ్జగ విధింప"

అని దువ్వూరి రామిరెడ్డి గారు ప్రకృతికి తన గురువుని వెల్లడించినాడు.

ఈ విధముగా భావకవులకు ప్రకృతి అనేక విధములుగా భాసించి, వారిలో అనేకానుభూతులను రేకెత్తించినది. వారు తమకు గల విభిన్న మానసిక ప్రవృత్తులను ప్రకృతిలో సమన్వయించుకొని తృప్తులైరి.

### 12.5.1. పల్లీ జీవన చిత్రణము

### పల్లీయ ప్రకృతి

మన ప్రాచీన కావ్యములలో పల్లీయ ప్రకృతి చిత్రణము చాల తక్కువ. శ్రీకృష్ణ దేవరాయలు ఆముక్తమాల్యదలో పల్లీయ ప్రకృతి చిత్రణకు పాదులు వేసినాడు. ఆధునికి కవిత్వములోనే పల్లీయ ప్రకృతికి అంగిత్య భాగ్యము కలిగినది. భావ కవిత్వములో పల్లీయ ప్రకృతిని చిత్రించిన వారిలో విశ్వనాథ, పింగళి, కాటూరి, దువ్వూరి, కవికొండల, బాపిరాజు ముఖ్యమైనవారు. విశ్వనాథ వారి 'ఋతు సంహారము' న ఆయా ఋతువులలో పల్లె పట్టులలోని బహిః ప్రకృతిలో, ప్రజల జీవిత రంగములో జరుగు మార్పులను, పల్లీయ ప్రకృతిని 'రసపు గూళ్లైన' తెలుగు పలుకు బళ్ళలో రమణీయముగా చిత్రీకరించిరి. ప్రభాత సమయమున పల్లెటూరిలోని వివిధ దృశ్యములను కాటూరి వేంకటేశ్వరరావు గారు కన్నులకు గట్టినట్లు ఈ విధముగా చిత్రించినారు.

"తొలికోళ్ళ యెచ్చరింతలు రెక్కలల్లార్చి
        ములుకోళ్ళ గేములు మాటెలుగు సూప
మును మున్న మేల్కొన్న ముది యవ్వ కరురఝుం
        కృతి సుతిగా నూలికృతులు వాడఁ
గర కంకణ ధ్వనుల్ కవ్వంపుఁ జప్పుళ్ళ
        బెరయగా నిల్లాండ్రు బెరుగు దరవఁ
బులుగుల కలకలమ్ముల తోడఁ గలయంపి
        సవ్వడుల్ తీయనై సందడింప

మోటి గిలకల రవళిలో దోటలకును
జలముతోడు బలీ వర్దములనుఁ గాపు
లదలుపన్ మోకు జవ్వాట లాలకించు
చల్లన న్మేలు కాంచు మా పల్లెటూరు"

### పల్లీజన ప్రకృతి

(ఎ) కర్షకులు - పల్లీయులలో కర్షకులు, కోత కూలీలు (పాలేర్లు) గొల్లవారు, పడవ సరంగులు, పశువుల కాపర్లు, చేపలు పట్టువారు మున్నగువారు దుర్భర జీవిత యాత్రను అంతి చిరునవ్వులతో గడుపు జానపదులు. ఈ పల్లీయుల బ్రతుకు తెరువులు ప్రాచీన కావ్యముల కెక్కలేదు. నవ్యకవులు పల్లీయుల బ్రతుకులపై కావ్యములల్లుటకు కాల్పనిక కవిత్వ ప్రభావమే కాక, గాంధీజీ ప్రబోధం కూడ పనిచేసింది. దువ్వూరి రామిరెడ్డి గారి 'కృషీవలుడు' పొలము కాపుల జీవితములలోని సర్వతోముఖ విశిష్ట గుణములను చిత్రించిన కావ్యము. కాపువానికి

'పల్లె యెల్లయే సర్వ ప్రపంచ సీమ
ప్రియ యేకర్తయే రమణీయ విగ్రహంబు'

'ధారుణీపతి పాలన దండము' కన్న ఆతని హాలము గొప్పది.

తడిసిన పచ్చి కట్టియలు తంగెడు తప్పర తాటియాకులం
బడయక ప్రొయ్యిలో దుఱిగి పైఁబొగ లెత్తగ నూదుగాని కూ

డుడకదు కాకకుం బొగకు నుప్పతిలెం గడకంట భాష్పముల్"

వానాకాలమున కాపు టిల్లాలు పడె అవస్థలను కళ్ళకు కట్టినట్లు చిత్రించిరి.

తుమ్మల సీతారామమూర్తి గారు 'క్షేత్రజీవి' శీర్షికలో పట్టణములకు పరువులెత్తు కర్షకుల నుద్దేశించి,

"కదురు గల చోటు కవ్వంబు కదులు చోటు
కఱవులకు ధూమకేతు"

అని కృషి జీవనము లోని ప్రాశస్త్యము నుగ్గడించిరి. 'శివ రక్షకుడు' అను శీర్షిక క్రింద శివునికి, కర్షకునికి అబేధము చిత్రించిరి.

(బి) గోపకులు - ఆంగ్ల కాల్పనిక కవిత్వమున Pastoral Poetry ప్రభావముగా, తెలుగులో గోపాలుర జీవితమును కావ్య వస్తువుగా జేసుకొని కావ్య రచన జరిగినది. Pastoral Poetry అనగా, నాగరకులైన కవులు గోపాలుర జీవితమునకు ముగ్ధులై రచించిన కవిత్వము. వీటిని 'గోప కావ్యము'లని ఆంధ్ర శేషగిరిరావు గారు పేర్కొనిరి. దువ్వూరి వారి 'వనకుమారి' ఈ శాఖకు ఏకైక ప్రతినిధి అని చెప్పవచ్చును. దురదృష్ట వశమున రాజ్య భ్రష్టుడైన ఒక రాజు, ఆతని చిన్న కూతురు, అడవిలో గొల్ల వారుగా నివసించిన వృత్తాంతం ప్రధాన వస్తువు. పుట్టుకతోనే గొల్లవారు కాకున్ననూ, గొల్లవారిగా జీవించిన వారి జీవితమును చిత్రించిన కావ్యమిది. ఇది 'గోప కావ్యముల' పంక్తిలో చేరినది.

(సి) ఇతర వృత్తులవారు - పల్లీయులలో అనేక వర్గముల వారు, వృత్తుల వారుందురు. వీరిలో అలకాపరులు మొదలుకొని అంట్లు తోమెడి దాసి వరకు కావ్య వస్తువులుగ చేసికొన్న వారు కవికొండల వెంకటరావు గారు. 'రక్తకుల్య గాథ' అను శీర్షికలో వీరు పడవ లాగు వారి పాటను మనోజ్ఞముగా రచించారు.

"రార వెంకటరెడ్డి రార పోతన్న
రావడం లేదు వల లాగు లాగంౘ్రా
రక్త కుల్యకు కొత్త శక్త్చొచ్చె నేడు
రావడం లేదు వల లాగు లాగంౘ్రా"

పడవ లాగు వారితో పాటు పడవ మీదున్న పిల్లను కూడ వీరు

"నదినిండ నీరున్నదీ నావపై పిల్లున్నదీ
పిల్లాకు వొళ్ళున్నదీ వొళ్లెల్ల వయసున్నదీ"

అని వర్ణించినారు. 'ప్రకృతి చందనము' అను కావ్యములో వీరు మంగలి కుర్ర వానిని గూర్చి, జంతికలమ్ముకొను వృద్ధురాలిని గూర్చి రచనలు చేశారు. 'కలరుతము' అను కావ్య సంపుటిలో అంట్లు తోముకొని బ్రతుకు దాసి జీవితమును హృదయంగముగ చిత్రించిరి. కోత కూలీలను గురించి, రోడ్లు బాగు చేసెడి వారిని గూర్చి కూడ వెంకటరావు గారు ప్రత్యేకముగా గేయములు రచించిరి. దువ్వూరి రామిరెడ్డి గారు 'ముసలి మాలెత' అన్న పద్యములలో ముసలి మాలెత పై జాలిపడగా, ఆ వృద్ధురాలు

"కాలు సేతులు నున్నంత కాల మెరుల
చేతి కూటికి నాసింపఁ జిన్నతన మునను"

అని తన అభిమానమును ప్రకటించుకొనెను.

'గోధూళి' అను పాటల సంపుటిలో అడవి బాపిరాజు గారు ఆకు మళ్ళలో పనిచేయు భార్యాభర్త జీవిత రేఖలను రమ్యముగా చిత్రించినారు.

'యెయ్యవే గూడ నా పిల్లా అని
యెయ్యరోయ్ గూడ యెయ్యరా ఓ సిన్ని బావా
యెయ్యరోయ్ గూడ వేయరా।

అని ఆకుమళ్ళకు గూడ వేసినప్పటి ఘట్టమును స్వభావ సిద్ధముగా వర్ణించినారు.

కొనకళ్ళ వెంకటరత్నం గారి 'బంగారి మామ పాటల' లో పల్లీజన ప్రకృతి ప్రధానముగా చిత్రింపబడినది. ఊరిలో తిండికి గడవక పట్నవాసమునకై వెళ్ళిపోవు రైతులను గూర్చి గుండె గూడు కదలునట్లు వర్ణించారు.

"ఈన మోపై వున్న పాటలు
ఏటి మునకల పాలు జేసి
కొంప గోడు విడిచె పట్టెడు
కూటికై ఊరేగ వలెరా"

రోడ్డు రోలరు లాగు శ్రామికుల ఆత్మ వేదనను వ్యక్తీకరించు పాటలో -

"మారువాడి అప్పుకంటె మాయదారి బ్రతుకుకంటె
బరువా ఇంతోటి పెద్ద బండరాయి మామయ్య
లాగరా హోయి లెస్స లాగరా
రోడ్డు రోలరు ముందడుగై సాగరా"

వంటి చరణములతో కూలీల ఆర్తనాదము హృదయ విదారకముగా ధ్వనించును.

'పెద్దమనిషి' పల్లకిని మోసెడు బోయీల విషాద గీతికలో -

"రాళ్లైన మోయచ్చు
రథమైన లాగచ్చు
గుండె లేనీ మనిషి
కూర్చున్న పల్లాకి
రంపాలతో కోసి
నట్టుగ ఉండాది!"

బోయీల నిస్సాహాయతతో పాడు, బుస్స గొట్టుచున్న సాంఘిక చైతన్యము కూడ ద్యోతకమగు చున్నది.

## 12.6 భక్తి కవిత్వము (Mystic Poetry)

పూజ్య పూజక భావమె భక్తికి మూల బీజం వంటిది. పూజ్య పదార్థమును పొందుటకు భక్తుడు చేయు ప్రయత్నము

సాధన భగవంతుని పట్ల ఉండే అవ్యాజమైన, అహంకార రహితమైన, ప్రేమతో మనస్సు భగవంతుని కదీనము కాగా, భక్తుడు పరమాత్మలో లీనం కావాలని పరితపిస్తాడు. రామాయణ, భారత, భాగవతాది గ్రంథాలలో నవవిధ భక్తులకు లక్ష్యాలు కన్పిస్తాయి. భావ కవులలో భక్తి కవిత్వమును వెలయించిన వారు పలువురున్నారు. వీరిలో కొందరు త్రిమూర్తుల ప్రతినిధి యైన జగదీశ్వరిని ఉపాసించినవారున్నారు. ఆ జగదాంబను సమీపించుటకు పంచ భూతాత్మకమైన ప్రకృతిని ఆశ్రయించినారు. ప్రకృతి ద్వార పరమాత్మ సాయుజ్యము కొరకు భావకవులు ప్రయత్నము చేసిరి. భావకవులలో అధికులు మధుర భక్తి మార్గమునే ఆశ్రయించిరి. ఇంగ్లీషు కాల్పనిక కవిత్వములో కూడ భక్తి కవిత్వము ప్రథము స్థానమాక్రమించినది. భావకవులు సృష్టిలో పరమాత్మ అంశమును దర్శించిరి. అంతర్ముఖత్వం ద్వారా, ఆత్మ దర్శనం ద్వారా వారి చరమ లక్ష్యం సాధింపబడింది. భావకవులు వ్రాసిన భక్తి కవిత్వాన్ని మూడు శాఖలుగా విభజించవచ్చును.

## పారమాత్మిక కవిత్వము

"సృష్టి యొక్కటేయని, ఈశ్వరుడొక్కడే యని భావకవి భావించెను. తాపత్రయ సంతప్యమైన యీ లోకమునకు పరమాత్ముడే ఏకైక గమ్యమని భావించెను. ననలు, సొనలు, మంజుకుంజములు, ఆ పరాత్పరుని ఆనంద హాస లేశాంకురమ్ములుగా భావించెను. ప్రతి పుష్పము భావ కవికి భగవంతుని ప్రణయ లేఖగా భాసించినది. పరమాత్ముడు కృష్ణశాస్త్రి గారికి

"సడలు మేనికి వీవన, బడలు నెదకు
తీయనగు నుడి, వటులు పూదీవ మృత
జీవ మిడు వాన జడిగా"

దీన పావనుడిగా కనిపించినాడు. అపుడు కవి తనను తాను చూచుకొనగా తానెంత పాపియో, అహంకారియో, అల్పుడో అర్థమైనది. భగవంతునితో తన క్షుద్ర గుణములను మొరపెట్టుకొన్నాడు. 'కుక్క గొడుగు క్రింద కూర్చొండి, ఛత్రాధిపతి ననుకొని బడలు వడితి'నని, 'కుమ్మరి సారెపై జేరి భూచక్రంబెల్ల నాయదీనం బని నమ్మి దండధరుండనై కన్నుగానక యలజడ బడితి'నని చివరకు 'గొడుగు ముడిగిపోయినది. కులాల చక్రంబు తునియలై పోయినదని' అపుడు తానెంత అధమ మర్త్యుడో తనకు తెలిసినదని, ప్రభునితో నివేదించుకొన్నాడు. తన అహంకార బుద్ధికి, తాను చేసిన పాప కార్యములకు తానే సలసలా క్రాగిపోయతీ భగవంతునితో

"ఈ మహాపాపి, గర్విష్ఠు, నీ కిరాతు
గరుణఁజే రంగదాయకు - కాలయవను
చేతి గండ్ర గొడ్డండ్రతో చిన్న చిన్న
ఖండములుగ నరకనిమ్ము"

అన్నంత తీవ్రముగా తన బాధ వెల్లడించుకొనెను.

మహతిలో కృష్ణశాస్త్రి గారు 'తనవి గడ్డిపూవులని, అతని యిష్టమైనచో వానినాతని పూలదండతో మెరసిపోనిమ్మని, తనవి లేత గీతములని, అతని కిష్టములైనచో అతని కీర్తనములో మ్రోగిపోనిమ్మని, తనది పేద జీవిక అని, అతని యిష్టమైనచో అతని రాజవీధిలో సాగిపోనిమ్మని, ఆత్మ న్యూనత్వమును, భగవధాధిక్యమును ప్రకటించెను.

ఇంతటి పాశ్చాత్తాపమును ప్రకటించినను, ఇంతగా అహంకార త్యాగమొనర్చినను, ఇంతగా తన అల్పత్వమును ప్రసరించినను, పరమాత్మ సాన్నిధ్యము లభించక, కవికి కన్నీరొకటె శరణ్యమగును.

"కురియమురా కన్నీరును మరిమరి విలపించుమురా
సరము గూర్చి పరమేశుడు తాల్చునురా పాపీ"

అని తనను తాను సంబోధించుకొనెను. కృష్ణశాస్త్రి గారు 'కన్నీటి చుక్క గాక కాన్కగా నీకేమొసంగ గలుగుదునని పరమాత్మనితో విన్నవించెను.

"ఎట్లు నిన్నూహ సేయుటో యెఱుగలేక
వంగి వంగి శిరము వాంచి క్రుంగిపోదు"

అని క్రుంగిపోయెను. కవి ఆత్మక్షాళన తత్త్వము అనుసరించినాడు. కన్నీరు ఊషర క్షేత్రము వంటి హృదయమును పదిలపరచి సమస్త కాలుష్యములను పోద్రోలి, అభినవ జీవకళలను చిగురింప జేయునని భావించినాడు. కృష్ణశాస్త్రి గారు తాను జలజల కన్నీరు కురిసిన తర్వాత పరమాత్మ సాన్నిధ్యము లభించినట్లు తృప్తిచెందాడు.

"కలుష దుర్ధాంత పంక సంకలిత కుహర
ముల జనించు మదీమాశ్రు మలినధార
స్వామి, భవదీయ పాద దేశమునఁ బాఱి
పరమ పావన జాహ్నవీ ప్రతిభఁ గాంచు"

ఈ విశ్వాస సూర్యోదయమైన పిమ్మట భక్తునికి, భగవంతునికి భేద భావముండదు.

## మధుర భక్తి కవిత్వము

వైష్ణవ గీతములు 'పుంసాం మోహన రూపాయనమః' అని నేర్పించినవి. పరమ పురుషుడే పురుషుడు. ఇతరులు (భక్తులు) అందరూ స్త్రీలను అభిప్రాయము వైష్ణవ వాఙ్మయమున స్థిరపడినది. శైవులు కూడ పార్వతీపరమైశ్వరులను శృంగారమూర్తులుగా చిత్రించుకొన్నను వారిది భక్తి శృంగారము. వైష్ణవుల 'శృంగార భక్తి'ని ప్రతిపాదించిరి. శైవులు పార్వతీ పరమేశ్వరుల నిత్య సంయోగమునే చిత్రించిరి. వైష్ణవులు రాధాకృష్ణుల, గోపీకృష్ణుల విరహ శృంగారమునే విశేషముగా చిత్రించిరి.

గోపీకృష్ణుల శృంగారము జీవాత్మ పరమాత్మల వియోగ సంయోగములకు సంకేతము. భగవంతుని ప్రియునిగా భావించుకొని, తన్ను తాను ప్రేయసిగా భావించుకొనుటయే మధురభక్తి. రాధాకృష్ణులు, గోపీకృష్ణులు జీవాత్మ పరమాత్మల మధుర భక్తికి పర్యాయ పదములై పోయారు. మధుర భక్తిలో సర్వాత్మా సమర్పణము, భగవద్వియోగ దుస్సహత్వము ముఖ్యములు.

భావ కవిత్వంలో వెలువడిన భక్తి కవిత్వమున మధుర భక్తియే అధికముగా కన్పించును. దీని అరతరణకు ఆంధ్ర భాగవతం, క్షేత్రయ్య పదాలు, గీత గోవిందము, కృష్ణకర్ణామృతము మూల ప్రభావములు. వీనితో పాటు రవీంద్రుని గీతాంజలి ప్రభావము కన్పించును. భావ కవిత్వములో మధుర భక్తి కవిత్వమునకు వెంకట పార్వతీశ్వరుల 'ఏకాంత సేవ' ప్రతినిధి కావ్యము. యుగయుగముల విశ్వ మానవుని మధుర సాధన 'మధురయుగ, మార్ధవంబుగా, మంజులముగా, మానసానందకరముగా, మంగళముగా చిత్రింపబడినది. "ప్రవిరుల భక్తి యుక్తుడైన భక్తుడు పరమేశ్వరుని గూర్చి పాడు మధుర గీతమే' "ఏకాంతసేవ". వంగ భాషకు రవీంద్రుని గీతాంజలి యెట్టిదో, మన యాంధ్రమునకే మహా కవుల భక్తుల 'ఏకాంత సేవ' యట్టిదని దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి అభిప్రాయము. ఏకాంత సేవ, గీతాంజలి దేనికది విశిష్టములైన కావ్యాలు. ఈ మధుర భక్తి కవిత్వము నవ్య కవితా కేదారమున రెండు పాయలుగ ప్రవహించినది. (1) ఆత్మాశ్రయ రీతి, (2) వస్త్వాశ్రయ రీతి.

(1) ఆత్మాశ్రయ రీతి - ఆత్మాశ్రయ రీతిలో భావకవులు తమ్ము తాము గోపికగనో, రాధికగనో, భావన చేసుకొని రమ్యాతి రమ్యములైన ఖండ కావ్యములను క్రమగీతులను గానము చేసినారు. కవి తనను తాను 'వరనందనోద్యాన వనలక్ష్మి' గాను, భగవంతుని 'తరుణ శృంగార మాధవుడు' గాను సంకేతించు కోవటం ఏకాంత సేవలో కన్పిస్తుంది. బసవరాజు అప్పారావు గారు 'దాసిగా నుండుట కైన తగనా ప్రాణేశా' యనియు 'పాదములు నొచ్చినంత పట్టుటకైనను దగనా' అని సేవాభావము వెలిబుచ్చినారు. ప్రాణేశ్వరుడు ఎట్టకేలకు తన ఇంటికి రాగా లజ్జా భారముతో, శిశిర వాత స్పర్శచే వణికిపోయే సుమవల్లిక వలె ఉక్కిరి బిక్కిరి యైపోయి -

"పాడు సిగ్గు వీడదాయె ప్రాణేశ। దేవా। నీ
చూడ చక్కనైన మోము చూడలేక వెఱగు పడతి"

అని నివేదించుకొన్నాడు. ఒక్కొక్క మానసిక స్థితిలో బసవరాజు అప్పారావు గారికి భగవంతుడు 'కాంత రూపమున' కన్నుల బడెను. అప్పుడాతడు 'అతివా నా ప్రాణనాధు డెవ్వడని' యడుగగా 'ఆడుదాని వలె హృదయము కానుక యర్పించినతడే నానాధుడనె' నట. భగవంతుని కాంతా రూపమున భావన చేయుట దీనిలోని విలక్షణాంశం.

(2) వస్త్వాశ్రయ రీతి - రాధాకృష్ణుల గోపికాకృష్ణుల సంయోగ వియోగములను, మోద విషాదములను, ఆయా పాత్రలనే ఆశ్రయించి చిత్రింపబడునది వస్త్వాశ్రయ రీతి అనవచ్చును. దీనికి విశ్వనాథ వారి 'శృంగార వీధి' ప్రధమ నిదర్శనము. రాధిక వేపధు స్థితి వర్ణనతో ఈ కావ్యము ప్రారంభమగును. రాధ మూర్చావస్థ, శిశిరోపచారములు, రాధా కృష్ణుల సంయోగము, స్వామి వేణుగానము, రాధా స్వప్నము మున్నగునవి వర్ణింప బడినవి. ఈ కావ్యము రాధాకృష్ణుల విరహ విప్రలంభమునకు, సంయోగమునకు వంతెన వంటిది. స్థూలముగా శృంగార గాథ వలె కన్పించినను, ప్రణయపథము ద్వారా ప్రణవము నందుకొను పద్ధతిలో సాగిన కావ్యం. కృష్ణశాస్త్రి గారి 'అన్వేషణము', కృష్ణుని మురళి కామంద మంద మధురుల రుచులు' గుండెలో రగిలిపోవగా, ఎలదేటి చిఱుపాట సెలయేటి కెరటాల బడిపోవు విరికన్నె వలపువోలె పరుగులెత్తిన గోపిక విప్రలంభ వేదనను, సంయోగ మాధురిని వర్ణించిన ఖండకావ్యం. కరుణశ్రీగారి కరుణామయి, చామర్తి రాజశేఖరరావు గారి బృందావనం, బసవరాజు అప్పారావు గారి 'గోపికా గీతములు' వట్టికొండ విశాలాక్షి గారి 'ప్రణయ భిక్ష', చావలి బంగారమ్మ గారి 'రాధ', వేములవారి 'రాధ' సంధ్యాన్వేషణము మొదలైనవి వస్త్వాశ్రయ రీతి ఖండకావ్యములు.

(3) వేణుగానం - మధుర భక్తి కవిత్వమున శ్రీకృష్ణుని వేణుగానమునకు అత్యంత ప్రాముఖ్యమున్నది. మధుర భక్తి కవిత వెలయించిన వారు వేణుగానాన్ని వర్ణించిక విడువలేదు. 'వాయింపుమా మురళి వాయింపుమా కృష్ణా' అని బసవరాజు అప్పారావు గారు, 'ఏదీ యింకొక్క మారూదరా నీ మురళీ' అని వేదులవారు 'ఏది మరొక్కమాటు హృదయేశ్వర గుండెలు పుల్కరింపగా ఊదగ దోయి' అని కరుణశ్రీ గారు శ్రీకృష్ణుని అర్థించారు.

మురళీరవము విశ్వమంతట వ్యాపించగా జోలపాడినట్లు అనుభూతి చెంది సృష్టి సమస్తము సుషుప్తిలో మునిగిపోయినది. బాలగోపాలుని పాట అతని చేతిలోని మురళినే కాక కవిలోని 'మోడు టెడద'ను శిధిల జీవనమ్మును మ్రోయించినది. ఆ మురళీ గానములో -

"మంజుల సుమామృతము లోని మధురిమమ్ము
మధుర చంద్రా తాపములోని మార్దవమ్ము
మృదు సమీరమ్ములోని పరిమళమ్ము"

కలవని వేదులవారు భావించినారు. ఆ 'పాట తీపి'ని భరించు శక్తి తనకు లేదని గ్రహించి

"మ్రోయింప కోయీ మురళి మ్రోయింప కోయీ
తీయ తేనియ బరువు మోయలేదీ బ్రతుకు"

అని గాన పారవశ్యాన్ని తట్టుకోలేని విచిత్రమైన అవస్థను కృష్ణశాస్త్రి గారు ప్రకటించారు.

జీవాత్మ పరమాత్మ పిలుపును మురళీ గాన రూపంలో అందుకని పరమాత్మలో లీనం కావాలని కోరుకుంటాడు. అందుకే విశ్వనాథ వారు వేణుగానాన్ని 'బ్రహ్మ గీతం' గా వర్ణించారు.

**(4)** తాత్త్విక కవిత్వము - తెలుగు సాహిత్యమున 'ప్రబంధ చంద్రోదయము' వంటి కావ్యములలో ప్రతిపాదింపబడినది తాత్త్విక కవిత్వమే. మోక్ష సాధన మార్గములలో ఒకటైన జ్ఞాన మార్గము ఆశ్రయించిన ధోరణి తాత్త్విక కవిత్వంలో కన్పిస్తుంది. ఇందులో జిజ్ఞాస ప్రధానమైనది. గూఢత, ఒకానొకప్పుడు 'అయోమయము' దాని లక్షణములు ప్రాచీనులు మృత్యువును దంష్ట్రాకరాళముగ చిత్రింపగా, నవ్యులు ప్రియమైన వస్తువుగా భావించుట వారి విశిష్టత. కాల్పనిక కవుల ప్రభావంతో తెలుగు కవులలో కల్గిన భావమిది. దువ్వూరి రామిరెడ్డి గారు మృత్యువును 'ఆనందదాయకమైన వాసంతకల్య'గా 'సకియ'గా భావించడము విలక్షణమైనదే. వెంకట పార్వతీశ్వర కవులు 'విచార లహరి'లో 'జలధరంబుల యందు జలములే గాక పిడుగు లేమిటికి గల్పింపగాబడినో' అని ప్రకృతి సూక్ష్మముల పట్ల జిజ్ఞాసా దృష్టిని ప్రదర్శించారు.

## 12.7 దేశభక్తి కవిత్వము (Patriotic Poetry)

భావకవులు గానమొనర్చిన దేశభక్తి జాతీయ భావన నుండి పుట్టినది. ఆధునికాంధ్ర కవిత్వములో దేశభక్తి రెండు పాయలుగా ప్రవహించింది. ఒకటి భారత జాతీయం భిహున సంబంధి. రెండవది ఆంధ్రా భిహున సంబంధి. ఇది సమకాలీన పరిస్థితులు, రాజకీయ ఉద్యమాల ప్రభావములో వెలువడింది. దీనిపై ఆంగ్ల సాహిత్య కాల్పనిక ప్రభావము లేదు.

### 12.7.1. భారత జాతీయోద్యమము

ఆంగ్ల ప్రభుత్వము 1905లో వంగ దేశమును రెండు ముక్కలుగా విభజించడముతో, భారత దేశంలో జాతీయాభిమానము పొంగిపొరలింది. బిపిన్ చంద్రపాల్ గారు కలకత్తా నుంచి మద్రాసు వరకు ఉన్న అన్ని ముఖ్యమైన పట్టణములలో తెల్ల దొరల దౌర్జన్య కాండకు వ్యతిరేకముగా ఉపన్యాసాలు ఇచ్చి ప్రజలను ఉత్తేజితులను చేశారు. రాజమహేంద్రవర సభలో చంద్రపాల్ గారి ఉపన్యాసము విని ఉద్రిక్తులై చిలకమర్తి లక్ష్మీనరసింహము గారు వ్రాసి చదివిన,

"భరత ఖండంబు చక్కని పాడి యావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్ల వారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియబట్టి"

పద్యము సభను ఉత్సాహ తరంగిత మొనర్చినది. ఈ పద్యము తెలుగులో భారత జాతీయోద్యమ సంబంధమైన తొలి రచన యని చెప్పవచ్చును. 1907లో ప్రభుత్వము లాలాలజపతి రాయ్‌ను బంధించి బర్మాలో నిర్బంధించినది. ఆ సంఘటనలో జాతీయోద్యమ వహ్నికాజ్యము పోసినట్లైంది. దేశీయులలో కలిగిన యీ సంచలనమును చిలకమర్తి వారు ఆవేశపూరితమైన రీతిలో కవితా బద్ధము చేసిరి.

"చెరసాలల్ పృథు చంద్రశాలలె యగున్, చేదోయి గీతించున

య్యర దండల్ విరి దండలయ్యెడను, హేయంబైన చోడంబులే
పరమాన్నంబగు, మోటుకంబళులు దాల్పన్ పట్టు సెల్లాలగున్
స్థిరుడై యెనరుడాత్మ దేశమును భక్తిం గొల్చు నవ్వానికిన్"

"భరత ఖండంబె యొక పెద్ద బందెఖాన
అందులో నున్న ఖయిదీలు పొందు జనులు
ఒక్క గది నుండి మార్చి వెరొక్క గదిని
బెట్టుటే కాక చెరయించు వేరగలదె"

జాతీయ భావమును వ్యంగ్యము గానో, అన్యాపదేశముగానో చిత్రించిక సూటిగా ఆంగ్ల ప్రభుత్వమును విమర్శించిన మొట్ట మొదటి జాతీయ కవి చిలకమర్తి వారే. మంగిపూడి వెంకట శర్మ గారు 'భరతమాత' అను శీర్షికలో భారతదేశ ప్రాచీనౌన్నత్యమును గానము చేసినారు. 1915లో గోఖలే నిర్యాణ వార్త వినగానే రాయప్రోలులో పొంగులెత్తిన భావోర్మికలలో జాతీయోద్యమ కవిత్వము తొంగిచూచినది.

### 12.7.2. జాతీయాభిమానము

భావకవులలో జాతీయతను ప్రబోధించిన వారిలో దువ్వూరి, బసవరాజు మున్నగు వారున్నారు. రాయప్రోలు వారు భారత జాతీయతకు సంబంధించి వ్రాసిన 'జన్మభూమి' గేయము జాతీయ కవితా పురంధ్రికి శిరోభూషణము వంటిది.

"ఏ దేశమేగినా, ఎందు కాలిడినా
ఏ పీఠమెక్కినా, ఎవ్వరేమనినా
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము"

ఈ గేయములో వారు 'జననీ జన్మభూమిశ్చ' అను సూక్తినే ప్రబోధించినను అంతకు ముందు ఎవ్వరందించని చైతన్యమును తొణికిసలాడించినారు.

"అవమానమేలరా၊ అనుమానమేల
భారతీయుడనంచు భక్తితో పాడ"

అను పంక్తులలో జాతీయ భావము ప్రబోధ రూపకముగా తరగ లెత్తినది. రాయప్రోలు వారి తర్వాత 'ఆత్మ విశ్వాస సూర్యోదయ' కాంతులతో భారత జాతీయ ప్రబోధ గీతాలు లాలపించిన కవి దువ్వూరి రామిరెడ్డి గారు -

"అంబుదంబుల నమృత పూరంబు లొలుక
నింద్ర చాపంపు తోరణ మింపు గులుక
కాఱు మేఱుఁగులు నెల్లడ గడలు కొనఁగ
వెడలె స్వాతంత్ర్య రధము విన్వీధి యందు"

వేదుల సత్యనారాయణ శాస్త్రి గారు తమకు తాము పూవుగా భావించుకొని 'కానుకనై దరాధిపుల కాళ్ళకడం బొరలాడి వాడి పోలే' నని, 'దరా పరాగ పటలీ మలినమ్మగు ద్వార తోరణాస్థానము నందు లింబడగజాల'నని ఉద్ఘోషించినారు.

వెంకట పార్వతీశ్వర కవులు 'పరమార్థ నిధియైన భారత భూమి బానిసతనములోబడి క్రుంగుచుండ, ఆర్య సంతతివారు' కనుమూసి కాలంబు గడపుట తగునే' యని హెచ్చరించిరి. జాషువాగారు 'దేశ సేవనే పూజ సల్పుచు, దేశమాతకై దివిటి కారలె' నని భారతమాతను కీర్తించినారు.

## గాంధీ ప్రశస్తి

భావకవులు రచించిన జాతీయ గీతములలో గాంధీజీని కీర్తించిన వారిలో బసవరాజు అప్పారావు గారు ముఖ్యులు -

"కొల్లాయి గట్టితే నేమి - మా గాంధి
కోమటై పుట్టితే నేమి
వెన్నపూసా మనసు, కన్నతల్లీ ప్రేమ
పండంటి మోముపై బ్రహ్మ తేజస్సు
చకచక నడిస్తేను జగతి కంపించేను
పలుకు పలికితేను బ్రహ్మ వాక్కేను"

గాంధీజీ కర్మ వీరత్వమును, బ్రహ్మర్షిత్వమును చక్కగా ధ్వనింపచేసినది.

"జయ గాంధీ దేవా మంగళం జయ మంగళంబు నీకు
సత్యాగ్రహా, శ్రమ, తాపసా, శాంతి స్వభావ మానసా"

అని గాంధీ గారిని పరమాత్మగా భావించి కొందరు హారతి పాటలు రచించారు.

## ప్రచార గీతములు

భావ కవులు గాంధీజీని గూర్చి, రాట్నమును గూర్చి, స్వరాజ్యమును గూర్చి, వివిధ జాతీయోద్యమములను గూర్చి, ప్రచార స్థాయిలో గేయములు, పద్యములు, వ్రాసినారు. మాధవపెద్ది బుచ్చి సుందరరామ శాస్త్రి గారు స్వరాజ్య సమస్యపై, హరిజన సమస్యపై, ప్రచార గీతములు రచించారు. 'అంటరాని వారెవరో కారు, మా వెంట రానివారే' అన్న గీతము వీరిదే. గరిమెళ్ళ సత్యనారాయణ గారు 'మా కొద్దీ తెల్ల దొరతనమూ' అనే పాటతో సామాన్య ప్రజలలో స్వాతంత్ర్య శంఖారావం చేశారు. బసవరాజు అప్పారావు గారు.

"సిగ్గు లేదా నీకు శరము లేదా
అన్నమైనా లేక బీదలల్లాడు తుంటేను
సీతాకోక చిలుక లాగ సీమ గుడ్డ గట్టి తిరుగ"

అని విదేశీ వస్త్రధారులను తీవ్రంగా నిరసించారు.

## 12.7.3. వస్త్వాశ్రయ రీతి

భావ కవులు భారత జాతీయాభిమానాన్ని వారి కావ్యాలలో వస్త్వాశ్రయ రీతిలో వెల్లడించినట్లు కనిపిస్తుంది. దువ్వూరి వారి ద్రౌపది సందేశం, చామర్తి రాజశేఖర రావు గారి పాంచాలీ స్వాంతనం, కరుణశ్రీ గారి ధనుర్భంగం, పెనుమర్తి వెంకటరత్నం గారి దీపావళి నాడు, తుమ్మల వారి ఆదర్శవీరుడు, రాజశేఖర శతావధాని గారి రాణాప్రతాపసింహ చరిత్ర, గడియారం శేషశాస్త్రి గారి

శివభారతం మొదలగునవి ఈ ధోరణిలో వచ్చిన వస్త్వాశ్రయి రీతి కావ్యాలు.

### 12.7.4. ఆంధ్రాభిమానం - ఆంధ్రోద్యమ కవిత్వం

ప్రాచీనాంధ్ర కావ్యములలో ఆంధ్రాభిమన్నది అంతగా కానరాదు. ఈ ఆధునిక శతాబ్దిలోనే ఆంధ్ర జ్యాత్యభిమానము బహుముఖములుగా వికసించినది. ఆంధ్రాభిమానములో **1905-1920** మధ్య ఆంధ్రోద్యమము సాగినది. ఆంధ్రులు గత వైభవం ఈ ఉద్యమానికి ఊపిరినిచ్చింది. కృష్ణా పత్రిక, ఆంధ్ర పత్రిక, ఆంధ్ర రాష్ట్రోద్యమానికి ప్రచార కలిగించాయి.

"నాదు జాతి నా దేశము నాదు భాష
అను అహంకార దర్శనమందు మాంధ్ర"

ఈ పద్య భాగములో ప్రతిపాదితమైన అహంకార దర్శనములో తెలుగు కవులకు స్మృతిపథమున ఆంధ్రాభిమానము కలిగినది. ఇది రాయప్రోలు వారు రచించిన 'ఆంధ్రావళి'లో 'ఆంధ్ర' శీర్షిక. **1914**లో గట్టము కొండారెడ్డి గారు ఆంధ్ర మాత ప్రాచీన వైభవ స్తుతి, ప్రస్తుత స్థితిని గూర్చి 'ఆంధ్ర మాతృస్తవము' అను శీర్షికలో ప్రచిరించారు. **1916**లో మండపాక పార్వతీశ్వర శాస్త్రి గారు 'ఆంధ్ర సంవత్సరాది' అను శీర్షికన ఆంధ్ర రాష్ట్ర భావనను వెల్లడించిరి.

"ఆంధ్ర ప్రత్యేక రాష్ట్రాసక్తి చాటించె
మదపికంబులు పంచమ స్వనమున"

రాయప్రోలు సుబ్బారావు గారు ఆంధ్రుల గత వైభవాన్ని 'అమరావతీ పట్టణముల బౌద్ధులు విశ్వ విద్యాలయమ్ముల స్థాపించునాడు' ఓరుగల్లున రాజవీర లాంఛనముగ పలు శాస్త్ర శాలలు నిలుపునాడు' ఆంధ్ర సామ్రాజ్య దిగ్జియస్తంభమేద్రించునాడు" అని కీర్తించినారు.

"జాతిన దేశ గౌరవము చక్కన దిద్ది, మహాంధ్రమంట లీ
భారము శ్లాఘనీయముగా పాలన చేసి, సమాన రాష్ట్రముల్
కూరిమి నాసబేయ తెనుగుంబుడమిన్ కయి సేయరమ్య"

అని ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకమును, ప్రస్తుత కర్తవ్యాన్ని ప్రబోధించినారు.

### 12.7.5. ఆంధ్ర జాత్యభిమానము

ఆంధ్రాభిమానము జాతి, దేశ, భాషాభిమానములుగా ప్రవహించినది. రాయప్రోలు వారన్న 'నాదు దేశము - నా జాతి - నాదు భాష' యన్న సూత్రమునకే ఇతివృత్తి. ఈ మూడింటికిని గత వైభవ స్మరణము, వర్తమాన స్థితి పట్ల విచారము, భవిషత్ కర్తవ్య ప్రబోధము ముఖ్య లక్షణములుగా నున్నవి.

### 1. శౌర్య ప్రశస్తి

'ఆంధ్ర పౌరుషము'లో ఆంధ్రజాతి పూర్వప్రతిభ'ను విశ్వనాధ వారు,

"కోటి గోడల నుండి కుప్పించి సింహంబు
లోయన నరులపై నురక లేదో
కొండ యడుగు నుండి కొండ పై వరకు నూ

గించి తేజీల దూకించ లేదో
కోట తల్పులను ఢీకొనవచ్చు కుంభికుం
భమ్ముల గ్రుద్ది చంపంగ లేదో"

అని ఆంధ్రుల పరాక్రమ ఘట్టములను వివరించిరి.

"కంచి కోటల కంచు తల్పులు ఖంగు ఖంగున మ్రోగునప్పుడు
తంజనగరపు కోట గోడలు చెంగు చెంగున నెగురునప్పుడు"

అని త్రిపురనేని రామస్వామి గారు తెలుగు వారల పరాక్రమెంత ఉవ్వెత్తు ఎగసినదో తెలుగు బిడ్డలను హెచ్చరించినాడు.

**2. ఐశ్వర్య ప్రశస్తి**

ఆంధ్ర దేశము గతంలో సాగించిన విదేశీ వ్యాపారమును, నౌకా వ్యాపారమును సాధించిన సిరిసంపదలను ఆంధ్ర కవులు అత్యంతావేశములో స్మరించినారు. రాయప్రోలు వారు ఆంధ్రుల ఐశ్వర్యమును -

"పాకాల చెరువు చెంపల పండు ధాన్యముల్
అన్య దేశాధీశులడుగు నాడు
అద్దంకి కోడెల నాబోయలకునయి
దూరాగతులు కొని త్రోలునాడు"

స్మరించినారు.

ఈజిప్తు నుండి కృష్ణా జలమ్ములకు బా
రంబాటగా పరాక్రమము బూపి
సకల దీవుల విజయ ధ్వజముల నాటి
తనదు తెరచాప వార్ధి రాజునకు కట్టుకోకగా

అని ఆంధ్రుల నౌకా వ్యాపారమును తుమ్మల వారు కీర్తించినారు.

**3. కళా ప్రశస్తి**

శిల్ప, సంగీత, కవిత్వాది లలిత కళలో ప్రాచీనాంధ్రులు సాధించిన కౌశలమును భావకవులు తనివితీర కీర్తించినారు.

తల వంచలేదు విఠలరాయ దేవుడు
పటు శతాంబ్దాభీల బారమునకు
నవసిపోలేదు సానువు గణేశుని బొజ్జ
బహుకాల దీర్ఘోపవానములకు

అని ఆంధ్ర శిల్ప ప్రశస్తిని జాషువ గారు కీర్తించిరి.

ఏ రీతి మలచితో యీ స్తంబముల యందు
ప్రోవు గ్రమ్మిన మల్లెపూవు చాలు
ఏ లేపనంబున నీ కుడ్యముల కెల్ల
ధనరించినారో యద్దాల తళుకు"

అని పుట్టపర్తి నారాయణాచార్యుల వారు ఆంధ్ర శిల్పుల కళా నైపుణ్యాన్ని కీర్తించారు.

**4. దేశాభిమానం**

భావకవులు ఆంధ్రదేశ భౌతిక స్వరూపమును అద్భుతావేశముతో ఉల్లేఖించిరి. ఈ దేశాభిమానములో క్షేత్ర ప్రశస్తి, నదీ ప్రశస్తి, దుర్గ ప్రశస్తి' యున్నవి.

క్షేత్ర ప్రశస్తి - ఆంధ్ర చరిత్రలో రాజధానులైన ఓరుగల్లు, రాజమహేంద్రవరము, అమరావతి, కొండవీడు, హంపి, పెనుగొండ పట్టణములను భావకవులను మైమరపించిన మహనీయ క్షేత్రములు కొడాలి సుబ్బారావు గారి 'హంపీ క్షేత్రము' కరుణ రస ప్రధానమైనది.

"శిలలు ద్రవించి యేడ్చినవి జీర్ణములైనవి తుంగభద్రలో
పలి గుడి గోపురంబులు, సభాస్థలులైనవి కొండముచ్చు గుం
పులకు, చరిత్రలో మునిగి పోయిన దాంధ్ర వసుంధరాది పో
జ్జ్వల విజయ ప్రతాప రభసంబొక స్వప్న కథా విశేషమై"

హంపీ దర్శనము తర్వాత గత వైభవమును తలచుకొని, గుండెలో నుండి వెలికి జిమ్మిన భాష్ప సంగీతమిది.

"శ్రీ దక్ష వాటికా శృంగార దేవతా
సేవ (గస్తూరి వాసించు నాడు"

అని ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారు 'దక్షారామ' కావ్యములో ఆంధ్రాభిమానమును వ్యక్తీకరించిరి.

పుట్టపర్తి నారాయణాచార్యులు వ్రాసిన 'పెనుగొండ లక్ష్మి' యందు

"రాయల పాద ముద్రలు దలఁదాల్చు సొం
పులు దిద్దు కొన్నట్టి కలికి మిన్న"
"తెనుగు ఢంకాలు మ్రోగిన దివ్యభూమి
కనుము తమ్ముడా। జీర్ణింబు గగనమహలు"

ప్రాచీన రాజ్య వైభవమును, పరాక్రమమును వర్ణించినారు.

దువ్వూరి వారి 'కొండవీడు' విశ్వనాధ వారి 'కొండవీటి పొగమబ్బులు' గత వైభవమును స్మరించిన ఖండకావ్యాలు.

నదీ ప్రశస్తి - తెలుగు దేశమున ప్రవహించు గోదావరి, కృష్ణ, తుంగభద్రా, పెన్నా నదులను కేంద్రములుగా చేసికొని భావకవులు ఖండకావ్యాలు రచించిరి. దేశ భౌతిక సంపదలో నదీ సంపత్తి ప్రధమ గణ్యమైనది. ఈ నదులన్నిటిలో గౌతమి, కృష్ణలే అధికముగా వర్ణింపబడినవి.

గోదావరి నుద్దేశించి జాషువా గారు,

"శబ్ద శాసనుని ద్రాక్ష కవిత్వమును౯ గా
మించి యెన్నాళ్ళు లాలించినావో"

అని స్మరించుకొనిరి. 'ఆంధ్ర పౌరుషము' లో విశ్వనాధ వారు నాలుగు తెలుగు నదులను కేంద్రాలుగా గ్రహించి, ప్రాచీన కాలంలో జరిగిన సాహిత్య శిల్పకళ విలసనాన్ని, ఆంధ్రజాతి వైభవాన్ని ప్రశంసించారు.

### 12.7.6. భాషాభిమానం

తెలుగు తీపిని ప్రాచీన మహా కవులు పలువురు కీర్తించిరి. భావ కవులు మీగడలు, తేనెలు, పూల లావణ్యము, సెలయేటి బయ్యారము కలగలిసి తెలుగు భాషగా రూపొందెనని ఉత్ప్రేక్షించిరి.

"ఊరక రాష్ట్ర మూడి పడునొక్కొ మహేశ్వరినట్లు మాతృ భా
షారమణిన్ భజించుటకు సంబరం మందని చచ్చు జాతికిన్"

అని ఆంధ్ర భాషా సేవ చేయనిదే రాష్ట్రము రాదని తుమ్మల వారు హెచ్చరించారు.

## 12.8 సంఘ సంస్కరణ కవిత్వము (Reformative Poetry)

సంఘ సంస్కరణ కవిత్వముపై మానవోద్యమము, 'గాంధీయిజము' మున్నగు స్వదేశీయ ప్రభావములే కాని విదేశీయ ప్రభావము అణుమాత్రమైన లేదు. రాజారామ మోహన రాయలు వంగ దేశమున ఎగుర వేసిన ఈ ఉద్యమ ధ్వజమును వీరేశలింగం గారందుకొన్నారు. రామమోహన రాయల ఉద్యమమునకు బ్రహ్మ సమాజము వాహికగా నుండేది. కందుకూరి వారు ఈ సంఘమును ఆంధ్ర దేశములో స్థాపించి, దీని ద్వార సంఘ సంస్కరణ కార్యములు జరిపినారు. వీరికి ఈ ఉద్యమ నిర్వహణలో రఘుపతి వేంకటరత్నం నాయుడు గారు అండగా నిల్చిరి. బాల్య వివాహ ఖండనము, కన్యాశుల్క నిరసనము, వర్ణ వ్యవస్థా నిరసనము, సంఘ వ్యవస్థా నిరసనము, మొదలగు మానవోద్యమములు ప్రారంభమైనవి. మానవోద్యమం రెండవ తరంలో గాంధీయ దృక్పథముగా రూపొందినది. గాంధీజీ సర్వోదయ సిద్ధాంతము బహుళ ప్రచారమందినది. వీటిని దృష్టిలో పెట్టుకొని, భావ కవితా కాలంలో సంఘ సంస్కరణ కవిత్వం వెలువడింది.

భావకవులు కొందరు వితంతు విలాపాన్ని వినిపించారు. కొందరు కన్యా శుల్కాన్ని నిరసించారు. కొందరు వర్ణ భేద పిశాచి కెదురు తిరిగారు. కొందరు గాంధీజీ బాటలో 'హరిజన సమస్యను' కావ్య వస్తువుగా తీసుకొని వ్రాశారు. కొందరు ఈ బాటలోనే విశ్వమానవ ప్రేమను పతాకగా స్వీకరించి ప్రస్థావించారు.

### 12.8.1. దురాచార నిరసనము

కందుకూరి వీరేశలింగం గారి సంస్కరణ వజ్ర ఘాతములో అది బాల్య వివాహ పద్ధతి చూర్ణమై పోయినది. బాల్య వివాహములు చాలవరకు సన్నగిల్లినవి కాని పూర్తిగా పోలేదు. బాల్య వివాహముల వలన వితంతువుల సమస్య బయలు దేరినది. అగ్ర వర్ణముల వారిలో బాల వితంతువుల సమస్య తీవ్ర రూపము దాల్చినది. శుల్కమున కాసపడి తల్లిదండ్రులు వృద్ధులకు తమ కూతుళ్ళ నంట గట్టుటతో ఇది మరింత విషమించినది. మంగిపూడి వెంకటశర్మ గారు 'పైక మిచ్చిన వారికే బాలికలను గట్టపెట్టుట యిది యేటి కర్మ' మని ఆక్రోశించినాడు. వీరు 'బాల వితుంతు విలాపము' అను కావ్యంలో బాల్య వివాహములను నిరసించిరి.

పొత్తిళ్ళ లోనున్న నెత్తురు కందుల
　　పెండ్లిండ్లు సేయు భావించనొకడు,
పురుడు వోవక మున్నె బొట్టెల నమ్మంగ
　　బేరసారములు గావించు నొకడు,
కన్నులు తెఱవని కసు గాయలను గట్టి
　　పెట్టి వృద్ధులను సేవించు నొకడు,
పాలైన విడువని పసికొనలను గూర్ప
　　వెస రాయబారి రావించు నొకడు

ఈ కావ్యములో వృద్ధ వివాహమును, వితంతువుల దుర్భర దుఃఖ గాథలను అతి రమ్యముగా స్వభావికముగా వర్ణించిరి.

వర శుల్క నిరసనగా భోగరాజు నారాయణ మూర్తి గారు, 'పండుగ కట్న' మను కార్యము రచించిరి. గురజాడ వారు పూర్ణమ్మను, రాయప్రోలు వారు 'స్నేహలత'ను ఈ శుల్కమునకు నిరసనగా వ్రాయబడిన కావ్యాలే. మంగిపూడి వెంకటశర్మ గారు 'అబలా విలాపము'లో వనితలను వంటయింటి కుందేళ్ళ వలె అణగద్రొక్క పద్ధతిని తీవ్రముగా ఖండించినాడు.

"బాలుర కెట్టులో బాలల కట్టులే
　　యున్నత విద్యల నొసగుడయ్య
యువకుల కెట్టులో యువతుల కట్టులే
　　స్వేచ్ఛా ప్రదానంబు సేయరయ్య"

అని స్త్రీలు స్వేచ్ఛా స్వాతంత్ర్యములకు, విద్యా గౌరముల కర్హులని ఉద్ఘాటించినాడు.

ఏకేశ్వరా రాధనము, విగ్రహారాధనము, బ్రహ్మసమాజము ప్రచారం చేసినది. తెలుగు నాట ఈ లక్ష్యాలు ప్రచారము చేయుటకు 'బ్రహ్మసమాజ ప్రార్థనా మందిరములు' పట్టణములలో నెలకొల్పబడినవి.

కందుకూరి వెంకటరత్నం నాయుడు గారు దీనికి మూలస్తంభములు. దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు -

"శిధిలాల యమ్మలో శివుడు లేడోయి
ప్రాంగణమ్మున గంట పలుక లేదోయి
దివ్య శంఖము గొంతు తెరువ లేదోయి
పూజారి గుడినుండి పోవ లేడోయి
చిత్ర చిత్రపు పూలు ఛైత్రమాసపు పూలు
ఊరూర ఇంటించ ఊరకే పూచాయి
శిధిలాల యమ్మలో శిల కెదురుగా కునుకు
పూజారి కొకటేని పూవు లేదోయి"

భక్తి భావమున్న చోట పరమాత్ముడున్నాడని, అతడు ఆలయములో బందియై యుండడని, విగ్రహారాధనా తత్త్వమును వ్యంగ్యముగా ఎత్తిపొడిచినాడు.

### 12.8.2. వర్ణ వ్యవస్థా నిరసనము

మానవోద్యమము కుల, మత, వర్ణ వ్యత్యాసముల నెదిరించినది. తెలుగు నాట బ్రహ్మ సమాజమీ తత్త్వమునే ప్రచారము చేసినది. బ్రహ్మ సమాజ ప్రభావముతో కంఠమెత్తిన కవి వర్ణ విద్వేష శృంఖలలను తెగద్రెంచుడని ఉద్ఘోషించినాడు.

"గుణములేని వాని దేకులమైతేనేమి
తృణమైతేనేమి శ్రీచరణమంటునేని
ఏ కౌటిల్యము వీని నేర్పరిచిందో కాని
చీకటి గదులున్నే జగదీశ్వరాలయములోనే"

అని పరమేశ్వర సన్నిధానములో వర్ణ ప్రసక్తి లేదని స్పష్టపరచినాడు. వర్ణ వ్యవస్థను సాంఘిక చైతన్య దృష్ట్యా నిరసించుట ఈ యుగములోనే ప్రారంభమైనది. గుణమును బట్టి కాక కులమును బట్టి మానవుల హెచ్చు తగ్గులు నిర్ణయించు వ్యవస్థను నవ్య కవి నిరసించినాడు. కడ జాతి వానికి సంఘము చూపిన నిర్దాక్షిణ్యమున కెదురు తిరిగి కావ్యముల రూపమున సవాలు చేసినాడు. గంగ కూడ కడవాని తల మీది పంకమును కడిగి కరుణించ లేదని ఆక్రోశించినాడు. జాషువా గారు 'గబ్బిలము' అను కావ్యములో ఆనాడు బిగుసుకొని పోయిన వర్ణ వ్యవస్థలోని కుళ్ళును వెలిచిమ్ముటకు ప్రయత్నించాడు. 'సనాతన ధర్మ ధేనువుల్ పిదికిన పాలు అంటరాని వానికి లభింపవని, అతని గాలి సోకగా 'నాల్గు పడగల హైందవ నాగరాజు' కసరి బుసకొట్టునని, ప్రతిమల పెండ్లి చేయుటకు వందలు వేలు వ్యయింత్రురు గాని దుఃఖితు మయమైన వారి పాత్రలలో భరతవేదిని వేదుకు విదల్పదని "వర్ణవ్యవస్థ వలని దుస్థితిని ఎత్తి చూపినాడు.

### 12.8.3. సంఘ వ్యవస్థా నిరసనము

సంఘములో ఒక్క వర్ణ వ్యవస్థయే కాదు, సమస్త వ్యవస్థ కుళ్ళి పోయినదని హుంకరించి తెలుగునాట విప్లవ శంఖమును పూరించినవారు త్రిపురనేని రామస్వామి చౌదరి గారు. సంఘములో అధికార ముద్ర దాల్చిన పురాణములు, ధర్మ శాస్త్రములు, ఇతి హాసములు అగ్ర జాతులు వారు తమ స్వార్థము కొరకు కల్పించు కొన్న కట్టు కథలని, వారందించిన పురాణముల నల్ల మందులో మిగిలిన జాతులు మైకముతో, మౌఢ్యములో పడియున్నవని, సంఘ వ్యవస్థ సామూలాగ్రముగా మార్చినే కాని, కడమ జాతులకు విముక్తి లేదని చౌదరి గారి సిద్ధాంతము. ఈ సిద్దాంతము ద్వారా వారు పురాణములలోని కథలను బూతులని, బూటకములని నిరూపించుటకు ప్రయత్నించిరి. శంబుకవధ, ప్రహ్లాద చరిత్ర మున్నగు వానిలో ఆర్యులు ద్రావిడులకు వ్యతిరేకముగా చేసిన పన్నాగముల నెత్తి చూపి పాఠకులను దిగ్భ్రాంతులను చేసిరి. భగవద్గీతలోని 'చాతుర్వర్ణ్యం మయాస్పష్టమే' అను సూత్రమునకు వ్యతిరేకముగా ఇంకొక భగవద్గీత (బ్రహ్మనాయుడు కృష్ణుడుగా) రచించిరి. ఈ సిద్ధాంతములన్నిటిని వారు 'సూత పురాణము' అను పేర వెలయించిరి.

### 12.8.4. గాంధీయ దృక్పథము

గాంధీజీ మానవోద్యమమును వ్యక్తి స్వాతంత్ర్య పరిధి నుండి సమిష్టి మానవ శ్రేయః పథములో ప్రవేశ పెట్టిన మహనీయుడు. మతము, వివాహము మున్నగు సమస్యల కన్న ముందుగా సంఘములోని ఆర్థిక దుస్థితిని, భావ దారిద్ర్యమును తొలగించ వలెనని ప్రతిపాదించినాడు. ఈ దృష్టితోనే ప్రాచీన ఋషులు ప్రబోధించిన ధర్మ సూత్రములకు క్రొత్త వ్యాఖ్యానము రచించినాడు. భగవద్గీతలోని కర్మ యోగమునకు ప్రాధాన్యమిచ్చినాడు. మానవుని మనస్సును జయించుటకు కత్తి కన్న కారుణ్యమే ప్రబలమైనదని నిరూపించినాడు. జాత్యభ్యుదయమునకు గ్రామ వికాస మత్యవసరమని ప్రబోధించినాడు. సత్యము, ధర్మము, ప్రేమ, అను విశాల సూత్రముల ద్వారా తన దృక్పథమును దేశీయులకందించినాడు. గాంధీజీ సిద్ధాంతముల ప్రభావము నవ్య కవులలో

కొందరిపై విశేషముగా ప్రసరించినది.

గాంధీజీ సిద్ధాంతాల ప్రభావముతో తుమ్మల సీతారామ మూర్తి గారు 'ధర్మజ్యోతి', 'ఆత్మార్పణము' అను రెండు కావ్యాలను వ్రాశారు. ధర్మజ్యోతి ధర్మవరమునకు, ఆత్మార్పణము ఆత్మార్పణ తత్త్వమునకు (దయా వీరమునకు) మచ్చుతునకలు. ఆత్మార్పణములో జీవ కారుణ్యము ఆవశ్యకతను ధ్వనింపజేయబడినది. గాంధీయ దృక్పథములోని విశ్వమానవ ప్రేమ, జీవకారుణ్యములను ధ్వనింపజేసిన కావ్యము 'పింగళి - కాటూర్ల' 'సౌందరనందము'. బుద్ధుడు నందునికి బోధించిన ధర్మసారము-

"కొడుకులు లేని వారలకుఁ గూరిమి బిడ్డవు, మాతృహీనులౌ
బుడతల కెల్లఁ దల్లివయి పోషణ సేయుము నాయనంగలే
కడలెడు దీనులన్ మనపు, మూర్తుల కాదరు వైభజింపు, మీ
పుడమి దివమ్ము సల్పు మీది పో, పరమార్థము బౌద్ధ జాతికిన్"

ఎల్లలు లేని ప్రేమ, విల్లి విరిసెడు జీవ కారుణ్యము, బౌద్ధజాతి లక్ష్యములని, అవి యెల్లరికి ఆదరణీయములని ఈ పద్యములో ప్రబోధింపబడినవి.

గాంధీజీ సాగించిన అస్పృశ్యతా నివారణోద్యమము ప్రభావముగా, వేంకట పార్వతీశ్వర కవులు 'పంచమాభినందనము'లో

"మమత తప్పిన యాతడు మాలగాక
మాట దప్పిన యాతడు మాలగాక
అన్నెమునుఁ బున్నెమెఱుగని యట్టి మాల
మాలయే? దేవు యెడఁ బూలమాలగాక"

అని అస్పృశ్యతా నివారణకై గళమెత్తారు.

దేవాలయ ప్రవేశార్హత లేక హరిజనులు కుమిలి పోయిన స్థితిని, పురిపండా అప్పల స్వామి గారు -

"గుడిలోన దైవమా ఆలింప వోయి
గుడిలోన దయ్యమా పైకి రావోయి
నీ పాద పూజకై వెదికి తెచ్చిన పూలు
నీ పాద సేవకై నింపి తెచ్చిన నీళ్ళు
పనికి రావంటారు మైలపడెనంటారు
మాల మెట్టిన నేల మాల ముట్టిన నీరు
మాల పాడిన పాట మాలలాడిన మాట
మైలపడెనంటారు పనికి రాదంటారు"

ఈ గీతములో మాలలకున్న భక్తి తాత్పర్యములు, వానికి సమాజము చేసిన విరోధము చిత్రింపబడినవి.

## 12.9 స్మృతి కావ్యములు (Elegies)

పాశ్చాత్యుల ఆత్మాశ్రయ కవిత్వములో స్మృతి గీతము (Elegies) ప్రధానమైనది. ఆప్తులైన వారెవరైనను మరణించిన, వారి మరణము గూర్చి స్మృతి రూపకముగా గేయమో, పద్యమో, కావ్యమో వ్రాసినచో అది 'ఎలిజీ' యే అగును. ఇంగ్లీషు కాల్పనిక

కవిత్వములో ఎలజీ ప్రధానముగా దేశనాయక పరముగా మిత్రపరముగా రూపొందినది. ఈ స్మృతి గీతములలో కవి కేవలము వ్యక్తిగత విషయములనే కాక, తాత్త్విక దృక్పథము, ఆత్మ విషయములతో పాటు జగత్పరమైన శాశ్వత సత్యములను కూడ ప్రకటించును.

ఎలిజీకి తెలుగులో శోకగీతమని, శోక కావ్యమని పర్యాయ పదములు వాడబడినవి. తాపీ ధర్మారావు గారు 1911 లో రచించిన ఒక ఎలిజీకి ఏమీ తోచక 'కారుణ్యము' అని తెలుగులో నామకరణము చేసిరట. నేడు దీనికి సమానార్ధకముగా స్మృతి గీతము, స్మృతి కావ్యము అను పదములే సముచితముగా వాడబడుచున్నవి.

నవ్య కవులలో మొట్ట మొదటి స్మృతి కావ్యము రచించిన వారు రాయప్రోలు సుబ్బారావు గారు. గోపాలకృష్ణ గోఖలే నిర్యాణ వార్త వినగానే వీరు చక్కని స్మృతి కావ్యము రచించిరి. తర్వాత బసవరాజు అప్పారావు, విశ్వనాథ, నాయని సుబ్బారావు, మున్నగువారు రసభరితములైన రచనలు కావించిరి.

ఈ స్మృతి కావ్యములను నాలుగు వర్గములుగా విభజించవచ్చును.

### 12.9.1. దేశనాయక స్మృతి

రాజకీయ, సాంఘిక, కళాది రంగములలో ప్రసిద్ధులైన వారిని గూర్చిన స్మృతి కావ్యములు ఈ విభజనలో చేరుతాయి. రవీంద్రుని అస్తమయమునకు భాష్ప స్తంభిత కంఠులై రాయప్రోలు రచించిన 'రవీంద్రుని అస్తమయము' గణనీయమైనది. రవీంద్రుని నిర్యాణముతో ప్రకృతి సమస్తము నిస్తబ్ధమై పోయినట్లు వర్ణింపబడినది. కిన్నెరలు శ్రుతులాపి నిదురించినవని, రంగు గిన్నెలలోని వన్నెల చిన్నెలు మాసిపోయినవని, కావ్యకలకంఠీ కంఠరాగము గద్గద్యము వహించిన దని కరుణావేశముతో పల్కినాడు.

గురజాడ అప్పారావు గారి నిర్యాణానంతరము దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు వ్రాసిన గేయము చక్కని స్మృతి కావ్యము.

"యుగయుగంబుల నుండి మ్రోగెడు
విశ్వ గాన వియత్త రంగిణి
భంగముల నుప్పొంగు"

అని ఎంతో యెత్తుగా కవి ఊహించినాడు.

ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారి మృతికి, బసవరాజు అప్పారావు

"ఏల పాడె నింక యమునా కళ్యాణినే
లీలా మానవుడు గోపాలుడు లేడాయె"

అని దుఃఖావిలురైనారు.

విశ్వదాత కాశీనాధుని వారు శివైక్యమును చెందగానే దేశములోని ఆంధ్ర కవులందరు స్మృతి గీతములు సమర్పించినారు. తుమ్మల వారు ఈ పద్యములో విశ్వదాతను మాతృ దాస్య పాశ చ్ఛేద కౌశల్యము గన్న కర్మయోగిగా బలికర్ణ మాంధాతల విస్మృతికిం దెచ్చు విశ్వదాత'గా 'చదువులమ్మకు సేవ సలుపు బంటుగా' కీర్తించినాడు.

గాంధీజీ నిర్యాణానంతరము జాషువా గారు 'బాపూజీ' కావ్యమును వ్రాసిరి. "ముగ్గిన పండు, క్షమా ప్రవాసి, యగు మహాత్ముడు తుపాకీ గుండ్లకు బలియై పోయిన విషయమును తలచుకొని "ఇదియో పోవడమా౹ జగజ్జనక౹ రానేరావుగా" భారతజ్యోతి

గప్పునారిపోయినదని 'జగమొక్కుమ్మడి జొమ్ము గ్రుద్దుకొని మూర్ఛన్ దేలి తబ్బిబ్బు చెందినదని' 'ఖదరు రాటాల ఝూంకార రవళి' తోపాటు 'గంటు పేదల నోటి కబళరాసి' కూడ ఆగిపోయినదని కరుణ రసాత్మకముగ చిత్రించినారు జాషువా గారు.

### 12.9.2. సతీస్మృతి

తెలుగున సతీస్మృతి కావ్యములు వ్రాసిన వారిలో విశ్వనాథ, దువ్వూరి, వేంకట పార్వతీశ్వరులలో ఒకరైన బాలాంత్రపు వెంకటరావు గారు ప్రథమ గణ్యులు. విశ్వనాథ వారు పరమపదించిన వారి భార్య పేర 'వరలక్ష్మి త్రిశతి' అను పేర మూడు వందల పద్యములు రచించిరి. ఇది కర్మ, స్మృతి, నిత్య శతకములను మూడు భాగములుగా నున్నది. కావ్య ప్రారంభములో

ఓ సఖా। ప్రియ భార్యా వియోగ మెఱుగ
నట్టి యో పూర్వ సత్కృతీ। యకట। నీవు
కర్మ శతకంబు చదువకు। మర్మఘాతి
నీ వెఱుగ లేవు దానిలోని దగు . . . .

కర్మ శతకములోని మర్మ చ్ఛేదకమైన దుఃఖ తీవ్రత ధ్వనింప జేసినారు. మైథిలీ శీలయైన తన సతిలేని తన కాయము దహన యోగ్యమైన వట్టి కట్టెగా భావించినాడు. కృష్ణలో ఆమె అస్తులను కలుపుచున్నప్పుడు.

"అంటె పేరున కంటె భార్యాస్థి గాని
నా శరీరాస్థి నిజము కృష్ణార్పణమ్ము"

అని పొగిలిపోయాడు. నవ్య కవులు భార్యా సంస్కృతికి కట్టిన అక్షర సౌధములలో 'వరలక్ష్మి త్రిశతి' తాజమహలు వంటిది.

సతీస్మృతిలో వెలయించిన మరొక చక్కని కావ్యం దువ్వూరి వారి 'భగ్న హృదయము' కవిగారి సతీమణి ఇరువది యైదవ యేటనే అకాలమృతి కలగగా, కలిగిన చిత్త భ్రమణముతో కవి

"హృదయమును దొంగిలించిన రీతి గానె
స్మృతిని సైతంబు నీవు హరింపు మతివ"

అని విలపించినాడు.

బాలాంత్రపు వెంకటరావు గారు తమ సతీ నిర్యాణములో వ్రాసిన 'విరహ సంగీతము' అను స్మృతి గీతమున, ఆమె మరణము 'విశ్వమును వెలయించు వెన్నెల పాటి' కోరికల్ చిగురించు కోకిల పాట" కడలేని పాటలో గలసిపోయినవని కవి గారు భావించినారు.

### 12.9.3. సుతాదిక స్మృతి

దువ్వూరి వారు భార్యా వియోగములో విలపించుచుండగా, తమ బిడ్డ పసికందుగా నున్నప్పుడే కనుమూసినందుకు దుఃఖించి 'శిశు వియోగము' అను ఖండిక వ్రాసిరి.

"పూవు రాలిన జిఱుపిందె పూవయైన
నంటుకొని యుండునన్న పేరాసమంటి
మృత్యు నిశ్వాస పవనంబు రేగి సుడిసి
భావి ఫలమును గసుగందుఁ బైకి విసరే"

అను దుఃఖాధిక్యముతో వాపోయిరి.

సుతాస్మృతిలో రచింపబడిన గేయములలో బసవరాజు అప్పారావు గారి 'నిర్యాణ సుఖము' పేర్కొనదగినది. కవి గారి కూతురు పేరు మంగళప్రద. వారి చిట్టి తల్లి మరణించుటతో వారికి 'కత్తి పెట్టి పొడిచి' నట్లయ్యింది.

"బంగారు బొమ్మ నాదు మంగళ ప్రదమ్మ యేంటి
రుద్రభూమి కటిక నేల నిద్రించెడు నొడలు మరచి"

అందువలన 'చలి పిడుగా గర్జింపకు' మని బ్రతిమాలుకొన్నాడు. తన చిట్టి తల్లి మినుకు మినుకున మెరయు చుక్కలలో ఒక్కటిగా మారిన దేమో యని పలవించినాడు.

## 12.9.4. ఆప్త స్మృతి

మాతా పితరులు, సోదరీ సోదరులు మున్నగు వారి స్మృత్యర్థము వెలువడిన కావ్యాలు, గీతాలు ఈ శ్రేణిలోనికి వస్తాయి. నాయని సుబ్బారావు గారి 'మాతృ గీతాలు' ఉత్తమమైన కావ్యము. జననియగు ఉదయమ్మ అస్తమయములో కవి ఉద్విగ్నుడై,

ఎవ్వడా క్రూర కర్మరు డెవడు। నీల
జలద నిర్ముక్త శిర శర్వరీ ప్ర
శాంత మలవాటు పడిన నిశాంతమందు
అకట నట్టింటి దీపమ్ము నార్పినాడు।

అని దుర్విధిని దూషించినాడు. కావ్యమంతటా సర్వకాలములందు సమస్త ప్రదేశములందు కవి మాతృమూర్తి స్మృతులే వెలయించుకొన్నాడు.

పెనుమర్తి వెంకటరత్నం గారు మాతృ స్మృతికై వ్రాసిన కావ్యం ఎన్నదగినది. మాతృ మరణంతో తన బ్రతుకున 'దివాంధ గీతము' మ్రోగుచున్నదని, విలయాంధ తమస్సులు చుట్టుముట్టాయని, తన మధు ప్రవాహములు స్వప్నములై చెదరిపోయాయని కవి దుఃఖించినాడు.

"జన్మ జన్మల నాటి వాత్సల్య లతలు
విరియ బూచిన పూవులు పరువు మాసె
ఐహిక ఋణానుబంధము లస్తమించి
అమృత దారలె కాలకూటాగ్నులు మిసె"

అని విధి వైపరీత్యానికి విలపించినాడు.

మోటూరి వెంకటరావు గారు పితృ మరణానికి, సోదరి మరణానికి పొగిలిపోయి 'ఆహుతి' అన్న గేయం రచించారు. తనకు కలిగిన ఆశయ భంగాన్ని,

"గాలిమేడలు హిమన గమ్ముల
గట్టుకొని నా బ్రతుకు నేటికి
గాజు పెంకులు వోలె ముక్కలు
గాగ ( జితికినది."

అను చరణాలలో చిత్రించుకొన్నాడు.

అబ్బూరి రామకృష్ణారావు గారు కవికొండల సాంబశివరావు గారి మృతికి వగచి 'సోదర స్మృతి' అను ఖండ కావ్యాన్ని వ్రాశారు.

"నీ మధుర తేజో రూప సీమఁ దలచి
నీవు మొదలు పెట్టిన యక్ష రావళులనుఁ
గూర్చి యల్లెద మింకమా నేర్చినట్లు
మానవ ప్రేమ పూర్వ నిర్వాణ గీతి"

అను పద్యంలో అతని జీవితమే తనకు సందేశంగా పరిణమించిందని ఆశాభావం వెల్లడించాడు.

## 12.10 సమీక్ష

ఈ విధముగా భావ కవిత్వం ఆరు శాఖలుగా విలసిల్లి, వస్తు, భావ, రచనలలో నవ్య ప్రయోగం గావించి, మూడు దశాబ్దాలు ప్రతిభా మహితముగా విరాజిల్లింది. భావ కవిత్వం, ఆంధ్ర కవితా రాగంలో అప్రతిహతమైన ప్రభావాన్ని చూపి, అభ్యుదయ కవిత్వానికి బాటలు తీసి, నిశ్శబ్దముగా నిష్క్రమించింది.

## 12.11 ప్రశ్నలు

1. భావ కవిత్వాన్ని నిర్వచించి, భావకవితా స్వరూపాన్ని ఆవిష్కరించండి.
2. భావ కవిత్వంలోని శాఖల్ని సంగ్రహముగా పేర్కొనునది.
3. భావ కవితా కాలంలో వచ్చిన ప్రణయ కవిత్వంలోని దశలను వివరించునది.
4. భావ కవులు ప్రకృతిని విశ్లేషించిన తీరు విశదీకరించునది.
5. భావ కవిత్వం లో వచ్చిన భక్తి కవిత్వాని వ్యక్తీకరించునది.
6. దేశభక్తి కవిత్వాన్ని వివరించునది.
7. సంఘ సంస్కరణ కవిత్వంలోని అంశాలను పేర్కొనునది.
8. భావ కవుల రచనలలోని స్మృతి కావ్యాలను పరిశీలించునది.

## 12.12 ఉపయుక్త గ్రంథాలు


1. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగములు - డాక్టర్ సి. నారాయణ రెడ్డి
2. తెలుగు కవితా వికాసం - కడియాల రామమోహనరావు
3. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
4. లక్ష్మీరంజన వ్యాసావళి - శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం



**అరిపిరాల హరిహరనాథశాస్త్రి**
Incharge - తెలుగు శాఖ
శ్రీ సుబ్బరాయ & నారాయణ కళాశాల
నరసరావుపేట - 522 601

# పాఠం - 13

# వస్తు కవిత్వము

పాఠ్యనిర్మాణక్రమం

13.0. లక్ష్యం
13.1. వస్తువు - కథ
13.2. సంస్కృతంలో వస్తు కవిత్వం
13.3. కన్నడంలో వస్తు కవిత్వం
13.4. తెలుగులో వస్తు కవిత్వం - నన్నయ
13.5. నన్నెచోడుని ప్రయోగాలు
13.6. వస్తు కవిత్వం - వర్ణనా ప్రాధాన్యం
13.7. వస్తు కవిత్వం - సహజ కవిత
13.8. వస్తు కవిత్వం - ప్రకృతి కవిత
13.9. వస్తు కవిత్వం - ప్రబంధ కవిత్వం
13.10. వస్తు కవిత్వం - పాత్ర పోషణం
13.11. వస్తు కవిత్వం - ప్రకృతి వర్ణనలు
13.12. వస్తు కవిత్వం - సహజ కవిత్వం
13.13. వస్తు కవిత్వం - ప్రబంధ కవిత్వం
13.14. వస్తు కవిత్వం - ఆధునిక కవిత్వం
13.15. సమీక్ష
13.16. ప్రశ్నలు
13.17. ఉపయుక్త గ్రంథాలు

## 13.0 లక్ష్యం

తెలుగు కవిత్వంలో ప్రధానమైనదైన వస్తు కవిత్వాన్ని గురించి తెలుసుకోవడం ఈ పాఠం ప్రధాన లక్ష్యం. వస్తు కవిత్వమంటే కథా ప్రధానమైన కవిత్వం. కథ అనగానే పాత్ర పోషణమూ ఉంటుంది. వస్తు కవిత్వం అనే శబ్దానికి వర్ణనలు గల కవిత్వం, సహజమైన కవిత్వం ప్రకృతిని వర్ణించే కవిత్వం, ప్రబంధ కవిత్వం మొదలైన అర్థాలూ ఉన్నాయి. సంస్కృతం, కన్నడం భాషలలోనూ వస్తు కవిత్వముంది. తెలుగు ప్రాచీన కవిత్వంలోను ఆధునిక కవిత్వంలోనూ వస్తు కవిత్వముంది. అయితే కాలానుకూల పరిణామం కన్పిస్తుంది.

## 13.1 వస్తువు - కథ

కవిత్వం వస్తు భావ రచనా ప్రధానంగా ఉంటుంది. ప్రాచీన కవిత్వం ప్రధానంగా వస్తు కవిత్వం. ఆధునిక కవిత్వం ప్రధానంగా భావ కవిత్వం. రచనా విధానం తదనుగుణంగా సాగుతుంది. రచన కన్నా భావానికి, భావానికన్నా, వస్తువుకు జన జిహ్వాగ్ర నర్తన సామర్థ్యం ఎక్కువ. వస్తువు అంటే ఇతివృత్తం, కథ. ఇతివృత్తాన్ని కావ్యానికి శరీరంగా మన ఆలంకారికులు పరిగణించారు. భరతుడు 'ఇతి వృత్తంతు కావ్యస్య శరీరం పరికీర్తితమ్' అన్నాడు. అందువల్ల కావ్య శరీరమైన వస్తువు నిర్మలంగా

ఉండాలి. సద్వస్తువును మాత్రమే తీసికొని కావ్యాలు వ్రాయాలని భరతుడి తరువాతి ఆలంకారికులు కూడా అభిప్రాయపడ్డారు. భామహుడు ఈ విధంగా వ్రాక్రుచ్చాడు.

సర్గబంధో మహా కావ్యం మహతాంచ మహచ్ఛయత్
అగ్రామ్య శబ్ద మర్థంచ సాలంకారం సదాశ్రయమ్

కథా శరీరం సద్వస్తువు నాశ్రయించి ఉండాలి అని భామహమతం కథా శరీరంలో అధర్మాత్మకాలైన అంశాలు తారసిల్లినప్పుడు వాటిని పరిహరించాలని సూచించారు.

ఇతివృత్త వశాయాతాం
త్యక్త్వా2 ననుగుణాం స్థితిమ్
ఉత్ప్రేక్ష్యా ప్యంతరాభీష్ట
రసోచిత కథోన్నయః

ఇతివృత్తంలో ఉన్న అననుకూల సంఘటనలను త్యజించి, మధ్య మధ్య అవసరమైతే కొత్త సన్నివేశాలను కల్పించి వస్తువును రసవంతంగా చేయాలని ఆనందవర్ధనుడి అభిప్రాయం.

ఈ వస్తువు మూడు విధాలు. (1) ప్రఖ్యాతం/ప్రసిద్ధం, (2) ఉత్పాద్యం/కల్పితం, (3) మిశ్రం, పురాణాలు, చరిత్రలు మొదలైన వాటిలోని కథ ప్రఖ్యాతం లేదా ప్రసిద్ధం. కవి కపోల కల్పిత కథ ఉత్పాద్యం. ఈ రెండింటి సమ్యక్సమ్మేళనం మిశ్రం.

కావ్యంలోని ప్రధాన కథ ఆఖ్యానం. దానితో సంబంధమున్న చిన్న చిన్న కథలు ఉపాఖ్యానాలు.

## 13.2 సంస్కృతంలో వస్తు కవిత్వం

ప్రశస్త వస్తు కవిత ప్రథమ కావ్యం వాల్మీకి రామాయణం. అందులోని వస్తువు ఐతిహాసికం. వ్యాస భారతం కూడ ఐతిహాసిక వస్తు భరిత మహా కావ్యం. ఆ తరువాత కాళిదాసు వస్తు వరణంలో చక్కని ప్రయోగాలు చేశాడు. మేఘ సందేశంలోని కథ కల్పితం. ఇందులో నాయికా నాయకుల పేర్లు కూడా లేవు. ప్రణయ వేదనకు, సందేశానికి మేఘ సందేశం తొలి కావ్య రూపం. కాళిదాసు ఋతు సంహారం కూడా వస్తు రీత్యా గొప్ప ప్రయోగం. ఆ తరువాత ఎన్నెన్నో వస్తు బలం కల కావ్యాలు వచ్చాయి. వస్తు కవిత విస్తరించింది.

## 13.3 కన్నడంలో వస్తు కవిత్వం

కన్నడంలో మల్లియ రేచనను ఆశ్రయించుకొని ఎందరో వస్తు కవులు ఉండేవారు. తాను వస్తు కవి జనాశ్రయుడనని తేటగీతి లక్ష్యంలో చెప్పుకొన్నాడు. ఆనాడు వస్తు కవితను అందరూ చెప్పేవారు కాబోలు, దీని ప్రభావం తర్వాత తరాల మీద కూడా బాగా ప్రసరించింది. క్రీ.శ. 990 ప్రాంతాలలో ఉన్న నాగవర్మ తెలుగువాడైనా రాజభాష అయిన కన్నడంలో కావ్య రచన చేశాడు. నాగవర్మ బాణుడి కాదంబరిని కన్నడ చంపువుగా వ్రాశాడు. అందులో ఒకచోట ఇది "వస్తుబంధం" అని చెప్పాడు.

## 13.4 తెలుగులో వస్తు కవిత్వం - నన్నయ

ఆదికవి నన్నయ్య తన కవితా లక్షణాలుగా ప్రసన్న కథా కలితార్థయుక్తి, అక్షర రమ్యతలను చెప్పుకొన్న విషయం, తనకు విశేషణంగా 'నానారుచిరార్థసూక్తి నిధి' శబ్దాన్ని వాడుకొన్న విషయం మన అందరికీ తెలిసిందే. ఇక్కడ వస్తు అర్థ రచనా విశేషాలు

మూడూ వ్యక్తమౌతాయి. నన్నయది వస్తు కవిత. ప్రసన్న కథలలో మనోహరమైన కావ్యార్థాలను, ధర్మార్థ కామ మోక్ష రూప పురుషార్థ విశేషాలను నిక్షేపించడం ఆయన మార్గం. ఆ కథలు ఎటువంటి చిక్కులు లేకుండా తేటగా ఉంటాయి. రసభరితంగా ఉంటాయి. ఈ ప్రసన్నతా సాధనానికి నన్నయ కొన్ని పద్ధతులను అవలంబించాడు. (1) కథా గమనానికి ఆటంకం కలిగించే వర్ణనల్ని నీతి ధర్మ విషయాల్ని పరిహరించడం, (2) పునరుక్తులను పరిత్యజించడం, (3) అప్రసిద్ధ నేయార్థక శబ్దాల్ని త్రోసిపుచ్చడం, (4) సమాస క్లిష్టతను పరిహరించడం, (5) సంధుల్ని శ్రవణ విహితం కావించడం, (6) గూఢ కథాంశాలను వ్యాఖ్యానించడం, (7) ప్రధాన కథకూ ఉపాఖ్యానాలకూ అంగాంగి భావ సౌందర్యాన్ని సంఘటించడం, (8) పూర్వోత్తర విషయాల్ని సంధానించడం, (9) వస్తువును విభజించడం, (10) సంఘటనల ప్రాధాన్యాన్ని చిత్రించిడం, (11) పాత్రల మనోధర్మాల్ని విశ్లేషించడం, (12) కథల్ని సరసంగా సంతరించడం.

నన్నయకు కథ పట్ల ప్రత్యేక దృక్పథం ఉంది.

ఏయది హృద్య మపూర్వం
బేయది? యెద్దాని వినిన నెఱుక సమగ్రం
బైయుండు? నఘ నిబర్హణ
మేయది? యక్కథయ వినగ నిష్టము మాకున్ (1.1.30)

వస్తువు మనోహరంగా, వినూతనంగా, విజ్ఞానదాయకంగా, పాపహరంగా ఉండాలని ఆ నిత్య సత్యవచనుని సరసాశయం.

భారతంలో ఏకత్వంలో భిన్నత్వం ఉంది. అది 'ఇతిహాస వస్తు సముదాయం'. 'అమితాఖ్యానక శోభితం'. అందులో ఎన్నో కథలు! ఉపకథలు!! నన్నయ గారు, ఆ తరువాత తిక్కన, ఎర్రన ఒక్కొక్క ఉపాఖ్యానాన్ని ఒక్కొక్క చిన్న కావ్యంగా చిత్రిక పట్టారు. కొన్నిసార్లు మనోజ్ఞ కథాంశాన్ని ఒక్కొక్క పద్యంలో కళాత్మకంగా అమర్చారు.

వస్తు వ్యాఖ్యానం రెండు విధాలుగా ఉంటుంది.

1. శ్రోతృ దృగ్గోచరమైన దాన్ని వ్యాఖ్యానించడం.

2. శ్రోత చూడని దాన్ని వ్యాఖ్యానించడం. కొన్ని సందర్భాలలో యధాతథంగా చెబితే సరిపోతుంది. మరికొన్ని సందర్భాలలో మార్పులు చేర్పులు అవసరం. కొన్ని సందర్భాలలో గత వస్తు వివరణం (Background information) జోడించాలి. ఇక్కడ ఉపాఖ్యానా లెంతగానో ఉపకరిస్తాయి. నన్నయ వీనిని చక్కగా పరిశీలించి రచన కావించాడు.

ఇలా నన్నయ గారు పుణ్య వస్తువును, స్వీకరించి ప్రసన్న కథా కలితార్థ యుక్తిని కవీంద్రులు సారమతితో లోనారసి మేలు అనేటట్లు నిర్వహించారు. 'ప్రసన్న కథా కలితార్థ యుక్తి' కి ప్రసన్న కథా కవితార్థయుక్తి అనే పాఠాంతరం ఉంది. 'లలిత పదం, ప్రసన్న కవితా గుణ మిల్లదె' దీనికి మూలమని, ఇదే సరియైన పాఠమని కొందరి అభిప్రాయం. అయినా ప్రసన్నకథా కలితార్థ యుక్తి పాఠమే బహుజనామోదపాత్రమైంది. ఆదికవి నన్నయ్యే వస్తు కవిత్వపు మొక్కకు పాదులు తీశాడు.

## 13.5 నన్నెచోడుని ప్రయోగాలు

నన్నెచోడుడు బాహాటంగా తాను వస్తుకవినని చెప్పుకొన్నాడు. వస్తు కావ్యం, వస్తు కవిత అనే పదాలను తన కుమార సంభవ కావ్యావతారికలో ప్రయోగించాడు. వాల్మీకిని 'వస్తు కావ్యాబ్జరవి' (1-17) అని ప్రస్తుతించాడు.

భారవియ వస్తు కవితను

భారవియును బరఁగి రుదయ పర్వత శిఖరా
గ్రారోహ ణేంద్ర కీల న
గారోహణ వర్ణనల జనారాధితులై (1-20)

అని భారవిని వస్తు కవిగా సంభావించాడు. ఉద్భటుడు కుమార సంభవాన్ని "గూఢ వస్తుమయ కావ్యముగా" చెప్పినట్లుగా పేర్కొన్నాడు. "సమస్త వస్తు కవీశ్వర/నూత్నరుచిర కావ్య రత్న వీథి" (1-36) అని వస్తు కవిత్వపు విలువను వివరించాడు. తనది "జంగమ మల్లయ/వరము నందు గనిన వస్తు కవిత" (1-49) అని చెప్పుకొన్నాడు.

## 13.6 వస్తు కవిత్వం - వర్ణనా ప్రాధాన్యం

వస్తు కవిత అన్న శబ్దానికి కథకు ప్రాధాన్యమున్న కవిత అని ఇంతకు ముందు అర్థం చెప్పుకున్నాం. మరికొన్ని అర్థాలను అనుశీలిద్దాం. నన్నెచోడుని కుమారసంభవం ఇతివృత్తంతో పాటు వర్ణనా ప్రాధాన్యం కూడా ఉన్న కావ్యం కనుక నన్నెచోడుడి దృష్టిలో వస్తు కవిత అంటే "వర్ణనాత్మకమైన ఫణితి" కావచ్చునని ఖండవల్లి లక్ష్మీరంజనం గారు భావించారు. కోరాడ రామకృష్ణయ్య గారు "వర్ణనీయ వస్తువును గూర్చి చమత్కార వర్ణనలతో గూడిన కవిత" అన్నారు.

## 13.7 వస్తు కవిత్వం - సహజ కవిత

వస్తు కవిత్వం అంటే నిసర్గ కవిత్వమని ఒక భావన. "వాడు వస్తుతః మంచివాడు" లాంటి వాక్యాలు లోకంలో ఉన్నాయి. అందువల్ల వస్తు కవిత అంటే సహజ కవిత అని అర్థం.

## 13.8 వస్తు కవిత్వం - ప్రకృతి కవిత

వస్తు శబ్దానికి ప్రకృతి అని నిఘంటువులలో అర్థం ఉంది. కాబట్టి ప్రకృతిని గురించి వర్ణించే కవిత్వమని కూడా అర్థం చెప్పవచ్చు. "వస్తు కవిత యనగా బ్రకృతిని వాస్తవముగా వర్ణించు కవిత యనియు, వస్తు కవులనగా బ్రకృతి శోభను వాస్తవముగా వర్ణించు కవులనియు ననుటయే" అని అమరేశం రాజేశ్వర శర్మ గారి అభిభాషణం. నన్నెచోడుడి కవిత్వంలో ఉన్న వన, ఋతు, సముద్ర, చంద్రోదయ, సూర్యోదయ, జలకేళ్యాది వర్ణనలను ప్రకృతి వర్ణనలు గానే పరిగ్రహించవచ్చు. నన్నెచోడుడు కుమారసంభవావతారికలో అష్టాదశ వర్ణనలను పేర్కొన్నాడు.

వన జలకేళీ రవి శశి
తనయోదయ మంత్రగతి రత క్షితిప రణాం
బునిధి మధు ఋతు పురోద్వా
హ నగ విరహ దూత్య వర్ణ నాష్టాదశమున్ (1-44)

## 13.9 వస్తు కవిత్వం - ప్రబంధ కవిత

అందువల్ల ఈ వస్తు కవిత్వం వర్ణనా బాహుళ్య బంధురమైన ప్రబంధ కవిత్వానికి సన్నిహితంగా గోచరిస్తున్నది. వస్తు కవిత అంటే ప్రబంధ కవిత్వమే అని, ప్రబంధాలు పలు విధాలని, అందులో మహా కావ్యం వస్తువు అంటే కథా ప్రాధాన్యం కలదనీ, అటువంటి వస్తువును ఆశ్రయించినదే వస్తు కవిత అని వేదం వెంకటరాయ శాస్త్రి గారు వ్రాశారు. అది చాటు ప్రబంధాదుల వంటిది కాదని పేర్కొన్నారు.

కనుక వస్తు కవిత్వం అంటే కథా ప్రధానమైన కవిత్వమని, వర్ణనాత్మకమైన కవిత్వమని సహజ కవిత్వమని ప్రకృతి

చిత్రణాత్మకమైన కవిత్వమని ప్రబంధ కవిత్వమని భావించవచ్చు.

### 13.10 వస్తు కవిత్వం - పాత్ర పోషణం

లోకంలో తన కళ్ల ఎదుట జరిగే వృత్తాంతాన్ని గమనించేటప్పుడు లేదా పురాణేతిహాసాల్ని చదివేటప్పుడు కవికి ఆ వృత్తాంతాల్లో అంతర్భూతమైన పుణ్యమో పురుషార్థమో, వస్తు సౌందర్యమో లేదా ఆ కథా గమనానికి కారణభూతాలైన పాత్రల ప్రవర్తనమో నచ్చుతుంది. అతని హృదయం ఆకృష్టమై పరవశమౌతుంది. ఆ మురిపెమే కవికి భావావేశాన్ని కలిగించి కావ్య రచనా కుతూహలాన్ని ప్రేరేపిస్తుంది. కవి తాను చూచిన మహత్వాన్ని వ్యక్తం చేయడానికి ఆ కథను కావ్య వస్తువుగా స్వీకరిస్తాడు. వస్తువు అనే ఉపాధిలేకుండా పాత్రను ఉన్మీలించడానికి అవకాశం లేదు. అలాగే పాత్ర అనే ఉపాధి లేకుండా వస్తువే లేదు. కాబట్టి పరస్పరాశ్రితాలైన వస్తు పాత్రలు కలిసి కవికి కావ్య వస్తువుగా లభ్యమౌతాయి. ఇది కవితా శిల్పం. ఈ శిల్ప రచన పరిణత బుద్ధి, నిర్వహణ సామర్థ్యం గల కవులకు మాత్రమే సాధ్యం. ఇది సృష్టికి ప్రతిసృష్టి. ఈ కావ్యం పద్యంగా గాని, గద్యంగా గాని చంపవుగా గాని ఉండవచ్చు. శ్రవ్యంగా గాని దృశ్యంగా గాని ఉండవచ్చు.

శ్రవ్య కావ్యాన్ని వ్రాసేటప్పుడు కవి పాత్రలను తన వెనుక నిలుపుకొని, పాఠకులకూ పాత్రలకూ మధ్య తాను నిలుస్తాడు. అవసరమైనప్పుడు పాత్రల్ని మన ముందు నిలబెట్టి వాటి చేత మాటలాడిస్తాడు. అవసరం లేనప్పుడు పాత్రల్ని వెనక్కు నెట్టి తానే మాటలాడతాడు. ఇలా పాత్రల ద్వారా కొంత, తన ద్వారా కొంత కథను నడుపుతాడు. ఇది అంతా వీధి నాటకం సూత్రధారుడి పనిలా ఉంటుంది.

దృశ్య కావ్యంలో కవి మనకు కనపడడు. పాత్రలను సృష్టించి వాటి ద్వారా కథ నడుపుతాడు. పాత్రలను మన ఎదుట నిలబెట్టి అవే ఆడేటట్లు చేస్తాడు. తాను ఉదాసీనుడుగా సాక్షిభూతుడుగా ఉంటాడు. భావ కవిత్వంలో కవి మన ఎదుట పూర్తిగా ఉండి, తన కష్ట సుఖాలు వెళ్లబోసుకుంటాడు. శ్రవ్య కావ్యంలో కొంతసేపు మాత్రమే కనిపిస్తాడు. దృశ్య కావ్యంలో తాను సృష్టించిన పాత్రలను మన ముందు నిలిపి తాను కనపడకుండా పోతాడు. శ్రవ్య కావ్యంలో సైతం ఇలాంటి ప్రజ్ఞను చూపిన తిక్కనాది కవులున్నారు. వారైనా శ్రవ్య కావ్య స్వభావాన్ని బట్టి పోవలసి ఉంటుంది. కనుక నాటకంలో లాగా కేవల సాక్షిభూతులుగా ఉండడం కుదరదు. అయితే మొత్తం మీద వారి పాత్రలు రసాధారాలై, నిత్య జీవితంలో మనకు తారసపడే బంధు మిత్రాదుల కన్నా సన్నిహితాలై రాణిస్తాయి.

పాత్ర చిత్రణం రెండు రకాలుగా ఉంటుంది. (1) ప్రత్యక్ష పద్ధతి, (2) పరోక్ష పద్ధతి. కవి పాత్రను వర్ణించడం ప్రత్యక్ష పద్ధతి (Direct method). స్వయం వ్యక్తం చేయడం పరోక్ష పద్ధతి (Indirect method). మొత్తం మీద కావ్యంలో కవి ఎంత తక్కువ కనిపిస్తే అంత మంచిది అని ఏంగిల్స్ కూడా అభిప్రాయపడ్డాడు.

భారతం అసంఖ్యాక పాత్రలతో నడిచే అతి విస్తృత ప్రపంచం. విపులతరమైన పటం మీద చిత్రింపబడ్డ మూర్తుల్లో సూక్ష్మరేఖలు మరుగుపడతాయి. ఇది చిత్రలేఖన కళాధర్మాల్లో ఒకటి. సాహిత్యంలో కూడా విపులతర వస్తు ప్రపంచంలో సూక్ష్మ వివరణాలు కవి భావనను తప్పించుకొని పోతాయి. భారతంలో అటువంటి సూక్ష్మ వివరణ విస్మరణం ఎక్కడా జరగలేదు.

తెలుగు కవులలో పాత్ర చిత్రణకు తిక్కన పెట్టిన పేరు. శబ్దం నుంచి రూపాన్ని సృష్టించిన మహా మాంత్రికుడాయన. ఆయన "సినిమాటిక్"గా రాస్తాడని శ్రీశ్రీ ప్రశంస. తిక్కన షేక్స్పియర్‌కు ఏ మాత్రం తీసిపోడు. షేక్స్ పియర్ కూడా తిక్కనలాగా స్త్రీ పాత్రలను పోషించలేక పోయాడని పి.వి.రాజమన్నారు గారి అభిప్రాయం. పాత్ర చిత్రణంలో హావభావాల్ని తిక్కన అద్భుతంగా చిత్రించాడు. వాటి ఆంగిక వాచిక ఆహార్య సాత్త్వికాభినయాల్ని కళ్లకు కట్టినట్లుగా చిత్రించాడు.

## 13.11 వస్తు కవిత్వం - ప్రకృతి వర్ణనలు

వస్తు కవిత్వ మంటే వర్ణనా ప్రాధాన్యమని కూడా మనం గమనించాం. అసలు కవిత్వమంటేనే వర్ణన అని మన ప్రాచీనుల అభిప్రాయం. లోకోత్తర వర్ణనా నిపుణైన కవి కర్మ కావ్యం అని వారు ఉద్ఘాటించారు. వర్ణనలు రెండు విధాలుగా కనిపిస్తాయి. స్థిరవస్తు వర్ణనలు, చరవస్తు వర్ణనలు. ఒక వస్తువును యధాతథంగా చెప్పడం ఒక పద్ధతి. ఇంకొక వస్తువుతో పోల్చి చెప్పడం మరో పద్ధతి. వర్ణనలు సహృదయుణ్ణి భావనా సాగరపు అంచుల మీద విహరింపజేస్తాయి. స్పష్టమైన, సముచితమైన, ఆత్మీయతా భరితమైన రసాద్యుపస్కారకమైన వర్ణనలకే ఈ అద్భుతశక్తి ఉంటుంది.

కవికి గల దార్శనిక భావుకతా శక్తుల వల్ల వర్ణనలు రూపొందుతాయి. అనేక వస్తువులు అనేకులకు అనేక విధాలుగా గోచరిస్తాయి. ఒక్కొక్కసారి దేశకాల పరిస్థితుల్ని బట్టి ఒక్కడికే పెక్కు తీరులుగా కన్పిస్తాయి. అటువంటి భిన్నత్వమే కళకు ప్రాణం. ఇదే ఉపజ్ఞ లేక ఆత్మీయత. శాస్త్రాలు విషయ ప్రధానాలు కాబట్టి అందులో వ్యక్తిగతమైన ఆత్మధర్మం ఉండదు. కళలు కర్తృత్వ ప్రధానాలు కాబట్టి ఉపజ్ఞ లేకపోతే ఊపిరి లేనట్లే. కవి సమయాలను అనుసరించి అపరిమితంగా వర్ణించే క్లేశం కన్నా తన అనుభవం ఆధారంగా రచించే వర్ణనావేశం మిన్న, వర్ణించేటప్పుడు కవులు అప్రమత్తంగా ఉండవలసిన విషయం మరొకటి. అది అంగాంగి సంఘటనం. వర్ణనలు కథతో పొత్తు కలిగి ఉండాలి. అంతే కాదు హత్తుకు పోవాలి. వర్ణనలు వస్తువేగ నిరోధకాలు కాకూడదు. కథాగత పాత్రల మానసిక స్థితిగతుల కనుకూలంగా నేపథ్యం చేకూర్చాలి. ప్రకృతిని వర్ణించేటప్పుడు సర్వలక్షణ సంపన్నంగా రచించడం మంచిది కాదు. విశిష్ట లక్షణాలనే వర్ణించాలి.

వర్ణనలు అనగానే మనకు ప్రకృతి వర్ణనలు స్ఫురిస్తాయి. మానవునికి మానవులతో మాత్రమే సంబంధం ఉండదు. మానవులందరికీ తాముండే ప్రకృతితో సంబంధం తప్పకుండా ఉంటుంది. ప్రకృతి అందచందాలకు ఆదిమ మానవుడు పరవశించాడు. ప్రకృతి విలయతాండవం చేసినప్పుడు భయపడ్డాడు. ఇలా ప్రకృతికి, కవిత్వానికి అవినాభావ సంబంధముంది.

ప్రకృతి కవిత్వానికి ఒక ఆవరణమో, జీవితానికి ఒక అలంకారమో, తత్వానికి ప్రాణప్రదాయినో తప్పక అవుతుంది. వర్డ్సువర్తు కవీశ్వరుడు ప్రకృతిని తన జీవిత భాగస్వామిని కావించుకొని కవిత్వమల్లి విశ్వచైతన్యం కలిగించాడు. షేక్స్పియర్ ప్రకృతిని జీవిత వివిధ వాద్య సమ్మేళనాలలో ఒక వాద్యం కావించుకున్నాడు. ఆధునిక కవులు ప్రకృతిని విశ్వభూషణంగా వర్ణించారు అని అరవిందుల ప్రవచనం.

షేక్స్ప్రియర్ రచనలలో ప్రకృతి సౌందర్యానికి పురస్కారం లేకపోలేదు. కాని మానవాత్మ విశాల విశ్వాత్మలో ఏకత్వాన్ని పొందడాన్ని అతడు చిత్రించలేక పోయాడు. కాని వర్డ్సువర్తు, షెల్లీ మొదలైన తరువాతి కవుల్లో ఈ విధానం గోచరిస్తుంది. వీరు ప్రకృతి సాక్షాత్కారాన్ని పొందారు. దానితో తాదాత్మ్యానికి తహతహలాడారు. ఇది వారి కాలంలో యూరపు ఖండం అంతటా ఏర్పడ్డ బృహత్పరిణామం. ఈ పరిణామం భారతీయ దార్శనిక ప్రభావం వల్ల ప్రభవించింది. జర్మనీ మొట్టమొదటగా ఈ ప్రబోధానికి పులకించింది.

మిల్టను మహాకవి కృతమైన 'పారడైజు లాస్టు' మహాకావ్యంలో మానవుడికి ప్రకృతితో ఉన్న సంబంధం కొంత నిరూపితమైంది. మిల్టను నందనోద్యాన సౌందర్యాన్ని సురుచిరోజ్జ్వల శబ్దాలతో వర్ణించాడు. అందులో పశుపక్ష్యాదులు పరస్పర సహన సద్భావాలతో సంచరిస్తున్న మనోహరంగా వర్ణించాడు. కాని మానవుడికి వీటికి గల సంబంధం ఇందులో కన్పించదు. మానవ సౌఖ్యానికే అవి సృష్టించబడ్డాయి. మానవుడే వాటి సర్వాధికారి.

భారతీయులు మానవుడికి ఆధిక్యాన్ని అంటకట్టడానికి యత్నించలేదు. పృథగ్భావానికి తావులేదు. సమగ్ర సానుభూతి, సంపూర్ణావగాహనకు మాత్రమే కాకుండా ప్రకృతి తాదాత్మ్య సాధనానికి పెద్దపీట వేశారు భారతీయులు.

ప్రకృతి సౌందర్యానికి ఆలవాలమైన ప్రదేశాల్లో భారతీయులు తమ పుణ్యక్షేత్రాలు ఏర్పరుచుకున్నారు. ఇక్కడ మానవుడు లౌకిక పరతంత్ర విముక్తుడై స్వచ్ఛందంగా జీవిస్తాడు.

ప్రకృతి మానవుడి అవసరాలు తీర్చేది మాత్రమే కాదు, ఆత్మ సాక్షాత్కారానికి తోడ్పడేది. భారతీయులు తమ ప్రవిమల ప్రేమ స్వభావంతో అఖండ ప్రకృతి మహత్త్వాన్ని తమలో విలీనం చేసుకున్నారు. ప్రకృతిలోని చిత్ర విచిత్ర వర్ణాలు, మనోహర సౌరభాలు, మధుర గానాలు, అనంత భగవత్తత్త్వానికి మానవ హృదయాలను పురికొల్పుతాయి. భారతీయ సాహిత్యం ఏవంవిధ ప్రకృతి సాక్షాత్కార వైభవంతో తులతూగే దివ్య సాహిత్యం అని విశ్వకవి రవీంద్రులు ప్రవచించారు.

మహర్షుల సందేశ సౌరభాన్ని గుబాళించే మన మహేతి హాస గాథలు ఆరణ్య వృక్షచ్ఛాయల్లో ఆవృత్తమైనవే. సర్వోత్కృష్టమైన మన సంస్కృత రూపక ద్వయం శాకుంతలం, ఉత్తర రామచరిత్రం ఆరణ్యాశ్రమ దృశ్య మహిమ సమన్విత మహర్షి, దివ్యశక్తి సముత్పుల్లాలే.

భారతీయ సాహిత్యంలో ప్రధానంగా రామాయణ భారతాలలో ప్రకృతి వర్ణనల పరమోదాత్తంగా తీర్చి దిద్దబడ్డాయి. రామాయణంలోని పర్వతారణ్య ఋతువర్ణనలు రమ్యతరాలు. వాల్మీకి మహర్షి ప్రకృతి సౌందర్య చిత్రణలో కిష్కింధాకాండంలోని వర్షాశరద్వర్ణనలు అత్యంత ప్రధానాలు. ప్రకృతి వర్ణనలలో వాల్మీకి ఈ క్రింది విధానాలను అవలంబించాడు.

1. సహజ స్థితి వర్ణన - స్వభావోక్తి మూలంగా కావించడం.

2. ఉత్ప్రేక్షాతి శయోక్తుల మూలంగా వర్ణించడం.

3. తిర్యక్కుల జీవితంతో సానుభూతి ప్రకటించడం. మరికొన్ని సందర్భాల్లో ప్రకృతి మానవ జీవితంతో సానుభూతి వహిస్తున్నట్లు నిరూపించడం.

4. సమాసోక్తి అలంకార విషయంగా ప్రకృతిని వర్ణించడం. అప్రస్తుత విషయ ప్రశంస ధ్వనించేటట్లు చేయడం.

5. ప్రకృతి వర్ణనలను సప్రయోజనంగా కూర్చడం.

కాళిదాసాది మహాకవులు వాల్మీకికి శిష్యులై ప్రకృతి వర్ణనల్లో కృతకృత్యులయ్యారు. కాళిదాసు అత్యున్నత శిఖరం అందుకొన్న నిపుణుడు. చరవస్తు వర్ణనలలో ఆయనకు ఆయనే సాటి. సమీరణోత్థేవ తరంగలేఖా/పద్మాంతరం మానసరాజ హంసీమ్ (రఘు. 6-26) వికసించిన తామరపూలతోను, తెల్లని హంసలతోను ఉండే సరస్సౌందర్యం హాయిని చేకూరుస్తుంది. ఇది నిశ్చల దృశ్యమైనా మనోజ్ఞమే. పిల్లగాలుల తాకిడి వల్ల నీటి మీద చిన్న చిన్న తరంగాలు ఏర్పడి, అవి తాకితే అటు ఇటు కదిలే పద్మాలు, కలహంసలు కలిగిన సరోవరం అత్యంత రమణీయం. ప్రకృతి మాత ఋతువు కొక రుచిరాలంకృతి సవదరించుకొని శోభిల్లుతుంది. అటువంటి ఋతుశోభను చిత్రిస్తూ కాళిదాస మహాకవి 'ఋతు సంహార' మనే ప్రకృతి కావ్యాన్ని ఎప్పుడో రచించాడు. అనంతర కాలంలో ఎప్పటికో గాని ఇటువంటి కావ్య రచన ప్రపంచ సాహిత్యంలో పొడకట్టలేదు.

మన కవిత్రయం వారు వాల్మీకి వ్యాస కాళిదాసాది కవుల కవితాంబుధిని ఆపోశనం పట్టారు. వారి వర్ణనా వైదగ్ధ్యాన్ని పుణికి పుచ్చుకొన్నారు. నన్నయ వర్ణనలు తైల వర్ణ చిత్రాలను, తిక్కన వర్ణనలు రేఖా చిత్రాలను పోలి ఉంటాయి. నన్నయ వర్ణనలు భవిష్యత్కథా సూచకాలు. తిక్కన వాచ్యంగానే పాత్రల స్థితిగతులలో ప్రకృతి వర్ణనల్ని అనుబంధిస్తాడు. ఎర్రన శైలి వర్ణనాత్మకం. అందువల్లనే ఆయన ప్రబంధ పరమేశ్వరుడయ్యాడు. ఎర్రన పశు పక్ష్యాదుల్ని వర్ణించినా మానవుల్ని వర్ణించినా రమ్య శబ్ద చిత్రాన్ని సృజించి పాఠకుల కళ్ల ఎదుట నిలబెడతాడు. నన్నయ లేఖిని శారద రాత్రుల వర్ణనతో ఆగిపోవడం, అక్కడ నుంచి ఎర్రన అందుకోవడం విశేషం. కవిత్రయం వారి ప్రకృతీతర వర్ణనలూ పరమ రమణీయాలు. ముఖ్యంగా తిక్కన యుద్ధ వర్ణనలు

ప్రసిద్ధాలు. వర్ణ రంజిత, రూప రంజిత, భావ రంజిత, రణాంగణ వర్ణనా వైశద్యంలో తిక్కన పరిణత ప్రజ్ఞుడు. తిక్కన గంటమే ప్రాచీన భారతీయ కదన కళకు కడసారి కుంచె. యుద్ధ సందర్భాలలో ఆయన చేసే ప్రకృతి వర్ణన కథా సన్నివేశాలతో సంబంధం కలిగి ఉంటుంది. ఆయన సూర్యోదయ సూర్యాస్తమయ వర్ణనలు యుద్ధ విరామాదుల్ని సూచించడం కోసం చేస్తుంటాడు. వర్ణనాశ్వాల్ని నిగ్రహ ప్రగ్రహంతో నడపడం కవిత్రయం వారి ప్రత్యేకత.

శ్రీనాథుడు కథా మాత్ర ప్రధానాలైన పురాణాల్ని వ్రాయదగిన కవి కాదు. ప్రబంధోచితమైన వర్ణనలతో కథను అలంకరించి గ్రంథాన్ని విస్తరింపజేస్తే గాని ఆయనకు తృప్తి కలగదు. వర్ణనీయ వస్తువు ఎలాంటిదైనా తనివితీరా వర్ణించడం శ్రీనాథుడికి పరిపాటి. ఆయన భీమేశ్వర పురాణంలో ద్రాక్షారామాన్నే కాకుండా గోదావరీ మండలంలోని నదుల్ని, కొండల్ని, గుళ్లూ - గోపురాల్నీ, తీర్థక్షేత్రాల్ని రమణీయంగా వర్ణించాడు.

## 13.12 వస్తు కవిత్వం - సహజ కవిత్వం

వస్తు కవిత్వం అంటే సహజ కవిత్వం అని కూడా అర్థం. తెలుగు కవుల్లో కవియోగులు పోతన, వేమనలు అచ్చమైన సహజ కవులు. మొల్ల కూడ వీరితో పాటు చెప్పుకోదగిన సత్కవయిత్రి. పోతన కావ్యానికి విష్ణుస్తుతే ప్రాణం అన్నాడు. హరినామ స్తుతి గల కావ్యం బంగారు తామరలతో, హంసలతో ప్రకాశించే మానస సరస్సు వంటిదని, అది లేని కావ్యం విచిత్రార్థ భరితమైనా శోభాస్పదం కాదని, అది కాకుల గోలతో నిండిన గుంటతో సమానమనీ అన్నాడు పోతన సహజ పాండిత్యుడు. భక్తి భరితమైన ఆయన హృదయం నుండి దూసుకు వచ్చిన అతి మధుర పద్యాలు గేయ సదృశంగా అందరూ అన్ని వేళలా పాడుకోవడానికి అనువుగా ఉంటాయి. ఆయన భాగవతం అందరికీ ఆరాధ్యం కావడానికి కల ప్రధాన కారణాల్లో ఇదొకటి. వేమన కూడా సహజ పాండిత్య ప్రశస్తి సమేతుడు. ఈయన వస్తువులో వైవిధ్యాన్ని ప్రదర్శించాడు. తన చుట్టూ జరిగే విషయాల్ని ప్రజల భాషలో పద్యాలుగా వ్రాయడం వేమన సహజ కవిత్వంలోని ప్రధానాంశం. మొల్ల కూడా సహజ కవితా పరిమళాన్ని విరజిమ్మిన కవయిత్రి. తేనె సోకగానే నోరు తీయన అయినట్లుగా కవిత్వం వినగానే అర్థమంతా స్ఫురించాలని, అలా కాకుండా గూఢ శబ్దాలు గుప్పితే ఆ కావ్యం మూగ చెవిటి వారి ముచ్చట అవుతుందని చెప్పింది. ఆమె రామాయణం సహజ కవిత్వ సంశోభితం.

## 13.13 వస్తు కవిత్వం - ప్రబంధ కవిత్వం

వస్తు కవిత్వమంటే ప్రబంధ కవిత్వమన్న భావనకు ప్రకృతి వర్ణనా బాహుళ్యమే కారణం. ప్రబంధంలో రచనా కళకు కూడా ప్రాధాన్యముంది. ప్రబంధ కవిత్వంలో కథానాయిక నడుములాగా కనపడీ కనపడనట్లుగా ఉంటుంది. ఇతిహాస పురాణాదుల లోని కథలను రేఖామాత్రంగా స్వీకరించి పాత్రపోషణ వర్ణనాలంకారాలతో పెంచి వ్రాశారు ప్రబంధ కవులు. అల్లసాని పెద్దన ఆంధ్ర కవితా పితామహుడు అంటే ప్రబంధ కవితనే దృష్టిలో ఉంచుకోవాలి. ఆయన మనుచరిత్ర మార్కండేయ పురాణంలోని చిన్న కథను పెంచి వ్రాసింది. పెద్దన సృష్టించిన వరూధినీ ప్రవర పాత్రలు, తిమ్మన సృష్టించిన సత్యా కృష్ణ పాత్రలు, ధూర్జటి సృష్టించిన తిన్నడు, నత్కీరుడు, రామకృష్ణుడు సృష్టించిన నిగమశర్మ మరపురాని పాత్రలు. శ్రీకృష్ణ దేవరాయల వారి ప్రకృతి వర్ణనలు ప్రశంసార్హాలు. సూరన కళాపూర్ణోదయంలో - కల్పిత కథకూ, కథను మధ్యలో ప్రారంభించి, తరువాత మొదటి కథ చెప్పి తరువాత ముగించే శిల్పానికీ ప్రాధాన్యమిచ్చాడు. మూడు జన్మల కథను ఆధునిక నవలా పద్ధతిలో రచించాడు. సూరన కళాపూర్ణోదయం "అత్యపూర్వ కథా సంవిధాన వైచిత్రీ మహనీయం". రామరాజభూషణుడు మిశ్ర వస్తువుకు ప్రాధాన్యమిచ్చాడు. సూరనను దృష్టిలో ఉంచుకొని కాబోలు "కేవల కల్పనా కథలు కృత్రిమ రత్నములు" అన్నాడు. పూర్వ గాథలు పుట్టురత్నాలు అన్నాడు. మిశ్ర కథలు సానలు తీరిన జాతి రత్నాలు అన్నాడు.

నన్నయ కథలో ఉన్న ప్రసన్నత సూరనాదులలో లేదు. నన్నయ ఛాసరు వంటివాడు. వీరిద్దరూ నిర్మలమైన నవనీత

సుకుమారమైన మనస్సు కలవారు, ప్రసన్న రచనా ప్రియులు. నన్నయ కథ పచ్చగడ్డి ఒడ్డుల్ని చుంబిస్తూ తిన్నగా పరుగెత్తే తేనెవాక. సూరన కథ కొండ వాగు వలె వంకరలు తిరుగుతూ ఉరుకులు తీస్తూ ఉంటుంది.

ఆ తరువాత కాలంలో కొందరు కవులు, కవయిత్రులు అసత్కథలను తీసుకొని కావ్యాలు వ్రాశారు. శశాంక విజయం, రాధికా సాంత్వనం, అహల్యా సంక్రందనం లాంటి ప్రబంధాలు పారిదారికా శృంగార ప్రబోధకాలు.

## 13.14 వస్తు కవిత్వం - ఆధునిక కవిత్వం

మన ప్రాచీన వస్తు కావ్యాలు అగ్రవర్ణాల కథలకు పాత్రలకే అధిక ప్రాధాన్యాన్ని ఇచ్చాయి. సుకుమారుడు, నిగమశర్మ, నిరంకుశుడు మొదలైన పాత్రలకు సాంఘిక స్పర్శ ఉన్నా అవి అగ్రవర్ణాలకు చెందిన పాత్రలే బసవ పురాణాదులలో మడివాలు మాచయ్య వంటి పాత్రలు శూద్ర పాత్రలు భక్తి ప్రధానమైనవి కొద్దిగా కన్పిస్తాయి. ఆధునిక కవిత్వంలో నాయికా నాయకుల విషయంలో గుణ ప్రాధాన్యమే కాని కుల ప్రాధాన్యం ఉండదు. జాషువ గారి గబ్బిలంలో బక్క చిక్కిన దళితుడు నాయకుడు ఇది వస్తు పరంగా గొప్ప విప్లవం. ఇక వర్ణనల విషయంలో అంగాంగ వర్ణనలకు ప్రాచీన వస్తు కవిత్వంలో ప్రాధాన్యముంది. ఆధునిక వస్తు కవిత్వంలో ఇది పరిత్యక్తమైంది. భావ ప్రకటన సాధనాలు కాబట్టి ముఖ నేత్రాదులను కొంతమంది వర్ణించారు. వక్షోజ జఘన వర్ణనలను వదలివేశారు. అంగ వర్ణన కన్నా అంతరంగ వర్ణన మిన్న అని నవ్యులు భావించారు.

గురజాడ వారి కన్యక, పూర్ణమ్మ, లవణరాజు కల మొదలైన ఖండికలు వస్తు కవిత్వ మణి దర్పణాలు. రాయప్రోలు వారి కష్ట కమల, స్నేహలత, స్వప్న గమారం, తృణ కంకణం ప్రసిద్ధ వస్తు కావ్యాలు. తృణ కంకణంలోని అమలిన శృంగారం ఆధునిక సమాజానికి అనుసరణీయం.

భావ కవిత్వంలో నాయికా శృంగారం శిఖరస్థానమందుకొన్న కావ్యాలు ఊర్వశి, కిన్నెరసాని పాటలు, యెంకి పాటలు, శశికళ, హృదయేశ్వరి, సౌభద్రుని ప్రణయ యాత్ర. ఊర్వశి, శశికళ, హృదయేశ్వరిలోని నాయిక, సౌభద్రుని ప్రణయ యాత్రలోని వత్సల ఆయా కవులు వైయక్తికంగా ప్రేమించిన సందరీమణులు. ఊర్వశి, శశికళ లౌకిక వాసనల కతీతమైన ఊహాస్వప్నలు. హృదయేశ్వరి లోని నాయిక, సౌభద్రుని ప్రణయ యాత్ర లోని వత్సల లౌకిక గంధమున్న నాయికలు. ఆ కవుల జీవితంతో పెనవేసికొని పోయిన వాస్తవిక మూర్తులు. కిన్నెర, యెంకి కవుల నిత్య జీవితంతో సంబంధమున్న వారు కారు, కళాత్మక అమృతమూర్తులు.

భారత జాతీయోద్యమాన్ని అనేక కవులు ఆత్మాశ్రయ కవిత్వంగా చిత్రించారు. కొంతమంది కవులు పరాశ్రయ కవిత్వంగా అంటే వస్తు కవిత్వంగా చిత్రించారు. కొంతమంది పౌరాణిక వస్తువును, కొంతమంది చారిత్రక వస్తువును స్వీకరించారు. దువ్వూరి రామిరెడ్డి గారు 'ద్రౌపదీ సందేశం' లో జాతీయతను ప్రబోధించారు. చామర్తి రాజశేఖరరావు గారు 'పాంచాలీ సాంత్వనం' లో ఇంగ్లీషు వారిని కౌరవులుగా, ద్రౌపదిని భారతాంబగా, ధ్వనింపజేశారు. కరుణశ్రీ గారి ఉదయశ్రీ లోని 'ధనుర్భంగం' ఖండికలో జాతీయతా వాసన గుబాళిస్తుంది. రాముడు శివధనుర్భంగం చేయగానే -

చెల్లరే విల్లు విరచునే నల్లవాడు
పది పదారేండ్ల యెలరాచ పడుచువాడు
సిగ్గు సిగ్గంచు లేచి గర్జించినారు
కనులు గుట్టిన తెల్ల మొగాలవారు

ఇక్కడ 'నల్లవాడు' భారతీయుడు. 'తెల్ల మొగాలవారు' బ్రిటీషు వారు. భారత జాతీయ భావనను, గర్భీకరించుకొని

ఆధునిక పంచ కావ్యాలు ఆవిర్భవించాయి. పింగళి, కాటూరి కవుల సౌందరనందంలోని వస్తువు బౌద్ధమైనా సందేశం గాంధీ సందేశమే. రాణా ప్రతాపసింహ చరిత్ర, శివభారతం భారత జాతీయ భావన వస్తువుగా ఒకే ఊరిలో - ప్రొద్దుటూరులో - వెలువడిన మహాకావ్యాలు. ఇవి సూర్యచంద్ర సదృశాలు. వీని తేజస్సు, ఓజస్సు నిరుపమానం. తుమ్మలవారు రచించిన మహాత్ముడి 'ఆత్మకథ' కూడా ఈ కోవలోనిదే. మధునా పంతుల వారి ఆంధ్రపురాణం ఆంధ్రాభిమాన సాంద్రం. ఈ పంచ కావ్యాల వంటిదే విశ్వనాథ వారి ఆంధ్ర ప్రశస్తి కావ్యం. విశ్వనాథ వారి చేతి చలువతో కంకాళం లాంటి చరిత్రకు ప్రాణ ప్రతిష్ఠ జరిగింది. "పూర్వాంధ్ర ధతాధినాయక కథా మంజూషికా రత్న గాథా పద్యావలి పేరి" "మహాప్రబంధ రచనా సౌందర్యపున్ వాసనల్ తీపై క్రమ్మగ" ఖండ కావ్య హారాలు అల్లబడ్డాయి. దువ్వూరి రామిరెడ్డి గారు కర్షక జీవిత వర్ణనతో రచించిన వస్తుకావ్యం కృషీవలుడు. ఈయన 'వన కుమారి' కావ్యంలో గోపకుల జీవితాన్ని చక్కగా చిత్రించాడు. సంఘ వ్యవస్థా నిరసన భావాలతో త్రిపురనేని రామస్వామి చౌదరి గారు సూత పురాణాన్ని రచించారు. హరిజన దేవాలయ ప్రవేశం, అస్పృశ్యతా నివారణం వస్తువులుగా కాటూరి 'గుడిగంటలు' కావ్యాన్ని వ్రాశారు.

శ్రీశ్రీ మహా ప్రస్థానంలోని 'బాటసారి', 'భిక్షువర్షీయసి' 'ఉన్మాది' మొదలైన ఖండికలు అభ్యుదయ కవితా మార్గానికి చెందిన చక్కని వస్తు కవితలు. 'బాటసారి' లో కూటికోసం కూలి కోసం పట్టణంలో బ్రదుకుదామని తల్లి మాటలు చెవిని పెట్టక బయలుదేరిన బాటసారి నిస్సహాయ స్థితిలో పొందిన దయనీయమైన మృత్యువును కవి వర్ణించాడు. 'భిక్షు వర్షీయసి' లో ఆరిన కుంపటిలాంటి కాంతిలేని గాజు కళ్ల ముసలిది, ఆమె ప్రక్కన ఎముక ముక్క కొరుకుతున్న కుక్క, ఈగను అందుకునే తొండ, ఎంగిలాకు కవితా వస్తువులు 'ఉన్మాది'లో వెర్రివాడు కథానాయకుడు. 'బుద్ధిమంతులు' చేసిన అన్యాయం వల్ల వెర్రిఎత్తిన కుర్రవాడు అతడు.

ఆధునిక యుగంలో సంప్రదాయ మార్గంలో వెలువడ్డ నిస్తుల వస్తు కావ్యం విశ్వనాథ సత్యనారాయణ గారి శ్రీమద్రామాయణ కల్పవృక్షం. వస్తువులో వాల్మీకిని, రచనలో నన్నయ తిక్కనలను ఆదర్శంగా గ్రహించి, జీవుని వేదన, మనోలక్షణ నివేదన ప్రధాన గుణాలుగా విశ్వనాథ వారు కల్పవృక్ష రచన కావించారు. ఈ వస్తు కావ్యానికి జ్ఞాన పీఠ పురస్కారం లభించడం మనకు గర్వ కారణం. వానమామలై వరదాచార్యుల వారి 'పోతన' కూడా చక్కని వస్తు కావ్యం. పల్లా దుర్గయ్య గారి 'గంగిరెద్దు' వస్తు నవ్యత గల సంప్రదాయ సిద్ధమైన కావ్యం. ఒక ఆవుదూడ ఈ కావ్యంలో నాయక పదవిని ఆక్రమించింది. గంగిరెద్దు నెపంతో కవి లోకవృత్తాన్ని చక్కగా ప్రయోగించాడు. దాశరథి 'మహాబోధి', బుద్ధుని జాతక గాథలు కొన్ని వస్తువుగా గల మనోజ్ఞ కావ్యం.

విద్వాన్ విశ్వం గారి 'పెన్నేటి పాట' నేటి రాయలసీమ కన్నీటి పాట. పెన్నేరు గట్టున ఉన్న పల్లెల బ్రతుకు నీడ ఇందులో ప్రతిబింబిస్తున్నది. రంగడు, గంగమ్మ అనే కాపు దంపతుల పరస్పరానురాగం, పరోపకార బుద్ధి, నిష్కల్మష ప్రవర్తనం ఇందులో చక్కగా చిత్రింపబడ్డాయి. బోయి భీమన్న గారి 'దీపసభ' సరికొత్త వస్తు కావ్యం. దీనిలో దీపం ప్రధాన వస్తువు. సృష్ట్యాది నుండి వెలువడిన వివిధ దీపాలు ఇందులోని పాత్రలు. మైనపు దీపం, బండి దీపం, హరికైన్ లైటు, ఉల్క, వీధి లాంతరు, విద్యుద్దీపం మొదలైనవి ఆ దీపాలు. విశ్వేశ్వరి అయిన పరంజ్యోతి అధ్యక్షతలో జరిగిన విశ్వదీపికా పరిషత్తు సమావేశంలో తమతమ అనుభవాల్ని విన్నవించుకొంటాయి. దీపాలన్నీ ఆ పరంజ్యోతి అంశలే అన్నది కావ్య సారాంశం. దీపం ప్రధాన వస్తువుగా మొట్టమొదట వెలువడిన సమగ్ర కావ్యం ఇదే.

సందేశ వస్తు కావ్యాల్లో పుట్టపర్తి వారి మేఘదూతం, మోటూరి వెంకటరావు గారి చకోర సందేశం ప్రధానమైనవి. ఒకానొక సామాన్య మానవుడు 'ధనిక వాదాన్ని' గర్హించిన కారణంగా 'అధికారుల' చేత నిర్బంధితుడై 'కుటిల కారాగార కఠిన దంష్ట్రాక్రకచ దళితుడై", ఆ 'బందిఖాన' నుండే తన ప్రేయసి స్మృతికి రాగా మబ్బుతో చేసికొన్న విన్నపం ఈ కావ్యంలో రసవంతంగా చిత్రించబడింది. ఆంధ్ర ప్రదేశంలోని వివిధ ప్రాంతాలూ, వర్తమాన స్థితిగతులూ మేఘ దూతంలో వర్ణితాలు. ఈ కావ్యమంతా ఖండగతిలో సాగింది.

వెంకటరావు గారి చకోర సందేశం విలోమ మార్గ కావ్యం. యక్షుని భార్య తన భర్తకు చకోరం ద్వారా సందేశం పంపడం ఈ కావ్యంలోని వస్తువు.

డాక్టర్ సి. నారాయణ రెడ్డి గారు గేయవస్తుకావ్య రచన కావించిన వారిలో అగ్రగణ్యులు. 'నాగార్జున సాగరం' కావ్యంలోని వస్తువు కల్పితం. మతానికి ప్రణయానికి జరిగిన సంఘర్షణ ఇందులోని ప్రధానాంశం. 'కర్పూర వసంతరాయలు' కుమారగిరి రెడ్డి లకుమల శృంగార జీవితాన్ని, లకుమ త్యాగ శీలాన్ని చిత్రించే కావ్యం. 'విశ్వనాథ నాయడు' రాజభక్తిని చిత్రించిన కావ్యం. 'నాగార్జున సాగరం' లో ప్రసన్న కథాకథనం, 'కర్పూర వసంతరాయలు' లో కవితా శిల్పం, 'విశ్వనాథ నాయడు' లో పాత్ర చిత్రణం ప్రధానగుణాలు. కథ, పాత్రలు, వర్ణనలు మొదలైన కావ్యాంగాలను దృష్టిలో పెట్టుకొని వృత్త వాసన స్ఫురించే గేయ ఛ్ఛందస్సులో రచింపబడ్డ గేయకథాకావ్యాల్లో 'నాగార్జున సాగరం' ఒక ప్రత్యేక సంవిధానానికి మార్గదర్శకమైంది. నారాయణ రెడ్డి 'జాతిరత్నం' జవహర్‌లాల్ నెహ్రూ గారి జీవిత చరిత్ర ఆధారంగా రచించబడ్డ వస్తు కావ్యం. ఈయన రచించిన 'విశ్వంభర' మానవ జీవన వికాసాన్ని చిత్రించిన వస్తుకావ్యం. అయితే ఇందులో పాత్రల పేర్లు, తేదీలు ఉండవు. విశ్వ మానవుడే దీని కథానాయకుడు. ఇది గూఢ వస్తుమయ కావ్యం. ఈ వస్తు కావ్యం కూడా జ్ఞానపీఠ పురస్కార భాజనం కావడం ముదావహం.

అనుభూతి కవిత్వం, విప్లవ కవిత్వం మొదలైన వాటిల్లో కూడ వస్తు కవిత్వం ఎంతో కొంత కన్పిస్తున్నది. శివసాగర్ రచించిన చెల్లీ! చెంద్రమ్మ ఖండిక చక్కని వస్తు కవితకు లక్ష్యం.

### 13.15 సమీక్ష

వస్తు కవిత కథా ప్రధానమైనది. పాత్రపోషణ, వర్ణనలు, ప్రకృతి చిత్రణం, సహజత్వం, ప్రాబంధిక ధోరణులు మొదలైనవి అన్నీ ఇందులో ఉంటాయి. దేశకాల పరిస్థితులను బట్టి వస్తు కవితలో ఎన్నో సంప్రదాయాలు, ప్రయోగాలు కనిపిస్తాయి. ఈ వస్తువు వస్తు కవితకు యోగ్యం, ఇది కాదు అనేది లేదు. శ్రీశ్రీ అన్నట్లు దేన్నీ హీనంగా చూడకూడదు. అన్నీ కవితామయాలే. వస్తు కవితలో భవిష్యత్తులోనూ నవ్య భవ్యరీతులు ఏర్పడి సహృదయ ప్రీతిపాత్రాలు కావాలి. ఈనాడు నవల కథానిక ప్రక్రియలు ప్రచుర ప్రచారాన్ని పొందినా, కవిత్వం ఆనందంతో వస్తు భారాన్ని స్వీకరిస్తూనే ఉన్నది. దేని అందం దానిదే. వస్తు కవిత్వం అంటే వస్తు గౌరవం, కవితా గౌరవం రెండూ సమ్యక్సమ్మేళనం చెందిన కళాఖండం.

### 13.16 ప్రశ్నలు

1. వస్తు కవిత్వాన్ని నిర్వచించండి.
2. వస్తు కవిత్వంలోని కథాకథన పాత్రోన్మీలన ప్రాధాన్యన్ని వివరించండి.
3. వస్తు కవిత్వంలోని ప్రకృతి వర్ణనల ప్రాముఖ్యాన్ని విశదీకరించండి.
4. 'వస్తు కవిత అంటే సహజ కవిత' 'వస్తు కవిత అంటే ప్రబంధ కవిత' - చర్చించండి.
5. ఆధునిక యుగంలోని వస్తు కవిత్వాన్ని గురించి సమీక్షించండి.

### 13.17 ఉపయుక్త గ్రంథాలు

1. సమగ్ర ఆంధ్ర సాహిత్యం, మొదటి సంపుటం - ఆరుద్ర
2. ఆధునికాంధ్ర కవిత్వము-సంప్రదాయములు, ప్రయోగములు - డాక్టర్ సి. నారాయణ రెడ్డి
3. భారత పద్యశైలి - డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి

4. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
5. ఆంధ్ర సాహిత్య చరిత్ర - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం

**డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి**
రీడర్ & ప్రిన్సిపాల్
శ్రీమతి కాసు రాఘవమ్మ బ్రహ్మానందరెడ్డి కళాశాల
నరసరావుపేట - 522 601

# పాఠం - 14

# నవల

పాఠ్యనిర్మాణక్రమం


14.0. లక్ష్యం

14.1. నవల - నిర్వచనములు

14.2. నవల - లక్షణములు

14.3. తెలుగు నవల - ఆవిర్భావము

14.4. నవలా వికాసము

14.5. నవలా భేదాలు

14.6. నవల ప్రధానాంగములు

14.7. నవలా రచయిత బాధ్యతలు

14.8. సమీక్ష

14.9. ప్రశ్నలు

14.10. ఉపయుక్త గ్రంథాలు


## 14.0 లక్ష్యం

1857 లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య సమరము తరువాత భారత దేశములో బ్రిటీష్ వారి రాజ్యము సుస్థిరమైనది. రాజకీయమైన పరిపాలనే కాక, సాంఘిక, విద్యాది రంగములలో ఆంగ్లేయుల ప్రభావము భారతీయ జీవన విదానము మీద ప్రసరించినది. సంఘ సంస్కర్తలు సాంఘిక దురాచారములను విమర్శించుచూ, వాటిని రూపుమాపడానికి ప్రయత్నించిరి. ఆంగ్ల సాహిత్య ప్రభావము ద్వారా ఉత్తేజితులైన రచయితలు, కవులు, ఆయా సిద్ధాంతాలను, భావాలను, ఆంగ్ల సాహిత్యము నుండి స్వీకరించిన నూతన ప్రక్రియల ద్వారా, తమ భారతీయ సాహిత్యములో ప్రతిబింబింప చేయాలని ప్రయత్నించిరి. దానికి ప్రతిఫలమే నూతన సృజనాత్మక ప్రక్రియలైన నవల, నాటకము, కథానిక, నాటిక, వ్యాసము, సమీక్ష, స్వీయచరిత్ర, జీవిత చరిత్ర, పీఠిక, సంపాదకీయము, అనువాద సాహిత్యము మొదలగు ప్రక్రియలు తెలుగు సాహిత్యము లోనికి ప్రవేశించినవి. ఇందులో నవలా విభాగ పరిశీలనమే ఈ పాఠ లక్ష్యం.

## 14.1 నవల - నిర్వచనములు

'నవల' అను పదము ఆంగ్లములోని Novel (నావెల్) అను పదానికి పర్యాయ పదముగా తెలుగులో వాడబడుచున్నది. ఆంగ్లములో Novel అను పదము "Novelle" అనే ఇటాలియన్ పదము నుండి వచ్చినది. ఆంగ్ల సాహిత్యములోనికి ఈ పదము 'Novellus', 'Novus' అను లాటిన్ భాషాపదము నుండి వచ్చి చేరినట్లుగా భావించబడుచున్నది. ఆంగ్ల సాహిత్యములో కాని, తెలుగు సాహిత్యములో కాని కాల్పనిక కథా సాహిత్యమంతా (fiction) ఈ ప్రక్రియగానే ఎంచబడుతున్నది. ఈ ప్రక్రియ 'నవల్ కథా' అనీ, మరాఠీ, కన్నడ భాషలలో 'కాదంబరీ' అనీ, బెంగాలి, హిందీ, పంజాబి, ఒరియా, అస్సామీ భాషలలో 'ఉపన్యాస్' అనీ, సంస్కృతములో 'నవలా' అనీ పిలవబడుతున్న ఈ ప్రక్రియ తెలుగు భాషలో 'నవల' అని పిలవబడుచున్నది. ఈ విధముగా తెలుగులో 'నవల' అని పిలవబడుటకు కారణము ఆంగ్ల శబ్దమునకు దగ్గరగా వున్నదనే కాదు, ఆంగ్లములో ఈ పదానికి ఉన్న 'క్రొత్తది' 'వినూత్నమైనది' అనే అర్థాన్ని కూడ స్ఫురింపచేయుచున్నది.

1872వ సంవత్సరములో 'శ్రీరంగరాజ చరిత్ర' కర్త శ్రీ నరహరి గోపాలకృష్ణమ చెట్టి గారు దీనిని 'నవీన ప్రబంధము' అనినారు. 1878వ సంవత్సరమున 'రాజశేఖర చరిత్రము' వ్రాసిన కందుకూరి వీరేశలింగము పంతులు గారు 'వచన ప్రబంధమ' ని ఈ ప్రక్రియను పేర్కొనినారు. ఆ తరువాత 1897లో శ్రీ కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి గారు రాజశేఖర చరిత్రకు పీఠిక వ్రాయుచు 'నవల' అనే పదమును మొట్టమొదటిసారిగా పేర్కొనినారు. అప్పటినుండి ఈ ప్రక్రియకు ఆంగ్లభాషలోని Novel పేరు తెలుగులో 'నవల'గా ప్రసిద్ధి కెక్కినది.

### 14.1.1. పాశ్చాత్యుల నిర్వచనములు

'నవలా' ప్రక్రియ గురించి అనేక మంది పాశ్చాత్యులు అనేక నిర్వచనము లిచ్చినారు. ఇది ఆధునిక ప్రక్రియ కనుకనూ పైగా పాశ్చాత్య సాహిత్య ప్రభావము నుండి భారతీయ భాషలలోనికి వచ్చినది కావున, నవలా ప్రక్రియ గురించి పాశ్చాత్య ప్రముఖుల అభిప్రాయములను ముందుగా తెలుసుకుందాము.

"యథార్థ జీవనాన్ని, యథార్థ దృష్టితో అధ్యయనం చేసి, దానిని గద్య రూపంలో వ్యక్తం చేసేదే నవల అని రిచర్డ్ క్రాస్ (Richard Cross) తన 'The Development of English Novel' అనే పుస్తకములో నవల గురించి నిర్వచించారు.

"నవల' అన్నది కేవలము గద్యాత్మకమయిన కాల్పనిక కథ కాదు. అది మానవుడి జీవితాన్ని గురించి, పరిపూర్ణ చేష్టలను గురించి గద్య రూపములో చెప్పబడిన వ్యాఖ్యానం" అని Roll Fox తన 'Novel and the People' అనే గ్రంథములో నవలను నిర్వచించినారు.

'సజీవమైన జగత్తులో పరిచయం చేసే కళాకృతి నవల చాలా విధాల ఈ జగత్తు మన చుట్టువున్న ప్రపంచాన్ని పోలి వుంటుంది' అని లార్డ్ డేవిడ్ సెసిల్ తన గ్రంథం 'Hardy the Novelist' లో నవలను పేర్కొనినారు.

'నవల జీవితానికి ప్రతిబింబము. మిగిలిన అన్ని సాహిత్య ప్రక్రియ కన్న దీని పరిధి విస్తృతమైనది' అని జె.బి. ప్రీస్ట్లీ తన 'The English Novel' గ్రంథములో పేర్కొనినారు.

"సామాజిక ప్రయోజనాత్మకమయిన నవల సమాజ ప్రగతికి దోహదం చేసే మంచి సాధనం. ఎన్నో గంభీర విషయాల్ని నవలలో వర్ణించిడానికి వీలుంది. నవల చరిత్రకు ప్రత్యామ్నాయం" అని హెచ్.జి. వేల్స్ నవలను గురించి నిర్వచించినారు.

"జీవితం ఉన్నది ఉన్నట్లు చిత్రించటం నవల కాదు" అని 'సోమర్ సెట్ మామ్' నవల నిర్వచించినారు.

వీరందరి అభిప్రాయం ప్రకారము నవలా ప్రక్రియనునది గద్యాత్మకమైనది, వాస్తవ జీవితాన్ని ప్రతిబింబించేది, సామాజిక ప్రయోజనాత్మకమైనది, సమాజ ప్రగతికి దోహదము కలుగచేసేది, మిగిలిన ప్రక్రియల కన్నా దీని పరిధి విస్తృతమైనదని, చరిత్రకు నవల ప్రత్యామ్నాయ' మని భావించవచ్చును.

### 14.1.2. ప్రాచ్యుల నిర్వచనములు

ఆంగ్ల సాహిత్య ప్రభావము వలన తెలుగు సాహిత్యము లోనికి ప్రవేశించిన ఈ ఆధునిక నవలా ప్రక్రియను గురించి తెలుగు కవులు, రచయితలు, విమర్శకులు అనేక నిర్వచనము లిచ్చినారు. యెదలి నాగభూషణ శర్మ గారు, బొడ్డపాటి వేంకట కుటుంబరావు గారు, కొడవటిగంటి కుటుంబరావు గారు, గొర్రెపాటి వెంకట సుబ్బయ్య గారు, వేదం వెంకటరామ శాస్త్రి గారు, కొలకలూరి ఇనాక్ గారు, పింగళి లక్ష్మీకాంతం గారు, కే.వి. ఆర్. నరసింహం గారు, విశ్వనాథ సత్యనారాయణ మొదలగు అనేక మంది ప్రముఖులు నవలా ప్రక్రియ గురించి తమ అభిప్రాయములను వెల్లడించినారు.

'తెలుగు నవలా వికాసము'లో యెదలి నాగభూషణ శర్మ గారు నవల "వస్తావిక జీవితాన్ని గురించిన కాల్పనిక కథ" ...

"సాంఘిక జీవితానికి ప్రతిబింబముగా వ్యక్తుల జీవిత గమనాన్ని చిత్రిస్తూ, జనుల ఆచార వ్యవహారములను వ్యక్తీకరించే గద్య ప్రబంధం 'నవల' అని పేర్కొన్నారు.

తెలుగు నవలా సాహిత్య వికాసములో పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు గారు 'యథార్థ జీవితముల వాస్తవిక చిత్రణము గల గద్య రూపక కథా సాహిత్యము నవల' అని నిర్వచించినారు.

"ఒక వ్యక్తి యొక్క జీవిత చరిత్ర కావ్య దృష్టిలో వ్రాస్తే నవల అవుతుంది" అని విశ్వనాథ సత్యనారాయణ గారు నవలను నిర్వచించినారు.

"ఒక దశ నుండి మరియొక దశకు, ఒక స్థితినుంచి మరియొక స్థితికి మనుజులు, వ్యవస్థ, దేశము పొందుతున్న పరిణామం భవిష్యత్తుపై చిత్రింపగల ముద్ర, సాకల్యంగా చర్చించి రచింపగల సాహితీ ప్రక్రియ నవల" అని ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు నవలను నిర్వచించినారు.

ప్రాచ్య, పాశ్చాత్యులు వివరించిన నిర్వచనాలన్నింటిని పరిశీలించిన, ఏ నిర్వచనము సమగ్రమైనదిగా కన్పించదు. కారణము, అధునిక సాహిత్యములో అన్ని రంగాల ప్రక్రియలను తనలో ఇముడ్చుకోగల ఈ నవలా ప్రక్రియను నిర్వచించటము చాల కష్టమైనదని అందరూ అంగీకరించినారు. నవలాకారుల నిర్వచనములను పరిశీలించిన నవలా ప్రక్రియను ఈ విధముగా చెప్పవచ్చును. "మనోరంజకత, అతి విచిత్రత, వాస్తవికత అను త్రిగుణములను కలిగి యుండి, యథార్థ జీవిత చిత్రణము మన మనో నేత్రములకు గోచరించునట్లు, భాసింపజేసెడి గద్య కావ్య ఖండికయే 'నవల'గా సాహిత్య లోకముచే నిర్వచించబడుచున్నదని" భావింపవచ్చును. నవల గద్య కావ్యమని, సమకాలీన సమాజ, మానవ జీవితాలను చిత్రించే కాల్పనిక కథని, మనోరంజకత పాటు, విజ్ఞాన సముపార్జన దీని లక్ష్యమని, విస్తృత సాహిత్య ప్రక్రియయే నవలని స్థూలముగా భావింపవచ్చును.

## 14.2. నవలా లక్షణములు

విస్తృత స్థాయి సాహిత్య ప్రక్రియగా భావించ బడుతున్న నవల స్వరూప స్వభావములను నిర్ణయించునప్పుడు, ఈ క్రింది లక్షణములు నవలకు కలవని యెదలి నాగభూషణశర్మ గారు, కొలకలూరి ఇనాక్ గారు పేర్కొనిరి.

1. నవల గద్య కావ్యము (వచన రూపము) లో ప్రధానముగా నుండును.

2. యుగ చిత్రణే నవల ప్రధాన ధ్యేయం అనగా సమకాలీన సమాజ, మానవ జీవితాల చిత్రణే నవల పరమ లక్ష్యం.

3. సహజమైన, స్వాభావికమైన శైలి నవలకు ప్రాణం.

4. సర్వ జీవన విధానానికి వ్యాపకమైన, విస్తృతమైన విధానం నవలలో ఉంటుంది.

5. ప్రత్యక్షముగానో, పరోక్షముగానో, సర్వ విషయముల మీద రచయిత వ్యాఖ్యానానికి ఇందులో ఆస్కారమున్నది.

6. కాల్పనిక సాహిత్యానికి, సరళమైన స్వాభావికమైన రూపం నవల.

7. నవలా ప్రక్రియలో నాటకం, కావ్యం, అధిక్షేపణ కావ్యం వంటి అన్ని ప్రక్రియల విధానాలు నవలలో ఉపయుక్తం చేయబడవచ్చు.

8. మనోరంజకతతో పాటు విజ్ఞాన సముపార్జనం కూడ నవలలో సాధ్యం అవుతుంది.

9. యధార్ధ జీవితంలోని సత్యం కంటె నవలలోని సత్యం గాఢమైంది. యధార్థ జీవితములోని వన్నీ జరిగిన సత్యాలు. కానీ, నవలలో సంభవం కాగల సత్యాలకు కూడ స్థానం వుంటుంది.

10. వేదన, భావుకత, ఈ రెండు నవలలకు ప్రేరణ శక్తులు.

11. ఒక వ్యక్తి జీవితాన్ని గురించి కాని, జీవితము లోని ఒక ముఖ్య భాగాన్ని గురించి కాని, నవల చిత్రించడానికి ప్రయత్నిస్తుంది.

12. వివరణాత్మకము, వాఖ్యానాత్మకము, నాటకీయము అయిన శైలిలో ఏ ఒక దానిని గాని, అన్నింటిని గాని, నవలలో ప్రయత్నించే అవకాశము ఉన్నది.

13. జాగ్రత్ సుషుప్తి - అవస్థలలోని సర్వ విషయాల్ని, ఉద్వేగాల్ని వెలికి తెచ్చి వర్ణించడానికి తగిన సాధనం నవల.

14. వాస్తవ సమాజాన్ని, సమకాలీన సమాజాన్ని ముందుంచ గలిగినది నవల.

15. రచయితే కథను నిరూపించవచ్చు, లేదా పాత్రల చేత కథను నడిపిస్తూ, అక్కడక్కడ జీవిత వ్యాఖ్యానాలు చేస్తూ, పాత్రలను ముందుకు తీసుకు వెళ్ళవచ్చు. ఆ పాత్రల ద్వారా పాఠకులకు హితోపదేశం చేయడానికి అవకాశం ఉంటుంది.

16. జీవిత వాస్తవాల్ని విశదీకరించడానికి, లోతుగా చిత్రించడానికి అనువైనది నవల. చారిత్రక, రాజకీయ, ఆర్థిక, సామాజిక, నైతిక, తాత్విక విషయాలతో పాటు, మానవ మనస్తత్వాన్ని కూడా చిత్రించ గలిగే విశిష్టతను సంతరించుకున్న ఆధునిక సాహిత్య ప్రక్రియ నవల.

17. ఇతర సాహిత్య ప్రక్రియల స్వరూప స్వభావాలు ఈ నవలా ప్రక్రియలో ఇమిడిపోతాయి.

## 14.3 తెలుగు నవల ఆవిర్భావము

ఆంగ్ల భాషా సాహిత్య ప్రభావముచే భారతీయ భాషలలోనికి ప్రవేశించిన ఆధునిక ప్రక్రియలలో ఒకటియైన నవల - మిగిలిన అన్ని ప్రక్రియల వలెనే, తెలుగు సాహిత్యములో ముందు అనుకరణలు, అనువాదములుగా ప్రారంభమయినా, రానురాను తన స్వయంప్రతిభను నిర్ధారించుకొని, ఎన్నో క్రొత్త క్రొత్త పోకడలు పోయినది. తెలుగులో నవల ప్రారంభములో ఆచార వ్యవహారాలను, మూఢ విశ్వాసాల్ని, దురాచారాల్ని హేతువాద దృష్టితో ఖండించేదిగా, సంఘ సంస్కరణ ధ్యేయముగా వెలువడినది.

తెలుగు సాహిత్యములో నవలా రచన ఎప్పుడు ప్రారంభమైనది? ఎట్లా ప్రారంభమైనది? తొలి నవలా రచయిత ఎవరు? తొలి తెలుగు నవల ఏది? అను విషయములో విమర్శకుల మధ్య భిన్నాభిప్రాయములు ఏర్పడినవి. దీనికి కారణము మూడు నవలలు వుండటము వలన ఈ పరిస్థితి ఏర్పడినది. 1867లో కొక్కొండ వెంకటరత్నం పంతులు గారు వ్రాసిన 'మహా శ్వేత' మొదటిది కాగా, 1872లో నరహరి గోపాలకృష్ణమ చెట్టి గారు వ్రాసిన 'శ్రీరంగరాజు చరిత్ర' రెండవది కాగా, 1878లో కందుకూరి వీరేశలింగము పంతులు గారు వ్రాసిన 'రాజశేఖర చరిత్ర' మూడవది. ఈ మూడింటిని రచించిన రచయితలు తమ రచన 'నవల' అని పేర్కొనలేదు. కనీసం ప్రచురణ కర్తలు కూడ వీటిని నవలలుగా పేర్కొనలేదు. మహా శ్వేత వచన రచనగా వున్నప్పటికీ ప్రక్రియ పేరులేదు. గోపాలకృష్ణమ చెట్టి తన రచనను 'నవీన ప్రబంధము' మని పేర్కొనెను. రాజశేఖర చరిత్ర వ్రాసిన కందుకూరి వీరేశలింగము పంతులు గారు తన రచనను 'వచన ప్రబంధము' అని పేర్కొనిరి.

క్రీ.శ. 1867 వ సంవత్సరమున కీ.శే. కొక్కొండ వేంకటరత్నము పంతులు గారు 'మహాశ్వేత' యను నవలను వ్రాసినట్లును,

తెలుగులో మహాశ్వేత మొదటి నవలయని, యీ నవల సంస్కృతములో బాణభట్టుని గద్య కావ్య రాజమగు 'కాదంబరి' లోని మనోహరమగు కథకు స్వేచ్ఛానువాదమని 'వేంకట రత్నము జీవిత చరిత్ర' ఆంగ్లమున కీర్తిశేషులు శివశంకర పాండ్యా వ్రాసినట్లును, శ్రీ నిడుదవోలు వేంకటరావు గారు ఆంధ్ర వచన వాఙ్మయము నందు తెలిపియున్నారు. ఈ నవలలో కొంత భాగము 1895 వ సంవత్సరమున 'వైజయంతి' పత్రిక యందు ప్రకటితమైనది. అంతే కాని యీ గ్రంథము పూర్తిగా లభ్యము కాలేదు. అందువలన విమర్శకులు యీ రచనను మొదటి నవలగా అంగీకరించలేదు. 1867 లో మహాశ్వేత రచింపబడిన దనటానికి శివశంకర పాండ్యా గారి మాటలు తప్ప, మరో నిదర్శనము కనబడుట లేదు. వ్రాసిన 28 సంవత్సరములకు యీ రచనలో కొంత భాగము 'వైజయింతి' లో ప్రకటించబడినది. "కథా వస్తువు కల్పితము కాకపోవడము వలన ఆంగ్ల భాష వాసన ఇందులో ద్యోతకం కావడము లేదు. అందువలన కూడ దీనిని మొట్టమొదటి నవలగా అనడానికి వీలులేదు" అని ఆచార్య అక్కిరాజు రమాపతిరావు గారు పేర్కొనిరి.

1872 వ సంవత్సరములో కర్నూలు మండలములో డెప్యూటి కలక్టరు ఉద్యోగము చేసిన నరహర గోపాలకృష్ణమ చెట్టి గారు 'శ్రీరంగరాజు చరిత్ర' వ్రాసినట్లు ఫోర్ట్‌సెంట్ జార్జి గెజిట్ లో ప్రకటించబడినది. 'హిందువుల ఆచారము తెలుపు నట్టి నవీన ప్రబంధము' అన్న చెట్టి గారు ఆనాటి ఆచార వ్యవహారములను యీ రచనలో చూపి విమర్శించడానికి యత్నించి కృతకృత్యులైనారు. గెజిట్ యీ నవలను గురించి Subject అన్నచోట A Novel అని వ్రాయడంతో పాటు క్రింద Remarks అన్నచోట "This is apparently the first attempt ever made in this part 06 India at NOVEL writing in Telugu prose" అని వ్రాయటము వలన 'శ్రీరంగ రాజ చరిత్ర' మొదటి నవలగా పేర్కొన్నారు. ఇది లార్డు మేయో గారి ప్రేరణతో వ్రాయబడిన మౌలికమైన తెలుగు నవల అనుకరణ కాదు - అనువాదము కాదు.

"కల్పిత కథ, జనుల ఆచార వ్యవహారములను ప్రతిబింబించే రచన, మూఢ విశ్వాసాల విమర్శ" కలిగిన శ్రీరంగరాజ చరిత్రను తొలి తెలుగు నవలగా యెదలి నాగభూషణ శర్మ గారు పేర్కొనిరి. ఈ రచన తొలి తెలుగు నవలా ప్రయత్నమని కొంతమంది విమర్శకులు తమ అభిప్రాయమును వ్యక్తం చేసినారు.

కథలో కల్పన నామమాత్రము, వర్ణనాత్మకమైన శైలి, జటిలమైన భాష, వర్ణవ్యత్యాసాలను గురించి యిందులో నిశితమైన, గెజిట్‌లో దీనిని సమీక్షించిన వారు మాత్రం నవలలోని ఒక్క సంఘటనను ఆమోదింపలేక పోయినట్లు ప్రకటించడము వలన, రచయిత ప్రభుత్వ పుద్యోగము చేసుకుంటూ కవులలో ప్రఖ్యాతుడు కాకపోవటము వలనను, శ్రీరంగరాజ చరిత్రకు ప్రసిద్ధి లేమిచేతను, చాలమంది విమర్శకులు తెలుగులో మొదటి నవలగా శ్రీరంగరాజ చరిత్రను పేర్కొనలేదు.

ఆంగ్ల సాహిత్యములోని ఆలివర్ గోల్డ్‌స్మిత్ వ్రాసిన 'ది వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్' అనే నవలను ఆధారముగా చేసుకొని, కందుకూరి వీరేశలింగము పంతులు గారు 'రాజశేఖర చరిత్ర' అను వచన ప్రబంధమును వ్రాసినారు. 1878లో 'వివేక చంద్రిక' లో వరుసగా ప్రకటింపబడి 1880లో పుస్తక రూపము లోనికి వచ్చింది. దీనిని ఒకరిద్దరు ఆంగ్లములోనికి అనువాదము చేసినారు. కందుకూరి వీరేశలింగము గారే 'తాము మొదటి నవలా రచయితనని చెప్పుకోవటము చేతను, దాని ప్రాశస్త్యమును బట్టి ఆంగ్లములోనికి అనువదింపబడటము చేతను, లోకములో దీనికి ప్రసిద్ధము కలుగుట చేతను, 1929 నాటికే ఆంధ్ర వాఙ్మయ సూచికయందు నవలగా పేర్కొనబడినది. రాజశేఖర చరిత్రను గురించి హిందూ పత్రిక 'It is the first Telugu Novel that has yet appeared' అని పేర్కొనినది. దీనివలన ఆంగ్లములో నావెల్ ఎట్టిదో, తెలుగులో అట్టి రచనే చేయబడ్డదని తెలియుచున్నది.

'ఆంగ్ల సాహిత్య ప్రభావము ఉండటము వలనను, అనుసరణ గ్రంథము కావటము వలనను, స్వకపోల కల్పితములైన అంశములు అనేకము ఉండటము వలను, సర్వ లక్షణ సమగ్రమైన తొట్ట తొలుతటి తెలుగు నవల 'రాజశేఖర చరిత్ర' యేనని విదితము కాగలదని' డాక్టరు అక్కిరాజు రమాపతి రావు గారు పేర్కొనిరి. మొత్తము మీద పై కారణములను పరిశీలించిన, పెక్కుమంది విమర్శకుల అభిప్రాయముల ప్రకారము 'రాజశేఖర చరిత్ర' తొలి తెలుగు నవలగా చెప్పవచ్చును.

## 14.4 నవలా వికాసము

ప్రథమ స్వాతంత్ర్య సమరము తరువాత, ఆంగ్ల సాహిత్య ప్రభావముచే ఉత్తేజితులైన భారతీయ రచయితలు జాతీయ సాహిత్యములో సృజనాత్మక రూపమైన నవలా ప్రక్రియకు శ్రీకారము చుట్టిరి. తెలుగు నవలా సాహిత్యాన్ని ఆయాకాలంలో వున్న ముఖ్యమైన ప్రవృత్తులను బట్టి యెదలి నాగభూషణ శర్మ గారు ఐదు భాగములుగా విభజించడము జరిగినది.

| | | |
|---|---|---|
| 1. | ప్రారంభ యుగం | 1872-1900 |
| 2. | అనువాద యుగం | 1900-1920 |
| 3. | వికాస యుగం | 1920-1942 |
| 4. | మనోవైజ్ఞానిక యుగం | 1942-1960 |
| 5. | సమకాలీన యుగం | 1960-నేటి వరకు |

### 14.4.1. ప్రారంభ యుగం (1872-1900)

ప్రారంభ యుగం లోని నవలలు ఆంగ్ల సాహిత్య ప్రభావము వలన వ్రాయబడినవి. కందుకూరి వీరేశలింగము గారి 'రాజశేఖర చరిత్ర' ప్రభావముతో అనేక నవలలు రచించడము వలన విమర్శకులు ఈ యుగాన్ని వీరేశలింగం యుగంగా పేర్కొనుచున్నారు. రాజశేఖర చరిత్రపై ఆలివర్ గోల్డ స్మిత్ వ్రాసిన 'ది వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్' ప్రభావము కలదు. చింతామణి పత్రిక ద్వార నవలల పోటీలను ఏర్పాటు చేసి, నవలా రచనకు ఉత్తమ నిబంధనలను ప్రతిపాదించి, తదనుగుణముగా రచయితలను ప్రోత్సహించి నవలలు వ్రాయడానికి ఒక ఒరవడిని కల్పించింది కందుకూరి వీరేశలింగము పంతులు గారే. సులభ గ్రాహ్యత, వైశద్యము, సమత, జీవనము అనునవి నవలా రచనకు ముఖ్య లక్షణములుగా నిర్ణయించిరి. చింతామణి పత్రిక నిర్వహించిన పోటీలలో ఖండవల్లి రామచంద్రుడు గారి 'ధర్మవతీ విలాసం' (1893), మాలతీ రాఘవీయం (1895), లక్ష్మీ సుందర విజయము (1896), తల్లాప్రగడ సూర్యనారాయణ గారి 'సంజీవ రాయ చరిత్ర (1893), నంబూరు తిరునారాయణ స్వామి 'సుబ్బారావు రేక ప్రణయ మహిమలు (1894), చిలకమర్తి వారి రామచంద్ర విజయము, హేమలత అహల్యాబాయి, కర్పూరమంజరి, గణపతి మొదలగునవి బహుమతులు పొందినవి. చింతామణి పత్రిక నవలా పోటీలను నిర్వహించడము ద్వార నవలా వికాసానికి దోహదమయినది. కందుకూరి వారు నవలలు వ్రాయడమే కాక, అనేక విధాలుగా కృషి చేశారు. ధర్మవతీ విలాసములో స్త్రీల బుద్ధి బలము, ధీశక్తి నిరూపింపబడినది. సంజీవ రాయ చరిత్రములో సంఘ సంస్కరణ ముఖ్యమైన ధ్యేయముగా వ్రాయబడినది. ప్రణయ మహిమలులో అత్తా కోడళ్ళు కయ్యాలు, స్త్రీల స్వార్థపరత్వము, వివహములలో విపరీతమైన ఖర్చులు, నాయకుని వేశ్యాలోలత్వము మొదలగు విషయములు చర్చించబడినవి. ప్రారంభములో వచ్చిన నవలల్లో రాజకీయోద్యమము, జాతీయ జీవన చిత్రణం, సంఘ సంస్కరణలు చోటు చేసుకున్నాయి. ఆ తరువాత జాతీయోద్యమాన్ని ఆధారం చేసుకొని అనేక నవలలు వచ్చాయి.

### 14.4.2. అనువాద యుగం (1900-1920)

ఈ యుగంలో ఎక్కువగా అనువాద నవలలు రచింపబడినాయి. ఈ యుగంలో వచ్చిన చారిత్రక నవలలో కూడ ఎక్కువ భాగము అనువాదములే కావడము వలన ఈ యుగమును చారిత్రక యుగమని, అనువాద యుగమని వ్యవహరింతురు. 20 వ శతాబ్ద ఆరంభములో భారత దేశములో జాతీయోద్యమం ప్రారంభమైనది. 1905 లో బెంగాల్ విభజనతో దేశమంతా ఉద్రిక్త వాతావరణ పూరితమైనది. ఈ జాతీయోద్యమ ప్రభావముతో బెంగాలీలు చాల నవలలు రచించినారు. తెలుగు భాష లోనికి వంగ భాష నుంచి అనేక నవలలు అనువదింప బడినాయి.

1899లో జి.వి.యస్. దొరస్వామయ్య రచించిన 'కపాల కుండలం' తెలుగులో మొట్టమొదటి బెంగాలి అనువాద నవల. వీరె 1907లో బంకించంద 'ఆనంద మఠం', 1908లో 'కమలా కోమల' అనే బెంగాలీ నవలలను తెలుగులోనికి అనువదించినారు. కనకవల్లి భాస్కరరావు గారు వ్రాసిన 'ప్రఫుల్లముఖి' (1909), చిల్లరిగె శ్రీనివాసరావు గారు వ్రాసిన 'కృష్ణకాంతుని మరణశాసనం', తల్లాప్రగడ సూర్యనారాయణ గారి 'శైవలినీ చంద్రశేఖరము' (1910), చాగంటి శేషయ్య గారి 'రాధారాణి' (1910), 'దుర్గేశ నందిని' (1911), 'నవాబు నందిని' (1915), వేంకట పార్వతీశ కవుల 'రాజ సింహం' (1912) వంటి మొదలగు నవలలు అనువాదము చేయబడి ఆంధ్ర పాఠకుల ఆదరాభిమానములు పొందినాయి.

ఈ యుగంలో స్వతంత్రమైన చారిత్రక నవలలు వ్రాసిన వారిలో ధరణీప్రగడ వెంకట శివరావు గారి 'కాంచనమాల', భోగరాజు వారి 'విమలాదేవి', వేంకట పార్వతీశ కవుల 'వసుమతీ వసంతము', 'ప్రమదా వనము', రత్నాకరము వేంకటప్పయ్య, తుమ్మగుండి కేశవరావులు కలిసి వ్రాసిన 'సత్యబాయి', కేతవరపు వేంకటశాస్త్రి గారి 'రాయచూరు యుద్ధము' (1912), భోగరాజు వారి 'ఆంధ్ర రాష్ట్రము' (1915), విమలాదేవి (1910), అస్తమయము (1916), ధరణికోట (1917), దుగ్గిరాల రాఘవ చంద్రయ్య సచ్ఛాస్త్రి గారు వ్రాసిన 'విజయనగర సామ్రాజ్యము' (1913), చిలుకూరి వీరభద్రరావు గారి 'కర్ణ సామ్రాజ్యము' (1916) వంటి ముఖ్య చారిత్రక నవలలు రచింపబడినాయి.

ఈ యుగంలో వచ్చిన అనువాదాలలో అపరాధ పరిశోధక నవలలు ముఖ్యముగా వంగ భాష నుంచి వచ్చిన అనువాదాలు ఎక్కువ. పాఠకులలో ఉత్సుకతను పెంచే, ఆసాంతము చదివించే గుణం ఈ నవలలో వుంది. బెంగాలీ భాషలో దాదాపు 106 నవలలను పాంచకడే దేవ్ గారు వ్రాశారు. వీటిలో చాల భాగం తెలుగులోనికి అనువదింపబడినాయి. వీటిని అనువాదము చేసిన వారిలో వేంకట పార్వతీశ కవులు, దేవరాజు వేంకట కృష్ణారావు ప్రభృతులు ముఖ్యులు. దేవరాజు వారి 'వాడే వీడు', 'నేనే' 'కాలూరాయి' వంటి నవలలు ఎన్నో ముద్రణలు పొందాయి. వేగుచుక్క గ్రంథమాల, ఆంధ్రప్రచారణీ గ్రంధమాల, సరస్వతీ గ్రంథమాలలు ఈ నవలలను ప్రోత్సహించి ప్రచురించినాయి.

మౌలికములైన సాంఘిక నవలలు వ్రాసిన వారిలో చిలకమర్తి వారి 'రాజారత్నము' (1919), 'గణపతి' (1920), వేంకట పార్వతీశ కవుల 'మాతృ మందిరము' (1919), శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి 'శ్మశాన వాటిక' లేదా 'విష భుజంగము' (1917) మొదలైనవి. ఈ యుగంలో అనువాద నవలలు, స్వతంత్ర నవలలు వచ్చినప్పటికిని, లెక్కకు మించి అనేక చారిత్రక నవలలు రావడం వలన ఈ యుగాన్ని చారిత్రక నవలల యుగం అని విమర్శకులు అభిప్రాయపడిరి.

### 14.4.3. వికాస యుగం (1920-1942)

ఈ యుగంలో భాషలో, శైలిలో, శిల్పంలో, వస్తువులో, వైవిధ్యములో కాక, అన్ని రకాలుగా మార్పులు వచ్చి వికాస యుగముగా పేరుగాంచినది. జాతీయోద్యమము తీవ్ర రూపము దాల్చటము, జీవన విధానములో విప్లవాత్మకమైన మార్పులు రావాలనటము, సంఘములో యింతవరకు పీడితులైన దరిద్రులు, స్త్రీలు పునరుద్ధరించబడాలనే భావాలు నవలా రచయితలలో అధికమైనాయి.

రాజకీయము, హరిజనోద్ధరణము, గ్రామీణ జీవిత విధానము యథాతథముగా చిత్రించబడిన అజరామరమైన నవల సంఘ సంస్కర్త ఉన్నవ లక్ష్మీనారాయణ గారిచే వ్రాయబడిన 'మాలపల్లి' లేదా సంగ విజయము. విశ్వనాథ వారు అంతరాత్మ, ఏకవీర, వేయి పడగలు, మా బాబు, చెలియలి కట్ట, బద్దన్న సేనాని, ధర్మచక్రము, స్వర్గానికి నిచ్చెనలు, విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు, కడిమి చెట్టు, బాణావతి, మొదలగు వైవిధ్యములైన రచనలు రచించిరి. అడవి బాపిరాజు గారు హిమబిందు, గోన గన్నారెడ్డి, నారాయణరావు, కోనంగి, తుఫాను, నరుడు, జాజిమల్లి, అడవి శాంతిశ్రీ, మధురవాణి, శిలారథము, కైలాశేశ్వరుడు, మొదలైన రచనలు వ్రాసిరి. అడవి బాపిరాజు గారు ఆంధ్ర చరిత్ర పట్ల, సంస్కృతి పట్ల గౌరవము ఉండటము వలన ఆంధ్రుల శౌర్యాన్ని,

ధీరత్వాన్ని తమ నవలలో పొగిడినారు. స్త్రీలకు స్వేచ్ఛ, స్వేచ్ఛా ప్రణయం కోసం కలం పట్టి దైవమిచ్చిన భార్య, శశిరేఖ, మైదానం, జీవితాదర్శం, బ్రాహ్మణీకం, హంపీ కన్యలు, మొదలగు నవలలు చలం గారు వ్రాశారు. ముని మాణిక్యం నరసింహారావు గారు రుక్కుతల్లి, దీక్షితులు, తిరుమాళిగ నవలలు, మొక్కపాటి నరసింహశాస్త్రి గారు 'బారిష్టరు పార్వతీశం' శ్రీ పాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు శ్మశాన వాటిక, ఆత్మబలి, వేలూరి శివరామ శాస్త్రి గారు అహోబలీయము. శేషాద్రి రమణ కవుల కొండపలి ముట్టడి, పిలకా గణపతి శాస్త్రి మీనాంబిక మొదలగు నవలలు యీ కాలంలో ఎన్నదగిన ప్రముఖమైన నవలలు.

## 14.4.4. మనోవైజ్ఞానిక యుగం (1942-1960)

మనస్తత్వ శాస్త్ర సిద్ధాంతాలు ఆధారముగా గాని, లేదా, మనో విశ్లేషణ పద్ధతి ద్వారా కాని పాత్ర చిత్రణతో నవలలు ఈ కాలంలో వ్రాయడముచే, ఈ యుగం మనోవైజ్ఞానిక యుగంగా వ్యవహరించబడుచున్నది. మనస్తత్వ శాస్త్ర విధానాలకు ప్రాధాన్యమిచ్చి నవలలను వ్రాసిన వారిలో గోపీచంద్, బుచ్చిబాబు, రాచకొండ విశ్వనాథశాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావు, జి.వి.కృష్ణారావు మొదలగు వారు అతి ముఖ్యులు. సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని, మానవత్వాన్ని ఆధారముగా చేసుకొని కొడవటిగంటి కుటుంబరావు గారు అనేక నవలలు రచించినారు. వీరి చదువు, అనుభవము, మొదలైన నవలలో ఆ కాలము నాటి ఆర్థిక, మానసిక సంక్షోభాన్ని చిత్రీకరించినారు. యువకులు ఈనాడు సాగించే తాత్త్విక ఆలోచనల పర్యావసానము, మానసిక శాస్త్రం వెలువరించిన అన్ని సిద్ధాంతాలు, అన్ని పద్ధతులను బుచ్చిబాబు 'చివరకు మిగిలేది' లో చక్కగా వివరించినారు. రాచకొండ విశ్వనాథ శాస్త్రి 'అల్పజీవి', జి.వి.కృష్ణారావు 'కీలుబొమ్మలు', గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర' మొదలైన నవలలు మనో వైజ్ఞానిక నవలలు. భాస్కరభట్ల కృష్ణారావు గారి 'యుగసంధి' 'వెల్లువలో పూచిక పుల్లలు', బలివాడ కాంతారావు గారి 'గోడ మీది బొమ్మ', 'సుగుణ', మొదలైనవి ప్రముఖ నవలలు. ఇవి కాక నోరి నరసింహమూర్తి, తెన్నేటి సూరి, మల్లాది వసుంధర, ధూళిపాళ శ్రీరామ్మూర్తి, మొదలగు వారి చారిత్రక నవలలు కూడ ఈ కాలంలో రచింపబడినవే. నైజాం నవాబు పాలనలో ప్రజలు పడిన పాటను, రజాకార్ చర్యలను వివరముగా వివరిస్తూ బొలిముంత శివరామకృష్ణ గారి 'మృత్యుంజయులు' నవల, తెలంగాణా విమోచనోద్యమం లోని ఒక నాయకుణ్ణి గురించి వ్రాస్తూ, ఆనాటి రాజకీయాలను, స్థితిగతులను కన్నులకు కట్టినట్లు చిత్రించిన వట్టికోట ఆళ్వారుస్వామి 'ప్రజల మనిషి', 'గంగు' నవలలు ఈ కాలంలో వచ్చిన చెప్పుకోదగిన నవలలు.

## 14.4.5. సమకాలీన యుగం (1960-నేటి వరకు)

ఈ యుగంలోని నవలల్లో సమకాలీన జీవిత చిత్రం చిత్రించబడటం వలన, ఈ యుగాన్ని 'సమకాలీన యుగం'గా వ్యవహరించినారు. ఈ యుగంలో పురుషులే కాక స్త్రీ రచయిత్రులు కూడ మంచి నవలలు వ్రాశారు. వార పత్రికలు, మాస పత్రికలు, నవలల పోటీలు ఏర్పాటు చేయడము, చదువుకున్న పాఠకుల సంఖ్య ఎక్కువ కావడము, రచయితలు ఎక్కువగా కుటుంబ గాథలు ఇతివృత్తముగా స్వీకరించడము వలన, ఎందరో క్రొత్త రచయత(త్రు)లు ముందుకు వచ్చి రచనలు చేసినారు. భావనా శక్తి వున్న స్త్రీలు ఎక్కువ మంది రచనను చేపట్టడం వలన కొద్దిమంది మగవారు సైతము తమ కలం పేర్లు ఆడవాళ్ళ పేరుతో రచనలు చేసినారు. మాలతీ చందూర్ 'చంపకం - చెదపురుగులూ', శ్రీదేవి 'కాలాతీత వ్యక్తులు', లత 'పథవిహీన', మోహనవంశి 'మహానగరంలో స్త్రీ', ముప్పాళ్ళ రంగనాయకమ్మ 'బలిపీఠం, పేకమేడలు, కృష్ణవేణి, స్వీట్ హోం', కోడూరి కౌసల్యాదేవి 'చక్రవాకం, చక్రనేమి, చక్ర భ్రమణం, ధర్మ చక్రం, శాంతి నికేతన్', యుద్ధనపూడి సులోచనారాణి 'సెక్రటరీ, విజేత', ద్వివేదుల విశాలాక్షి 'వైకుంఠపాళి, వారధి, మారిన విలువలు, గ్రహణం విడిచింది, ఆనందారామం, సంపెంగ పొదలు, చీకటి కడుపున కాంతి, ఆత్మబలి', వాసిరెడ్డి సీతాదేవి 'మట్టి మనుషులు' వంటి ప్రముఖ నవలలు రచించిన రచయిత్రులు, అనేక సామాజిక నవలల ద్వార జాతిని జాగృతం చేశారు. కొమ్మూరి వేణుగోపాలరావు 'పెంకుటిల్లు, హౌస్ సర్జన్', సింగరాజు లింగమూర్తి 'ఆదర్శాలు - ఆంతర్యాలు', మంజుశ్రీ 'జారుడు మెట్లు, స్వర్గారోహణ', వీరాజీ 'తొలి మజిలి', ఆదివిష్ణు 'సగటు మనిషి', దాశరధి రంగాచార్య 'చిల్లర దేవుళ్ళు',

పోరంకి 'వెలుగు-వెన్నెల-గోదావరి, ముత్యాల పందిరి', పాలగుమ్మి పద్మరాజు 'బతికిన కాలేజీ' నల్లరేగడి, కొండముది శ్రీరామచంద్రమూర్తి 'కరుణ, నవీన్, అంపశయ్య', మొదలైనవి ప్రసిద్ధ నవలలు. 1970 సంవత్సరము తరువాత వచ్చిన వారిలో 'యండమూరి వీరేంద్రనాథ్, మల్లాది కృష్ణమూర్తి' మొదలైన రచయితలు క్షుద్ర సాహిత్యాని నవలల్లో ప్రవేశ పెట్టారు. ఆధునిక రచయితలు నవలా సాహిత్యములో ప్రసిద్ధులైన వారలు పెక్కుమంది వున్నప్పటికిని సంక్షిప్తత కోసము వారందరి పేర్లను తెలియ చేయుట లేదు.

ఈ విధముగా తెలుగు నవలా చరిత్రను పరిశీలించిన సాంఘిక, చారిత్రక, పౌరాణిక, కథలకు సంబంధించిన నవలలు వచ్చాయి. అంతే కాకుండ ఇప్పుడు మాండలిక నవలలు కూడ వస్తున్నాయి. ప్రస్తుతము వార, పక్ష, మాస, దిన పత్రికలల్లోను నవలలు ఎక్కువగా కన్పిస్తున్నాయి.

### 14.5. నవలా భేదాలు

నవలా రచయితలు తీసుకొనె ఇతివృత్తము లేక కథా వస్తువును బట్టి నవలల్లో అనేక భేదాలున్నాయి. వాటిని ఈ క్రింది విధముగా విభజించవచ్చును.

1. సాంఘిక నవలలు
2. చారిత్రక నవలలు
3. పౌరాణిక నవలలు
4. రాజకీయ నవలలు
5. హాస్య నవలలు
6. అనువాద నవలలు
7. అపరాధ పరిశోధన నవలలు
8. మనోవైజ్ఞానిక నవలలు
9. పిల్లల నవలలు
10. వైజ్ఞానిక భాషా నవలలు
11. వేశ్య నవలలు
12. అశ్లీల నవలు

### 14.5.1. సాంఘిక నవలలు

గడిచిన 130 సంవత్సరములలో వచ్చిన తెలుగు నవలల్లో అధిక భాగము సాంఘిక నవలలే. సమకాలీన సమాజ, మానవ జీవితాల చిత్రణే నవలల లక్ష్యం. నవల జీవితానికి ప్రతిబింబము. కాబట్టి సాంఘిక నవలలు అధికముగా వచ్చాయి. సాంఘిక జీవితాన్ని సంపూర్ణముగా చిత్రీకరించకపోయినా, వ్యక్తుల జీవిత చరిత్రలను చిత్రిస్తూ, సంఘాన్ని ఆ జీవితాలకు నేపథ్యముగా చిత్రించారు మొదటి తరం నవలాకారులు. తెలుగులో మొట్టమొదట నవలలు సాంఘిక ఇతివృత్తములో వచ్చినవే. శ్రీరంగరాజ చరిత్ర, రాజశేఖర చరిత్ర ఈ రెండునూ ఆ కాలం నాటి సాంఘిక వాతావరణాని ప్రతిబింబించాయి. విశ్వనాథ వారి వేయి పడగలు, తెఱచి రాజు, మా బాబు, జేబుదొంగ, అడవి బాపిరాజు గారి నారాయణరావు, తుఫాను, కోనంగి, నరుడు, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి ఆత్మబలి, గోపిచంద్ గారి 'అసమర్థుని జీవయాత్ర', బుచ్చిబాబు గారి 'చివరకు మిగిలేది', బలివాడ కాంతారావు గారి గోడమీద బొమ్మ, సుగుణ, జి.వి.కృష్ణారావు గారి కీలుబొమ్మలు, పోతుకూచి సాంబశివరావు గారి ఉదయ కిరణాలు, పులుగుర్తి

లక్ష్మీనరసమాంబ గారి సుభద్ర, డాక్టరు శ్రీదేవి కాలాతీత వ్యక్తులు, మాలతీ చందూర్ గారి చంపకం-చెదల పురుగు, ముప్పాళ్ళ రంగనాయకమ్మ గారి బలిపీఠం, పేకమేడలు, వసుంధర గారి దూరపు కొండలు, మొదలయినవి ప్రఖ్యాత సాంఘిక నవలలగా పేర్కొనవచ్చు. ఈ నవలలు ఎక్కువగా రావటానికి కారణము పత్రికల ప్రోత్సాహమే. ముఖ్యముగా వార పత్రికలు నవలలను ధారావాహికముగా వెలువరించినాయి. ఈ పత్రికలు నవలా వ్యాప్తికి ఉపకరించినంతగా మరేవి ఉపకరించలేదు. సాంఘిక నవలు రెండు విధములు. (1) సంఘము నందలి వ్యవస్థను వ్యంగ్య స్ఫోరకముగా విమర్శించి, అభ్యుదయ మార్గమును సూచించునవి. పరిష్కార మార్గమును ప్రతిపాదించి, పునర్నిర్మాణమునకు మార్గదర్శకముగా నుండునవి. (2) సాంఘిక పరిస్థితులను యధాతథముగా చిత్రించునవి. రాబోవు తరములకు చారిత్రక విషయములను సత్యదూరములు కాకుండ చూపునవి.

### 14.5.2. చారిత్రక నవలలు

రాశిలో సాంఘిక నవలల తరువాత ప్రముఖ స్థానాన్ని పొందినవి చారిత్రక నవలలు. అనేక మంది నవలా రచయిత(త్రు)లు చరిత్రను ఆధారముగా చేసుకొని, చారిత్రక యితివృత్తముతో నవలలు రచించినారు. చారిత్రక నవలల్లో వాస్తవికతకు చోటుంటుంది తప్ప రచయిత ఊహకు చోటుండదు. చరిత్రలోని వాస్తవికతను ఆధారముగా చేసుకొని మాత్రమే రచనలు వ్రాయాలి. "జరిగిపోయిన ఒకానొక చారిత్రక సంఘటనను, ఆధారముగా గ్రహియించి, విచిత్ర సన్నివేశములలో, కథాకథన దక్షతలో రచియించిన మహత్తర గ్రంథమే 'చారిత్రాత్మకమైన' నవల. ఈ నవలలను రెండు విధములుగా విభజించవచ్చును. (1) ఏదేని దేశ చరిత్రను లేదా అందలి ఒకానొక ప్రముఖ సంఘటనను ఆధారముగా చేసుకొని వ్రాయు నవలలు, (2) చరిత్రలో తెరమరుగున పడిపోయిన ప్రముఖ వ్యక్తులను గాని, లేదా వీరోచిత కృత్యములను, సాహస కార్యములను నెరపిన వారిని గాని దీసికొని, ఆ వ్యక్తుల చుట్టు కథను మలచునట్టివి జీవితాత్మక నవలలు. ఈ రకమైన నవలలు జాతీయ భావములను, దేశ భక్తిని, వీర రసమును, ప్రజలలో పెంపొందించుటకు తోడ్పడగలవు.

భారతీయ చారిత్రక నవలలకు మకుటమని చెప్పదగిన డాక్టరు శ్రీ కె.యం.మున్షి వ్రాసిన 'భగవాన్ పరశురాముడు' మరియు శ్రీ రాహుల్ సాంకృత్యాయన్ వ్రాసిన 'సింహసేనాపతి' నవలలు ఆనాటి యదార్ధ పరిస్థితి చదివిన వారికి తెలియగలదు.

చారిత్రక నవలల్లో శ్రీ ఖండవల్లి రామచంద్రుడు 'ధర్మవతీ విలాసము', చిలకమర్తి వారి 'అహల్యాబాయి', విశ్వనాథ వారి ఏకవీర, కడిమిచెట్టు, బద్దన్న సేనాని, అడవి బాపిరాజు గారి హిమబిందు, గోన గన్నారెడ్డి అడవిశాంతిశ్రీ, చిలకూరి వీరభద్రరావు గారి నాయకురాలు, కాకర్ల వారి రఘునాధరాయలు, కనకాభిషేకం, నోరి నరసింహశాస్త్రి గారి నారాయణ భట్టు, మల్లారెడ్డి, రుద్రాంబ, కొర్లపాటి శ్రీరామ్మూర్తి గారి చిత్రశాల, తెన్నేటి సూరి గారి 'చెంఘిజ్ ఖాన్, కౌతవరపు వెంకటశాస్త్రి గారి 'విజయనగర సామ్రాజ్యము, భోగరాజు వారి ఆంధ్ర రాష్ట్రము, ధరణికోట, మల్లాది వసుంధర 'తంజావూరు పతనము', పాటిబండ మాధవశర్మ గారి రాజశిల్పి, ధూళిపాళ శ్రీరామ్మూర్తి గారి భువన విజయము, గృహరాజు వేట, మొదలగునవి ప్రముఖములు. వీరివే కాక చాలమంది రచయితలు చారిత్రక నవలలను వ్రాశారు.

### 14.5.3. పౌరాణిక నవలలు

పురాణ సంబంధమేన విషయములను ప్రాతిపదికగా తీసుకొని, వాని యందలి పురాణత్వము చెడకుండ, నేటి సంఘమునకు అవి ఎంతటి ప్రయోజనమును కలిగించు చున్నవో వివరించి చెప్పునవి పౌరాణిక నవలలు. పౌరాణిక నవలలు వ్రాసిన వారి సంఖ్య చాల తక్కువ. చిలకమర్తి వారి 'సౌందర్య తిలక' విశ్వనాథ వారి పురాణ వైర గ్రంథమాలాంతర్గత నవలలు, కొక్కొండ వేంకటరత్నం గారి 'మహాశ్వేత', కౌతవరపు వేంకట శాస్త్రి గారి మదాలస, జయంతి సూరమ్మ గారి 'సుదక్షిణా చరిత్రము' మొదలైన నవలలు పౌరాణిక ఇతివృత్తంతో వ్రాసినవే.

### 14.5.4. హాస్య నవలలు

తెలుగు వారి నిత్య జీవితములో వున్నంత హాస్యము వారి గ్రంథాలలో తక్కువ. తెలుగు నవలా చరిత్రలో హాస్య నవలలు వ్రాసిన వారు చాల తక్కువ. ఉన్నవాటిలో ఎక్కువగా సాంఘిక నవలలే. చిలకమర్తి వారి గణపతి, మొక్కపాటి నరసింహశాస్త్రి గారి 'బారిష్టరు పార్వతీశం', మునిమాణిక్యం నరసింహశాస్త్రి గారి 'తెరుమూళిగ' మొదలయినవి ప్రసిద్ధి చెందిన హాస్య నవలలు. ఆధునిక రచయితలలో రావిశాస్త్రి, ముళ్ళపూడి వేంకటరమణ, ఎర్రంశెట్టి, బీనాదేవి, మొదలయినవారు హాస్య నవలలు వ్రాశారు.

### 14.5.5. రాజకీయ నవలలు

"దేశమందలి భిన్న వ్యక్తులు తమతమ ధర్మములను గమనించి, హక్కులను ప్రతిపాదించి, ఆ హక్కులను సాధించుటకు ప్రజలలో ఉద్రేకములను రెచ్చగొట్టి, తిరుగుబాటునకు పునాది వేయుట లక్ష్యముగా గల కథా సంవిధానము రాజకీయ నవల". ఇవి వీర రస ప్రధానముగా నుండి ప్రజలను చైతన్య వంతులుగను, కార్యోన్ముఖులుగను మార్చగలవు. ఇట్టిది దేశభక్తి ప్రపూరితములు. దేశము కొరకై తమ సర్వస్వమును త్యాగము చేయుట ప్రధాన లక్ష్యము.

భారత దేశములో జాతీయోద్యమ ప్రభావము తెలుగు నవలా సాహిత్యముపై తన ప్రభావమును ప్రసరింపజేసినది. జాతీయోద్యమాన్ని దృష్టిలో పెట్టుకొని వ్రాసిన రాజకీయ నవలలు అనేకం వచ్చాయి. గాంధీజీ సిద్ధాంతాల ప్రభావములో కూడ అనేక నవలలు వచ్చాయి. సంఘ సంస్కర్త ఉన్నవ లక్ష్మీనారాయణ గారి మాలపల్లి లేక సంగ విజయము ఆనాటి పరిస్థితుల ప్రభావములో వచ్చిన నవల. గాంధీజీ ఆశయము, హరిజనోద్ధరణ ప్రభావము ఈ నవలపై వున్నది. విశ్వనాథ వారి వేయి పడగల నవలలోని మూడు పాత్రల పైన జాతీయోద్యమ ప్రభావమున్నది. అడవి బాపిరాజు గారి నారాయణరావు, కోనంగి నవల పైన కూడ జాతీయోద్యమ ప్రభావమున్నది. మహీధర రామమోహనరావు గారి 'కొల్లాయి గట్టితేనేమి', రథచక్రాలు, ఓనమాలు, మృత్యువు, నీటల్లో దావాలనము, ఉప్పల లక్ష్మణరావు గారి అతడు-ఆమె, వట్టికోట ఆళ్వారుస్వామి గారి 'గంగు' ప్రజల మనిషి మొదలైన నవలలు సాంఘిక, రాజకీయ సమస్యలతో కూడిన నవలలగా పేర్కొనవచ్చును.

### 14.5.6. అనువాద నవలలు

తెలుగు నవలా ప్రక్రియ ఆధునిక ఆంగ్ల సాహిత్య ప్రచారము వలన ప్రారంభము కావటముచే తెలుగులో అనేక అనువాద నవలలు వచ్చాయి. కొక్కొండ వేంకటరత్నం గారి మహాశ్వేత, బాణాకృత మైన సంస్కృత కాదంబరికి అనువాదము. ఆంగ్లమున ఆలివర్ గోల్డస్మిత్ వ్రాసిన 'వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్' కు అనువాదముగా కందుకూరి వీరేశలింగము పంతులు గారు రాజశేఖర చరిత్రను వ్రాశారు. ఆంగ్లములో రమేష్‌చంద్ర దత్తు వ్రాసిన 'The Lake of Palms' అనుదానికి చిలకమర్తి వారు 'సుధాశరశ్చంద్రము' అనువాదము, టాడ్ వ్రాసిన 'Annals of Rajastan' అను గ్రంథానికి 'రాజస్థాన్ కథావళి' అను పేరుతో చిలకమర్తి వారు తెలుగున అనువదించినారు. బకించంద్ర చటర్జీ 'కపాలకుండలి' 'ఆనంద మఠం' అను నవలలను ఒ.వై. దొరస్వామయ్య గారు అనువదించినారు. రవీంద్రనాధ్ ఠాగూర్ రచనలన్నీ తెలుగున అనువాదములుగా వచ్చాయి. దేశి కవితా మండలి, ఆదర్శ గ్రంథమండలి, వంటి గ్రంథ ప్రకాశిక సంస్థలు శరత్ సాహిత్యాన్నంతటిని 13, 14, సంపుటాలలో తెలుగునకు అనువదింపచేసినారు. ఈ నవలలు తెలుగు రాష్ట్రమున బహుళ ప్రచారమును పొందినాయి. బెంగాలీ రచనలను విరివిగా తెలుగు వారికి అందించిన వ్యక్తి శ్రీ మద్దిపట్ల సూరి. హిందీ భాష నుండి తెలుగు లోనికి అనేక నవలలు అనువదింపబడినాయి. కన్నడము నుండి త్రివేణి వ్రాసిన నవలలు ఎక్కువగా తెలుగున అనువదింపబడినాయి. మాక్సిం గోర్కీ వ్రాసిన 'Mother' నవలను క్రొవ్విడి లింగరాజు గారు 'అమ్మ' అను నవలగా అనువదించినారు. డాస్టో వస్కీ ప్రఖ్యాత నవలకు శివం అనువాదము, బెల్లంకొండ రామదాసు అనువాదము పేర్కొనదగినవి. అనువాద నవలలు ఎక్కువగా రాయటానికి ప్రోత్సాహించినవే పత్రికలే. ఈ అనువాదకు లందరూ ప్రపంచ

సాహిత్యములోని ఆణి ముత్యాలను తెలుగు వారికి అందించి, పఠనాసక్తిని, విజ్ఞాన్ని పెంపొందింప చేయటానికి దోహద చేశారనవచ్చును.

### 14.5.7. డిటెక్టివ్ నవలలు లేక అపరాధ పరిశోధన నవలలు

డిటెక్టివ్ నవలలనే అపరాధ పరిశోధన నవలలు అందురు. బెంగాలీ భాష నుండి మొట్టమొదటిగా తెలుగు లోనికి డిటెక్టివ్ నవలలు అనువదింపబడినాయి. 1925-35 సంవత్సరముల మధ్య కాలములో డిటెక్టివ్ నవలలు ఎక్కువ మంది పాఠకులను ఆకొట్టుకోవడానికి ప్రారంభమైనది. డిటెక్టివ్ నవలల్లో సస్పెన్స్ - ఉత్సుకతతో కూడిన కథ, ఏకబిగిన నవల చివరి వరకు వుండి పాఠకులను చదివించుతాయి. ఆంగ్లేయుల డిటెక్టివ్ సాహిత్యం తెలుగు వారిపై ప్రభావం చూపింది. ఆంధ్ర పచారిణీ గ్రంథమాల, సరస్వతీ గ్రంథమాల, విజ్ఞాన చంద్రికా మండలి, వేగుచుక్క గ్రంథమాల, సంస్థలన్నీ యిటువంటి నవలల అనువాదాలనో - అనుకరణలనో ప్రచురించినాయి.

వేంకట పార్వతీశ కవుల 'మాయావి-మనోరమ-మాయావిని, దేవరాజు కృష్ణారావు గారి 'వాడే-వీడు, మొసలికంటి సంజీవరావు గారి మొగలాయి దర్బారు, సీరము సుబ్రహ్మణ్యం గారి జాగిలము, మద్వాల నారాయణ రావు గారి భయంకరలోయ, హత్యాన్వేషణము, ఆరుద్ర పలకల వెండిగ్లాసు, మొదలైన పరిశోధన నవలలు వచ్చాయి. టాపీ ధర్మారావు, టెంపోరావు, అబ్బూరి, కొమ్మూరి సాంబశివరావు, విశ్వప్రసాద్, జి.వి.జి. కృష్ణ మొదలగు వారి అపరాధ పరిశోధన నవలలు పాఠక లోకాన్నికి పఠనాసక్తిని కలిగించినాయి.

### 14.5.8. మనోవైజ్ఞానిక నవలలు

ఆధునిక నవలా సాహిత్యంపై మనోవైజ్ఞానిక సిద్ధాంతాల ప్రభావము అధికము. ఈ సిద్ధాంతాలు చాలవరకు ఇతర దేశాల నుండి మన నవలలోనికి వచ్చినవే. ఈ ప్రభావము వలన కథా కథన రీతిలోను పాత్ర చిత్రణము నందును మార్పు వచ్చింది. 1944-50 మధ్య కాలములో మనో వైజ్ఞానిక సిద్ధాంతాన్ని ఆధారముగా చేసుకొని అనేక మంది నవలలు రచించినారు. బుచ్చిబాబు గారి 'చివరకు మిగిలేది' గోపీచంద్ 'అసమర్ధుని జీవయాత్ర', రాచకొండ విశ్వనాథశాస్త్రి గారి 'అల్పజీవి', నవీన్ 'అంపశయ్య' మొదలైన నవలలను మనోవైజ్ఞానిక నవలలుగా పేర్కొనవచ్చును.

### 14.5.9. వైజ్ఞానిక భాషా నవలలు

మనో వైజ్ఞానిక నవలల తరువాత వైజ్ఞానిక భాషా నవలలు వచ్చాయి. ఈ నవలలు సంచలనాన్ని, ఉత్కంఠను కలిగిస్తాయి. వీటిలో మంత్రాలు-తంత్రాలు, భూతాలు-దెయ్యాలు-చేతబడులు-భూగృహాలు, మొదలైనవి ఉంటాయి. ఇలాంటి నవలలు వ్రాసిన వారిలో యండమూరి వీరేంద్రనాథ్‌ను ప్రముఖముగా చెప్పవచ్చును. యండమూరి వ్రాసిన తులసీదళం, తులసి మొదలైన నవలలు 1978 సంవత్సరములలో పాఠకులలో సంచలనాన్ని కలిగించాయి.

### 14.5.10. పిల్లల నవలలు

తెలుగు నవలల్లో పిల్లల్ని గురించి అనేక నవలలు వెలువడినాయి. ముళ్ళపూడి వేంకటరమణ వ్రాసిన 'బుడుగు-బుడుగు', చిచ్చుర పిడుగు, మొదలైనవి పిల్లల నవలలే. అలాగే ఆంగ్లములోని 'ఆలీష్ ఇన్ వండర్ లాండ్' లాంటి పిల్లల నవల తెలుగులో 'అల్లీబల్లీ లోకంలో అమ్మాయి' అను పేరుతో అనువదించబడినది. శ్రీకథా వినోదిని రచించిన 'విహార యాత్ర', నార్ల చిరంజీవి 'పేను - పెసర చేను', కె. సభా వ్రాసిన 'కవీ - గాయకుడు', చింతా దీక్షితులు వ్రాసిన 'లీలా సుందరి', నోరి నరసింహ శాస్త్రి వ్రాసిన 'కర్పూర ద్వీపయాత్ర' కంచి రమాదేవి 'అనంతంలో అందం' మొదలైన రచనలన్నీ పిల్లల నవలలే.

### 14.5.11. అశ్లీల నవలలు

తెలుగులో కొన్ని అశ్లీల నవలలు వచ్చాయి. అశ్లీల సాహిత్యం వ్రాసిన వారిలో చలం, హేమలత మొదలగు వారు. చలం గారు స్వేచ్ఛా ప్రణయం ఇతివృత్తముగా 'మైదానం' అనే నవలను రాశారు. తెన్నేటి హేమలత గారి నీటి బుడగలు, గాలి బుడగలు మొదలైన నవలలను ఉదాహరణగా చెప్పవచ్చును.

### 14.5.12. వేశ్య నవలలు

తెలుగులో వేశ్య జీవితాలను వర్ణిస్తూ కొన్ని నవలలు వచ్చాయి. ఇటువంటి ఇతివృత్తములో రావిశాస్త్రి గారు వ్రాసిన 'రత్తాలు-రాంబాబు' నవలను పేర్కొనవచ్చు. నటరాజ్ అనే తమిళుడు 'శారద' అనే పేరుతో రెండు నవలలను వ్రాశాడు.

## 14.6. నవల ప్రధానాంగములు విషయ వివరణము

నవల ప్రధానాంగములను ఐదు విధములుగ విభజించవచ్చును.

1. ఇతివృత్తము
2. పాత్ర చిత్రణ
3. సంభాషణములు
4. వాతావరణము
5. సందేశము

### 14.6.1. ఇతివృత్తము

ప్రతి నిత్యము జీవిత రంగమున సంభవించిన అనుభవములు, సంఘటనలు, సమావేశములు, వాగ్వ్యాహారములు నవలకు ముఖ్య ఇతివృత్తములై ప్రధానాంగముగా భాసించుచున్నవి. కనుక నవలకు ఇతివృత్తము ముఖ్యమైన అంగమని గ్రహింపవలయును. నవల యందుండు 'కథ' ను ఇతివృత్తమందురు. ఇతివృత్తమును స్వీకరించుట యందును, స్వీకరించిన దానిని క్రమముగా నడుపుట యందును రచయితకు మంచి సామర్ధ్యము అవసరము. ఇతివృత్తము ఇంపుగను, చదివిన కొలది చదివించగల సమర్థవంతముగను ఉన్నప్పుడే అది సర్వజనా(దరము)మోదము పొందగలదు. ఇతివృత్త నిర్వహణమున రచయితకు సువిశాలమైన జీవిత వైఖరీ పరిజ్ఞానము, వ్యక్తిగతమైన శక్తి సామర్ధ్యములు, రచనా శిల్పాభిజ్ఞతము ఉండవలెను.

### 14.6.2. పాత్ర చిత్రణ

మనము ప్రతి నిత్యము జీవిత రంగమున చూచుచున్న వ్యక్తులు, మనలో సన్నిహిత సంబంధము కల మనుష్యులు, ఈ సంఘటనలకు, ఈ విచిత్ర సమావేశములకు మూలభూతములై నవలలందు 'పాత్రలు' గా వ్యవహరింతురు. పాత్ర చిత్రణమున రచయిత కడుజాగరూకుడై మెలగవలెను. సజీవ సంపన్నమైన పాత్రలను సృష్టించుటకు రచయిత ప్రతిభావంతుడును, భావకుడును గావలెను. తాను జీవించుచున్న సమాజమందలి వ్యక్తులను, వారి స్వరూప స్వభావములను, వారి మనో వృత్తులను, వారి వేషభాషలను, ఆచార వ్యవహారములను, నాగరికతా వైభవమును, ఆర్థిక స్తోమతులను చక్కగా పరిశీలించగల లోకానుభవము ఉన్న యెడల సజీవ పాత్రలను సృష్టించగలడు.

నవల యందు కథాకథనము కంటె పాత్ర చిత్రణము ముఖ్యమైనది. అపురూపములును, చదివిన తరువాత తలచుకొనిన మాత్రమున మన కన్నులకు గోచరించినవియు అగు పాత్రలు గల నవలలే కథా రక్తి గల నవలల కంటె లోకమున ప్రసిద్ధి కెక్కినవి

కాలమున నిలవబడినవి.

### 14.6.3. సంభాషణలు

నవల యందలి పాత్రలు ప్రపంచము నందలి మానవులకు ప్రతిబింబములు. ఆ పాత్రల సంభాషణా సంవిధానము సరసముగను, సుందరముగను, మనోరంజకముగను, ఫలవంతముగ నున్నప్పుడే పాఠకులకు ఆనందమును చేకూర్చగలవు. పఠితలకు తృప్తిని కలిగించని నవలలు ఆదరణమునకు నోచుకోవు. సంఘటనములకును, సన్నివేశములకును, అనుకూలమైన సంభాషణములు జరిగినప్పుడే, నవల సజీవముతో మనముందు సాక్షాత్కరించి, పాఠకులను ఆనంద సముద్రములో ఓలలాడించగలదు.

### 14.6.4. వాతావరణము

నవల వాస్తవికతను ఆపాదించుకొని, సజీవముగను, సలక్షణముగను, చైతన్యవంతముగను, భాసింపవలయునన్న దేశ కాల చిత్రణము లేదా బాహ్య పరిస్థితులను గురించి వివరణము ముఖ్యము. అనగా చక్కని వాతావరణము కల్పన చేయవలెను. దేశ కాల పరిస్థితులును, బాహ్య వాతావరణమును సమర్థవంతముగా చిత్రించినప్పుడే, ఇతివృత్తమునకు మంచి జిగి, బిగి, చేకూరి, రచన సక్రమముగాను, సాఫీగాను సాగగలదు. ఈ వాతావరణమును (1) సామాజిక వాతావరణము, (2) భౌతిక వాతావరణమని రెండు భాగములుగా విభజించవచ్చును. ఈ వాతావరణమును పుష్టివంతముగను, తుష్టివంతముగను చిత్రించి చూసినప్పుడే, నవలకు పరిపూర్ణత సిద్ధించి, అది ఫలవంతము కాగలదు. వాతావరణమును చిత్రించునప్పుడు రచయితకు శ్రద్ధ ఎంతైనా అవసరము. అది మరచినచో అనర్థములు ప్రత్యక్షము కాగలవు.

### 14.6.5. సందేశము

నవలా రచయిత తనకు గల లోకానుభవముతో, పైన వివరించిన నాలుగంశములను సహాయముగ తీసుకొని, యీ ప్రపంచమును, తాను జీవించుచున్న సంఘమందలి విభిన్న వ్యక్తులను, వారి గమన శీలమును గురించి తన అభిప్రాయములను వెల్లడించును. దీనిని 'సందేశము' అని గాని లేదా జీవన తత్త్వము అని గాని, లేదా జీవన విధానము అని గాని అందురు. శరీరమునకు ప్రాణమెట్టిదో రచనకు రచయిత యొసంగు సందేశమట్టిది. సమర్థవంతుడైన రచయిత చేతిలో నవల 'సామాజిక దర్శనము' గా ప్రకాశించును. రచయిత ఇచ్చు సందేశము అత్యుత్తమమైనది. సార్వదేశికము, సార్వకాలికమునై, సర్వమానవ కళ్యాణమునకు, సర్వ మానవ సౌభ్రాతృత్వమునకు, సౌహార్ద్రత్వమునకు దోహదమొసంగునదిగా యుండును. అప్పుడు ఆ రచయిత పడిన శ్రమ ఫలవంతమగును. కనుక రచయిత యిచ్చు సందేశము నవలకు చాల ముఖ్యమైనది.

## 14.7. నవలా రచయిత బాధ్యతలు

నవల పెక్కు విషయముల సమాహారము. దాని పరిధి విశాలము. కనుక రచయిత నవల వ్రాయునపుడు మిక్కిలి అప్రమత్తుడుగా నుండవలెను. నవలా రచనమందు ఏ విషయమున కెంత ప్రాధాన్య మీయవలెనో గుర్తించి, ముందుగా క్రమబద్ధమైన ప్రణాళిక సిద్ధము చేసుకొని, తదనుగుణ్యముగా రచన చేయవలెను.

నవలాకారుడు నీతిని బోధించునపుడు, పాత్రల శీలమును చిత్రీకరించునపుడు, హితమును బోధించునపుడు, మత విషయములను చర్చించునపుడు, ధర్మ ప్రతిపాదన చేసి సంఘమును పునరుద్ధరించునపుడు, మానవ మానసిక ప్రవృత్తులను వర్ణించునపుడు, విజ్ఞానాత్మకమైన ప్రబోధమును చేయునపుడు, స్థితప్రజ్ఞుడై ప్రవర్తించవలెను. భాషా విషయము నందు కఠిన పద భూయిష్టమైన సమాసమును గాని, అనర్థములను చేకూర్చు అలంకారములను గాని, కథాకథనమునకు పుష్టిని చేకూర్చలేని సంభాషణలును గాని, అసహజము, అసందర్భములైన వర్ణనలను గాని చేయుకుండుట చాల ముఖ్యము. అధిక వర్ణనలు

అనర్ధదాయకములను సత్యమును నవలా రచయిత మరువరాదు.

చదివిన కొలది చదివించి, చవులూరించగల తియ్యని మాటలతో, మధురమైన లోకోక్తులతో, దేశీయములైన నుడికారపు సొంపులతో, సరస సంభాషణలతో, చమత్కార జనితముగను, ఆహ్లాదవంతముగను వుండి ప్రవాహ సదృశ్యముగ కథ సాగినప్పుడే నవలాకారుని కృషి ఫలించును.

### 14.7.1. నవల - ప్రపంచ దర్శిని

ఆధునిక ప్రక్రియల అన్నిటి యందును నవల ప్రతి దేశమునను, ప్రతి సమాజమునను, ఒక ఉన్నత స్థానము సంపాదించు కొనినది. మానవ జీవిత యధార్థ చిత్రణను అపురూపముగా ఒక వినూతనత్వముతో రచించుట వలన ఇతర సాహిత్య ప్రక్రియల అన్నింటి కన్న గొప్ప పలుకుబడి, విలువ, ప్రభావము, ప్రపంచములోని ప్రతి సమాజములోను లభించినది. ఈ ప్రక్రియ ద్వార ఏ దేశమును ఎక్కడికిని వెళ్లకుండగనే, సందర్శించకుండగనే, ఆదేశములు సాధించుచున్న ఘన విజయములను, వాని సమగ్ర స్వరూపములను, సంపూర్ణముగా సాకల్యముగా ఇక్కడ నుండియే దర్శించవచ్చును.

ఆధునిక ప్రక్రియలు అన్నిటియందును నవలా ప్రక్రియ, తన ప్రాభవమును, ప్రభావమును బహుముఖములుగా విస్తరింప జేసుకొని, తన తోటి సాహిత్య ప్రక్రియల అన్నింటియందును ముందు నిలిచి, సజీవ స్రవంతియై, నిత్య నూతనము గాను, నవనవోన్మేషముగను, వర్థిల్లుచూ, పెక్కు భాషలలో 'నవ శకమును సృష్టించి' ప్రపంచ ప్రజల చేత నివ్వాళులనందు కొనుచున్నది. విశ్వసృష్టిని, దాని స్వరూప స్వభావములను బాగుగా గమనించి, యధార్ధ పరిస్థితులను అవగాహన చేసికొనుటకు 'నవలా ప్రక్రియ' కన్నా మరొక సరియైన మార్గము లేదని చెప్పినచో అతిశయోక్తి కానేరదు. ఇది తదితర సాహిత్య ప్రక్రియలకు మకుటము. ప్రతిభావంతుడైన రచయిత చేత అపురూపముగా మలచబడి, సర్వ జనులకు మధురానందమును కలిగించునదియైన నవల 'ప్రపంచ దర్శిని' యై కలకాలము ప్రపంచమున వర్థిల్లగలదు.

### 14.8 సమీక్ష

నవల ఒక ప్రత్యేకమయిన ప్రతిపత్తి కలిగిన వాఙ్మయ ప్రక్రియ. ఇది ఆంగ్ల భాషా సాహిత్య ప్రభావము వలన తెలుగు సాహిత్యము లోనికి ప్రవేశించినది. ఆంగ్లమున నావెల్ అను పదానికి సమానార్ధకమైన నవల 1872 లో మొట్టమొదటిసారిగా ప్రచురింపబడినది. నరహరి గోపాలకృష్ణమచెట్టి గారు వ్రాసిన శ్రీరంగరాజ చరిత్ర. 1878 లో కందుకూరి వీరేశలింగము గారు రాజశేఖర చరిత్రను వ్రాశారు. ఆ తరువాత నవల ఒక రచనా ప్రక్రియగా విశేష ఆదరమును పొందినది. తెలుగు నవల 5 యుగాలుగా విభజింపబడి, పన్నెండు నవలా భేదాలుగా గుర్తింపబడినది. నవల మళ్ళీ మళ్ళీ చదివించేదిగా వుండాలి. చదివిన నవల పాఠకుల హృదయమును హత్తుకొనాలి. అదే ఉత్తమమైన నవల అవుతుంది.

### 14.9 ప్రశ్నలు

1. నవలా లక్షణములను సోదాహరణముగా వివరించునది.
2. తెలుగు నవల వికాసాన్ని, ఆవిర్భావాన్ని, భేదాలను వివరించునది.
3. నవల ప్రధానాంగములను చర్చించునది.
4. నవలా ప్రక్రియ విశిష్టతను, నవలా రచయిత బాధ్యతలను తెల్పునది.

**14.10 ఉపయుక్త గ్రంథాలు**


1. తెలుగు నవలా వికాసము - యెదలి నాగభూషణశర్మ
2. తెలుగు నవలా పరిణామము - బొడ్డపాటి వేంకట కుటుంబరావు
3. తెలుగు నవలా సాహిత్య వికాసము - పుల్లాబొట్ల వేంకటేశ్వర్లు
4. తెలుగు నవల సామాజిక దృక్పథం - అక్కిరాజు రమాపతిరావు
5. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
6. ఆంధ్ర వచన వాఙ్మయము - నిడుదవోలు వేంకటరావు
7. వ్యాససంపుటి, యువభారతి, 1972 - మహతి
8. సంపుటి 3, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం - వాఙ్మయి
9. సాహిత్య భావలహరి - ఆచార్య యస్.వి. జోగారావు



**అరిపిరాల హరిహరనాథశాస్త్రి**

Incharge - తెలుగు శాఖ

శ్రీ సుబ్బరాయ & నారాయణ కళాశాల

నరసరావుపేట - 522 601

# పాఠం - 15

# కథానిక

పాఠ్యనిర్మాణక్రమం

15.0. లక్ష్యం
15.1. ఉపోద్ఘాతము
15.2. కథానిక - పద వివరణ
15.3. ఆంగ్ల ప్రభావము
15.4. కథానిక - ప్రాచీన సాహిత్యము
15.5. కథానిక - ఆధునిక సాహిత్యము
15.6. కథానిక - నిర్వచనములు
15.7. కథానిక - లక్షణములు (భారత పాశ్చాత్య లక్షణ సమన్వయము)
15.8. కథానిక - స్వరూపము
15.9. కథానిక - ఆవిర్భావ వికాసాలు
15.10. కథానిక - భేదాలు
15.11. సమీక్ష
15.12. ప్రశ్నలు
15.13. ఉపయుక్త గ్రంథాలు

## 15.0 లక్ష్యం

ఆధునికాంధ్ర సాహిత్యంలో ప్రచుర ప్రచారాన్ని పొందిన కథానిక పూర్వాపరాల్ని, లక్షణాల్ని, భేదాల్ని వివరించడం ఈ పాఠ లక్ష్యం.

## 15.1 ఉపోద్ఘాతము

ప్రపంచ సాహిత్య ప్రక్రియలన్నింటి యందును బహుళ ప్రచారము పొందిన ప్రక్రియ కథానిక. ఆధునిక కల్పనా సాహిత్య ప్రక్రియలన్నింటిలోనూ 'కథానిక' ప్రముఖ స్థానాన్ని అలంకరించినది. దీనికి కారణము సామాన్య మానవుని సాహిత్యకామనకు ప్రథమ సోపానము కథాశ్రవణ ప్రవణత్వము. జీవితకాలమందు ఎప్పుడో యొకప్పుడు కథకుడు గాని మానవుడు, కథ విని ఆనందించని మానవుడు గాని ఉండడు. తెలుగు సాహిత్యవనంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా వెలుగొంది దినదిన ప్రవర్థమవుతున్న సాహిత్య ప్రక్రియ కథానిక. తెలుగు సాహిత్య జగత్తులో ఈ యుగాన్ని కథానిక యుగమని పిలువవచ్చును.

## 15.2 కథానిక - పద వివరణ

సంస్కృతములో కథ్ అనే ధాతువునకు 'చెప్పడం' అని అర్థం. దాన్నించే పుట్టింది 'కథా' శబ్దం. దానికి తెలుగులో తత్సమ రూపం కథ. తద్భవం కత.

ఆంగ్ల సాహిత్య ప్రభావముతో భారత దేశంలో వెలువడిన అనేక నూతన ప్రక్రియలలో కథానిక ప్రక్రియ ఒకటి. ఆంగ్లంలో

short story కి సమానార్థముగా 'చిన్న కథ' అనే పేరుతో ప్రారంభములో పిలిచేవారు. 1936 లో ఇంద్రగంటి హనుమత్ శాస్త్రి గారు 'ప్రతిభ' అనే పత్రికలో వ్యాసం వ్రాస్తూ short story అనే దానిని 'చిన్న కథ' అనకుండా, సంస్కృతములో వున్న 'కథానిక' అనే పదాన్ని ఉపయోగించడము అన్ని విధాల మంచిదని సూచించినారు. ఆనాటి నుండి శాస్త్రి గారు సూచించినట్లుగా short story ని 'కథానిక' అని పిలుచుట పరిపాటి అయినది. కథానిక అనే పదాన్ని మనం సాహిత్యములో మాత్రమే వ్యవహరించుచున్నాము. నిత్య వ్యవహారములో మాత్రము కథ, కథలు అని వాడుచున్నాము. మొత్తం మీద కథానికను 'కథ' అని 'చిన్న కథ' అని వ్యవహరించుచున్నారు. కాని పారిభాషిక వివక్ష కోసం 'కథానిక' అని పిలుచుటయే సమంజసము.

## 15.3 ఆంగ్ల ప్రభావము

కథానిక పాశ్చాత్యుల సాంప్రదాయము. పాశ్చాత్య రచయితల ప్రభావము వలన ఇతర భాషల మాదిరిగానే భారత దేశంలోకి ప్రవేశించిన ఆధునిక వచన సాహిత్య ప్రక్రియలలో 'కథానిక' ఒకటి. కథానిక రచన మొదటగా అమెరికాలో ప్రారంభమైనది. అమెరికా దేశమున 'వాషింగ్టన్ ఇర్వింగ్' కథానికను ఒక ప్రత్యేక లక్షణముగల గద్య సాహిత్య ప్రక్రియగా రూపొందింప నవకాశము గలదని మొదట గుర్తించినాడు. ఆ తరువాత 'నథానియేల్, హోతార్న్ గారు దీనికి అంతరంగిక శిల్ప పటిష్టతను కొంత చేకూర్చిరి. ఆధునిక యుగ గొప్ప కథా రచయితలలో ప్రథముడుగా పరిగణింపబడినవాడు 'ఎడ్గర్ అల్లెన్ పో'. కథానికా లక్షణమును గూర్చి మొదటగా తెలియ చెప్పినవాడు. 1885 లో 'బ్రాండర్ మాథ్యూస్' 'ఫిలాసఫీ ఆఫ్ షార్ట్ స్టోరి' అను వ్యాసమును వ్రాసెను. విదేశాలలో చిన్న కథలు వ్రాసి ప్రసిద్ధి కెక్కిన వారిలో 'సోమర్ సెట్ మామ్, గయడ్ మెపాసా, ఆంటిన్ చెకోవ్, స్కీవెన్సన్, సారోయన్, బోతా, జాక్‌లండన్, నథానియేల్ హాథారన్, స్వెన్‌బక్, హాబర్టు, బహెన్రీ, మెపాపో మొదలైనవారు.

## 15.4 కథానిక ప్రాచీన సాహిత్యం

కథానిక లిఖిత రూపము ధరింపకముందు, జాతి జన శ్రుతి యందును, పుక్కిట పురాణములందును ప్రచరితములగు చుండిన కట్టు కథలు, పిట్ట కథలను, దీని పూర్వ రూపములుగా భావింపనగును. ఉపనిషత్కథలు, బౌద్ధజాతక కథలు, పంచతంత్ర కథలు మున్నగునవి ప్రాచీనములే కాని, కొంత పరిణత రూపములుగా భావింపనగును. ప్రాచీనాంధ్ర సాహిత్యములో కథలు ఉన్నట్లు ఆధారములు కన్పించటము లేదు. కథలు గ్రంథస్తము కాకపోయినను జనశ్రుతిలో వుండి వుండవచ్చును. తరువాత కాలములో కథలు తెలుగు సాహిత్యములో కావ్యాలల్లోను, ద్విపదలల్లోను కన్పిస్తున్నాయి. కాని, వచన రూపములో కథలున్నట్లు స్పష్టముగా ఆధారములు కన్పించుటలేదు.

గద్య పద్యాత్మకమైన కథా రచనలు 13వ శతాబ్ది నుండి తెలుగు సాహిత్యములో కన్పించుచున్నవి. కేతన - దశకుమార చరిత్ర, అనంతామాత్యుని - భోజరాజీయము, జక్కన - విక్రమార్క చరిత్ర, వెన్నెలకంటి అన్నయ్య - షోటశకుమార చరిత్ర, కొఱవి గోపరాజు - సింహాసన ద్వాత్రింశిక, కదరీపతి - శుకసప్తతి, నారాయణ కవి -హంస వింశది, తురగా వెంకంరాజు-మర్యాద రామచరిత్ర, మొదలగునవి విశేష ప్రాచుర్యము పొందిన గద్య పద్యాత్మక కథలు.

ఆధునిక యుగారంభ దశయందు కాశీమజిలీ కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు, పరమానందయ్య శిష్యుల కథలు, మున్నగునవి. ఇవి అన్నియు కట్టు కథలు, పిట్ట కథలు వంటివి.

## 15.5 కథానిక - ఆధునిక సాహిత్యం

ప్రాదుర్భమున పరమ ప్రాచీనమైనదైనను, ఒక నియతి పరిణత స్థితి యందు, నిత్య నూతనమై, అనేక రచయితలు పూనుకొని సానబెట్టుచున్న ప్రత్యేక ప్రయోజనాత్మకమైన సాహిత్య కళా ఖండముగా అను నిత్యము అభ్యుదయమందుచున్నది

కథానిక ప్రక్రియ. తెలుగు సాహిత్యములో 1850 ప్రాంతం నుంచి కథా సాహిత్యము ప్రారంభమైనది. పరతస్తు చిన్నయసూరి, కందుకూరి వీరేశలింగం పంతులు గారు, రఘుపతి వేంకటరత్నము నాయుడు, వేదం వేంకటరాయ శాస్త్రి ప్రభృతులు సంస్కృత సాహిత్యం నుంచి ఎన్నో కథల్ని అనువదించి అనుకరించినారు. వేదం వారు భోజ కాళిదాసు కథలు, భేతాళ పంచ వింశది, కథా సరిత్సాగరము అనే కథల సంపుటాల్ని ప్రచురించినారు. ఇవి సంస్కృతము నుండి అనువదించబడినాయి.

పందొమ్మిదో శతాబ్ది ఆరంభం కథానిక ప్రక్రియకు ఉషోదయం వంటిది. సంపూర్ణ ఆధునిక కథానిక లక్షణములతో తెలుగు సాహిత్యంలో కథానికకు శ్రీకారము చుట్టి 96 సంవత్సరములు కావస్తుంది. 'ఆంధ్రావళికి సమ్మోదం కలుగ జేయడమే ధ్యేయంగా కలం పట్టిన కవి బ్రహ్మలా' గురజాడ అప్పారావు గారు మూఢ విశ్వాసాల రుగ్మతలో చివికిపోతున్న సమాజం కోసం సరిక్రొత్త టానిక్కులు తయారు చేయడంలో సలిపిన ప్రయత్నాల నుంచి తెలుగు కథానిక మొదటిసారిగా 1910 నుంచి ప్రారంభమైనదని చెప్పవచ్చును. గురజాడ వారి కథ పేరు 'దిద్దుబాటు' ఆంధ్రభారతి అను పత్రికలో 1910 ఫిబ్రవరి నెలలో మొదటిసారి అచ్చు అయినది. అప్పారావు గారు ప్రారంభములో ఈ కథను గ్రాంధికములో వ్రాసి, తరువాత దానిని వ్యవహారికములోనికి మార్చారు. తెలుగు కథానిక ప్రక్రియలో, విషయములలో భిన్నాభిప్రాయములున్నప్పటికి, అప్పారావు గారే ఆద్యులు, ఆరాధ్యులు అని చెప్పక తప్పదు. కావున గురజాడ అప్పారావు గారిని 'కథానికా పితామహుడు' అనవచ్చును.

## 15.6 కథానిక - నిర్వచనములు

'కథానిక' నిర్వచనమును గురించి మన పురాణములలోను, పాశ్చాత్య పండితులు, ప్రాచ్య పండితుల రచనలలో ఏ విధముగా వివరించబడినదో ముందుగా తెలుసుకొందుము.

(అ) అగ్నిపురాణము, (ఆ) పాశ్చాత్యులు, (ఇ) ప్రాచ్యులు.

### 15.6.1. అగ్నిపురాణము

కథానిక ప్రక్రియ లక్షణాలను గురించి సంగ్రహంగానైనా, చక్కగా వివరించిన ప్రతిష్ఠ అగ్నిపురాణానికి దక్కింది. అగ్నిపురాణం 337 వ అధ్యాయములో కావ్యాది లక్షణ నిరూపణ సంధర్భములో జరిగిన గద్య కావ్య విభాగంలో . . . . . .

ఆఖ్యాయికా కథా, ఖండకథా, పరికథా తథా
కథానికేతి మన్యంతే గద్య కావ్యంచ పంచథా (337, శ్లో. 12)

ఇతివృత్త భేదాన్ని బట్టి 'కథా, ఆఖ్యాయికా, ఖండకథా, పరికథా, కథాలికా అను నైదు గద్య ప్రబంధ భేదములు గలవని కావ్యాదర్శ వ్యాఖ్యాత జీవానంద విద్యాసాగర భట్టాచార్యులు తెలిపిరి. కావున, కథానికను ఒక ప్రత్యేక సాహిత్య ప్రక్రియగా గుర్తించి, ప్రపంచములో మొట్టమొదటి సారిగా లక్షణ నిర్దేశం చేసిన ప్రతిష్ఠ 'అగ్నిపురాణ కర్త' కే దక్కుతుంది. అందులో ఆధునిక కథానికా ప్రక్రియను గురించి ఇలా నిర్వచించినారు.

భయానకం సుఖాపరం, గర్భేచ కరుణో రసః
అద్భుతోఽంతే సుక ప్తార్థా నోదాత్తా సా కథానికా (337, శ్లో. 20)

ఆదిలో భయానకము, మధ్యలో కరుణము, అంతములో అద్భుతము అనే మూడు రసాలుంటూ, క్లుప్తముగా, అనుదాత్తముగా చేసిన రచన కథానిక అవుతుందని అగ్నిపురాణ కర్త వివరించినాడు.

### 15.6.2. పాశ్చాత్యులు - కథానిక నిర్వచనములు

ఆంగ్ల సాహిత్య ప్రభావముతో కథానిక ప్రక్రియ తెలుగు సాహిత్యము లోనికి ప్రవేశించినది. అందువలన పాశ్చాత్య విమర్శకులు కథానికను ఎలా నిర్వచించినారో పరిశీలించెదము.

1. "A short story is a prose narrative, requiring from half an hour to one or two hours in its persual"
- Edgor Allen Poe

"ఒకే సంఘటనాన్ని వాస్తవమైనదైనా అభూత కల్పనతో కూడుకొన్నదైన చిత్రిస్తూ ఒకేసారి కూర్చుని చదువగలిగే సాహిత్య ప్రక్రియ చిన్న కథ." - ఎడ్గార్ ఎలెన్ పో

2. "A short story clears with a single character or a single event on a single emotion."
- Brande Mathews

3. "ఆద్యంతాలు లేనిదే అసలైన కథానిక" - చెకోవ్

4. "కథంటె కథన రూపంలో చెప్పబడె చిన్న నాటిక" - హెన్రీ థామస్

5. "ప్లాటులే సర్వసం" - ఓహెన్రీ

6. "కథానికకు సంపూర్ణమైన నిర్వచన మివ్వడం కష్టం. అందుకే కథను నిర్వచించటములోని ఇబ్బందుల్ని గూర్చి సోమర్ సెట్ మామ్ ఇలా అన్నారు. రచయితను తనకు నచ్చిన లక్షణాల్ని మాత్రమే యిరికించి చిన్న కథలను నిర్వచిస్తున్నాడు. అంతే కాని ఏ విధముగా రాసినా పాఠకులను ఆకర్షిస్తే ఆ విధానం మంచిదని గుర్తించాలి." - సోమర్ సెట్ మామ్

### 15.6.3. కథానిక - ప్రాచ్యుల నిర్వచనములు

తెలుగు కథానికా రచయితలు కొందరు ఆయా సందర్భాలలో కథానికను గురించి తమతమ అభిప్రాయములను వెలిబుచ్చినారు. అభిప్రాయములు వెలిబుచ్చిన వారిలో పాలగుమ్మి పద్మరాజు, బుచ్చిబాబు, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, మల్లాది రామకృష్ణ శాస్త్రి, గోపీచంద్, బొట్టు బాపిరాజు, దేవరకొండ బాలగంగాధర తిలక్, ఆరుద్ర, బొడ్డపాటి కుటుంబరాయ శర్మ, మధురాంతకం రాజారామ్, చలం, గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, పోరంకి దక్షిణామూర్తి, తూలికా భూషణ్, అవుకు అంకిరెడ్డి, కళ్యాణ సుందరీ జగన్నాథ్, హితశ్రీ, తాళ్ళూరి నాగేశ్వరరావు, కేతు విశ్వనాథ రెడ్డి, ఏ.యస్. రామారావు మొదలగువారు.

(1) చిన్న కథకి ప్రధాన లక్షణం కేంద్రీకరణం. కథలో చిన్న విషయం ఆ కేంద్రాన్ని సూచిస్తూ వుండాలి. కథానికకు కేంద్రంగా ఒక స్పష్టమైన సంఘటన, ఒక విచిత్రమైన వ్యక్తి, ఒక మనఃస్థితి, రెండు స్వభావాల తారతమ్యం వల్ల వచ్చే నాటకీయత ఇలా ఏదో ఒకటి వుండాలి. కథానిక ఒక మెరుపు వంటిది. దానిలో వేగం ప్రధానం. వైచిత్రి కథానికకు ప్రాణం. కథానికకు ప్లాట్ అనేది అవసరమని నా అభిప్రాయం. శిల్పం మీద దృష్టిని కేంద్రీకరించి మరీ వ్రాయాలి. లేకపోతే కళ్ళెం లేని గుర్రంలా అది తిరిగి తిరిగి దిక్కులేని ప్రదేశాన్ని చేరుకుంటుంది. - పాలగుమ్మి పద్మరాజు.

(2) కథానిక అంటె మళ్ళీ మళ్ళీ చదివించె వచన ఖండ కావ్యం. వెనుక నుంచి సముద్రం హోరు వినిపిస్తూ చూడ్డానికి మాత్రం కెరటంలా కన్పించేది. - బుచ్చిబాబు (శివరాజు వెంకట సుబ్బారావు).

(3) కథలంటె పైపైని వున్నాయనుకున్నావేమో, అవి కల్పించడానికి చాల గొప్ప ప్రతిభ వుండాలి. వాటిని తెలుసుకోవడానికి ఎంతో

పరిజ్ఞాన వుండాలి. అవి చెప్పడానికి ఎంతో నేర్పు వుండాలి. అవి వినడానికి ఎంతో రుచి వుండాలి. అవి బోధపరచడానికి ఎంతో సూక్ష్మబుద్ధి వుండాలి. కథలు కళ్ళకి వెలుగిస్తాయి, బుద్ధికి పదునువెడతాయి. మనస్సుకి ఉత్సాహము, ఉల్లాసము కలిగిస్తాయి. - శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి.

(4) సహజం అన్పించే అసహజం కథ. - మల్లాది రామకృష్ణ శాస్త్రి.

(5) కథను ఏ రూపంలో వ్రాసినా కథ ద్వారా పాఠకులకు ఒక పరిష్కారాన్ని, ఒక కొత్త దృష్టిని కల్గించడం ముఖ్యం. - గోపీచంద్.

(6) ఉపక్రమణంలో ఒక ఉత్కంఠా, నిర్వహణలో ఒక ఔత్సుక్యం, ఉపసంహారంలో ఒక విచిత్ర చంక్రమణం, కథకు కావలసిన అలంకారాలు. - బొడ్డు బాపిరాజు.

(7) కథ అనేది మన జీవితంలో జీవిత రహస్యంతో, జీవిత వైచిత్రితో కొంత పరిచయం కలుగ చెయ్యాలి. కథ చెప్పే విధానమే కథకి అందాన్ని, బలాన్ని ఇస్తుంది. - దేవరకొండ బాలగంగాధర్ తిలక్.

(8) కథకు గొప్పతనం పట్టాలంటే కథ చిత్రించి జీవితం భూమి నుంచి తేవాలి. - చలం.

(9) కథ అనేది మొదట్లో కుతూహలాన్ని, చివర ఆలోచనల్ని కలిగించాలి. మధ్యలో రక్తి కట్టిస్తూ చెప్పుకు పోవాలి. - ఆరుద్ర.

(10) ఒక రకమైన ఎత్తుగడ, ఒకానొక నడక తీరు, ఒక రీతి గల ముగింపు, కొన్ని పాత్రలు, పాత్ర పోషణా విధానం, వస్తు విన్యాస వైశిష్ట్యం, ఏదేని ఒక జీవిత సత్య ప్రతిపాదనం, అన్నింటిని మించి వస్త్వైక్యం అనే కొన్ని లక్షణాలు కలిగి వినోద, విజ్ఞాన, వికాసాది, సాధనమైనది కథానిక. - బొడ్డపాటి కుటుంబరాయ శర్మ.

(11) సహజత్వం, ఉత్కంఠం, అనే రెండు చక్రాల మీదే కథ సాగాలి. - మధురాంతకం రాజారాం.

(12) కథకు ఎత్తుగడ బాగా వుండాలి. గమనము వేగముగా వుండాలి. Climax అద్భుతముగా ఉండాలి. - గొర్రిపాటి వెంకటసుబ్బయ్య.

(13) 'ఏకాంశ వ్యగ్రమై, స్వయం సమగ్రమైన కథాత్మక వచన ప్రక్రియ 'కథానిక' - పోరంకి దక్షిణామూర్తి.

(14) చిన్న కథ ఒక సంఘటన కావచ్చు. ఒక వ్యక్తి మనస్తత్వ పరిణామం కావచ్చు. ఒక సుదీర్ఘమైన ఇతివృత్తమే కావచ్చు. చిన్న కథలో కేవలం ఒకే ప్రత్యేకత ఉంది. సాధ్యమైనంత తక్కువ మంది వ్యక్తులతో, తక్కువ సంఘటనలతో అది కథ కావాలి. అంతే కాక అది స్వయం సంపూర్ణం కావాలి. అంటె కథకు ఆధారముగా తీసుకున్న సంఘటనలతో, వ్యక్తులతో, చెప్పదలచుకున్న దానిని సంపూర్ణంగా చెప్పగలిగి ఉండాలి. - మాలికా భూషణ్

(15) కథానిక జీవిత ప్రవాహంలో ఒక 'అల' వంటిది. అది క్షణికమయినా దానికుండే శక్తి సామర్థ్యాలు విలువైనవి. హఠాత్తుగా ప్రారంభమై హఠాత్తుగా అంతమవుతుంది. ఆద్యంతాలు ప్రతిభావంతముగా వుంటాయి. కథానిక తన ఉద్దేశాన్ని తుది క్షణం వరకు అణిచిపెట్టుకొని వుంటుంది. తన ఉద్దేశాన్ని చెప్పి పఠితను ఒక విశేష ప్రభావానికి గురిచేస్తుంది. - అవుకు అంకిరెడ్డి.

(16) ఒకే సంఘటను చుట్టూ కథ అల్లుకు పోయి, భావంలో భిన్నత్వము కాకుండా ఒక ఐక్యతతో ఉండే రచన 'చిన కథ' - కళ్యాణ సుందరీ జగన్నాథ్

(17) సాధారణముగా అతి విస్తృత క్షేత్రము కలిగి ఒకానొక సత్యమునకో యధార్థములకో సంబంధించిన ఉత్కంఠ సంవేదనముతో కూడి, స్వయం సంపూర్ణమై దానిలోని విభిన్న తత్త్వములను ఏకోన్ముఖములుగా చూపు ఇతివృత్తాత్మక గద్య కవితా శిల్ప ఖండమును

'కథానిక' అని నిర్వచింపవచ్చును. - బొడ్డుపాటి కుటుంబరాయ శర్మ.

(18) ఒక అవస్థను గాని, ఒక అనుభవాన్ని గాని, ఒక వైచిత్ర్యాన్ని గాని, ఒక మనస్తత్వాన్ని గాని చిత్రించేది కథ. - హితశ్రీ.

(19) సాధారణముగా ఒక సంఘటనను గానీ, అంతకంటె ఎక్కువ సంఘటనలతో ఒక ప్రయోజనాన్ని, ఒకే ఆదర్శాన్ని దృష్టిలో పెట్టుకొని చిత్రించడాన్ని చిన్నకథ అని గాని, కథానిక అని గాని అంటారు. - తాళ్ళూరి నాగేశ్వరరావు.

(20) పాఠకుని కాలాన్ని వృథా చేయకుండా, అతి తక్కువ కాలంలో విజ్ఞానంతో పాటు వినోదాన్ని కలిగిస్తూ, ప్రకృతి రహస్యాలను మానవుల విచిత్ర, చిత్ర ప్రవృత్తులను, ప్రమాణాం పరిమాణాలను సూటిగా చెబుతూ ఆశ్చర్యాన్ని కలిగించ గలిగేదే 'కథానిక' - ఎ.యస్. రామారావు.

(21) కథ వ్రాయాలని ఆర్తికి ఎలా వ్రాయాలి, ఎందు కోసం వ్రాయాలి అనే ఆలోచన వుంటే ఆసక్తి కలిగించే మంచి కథ రాయడం సాధ్య పడుతుంది. - కేతు విశ్వనాధ రెడ్డి.

## 15.7 కథానిక - లక్షణములు

'చిన్న కథ' ను ఒక ప్రత్యేక సాహిత్య ప్రక్రియగా గుర్తించి లక్షణం నిర్దేశం చేసిన ప్రప్రథమ గ్రంథం అగ్ని పురాణము. అయితే కథానికను ఒక నిర్దిష్ట సాహిత్య ప్రక్రియగా పరిచయం చేసి, ఆ రంగంలో కృషి చేయడానికి మనకు స్ఫూర్తినిచ్చే ఒరవడి పెట్టింది పాశ్చాత్య కథానికే. 1936 ఆగష్టు నెల 'ప్రతిభ' పత్రికలో ఇంద్రగంటి హనుమత్ శాస్త్రి గారు అగ్ని పురాణములో చెప్పిన కథానిక లక్షణాలను ప్రకటించు వరకు, ఆ లక్షణాల గురించి తెలుగు రచయితలకు తెలియదు. అయినప్పటికి కొన్ని దశాబ్దాలుగా తెలుగులో కథానికలు వెలువడుతూ వున్నాయి. పాశ్చాత్య కథానికా లక్షణములుగా మనం భావించే వాటిని అనేక శతాబ్దాలకు పూర్వమే భారతీయ లాక్షిణికులు నిర్దేశించి ఉండడం భారతీయులకు గర్వ కారణమే. అందువలన భారతీయ పాశ్చాత్య లక్షణ సమన్వయం చేయవలసిన అవసర మేర్పడినది.

### 15.7.1. భారత పాశ్చాత్య లక్షణ సమన్వయము

బ్రాండరు మాథ్యూస్ 'కథానిక' ను గురించి సమగ్రముగా నిర్దేశించి లక్షణ నిర్దేశం చేసినాడు. అగ్ని పురాణ కర్త ఎడ్గార్ ఎలెన్ పో, బ్రాండర్ మాథ్యూస్ మొదలైన వారి నిర్వచనములను తులనాత్మకముగా పరిశీలించిన 'కథానిక' లక్షణములను పేర్కొనవచ్చును.

| అగ్ని పురాణ కర్త (కాలం తెలియదు) | ఎడ్గార్ ఎలెన్ పో (1842 సం.) | బ్రాండర్ మాథ్యూస్ (1884 సం.) |
|---|---|---|
| 1. క్లుప్తత<br>2. అనుదాత్తత<br>3. కథాదిలో భయానకం<br>4. కథా గర్భంలో కరుణరసం<br>5. కథాంతంలో అద్భుతం | 1. క్లుప్తత<br>2. ఏకైక ప్రభావాన్వితి | 1. మౌలికత<br>2. ఏకత<br>3. క్లుప్తత<br>4. శైలీ రమ్యత<br>5. క్రియాశీలత<br>6. రూపం<br>7. వస్తువు<br>8. వీలుంటె కల్పన |

పై పట్టికలోని మూడు విభాగాలలోని అంశములను పరిశీలించిన కథానికా లక్షణములను ఈ విధముగా చెప్పవచ్చును.

(ఏ) సంక్షిప్తత లేక క్లుప్తత - కథానిక క్లుప్తముగా లేదా సంక్షిప్తముగా లేదా చిన్నదిగా ఉండాలన్న విషయములో భారతీయ పాశ్చాత్య లాక్షణికులు ఏకాభిప్రాయమును వెలిబుచ్చారనేది సుస్పష్టం. పరిమాణము చిన్నగా ఉండటం వల్ల పాఠకులకు 'ఏకబిగి'ని చదవడానికి వీలవుతుందన్నాడు ఎడ్గార్ ఎలెన్ పో. అప్పుడు పాఠకుని అవధానత నిశ్చలంగా ఉంటుంది. ఆ ఏకాగ్రత వలన తాదాత్మ్యం సిద్ధిస్తుంది. ఆ రచన అతని హృదయము మీద ముద్ర వేస్తుంది. కథానిక పరిమాణం కచ్చితంగా ఇంత ఉండాలని ఏ లాక్షణికుడు నిర్ణయించలేదు. అరగంట సేపు కూడ పట్టని అపురూప కథానికలున్నాయి. (ఉదా. వి. రాజారామ మోహనరావు గారి 'వరద' కథానిక). క్లుప్తత కథనంలోను, వర్ణనలోను, సంభాషణలలోను, పాత్ర చిత్రణలోను, వివిధ భావాల అభివ్యక్తిలోను, ద్యోతకం కావాలి. అనవసరమైన వాక్యం కాని, పదం కాని ఒక్కటి కూడ రచనలో కనిపించగూడదు. అల్పాక్షర రచనలో అనల్పార్థ స్ఫూర్తి సాధించాలి. ప్రతి ఒక్క విషయం ప్రయోజనాత్మకంగా ఉండే విధంగా రచయిత జాగ్రత్త పడాలి. అందుకు అతనికి సంయమన శక్తి తప్పనిసరిగా అవసరము. కథానిక వ్రాయడానికి కథకుడు చాల కష్ట పడాలి. అందుకనే కథానిక వ్రాయటము కష్టమన్నారు విమర్శకులు.

(బి) అనుదాత్తత - అగ్ని పురాణ కర్త చెప్పిన లక్షణాలలో మరొకటి 'అనుదాత్తత'. కథా వస్తువులోను, భాషా శైలిలోను, వర్ణనలోను అది కనిపించాలి. అత్యంత సహజంగా, సరళంగా సాగిపోవాలి. ఈ విషయములో జానపద కథ ఆదర్శవంతమైనది. అందుకే అది జీవితానికి అంత సన్నిహితముగా ఉంటుంది. పాశ్చాత్య రచయితలు ఈ నియమాన్ని పాటించారే కాని, పాశ్చాత్య లాక్షణికులు దీనిని ప్రత్యేకించి నిర్దేశించి చెప్పలేదు. సహజత్వ, సారళ్యాల ప్రాముఖ్యాన్ని మటుకు చెప్పినారు.

(సి) రస నిర్దేశము - అగ్ని పురాణ కర్త కథాదిలో భయానకం ఉండాలని చెప్పాడు. కాని అది అందరికి అంగీకారయోగ్యం కాదు. ఏ కథ అయినా ఎత్తుగడలోనే పాఠకుడిని ఆకట్టుకోవాలని అందరూ అంగీకరించినదే. ఆదిలో ఉత్కంఠ రేకెత్తించే కథ పాఠకుడి చేత అవలీలగా చదివిస్తుంది. కథా గర్భంలో కరుణ రసముండాలని అగ్ని పురాణ కర్త చెప్పాడు. కరుణం హృదయాన్ని ద్రవింపజేస్తుంది. నిజమే కాని, అది కథ మధ్య భాగంలో ఉండటమా, మానడమా అన్నది కథా వస్తువు మీద, సన్నివేశం మీద ఆధారపడి ఉంటుంది. కావున, పాశ్చాత్య విమర్శకులు ఈ రెండింటిని గూర్చి ప్రస్తావించలేదు. అగ్ని పురాణంలో చెప్పిన కథానిక లక్షణాలలో చివర అద్భుత రసముండాలన్న విషయము. ఆరంభములో పాఠకునిలో ఉత్కంఠ కలిగించి, మధ్యలో హృదయాన్ని ద్రవీభూతం చేసి, అద్భుతముగా ముగించాలని అగ్ని పురాణ కర్త ఉద్దేశ్యం కథా గర్భం ఏలా ఉన్నా, ఆద్యంతాలు రెండు ఆకర్షకమైతే తప్ప పాఠకుడు పట్టించుకోడు. అందులోను ముగింపుకే ప్రాధాన్యత ఉంటుంది. పాఠకుడు ఊహించని విధముగా కథ మలుపు తిరిగి, చమత్కారముగా అంతమైనప్పుడు కలిగే ఆనందం ఎంతో విలువైనది. అందుకే ఓ.హెన్రీ. కథల్లోని 'కొసమెరుపు' పాఠకులను విశేషముగా ఆకర్షించినది. అయితే ఈ ముగింపు కథా పరిణామ దృష్ట్యా సహజమైయుండాలి. లేనప్పుడు పాఠకుల నిరసనకు గురవుతుంది.

(డి) ఏకైక ప్రభావాన్వితి - కథ కంతకూ అంతస్సూత్రం ఒక్కటే ఉండాలన్నాడు ఎడ్గార్ ఎలెన్ పో. అది ఒక సంఘటన కావచ్చు. ఒక పాత్ర కావచ్చు. ఒక సన్నివేశమైనా కావచ్చు. దానిని సమగ్రంగా పోషించి నప్పుడే పాఠకుడి హృదయం మీద ముద్ర వేస్తుంది. దానినే 'ఏకైక ప్రభావన్వితి' అన్నాడాయన. కథాంశం ఏక సూత్రం మీద నిలిచినపుడు పాఠకుడికి అంత స్పష్టంగా అవగాహన మవుతుంది. రచయిత కథనంలో గాని, వర్ణనల్లో గాని, అప్పుడు అనవసరమైన విషయం ఏ ఒక్కటి ప్రవేశించదు. ప్రతి మాటకు ప్రతి వాక్యానికి మూల భావంతో సంబంధం గోచరిస్తూ ఉంటుంది.

(ఇ) మౌలికత - ఈ విషయాన్ని వివరించినవాడు మాథ్యూస్ ఒక్కడే. కథానికా రచయితకు మౌలిక సృజనాత్మక కుశలత తప్పని సరిగా ఉండాలని ఆయన అభిప్రాయము. భారతీయ లాక్షణికులు కావ్య కర్తకు ప్రతిభా వ్యుత్పత్తి అభ్యాసాలు ఉండాలంటూ,

ప్రతిభకు ప్రథమ స్థానం కల్పించడంలో అంతరార్ధమిదే. నవనవోన్మేషశాలని అయిన ప్రజ్ఞే ప్రతిభ అని భారతీయ లాక్షణికులు స్పష్టం చేశారు.

(యఫ్) శైలి - కథా రచయిత శైలిలో క్లుప్తత, రమ్యత ఉండాలని బ్రాండర్ మాథ్యూస్ చెప్పాడు. ప్రతి మాట రచయిత తూచితూచి వాడాలి. మాటలలో రచయిత శిల్పాలు చెక్కాలి. నగిషీలు చూపాలి. రచనలో ప్రతి అంశం శైలిలో అంతర్భాగమే అవుతుంది. అది సహజముగా, సరళ సుందరముగా రూపొందినప్పుడే పఠితకు కలిగే తృప్తి వర్ణనాతీతం. వాచ్యం చేయకుండా భావాని ధ్వనింప జేసే సందర్భాలలో కూడ రచయిత శక్తివంతమైన శైలి అనుకరించాలి.

(జి) క్రియాశీలత - కథానికలో కథ క్రియాశీలమై చేతన్యంలో తొణికిసలాడాలి. ఏప్పుడూ ఏదో జరుగుతూ ఉండాలి. మార్పు కనిపుస్తూ ఉండాలి. అది లేకపోతే కథే లేదు. అందుకే బ్రాండర్ మాథ్యూస్ 'A short story is nothing if there is no story at all' అన్నాడు. ఇక్కడ 'story' అనగా క్రియాశీలతే.

(హెచ్) రూపం - రచయితకు, తాను రాసే ప్రక్రియ తాలూకా రూపురేకల పట్ల స్పష్టమైన, నిర్దష్టమైన అవగాహన ఉండాలి. నిర్మాణం సహేతుకంగా, సంపూర్ణంగా, సందర్భానుగుణంగా ఉండాలి. అందుకే ఈ రూప స్పృహ గురించి మాథ్యూస్ ప్రత్యేకముగా చెప్పవలసి వచ్చింది. రచయిత ఏం చెప్పదలచాడన్నది, ఎలా చెప్పాడన్నదాని కంటె ముఖ్యమైనదని మాథ్యూస్ అభిప్రాయం.

(ఐ) కల్పన - మాథ్యూస్ చెప్పిన దానిలో చివరి అంశం వీలుంటే కల్పన. సామాన్య వస్తువులో అద్భుతాలను జోడించి నట్లయితే కథానిక శోభిస్తుందని భావన. అయితే కల్పన అనేది వస్తువుకు అత్యవసరమైనపుడే కల్పించ వలయునని మాథ్యూస్ భావము.

కథానికా ప్రక్రియ మౌలిక లక్షణాల విషయంలో అగ్ని పురాణం కాలం నుంచి ఈ నాటి వరకు భిన్నాభిప్రాయమన్నది లేదని తెలియుచున్నది. భారతీయ లాక్షణికులు సూత్రప్రాయముగా చెప్పిన అంశాలకు పాశ్చాత్య సాహిత్య శాస్త్రంలో వివరణలు గ్రహించవచ్చును. అయితే భారతీయ కథానిగా ప్రగతి అనేక శతాబ్దాల కాలం కుంటుపడి ఉన్నందువలన, పాశ్చాత్య లాక్షణికులు గమనించిన అంశాలను భారతీయ లాక్షణికులు సంపూర్ణముగా ఆవిష్కరించ లేకపోయినారని తెలియుచున్నది.

## 15.8 కథానిక స్వరూపము

'చిన్న కథ రాయడం పెద్ద కష్టం' అంటాడు మంజుశ్రీ. కథానిక అన్నది నిష్ఠగా, నిర్భరంగా, సాగవలసిన రచనా ప్రక్రియ. పడవలసిన క్లేశం ఎక్కువ. చూపవలసిన శిల్ప ఎక్కువ. అందువలన ప్రక్రియా స్వరూప స్వభావాల పరిశీలనకూ కల్పనా శిల్ప దృష్టికి ప్రాముఖ్య మేర్పడినది. కథానికను త్రిమితీయం (Three-dimensional) గా విశ్లేషించవచ్చును. ఆ విభాగాలు ఇవి.

1. వస్తుగత విభాగం
2. రూపగత విభాగం
3. సంవిధాన విభాగం

### 15.8.1. వస్తుగత విభాగం

రచనకు మూలభూతమై ప్రేరక బీజంతో మొదలుకొని పరమార్థ సంసిద్ధి పర్యంత సాగే అంతఃస్రోతస్విని వస్తుగత విభాగం. ఇందులో గమనార్హమైన అంశాలు నాలుగున్నాయి.

| | |
|---|---|
| కథాబీజం | ఇతివృత్తం |
| కథా వస్తువు | పరమార్థం |

### కథాబీజం

ఒక రమణీయ సన్నివేశం, హృదయ విదారకమైన ఒక సంఘటన, ఒకానొక భావ సంఘర్షణ, ఒక శీల విశిష్టత, ఒక వాతావరణ స్థితి, ఒక ఊహ చిత్రం, ఒక విలక్షణ ప్రవృత్తి -వంటివాటిలో ఏ ఒక్కటైనా కథకుడి హృదయంలో స్పందన కలిగించినపుడు, ఆలోచనకు ప్రేరణ ఇచ్చినప్పుడు, లోలోపల ప్రవర్థమానమవుతున్నప్పుడు, ఆ మాదిరి అంశాన్ని కథా బీజం (germinal idea) అందురు.

### కథా వస్తువు

కథకుడి మనోభూమిలో నాటుకొన్న కథాబీజం నాని నాని, ఉత్తరోత్తర వికసించే కథారూపాన్ని సాహిత్య పరిభాషలో కథా వస్తువు (theme) లేక విషయం (subject) అందురు.

### ఇతివృత్తం

కథా వస్తువునకు రచనానుకూలమైన పథకం రూపొందించి నప్పుడు అది ఇతివృత్తం (plot) అవుతుంది.

### పరమార్థం

మానవ హృదయమున కొక ఆర్ద్రమైన అనుభూతిని కలిగించి ఒక తథ్యాన్ని ఆవిష్కరించి, మనస్సును సంపుల్లం కావించడమే రచనకు పరమార్థం.

### 15.8.2. రూపగత విభాగం

ఆది నుంచి అంతం వరకు వివిధావయవ సుసంఘటితమైన కథా శరీరం రూపగత విభాగం. ఇందులో పరిశీలించ వలసిన విషయములు ఆరున్నాయి.

| | |
|---|---|
| ఎత్తుగడ | పట్టు లేదా పరాకాష్ట |
| నడక | విడుపు లేదా చరమసీమ |
| విషయస్థితి | ముగింపు |

### ఎత్తుగడ

రచయిత ఏర్పరచుకొన్న పథకాన్ని అనుసరించి కథను ఎక్కడ ఆరంభిస్తాడో అది ఎత్తుగడ. అది ఆకర్షకంగా ఉండాలి. పాఠకుడిని సుముఖుడిని చేసి, ఆసక్తి పుట్టించి, ఉత్కంఠ రేకెత్తించాలి. ఎత్తుగడ విజయం మీదనే కథ యావత్తూ ఆధారపడి ఉంటుంది. అది ఏ విధంగానైనా మొదలుకావచ్చు.

### నడక

కథా వికాసానికి గమనం అత్యంతావశ్యకమైనది. కథ ఆరంభస్థితికి అంత్య స్థితికి మధ్య పరిణామ రూపంలో ఇది వ్యక్తమవుతుంది. నడక ఏ విధముగానైన సాగవచ్చు. కథా గమనానికి తోడ్పడేవి పాత్రలు, సంఘటనలు, సంఘర్షణలు. ప్రతి సంఘటనా మరొక సంఘటనకు మాతృక కావాలి. కథను మరికొంత ముందుకు నడిపిస్తూ ఉండాలి. ఇందుకు భాషా, శైలి, తోడ్పడతాయి.

**విషమస్థితి**

కథాగతమైన ఫలాపేక్షకు అవరోధం, పరస్పర విరుద్ధ శక్తుల మధ్య ఘర్షణ ఏర్పడి పర్యవసానం అనిశ్చితమైనప్పటి స్థితిని విషమస్థితి లేదా సంకటస్థితి (crisis) అని చెప్పవచ్చును. ఇది పాత్రలకు, సన్నివేశములకు, సంఘటనలకు మధ్య ఏర్పడవచ్చు. కథాపథంలో ఇదొక మైలురాయి వంటిది.

**పరాకాష్ఠ (Climax)**

దీనినే 'ఉత్కర్ష' అని, 'పట్టు' అనియు అనవచ్చును. ఇది అత్యంత ప్రధానమైనది. ఆరోహణ క్రమములో సాగుతున్న కథ శక్తినంతనూ కూడ గట్టుకొని శిఖర బిందువు నందుకోవడమే పరాకాష్ఠ. ఇది సంఘటనా, సన్నివేశము, సంఘర్షణాత్మకముగ నుండవచ్చును. కథా సంఘటనలలో అత్యంత ప్రబలమైనది, భవిష్య నిర్ణాయకమైనది, పరాకాష్ఠ. కథాగతికి ఇది లక్ష్య బిందువు.

**చరమసీమ (Denomement) లేదా విడుపు**

ఇది పరాకాష్ఠకు ముగింపునకు మధ్య ఉండేది. పరాకాష్ఠలో ఏర్పడిన భావోద్రేకాలన్నీ చరమసీమకు వచ్చేసరికి కొంతవరకు శమిస్తాయి. చిక్కుముడులన్ని విడివడతాయి. ముగింపునకు రంగాన్ని సిద్ధం చేస్తుంది. అయితే ప్రతి కథలోనూ చరమసీమ ఉండాలన్న నియమం లేదు. అందువలన కథా స్వరూపములో చరమసీమ ఐచ్ఛికమే గాని నిర్బంధ కాదు.

**ముగింపు**

కథా నిర్మాణము మొత్తము ముగింపు మీద ఆధారపడి ఉంటుంది. అందువలన రచయితలు ముందుగా ముగింపు నిర్ణయించుకొని ఎత్తుగడ ప్రారంభిస్తారు. ఒక చమత్కార సన్నివేశంలో గానీ, ఒక హృదయార్ద్రకమైన ఘట్టంలో గాని, ఒక అననుభూత విషయావిష్కృతిలో గాని తటిత్తులా మెరిసే ముగింపు కథకు శోభనిస్తుంది. అందుకే అగ్ని పురాణ కర్త కథానికకు అద్భుతాంతం ఉండాలన్నాడు. ఓ. హెన్రీ 'కథకు కొస మెరపు అందం' చేకూర్చునన్నాడు. కృతకమైన కొసమెరుపు కంటె సహజమైన ముగింపునే అభిలషించే రచయితలు చాలమంది ఉన్నారు.

**15.8.3. సంవిధాన విభాగము**

కథానికకు అవయవ సుసంఘటన కావించి, సౌష్ఠవం చేకూర్చి, సౌందర్యం పోషించే వివిధాంశ సమూహారం సంవిధాన విభాగం. ఇందులో పరిశీలించి వలసిన అంశాలు ఐదున్నాయి.

పాత్ర — సంఘర్షణ

సంఘటన — సన్నివేశం

కథనం

**పాత్ర**

రూపకాల్లోను, కథాత్మక రచనల్లోను, సంవాద నటనల ద్వారా స్వీయ ప్రవృత్తిని ప్రకటీకరించే వ్యక్తిని పాత్ర (character) అందురు. పాత్ర చెప్పేది 'సంవాదము' (dialogue), పాత్ర చేసేది నటన/చర్య (action). కథ అంటె మానవ కథ. మానవుని చుట్టూ ఉన్న సమాజ శక్తులు పరస్పర వైరుధ్యంలో నుంచి పుట్టిన బాహ్యాంతర సంఘర్షణల కథ. కథ పాత్ర చుట్టూ నడుస్తుంది. పాత్రను తన చుట్టూ నడిపిస్తుంది. కథలోకి ప్రవేశించని పాత్ర ఉండవచ్చును గాని, పాత్ర లేని కథ మట్టుకు ఉండదనే చెప్పవచ్చును.

### సంఘటన (incident)

ప్రత్యక్షముగా గాని, పరోక్షముగా గాని పాత్ర(ల)ను ప్రభావితం చేసేటట్లుగా 'జరిగిన ఒక విషయాన్ని' సంఘటన అనవచ్చును. ఇది ఒకటైన, ఎక్కువైనా ఉండవచ్చు. సంఘటనల్లో నుంచి నాయకులు పుట్టుకు రావచ్చు. ఒక చిన్న సంఘటన ఒక మహోద్యమానికి నాంది పలకవచ్చు. ఒక చిన్న సంఘటనతో ఒక మహా సంరంభం కూడ చప్పగా చల్లారిపోవచ్చు. సంఘటన నిర్వహణ సామర్థ్యం రచయిత ప్రతిభకు గీటురాయి.

### సంఘర్షణ (conflict)

రెండు పరస్పర విరోధ శక్తులు తలపడినప్పుడు కలిగే రాపిడిని సంఘర్షణ అందురు. ఇది బాహ్యాము కాని, ఆంతరకము గాని కావచ్చును. కుటుంబములో, వర్గంలో, సమాజంలో, రాజకీయ వ్యవస్థలో, ఎక్కడైనా ఎదురయ్యేది భాహ్య సంఘర్షణ. పాత్ర అంతరంగంలో సంభవించేది అంతస్సంఘర్షణ. ఈ రెంటికి కథ మీద ప్రభావముంటుంది. దీని ఫలితం మీద పర్యవసానం ఆధారపడి ఉంటుంది.

### సన్నివేశము (situation)

ఒకానొక పాత్ర గాని, పాత్రలు గాని ఉన్న స్థితిని సన్నివేశమనవచ్చును. పాత్రల స్థితి అన్నది సంపూర్ణంగా ఆంతరికము కాదు. బహ్య ప్రభావాల ముద్ర దాని మీద ఉంటుంది. దేశ కాలాదులు దానికి కారణమవుతాయి. సన్నివేశ చిత్రణ సహజంగా, సంగ్రహంగా సాగడమన్నది కథకు శోభ చేకూరిస్తుంది. అందులో ప్రతి పదానికి, ప్రతి వాక్యానికి, సార్థక్యం సాధించవలసి ఉంటుంది.

### కథనం (Narration)

కథలో పాత్రల సంవాదం వినా తక్కినదంతా కథనంలోకి వస్తుంది. ఇది రెండు విధములుగా ఉంటుంది. ఒకటి, పాత్రకే ఆత్మగతంగా చెప్పేది. రెండోది కథకుడు తానుగా చెప్పేది. తాను చెప్పడానికి అనుసరించే పద్ధతి వేరు. ఇతరుల చేత చెప్పించడానికి అనుసరించే పద్ధతి వేరు. ఏది ఎన్నుకోవడమన్నది కథలోని సంవిధాన శిల్పం మీద ఆధారపడి ఉంటుంది. కథకుడు సర్వసాక్షి (omniscient) స్థానుడై ప్రథమ పురుషలో చెప్పే పద్ధతి ఒకటి. పాత్రలోకి ప్రవేశించి అతని ముఖత ఆత్మగతంగా (ఉత్తమ పురుషలో) చెప్పేది మరొకటి. ప్రథమ పురుష కథనంలో ఉండే సౌకర్యం ఉత్తమ పురుష కథనంలో ఉండదు.

## 15.9 కథానిక - ఆవిర్భావ వికాసాలు

ఒక నిర్దిష్ట సాహిత్య ప్రక్రియగా రూపొందిన ఆధానిక వచన రచనా విశేషం 'కథానిక'. మామూలు కథ కంటె ఇది సునిశితం, సూక్ష్మతరం. ప్రతి కథానికా ఒక కథే. ప్రతి కథా కథానిక కాదు. కథ విషయ ప్రధానమైతే కథానిక శిల్ప ప్రధానం. రచయిత ఏం చెప్పాడన్నది రెండింటికి వర్తిస్తుంది. కాని ఎలా చెప్పాడన్నది 'కథానిక' కే వర్తిస్తుంది. కథ ముడి వజ్రం. కథానిక సానబెట్టిన వజ్రం. దీని అందం దానికి లేదు. దీని పనితనం దాంట్లో లేదు.

ఈ విషయాన్ని మొట్టమొదట గుర్తించి, ఆధునికాంధ్ర సాహితీరంగంలో నవశకోదయానికి నాంది పలికినవాడు, ఆధునిక తెలుగు కథానికకు ఆదిపురుషుడు శ్రీ గురజాడ వేంకట అప్పారావు. 'గురజాడ అప్పారావు' కథా రచనలో పరిపూర్ణమైన విప్లవమే కలిగించాడు. చిన్న కథ అప్పారావు మానస పుత్రిక అని కె.వి.రమణారెడ్డి గారి అభిప్రాయము. తెలుగు కథ గురజాడ అప్పారావు గారి 'దిద్దుబాటు' తో ప్రారంభమైనది. ఈ కథ 1910 సంవత్సరము ఫిబ్రవరి నెలలో 'ఆంధ్రభారతి' పత్రికలో అయ్యంకి వెంకట రమణయ్య గారి సంపాదకత్వములో బందరు నుంచి వెలువడిన దానిలో మొదటిసారిగ అచ్చు అయినది. గురజాడ వారు మొదట

ఈ కథను గ్రాంధిక భాషలో వ్రాసి, పిదప వ్యవహారిక భాషలోకి దాన్ని మార్చారు. ఈ కథలో కథానిక లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇందులోని కథ సమాజ జీవితానికి ప్రతిబింబం. వేశ్యా వ్యామోహములో పడిన గోపాలరావునకు అతని భార్య కమలిని మెత్తగా, చక్కగా బుద్ధి చెప్పుతుంది. తన భర్త పక్క దారిలో పడి చెడిపోయినపుడు అతనిని సన్మార్గం వేపు నడిపించే మంచి భార్య కథ ఇది. అందుచేతనే అప్పారావు గారు ఈ కథకు 'దిద్దుబాటు' అనే పేరు పెట్టారు. పేరు పెట్టటములోనే ఔచిత్యమును, నూతనత్వమును కలుగ చేసిరి. ఇది సాంఘిక ప్రయోజనము గల కథ. శిల్ప నైపుణ్యములోను, సమకాలికమైన సమస్యను పరిష్కరింప జేయటంలోను, సంభాషణలు పాత్రోచితమైన వ్యవహారికములో నడిపించుటలోను, ఆధునీకరణం మీదే చూపు నిలిపి, కథానికా ప్రక్రియ నొక కళాఖండముగా తీర్చిన మహా శిల్పి గురజాడ అప్పారావు. గురజాడ అప్పారావు గారు రాసినవి ఐదు కథానికలు 'దిద్దుబాటు, మీ పేరేమిటి, మెటిల్డా, పెద్ద మసీదు, సంస్కర్త హృదయం. ఐదు కథానికల ద్వారా తెలుగు కథా రచయితలకు మార్గదర్శి అయ్యారు అప్పారావు గారు.

తెలుగు సాహిత్యాన్ని ప్రజలకు చేరువుగా తీసుకొని వెళ్ళే సత్సంకల్పములో ఈ శతాబ్ది ప్రారంభములో ఆంధ్ర భారతి, త్రిలింగ, సువర్ణ రేఖ మొదలగు పత్రికలు ప్రారంభించబడ్డాయి. పానుగంటి లక్ష్మీనరసింహారావు గారి కథలు సువర్ణరేఖ పత్రికలో వరుసగా ప్రచురించబడ్డాయి. దొంగ టెలిగ్రాము, బుడబుక్కలవాడు, పతకము, తంతివార్త, విచిత్ర సమావేశము, మోసము అను ఆరు కథలు 1917లో కథావల్లరి అను పేరుతో సంపుటముగా వెలువడ్డాయి. చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు 'రాజస్థాన్ కథావళి' అనే పేరుతో కథలు వ్రాశారు. మాడపాటి హనుమంతరావు గారు, రుద్రమదేవి, హృదయశల్యం, అనే కథలతో పాటు కథా సంపుటి ప్రచురించినారు. ప్రేమచంద్ కథలను తెలుగు వాళ్ళకు అందించిన తొలి తరం రచయితల్లో మాడపాటి వారు ప్రముఖులు.

1920 లో 'సాహితీ' పత్రిక వెలువడ్డప్పటి నుంచి ఔత్సాహికుల్లో కథానికా రచన పట్ల ఆసక్తి పెంపొందినది. తల్లావఝుల శివ శంకర శాస్త్రి, వేలూరి శివరామ శాస్త్రి, నోరి నరసింహ శాస్త్రి, విశ్వనాథ వంటి శిష్టులు, విశిష్టులును ఉత్తమ సంస్కార వాసనా వాసితములుగ చక్కని కథలను అనేకము రచించిరి. శివ శంకర శాస్త్రి గారు రాసిన 'మురారి కథలు' నీలకంఠం కథలు 'ఎందరికో స్ఫూర్తి నిచ్చాయి. చింతా దీక్షితులు బాల వాఙ్మయ బ్రహ్మ, సుతిమెత్తని హాస్యము, సెంటిమెంట్ వీరి ప్రత్యేకతలు. శ్యామల, చిన్న చెంచురాణి, కిష్కంధలో కోతి, దాసరి పాట, మొదటి బహుమానం వంటి రమ్యమైన రచనలు దీక్షితులు గారి నైపుణ్యానికి గీటురాళ్ళు. వీరు సృష్టించిన సూరి - సీతి - వెంకి, వటీరావు, భైరవ శాస్త్రి, వంటి పాత్రలు తెలుగు కథా సాహిత్యములో చైతన్య స్ఫూర్తిలో నిలుస్తాయి. వ్యవహారిక భాషను కథల్లో ప్రయుక్తం చేసిన ప్రతిష్ఠ దీక్షితులు గారిదే నని చెప్పవచ్చును.

కథానికా కథకులలో ప్రత్యేకత సంతరించుకున్నవారు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు. సజీవ సంవాద రచన యందును, వాతావరణ సృష్టి యందును శ్రీపాద వారిది అందె వేసిన చేయి. శ్రీపాద వారికి ఆంధ్రాభిమానము ఎక్కువ. తెలుగు దనం వుట్టి పడేది కథలు వ్రాసిన మంచి కథకుడు శ్రీపాద వారు. హరిజన సమస్యల్ని, నిరుద్యోగ సమస్యల్ని, బ్రాహ్మణ కుటుంబాల్లో వితంతువు వివిధ వ్యధల్ని, చాల చక్కగా వివరించినారు. సాంప్రదాయక కుటుంబ జీవితంలోని రకరకాల వ్యక్తులు శాస్త్ర కథా పాత్రలు. వీరి తొలి కథానికలు 'పూలదండ' అను పేరుతో సంపుటంగా వచ్చాయి. వీరి కథానికలు రామలక్ష్మి, వెలిపెడితే అల్లుడైనాడు, ముందు హాలాహలము - పిదప అమృతము, మేనటికము తప్పలేదు, జూనియర్ కాదు - అల్లుడు, చీకటి - వెలుగు, జన్మానికల్లా వకటే ముద్దు, గులాబీ అత్తరు, రాజ పీనుగు తోడు లేకుండా వెళ్ళదు, గూడు మారిన కొత్తరికం, మార్గదర్శి, ముళ్ళచెట్టూ కమ్మని పువ్వును, తాపీ మేస్త్రీ, రామదీక్షితులు, కలుపు మొక్కలు, కీలెరిగిన వాత, అరికాళ్ళ కింద మంటలు మొదలైనవి మరిచిపోలేని ఆణిముత్యపు కథలు. శాస్త్రి గారి కథా పాత్రలన్నీ సజీవ పాత్రలే. సంస్కార దృష్టి అపారముగా ఉన్న మహా ప్రతిభాశాలి శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు.

కథక చక్రవర్తి కవికొండల వేంకటరావు గారు 'మట్టెల రవళి, కల-కళ్ళు, ముగ్గుల రథం వంటి కథా సంపుటాలు

వెలువరించారు. పామర జనంలోని తీరు తెన్నులును చిట్టి పొట్టి కథలుగా తీర్చి దిద్దటము కవికొండల వారి పనితనం. వీరు వ్రాసిన 'జమీందారు' కథ మారుతున్న సమాజాన్ని ప్రతిబింబించే చక్కని కథ. బహుముఖ ప్రజ్ఞానిధిగా పేరుగన్న వేలూరి శివరామ శాస్త్రి గారు 'ఓబయ్య, పిత్తల్ కా దర్వాజా, తన్మయతా, డిప్రెషన్ చెంబు, నికల్ హైద్రాబాద్, నమశ్శివాయ, చంద్రికలు, ఒకటే చీర, వంటి కళాఖండాలను తెలుగు వాళ్ళకు అందించిన ఉత్తమ కథకులు. కథకు పేరు పెట్టటములో, కథా ప్రారంభ ముగింపుల్లో, సన్నివేశ కల్పనల్లో, పాత్ర చిత్రణలో, భాషలో, శైలిలో శివరామ శాస్త్రి గారు ప్రదర్శించిన నైపుణ్యం శిల్ప చాతుర్యం అనితర సాధ్యము. కథాషట్కం, కథాసప్తకం, అనే పేర్లతో వీరి కథా సంపుటాలు వెలువడ్డాయి. వివిధ శాస్త్ర విజ్ఞానం, విశేష ప్రౌఢ వీరి కథల్లో కన్పిస్తాయి. ప్రతి కథానికా భావ పూర్ణమై పాత్ర పోషణలో భాసిస్తూ వుంటుంది.

కథారచన పట్ల ఆసక్తి చూపిన తొలి తరం రచయిత్రుల్లో కాంచనవల్లి కనకాంబ, కనుపర్తి వరలక్ష్మమ్మ గారు ముఖ్యులు. కనకాంబ గారు 'రాధ' అనే మంచి కథను రాశారు. 'చక్కని కథలు' అనే కథా సంపుటిని వెలువరించినారు. వరలక్ష్మమ్మ గారు రెండే కోర్కెలు, పెన్షన్ పుచ్చుకున్న నాటి రాత్రి, ప్రణయ లేఖలు, అనే కథలు వ్రాశారు. వరలక్ష్మమ్మ గారి రచనలో 'కయిత్వం లేని పటుత్వం, గర్వం లేని గాంభీర్యం, ఆడంబరం లేని ఆదర్శం, ద్యోతకమవుతాయని' కట్టమంచి రామలింగా రెడ్డి గారన్నారు.

దాంపత్య జీవితాన్ని రమ్యంగా చిత్రించిన వారు మునిమాణిక్యం నరసింహారావు గారు. మంచి హాస్యాన్ని పోషించారు. నరసింహారావు గారు సంసారములోని అందాన్ని, మాధుర్యాన్ని చక్కగా వివరించినారు. వీరు కాంతం అనే పాత్రను సృష్టించినారు. వీరి వాణి నాజూకుగా ఉంటుంది. గృహ కృత్యాలు, భార్య భర్తల కీచులాటలు, కపట భక్తుల నటనలు హాస్య పూర్వకముగా వర్ణించినారు. వీరి కాంతం కథలు, నేను మా కాంతం, కాంతం-కైఫీయల్, అనే కథానికా సంపుటాలు వెలువడ్డాయి.

ఆధునిక తెలుగు సాహిత్యమున గుడిపాటి వేంకటాచలంకు సాటి మరొకడు లేడు. స్త్రీ పురుష సంబంధాల పట్ల, కుటుంబ జీవనం పట్ల కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలు గలవాడు. తాను సత్యమని నమ్మిన దాన్ని కుండబద్దలు గొట్టినట్లు చెప్పగల ధైర్యశాలి. సొంత అభిరుచులూ ఆకాంక్షలూ వ్యక్తం చేసుకోవడానికి, శారీరక మానసిక పరితృప్తి పొందడానికి (నచ్చిన చోట ప్రేమను పంచుకోవడానికి) సమాజంలో స్త్రీకి గల అవరోధాలన్నిటిని ఆయన ఎదిరించాడు. చలం శైలి శక్తివంతమైనది. భావాలు సుస్పష్టమైనవి.

చలం గారు తమ కాలమున సంఘమున గల లైంగిక సమస్యలపై కఠారి వలె ఝుళిపించి, ఆకశ్మలమును జలముతో కడిగి విడిచినారు. వాదనకు దిగినచో వాడి వాదర, యుక్తికి దిగినచో తర్క శర్కశత్వము, సమన్వయము చేయుచో హాస్య సారస్యము, పాత్రను చిత్రించుచో ప్రగాఢ మనస్తత్వ మర్మకజ్ఞత, శైలి ప్రచరించుచో భాషాదేవి కళాస్థానములందు కౌశలము, సన్నివేశ ప్రకల్పనము సేయుచో చమత్కారమునకు నమస్కారము సేయు శబ్ద చాతుర్యము, భావ గాంభీర్యము ప్రదర్శించి కథను పాఠకుల గుండెలపై కదను త్రొక్కింతురు. కవాతు సేయుంతురు. సవారి చేయింతురు. రేఖముల ద్వారమున, మ్యూజింగ్స్ ద్వారమున, వాదము ద్వారమున, సంవాదము ద్వారమునను అనితర సాధ్యముగా అనేక కతలు రచించిరి. ఒక మపాసా, ఒక అనతల్ ఫ్రాంచే, పదిమంది డి.హెచ్.లారెన్స్‌లు, వందమంది వోడ్‌హౌసులు, ఆయన రచనా చణత్వమున, యదార్థ దర్శనమున, శృంగార శూరత్వమున, హాస్య చతురాస్యత్వమున, నిమిడిపోవుదురు. చలం గారి కలం తెలుగు వాఙ్మయమున సామెత కామెత యైనది' అన్న ఆచార్య యస్.వి.జోగారావు గారి మాటలు అక్షర సత్యములు.

చలం గారి కథానికలలో ప్రేమ కోసం ప్రాణం లెక్క పెట్టని యువ తత్త్వం, శిధిలమై పోతున్న ఒక తరం జీవితం మీద క్రొత్తగా పుడుతున్న నవతరం దీప్తి కనబడుతుంది. చలం గారి కథలు సమాజాన్ని ఉగ్రూత లూగించాయి. చలం పాత్రలు - సమస్యలు వాస్తవికతకు చెందినవి. నిత్య సమాజంలో స్త్రీలు ఎదుర్కొనే అనేకమైన సమస్యలకు రూపకల్పన చేసినారు. పాపం,

కన్నీటి కాలువ, ఆత్మార్పణ, ఆ రాత్రి స్టేషను పంపు, అదృష్టం, కళ్యాణి, అట్లపిండి, ఆమె పెదవులు, ఆ రాత్రి నాయుడు పిల్ల, నేను మా ఆవిడ మిగిలాం, భోగం మేళం, మాదిగమ్మాయి, రస పుత్రులు, లంచం, హరిజన సమస్య, మొదలైన కథలు వ్రాశారు. చలం 'ఓ పువ్వు పూసింది' మంచి కథానిక. కథానిక శిల్ప ప్రధానమైన సాహితీ ప్రక్రియ. ఈ విషయాన్ని గుర్తించిన వారు చలం. చలం కథలన్ని శిల్ప ప్రధానమైనవే.

ఈ శతాబ్దిలో కలం పట్టిన సాహితీ వేత్తల్లో బహుముఖ ప్రజ్ఞానిధి విశ్వనాథ సత్యనారాయణ. 'నీ ఋణం తీర్చుకున్నా ఏమి సంబంధం, మాక్లె దుర్గంలో కుక్క' మొదలైనవి 'చిన్న కథలు' అనే పేరుతో ఒక సంపుటముగా వెలువడ్డాయి.

చిత్రకళ, కవిత్వం, సంగీతం, కథా కథనం, ఒక్క చోట రాణించిన కళామూర్తి అడవి బాపిరాజు. "వీణ, వసుబాలుడు, భోగీరలోయి' వంటి కథలు బాపిరాజు రచనాభినివేశాన్ని ప్రదర్శిస్తాయి. తెలంగాణాలో విస్తృతంగా ఉన్న వెట్టి చాకిరి, జనాల మూఢాచారాలు, అధికారుల దుండగాలు వెల్లడించుచు 'గోలకొండ' పత్రికలో ప్రచరిస్తూ వచ్చిన 'మొగలాయి కథలు' సురవరం ప్రతాపరెడ్డి గారు రచించినారు.

తెలుగు పలుకుబడికి సాహిత్యములో ఒక స్థానం కల్పించిన కథకులలో కరుణకుమార ప్రముఖుడు. ఇతడు కథా కథన శిల్పంలో ఆరితేరిన దిట్ట. క్రింది తరగతి శ్రమజీవుల కష్ట సుఖాలను ప్రతిభావంతముగా చిత్రీకరించినాడు. 'టార్చిలైట్, రిక్షావాలా, పశువుల కొష్టం, కయ్యి - కాలువ, బిళ్ళల మొలత్రాడు, వంటి అద్భుత కథలను వ్రాశాడు. తెలుగు కథకులలో ప్రత్యేక స్థానమందు కొన్నాడు.

శైలికి, పాండితీ స్ఫూర్తికి విలక్షణమైన అందం చేకూర్చిన ప్రతిభాశాలి మల్లాది రామకృష్ణ శాస్త్రి గారు. 'స్వరమేళ, చెంగల్వ, రసమంజరి, సర్వమంగళ, వెలది వెన్నెల మొదలగునవి మల్లాది వారి రసగుళికలు. సరసతనూ, వాక్చమత్కృతిని పుణికి పుచ్చుకొన్న 'తాతగారి' పాత్ర మల్లాది వారి సృష్టే.

వస్తువులో నవ్యత్వం, సంవిధానంలో ప్రయోగ దృష్టి, దృక్పథంలో సమకాలిత్వం, శైలిలో సారళ్యం మిళితమైన రచనలు చేసి తెలుగు కథానికా సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కథకుడు కొడవటిగంటి కుటుంబరావు గారు. 'చంద్రోదయం, మొండివాడు, లేచిపోయిన మనిషి, నిలవనీరు, ఆడజన్మ, నువ్వులు-తెలక పిండి, కొన్ని వందల కథలు రాసి మానవ జీవితం లోని అంతరాంతరాల్లోకి వెలుగులు ప్రసరింపజేసిన 'టార్చ్ బేరర్' కుటుంబరావు గారు.

పరిశీలనలో నైశిత్యం, ప్రయోగంలో దక్షత, రచనలో సమతౌల్యం, ప్రదర్శించిన ఉత్తమ కథా రచయిత త్రిపురనేని గోపీచంద్. 'భార్యల్లోనే ఉంది, భార్యా భర్తలు, తండ్రులూ - కొడుకులూ, ధర్మ వడ్డీ' వంటి కథలు గోపీచంద్ శిల్ప నైపుణ్యానికి నిదర్శనాలు.

అంతర్జాతీయ కథానిక రంగంలో పెద్దపీట వేయించుకొని దేశానికి ప్రతిష్ట చేకూర్చిన తెలుగు కథకుడు పాలగుమ్మి పద్మరాజు గారు. ఈయన వ్రాసిన 'గాలివాన' అంతర్జాతీయ పోటీలో బహుమతినందుకొన్నది. మొదట ఈ కథను వీరు ఆంగ్లంలో వ్రాశారు. తరువాత తెలుగులో వ్రాశారు. శిల్పం దృష్ట్యా దాంతో సరితూగగల మరొక కథ 'పడవ ప్రయాణం' కూడ ప్రముఖుల మన్నల్ని ప్రశంసల్ని అందుకుంది.

రెండో తరం కథానికా రచయిత్రులలో సుప్రసిద్ధులు ఇల్లిందుల సరస్వతీదేవి గారు. వీరు 'పండుగ బహుమానం' ముత్యాల మనసు, బలీయసే కేవలమీశ్వరాజ్ఞ వంటి కథలు వ్రాశారు. జైలులో మగ్గుతున్న బందీల జీవితాన్ని దయనీయ గాథల్ని వెలికి తెచ్చినవారు వట్టికోటి ఆళ్వారు స్వామి గారు. 'పరిగె, పతితుని హృదయం, విధి లేక' వంటి కథానికలు ఆయన రచనా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తాయి. కథా కథన శిల్పంలో ఆరితేరిన వారు బుచ్చిబాబు (శివరాజు వెంకట సుబ్బారావు). 'నన్ను గురించి కథ వ్రాయవూ,

దేశం నాకిచ్చిన సందేశం, కలలో కార్చిన కన్నీరు, మేడ మెట్లు, ఆమె నీడ, అడవి కాచిన వెన్నెల, రస్సెల్ కంకితమైన రెండు కథలు బుచ్చిబాబు శిల్ప నైపుణ్యాన్ని అద్భుతంగా ప్రదర్శిస్తాయి. చైతన్య ప్రవంతి ఫక్కీలో సాగిన కథ బుచ్చిబాబు ప్రయోగ దృష్టికి నిదర్శనము.

కథకులకు కథకుడిగా ప్రసిద్ధుడైన రాచకొండ విశ్వనాథ శాస్త్రి గొప్ప ప్రతిభావంతుడు. కథా సాహిత్యానికి విశ్వనాథ శాస్త్రి నిజంగా విశ్వనాథుడే. 'మెరుపు మెరిసింది, కార్నర్ సీటు, కిటికి, జరీ అంచు తెల్లచీర, ఆరు సారా కథలు, కుక్క పిల్లా - సబ్బు బిళ్ళా, అగ్గిపుల్లా, వేతన శర్మ కథ-పోకు పిల్లి, పిపీలకం, వంటి అద్భుత కథలను వ్రాశాడు. సామాజిక స్పృహ, సమకాలీత, అనల్ప శిల్ప కల్పన ఈయనలో విశిష్టమైనవి. దగా పడిన తమ్ముళ్ళు, చెల్లెళ్ళు, ఈయనలో చైతన్య పుంజుకొంటారు. తెలుగు సాహిత్యంలో లోకోత్తర విశేషాన్ని సాధించిన వారు విశ్వనాథ శాస్త్రి గారు.

వాయు లీనం, ఎంపు, దుమ్ములగొండె, వంటి అపురూప శిల్ప నైపుణ్యం ప్రదర్శించే కథలు రాసిన కీర్తిమంతుడు చాసో (చాగంటి సోమయాజులు). చాసో దర్శనా నైశిత్యం అపురూపమైంది. ఒక్కో కథలో ఒక్కో జీవన సత్యం తొణికిసలాడుతుంది. దారిద్ర్యం, దోపిడి, అసమానత్వం, అన్యాయం, అక్రమం, అహంకారము, దురాచారము, సమాజగతమైన మౌఢ్యము - ఇవన్నీ కథలకి ముడి సరకు. కాళీపట్నం రామారావు గారి చావు, భయం, యజ్ఞం మంచి కథానికలు. ఆరుద్ర ఊరు ఊరుకొంది, ఉష్ణమొస్తె బావుణ్ణు, చాపక్రింద నీరు, సోమసుందర్ 'బానిస దేశం' మంచి కథానికలు. కథానిక శిల్పం పట్ల, ప్రయోగ వైచిత్రిపట్ల దక్షత చూపిన మేటి కథా రచయిత రావూరి భరద్వాజ. 'గోడల్లేని జైలు, లక్క బొమ్మలు, ఈడొచ్చిన కథ, చిత్ర గ్రహం, కుమార సంభవం' శతాధిక కథానికలు రాశారు. తెలుగు కథ నిండుతనం, హుందాతనం సంతరించుకొన్నది మధురాంతకం రాజారావు గారి రచనలలో. 'కుంపటిలో కుసుమం, కాటుక కంటినీరు, తాను వెలిగించిన దీపాలు, వగపేటికి చల్లందినన్, ధర్మగ్లాని వంటివి అనేకం వ్రాశారు. వస్తువులో వైవిధ్యం, రచనలో వైదగ్ధ్యం, నుడికారంలో అచ్చమైన తెలుగుతనం ఈయన ప్రత్యేకత. చమత్కార రచనా చంద్రుడు అవసరాల రామకృష్ణారావు. వీరి రచనలు 'సామాన్యుడూ సర్కారూ, గాంధీ గారి ఖరీదు, నల్లపిల్ల, ఎవడితోనైనా లేచిపోరాదు, నాకు నువ్వు - నీకు నేను' మొదలగు కథానికలు వ్రాశారు. హాస్యంలో రవ్వంత కరుణను రంగరించి, జనతా ఎక్స్‌ప్రెస్, మహారాజా యువరాజు, ఆకలీ ఆనందరావు, వేట, సాక్షి వంటి ఉదాత్త కథలు వ్రాసిన వారు ముళ్ళపూడి వేంకటరమణ.

పురాణం సుబ్రహ్మణ్యశర్మ వ్రాసిన కోతి, సంసారం, సీత జెడ, నీలి, సుప్రసిద్ధములైన కథానికలు. వీటిలో 'నీలి' రెండో ప్రపంచ కథానికల పోటీకి తెలుగు నుంచి ఎన్నికైన కథల్లో ప్రధమ సత్యమైంది. 'ముసురు, నీళ్ళు, నిప్పు, మబ్బు విడిచిన ఎండ, మనసు' వంటి చక్కటి కథలు తీర్చిదిద్దిన పెద్దిభొట్ల సుబ్బరామయ్య, గ్రామీణ వాతావరణాన్ని సహజంగా చిత్రించి రమ్యమైన కథలు వ్రాసిన తాళ్ళూరు నాగేశ్వర రావు గారు మానవత్వం, గెజిటెడ్ ఆఫీసరు భార్య, ప్రేమికుని అంతరంగిక ప్రపంచం, మా వూరి కథలు, కథా వస్తువుల్లో వైవిధ్యం ప్రదర్శిస్తాయి. శీలా వీర్రాజు గారి 'పగా మైనస్ ద్వేషం' రెండు కన్నీటి చుక్కలూ - ఒక ప్రశ్న, అతుకు పడ్డ సౌందర్యం, కథ నాదీ ముగింపు ఆమెదీ' మొదలైనవి కథా కళాఖండాలు.

తెలుగు కథానికా సాహిత్యాన్ని రాస్తున్న వారిలో స్త్రీలలో చెప్పుకోదగ్గ వాళ్ళు చాల మంది వున్నారు. బండారు అచ్చమాంబ 'అబలా సచ్చరిత్ర రత్నమాలా' వరలక్ష్మమ్మ గారి 'ఫించను పుచ్చుకున్న మర్నాడు' అచ్యుతవల్లీ గారి 'బాత్ ఏక్ రాతికీ' ఉషారాణి భాటియా 'ఎడ్గార్ ఎలెన్ పో' కథానికలు, కనకదుర్గా రామచంద్రన్ గారి అందమైన లోకం, ఇంద్రజాల దీపం, మొదలగు బాలల కథలు, అబ్బూరి ఛాయాదేవి 'అనగా అనగా' కథల సంపుటి, తురగా జానకీ రాణి, ఎర్ర గులాబీలు, తేజోవతి 'ఎన్.జి.వో', ఏవని నిర్మల ప్రభావతి 'స్త్రీ', అనే కథల సంపుటి, కొమ్మూరి పద్మావతీ దేవి 'పొగడ దండ', భట్టిప్రోలు బాలాదేవి 'వెనుకక తిరిగిన కాలచక్రం', బీనాదేవి 'రాధమ్మ పెళ్ళి ఆగిపోయింది', భానుమతీ రామకృష్ణ గారి 'అత్తగారి కథలు', అరవింద 'మేఘం వర్షించింది', కె. మీరాబాయి 'నన్ను క్షమించురూ', పోలాప్రగడ రాజ్యలక్ష్మి 'రాజ్యలక్ష్మీ కథలు', కె.రామలక్ష్మి 'నీదే నా హృదయం', వడ్లమాని లలిత

'నిస్పృహ', టి. విజయలక్ష్మి 'మలుపు', మోహనవంశీ అద్దేపల్లి వివేకానంద దేవి 'కళ్యాణీ కథలు', దేవమూరి శకుంతల 'హుస్సేను సాగరు', పోల్కంపల్లి శాంతాదేవి 'విశ్వేశ్వరి', అచంట శారదాదేవి 'ఒక్కనాటి అతిథి', శ్యామలారాణి 'తుది కోరిక' 'పడగ నీడ', గొల్లపూడి సీతాదేవి 'నీలి తెరలు', యుద్ధనపూడి సులోచనారాణి 'తెలిసిన విలువలు' అను కథలు ప్రముఖముగా పేర్కొనదగినవి.

ముప్పాళ్ళ రంగనాయకమ్మ 'ది సామ్యవాద విప్లవ ధోరణి' లో సాగిన కథానికలు. లతది ప్రయోగశీలి రచనలు, ఇల్లిందుల సరస్వతీ దేవి, వాసిరెడ్డి సీతాదేవి, కోడూరి కౌసల్యాదేవి, శర్వాణి, సరళాదేవి, మందరపు లలిత, ద్వివేదుల విశాలాక్ష్మి, గంటి వెంకటరమణ, పి.యస్. రమాదేవి, సి. ఆనందరామం, డి. కామేశ్వరి, అడవికొలను పార్వతి, నిడుదవోలు మాలతి, మున్నగు కథానిక రచయిత్రులు ఎందరో కలరు. వీరిలో చాలమంది కథానికలు అనేక పత్రికలలో ప్రచురింపబడినవి. మంచి మంచి బహుమతులు పొందినవారూ కూడ కలరు. పత్రికలు తరచుగా నిర్వహించు పోటీలు, దినదిన ప్రవర్ధమాన మగుచున్న గ్రంథాలయములు, ఎక్కువగా వచ్చుచున్న ప్రచురణ సంస్థలు, వీని ఫలితముగా కథానికా పాఠకుల సంఖ్యతో పాటు రచయిత(త్రు)ల సంఖ్య మీద పెరుగుచున్నది.

నేడు చాలమంది కథకులు ఉద్యమాల రూపములో కథానికలు వ్రాస్తున్నారు. దళితవాడల, స్త్రీ వాదం, ఉద్యమాలకు సంబంధించిన అనేక కథలు వస్తున్నాయి. ఈనాటి తెలుగు కథానిక సంపూర్ణముగా, సాంఘికమై నిర్మాణ శిల్పాలని ఆవిష్కరిస్తూ, వ్యక్తి దృష్టిని, సమిష్టి ప్రయోజనాలవైపు మళ్ళించి మంచి విలువల కొరకు పాటుపడుచున్నది. తెలుగు కథానిక రచయితలు తమ తమ కథానికలలో సమకాలీన సమాజ పరిస్థితులను ప్రతిబింబిస్తూ, తెలుగు కథను ఉన్నత శిఖరాల వైపుకు తీసుకొని వెళ్ళుచున్నారు.

## 15.10 కథానిక - భేదాలు

తెలుగు సాహిత్యములో వేలకొలది కథానికలు వచ్చాయి. వాటిని నిశితముగా పరిశీలించి నాటి భేదాలను ఈ క్రింది విధముగా చెప్పవచ్చును.

| | | |
|---|---|---|
| 1. సాంఘిక కథలు | 2. చారిత్రక కథలు | 3. పౌరాణిక కథలు |
| 4. రాజకీయ కథలు | 5. కాల్పనిక కథలు | 6. ఆర్థిక కథలు |
| 7. జానపద కథలు | 8. మనో విశ్లేషణ కథలు | 9. వైజ్ఞానిక కథలు |
| 10. చైతన్య ప్రవంతి కథలు | 11. కళారంగ కథలు | 12. విమర్శ కథలు |
| 13. అనువాద కథలు | 14. సాహిత్య కథలు | 15. జీవిత చరిత్ర కథలు |
| 16. స్వీయ చరిత్ర కథలు | 17. జాతీయ సమైక్య కథలు | 18. విప్లవ కథలు |
| 19. అపరాధ పరిశోధన కథలు | 20. సంఘ సంస్కరణ కథలు | 21. హేతువాద కథలు |
| 22. అధిక్షేప కథలు | 23. పునర్జన్మ కథలు | 24. అస్తిత్వ కథలు |
| 25. సామ్యవాద కథలు | 26. దెయ్యాల కథలు | 27. సారా కథలు |
| 28. అత్తగారి కథలు | 29. పోలీసు కథలు | 30. ఆత్మ కథలు |
| 31. దేశ భక్తి కథలు | 32. తాత్త్విక కథలు | 33. ఆధ్యాత్మిక కథలు |
| 34. స్త్రీ కథలు | 35. స్త్రీ వాద కథలు | 36. వరకట్న కథలు |
| 37. దళిత కథలు | 38. దళితవాడ కథలు | 39. హాస్య కథలు |
| 40. శృంగార కథలు | 41. కరుణ కథలు | 42. నీతి కథలు |
| 43. బాలల కథలు | 44. ప్రేమ కథలు | 45. వేట కథలు |
| 46. రిక్షావాలా కథలు | 47. కార్మిక కథలు | 48. డైరి కథలు |
| 49. నిరుద్యోగ కథలు | 50. మని కథలు | 51. మనిక కథలు |

52. లేఖన కథలు
53. పోరాట కథలు
54. వ్యంగ్య కథలు
55. కథలో రథ కథలు
56. కార్టూన్ కథలు
57. స్త్రీ పురుష సంబంధ కథలు
58. కులాంతర ప్రేమ కథలు
59. ప్రకృతి భీభత్స కథలు
60. అధికార్ల సంబంధ కథలు
61. దుండగుల కథలు
62. సంస్కరణ కథలు
63. మాండలిక కథలు
64. వినోదాత్మక కథలు
65. వేశ్య కథలు

పైన వివరించిన రకరకాల భేదాలలో తెలుగులో సాహితీ లోకాన్ని కథానికా ప్రక్రియ ఏలుతుందనుటలో ఎటువంటి అతిశయోక్తి లేదు. విశ్వనాథ, గురజాడ, శ్రీపాద, చలం, కడవగంటి, దీక్షితులు, తిలక్, పాలగుమ్మి, అడవి, బుచ్చిబాబు, గోపీచంద్, బలివాడ, చా.సో., మధురాంతకం రాజారావు, వేటూరి, ముని మాణిక్యం, సుదర్శనం, కొలకలూరి, రావిశాస్త్రి, మొదలగు సుప్రసిద్ధ కథానికా రచయితలు తమ కథలతో విశ్వ సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

## 15.11 సమీక్ష

కథానిక ఒక ప్రత్యేకమైన ప్రతిపత్తి కలిగిన ఆధునిక సాహిత్య ప్రక్రియ. కథానిక పద వివరణ, ఆంగ్ల ప్రభావము, దాని ప్రాచీన సాహిత్యము, ఆధునిక సాహిత్యము, నిర్వచనమును గురించి, లక్షణములు - స్వరూప నిరూపణమును, ఆవిర్భావ వికాసము, భేదాలను గురించి వివరించబడినది. కొందరు రచయితలు వివిధ ప్రపంచ భాషలనుండి ఎన్నో మంచి కథలను, తెలుగునకు దెచ్చుటయే కాక స్వతంత్రముగను మంచి కథలనేకము రచించుచున్నారు. ఈనాడు టెలివిజన్ ప్రభావము వలన చదవడము కాస్త తక్కువయైనది. అయినను వాస్తవ జీవిత కథా వస్తువై, వాడుక భాషయే సర్వవాహికయై, ఆబాలగోపాలమునకును సాహిత్య సరస్వతీ ప్రసాదమును పంచి పెట్టుచున్న కథానికా ప్రక్రియకు మంచి భవిష్యత్తున్నదని చెప్పుటలో అతిశయోక్తి లేదు.

## 15.12 ప్రశ్నలు

1. కథానిక నిర్వచనములను, లక్షణములను పేర్కొనునది.
2. కథానిక ఆవిర్భావ వికాసములను పేర్కొనునది.
3. కథానిక స్వరూపమును, భేదములను వివరించునది.

## 15.13 ఉపయుక్త గ్రంథాలు


1. కథానిక స్వరూప స్వభావములు - పోరంకి దక్షిణామూర్తి
2. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
3. సాహిత్య భావలహరి - ఆచార్య యస్.వి. జోగారావు
4. వ్యాససంపుటి, యువభారతి, 1972 - మహతి
5. అందాల తెలుగు కథ - కథా రచయితన సమ్మేళనం, ప్రత్యేక సంచిక
6. ప్రాసంగిక వ్యాసావళి - గుజ్జర్లమూడి కృపాచారి, జ్యోతి స్వరూప రాణి



అరిపిరాల హరిహరనాథశాస్త్రి
Incharge - తెలుగు శాఖ
శ్రీ సుబ్బరాయ & నారాయణ కళాశాల
నరసరావుపేట - 522 601

# పాఠం - 16

# వ్యాసము

పాఠ్యనిర్మాణక్రమం

16.0. లక్ష్యం
16.1. వ్యాసము - మూలరూపము
16.2. వ్యాసము - నామాంతరాలు
16.3. వ్యాసము - వైవిధ్యము
16.4. వ్యాస లక్షణాలు
16.5. వ్యాస వర్గీకరణము
16.5.1. సాహిత్య వ్యాసాలు
16.5.2. భాషా వ్యాసాలు
16.5.3. శాస్త్రీయ వ్యాసాలు
16.5.4. పరిశోధక వ్యాసాలు
16.5.5. చారిత్రక వ్యాసాలు
16.5.6. ఇతరములు
16.6. సమీక్ష
16.7. ప్రశ్నలు
16.8. ఉపయుక్త గ్రంథాలు

## 16.0 లక్ష్యం

ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో నిత్యం మనకు సన్నిహితంగా ఉండేది వ్యాసం. నిద్రలేచి మనం చూడగానే పత్రికలో సంపాదకీయ రూపంలోను, దాని ప్రక్కనే బహురూపాలతో వ్యాసం సాక్షాత్కరిస్తుంది. ఈ ప్రక్రియ వైవిధ్య భరితం. సాహిత్య, భాషా, శాస్త్రీయ, పరిశోధిక, చారిత్రక విషయాలను వివరిస్తుంది. దీని నైకరూపాలను నైగనిగ్యాన్ని నిరూపించడమే ఈ పాఠ్య లక్ష్యం.

### పరిచయం

వచన సాహిత్యంలో అత్యంత ప్రచారం పొందిన ప్రక్రియ వ్యాసము. దాదాపు అన్ని భాషల్లోను ఈ 'వ్యాస' ప్రక్రియ వ్రేళ్ళూను కొన్నది. దిన, వార, పక్ష, ద్వైపాక్షిక పత్రికలలో వివిధ విషయాలతో, విభిన్న ధోరణులతో, వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ ప్రజారంజకంగా మారిన ప్రక్రియ వ్యాసము. వ్యాసమనేటప్పటికి ఏదైనా ఒక విషయాన్ని అర్థమయ్యే విధంగా వివరించి, విశదీకరించి చెప్పటమని తోస్తుంది. ఆంగ్ల భాషలో నున్న 'Essay' ప్రక్రియ తెలుగులో ఆ భాషా సాహచర్యంతో విశ్లేషణాత్మకంగా వెలసింది. విషయ సంవర్ధకంగా పెరిగింది. వినోద సంభరితంగా జరిగింది. విజ్ఞాన సంభారంగ వెలిగింది.

'మాంటేగ్' అను ఫ్రెంచి రచయిత తొలుత ఈ ప్రక్రియను ప్రవేశపెట్టి 'వ్యాస'మునకు ప్రపంచ సాహిత్యములోని తొలి స్థానాన్ని అందుకొన్నాడు. ఆయన ప్రవేశపెట్టిన 'Essay' అను పదమే ఆంగ్ల భాషలో కూడ కించిత్తు ఉచ్చారణ మార్పుతో

ప్రవేశించినది.

ఆంగ్ల భాషాధ్యయన ప్రవణన శీలురైన పెక్కురు ఆంధ్రులు 'వ్యాస' రచనలోని తీరుతెన్నులకు, రచనా సౌలభ్యమునకు ముగ్ధులైనారు. 'సంక్షిప్త' కు పేరుగాంచిన Bacon's వ్యాసాలు, విస్తృతికి, విశ్లేషణకు, విజ్ఞతకు, సాగదీతకు సంకేతాలైన 'Essays of Elia' వ్యాసాలు వ్యాస రచనకు పురిగొల్పాయి. 'జాన్ రస్కిన్' వ్రాసిన ఆధ్యాత్మికతా వ్యాసాలు, 'మాత్యూ ఆర్నాల్డ్' వ్రాసిన సారస్వత వ్యాసాలు - ఆంధ్ర సాహిత్యంలో వ్యాసావిర్భావానికి పునాదులైనాయి.

## 16.1 వ్యాసము - మూలరూపము

తెలుగు సాహిత్యములో ప్రవేశించిన ఈ క్రొత్త ప్రక్రియ ఆంగ్ల భాషా సాన్నిహిత్యమున, సాహచర్యమున తెలుగున బీజమై అడుగుబెట్టి మహావృక్షంగా ఎదిగింది. ప్రపంచ పర్యాప్తంగా పెరిగింది. ఆంగ్లమున 'Essay' అను పదము Vulgar Latin లోని 'exagiare' అను ధాతువు నుండి వచ్చినది. అదే ప్రాచీన ఫ్రెంచి భాషలో 'assaier' గ మారినది. ఆ మూలమునకు 'weigh out' అని అర్థము. ఆధునిక ఫ్రెంచి భాషలో 'essayer' మారి, ఆలంకారికమైన అర్థములో 'test' అనియు, 'try' అనియు, అర్థ వ్యాకోచము చెంది 'పరీక్ష గీటురాయి' గ మారినది. దీనినే 'short non-fictional literary composition' అను నర్థమున ప్రచారములోనికి తెచ్చినది 1580లో 'Essals' అను పేరుతో వ్రాసినది - 'మాంటేగ్' అను ఫ్రెంచి రచయిత.

వ్యాసమునకు (వి+అస్) వివరంగా చెప్పటం అని అర్థము. ఇందులో విషయ ప్రాధాన్యముంటుంది. వచన రూపంలో ఉన్న విషయ విశ్లేషణ ఇందలి ప్రధాన విషయము.

నాతి దీర్ఘంగా, నాతి సంక్షిప్తంగా, ఉండి, గంభీర విషయం కూడా స్పష్టంగా, సంగ్రహంగా, సరళంగా, సాధికారంగ ఉండి సమగ్రతను సంతరించుకోవాలి. విషయ విభాగములు పేరాలుగా విభజించి సౌలభ్యం సాధించాలి. ఉపోద్ఘాతంతో పాటు, విషయ సమృద్ధి, ఉపసంహారాలు ఇందలి ప్రధానాంగాలు.

## 16.2 వ్యాసము - నామాంతరాలు

'వ్యాసము' అను పేరు తర్వాత వచ్చినదే. ఆంధ్ర సాహిత్యంలో ఒక్కొక్కరు ఒక్కొక్క దృష్టితో ఒక్కొక్క పేరు స్వీకరించారు. మనకు తెలిసినంతలో ప్రథమాంధ్ర వ్యాసకర్తగా గుర్తింపబడిన సాహితీమూర్తి 'ముద్దు నరసింహనాయుని గారు'. ఆయన ఈ ప్రక్రియను 'ప్రమేయం' అన్నారు. పరవస్తు వేంకట రంగాచార్యులు గారు ఇదే ప్రక్రియను 'సంగ్రహం' అన్నారు. నోరి నరసింహం గారు దీనినే 'వచన కావ్యం' అని పిలిచారు. హిందీ సాహిత్యంలో ఈ వ్యాస ప్రక్రియనే 'ఉపన్యాస్' అని పిలచుట కద్దు. వీరేశలింగం పంతులు గారు ఈ సాహిత్య ప్రక్రియను 'ఉపన్యాసం' - అని హిందీ నామానికి సన్నిహితంగా పిలచారు.

## 16.3 వ్యాసము - వైవిధ్యము

తెలుగులో ఈ తరహా సాహిత్యాన్ని దొంతరలుగా సృష్టించినవారు లెక్కకు పెక్కురు కలరు. ప్రతి పత్రికలోని ఆత్మ 'సంపాదకీయము'. ఆ సంపాదకీయము ఈ 'వ్యాస' ప్రక్రియలోనిదే.

పానుగంటి 'సాక్షి' వ్యాసాలు, ఖండవల్లి లక్ష్మీరంజనం గారి సారస్వత వ్యాసాలు, కొలకలూరి ఇనాక్ గారి విమర్శనాత్మక వ్యాసాలు, తాపీ ధర్మారావు గారి 'సాహిత్య మొర్మొరాలు', నార్ల వారి 'సంపాదకీయాలు', కొడవటిగంటి వారి సమకాలీన దృక్పథాల దర్పణపు వ్యాసాలు, సురవరం ప్రతాపరెడ్డి గారి తెలంగాణా సాంస్కృతిక విజ్ఞాన వ్యాసాలు, నేలటూరి వేంకట రమణయ్య గారి సాహిత్య మర్మజ్ఞ వ్యాసాలు, సంజీవ్‌దేవ్ గారి చిత్రకళా నైగనిగ్యపు వ్యాసాలు, మల్లంపల్లి సోమశేఖర శాస్త్రి గారి పరిశోధక వ్యాసాలు,

దొణప్ప గారి భాషాశాస్త్ర పరిశోధక వ్యాసాలు, పింగళి లక్ష్మీకాంతం గారి 'సాహిత్య శిల్ప' సమీక్షక వ్యాసాలు, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ గారి 'సారస్వతా లోకపు వ్యాసాలు' - ఇంత వైవిధ్యంతో, ఇంత వైదగ్ధ్యంతో, తెలుగు భాషా యోషకు ఆధునిక ఆభరణాలుగ ప్రశంసింపబడ్డాయి.

ఈ విధంగా వ్యాసాలు రాజకీయాలకు, సాహిత్య చర్చలకు, సమీక్షలకు, అధిక్షేపాలకు, వాదోప వాదాలకు, శాస్త్రీయ చర్చలకు, సాంఘిక సమస్యలకు, ఆధ్యాత్మిక అవసరాలకు, చారిత్రక నిర్ణయాలకు, సంస్కృతీ విలసనానికి - అన్ని రంగాల్లో అన్ని హంగుల్తో ఈ 'వ్యాస' ప్రక్రియ - అంగరంగ వైభోగంగ, అనంత వ్యాసంగ ప్రబోధకంగా వెలసింది.

'సమీక్షలు' కూడ వ్యాసరూపంలోనే వెలుగు చూస్తున్నాయి. ఇవే గాక గ్రంథ పరిచయ వాక్యాలు, పీఠికలు, ముందు మాటలు, ప్రశంసలు, అభిశంసనలు వ్యాసాలలోనే వస్తున్నాయి.

కవుల 'రచనా' విధానాన్ని వివరించే వ్యాసాలు, అందలి 'పాత్ర'ల మనో భావాల్ని ఆవిష్కరించే వ్యాసాలు, శబ్ద వ్యుత్పత్తిని బట్టి వ్యాసము, ఉపన్యాసము సమానంగా ఉన్నా - ఒకటి లిపి బద్ధమైనది - మరొకటి 'వాక్కు'నకే పరిమితమైనది. 'ఉపన్యాసాన్ని' - మక్కికి మక్కికి వ్రాస్తే అది వ్యాసమే ఔతుంది. అలానే వ్యాసమునే ఉపన్యాసముగ చదివినచో అది ప్రసంగమౌతుంది.

ఈ వ్యాసములలో ఎదుటి వారిని సంతోష పెట్టేవి కొన్ని, నవ్వించేవి కొన్ని, కవ్వించేవి కొన్ని, ఆలోచింపజేసేవి కొన్ని, అభినందనకు నోచుకోనేవి కొన్ని, అభిశంసనను పంచుకొనేవి కొన్ని.

విశ్వనాథ సత్యనారాయణ గారి 'రామాయణ కల్ప వృక్షము' - పుట్టినప్పటి నుండి విమర్శల జడిలో తడిసిందే. అందుకు సాహిత్య కురుక్షేత్రంగా ఉపయోగపడింది 'భారతి' పత్రిక. 'రామాయణ విషవృక్షమ'న్న విమర్శక వ్యాస సంపుటి వెలువడింది. 'రామాయణ విషవృక్ష ఖండనము'తో మరియొక ప్రతి విమర్శక వ్యాస సంపుటి, దాని బాటలోనే 'రామాయణ విషవృక్ష ఖండన మండనము' పుట్టింది. 'మాటకు మాట తెగులు, నీటికి పాచి తెగులు' అన్నట్లు విమర్శ, ప్రతి విమర్శలు - పుంఖాను పుంఖంగా వెలువడ్డాయి. అవన్నీ వ్యాస రూపంలోనే.

పానుగంటి వారి 'సాక్షి' వ్యాసములు భాషకు భాష, విమర్శకు విమర్శ, భావమునకు భావము, సంస్కరణకు సంస్కరణ, హాస్యమునకు హాస్యము ముప్పిరిగొన్నవి.

## 16.4 వ్యాస లక్షణాలు

1. వచన ప్రక్రియల్లో వ్యాసం అగ్రేసరమైంది. ఎలా మలచుకొంటే అలా రూపుదిద్దుకొనే సాహిత్య ప్రక్రియ ఇది.
2. వ్యాసము సరళమైన భాషతో ఉండాలి.
3. అర్థ క్లిష్టత, అన్వయ క్లేశము ఉండరాదు.
4. స్పష్టత దృష్టిలో నుంచుకొని చిన్న చిన్న వాక్యాలు ఉండాలి.
5. సమాస బంధాలు, సుదీర్ఘమైన వాక్య విన్యాసాలు, 'వ్యాస ఘట్టా'ల వంటివి వదలివేయాలి.
6. వ్యాసాన్ని తగిన విధంగా - విభజించి - వీలైతే తగిన శీర్షికలతో ఆకర్షణీయంగా అలంకరించాలి.
7. 'సంక్షిప్తత' వ్యాసానికి విలువ పెంచుతుంది.

## 16.5 వ్యాస వర్గీకరణము

వ్యాసము దూరని సందు లేదు. అధిరోహించని అందలమూ లేదు. స్పృశింపని విషయము లేదు. అందువలననే విషయ ప్రధానంగా - వ్యాసాన్ని ఈ క్రింది విధంగా వర్గీకరించవచ్చు.

1. సాహిత్య వ్యాసాలు.

2. భాషా వ్యాసాలు.

3. శాస్త్రీయ వ్యాసాలు.

### 16.5.1. సాహిత్య వ్యాసాలు

కట్టమంచి రామలింగారెడ్డి గారి 'కవిత్వ తత్త్వ విచారము' - ఆధునిక విమర్శకు దారి చూపించింది. 'శేషాచలం అండ్ కో' వారు ప్రచురించిన 'పాకెట్ సైజు' ప్రబంధాలకు వ్రాయించిన 'పీఠికలు', సాహిత్య అకాడెమీ వారు తక్కువ ధరలకే అందించిన ప్రాచీన సాహిత్యపు ప్రచురణలలోని 'తొలి పలుకులు', 'ముందు మాటలు', ఇట్టి వ్యాసముల కోవలోనికే వస్తాయి. సాహిత్యపు విలువల్ని బేరీజు వేసే ఈ వ్యాసాలు సగటు పాఠకుణ్ణే కాదు, సంభృత పాండితీమన్యుని అలరించేవిగ ఉండాలి.

### 16.5.2. భాషా వ్యాసాలు

భాషల కుటుంబాలు, తెలుగు భాష ప్రాచీనత, సంస్కృత ప్రాకృత భాషల ప్రభావం, ద్రావిడ భాషా వర్గపు నిరూపణం - ఈ వ్యాసాల స్వరూపాలు.

వేటూరి ప్రభాకర శాస్త్రి గారు, జయంతి రామయ్య పంతులు గారు, కోదాడ రామకృష్ణ గారు, కోదాడ మహదేవ శాస్త్రి గారు, గంటిజోగి సోమయాజి గారు, తులనాత్మకతను దృష్టిలో పెట్టికొని వ్రాసిన వ్యాసాలు మకుటాయమానాలు. ఆధునికులలో ఆచార్య తూమాటి దొడాప్ప గారు, బూదరిజ రాధాకృష్ణ, భద్రిరాజు కృష్ణమూర్తి, లకంసాని చక్రధరరావు గారు, బొడ్డుపల్లి పురుషోత్తం గారు మొదలైన వారు వ్రాసిన భాషాతత్త్వ పరిశోధక వ్యాసాలు తర్వాతి వారికి కరదీపికలైనాయి.

వీటన్నిటికి ఆంగ్లంలో వచ్చిన బిషప్ 'కాల్డ్వెల్' వ్రాసిన ద్రావిడ భాషల తులనాత్మక వ్యాసాలు, 'సునీతి కుమార్ చటర్జీ' పరిశోధక వ్యాసాలు, మూలాలు. తిరుమల రామచంద్ర గారి 'నుడి-నానుడి' లాంటి వినోదాత్మకమైన భాషా వ్యాసాలు.

### 16.5.3. శాస్త్రీయ వ్యాసాలు

ఖగోళ శాస్త్రానికి సంబంధించి 'గొబ్బూరి వేంకటానంద రాఘవ రావు' గారు 'జ్యోతిర్వేదం' అన్న పేరుతో వ్యాస సంపుటిని వెలువరించారు. విజయవాడ లోని 'ప్లానిటోరియం' విశ్లేషకులైన ముదిగొండ హనుమంత రావు గారి 'ఆకాశ వీధుల్లో' వంటి విజ్ఞాన దాయకమైన వ్యాసాలు, 'సైన్సు కథ' ను వ్రాసిన వేమరాజు భానుమూర్తి గారి వ్యాసాలు, ఆయుర్వేదానికి భాష్యం చెప్పే ఆచంట లక్ష్మీపతి గారి వైద్య వ్యాసాలు, శారీరక విజ్ఞానానికి సంబంధించిన డాక్టర్ గాలి బాలసుందరరావు గారి ఆరోగ్య సూత్ర వ్యాసాలు లెక్కకు మించి వస్తున్నాయి.

### 16.5.4. పరిశోధక వ్యాసాలు

ఆంధ్ర ప్రదేశ్‌లోని అనేక విశ్వ విద్యాలయాల్లో పరిశోధనలు జరిగాయి. జరుగుతున్నాయి. కొన్ని వేరే రాష్ట్రాల విశ్వవిద్యాలయా

ల్లోను ఈ పరిశోధనలు - తెలుగునకు సంబంధించి 'వ్యాస' రూపముననే జరుగుచున్నవి. ఇవి భాషా, సాహిత్యాలలో ఇబ్బడి ముబ్బడిగా వస్తున్నాయి. 'ఆంధ్ర భాషా చరిత్రము' అను చిలుకూరి నారాయణరావు గారి పరిశోధక వ్యాస సంపుటికి తొలి Ph.D. వచ్చింది. కొర్లపాటి శ్రీరామమూర్తి గారి 'ఈశ్వరార్చన కళాశీలుడు' అను గ్రంథమునకు తొలి D.Litt. వచ్చింది.

### 16.5.5. చారిత్రక వ్యాసాలు

'రాజ రాజ నరేంద్ర పట్టాభిషేక సంచిక' ను భావరాజు వేంకట కృష్ణారావు గారు, 'కళింగ సంచిక' ను రాళ్ళబండి సుబ్బారావు గారు, 'కాకతీయ సంచిక', 'శాతవాహన సంచిక' లను మారేమండ రామారావు గారు, 'రెడ్డి సంచిక' ను వడ్డాది సుబ్బారావు గారు వ్యాసాల రూపంలో అందించారు. మామిడిపూడి వెంకటరంగయ్య గారు, మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు, సురవరం ప్రతాపరెడ్డి గారు, మానవల్లి రామకృష్ణ గారు, నిడదవోలు వెంకట్రావు గారు మొ॥ వారు వ్యాసాలను అందించారు.

### 16.5.6. ఇతరములు

ఇవేగాక రాజకీయ వ్యాసాలు - మామిడిపూడి వెంకటరంగయ్య, కొమర్రాజు లక్ష్మణరావు, నార్ల వెంకటేశ్వర్లు, ఆర్థిక వ్యాసాలకు కొచ్చెర్లకోట సత్యనారాయణ, కట్టమంచి రామలింగారెడ్డి గారి 'అర్థశాస్త్రము' చెప్పుకోవచ్చును.

సంపాదకీయాలన్నీ ప్రామాణికమైన వ్యాసాలే. వై.యస్.పతంజలి, మోటూరు హనుమంతరావు, గోరా శాస్త్రి, నార్ల వారు, ముట్నూరి కృష్ణారావు, నండూరి రామమోహనరావు, గజ్జల మల్లారెడ్డి వ్రాసిన వ్యాసాలు. సమకాలీన విన్యాసాలకు అక్షరాలతో ప్రతిరూపాలు. 'చరిత్ర' ను ప్రధానాంశంగ తీసికొని 'ది ట్వల్వ్ సీజర్స్' గూర్చి వ్రాసిన 'గిబ్బన్' సాహిత్య స్థాయికి ఎదిగాడు. 'విల్ డ్యురాంట్' వ్రాసిన ప్రపంచ చరిత్ర సాహిత్యపు హోదానే పొందింది. "There is no history without literature and there is no literature without history" - అన్న వాక్యంలో చరిత్ర, సాహిత్యాల సన్నిహిత సంబంధం తెలుస్తుంది.

## 16.6 సమీక్ష

వ్యాసము ఈ విధంగా ఆలంకారికముగా ఉండి, ఉక్తి చమత్కృతులతో, తార్కిక చర్చలతో, శాస్త్రీయ నైశద్యములతో, చారిత్రకపు లోతులతో, సమీక్షల సంజీవనులతో, పీఠికల తీపి మాటలతో, ఉపోద్ఘాతాల విద్వత్తలతో, అధిక్షేపాల ఆలాపాలతో, రాజకీయాల రభసలతో, జీవిత చరిత్రల కావిరంగులతో సంపాదకీయాల శంపాలతలతో సహస్రధా ప్రకాశించింది.

శైలీనైగ నిగ్యములు, విమర్శనలసే మనస్యములు గుణ దోష నిష్కర్షలు, సంస్కార పురస్కారములు పుష్కలంగా ఉండి - ఆచంద్రార్కము నిలచిపోయే ప్రక్రియ ఈ వ్యాసం.

## 16.7 ప్రశ్నలు

1. వ్యాసము పాశ్చాత్యమా? భారతీయమా?
2. వ్యాస భేదమును వివరించునది.
3. వ్యాసపు పుట్టుపూర్వోత్తరములను వ్రాయుడి.
4. 'వ్యాసము' యొక్క గొప్పతనమును లెక్కింపుము.

## 16.8 ఉపయుక్త గ్రంథాలు

1. సాహిత్య దర్శనము - ఆచార్య కె.వి.కె. నరసింహం.

2. తెలుగు సాహిత్య విమర్శ - డాక్టర్ వి. సిమ్మన్న
3. కావ్య సోపానము - డాక్టర్ దివాకర్ల వేంకటావధాని
4. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
5. తెలుగు వ్యాస పరిణామము - ఆచార్య కొలకలూరి ఇనాక్
6. తెలుగు సాహిత్య సమీక్ష-2, డాక్టర్ జి. నాగయ్య
7. సమగ్ర ఆంధ్ర సాహిత్యము - ఆరుద్ర

**పోలె ముత్యము**
ఎం.ఏ., ఎం.ఏ., యం.ఫిల్.
ఆంధ్రోపన్యాసకులు
ఆంధ్ర క్రైస్తవ కళాశాల
గుంటూరు.

# పాఠం - 17

# జీవిత చరిత్ర

పాఠ్యనిర్మాణక్రమం

17.1. ఉపోద్ఘాతము
17.2. జీవిత చరిత్ర - లక్షణములు
17.3. జీవిత చరిత్రలు - వర్గీకరణ
17.4. ప్రముఖ జీవిత చరిత్రలు
17.5. స్వీయచరిత్ర - నిర్వచనములు
17.6. స్వీయచరిత్ర - లక్షణములు
17.7. స్వీయచరిత్ర - స్వరూప స్వభావములు
17.8. స్వీయచరిత్ర - ఆవిర్భావ వికాసములు
17.9. సమీక్ష
17.10. ప్రశ్నలు
17.11. ఉపయుక్త గ్రంథాలు

## 17.1 ఉపోద్ఘాతము

ఎవని జన్మము మానవ జాతికి అలంకారభూతమో, ఎవని వర్తనము లోక కళ్యాణ హేతువో, ఎవని ప్రవృత్తి మానవ నాగరకతాభివృద్ధికి కారణభూతమో, అట్టి అసాధారణ ప్రభావము గల వ్యక్తి యొక్క విశిష్టతను లోకులకు తెలుపుటకు వ్రాయబడిన కథను జీవిత చరిత్ర అందురు. ఆధునిక వచన సాహిత్య ప్రక్రియగా వెలసిన మరొక ప్రసిద్ధి చెందిన ప్రక్రియ ఈ జీవిత చరిత్ర. ఈ ప్రక్రియ ఆంధ్ర వాఙ్మయమున పాశ్చాత్య సాహిత్య ప్రభావముతో ఏర్పడినది.

'Biography' (Bio-Graphy-GR) అనే పదానికి 'A written account, or history of the life of an individual written by others' అనే నిర్వచనం ఉంది. ఇది తెలుగులో జీవిత చరిత్ర. జీవిత చరిత్రకు 'ఇతరులు వ్రాసిన వ్యక్తి చరిత్ర' అను పరిమితార్థ మేర్పడినది. స్వీయ చరిత్ర అనగా తనను గురించి తాను వ్రాసుకొనిన జీవిత చరిత్ర. తెలుగు సాహిత్యములో స్వీయ చరిత్రల కన్నా జీవిత చరిత్రలే ముందు వెలువడినాయి. అందువలన 'జీవిత చరిత్ర' అనే మాటకు పరిమితార్థం ఏర్పడింది.

## 17.2 జీవిత చరిత్ర - లక్షణములు

చరిత్ర అను పదమునకు ఏ కారణము చేతనో దేశ చరిత్ర అను అర్థము రూఢమైనది. దేశ చరిత్రకును జీవిత చరిత్రకు భేదం ఉంది. జరిగింది జరిగినట్లు గాను, యదార్థము గాను, కాలక్రమానుగుణముగా చెప్పేది దేశ చరిత్ర. లోకంలో జరిగిన సత్య విషయములను మాత్రమే చెప్తుంది. చరిత్రకారుని స్వంత విషయములను చెప్పుకోవడానికి చరిత్రలో ఎటువంటి అవకాశము లేదు. అలాంటి అవకాశాన్ని చెప్పుకోవడానికి జీవిత చరిత్ర ఉపయోగపడుతుంది. జీవిత చరిత్ర వ్యక్తులను వారు చేసిన కార్యాలను తెలియజేస్తుంది. చరిత్రలో కవి యొక్క ఆత్మీయత వ్యక్తం కాదు. జీవిత చరిత్రలో కథా పురుషుని ఆత్మీయత వ్యక్తం అవుతుంది. పరచరిత్రమైనను ఆత్మ చరిత్రమైనను పేరునకు మాత్రమే అది చరిత్ర కాని, గుణము చేత ఆఖ్యాన విశేషమే. ఒక దేశము యొక్క గాని, జాతి యొక్క గాని చరిత్ర ఎంత సమర్థుడైన చరిత్రకారుడు వ్రాసినను, దాని ఆత్మను సమగ్రముగా వ్యక్తం చేయలేదు.

అతడు ఆ రాజ్యముల యొక్కయు, ఆ రాజుల యొక్కయు వికాశ దశలు, వైఫల్య దశలు వివరించుటయందే శ్రద్ధ చూపును. ఇక జీవిత చరిత్ర ఏ వ్యక్తి యొక్క చరిత్రను చెప్పుటకు ఉద్దేశించునో, అతని యొక్క ఆత్మను వ్యక్తం చేయుటకు యత్నించును. ఆ వ్యక్తి యొక్క జీవితము నందు ఏయే ఘట్టములు ఆతని మహత్త్వ నిరూపణమునకు ఉపకరించునో, ఆ ఘట్టములు కాలక్రమాను సారముగా సంఘటింపబడి, వినసింపైన కథా రూపమున వ్రాయునపుడే 'జీవిత చరిత్ర' చరిత్ర అనిపించుకొని ఆఖ్యానమై వాఙ్మయ కోటి కెక్కును. కథా పురుషుని యాత్మీయతను వ్యక్తము చేయలేనట్టియు, కథన కౌశలము లేనట్టియు, జీవిత చరిత్రలు సాహిత్యమనిపించుకొనవు.

బహుకాల బహుపురుష వృత్తాంతము గల పురాణముల కంటె ఏక నాయికాశ్రయమైన ప్రబంద మెటుల భిన్నమో, అట్లే దేశ చరిత్ర కంటె ఏక వ్యక్తి జీవిత చరిత్రయు భిన్నము. ఈ రెండు చరిత్రల భేద సాదృశ్యములను భంగ్యతరమున ఇట్లు చెప్పవచ్చును. సమగ్రమైన దేశ చరిత్ర ఒక్క రాజకీయాంశముల నిరూపణమే కాక, ఆ దేశములో, ఆ జాతిలో, జన్మించిన మహా పురుషుల ప్రవృత్తి విశేషముల సంపుటీకరణము కూడ కాదగును. అట్టి మహానీయులలో నొక్కని ప్రవృత్తి విశిష్టతను ఇతివృత్తముగా స్వీకరించి, సుందరమైన రచన చేయుట జీవిత చరిత్ర వ్రాయుట.

జీవిత చరిత్రను గురించి పాశ్చాత్య సాహిత్య వేత్తలభిప్రాయములు జీవిత చరిత్ర వ్రాయుటలోని ముఖ్య ఉద్దేశ్యము ఒకానొక ఆదర్శవ్యక్తి ఆత్మీయతను సాహిత్య లోకమునకు, సంఘమునకు తెలియచేయుటయే యగును.

"The aim of biography" said Sir Sidney Lee 'is the truthful transmission of personality' అని ఆంగ్ల భాషలోని సూక్తి. ఈ వ్యక్తీకరించు విధానమును బట్టి పాశ్చాత్య సాహిత్య వేత్తలు ఈ శాఖను సాహిత్యముగను, శాస్త్రముగను, నవలా భేదము గాను నిర్ణయింప వచ్చునని విమర్శించిరి. కళాత్మక ధర్మము లుండి సంక్షిప్తముగా ధర్మ నిర్దేశముతో కూడినది సాహిత్య కళగా పరిగణింపవచ్చును. ".... as in the case of poets Biographers seem to be born rather than made" అని Waldo H Dunn నిర్వచించెను. శాస్త్రీయ మార్గములో నేదో యొక సాంకేతిక శాఖననుసరించి దానికి మాత్రమే ప్రత్యేకించి యేర్పడిన జీవిత చరిత్రములనేకములు కలవు. వానినే మనము శాస్త్రీయమైన జీవిత చరిత్రమని తెలుపుదుము. ఈ విషయమునే Andre Mowrois "Scientific biography will become specialised and technical. There will be biographies in which development will be traced in all its inticacy and in a manner comprehensible only to the experts" అని తన అభిప్రాయమును వెల్లడిచేసి, "Sociological biographies, easthitic biographies, philosophycal biographies" మొదలగు వస్తు భేదములతో నేర్పడిన జీవిత చరిత్రలీ కోవకు చెందినవని నిర్దేశించెను. కానీ, మన సాహితీవేత్తలు సాహిత్య భేదములో జీవిత చరిత్ర ఒకటి అనియు, అది చరిత్ర కన్నను భిన్నమైనదనియు, జీవిత చరిత్రలోని కథానాయకునికే ఈ లక్షణములు కలవనియు, నిర్ణయించి వ్రాసిన వ్యాసములే కన్పించు చున్నవి. కాని, వస్తు భేదములలో ఈ శాఖ ఏ కోవకు చెందినదో నిర్ణయింపలేదు.

సాంఘిక జీవితమున కాదర్శప్రాయుడైన యొకానొక ప్రసిద్ధవ్యక్తి 'జీవిత చరిత్రలోని కథానాయకుడు' అనుట సామాన్యోక్తి. Platarch 'Writing the lines of famous Person' అని యూహించినట్లు విమర్శకుల భావన. ఆంగ్ల సాహిత్య ప్రారంభదశలో 'The history of particular men's lines is biography' అని తలంచిరి. Morcel Schwog "Biographers have supposed that only great men's lines could interest us" అని తన అభిప్రాయమును వ్యక్తపరచెను. కాని పైని పేర్కొనిన అంశములు అంత నిర్దుష్టములు కావేమోనని స్థూల దృష్టికి గోచరించును. జీవిత చరిత్రలోని నాయకుడు ఒక సాంఘిక మార్గమున ప్రఖ్యాతి వహించిన వ్యక్తిగ నున్నచో, మనము వారిని మార్గ దర్శకులుగా నెంచుకొని మన జీవిత పథమును సుగమము చేసుకొనవచ్చును. Sir Sidney Lee కథా వస్తువు విషయమున 'Should be of a certain magnitude' అని నిర్దేశించెను.

కావున ఎవరి జీవితం సహజ సుందరముగా నుండి గణింపదగిన ప్రసిద్ధాంశములలో కూడి యుండునో, వారి జీవితమును రమ్యముగా చెప్పుటయే జీవిత చరిత్ర యగును. "There are lines which have a natural beauty, which either by chance or by some force inherent in their being, are some how constructed life spontaeneous work of art" అని కథా వస్తువును గురించి Andre Mowrois అభిప్రాయపడెను.

జీవిత చరిత్రకు ఏక నాయకాశ్రయత్వం ప్రధాన లక్షణము. ఏక నాయికాశ్రయత్వములో కథన కౌశలముతోపాటు రచనా సౌందర్యము కూడ జీవిత చరిత్రకు సాహిత్య ప్రపంచమున స్థానమును కల్పించెడి అర్హతలలో ఒకటి యగును. కేవల దేశ చరిత్రలలో కొన్నింట సుందరమైన రచన ఉండవచ్చునేమో గాని, తక్కిన రెండునూ ఉండవు. అయినను దేశ చరిత్ర రచనలో రమణీయమైన శైలి యందు దృష్టిపెట్టిన చరిత్రకారులు చాలమంది లేరు. విషయ ప్రధానమైన రచనలకు రమణీయమైన శైలి అంతగా ఆవశ్యకము కాదు. విషయప్రధానమయ్యి, అట్టి శైలిని గూడ ఆపేక్షించి సాధించినప్పుడే జీవిత చరిత్ర సాహిత్యముగా పరిగణింపబడును. అసలు విషయమేదియైనను, ప్రక్రియ యేదియైనను, ఒక గ్రంథమును సాహిత్యముగా పరిగణింపబడ జేయునది రమణీయమైన శైలియే అనుట నిర్వివాదము. అట్టి శైలి ఉన్నంత మాత్రమున జీవిత చరిత్ర సహితము యదార్థమైన కావ్యజాతి యందు చేరదు. కావ్యము సౌందర్యాపేక్షచే అయదార్థములైనను, అసంభావ్యము కాని కల్పనలను అంగీకరించును. చారిత్రక కార్యములు వ్రాసిన కవులు సైతము అట్టి సుందర కల్పనల వల్లనే శుద్ధ చారిత్రక విషయములను కావ్యములుగ చేయగలిగిరి కాని, జీవిత చరిత్ర యందు ఎట్టి కల్పనావేశమును పనికిరాదు. ఈ అంశములలో దేశ చరిత్ర వలె జీవిత చరిత్రయు యదార్థ కథనమే కావలయును.

జీవిత చరిత్ర యందు కల్పనాది విశేషములకు అవకాశము లేక పోవుటచే దీనికి కావ్య శిల్ప గౌరవము దక్కలేదు. అయినను కథా పురుషుని జీవిత మహత్త్వమే ఆ చరిత్రకు సౌందర్యమును ఆపాదించుట వలన ఆ గ్రంథము పఠితులకు పూజ్యమగుచుండును. ఒక మహాపురుషుని జీవిత మహత్త్వా లోకము చేత కలిగిన అబ్బురపాటు ప్రేరణ కాగా, ఆ మహత్త్వ విశిష్టతను లోకులకు తెలుపుటకై వ్రాయబడెడి కథయే జీవిత చరిత్రకు వస్తువుగా ఉపకరించును గాని, లోక సామాన్యుల వర్తనము ఉపకరింపదు. ఆ వ్యక్తి సర్వ మానవకోటికిని ఆప్తుడు కాకపోయినను, తన జాతికి సాంఘికముగనో, రాజకీయముగనో, మరే విధముగానో, మహోపకారమొనర్చి, ఉద్ధరించి, ఔన్నత్యము కలిగించిన స్వార్థరహిత జీవనుడై నప్పుడు, అతని చరిత్ర స్వజాతీయులకే గాక క్రమముగా కొంత కాలమునకు లోకపూజ్యమగును. అట్టి పూజ్యతకు పాత్రము కాని జీవిత చరిత్రలు ఉత్తమశ్రేణిలో పరిగణింపబడవు.

జీవిత చరిత్ర రచనలలో దీక్షా పూర్వకముగా పాటింపవలసిన ప్రథమ నియమము సత్య కథనము. జీవిత చరిత్ర లోని నాయకుని బ్రతుకులోని సంఘటనలను సత్యము నేమాత్రము దాచిపెట్టక, యదార్థముగా ఉన్నదున్నట్లు తెలుపుట వలన పాఠకుల కభిరుచిని, ఉత్సాహమును కలిగించును. కావున జీవిత సంఘటనలోని ప్రతి అంశములోని సత్యమును వెల్లడి చేయుట ప్రథమ కర్తవ్యము. His first duty, I have shown, is to be truthful to understand and then reflect his understanding, his second, perhaps even more difficult is to be interesting", ...... interesting I mean, that his work must conform to the laws of aesthetics" అని జీవిత చరిత్రకారుల విషయమున A.J.A. Symons తన అభిప్రాయమును వెల్లడి చేసెను. కావున జీవిత చరిత్ర వ్రాయువారు ఆ వ్యక్తుల మంచి చెడు రెండింటిని తమ గ్రంథమున ప్రవేశపెట్ట వలయును. ఆ వ్యక్తి పై తమకు గల ప్రత్యేకాభిమానముతో తప్పులను విస్మరించిన అది వందిమాగధుల స్తోత్ర గ్రంథమగునే కాని జీవిత చరిత్రలనిపించుకోవు. " ..... a good biographer, in my view, is one who can see both white and black and can show a man who has this difficult pair to drive, can succeed as well as fail" అని Andre Mowrois చెప్పిన విషయమును అంగికరించవలసినదే. సత్య గోపనము పట్టి ప్రదేశములందు చేయక యుండుట వలన, మన జీవితమున

కొక సంతృప్తియు, పతనము నందొక ఉత్సాహము ఎక్కువగును. Sir Sidney Lee 'The truth which biography demands is truth in its hardest most of durate form; it is truth as truth is to be found in the British Museum; it is truth out of which all vapour of falsehood has been pressed by the weight of research; అని భావించెను. Biography లోని విషయములు "faithfully and authoritatively delivered" అని వారి అభిప్రాయము ఎంతటి మహనీయుడైనను, సర్వదోష రహితుడైన మానవుడుండడు. అందుచే సత్య కథనమున కథానాయకుని దోష నిరూపణము మానరాదు. వాటిని మరగు పరచుట కంటె ఉద్ఘాటించుటయే మేలు, లోకమునకు అదియే సదుపదేశమగును.

జీవిత చరిత్ర రచయిత కథానాయకుని బాహ్య ప్రపంచము తోడి సంబంధము గల విషయములను మాత్రమే గణింపక, ఆంతరంగిక విషయమునను సత్యమును దాచిపెట్టక అనౌచిత్య విషయము లైనప్పటికిని ఔచిత్యముతో దానిని వెల్లడి చేయుటయే పరమ ధర్మము.

"A true biography is the narrative, from birth to death, of one man's life in its outward mainteslation and inward coritings" అని W.H. Dann అభిప్రాయపడెను. కథానాయకుని ఆంతరంగిక జీవితమును కూడా వ్రాయుట వలన వారెట్లు తమ సంఘటనలను ఎదుర్కొనిరనియు, దాని కారణమున వారి హృదయ భావములు ఎట్లు పరిణిత నొందినవో స్పష్టమగును. అయితే జీవిత చరిత్రలోని ప్రతి సంఘటనను, ప్రతి దినచర్యను జీవిత చరిత్రలో గ్రహించుటకు వీలులేదు. ఏ సంఘటనల వలన వ్యక్తి గత భావములు మార్పునకు లోనైనవో, లేదా జీవితమునే మార్చి వేసినవో అట్టివి గ్రహించుటయే మంచిది. 'A Biographer or Auto Biographer is obliged to omit from his narrative the common places of daily life, and to limit himself almost exclusively to sailent events, action and traits" అని Herbert Spencer వివరించెను. ఈ విధముగానే Andre Mowrois 'the biographer, like the portrait painter and the land scape painter must pick out the essential qualities in the whole subject which he is contemplating' అని తన భావమును విశదీకరించెను.

జీవిత చరిత్ర వ్రాయు రచయిత పాటింపవలసిన ముఖ్యాంశము భావ సంయమనము. జీవిత చరిత్రకు సంబంధించిన వ్యక్తి రచయితకు ప్రీతి పాత్రుడై యుండి, అతని మన్ననలకు అర్హుడై యుండుట సామాన్య విషయము. సాధారణముగా కుమారులు గాని, శిష్యులు గాని, తమ గురువుల జీవిత చరిత్రలు వ్రాయుట పరిపాటి. అట్టి సందర్భమున వారి జీవితమందలి యే సంఘటనలైనను అవి సత్పరిణామములుగా నున్నట్లుగానే రచయితలు భావించి, వారి భావముల కనుగుణముగా వర్ణనలు రచనలు చేయుట సామాన్య విషయము. కావున రచయిత ఆ వ్యక్తి విషయమై తనకు కలిగిన ఆదరాభిమానములను విస్మరించి, జీవిత సంఘటనములను యధార్థముగా విన్నవించి, వాని ననుసరించి పాత్ర మనస్తత్వము పాఠక లోకమునకు గోచరించునట్లుగా చేయుటయే యుక్తము. రచయిత కళా ధర్మములను సమగ్రముగా పొందుపరచి చెప్పవలసిన రీతిలో వానిని చెప్పినచో పాఠకులకు ఉత్సాహమును కలిగించును గాని విసుగుదలను కలిగించుటకు అవకాశము లేదు. "When we read the biography of a very well known man we know in advance what changes of fortune and what denouement to expect. At first sight we might think that this might not the book of some of its interest, but if the thing is well done, the effect is exactly the reserve" అని Andre Mowrois తన భావములను స్పష్టపరచినాడు.

జీవిత చరిత్ర యే వ్యక్తికి సంబంధించినప్పటికిని క్రమ పరిణామములో సన్నివేశములను తెలిపి, అనవసరములైన వానిని విడిచిపెట్టి, పాత్రను పోషించుటయే ఉచితము. జీవిత చరిత్రత యందు సన్నివేశము లన్నియు ప్రత్యేకించి ఆ వ్యక్తికి సంబంధించినవై యుండు వానిని మాత్రమే వ్రాయవలయును. ఈ సాహిత్య ప్రక్రియ జీవితమునకు సంబంధించినది కావున నిందు పొందు

పరచిన విషయములు సజీవముగ నుండిననే అది పఠనార్హమగును. జీవితములకు సంబంధించిన సన్నివేశములను స్పష్టపరచుట మాత్రమే కాదు, ఆ సన్నివేశములను విశద పరచుట యందును పాఠకుల ఉత్సాహము కలిగించు రీతిగా తెలిపిననే అది సాహిత్య ఖండముగా రాణించును. "The biographer must not only select his facts but also present them in the most telling order" అని A.J.A. Symons అభిప్రాయమును వ్యక్తీకరించెను.

మానవ జీవితము ప్రకాశము, అప్రకాశము (public and private) అని రెండు విధములు. వానినే బహిరంగ జీవితము, ఆంతరంగిక జీవితము అనుచున్నారు. స్వీయచరిత్ర వ్రాసుకొను వ్యక్తి తన జీవితమును యధాతథముగా లోకమునకు ప్రదర్శింపవలయు ననెడి కుతూహలము కలవాడగుచో, ఆ రెండు విధములైన జీవిత భాగములను చిత్రించుట మేలు. అట్టి తలంపు లేనిచో ఆంతరంగిక జీవితమును స్పృశించకుండుట మేలు. బహిరంగ జీవితమునకు ప్రేరకములైన సంఘటనలు ఆంతరంగిక జీవితములో ఉన్నచో, అవి ఎంత రహస్యములైనను ప్రకటించబడవలసినదే కాని దాచవలసినవి కావు. పర చరిత్ర వ్రాయు వానికి కథాపురుషుని గృహస్థతకు సంబంధించిన గొప్ప విషయములు లభించుట చాల కష్టము. వాటిని సంపాదించటానికి అతడు పడెడి పాటు నిజముగా సత్య దేవతారాధనమే యగును. కథానాయకుని గృహచ్ఛిద్ర ప్రతికూల పరిస్థితులు ఎప్పుడో ఒకప్పుడు అతని బహిరంగ జీవితంపై ప్రభావము చూపవచ్చును. రచయిత పరిశోధించి ఆ లోపములను తెలిపినప్పుడు లోకులకు ఆ పురుషుని యందు ఆదర భావము ఎక్కువగును. లేనిచో దురభిప్రాయమే కలుగును.

జీవిత చరిత్రలోని వ్యక్తులు సజీవముగా నున్నప్పుడు ఆ సాహిత్య ప్రక్రియకు కావలసిన అంశములను సేకరించుట చాల సులభమైన కార్యము. కాని ఆ వ్యక్తులు మరణించిన పిదప ఈ కార్యక్రమమునకు పూనుకొనుట చాల కష్టము. అట్టి దశ యందు జీవిత చరిత్ర రచయితలకు దొరికెడి ఆధారములు వారి ఉత్తరములు, వారి దినచర్య గ్రంథములు మాత్రమే ఇవి. "That biography is not memorial journalism but a form of art and that is as much entitled as the modern novel to openners of expression" అని వ్యక్తీకరించుచూ "These dairies and memories are raw material but they should not be confused with the finished product. They are biographical sources not biographies" అని దాని ప్రయోజనములను విశదీకరించియున్నారు.

ఉత్తరములను, దినచర్య గ్రంథములను ఆధారముగా గొని అందు సంవత్సరాదుల ననుసరించి పౌర్వాపర్య విషయములు అతి జాగ్రత్తతో పొందుపరచి, అందలి విషయ సారాంశములను మాత్రమే వెల్లడి చేయవలయును కాని, ఉన్నవి ఉన్నట్లుగా గ్రంథమున పెట్టరాదు. కొన్ని కొన్ని సంఘటనలు సాధారణముగ ఉత్తర ప్రత్యుత్తరముల నుండుట సహజము. వాటిని వదిలిపెట్టుట మంచిది. Rev. Thomas Davidson - Most modern biographies are too large. They err by not selecting merely the significant" అని స్పష్టపరచెను. కావున వ్యక్తి గతమైన లేఖలను, దినచర్య గ్రంథములను తగు రీతిలో నుపయోగించుట శ్రేయోదాయకము. "A judicious and correct use of 'private letters" అని William Winters అభిప్రాయపడెను.

జీవిత చరిత్రకారుడు నిజమునకు వీరాధనా తత్పరుడు స్వీయచరిత్రకారుడు ఆత్మవిశ్వాస సంపన్నుడు. తనకు పూజ్య భావము లేని వాని చరిత్రను వ్రాయుటకు ఎవ్వరును పూనుకోరు. స్వశక్తి యందు విశ్వాసము లేనివారు తమ చరిత్రను వ్రాసుకోరు. తనకు ఆరాధనీయుడైన పురుషుని వీరునిగా భావించి అతని చరిత్ర వ్రాయువాడు, అత్యుత్సాహముచే అతిశయోక్తుల దారి పట్టునేని లోకులకు ఆ కథా పురుషుని యందు పూజ్య భావము తగ్గిపోవును. అందుచే రచయిత ఆవేశపూరితుడు కారాదు. అట్లే ఆత్మ విశ్వాసము కల స్వీయ చరిత్రకారుడు తాను సాధించిన కార్య సిద్ధుల ద్వారా తన ఆధిక్యమును ప్రదర్శించుకొనుట కంటె వినయ సంపదనే ఎక్కువ ప్రస్ఫుటము చేయుట మంచిది. కావున -

<u>జీవిత చరిత్ర వ్రాయుటలో గమనింపవలసిన అంశములు.</u>

1. సంఘముననో, సాహిత్యముననో, కొంత కీర్తి సంపాదించిన వ్యక్తి జీవితము కథా వస్తువు కావలయును. ఏక నాయికాశ్రయత్వము ప్రధాన లక్షణము.

2. జీవిత చరిత్ర వ్రాయుటలో కథన కౌశలముండవలయును.

3. కథనా కౌశలముతో పాటు రచనా సౌందర్య మవసరము.

4. యథార్థ పురుషుని యొక్క యథార్థ చిత్రణమే ప్రధానము. ఇందు కల్పనావేశము పనికిరాదు.

5. జీవిత చరిత్రను వ్రాయు వారు సత్య నిష్టను పాటింపవలయును. కథానాయకునిపై తనకు గల ఆదరాభిమానముతో రచన కొనసాగించరాదు.

6. జీవిత చరిత్ర యందు ఉపదేశము అను ప్రయోజనము సాధింపబడినట్లు, మరే ప్రక్రియ వలనను సాధ్యము కాదు.

## 17.3 జీవిత చరిత్రలు - వర్గీకరణ

ఆంగ్ల సాహిత్య ప్రభావముచే తెలుగు సాహిత్యములోనికి ఆధునిక వచన ప్రక్రియగా ప్రవేశించినదీ జీవిత చరిత్ర ప్రక్రియ. గడచిన శతాబ్దములో తెలుగులోని వచ్చిన జీవిత చరిత్రలను పరిశీలించిన, యీ క్రింది విధముగా వర్గీకరించవచ్చును.

1. సాహిత్య పరమైనవి - కందుకూరి వీరేశలింగము, చిలకమర్తి లక్ష్మీనరసింహం, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, దువ్వూరి రామిరెడ్డి, శ్రీశ్రీ, మొదలైన వారిచే రచింపబడినవి.

2. రాజకీయ పరమైనవి - కొండా వెంకటప్పయ్య, టంగుటూరి ప్రకాశం, రావి నారాయణ రెడ్డి, మొదలైన వారిచే రచింపబడినవి.

3. సాంఘికమైనవి - దర్శి చెంచయ్య, మందుములన నరసింగరావు, మామిడిపూడి వెంకటరంగయ్య, మొదలైన వారు జీవిత చరిత్రలు సాంఘిక ప్రాధాన్యత సంతరించుకున్నవి.

4. ఆధ్యాత్మకమైనవి - స్వామి జ్ఞానానంద, ఎక్కిరాల కృష్ణమాచార్యులు, మొదలైన వారి జీవిత చరిత్రలు.

5. పద్యాత్మకమైనవి - కొకొంట వేంకటరత్నం, గుఱ్ఱం జాషువా, తుమ్మల సీతారామ మూర్తి, మండపాక పార్వతీశ్వర శాస్త్రి మొదలైన వారి జీవిత చరిత్రలు.

6. అనువాదములు - శ్రీ మహీధర రామమోహనరావు గారి 'టాల్‌స్టాయి', కందుకూరి వీరేశలింగము గారి 'విక్టోరియా రాణి చరిత్ర' మొదలగునవి విదేశీయుల జీవిత చరిత్రలు అనువదింపబడినవి.

7. నటీనటులు రచించినవి - స్థానం నరసింహరావు 'అక్కినేని నాగేశ్వరరావు, నందమూరి తారక రామారావు' లపై రచించిన జీవిత చరిత్రలు.

## 17.4 ప్రముఖ జీవిత చరిత్రలు

మన వాఙ్మయమున ప్రారంభదశలో ఒకరి జీవిత వృత్తమును వేరొకరు వ్రాయుట యనునది కావ్యాదులలో కొంత కన్పించుచున్నది. 12వ శతాబ్దమున పాల్కురికి సోమనాథుడు 'మల్లికార్జున పండితారాధ్య చరిత్ర, బసవ పురాణము' అను గ్రంథములు మత ప్రచారార్థము అది మానుష కృత్యములలో వ్రాయబడిన గ్రంథములు. ఇవి ఛ్ఛందస్సుతో వ్రాయబడిన రచనలు.

ఇవియు జీవితమును తెలియచేసెడి రచనలే అయినను కేవల మతప్రచారము కొరకు వ్రాయబడినవే. ఆధునిక జీవిత చరిత్ర లక్షణములిందు పొడసూపవు.

తెలుగు సాహిత్యములో ఇరవై శతాబ్దములో జరిగిన జీవిత చరిత్ర రచనా ప్రక్రియలో నూతన వికాసం శ్రీ కందుకూరి వీరేశలింగము పంతులు గారితోనే ఆరంభమైనదని చెప్పవచ్చును. మొదట కవుల జీవిత చరిత్ర నుండి ప్రారంభమై, ఆ తరువాత సంస్కర్తలపై, ఆ తరువాత రాజకీయ వాదులపై, క్రమముగా ఇతర ప్రముఖులపైకి జీవిత చరిత్రల రచన సాగినది. కందుకూరి వారు మొదటిసారిగా ఆంధ్ర కవుల చరిత్రను రెండు సంపుటములుగా వెలువరించినారు. ఆ తర్వాత చాగంటి శేషయ్య గారు 'ఆంధ్రకవి తరంగిణి' అను పేరుతో కవుల యొక్క జీవిత చరిత్రను రచించినారు. ఇతర జీవిత చరిత్రల కంటె కవుల జీవిత చరిత్రలు కావ్యోదాహరములతో నిండియుండును. కావున వాటిని పాఠకులు చదువుతున్నప్పుడు చంపూ కావ్య పఠన వలెనే రసానందము నిచ్చుచుండును. ఇతర జీవిత చరిత్రలకు అటువంటి శోభ రాదు. వాఙ్మయ చరిత్రకు వాఙ్మయ విమర్శకు కవుల జీవిత చరిత్రలు ప్రధమ సోపానములని నిరాపేక్షముగా చెప్పవచ్చును. మరి కొంతమంది కవులు శతక కవులను గురించి వ్రాసిన రచనలు కలవు.

దేశ క్షేమం కోసం, స్వాతంత్రోద్యమము కోసము పాటుపడిన (రాజకీయ) నాయకులు పలువురున్నారు. వారు జాతీయ, అంతర్జాతీయముగా కీర్తి గడించినవారు. గాంధీజీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోసు, మొదలైన వారి జీవిత చరిత్రలు ప్రజలకు ఆదర్శము. తుమ్మల సీతారామమూర్తి గారు 'ఆత్మకథ', 'బాపూజీ ఆత్మకథ' (పద్య కావ్యము) అను పేరుతో రచన చేశారు. వీరే కాక గాంధీజీ జీవిత చరిత్రను వ్రాసిన వారు చాలమంది ఉన్నారు. వారిలో "దేవరకొండ చిన్ని కృష్ణశర్మ 'మహాత్మ గాంధీ', ముదిగొండ జగ్గన శాస్త్రి 'మహాత్మ గాంధీజీ', గుఱ్ఱం జాషువా 'బాపూజీ', పళ్లెపూర్ల ప్రజ్ఞాచార్యులు 'ఆత్మ సమర్పణము' (గాంధీ జీవితంపై పద్య కావ్యము), వేలూరి శివరామ శాస్త్రి గారి 'ఆత్మకథ' (గాంధీజీ జీవితం), వెలిదండ శ్రీనివాసరావు 'గాంధీ మహాత్ముని సమగ్ర చరిత్ర', దంటుపల్లి వేంకట సుబ్బశాస్త్రి గారు 'గాంధీజీ జీవితము', మనుకొండ సత్యనారాయణ గారు 'గాంధీ జీవిత చరిత్రము', బొడ్డపాటి శేషగిరిరావు, ఆత్మకూరి గోవిందాచార్యులు పలువురు కవులు గాంధీజీ జీవిత చరిత్రలు వ్రాసినారు. ఎ. రమేష్ గారు 'నెహ్రూ జీవిత చరిత్ర'ను, నేదునూరి గంగాధరం 'నెహ్రూ సమగ్ర చరిత్ర'ను, ముదిగొండ జగ్గన్న శాస్త్రి 'నెహ్రూ ఆత్మకథ'ను, కొండవీటి వెంకటకవి 'నెహ్రూ చరిత్ర'ను, వ్రాసిన వారిలో ఉన్నారు. దాదాభాయ్ నౌరోజీ జీవిత చరిత్రను యస్.సి.యన్. పార్థసారధి, గోపాలకృష్ణ గోఖలే జీవిత చరిత్రను ధరణీప్రగడ వేంకట శ్రీరామచంద్రమూర్తి, ఉండేమాల కొండారెడ్డి గారు, ఆకురాతి చలమయ్య, గుఱ్ఱం జాషువా, గారలు 'నేతాజీ సుభాష్ చంద్రబోస్' జీవిత చరిత్రను వ్రాశారు. తుర్లపాటి కుటుంబరావు, లాల్‌బహుదూర్ గురించి, భాయేశ్వర్ గారు రాజేంద్రప్రసాదు ఆత్మకథను, గొర్రెపాటి వెంకటసుబ్బయ్య గారు లాలా లజపతి రాయ్‌ను, నార్ల వేంకటేశ్వరరావు సర్దార్ భగత్‌సింగు, రాష్ట్రపతి రాధాకృష్ణన్‌ను, యర్రమిల్లి సూర్యనారాయణ మూర్తి 'లోకమాన్య తిలక్'ను, లవణం గారు 'వినోభా జీవితము'ను, యర్రమిల్లి నరసింహరావు గారు 'ఆంధ్రకేసరి' ప్రకాశం గారి జీవితంను, నదీరా ఇందిరాగాంధీని గురించి జీవిత చరిత్రలను వ్రాశారు.

జవంగుల నాగభూషణదాసు గారు 'శ్రీ వీర బ్రహ్మేంద్రస్వాముల' వారి జీవిత చరిత్రను, చిలకమర్తి లక్ష్మీనరసింహము గారు 'రామకృష్ణ పరమహంస' జీవితమును, యర్రమిల్లి ప్రభాకరరావు 'స్వామి వివేకానంద' జీవితమును, చిరంతనానంద స్వామి 'వివేకానందుని' జీవితమును, శారదాదేవి జీవితమును, ఇలపావులూరి పాండురంగారావు 'శంకరాచార్యుల' జీవితమును, కిళాంబి రంగాచారి 'తథాగతుడు' (గౌతమి బుద్దుని జీవితం) ను గురించి, కొమఱ్ఱాజు లక్ష్మణరావు గారు 'శివాజి చరిత్రము, గడియారం వేంకటశాస్త్రి గారు 'ఛత్రపతి శివాజీ'ని గురించి, కొండమూడి శ్రీరామచంద్రమూర్తి 'అనిబిసెంట్' ను గురించి జీవిత చరిత్ర రచనలు చేసినారు. మానికొండ సత్యనారాయణ శాస్త్రి 'తిలక్ మహాశయుని జీవితము', విశ్వనాథ సత్యనారాయణ 'ఝాన్సీరాణి' ని గురించి, కాటూరి వేంకటేశ్వరరావు 'రవీంద్ర కథ', చిన్నం హనుమయ్య చౌదరి 'విశ్వకవి రవీంద్రుడు', తల్లాప్రగడ ప్రకాశరాయుడు 'రామమోహన

రాయల' గురించి, చెన్నుభట్ల గోపాలరావు 'పొట్టి శ్రీరాములు'ను గురించి, వంగవోలు ఆదిశేషయ్య 'కస్తూరి మాత'ను గురించి జీవిత రచనలు చేసినారు.

కొన్ని విదేశీయుల జీవిత చరిత్రలు ఆంధ్రమున అనువదింపబడినాయి. శ్రీ మహధర రామమోహన రావు 'టాల్‌స్టాయ్' ను, కందుకూరి వీరేశలింగము పంతులు గారు 'విక్టోరియా మహారాణి చరిత్ర'ను వ్రాశారు. కత్తి పద్మారావు, ఎండ్లూరి చిన్నయ్య, బి.విజయ భారతి, బి.ఆర్.కుసుమ, బోయి జంగయ్య, మొదలైన వారెందరో డాక్టర్ అంబేద్కర్ జీవిత చరిత్రను వ్రాశారు. జీవిత చరిత్రలో యాత్ర చరిత్రను పొందుపరచి వెలువరించిన వ్యక్తి చరిత్రలు కూడ తెలుగులో రచింపబడినాయి. ఈ రకం జీవిత చరిత్రలలో స్వీయాత్మక రచన పరజీవిత చరిత్ర ప్రక్రియలు రెండు కలిసి ఉంటాయి.

భారతీయుల చరిత్రలు, ఆంధ్రుల చరిత్రలు, విదేశీయుల చరిత్రలు, వైజ్ఞానికుల జీవితాలు, తాత్త్వికుల జీవితాలు, రాజకీయ వాదుల జీవితాలు, కళాకోవిదుల జీవితాలు చదువుతుంటె ఆ మహనీయుల ఉదారమైన వ్యక్తిత్వం, ఆనాటి సమకాలికేతి వృత్తం మనకు తెలుస్తుంది. ఆ సచ్చరిత్రుల చరిత్రలు (జాతి) దారి దివ్వెలై భవిష్యత్తు వారికి వెలుగు బాట చూపిస్తుందనడములో అతిశయోక్తిలేదు.

## 17.5 స్వీయ చరిత్రలు

'Auto-biography' అను ఆంగ్ల పదమును, తెలుగులో 'స్వీయ చరిత్ర' అని పిలవబడుతున్నది. ఆంగ్ల భాషలో 'AUTO' అను పదమునకు (Auto-Self, Gr) Self one's own, be oneself, independently combining form of - అనే అర్థాలున్నాయి.

Biography అనే పదానికి (bio-graphia) 'A written account, or history of the life of an individual written by others' అనే నిర్వచనం వుంది. దీనిని తెలుగులో 'జీవిత చరిత్ర' అను అర్థముతో పిలవబడుతున్నది.

తనను గురించి తాను వ్రాసుకొనే చరిత్రను 'స్వీయ చరిత్ర' అని, తనను గురించి ఇతరులు వ్రాసిన చరిత్రను 'జీవిత చరిత్ర' అని చెప్పుకోవచ్చును. స్వీయ చరిత్రల కన్నా జీవిత చరిత్రలే ముందుగా ప్రసిద్ధము కావడము వలన, జీవిత చరిత్ర అనే పదముకు పరిమితార్థమేర్పడినది.

### 17.5.1. స్వీయ చరిత్ర - నిర్వచనం

'Auto-biography' కి ఈ క్రింది నిర్వచనములు కన్పించుచున్నాయి.

"A written account or history of the life of an individual written of one self"

"The story of a person's life written of himself"

"The account of individual human life written by the subject himself. In the broadest sense any self-written account of one's life and times may be thought of as auto-biographical, but auto-biography at a literary sense stands apart from certain related forms - notably the personal essay, the dairy. The travel journal and the auto-biographical novel"

స్వీయచరిత్రలో వ్యక్తి తన జీవిత విషయములనే గాక, తన సమకాలీన జీవన పరిస్థితులను, ఇతర వ్యక్తులకు సంబంధించిన

విశేషములను కూడ పొందుపరుస్తాడు. కాబట్టి వీటిని సమాజ చరిత్ర రూపొందించడానికి పనికి వచ్చే అక్షరాలుగా గుర్తించవచ్చును. ఇది వాఙ్మయములో చారిత్రక విభాగానికి చెందినవి. అయినను ఇవి చరిత్రలూ కావు. కట్టు కథలూ కావు. వీనిలో విస్తరించబడిన వస్తువు ఒక వ్యక్తి యొక్క జీవిత వివరణయే కాబట్టి ఇది చరిత్ర కాదనీ, వాస్తవమైనదీ, యధార్ధముగా జరిగినదీ కాబట్టి ఇది కట్టు కథ కాదనీ త్రోసి పుచ్చినా, ఈ రచనలలో చరిత్రకారుని సత్య దృష్టి, కథాకారుని కళాదృష్టి రెండు మేళవించి వుండటం వల్ల ఇవి ఆ రెండింటి సమ్మేళన రూపములనవచ్చును. అందుకే వాటిని జీవిత, స్వీయ, ఆత్మ చరిత్రలు అంటున్నాము.

## 17.6 స్వీయ చరిత్ర - లక్షణములు

ఈ క్రింది వానిని స్వీయ చరిత్ర లక్షణముగా చెప్పవచ్చును.

1. ఒక వ్యక్తి తన జీవితములోని సంఘటనలను తనకు తానే (వ్రాసుకోవాలి) చెప్పుకోవాలి.

2. రచయిత తన జీవితములో జరిగిన సంఘటనలను ఎప్పటి కప్పుడు వ్రాసుకొని, తరువాత స్వీయ చరిత్రలో వ్రాసుకోవటము ఒక పద్ధతి. ఈ పద్ధతిని కందుకూరి వీరేశలింగం పంతులు గారు పాటించారు. కందుకూరి వారు తాను వ్రాసుకున్న డైరీలోని చాలా విషయములు స్వీయ చరిత్రలో వ్రాసుకున్నారని తెలియుచున్నది.

3. స్వీయ చరిత్ర రచయిత తన గత జీవితంలోని ముఖ్య సంఘటనలను నెమరువేసుకుంటూ వ్రాయటం రెండవ పద్ధతి. ఈ పద్ధతిలోనే చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు తన స్వీయ చరిత్రను వ్రాసుకున్నట్లు తెలియుచున్నది.

4. స్వీయచరిత్రకారుడు తన జీవితంలో జరిగిన విషయములను ఉద్దేశ పూర్వకము గాని (అప్రధానమనుకొని) తనకే తెలియకుండగాని (మరపు వలన) కొన్నిటిని వదిలివేయవచ్చును.

5. స్వీయచరిత్ర వ్రాసుకొనిన వ్యక్తి స్వకీయ అనుభవాలు సామాజిక వ్యవస్థ లోనివి కావటము వలన, స్వీయ చరిత్రలు సమాజాన్ని గురించి తెలుసుకోవడానికి ఉపయోగపడతాయి.

6. స్వీయ చరిత్ర వ్రాసుకొనే రచయిత తనను గురించి తాను వ్రాసుకోవటము వలన, అతని మరణము గురించి స్వీయ చరిత్రలో ఉండదు. చాలమంది స్వీయ రచయితలు తమ చరిత్రలను చరమ దశలోనే వ్రాసుకొందురు. కొన్ని స్వీయచరిత్రలలో రచయిత మరణము తర్వాత, అతని బంధువులు గాని, శిష్యులు గాని, ఆప్తులు గాని పూరించడము కన్పిస్తుంది.

7. 'కల్పన'కు స్వీయచరిత్రలో చోటు లేదు. కల్పన కాని వచన సాహిత్య ప్రక్రియలలో స్వీయ చరిత్ర ఒకటి. రచయిత తన జీవితములో జరిగిన చిరస్మృతులను విశ్లేషించి చరమదశలో స్వీయచరిత్ర వ్రాసుకుంటాడు. అందులో వాస్తవికతకే తప్ప కల్పనకు చోటివ్వడు.

8. స్వీయచరిత్ర ప్రధానముగా బాహ్య జీవితాన్ని గురించే కాక ఆంతరంగిక జీవిత విషయాల్ని తెలుపుతుంది. రచయిత బాల్యం, కుటుంబ సమస్యలు, ప్రేమ వ్యవహారాలు, అలవాట్లు, మానసిక సంఘర్షణలు, ఉద్యోగ సమస్యలు లాంటివి కొన్ని బాహ్య ప్రపంచానికి తెలియవు. కావున, స్వీయచరిత్రలో ఈ ఆంతరంగిక విషయాలు రచయిత యొక్క వ్యక్తిత్వాన్ని తెలియచేస్తాయి.

9. స్వీయచరిత్రకారుడు తన వైయుక్తిక అనుభవాలను సామాజిక సంఘటనలతో అన్వయించుకొని స్వీయ చరిత్రను వ్రాయాలి. కేవల వైయుక్తిక సంఘటనలు మాత్రం తన చరిత్రలో ఉంటె అది చారిత్రక లక్షణాన్ని కోల్పోతుంది.

10. స్వీయచరిత్ర ప్రధానముగా వచన సాహిత్య ప్రక్రియ. అందువలన ఈ రచనకు వచనమే సరియైనది. అందువలన స్వీయచరిత్రలు ఎక్కువగా వచనంలోనే వుంటాయి. పద్యములలో వ్రాయబడిన స్వీయచరిత్రను వ్రాసిన కవులు కొద్దిమంది మాత్రమే ఉన్నారు.

11. స్వీయ చరిత్ర సమగ్రమైన ప్రణాళికాబద్ధంగా వుంటుంది. వ్యక్తి క్రమబద్ధమైన జీవిత పురోభివృద్ధిని, వివిధ దశలను తెలుపుతుంది. రచయిత బాల్యం, విద్యాభ్యాసం, యవ్వనం, ఉద్యోగం, వివాహం, దాంపత్యం, వ్యాపకాలు, వృద్ధాప్యం వంటి వివిధ దశలలోని ఘట్టాలు వర్ణించబడతాయి.

## 17.7 స్వీయచరిత్ర - స్వరూప స్వభావములు

### 17.7.1. స్వీయచరిత్ర స్వరూపం

స్వీయ చరిత్రలన్నీ ప్రధానంగా స్వీయచరిత్రకారుడి జీవితంలోని వివిధ దశలను క్రమబద్ధంగా చర్చించేవిగా వుండవు. కొన్ని స్వీయచరిత్రకు తక్కువ ప్రాధాన్యమిస్తూ వ్రాస్తే, మరికొన్ని స్వీయ జీవితంలోని దశలను విస్మరించి, ఆలోచనలు, జ్ఞాపకాలు, స్మృతులకు పరిమితమైనవి ఉన్నాయి.

స్వరూపాన్ని బట్టి స్వీయచరిత్రలను రెండు రకాలుగా విభజించవచ్చును.

1. స్వీయాత్మక రచనలు (Informal Auto-biographies)
2. స్వీయ చరిత్రలు (Formal Auto-biographies)

### స్వీయాత్మక రచనలు

ఒక వ్యక్తి తన జీవితంలో తన కోసం తనకు తానుగా వ్రాసుకున్న రచనలు ఈ స్వీయాత్మక రచనల విభాగంలోకి వస్తాయి. ఇది ప్రచురణకు ఉద్దేశించకుండ ఉన్నవి. ఈ స్వీయాత్మక రచనల పరిధిలోనికి, అనుభవాలు, జ్ఞాపకాలు (Memories) వైయుక్తిక స్మృతులు (Reminiscences ), దినచర్యలు (Dairies), యాత్రా చరిత్రలు (Travelogue), లేఖలు (Letters), ఆలోచనా ప్రవంతి (Musings), అనుభవసారం (Confessions) మొదలైనవి వస్తాయి.

### స్వీయ చరిత్రలు

ఒక వ్యక్తి తన అనుభవాలను తన వ్యక్తిత్వం నుండి విడదీయకుండా చెప్పడం స్వీయచరిత్రలో ప్రత్యేకమయిన లక్షణం. రచయిత తన జీవితంలో జరిగిన యధార్థ విశేషాలను తానే స్వయంగా ఒక క్రమపద్ధతిలో చెప్పటం స్వీయ చరిత్రలో కన్పించే అంశం.

### 17.7.2. స్వీయచరిత్ర స్వభావం

స్వీయచరిత్రలను వస్తుగతంగా, నిర్మాణగతంగా పరిశీలించిన తరువాతే వాటియొక్క అంతర, బాహ్యస్వభావాలను మనం గుర్తించవచ్చు.

### అంతర స్వరూపం

నాలుగైదు వందల సంవత్సరాలుగా అమెరికా, ఇంగ్లాండు, ఇతర యూరప్ దేశాలలో వచ్చిన స్వీయచరిత్రలను పరిశీలించి

నాలుగు రకాలుగా విభజించారు.

1. విషయాత్మకం, 2. ఆధ్యాత్మికం, 3. మేధావికం, 4. కల్పనాత్మకం, మొదలైన స్వీయ చరిత్రల అంతర స్వరూపాన్ని తెలియచేస్తాయి.

1. విషయాత్మకం.

ఇందులో స్వీయచరిత్రకారుడి జీవిత సంఘటనలకు అధిక ప్రాధాన్యం వుంటుంది. చరిత్రకారుని జీవితంలో వ్యక్తిగత కుటుంబ విషయములు, సామాజిక విషయములు సంఘటనాత్మకముగా ఒక క్రమమైన పద్ధతిలో వివరించడము జరుగుతుంది. కందుకూరి వీరేశలింగం పంతులు గారి 'స్వీయ చరిత్రము'. ఈ విషయ ప్రధానాత్మకమైన చరిత్రలకు ఉదాహరణగా చెప్పవచ్చును.

2. ఆధ్యాత్మికం.

స్వీయచరిత్రకారుని జీవితంలో జరిగిన వివిధ సంఘటనలను ఆధ్యాత్మిక దృష్టితో చూడటము ప్రధానముగా కన్పిస్తుంది. స్వీయ రచయిత మతపరముగా నడిపిన ఆధ్యాత్మిక విషయాలు, సాంస్కృతికోద్యమాలు వివిధ రకాలయినవి చోటు చేసుకుంటాయి. ఇలాంటి వాటికి ఉదాహరణముగా St.Augustine వ్రాసిన 'Confessions' ను చెప్పవచ్చును.

3. మేధావికం.

స్వీయ రచయిత తన కాలంలో తన సమాజంలో ఉన్న పరిస్థితులను హేతుబద్ధముగా ఆలోచించి, వాటిని సోపత్తికముగా నిరూపించడం ఇందులో జరుగుతుంది. సమాజ శ్రేయస్సు కోసము తనకు తానుగా నిస్వార్థంగా అర్పించుకున్న చరిత్రకారుని కృషి ఇందులో కన్పిస్తుంది. దీనికి దర్శి చెంచయ్య గారి 'నేను-నా దేశం' ను ఉదాహరణగా పేర్కొనవచ్చును.

4. కల్పనాత్మకం.

దీనిని రెండు రకములుగా విభజించవచ్చును.

(ఎ) కల్పనాత్మక స్వీయచరిత్ర (Fictionalised Auto-biography)

(బి) స్వీయచరిత్రాత్మక నవల (Auto-biographical fiction)

(ఎ) కల్పనాత్మక స్వీయచరిత్ర.

స్వీయచరిత్రలు వ్రాయువారు యదార్థముగా, జరిగింది జరిగినట్లుగా, కాలక్రమానుగుణముగా వ్రాయుదురు. అయితే కొందరు స్వీయచరిత్రలు వ్రాస్తున్నప్పుడు వాస్తవ సంఘటనలకు కొద్దిగా కల్పనల కూడా జోడించి వ్రాయడం అందులో జరుగుతుంది. దీనికి ఉదాహరణంగా చలం గారు వ్రాసిన 'చలం' నాయని సుబ్రహ్మణ్యం నాయుడు వ్రాసిన 'పచ్చనాకు సాక్షిగా' మొదలగు వాటిని పేర్కొనవచ్చును.

(బి) స్వీయచరిత్రాత్మక నవల.

స్వీయచరిత్రకారుడు ఇందులో వాస్తవ జీవితంలోని అనుభవాలను నవలా రూపంలో చెప్పడం కన్పిస్తుంది. కొడవటిగంటి కుటుంబరావు గారి 'చదువు' ఈ కోవకు చెందినదే.

విశ్వనాథ వారు వ్రాసిన 'వేయి పడగలు' నవలలో తనను గురించే కాక, తన మిత్రుల గురించిన వివరాలు ఉన్నాయి.

### బహిర స్వరూపము

స్వీయ చరిత్రకారుడి జీవిత దశలు వంటి బహిర స్వరూపమును నాలుగు వర్గాలుగ విభజించవచ్చును.

1. సమగ్రం, 2. సంపూర్ణం, 3. అసమగ్రం, 4. అసంపూర్ణం.

1. సమగ్ర స్వీయచరిత్ర

స్వీయచరిత్రకారుడు తన జీవితములోని అన్ని దశలను క్రమ పద్ధతిలో చెప్పిన అది సమగ్ర జీవిత చరిత్ర అవుతుంది.

2. సంపూర్ణ స్వీయచరిత్ర

స్వీయచరిత్ర రచయిత తన జీవితంలోని వివిధ దశలను, సంఘటనలను, ఆది నుంచి అంతము వరకు పేర్కొనిన అది సంపూర్ణ స్వీయ చరిత్ర అవుతుంది.

3. అసమగ్ర స్వీయచరిత్ర

స్వీయ రచయిత ఇందులో తన జీవితంలోని ముఖ్యమైన దశలలో కొన్నింటిని మాత్రమే పేర్కొంటాడు. ఆ విధముగా చెప్పిన దానిని అసమగ్ర స్వీయ చరిత్ర అందురు.

4. అసంపూర్ణ స్వీయచరిత్ర

స్వీయ రచయిత తన జీవితంలోని అన్ని విషయములను ఒక క్రమ పద్ధతిలో చిత్రించిన తరువాత జీవితములో కొన్ని ముఖ్యమైన విషయములు అనివార్య కారణాల వలన చేర్చకపోయిన యెడల అది అసంపూర్ణ స్వీయచరిత్ర అవుతుంది. స్వీయచరిత్రను భాగాలుగా విభజించి వ్రాసే దానిలో చివరి భాగాలు ఏ కారణము చేతనయినా వ్రాయకపోయిన యెడల అది అసంపూర్ణ స్వీయ చరిత్ర అవుతుంది.

## 17.8 స్వీయచరిత్ర - ఆవిర్భావ వికాసాలు

జీవిత చరిత్ర, స్వీయ చరిత్ర రెండునూ వచన రచనా ప్రక్రియకు చెందిన రచనలు. ఇవి రెండును వ్యక్తి చరిత్రను తెలియచేయునవియే. జీవిత చరిత్ర రచనయే స్వీయ చరిత్ర రచన కన్న ముందు వచ్చినది. జీవిత చరిత్ర రచనల కన్నా స్వీయ చరిత్ర రచనలో తక్కువ సంఖ్యలో వ్రాయబడినాయి. దీనికి కారణము స్వీయ రచనలు వ్రాసుకోవాలని కోరిక ఉన్ననూ అనేక కారణాలవలన ఆ కోరిక తీరదు. కొద్దిమంది మాత్రమే వ్రాసుకొనే వారుంటారు. జీవిత చరిత్రలు వ్రాయించుకోవాలని కోరిక ఉన్నా, లేకపోయిన, వారి తరములో గాని, తరువాత తరములో గాని, ఆ వ్యక్తుల బంధువులు, శిష్యులు, ఆప్తులు, వారి మీద అభిమానముతో లోకానికి తెలియచేయుటకు వ్రాయుటకు పూనుకుంటారు. ఈ రెండు ప్రక్రియలు తరువాత కాలంలో పరిణితి చెందాయి.

జీవిత చరిత్ర రచన ప్రాచీన కాలంలో క్రీస్తు పూర్వం 5వ శతాబ్దిలో ప్రారంభమయినట్టు తెలియుచున్నది. "ION OF CHIOS" అనే రచయిత తన సమకాలికుల జీవిత విశేషాలను వివరాలను వ్రాయడముతో మొదలైన జీవిత చరిత్ర తర్వాత వెయ్యి సంవత్సరముల దాక (5 BC - 5 AD) సంప్రదాయములలోనే సాగింది. ఈ కాలంలో మొదట జీవిత చరిత్ర రచన బాగా జరిగిన, ఆ కాలంలో వచ్చిన రచనలన్నీ కేవలం స్మృతి రచనలుగా మిగిలిపోయినాయి.

15, 16, శతాబ్దములలో పాశ్చాత్య దేశాలలో వచ్చిన సాంస్కృతిక, పునరుజ్జీవన, పారిశ్రామిక విప్లవముల ఫలితముగా సాహిత్యంలో అనేక మార్పులు వచ్చాయి. వీటిలో జీవిత చరిత్ర రచన కూడ అభివృద్ధి చెందినది. ఈ కాలములో స్వీయ చరిత్రలు కూడ బాగానే వచ్చాయి. 17, 18 శతాబ్దాలలో జీవిత చరిత్రలకు ప్రత్యేకమైన గుర్తింపువచ్చినది. నవలా ప్రక్రియ ఆవిర్భావం తర్వాత జీవిత చరిత్ర కూడ దానిని కొంత వరకు అనుసరించడముతో నవల శిల్ప జీవిత చరిత్ర లోనికి ప్రవేశించింది. దానికి పర్యావసానముగా జీవిత చరిత్ర లేక స్వీయచరిత్రలు కళాత్మకంగా రూపొందించడానికి అవకాశం ఏర్పడినది. అప్పటిదాక కేవలం స్మృతుల రూపంలో నున్న జీవిత, స్వీయ చరిత్రలు కళా రూపం పొందాయి.

18వ శతాబ్దములో స్వీయ చరిత్ర ప్రక్రియకు 'Auto-biography' అను పేరు స్థిరపడగా, ఆ తరువాత అమెరికా దేశీయుడు మొదటలో 'Education' అని, ఆంగ్లేయ స్త్రీ 'My apprentice' అని, ఐర్లాండు దేశీయుడు 'Summing-up' అని తమ స్వీయ చరిత్రలకు పేర్లు పెట్టుకున్నారు. పాశ్చాత్య దేశాలలో చాల కాలం 'మెమోయిర్, రెమిని సెన్స్స్, జర్నల్, అని పేర్లతో పిలవబడుతున్న ఈ ప్రక్రియ క్రమక్రమముగా వికసించింది. 1797లో మొట్టమొదటిసారిగా 'The monthly review' అనే పత్రికలో 'Auto-biography' అనే పేరు వాడబడింది. ఆనాటి నుండి ఈనాటి వరకు ఈ ప్రక్రియకు ఆ పేరే స్థిరపడింది.

గురజాడ శ్రీరామమూర్తి గారు 1893 లో 'కవి-జీవితములు' అనే గ్రంథము రచించారు. తెలుగులో ఈ ప్రక్రియకు 'స్వీయచరిత్ర' అనే పేరును మొదట ఉపయోగించినది శ్రీరామూర్తి గారే. ఆ తరువాత కందుకూరి వీరేశలింగము పంతులు గారు 'ఆంధ్ర కవుల చరిత్ర' వ్రాశారు. అందులో అంతకు ముందు గురజాడ శ్రీరామూర్తి గారు ఉపయోగించిన 'స్వీయచరిత్ర' అనే పదాన్ని ప్రచారము లోనికి కందుకూరి వారు తెచ్చారు. 'వీరేశలింగం స్వీయచరిత్ర' అనే మాట బహుళ ప్రచారము లోనికి వచ్చింది.

తెలుగులో తొలి స్వీయచరిత్ర ఏది? అనే నిర్ణయంపై అనేక వాదోపవాదాలున్నాయి. తెలుగులో అనేక ఆధునిక సాహిత్య ప్రక్రియలకు ఆద్యుడుని నేనే అని చెప్పుకున్న కందుకూరి వీరేశలింగం పంతులు గారు తన స్వీయచరిత్ర అవతారికలో 'తెలుగు భాషలో స్వీయచరిత్రమును వ్రాయబూనుట కిదియే ప్రథమ ప్రయత్నమని చెప్పుకున్నారు. అయితే వీరేశలింగం గారి కన్న ముందే తెలుగు వారైన వెన్నెలకంటి సుబ్బారావు ఇంగ్లీషులో తన స్వీయ చరిత్రను (The life of Vennelacunty Soob row) అని వ్రాసుకోగా, అది 1873 లో అచ్చు అయినది. కాబట్టి తెలుగులో మొట్టమొదటి స్వీయచరిత్ర వెన్నెలకంటి సుబ్బారావు గారికే అని కొందరి అభిప్రాయము. కాని ఆ చరిత్ర తెలుగులో వ్రాయబడక పోవటము, ఇంగ్లీషులో వ్రాయటము వలన విమర్శకులు దానిని తొలి స్వీయచరిత్రగా అంగీకరించలేదు. వీరేశలింగం గారి కంటె ముందు ఆదిభట్ల నారాయణ దాసు స్వీయచరిత్ర వ్రాసుకున్నారని ఆయన జీవిత చరిత్రకారుడు చెప్పాడు. కాని ఆ స్వీయచరిత్రలో నారాయణదాసు గారు తన 30 ఏండ్ల జీవితం వరకు మాత్రమే వ్రాసుకోవడము వలన ఇది అసంపూర్ణ స్వీయచరిత్ర అవుతుందని విమర్శకుల అభిప్రాయము.

చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి గారు వీరేశలింగము గారి కంటె ముందు 'జాతకచర్య' అనే పేరుతో ఆత్మకథను వ్రాసుకున్నట్లు కాటూరి వేంకటేశ్వర రావు గారి మాటల వలన తెలుస్తుంది. ఈ గ్రంథం ఉత్తర భాగము పూరించబడినది. ఈ గ్రంథం వీరేశలింగము గారి స్వీయచరిత్ర తరువాతనే ప్రచురితమైనది. కాని ఇది పద్యాలలో వ్రాయబడినది. చెళ్ళిపిళ్ళ వారి కన్న ముందే మండపాక పార్వతీశ్వర శాస్త్రి, కొక్కొండ వెంకట రత్నం పంతులు గార్లు వాళ్ళ యొక్క స్వీయ చరిత్రలు పద్యాలలో వ్రాసుకున్నారు. పద్యాలలో వ్రాయబడిన స్వీయ చరిత్రలలో మండపాక పార్వతీశ్వర శాస్త్రి గారి 'ఆత్మపర్యాయ సుపర్యాచర్యా' అనే స్వీయచరిత్ర 1894 లో మొదటి స్వీయ చరిత్ర అని భావించాలి. కాని, ఇవన్నీ పద్యాలలో వ్రాసుకున్న స్వీయచరిత్రలు కావటము వలన విమర్శకులు వాటిని తొలి స్వీయచరిత్రగా భావించలేదు.

1885 వ సంవత్సరము నాటికే వీరేశలింగం పంతులు గారు 'రాజమహేంద్రవర స్త్రీ పునర్వివాహ చరిత్ర' అనే స్వీయాత్మక రచనను వ్రాసి, చెన్నపట్టణ వాసులకు విన్పించటము, 1888 లో వీరేశలింగం గారి ప్రాణ స్నేహితుడైన బసవరాజు గవర్రాజు

మరణించటంతో అతని చరిత్రలు వ్రాయటము, ఈ రెండు రచనలు కూడ స్వీయ చరిత్రలో ప్రధాన ఘట్టాలే. దీని వలన కందుకూరి వారు **1885** నాటికే తన జీవిత చరిత్ర వ్రాసేందుకు పూనుకున్నట్లు తెలియుచున్నది. స్వీయ చరిత్ర లక్షణాల దృష్ట్యా వీరేశలింగం స్వీయచరిత్ర ఆదిభట్ల నారాయణదాసు స్వీయ చరిత్ర కన్నా మొదటిది అని చెప్పవచ్చును. వీరేశలింగం గారి కన్నా పెద్దవాడు, సంఘ సంస్కరణ ఉద్యమాలలో వీరేశలింగంకు తోడుగా ఉన్న పళ్ళె చెంచలరావు గారు స్వీయచరిత్ర వ్రాసుకున్నట్లు తెలుస్తుంది. కాని ఆ చరిత్ర లభ్యం కావటము లేదు. బహుశ వారు స్వీయ చరిత్రను ఇంగ్లీషులో వ్రాసుకొని వుండవచ్చును. అందువల్ల చెంచలరావు గారి స్వీయ చరిత్ర లభ్యమై, అది తెలుగులో వ్రాయబడినది అని నిర్ధారణమయ్యే వరకు 'వీరేశలింగము గారి స్వీయచరిత్రే మొట్టమొదటి తెలుగులో స్వీయచరిత్ర' గా నిర్ణయించవచ్చును.

స్వీయచరిత్రలను గూర్చి చిలకమర్తి వారు చెప్పినట్లు, "మహా పురుషులు పరులకు మార్గ దర్శకముగా నుండుటకై తమ చరిత్రలు తప్పక వ్రాయవలెను. మన యాంధ్ర దేశమున మొట్టమొదట స్వీయచరిత్రమును వ్రాసుకొన్నవారు మహనీయులైన రావుబహుద్దూర్ కందుకూరి వీరేశలింగము పంతులు గారు, ఆ మహాపురుషుని చరిత్రమంతయు స్వార్థ త్యాగము తోడను, లోకోపకారమైన ఘనకార్యముల తోడను నిండియున్నది. కావున వారి స్వీయ చరిత్రము నిశ్చయముగా నాంధ్ర సారస్వతమున కలంకారమై యాంధ్ర జనులకు మార్గ దర్శకమై యున్నది' చిలకమర్తి మాటలు యధార్థములు.

అయ్యదేవర కాళేశ్వరరావు గారి 'నా జీవిత కథ' టంగుటూరి ప్రకాశం పంతులు గారి 'నా జీవిత యాత్ర' చిలకమర్తి లక్ష్మీనరసింహం గారి 'స్వీయ చరిత్ర' ఇవన్నియూ వాస్తవిక చిత్రణతో, తత్కాల పరిస్థితులను ప్రదర్శిస్తూ, ఆసక్తికరములుగా ప్రసన్న శైలితో సాగిన స్వీయ చరిత్రలు, సూటిగా, సూక్ష్మంగా నాతి విస్తరంగా సున్నితంగా సాగిన రచనలు. శ్రీపాదవారి 'అనుభవాలు-జ్ఞాపకాలు' జానకిరాం గారి 'నాస్మృతి పథంలో-సాగుతున్న యాత్ర' మున్నగునవి మధుర స్మృతులను తెలియచేయునవి. నేటి ప్రజలకు మోజైన సినిమా ప్రపంచాన్ని భూతద్దంలో చూపించి, వారు గడించిన స్థానాన్ని నిరూపించిన చరిత్రలలో 'చిత్తూరి నాగయ్య గారి స్వీయచరిత్ర, అక్కినేని నాగేశ్వరరావు గారి జీవితము, శ్రీమతి జానకి గారి జీవితానుభవాలు' మొదలగునవి ప్రముఖములు.

స్వీయచరిత్ర కథనము అహంప్రత్యయ ప్రేరితము అను అభిప్రాయము గలదు. కాని ఇది ప్రాయోవాదము. స్వీయచరిత్ర కారునికి సత్య నిష్ఠ జీవిత చరిత్రకారుని కంటె ఎక్కువగా నుండవలెను. జీవిత చరిత్ర, స్వీయచరిత్రలకు వీరేశలింగము గారే మార్గ దర్శకులు. స్వీయచరిత్రను వ్రాసి మెప్పించటము చాలా కష్టం. ఎందువలననగా రచయిత తన జీవితములోని సంఘటనలను ఉన్నది ఉన్నట్లుగా చెప్పాలి.

## 17.9 సమీక్ష

జీవిత చరిత్ర, స్వీయచరిత్రలు ఆధునిక సాహిత్య ప్రక్రియలుగా ప్రసిద్ధి చెందినవి. ఇది పాశ్చాత్య సాహిత్య ప్రభావముతో తెలుగులో ఏర్పడినది. ఒకరి జీవిత గాథను మరొకరు గ్రంథస్తం చేసిన అది జీవిత చరిత్ర. ఎవరి జీవిత గాథను వారే గ్రంథస్తం చేసిన స్వీయచరిత్ర అనబడును. తెలుగులో ఈ ప్రక్రియకు 'స్వీయచరిత్ర' అనే పేరునుపయోగించిన ఘనత గురజాడ శ్రీరామమూర్తి గారికి దక్కుతుంది. జీవిత చరిత్రలను సాహిత్యపరమైన, రాజకీయపరమైన, సాంఘిక ప్రాధాన్యంకల, ఆధ్యాత్మికమైన, పర్యాత్మకమైనవిగా వర్గీకరింపవచ్చును. యధార్ధ పురుషుని యొక్క యధార్థ చిత్రణమే జీవిత చరిత్రకు ప్రధానము. ఇందులో కల్పనకు తావు లేదు. ఉపదేశము ప్రధానము. సాంఘిక జీవితమున కాదర్శప్రాయుడైన ప్రసిద్ధవ్యక్తి కథానాయకుడు కావున జీవిత చరిత్రలో ఏక నాయకాశ్రయత్వం ప్రధానలక్షణము. ఇందులో సత్యనిష్ఠ ఉండాలి. జీవిత, స్వీయచరిత్రలు సమకాలీన సాంఘిక పరిస్థితులను, సంఘటనలను తెల్సుకోవటానికి ఎంతో ఉపకరిస్తాయి.

### 17.10 ప్రశ్నలు

1. జీవిత చరిత్ర నిర్వచనము, వర్గీకరణ పద్ధతిని తెలియచేయునది.
2. జీవిత చరిత్ర లక్షణములను విశదీకరించునది.
3. ప్రముఖ జీవిత చరిత్రలను తెల్పునది?
4. స్వీయ చరిత్ర నిర్వచనం, లక్షణములను తెలియచేయునది.
5. స్వీయ చరిత్ర స్వరూప, స్వభావములను వివరించునది.
6. స్వీయ చరిత్ర ఆవిర్భావ వికాసములు తెలియచేయునది.

### 17.11 ఉపయుక్త గ్రంథాలు


1. కవి జీవితము - గురజాడ శ్రీరామమూర్తి
2. ఆంధ్ర కవుల చరిత్ర - కందుకూరి వీరేశలింగం
3. సాహిత్య భావ లహరి - ఆచార్య యస్.వి. జోగారావు
4. తెలుగు జీవిత చరిత్రలు వ్యాసం - పుల్లూరి ఉమ
5. ఆత్మకథలు-జీవిత చరిత్రలు (మహతి ప్రచురణ 1972) - డా॥ వేటూరి ఆనందమూర్తి
6. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం.



**అరిపిరాల హరిహరనాథశాస్త్రి**

Incharge - తెలుగు శాఖ

శ్రీ సుబ్బరాయ & నారాయణ కళాశాల

నరసరావుపేట - 522 601